గాంధీ సాహిత్య ప్రచురణ 20

నా స్వప్నసీమ భారతభూమి

రచన:

మహాత్మా గాంధీజీ

ప్రచురణకర్తలు:

గాంధీ సాహిత్య ప్రచురణాలయము

(గాంధీ స్మారకనిధి - ఆంధ్రశాఖ)

కాకినాడ

గాంధీ సాహిత్య ప్రచురణ 20

నా స్వప్నసీమ భారతభూమి

*

కర్త

మహాత్మా గాంధీ

అనువాదకర్త :

మల్లవరపు విశ్వేశ్వరరావు

ప్రకాశకులు :

గాంధీ సాహిత్య ప్రచురణాలయము

గాంధీ స్మారకనిధి, ఆంధ్రశాఖ

కాకినాడ

తొలి ముద్రణ
రెండువేల ప్రతులు
వెల రు. 6/-

అహ్మదాబాద్ నవజీవన్ ట్రస్టు వారి అనుమతితో

★

ముద్రణ :
శ్రీ సత్యమాంబా ముద్రణాలయము
కాకినాడ

మనవి

శతాబ్దులతరబడి దాస్యశృంఖములలో బడి సుషుప్తావస్థయందున్న భారతీయులను మహాత్మాగాంధీ స్వాతంత్ర్య సమరశంఖారావమును పూరించి మేల్కొలిపారు. సత్యము, అహింస సాధనములుగా పోరాటం సాగించారు. అస్పృశ్యతా నిర్మూలనము, మద్యనిషేధం మున్నగునవి ఆచరణలోనికి తెచ్చినగాని భారతదేశమునకు ముక్తి లేదని భావించి స్వాతంత్ర్య సమరముతోబాటు భారతదేశమున గల సాంఘిక దురాచారములను రూపుమాపుటకు ఉద్యమాలు సాగించారు. ప్రపంచములో నే దేశమెరుగని స్వల్పత్యాగముతో భారతదేశానికి స్వాతంత్ర్యము సిద్ధించినది.

కాని అంతటితో మన పని సమాప్తి కాలేదు. స్వతంత్ర భారతదేశ మన్నివిధముల వెనుకబడియున్నది. రాజనైతిక లోపములు, సాంఘిక దురాచారములు, ఆర్థిక హానిసత్వము స్వతంత్ర భారతదేశముపై తమ పిశాచ నృత్యమును సాగించుచునే యున్నవి. మహాత్మాగాంధి వీనినన్నిటిని ముందుగనే యూహించియుండుటచే అహింసాత్మక విధానంద్వారా వీనిని పరిష్కరించుటెట్లు అని యోచించి భావిభారతదేశస్వరూపమును ఆయన కనులయెదుట సృష్టించుకొని యుండిరి. వానినిగూర్చి వ్రాసిన వ్యాసముల సంపుటియే యీ "నా స్వప్నసీమ భారతభూమి" యను గ్రంథము. మహాత్ముని యూహాప్రపంచమున గల స్వతంత్ర భారతదేశస్వరూపమును తెలిసికొనుటకు ఈ గ్రంథమును పఠించుట చాల యవసరము. స్వతంత్రభారతదేశ మవలంబింపవలసిన ప్రాథమిక సూత్రములేవి, వానిని ఆచరణకు తెచ్చుటెట్లు మున్నగు విషయము లిందు విపులముగ చర్చించబడినవి.

స్వతంత్ర భారతదేశమున జాతిపిత మహాత్ముని యభిప్రాయములు, ఆశయములు, సిద్ధాంతములు బహుళ ప్రచారములోనికి వచ్చినగాని నిజమగు స్వాతంత్ర్యము, శాంతి లభింపవు. ప్రతి భారతీయుడు వీని నవగాహన చేసికొనవలసియున్నది కావున వారి గ్రంథములను ప్రాంతీయ భాషలయందు ప్రచురించుట యవసరము, గాంధీస్మారకనిధి, ఆంధ్రశాఖవారు గాంధీజీ రచనలను తెలుగులోనికి అనువదింపజేసి, ప్రచురించు సంకల్పంతో గాంధీ సాహిత్య ప్రచురణాలయమును కాకినాడలో నెలకొల్పిరి. వారి కృషి ఫలితముగ వెలువడిన గ్రంథముల యందు ఇది 20 వ ప్రచురణ. దీనిని ఆంధ్రమహాజనులు ఆదరింతురని మా ఆకాంక్ష. ఆంధ్ర ప్రభుత్వము, ఆంధ్రప్రజానీకము మా కృషికి తోడ్పడవలెనని మా మనవి.

సెప్టెంబరు 1962
కాకినాడ

సంపాదకవర్గము
గాంధీ సాహిత్య ప్రచురణాలయము

☆

తొలిపలుకులు

మనం ఒక నూతనయుగంలోకి ప్రవేశిస్తూవున్న ఈ సమయంలో గాంధీమహాత్ముడు తన స్వప్నసీమగా ఊహించుకొనివున్న భారతదేశపు చిత్రణమును మనదేశం యొక్కయు ప్రపంచంయొక్కయు సమక్షమున ప్రదర్శించడమనేది చాలా సంతోషకరమైన విషయం. మనం గడించిన స్వాతంత్ర్యంయొక్క ఫలితంగా, భారతదేశ భవిష్యత్తును బాగుచేసినా, పాడుచేసినా దాని బాధ్యత అంతా మనమీదనే ఆధారపడివున్నది. చాలావరకు గాంధీమహాత్ముని నాయకత్వ ఫలితంగానే మన కీనాడు ఈ స్వాతంత్ర్యం కరగతమయింది. ఆయన ప్రయోగించివున్న సత్యాహింసలనే అసదృశ్యమైన ఆయుధం ఈనాటి ప్రపంచమును ఆవరించిన కల్మషములన్నిటిని తొలగించుటకు మిక్కిలి అవసరమైన సాధనం. గాంధీజీ ఉపయోగించిన సాధనములు ఎంత అసంపూర్ణమైనవో మన మెరుగుదుము. అయినప్పటికి మనదేశమువంటి పరిస్థితులలోవున్న మరేదేశముకాని చేయవలసివుండే త్యాగముతో పోలిస్తే అంతకంటె చాలాతక్కువ త్యాగంతోనే మనం మన ఈప్సితగమ్యాన్ని చేరుకున్నామని చరిత్ర ఉద్ఘాటించగలదు. మన సాధనము లెంత విశిష్టమైనవో, తద్వారా మనం పొందివున్న స్వాతంత్ర్యం ఒసగే అవకాశాలుకూడా అంత విశిష్టమైనవే అని మనం గ్రహించాలి. మనయొక్క విజయఘడియలలో, మన విజయోత్సవాల సందడిలో మనకింతవరకును మార్గదర్శకుడుగా వర్తించిన మహానాయకుని,

ఆయన హృదయమును ఆవేశించిన చిరంతనాదర్శములను మనం విస్మరించకూడదు. మనంపొందిన స్వాతంత్ర్యం ఇంకా ఉచ్ఛతరమూ, స్వచ్ఛతరమూ అయిన భవిష్యద్ధర్మాన్ని అందుకొనుటకు సాధనప్రాయమైనది మాత్రమే. గాంధీమహాత్ముడు గాంచిన కలలకు భారతదేశం వాస్తవరూప మొసగగలగడమే ఆయన నిలిచిన సూత్రాలకును, ఆయన చేసిన కృషికిని తగిన పర్యవసానం కాగలదు. ఈ సమయాన్ని ఆయన బోధనలకు మూలకందమైన ప్రధానసూత్రాలను తిరిగి మనకు జ్ఞప్తికి తేవలసిన అవసరం ఎంతైనా వున్నది. అట్టి ప్రాథమిక సూత్రాలను చదువరిముందు ప్రదర్శించుటయే కాక, ఈనాడు బహిరంతర శృంఖలా విముక్తులైన మన అసంఖ్యాక ప్రజానీకముయొక్క దీక్షాబలముతోను మన రాజ్యాంగ ప్రణాళికాసహాయంతోను మన రాజకీయ, సాంఘిక జీవితముల పునర్నిర్మాణంద్వారా ఆ సూత్రములకు రూపకల్పనచేసే మార్గమునుకూడా సూచించే గ్రంథం సర్వులకూ స్వీకృతమయి తీరుతుందని వేరుగా చెప్పవలసిన పని లేదు. ఈ గ్రంథంలో శ్రీ ఆర్. కె. ప్రభుగారు గాంధీ మహాత్ముని రచనలనుంచి ప్రధానమైన సార్థకభాగాలను మిక్కిలి బుద్ధికౌశలంతో సేకరించి, ఒకచోట కూర్చివున్నారు. ఈ విషయమైన వాఙ్మయానికి ప్రస్తుతగ్రంథ మొక నూతనాలంకారమై శోభిల్లగలదని నేను నిస్సందేహముగా భావిస్తాను.

న్యూఢిల్లీ
8 ఆగష్టు 1947

రాజేంద్రప్రసాద్

పరిష్కృతముద్రణ పీఠిక

భారతస్వాతంత్ర్య ప్రకటన దినమైన 15 ఆగస్టు 1947న ఈ గ్రంథపు మొదటికూర్పు ప్రచురితమైనది మొదలు ఇంత వరకు భారతీయ సేతువుక్రింద చారిత్రక వాహిని చాలాదూరం ప్రవహించివున్నది. స్వాతంత్ర్యాగమనమునకును, మన జాతి పిత నిర్గమనమునకును పిమ్మట మన దేశాన్ని ఎదుర్కొనే ప్రధానసమస్యలలో కొన్ని రూపాంతరం పొందివున్నాయి; మరికొన్ని, అనగా సంస్థానాధీశులసమస్య, ఉద్యోగశాఖల లోను వ్యాపారరంగంలోను వుండే బ్రిటీషు దేశీయులసమస్య వంటివి, పూర్తిగా నివారణమైపోయాయి. ఈ రీతిగా సమూలంగా మార్పుపొందిన పరిస్థితులకు అనుగుణమగునట్లుగా ఈ గ్రంథపు తొలికూర్పుయొక్క రూపాన్ని సంపూర్ణంగా మార్చవలసిన అవసరం ఏర్పడింది. ఈ గ్రంథానికి సర్వతోముఖస్వరూపం ఒసగేనిమిత్తం గతించిన పరిస్థితులకు వర్తించే కొన్ని అధ్యాయాలను తీసివేయడమూ, నలభై వరకు క్రొత్త అధ్యాయాలను చేర్చడమూ జరిగింది. ఈ గ్రంథంయొక్క విపులీకృతమైన ఈ పరిష్కృత ముద్రణంద్వారా ప్రముఖ భారతీయ సమస్యలపై గాంధీజీ అభిప్రాయ సారాంశమును చదువరులకు క్లుప్తరూపంలోను అధికారయుక్తంగాను అంద జేయుటకు నేను ప్రయత్నించాను. ఇది గాంధీయ తత్వపరిశీలన మొనర్చే విద్యార్థులకును, నిర్మాణాత్మక కార్యక్రమంలో

నిమగ్నులైన ప్రజాసేవకులకును కూడా మిక్కిలి ఉపయుక్తముగా వుండగలదని తలుస్తాను. స్థలాభావాది హేతువులవలన ఈ గ్రంథములో కొన్ని లోపములు తప్పక పోయినప్పటికి, దానిని కూర్చుటకు నేను చేసిన పరిశ్రమ కేవలం నిష్ప్రయోజనం కాదని ఆసిస్తాను.

—ఆర్. కె. పి.

★

ప్రథమ ముద్రణ పీఠిక

ఈ గ్రంథంలో గాంధీమహాత్ముని రచనలనుంచి ప్రసంగములనుంచీ సేకరించి ప్రకటించబడిన భాగములద్వారా చదువరులకు స్వతంత్రభారతాన్నిగురించి మహాత్ముని భావము లెట్టివో, దేశ వ్యవహారాలలోను, విదేశ సంబంధాల విషయములోను స్వతంత్రభారతం ఏ రీతిగా వర్తించవలెనని ఆయన ఆసించివున్నాడో దానిని విశదపరచుటకు ప్రయత్నమొనర్చబడినది. గత 150 సంవత్సరములనుండియు తన ఆత్మను బానిసత్వశృంఖలములలో బంధించి, ఆర్థికంగానూ నైతికంగానూ ఆధ్యాత్మికంగానూ తన వినాశనానికి కారణభూతమైన విదేశీయ పాలనమనే చెరను పూర్తిగా విదలించుకుని, 15 ఆగస్టు 1947 వ తేదీని భారతదేశం స్వతంత్ర్యస్థితిలో అడుగుపెట్టబోతూవున్నది. ఈ స్వాతంత్ర్యం సంపాదనా మార్గంలో దేశంలో కలిగిన పాక్షిక, సాంఘిక ఘర్షణలఫలితంగా భారతదేశసమైక్యత చాలాచోట్ల విచ్ఛిన్నతపాలై, భారతీయాత్మ నలిగిపోయింది.

ప్రస్తుతం రూపందాలుస్తూవున్న స్వరాజ్యంయొక్క స్వభావాన్ని గమనిస్తే, అది గడించిన అనేక దశాబ్దములుగా మాతృదేశసేవా పరాయణులైన భారతపుత్రీపుత్రులు ఏ ఆశయములకై కృషిచేసి, ఏ ఫలితానికి ఎదురుచూశారో దానికి విరుద్ధంగా పరిణమిస్తున్నట్లు గోచరించగలదు. అందువలన జాతిపిత అయిన గాంధీజీ నేటి స్వాతంత్ర్యోదయం విషయమై తగినంత ఉత్సాహాతిశయమును ప్రదర్శించకపోవడంలో

ఆశ్చర్యమేమీ లేదు. ఈ సమయంలో ఆయన "తమసోమా జ్యోతిర్గమయ" అని వేదకాలపు ఋషులొనర్చిన ప్రార్థనను తిరిగి జపిస్తూ వుండవచ్చును.

భారతదేశంలోని ముస్లిములు వేరే ఒక జాతి అనే అసహజమైన సిద్ధాంతాన్ని తాను అంగీకరింపజాలనని గాంధీజీ ఉద్ఘాటించి వున్నారు. "హిందూమతమూ, ఇస్లాంమతమూ పరస్పర వైరుధ్యంతో కూడిన సంస్కృతులకును సిద్ధాంతాలకును ప్రాతినిధ్యం వహిస్తాయని చెప్పే భావాన్ని నేను యావదాత్మ పూర్వకంగా తిరస్కరిస్తాను" అని ఆయన ప్రకటించివున్నారు. "అట్టి సిద్ధాంతాన్ని అంగీకరించడం నా అభిప్రాయంలో పరమేశ్వరుని ఉనికిని తిరస్కరించినట్లే అవుతుంది. కొరానులో పేర్కొనబడిన దేవుడును, గీతలో పేర్కొనబడిన దేవుడును ఒక్కడే అనిన్నీ, మనమందరమును, ఏ యే పేర్లతో వర్తించినప్పటికి, ఒకే దేవుని సంతానమే అనిన్నీ నేను పూర్ణాత్మకంగా విశ్వసిస్తాను. నిన్నటివరకు హిందువులుగావున్న కోట్లకొలది జనులు ఇస్లాం మతమునే కనక స్వీకరించినయెడల, అంతటి నుంచి వారిక భారతీయులు కాకుండా వేరొకజాతివారైపోతారని భావించే అభిప్రాయాన్ని నేను ఎదుర్కొనకతప్పదు." అని కూడా గాంధీజీ ఉగ్గడించివున్నారు. ప్రస్తుతం సంభావితమవుతూవున్నరీతిగా భారతదేశం కలకాలం, భౌగోళికంగా గాని ఆధ్యాత్మికంగాగాని విభాజ్యమై వుండగలదని నమ్మడానికి ఆయన మనస్సు ఒప్పడంలేదు. "రెండు స్వతంత్రరాజ్యాలుగా విభజితమైనంతనే భారతదేశం రెండుజాతులుగా విడివడిపోజాలదు" అని కూడా ఆయన అనివున్నారు. విదేశ

పరిపాలకులు సృష్టించిన చీలికఫలితంగా భారత దేశ సమైక్యతా మార్గంలో ఏర్పడిన అడ్డంకు తొలగిపోయినపిమ్మట, ప్రస్తుతం భారతదేశం పొందిన గాయములునూని నెమ్మదిపొందిన పిదప, తన స్వప్నసీమ అయిన భారతభూమి అచిరకాలంలో వాస్తవరూపం దాల్చగలదనే ఆశతో ఆయన జీవించి, తన కృషిని సాగిస్తూవున్నారు.

తాను తలపెట్టిన పనియొక్క బాధ్యతాభారమును, తన శక్తిలోపమును ఎరిగిన ప్రస్తుత సంకలనకర్త గాంధీజీ కలలుగాంచిన భారతభూమియొక్క భావచిత్రమును చదువరులకు అందజేయ యత్నించుట ఎంత క్లిష్టకార్యమో గ్రహించకపోలేదు. "యంగిండియా", "హరిజన్" పత్రికలద్వారాను ఇతరములైన వివిధ రచనా ప్రసంగములద్వారాను ఆ మహా చిత్రకారుడు లిఖితమొనర్చివున్న అమరచిత్రమునకు ఈ సంకలనము తగిన ప్రతిబింబమును రూపించ లేకపోవచ్చును. ఆ విస్తృత చిత్రమును క్లుప్తరూపంలో ప్రదర్శించుటకు చేసిన ప్రయత్నము మహాత్ముని స్వీయవచనములలోనే చేయబడివుండుటనుబట్టి ఇందు సేకరింపబడిన విషయములు మూలానుసారితమూ, సర్వతోముఖమూ అయిన చిత్రాన్ని ఒసగగలుగవచ్చునని ఈ సంకలనకర్తయొక్క ఆశ. అయినప్పటికీ ఈ గ్రంథమునందు ఏ లోపములు కనిపించినా, వాటికన్నిటికిని ఈ సంకలనకర్త గాంధీజీకి, పాఠకలోకానికి కూడా తన హృదయపూర్వకమైన క్షమార్పణాలు అందజేస్తున్నాడు.

ఆగస్టు, 1947.

—ఆర్. కె. పి.

విషయ సూచిక

అధ్యాయం ౧

నా స్వప్నసీమ భారతభూమి

భారతదేశంలో ప్రతీదీ నన్నాకర్షిస్తుంది. అత్యున్నతాశయముపైన ఏ మానవుడుగాని కోరదగిన సర్వమూ ఆమెలో వుంది.

యంగిండియా, 21-2-'29.

భారతదేశం ప్రధానంగా కర్మభూమి, భోగభూమి కాదు.

యంగిండియా, 5-2-'25.

మూఢవిశ్వాసంతోనూ, అజ్ఞానంతోనూ కప్పువడి వున్నప్పటికిని తమ పురాతన సంప్రదాయిక సంస్థలలో కొన్నిటినైనా ఇంతవరకు రూపంలో నిలుపుకొనివున్న కొలది ప్రపంచ దేశములలోనూ భారతదేశం ఒకటి. తన సంతానమైన కోట్లకొలది ప్రజానీకాన్ని ఈనాడు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలను ఆమె పరిష్కరించుకొనగలదనే విషయంలో నా విశ్వాసం ఈ రోజున పూర్వమెన్నటి కంటెను ఎక్కువ ఉజ్వలంగా ప్రకాశిస్తున్నది.

యంగిండియా, 6-8-'25.

భారదేశపు విధ్యుక్తధర్మము ఇతరదేశములకంటె విభిన్నమైనదని నాకు తోస్తుంది. ఆధ్యాత్మికరంగంలో లోకోత్తరమగు స్థానాన్ని సాధించుటకు భారతదేశం ఎక్కువ అనుగుణ్యతను కలిగివున్నది. ఈ దేశం హృదయపూర్వ

కముగా అనుభూత మొనర్చుకొనిన పావిత్ర్యసిద్ధి లోకోత్కృష్ట మైనది. భారత దేశమునకు లోహఘటితములైన ఆయుధ సంపత్తియొక్క ఆధిక్యంతో పనిలేదు. దైవప్రసాదితములైన ఆయుధములతో ఆమె ఈవరలో సమర మొనర్చియున్నది. ఇంకను ఒనర్చగలదు. ఇతర దేశములు పశుబలారాధనాత్మక మైనవి. దీని యాదార్థ్యానికి యూరోపులో నడిచే భయంకర యుద్ధమే ఉదాహరణము. భారత దేశము లోకమంతను ఆత్మశక్తితో జయించగలదు. ఆత్మశక్తి సమక్షంలో పశు బలం ఏ మాత్రమూ నిలువజాలదని తెల్పుటకు చరిత్రలో అనేక ఉదాహరణలు చూడవచ్చును. ఆత్మశక్తిని ఉగ్గడిస్తూ కవీంద్రులు గానం చేసివున్నారు; ఋషీశ్వరులు తమ అను భూతులను అభివర్ణిత మొనర్చియున్నారు.

మహాత్మాగాంధీ ప్రసంగాలు, రచనలు, పే 405.

భారత దేశమే కనక ఖడ్గవాదాన్ని స్వీకరిస్తే క్షణిక మైన విజయాన్ని పొందవచ్చును. కాని అప్పుడు భారత దేశం నా హృదయగర్వానికి ఆలంబన కానేరకపోతుంది. నా సర్వస్వానికీ ఆమెయే ఆలంబనమగుటచేత, నేను భారత దేశంతో అవినాభావమైన సంబంధబంధనంతో కట్టువడి వున్నాను. భారత దేశం ప్రపంచమంతటను ప్రచార మొనర్చ వలసియున్న విధ్యుక్తధర్మమొకటి కలదని నా సంపూర్ణ విశ్వాసం. ఆమె యూరోపుఖండాన్ని గ్రుడ్డిగా అనుకరించ వలసిన పనిలేదు. భారత దేశం ఖడ్గవాదాన్ని అవలంబించిన క్షణం నాకు అగ్నిపరీక్షా సమయంగా భావిస్తాను. అందుకు నేను సంసిద్ధుడనై వుండగలననే ఆశిస్తాను. నా మతధర్మానికి

భౌగోళికమైన హద్దులేమీ లేవు. దానియందు నాకు సజీవమైన విశ్వాసమే కనక పాదుకొని వున్నచో, అది నా యొక్క దేశాభిమానములను కూడా అధిగమింప గలుగుతుంది. అహింసాధర్మం ద్వారా భారతదేశానికి సేవయొనర్చుటకే నా జీవితం అంకితమయివుంది.

యంగిండియా, 11-8-'20

భారతదేశం హింసావిధానాన్ని తన ధర్మంగా స్వీకరించడం జరిగి, అటు పిమ్మట, నేను సజీవుడనై వుంటే, నేను భారతదేశంలో నివసించడానికి అభిలషించను. ఆమె నా భక్తిభావాన్ని ప్రకోపింపజేయడానికి అశక్తమైపోతుంది. నా దేశాభిమానముకంటె నా మతధర్మానిదే పై చేయి. నా ఆధ్యాత్మిక పరిపోషణకు ఆధారభూతమైనదిగా భావించుట వలననే, నేను తల్లి రొమ్మునకు హత్తుకునే శిశువులా భారత దేశానికి అంటిపెట్టుకుని వుంటున్నాను. ఆమె నా ఉత్కృష్టాశయాలకు అనుగుణమైన వాతావరణం కలిగివున్నది. ఆ విశ్వాసానికి ఆస్కారం లేనినాడు నిరాధారుడుగా అనాథుడనై పోయినట్లుగా నిరాశోపహతుడినై పోతాను.

యంగిండియా, 6-4-'21

ప్రపంచ మంతటికిని ఉన్నతస్థితిని చేకూర్చే నిమిత్తం హృదయపూర్వకము నిష్కలుషమునగు ఆత్మ సమర్పణ గలుగుటకే భారతదేశము స్వతంత్రమును శక్తివంతమును కావలయునని నేను అభిలషిస్తున్నాను. భారతస్వాతంత్ర్యము శాంతి సమరముల సమస్యవిషయంలో ప్రపంచ దృక్పథ

మందు పరివర్తన తీసుకు రాగలగాలి. ఆమెయొక్క దుర్బల స్థితి మానవకోటి అంతటినీ నీరసిల్లజేస్తుంది.

యంగిండియా, 17-9-'25

చాలావిషయాలలో పాశ్చాత్యలోకంనుంచి మనం నేర్చుకొని లాభం పొందవలసిన అవసరం వున్నదని నేను అడకువగా అంగీకరిస్తాను. కాని జ్ఞాన మనునది ఏదో ఒక ఖండానికి గాని, ఏదో ఒక జాతికి గాని ప్రత్యేకమైన ఆస్తి కాదు. ఆసియావాసులు సర్వవిషయములలోను పాశ్చాత్యులను అనుకరించుటకుతప్ప మరెందుకును పనికిరారనే అభిప్రాయమును పెట్టుకుని, విచక్షణారహితంగా పాశ్చాత్య నాగరికత యొక్క అడుగుజాడల ననుసరించే అవివేక బుద్ధిని మాత్రమే నేను నిరసిస్తాను. తనలో కొన్ని లోపములున్న మాట నిజమే అయినప్పటికి సుదీర్ఘమైన కాల ప్రవాహంలో కలిగిన విఘాతము లన్నింటిని తట్టుకొని యింతవరకు నిలబడి వుండజాలిన స్వీయనాగరికతపై ఈనాడు దురాక్రమణ జరుగకుండా ప్రతిఘటించి, కొంతకాలము బాధానలమును ఓరిమితో సహించినయెడల, అటుపిమ్మట ఆమె ప్రపంచమునకు శాశ్వత శాంతిని ధృఢతరప్రగతిని సిద్ధింపజేయుటకు మార్గదర్శకురాలు కాగలదని నా బలమైన విశ్వాసం.

యంగిండియా, 11-8-'27

భారతదేశము తన సహజ పరమావధిని చేరుకొనుటకు పాశ్చాత్యులయొక్క రక్తసిక్త మార్గం దారి జూపదు;

ఆ మార్గమున వారే అలసిపోయియున్నట్లు సూచనలు ద్యోతక మవుతున్నవి కూడా. నిష్కుటిలమూ, భక్తిపరమూ అయిన జీవితం ద్వారా అభివ్యక్తమయ్యే రక్తపాత విరహితమైన శాంతిమార్గమే మన గమ్యానికి అనుగుణమైన దారి. భారత దేశము తన ఆత్మను కోల్పోయే ఆపత్తులో పడివుంది. ఆత్మను కోల్పోయినచో తన నిలకడనే కోల్పోతుంది. అందువలన ఆమె తన నిర్వీర్యతనూ నిస్సహాయతనూ తెల్పునట్లు "పశ్చిమాన్నించి త్రోసుకువచ్చే ప్రభావప్రవాహమును తప్పించుకొనలేన"ని ఆక్రోశమొనరిస్తూ కూర్చొనుటకు వీలులేదు. ఆమె తన నిమిత్తమును, ప్రపంచమంతటి నిమిత్తమును కూడా ఆ ప్రభావాలును ప్రతిఘటిత మొనర్పగల శక్తిని తనలో పెంపొందించు కొనక తప్పదు.

యంగిండియా, 7-10-'26

యూరోపియ నాగరికత యూరోపీయులకు తగినదే కావచ్చును. కాని దానిని మనం అనుకరిస్తే, అది భారత దేశానికి నాశనహేతువవుతుంది. దీనినిబట్టి మనకు జీర్ణ యోగ్యములైన అందలి ఏ మంచి అంశములనుగాని మనము స్వీకరించకూడదనిగాని, అందు ప్రవేశించియున్న చెడ్డ అంశములను యూరోపీయులైనను విసర్జించనవసరము లేదనిగాని అర్థముకాదు. అట్టి లోపములకు ఉదాహరణగా, వారి భౌతిక సుఖాన్వేషణమును, ఆ సుఖసౌకర్యముల అతిశయీకరణమును పేర్కొనవచ్చును. ఏ సుఖసౌకర్యములకు వారు బానిసలై పోతూవున్నారో, ఆ సుఖసౌకర్యముల బరువుక్రింద వారు

నలిగి నశించకుండవలెనంటే, యూరోపీయులు స్వబుద్ధిపూర్వకముగానే తమ దృక్పథమును మార్చుకోనవలసి వుంటుందని నేను చెప్ప సాహసిస్తాను. నాయీ అభిప్రాయం తప్పైతే కావచ్చును; కాని భారతదేశం ఆ "బంగారపు ఊరకల" కొరకు ఎగబడినయెడల, అది మృత్యువును కోరి తెచ్చుకున్నట్లే అవుతుందని మాత్రం నే నెఱుగుదును. "నిరాడంబర జీవనము, సమున్నత భావనము" అని చెప్పిన ఒకానొక పాశ్చాత్య తాత్త్వికుని సుభాషితమును మనము మన హృదయఫలకములపై అంకితమొనర్చుకుందుముగాక. ఈనాడు మన దేశమందలి కోట్లాదిజనులు ఎలాగూ ఆడంబరజీవితము అనుభవించగల యోగ్యతలేదు, ఆ జనబాహుళ్యం తరఫున ఆలోచనా భారాన్ని నిర్వహించబూనిన కొలదిమందిమైన మనం ఆడంబరజీవితం కొరకు నిరర్థకమైన అన్వేషణలో పడితే, ఉన్నతభావనమును కోల్పోయే విపత్తులో మునిగిపోగలము.

యంగిండియా, 30-4-'31

భారతదేశాన్ని అన్నివిధములైన బానిసత్వంనుంచీ, పరాశ్రయతనుంచీ విముక్తి పరిచి, అవసరమైతే పాపమునైనను చేయుటకు అధికారము నొసగే జన్మహక్కును కూర్చునట్టి స్వాతంత్ర్య ప్రణాళికను రూపొందించు నిమిత్తం నేను కృషిచేస్తున్నాను. పేదలలో పేదలైనవారు కూడా తమ జన్మభూమి అగు ఈ దేశం యొక్క నిర్మాణకార్యంలో తాము కూడా సార్థకంగా పాల్గొనడానికి అవకాశమున్నదని సంతసించగల భారతదేశం నిమిత్తమే నేను పాటుపడతాను;

అట్టి భారతదేశంలో పైతరగతివారు, క్రింది తరగతివారు అనేభేదానికి తావుండదు; అక్కడ అన్ని సంఘములవారును సంపూర్ణ సామరస్యంతో జీవించ గల్గుతారు. అట్టి భారత దేశంలో అస్పృశ్యతా పిశాచికిగాని, నిషా కలిగించే మద్య పానాదివిష ద్రవ్యములకు గాని ఏ మాత్రమూ తావుండదు. స్త్రీలు పురుషులతో సమానహక్కులు కలిగివుంటారు. ఇతరులకడుపుకొట్టి మనం లాభం పొందుటగాని, మన కడుపు కొట్టిఇతరులను లాభం పొందనిచ్చుట గాని లేకుండా, మనం మిగులు ప్రపంచ మంతటితోనూ శాంతియుత సంబంధాలు పెంపొందించు కుంటాము కనుక, మనకు వీలైనంత తక్కువ సైనికబలం వుంటే సరిపోతుంది. నోరులేని సామాన్య జనానీకం యొక్క శ్రేయస్సునకు విరుద్ధము కానంతవరకు, అందరిహక్కులును విదేశీయులవైనా సరే, స్వదేశీయులవైనా సరే విధిగా గౌరవింప బడతాయి. అసలు విదేశీయము స్వదేశీయము అనే విభిన్నభావం నాకు వ్యక్తిగతంగా భరించను. ఇదీ, నా స్వప్నసీమ అయిన భారతభూమి...... తదితరమైన దేని తోటీ నేను సంతుష్టిపొందను.

యంగిండియా, 10-9-'31

అధ్యాయం ౨

స్వ రా జ్య మం టే అ ర్థం

"స్వరాజ్యం" అనేది పవిత్రమైన పదం; అది వేదోక్తమైన శబ్దం; ఆత్మపాలన లేక ఆత్మనిగ్రహం అని అర్థమిస్తుంది, అంతేగాని "ఇన్డిపెన్డెన్స్" అనే ఆంగ్లపదం మామూలుగా అర్థమిచ్చేలాగ "సర్వనిగ్రహములనుంచి స్వేచ్ఛ" అని అర్థమీయదు.

యంగిండియా, 19-3-'31

పుట్టుకవలన గాని నివాసము వలనగాని దేశీయులుగా పరిగణింపబడువారును, కాయకష్టము మూలకంగా ప్రభుత్వమునకు సేవచేసెడి వారును, ఎన్నికపట్టికలో తమ పేరు నమోదు చేయించుకొనుటకు జాగ్రత్తపడినవారును అగు ప్రజానీకంలోని పూర్ణవయస్కులైన స్త్రీ పురుషులలోని అధికసంఖ్యాకులయొక్క అభిప్రాయ ప్రకటనం ద్వారా ప్రజానుమతిని పొందిన పాలనవిధానమే స్వరాజ్యమని నా అర్థం.........కొలదిమంది అధికారశక్తిని తమ చేతులలోనికి సంపాదించడం ద్వారా స్వరాజ్యం చేకూరదు; అధికార దుర్వినియోగం జరిగినప్పుడు, దానిని ప్రతిఘటించే శక్తిని సర్వులును సమార్జించడం ద్వారానే అది చేకూరుతుంద. ఇంకోవిధంగా చెప్పవలెనంటే అధికారమును సక్రమమార్గంలో నడచునట్లు చేయగల శక్తి తమలో గర్భితమై

వున్నదనే పరిజ్ఞానాన్ని జనబాహుళ్యంలో రేకెత్తించడం ద్వారా స్వరాజ్యం సిద్ధిస్తుంది.

యంగిండియా, 29-1-'25

స్వపరిపాలన మనేది పూర్తిగా మన అంతరశక్తిపై, ఎటువంటి ప్రతిబంధకములనైనను ప్రతిఘటించగల మన సామర్థ్యంపై ఆధారపడివుంటుంది. నిజానికి, దానిని ఆర్జించుటకును నిలుపుకొనుటకును ఆ విధమైన నిరంతర సాధన యొక్క అవసరం లేనటువంటి స్వపరిపాలనము కేవలం నిరర్థక మవుతుంది. అందువలన వ్యక్తిజీవిత స్వపరిపాలనమునకును ఆత్మ నిగ్రహమునకును ఎట్టి సాధనసంపత్తి అవసరమో స్త్రీ పురుష సమూహమైన ప్రజానీకమునకు సంబంధించిన స్వపరిపాలనమునకును అనగా రాజకీయ స్వపరిపాలనమునకును సరిగా అట్టి సాధనసంపత్తియే అవసరమని స్పష్టపరచుటకుగాను నేను మాటలద్వారాను చేతలద్వారాను కృషి సల్పివున్నాను.

యంగిండియా, 1-12-'27.

అది పరప్రభుత్వమైనా, జాతీయ ప్రభుత్వమైనా ప్రజలు ఆ ప్రభుత్వాధికారం నుంచి తాము స్వతంత్రులై వుండడానికి చేసే నిరంతర ప్రయత్నమే స్వపరిపాలనమునకు అర్థం. దైనందిన జీవితంలో ప్రతి సామాన్య వ్యవహార పరిష్కారానికీ ప్రభుత్వము పైననే ఆధారపడే స్వరాజ్యపాలనా విధానం మిక్కిలి శోచనీయ విషయ మవుతుంది.

యంగిండియా, 6-8-'25.

మన నాగరికతయొక్క విశిష్ట ప్రతిభను చెడకుండా నిలుపుకొనుటయే నా స్వరాజ్యం; అనేకములైన నూతన అంశాలను ఉల్లేఖించవలెననియే నా అభిలాష; అయితే అవన్నీ భారతీయఫలకంపైననే చిత్రించాలి. పాశ్చాత్య లోకంనుంచి నేను సంతోషపూర్వకంగానే అనువు తీసుకుంటాను; కాని ఆ తీసుకున్నదానిని సగౌరవమైన వడ్డీతో తిరిగి తీర్చగలపక్షంలోనే తీసుకుంటాను.

యంగిండియా, 26-6-'24

ప్రజానీకంలో అధికసంఖ్యాకులు దేశాభిమానమూ త్యాగబుద్ధీ కలవారై తమ స్వంతలాభముకంటెను, ఇతరము లగు అన్ని లబ్ధులకంటెను దేశశ్రేయస్సే సర్వోత్కృష్టమైన దిగా భావించినప్పుడే స్వరాజ్యమును నిల్పుకొనగలుగుతారు. స్వరాజ్యమంటే అధికసంఖ్యాకుల పరిపాలనలు. అధిక సంఖ్యా కులు అవినీతిపరులు, స్వార్థపరులు అయినచోట వారి పరిపాలనము అరాజకతతప్ప వేరేమియు కాజాలదు.

యంగిండియా, 28-7-21.

నేనును, మనమందరమును కలలుగాంచే స్వరాజ్యంలో జాతిమత సంబంధమైన భేదభావాలకు స్థానముండదు. చదు వుకున్నవారికి మాత్రమేగాని, ధనమున్నవారికి మాత్రమే గాని అది సొంతసొత్తు కాబోదు. స్వరాజ్యం అనేది కర్షకు లతో సహా సర్వులకూ ముఖ్యంగా వికలాంగులకూ, గుడ్డి వారికీ, ఆకలితోటీ కాయకష్టంతోటీ అలమటించే లక్షలాది జనాసీకానికీ-చెందినదై వుంటుంది.

యంగిండియా, 26-3-21.

భారతస్వరాజ్యం అధికసంఖ్యాక సంఘంయొక్క, —అనగా హిందూసంఘంయొక్క —పరిపాలన అవుతుందని కొందరు అంటున్నారు. అలా అనుకోడంకంటె గొప్ప పొరపాటు ఇంకొకటుండదు. అదే నిజమైతే, దానిని స్వరాజ్యమని పిలవడానికి నిరాకరించే వారిలో నేను మొదటి వాడినౌతాను; దానిని నేను నా సర్వశక్తులా ప్రతిఘటిస్తాను. ఏమంటే, నా భావనలోని 'హింద్‌స్వరాజ్' అంటే సర్వ ప్రజలయొక్క స్వపరిపాలనమనీ, న్యాయానుసరణమైన పరిపాలనమనీ అర్థం.

యంగిండియా, 16-4-'31.

స్వరాజ్యమనేది మనలను నాగరికులను చేయుటకును, మన నాగరికతను నిష్కళంకమూ స్థావరమూ ఒనర్చుటకును ఉద్దేశింపబడనిచో, అది ఏ మాత్రముగాని విలువలేనిదై పోతుంది. మనయొక్క బహిరంగమూ ఆంతరంగికమూ అగు సకల వ్యవహారములలోనూ మనము నీతికి ఒసగే సర్వోత్కృష్ట స్థానమే మన నాగరికతయొక్క మూలతత్వమును తెల్పుతుంది.

యంగిండియా, 23-1-'30.

'పూర్ణస్వరాజ్యం'...'పూర్ణ' అని ఎందుకన్నాం? అది రాజుకీ రైతుకీ, భూస్వామికీ కూలిపనివానికీ, హిందూ ముస్లిములకూ, పార్శీ క్రైస్తవులకూ, జైనులకూ, యూదులకూ, సిక్కులకూ, అందరికీ, వర్ణవర్గభేదములుగాని, తాహతు భేదములుగాని లేకుండా, సమానంగా వర్తిస్తుంది కనుకనే, దానిని 'పూర్ణస్వరాజ్య'మని నిర్వచించారు.

యంగిండియా, 5-3-31.

ఆ పదంయొక్క అర్థనిర్వచనమునుబట్టియును, పొందే నిమిత్తం మనం అనుసరించే సత్యము అహింస అగు సాధనములను బట్టియును స్వరాజ్యమనునది కొందరికి ఎక్కువ లాభకరమైనదిగాను మరికొందరికి తక్కువ లాభకరమైనదిగాను కొందరియెడల పక్షపాతము కలదిగాను మరికొందరియెడల ఉపేక్షాభావము చూపునదిగాను పరిణమించుటకు అవకాశము లేదు.

యంగిండియా, 5-3-'31

నేను కలలుగనే స్వరాజ్యం పేదవాని స్వరాజ్యం. మహారాజులూ, లక్షాధికారులూ అగువారితో సమానంగా మీరందరూను కూడా జీవిత సౌకర్యాలను అనుభవించగలగాలి. అయితే వాగిలాగ మీకు దివ్యభవనాలు అవసరమని కాదు. సుఖజీవితానికి అవి అవసరంలేదు. మీరూ నేనూ ఆ భవంతులలో దారి తప్పిపోతాం. కాని ధనికులైనవారు అనుభవించే సామాన్య జీవితసౌకర్యాలన్నీ మీకు కూడా లభ్యంకావాలి. అట్టి సౌకర్యాలు మీకు గూడా కలిగించేందుకు హామీ ఒసగితే తప్ప స్వరాజ్యం అనేది పూర్ణ స్వరాజ్యం కాజాలదని నేను నిస్సంశయంగా చెప్పగలను.

యంగిండియా, 26-3-'31

నా అభిప్రాయం ప్రకారం పూర్ణస్వరాజ్యం అంటే కేవలం స్వార్థపరమైన స్వాతంత్ర్యం కాదు; ఆరోగ్యవంతమూ గౌరవప్రదమూ అయిన స్వాతంత్ర్యం. నా జాతీయతాభావం ఎంతబలవత్తరమైనదైనా, ఇతరులతో ఏ సంబంధమూ

లేకుండా ఒంటెత్తుగా వుండునదికాదు. అది ఇతరదేశము లకు గాని, వ్యక్తులకు గాని హాని కలిగించుటకు ఉద్దేశింప బడినదియు కాదు. కొన్ని న్యాయశాస్త్ర సుభాషితాలలో శాస్త్రార్థం కంటె ఎక్కువగా నైతికమూల్యం గర్భితమై వుంటుంది. "నీ ఆస్తిని నీ ప్రక్కవానికి హాని కలుగనివిధంగా ఉపయోగించుకో" మని చెప్పే సూక్తిలో ఇమిడివున్న నిత్యసత్యాన్ని నేను విశ్వసిస్తాను.

యంగిండియా, 26-3-'31

పూర్ణస్వరాజ్ అనే మాటకి అన్వయించుకునే అర్థం మీదా దానిలో మనం ఊహించుకునే ఆదర్శంమీదా అంతా ఆధారపడి ఉంటుంది. ప్రజాబాహుళ్యాన్ని మేల్కొలిపి వారికి వాస్తవంగా ఏది లాభకరమో దానిని గురించిన పరిజ్ఞానాన్ని వారిలో రేకెత్తించి, ఆ సదాశయాన్ని లోక మంతటినీ ఎదురొడ్డి అయినా తాము పొందగలమనే ఆత్మ విశ్వాసాన్ని వారిలో జనింపజేయడమే పూర్ణస్వరాజ్యమునకు అర్థమైనయెడల— పూర్ణస్వరాజ్యం ద్వారా మనం కోరేది సామరస్యభావమూ, అంతరంగ బహిరంగ నిరంకుశ శక్తుల నుంచి విముక్తీ, జనసామాన్యంయొక్క ఆర్థికపరిస్థితుల దిన దినాభివృద్ధీ అయివున్నయెడల మనం దానిని, రాజకీయాధి కారం కరగతం కానవసరం లేకుండానే ప్రస్తుతాధికారులపై ఒత్తిడి తేవడం ద్వారా సాధించగలం.

యంగిండియా, 18-6-'31.

స్వరాజ్యమంటే నా భావమేమిటో పొరపాటులేకుండా

అర్థం చేసుకోండి. పరదేశీయుల వశత్వంనుంచి సంపూర్ణమైన విముక్తి అనిన్నీ, సంపూర్ణమైన ఆర్థిక స్వాతంత్ర్యం అనిన్నీ దానియొక్క అర్థం. కనుక దానికి ఒక చివర రాజకీయస్వాతంత్ర్యమూ, మరొక చివర ఆర్థిక స్వాతంత్ర్యమూ అవసరమౌతాయి. దానికి మరొక రెండు పరమార్థాలుకూడా అవసరం. అందులో ఒకటి నైతికమూ సాంఘికమూ అయినది; రెండవది సర్వోత్కృష్టార్థంలో, "మతధర్మం" అనేది. ఆ మతధర్మమన్నదానిలో హైందవ మతమూ, ఇస్లాం, క్రైస్తవమతం మొదలైనవన్నీ ఇమిడి వుండి, అది వాటన్నిటికీ అతీతమైనదై వుంటుంది. ఈ నాలుగు అంచులతో కూడిన నిర్మాణమును "స్వరాజ్య చతురస్రం" అందాం; దీని నాలుగు కోణములలోను ఏ ఒక్కటి సత్యవిరుద్ధమైనప్పటికిని, దాని రూపం వక్రమై పోతుంది.

హరిజన్, 2-1-'37.

మనం అందరమూ సత్యాహింసల ద్వారానే మన స్వరాజ్యసిద్ధిని పొందవలెననీ, తద్వారానే దానిని నడిపించి పరిపోషించుకొన వలెననీ దృఢంగా విశ్వసించిననాడే నా భావనలోని స్వరాజ్యం రూపంలోకి వస్తుంది. నిజమైన ప్రజాస్వామ్యం గాని ప్రజాస్వరాజ్యం గాని అసత్యయుతమూ దౌర్జన్యయుతమూ అయిన సాధనమూలద్వారా ఎన్నటికీ సిద్ధింప జాలదు. ఏలననగా అట్టి సాధనములను ప్రయోగించుటవల్ల ప్రతిఘటనమును సమూలంగా తొలగించే నిమిత్తం ప్రత్యర్థులను అణగద్రొక్కుట గాని లేక వినాశ మొందించుట

గాని జరుగుతుంది. అట్టి విధానము వ్యక్తి స్వాతంత్ర్యమునకు అనుగుణమైనదికాదు. నిష్కలుషమైన అహింసాత్మక పరిపాలన విధానంలోనే వ్యక్తి స్వాతంత్ర్యం పూర్ణ వికాసం పొందగలుగుతుంది.

హరిజన్, 27-5-'39

అహింసాత్మకమైన స్వరాజ్యంలో ప్రజలు తమ హక్కులను గురించి తెలుసుకొనవలసిన పనిలేదు. అయితే వారు తమ విధులను గురించి మాత్రం తెలుకొనడం అవసరం. ప్రతి విధినిర్వర్తనమునూ తత్సంబంధమైన ఒక హక్కును చేకూరుస్తుంది; మన విధులయొక్క సక్రమ నిర్వహణంద్వారా సిద్ధించేవే సత్యమైన హక్కులు. అందువల్ల తాము పౌరులుగా వున్న ప్రభుత్వానికి సేవ చేయుట ద్వారానే ప్రజలకు పౌరసత్వహక్కులు ప్రాప్తిస్తాయి. అట్టివారే తమకు ప్రాప్తించిన హక్కులను యోగ్యంగా వినియోగించుకొనగలుగుతారు. అబద్ధములాడడానికీ దౌర్జన్యం జరపడానికీ అందరికీ హక్కువుంది. కాని ఆ హక్కుయొక్క ప్రయోగము ఆ ప్రయోక్తకూ సంఘానికీ కూడా హానికరమవుతుంది. కాని సత్యమును అహింసను ఆచరించేవానికి గౌరవం ఏర్పడుతుంది; ఆ గౌరవమే హక్కులను తెస్తుంది. విధి నిర్వహణం ద్వారా హక్కులను పొందినవారు వాటిని కేవలం సంఘప్రయోజనానికే వినియోగిస్తారే గాని ఎన్నడూ తమ స్వప్రయోజనానికి వినియోగించరు. ప్రజాస్వరాజ్యం అంటే, అందలి ప్రతి వ్యక్తియొక్క స్వపరి

పాలనము యొక్కయు కూడిక మొత్తం అని అర్థమిస్తుంది. అట్టి స్వరాజ్యం వ్యక్తులు పౌరులుగా తమ తమ విధులను నిర్వర్తించడం ద్వారానే వస్తుంది. అందులో ఎవరుగాని తమ యొక్క హక్కులను గురించి ఆలోచించరు. విధి నిర్వహణమును మరింత చక్కగా నిర్వహించే నిమిత్తమై కావలసి వచ్చినప్పుడు ఆ హక్కులు వాటంతట అవే చేకూరుతాయి.

హరిజన్, 25-3-'39.

అహింసాత్మకమైన స్వరాజ్యంలో ఎవరూ ఎవరికీ శత్రువులు కారు; అందరికీ సమానాశయమైన గమ్యసిద్ధికై అందరు స్త్రీ పురుషులూ ఎవరివంతైన కృషిని వారు సమర్పిస్తారు; అందరూ చదువనూ వ్రాయనూ తెలిసివుంటారు; వారి విజ్ఞానం దినదిన ప్రవర్థమానం అవుతూవుంటుంది. అనారోగ్యాలూ వ్యాధులూ వీలైనంత వరకు నిర్మూలింపబడతాయి. ఎవడూ దరిద్రుడుగా వుండడు; శ్రామికుల కెప్పుడూ పని దొరుకుతుంది. అట్టిపరిపాలనలో జూదమునకు గాని, త్రాగుడుకు గాని, వ్యభిచారమునకు గాని, వర్గద్వేషానికి గాని తావుండదు. ధనికులైనవారు తమ ధనమును విచక్షణాపూర్వకంగానూ, ప్రయోజనకరంగానూ వినియోగిస్తారు; తమ ఘనతనూ లౌకిక సుఖాలనూ పెంచుకొనుటకై వినియోగించరు. కొలదిమంది శ్రీమంతులు మణిఖచిత దివ్య భవనాలలో సుఖించడమూ, లక్షలాది జనసామాన్యం వెల్తురు గాలీ లేని దుర్భర కొటారాలలో క్రుగ్గడమూ జరగదు. అహింసాత్మక స్వరాజ్యంలో న్యాయబద్ధమైన

హక్కులపై దురాక్రమణ వుండరాదు; అట్లే ఎవరుగాని న్యాయవిరుద్ధమైన హక్కులను కలిగివుండరాదు. సుసంఘటితమైన ప్రభుత్వంలో ఇతరుల హక్కులపై దురాక్రమణ అనేది అసాధ్యమైనదిగా వుండాలి; అట్టి దురాక్రమణను తొలగించుటకు దురాక్రమణదారునిపై బలప్రయోగం చేయవలసిన అవసరముండకూడదు.

హరిజన్, 25-3-'39

అధ్యాయం 3

జాతీయతా సమర్థన

నాకు దేశభక్తి అన్నా మానవప్రేమ అన్నా ఒకటే అర్థం. నేను మానవుడను కనుకను, నాలో మానవప్రేమ వున్నది కనుకను నాకు దేశభక్తివుంది. భారతదేశానికి సేవ చేసే నిమిత్తం నేను ఇంగ్లాండుదేశానికిగాని, జర్మనీదేశానికి గాని హాని కలిగించను. నా జీవిత ప్రణాళికలో సామ్రాజ్య తత్వానికి తావులేదు. మానవజాతి మూలపురుషుడైనవానికిని దేశభక్తుడైనవానికిని ఒకే ధర్మం వర్తిస్తుంది. దేశభక్తుడగు వానికి విశ్వమానవప్రేమలో ఎంత తక్కువ అభినివేశంవుంటే ఆతడు అంత తక్కువ దేశభక్తుడౌతాడు. సామాన్య మానవ ధర్మానికీ రాజకీయ ధర్మానికీ వైరుధ్యం ఏమీలేదు.

యంగిండియా, 16-3-'21.

నేటికాలము దేశభక్తి తత్వం వ్యక్తులు కుటుంబ మునకు ప్రాణమొసగవలయుననీ, కుటుంబము గ్రామానికి ప్రాణమొసగవలయుననీ, గ్రామము మండలానికీ, మండలము ప్రదేశానికీ, ప్రదేశం దేశానికీ ప్రాణమొసగవలయుననే ప్రబోధించురీతినే దేశమున్నూ అవసరమైనప్పుడు ప్రపంచ సంక్షేమంకోసమై ప్రాణమొసగుటకుగాను స్వాతంత్ర్యాన్ని కలిగివుండాలి. నా జాతీయతా ప్రియత్వమూ, నా జాతీయతా భావనము ఎట్టిదనగా—విశ్వమానవకుటుంబం చిరస్థాయిగా నిలుచుటకొరకు అవసరమైనచో నా సర్వదేశమును ప్రాణార్పణ మొనర్చుటకుగాను నేను నా దేశంయొక్క స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షిస్తాను. అందులో జాతివిద్వేషానికి తావు లేదు. మనము అట్టి జాతీయతను చేపట్టుదుముగాక.

భారతగ్రామాలలో గాంధీజీ, పే 170.

యావత్ప్రపంచమునకును శ్రేయస్కరమగుటకొరకే నేను భారతదేశాభ్యున్నతిని ఆసిస్తాను. ఇతర దేశముల శిథిల సమాధిపై నిర్మితమగు భారతాభ్యున్నతి నా కక్కరలేదు.

యంగిండియా, 12-3-'25

యూరోపుఖండానికి పాదాక్రాంతమై పడివుండే భారతదేశం మానవకోటియొక్క వేఆశను గాని తీర్చలేదు. జాగృతమును విముక్తమును అగు భారతదేశము వేదనావిల ప్రపంచానికి శాంతిసౌహార్ద సందేశము అందీయగలదు.

యంగిండియా, 1-6-'21

జాతీయవాది కానిదే ఎవడుగాని అంతర్జాతీయవాది కావడం అసాధ్యం. జాతీయత రూఢి అయిన తరువాతనే అంతర్జాతీయత సాధ్య మవుతుంది,- అంటే, వేరు వేరు దేశాల ప్రజలు తమున్మదాము సంఘటిత పరచుకొని, వారంతా కలిసి ఒక్క మనిషివలె కలిసి కృషిచేయగలిగిన నాడే అది సాధ్యపడు తుందన్నమాట. జాతీయతలో చెడుగేమీ లేదు,ఆధునిక జాతీయసంస్థలను పట్టుకొనివున్న సంకుచితత్వం, స్వార్థం, ఒంటెత్తుతనం అనే దుర్గుణాలలోనే వుంది చెడుగంతా. ప్రతిదేశమూ ఇతరదేశాలను నష్టపరచి తాను లాభం పొందవలెననీ, ఇతర దేశాలను నాశమొనర్చి తాను అభ్యున్నతి పొందవలెననీ కోరుతున్నది. భారతజాతీయత క్రొత్తదారి త్రొక్కింది. విశ్వమానవ సేవా సంక్షేమ సాధనార్థమై తన్నుతాను సంఘటిత పరచుకొని, పూర్ణమైన ఆత్మాభివ్యక్తతను పొందవలెనని కోరుతున్నది.

యంగిండియా, 18-6-'25

పరమేశ్వరుడు నన్ను భారతప్రజల మధ్య పుట్టిపెరగ వలసినదిగా నిర్దేశించి వున్నందున, నేను వారికి సేవచేయనిచో నా సృష్టికర్తయెడల అవిధేయుడనౌతాను. వారికి సేవచేయు మార్గము నెరుగనిచో నేను మానవసేవచేయు మార్గము నేనాటికిని ఎరుగజాలను. ఇక, నా దేశమునకు నేనొనర్చు సేవాచరణంవల్ల ఇతరదేశములకు హాని కలిగించనంతవరకును నేను అపమార్గవర్తిని కాజాలను.

యంగిండియా, 18-6-25.

నా దేశభక్తిభావం సంకుచితంకాదు. దాని ఆలింగనంలో సర్వలోకమూ ఇముడుతుంది. ఇతరజాతులను నష్టపరిచి లాభం పొందుటద్వారాను, బాధించుటద్వారాను, తాను ఉచ్ఛస్థితిని పొందగోరే దేశాభిమానాన్ని నేను నిరాకరిస్తాను. సర్వదా, ప్రతి అంశంలోను, విశ్వమానవ విస్తృత శ్రేయానికి అనుగుణంగా వుంటేనే తప్ప నేను నిర్వచించే దేశభక్తిభావానికి ఏ మాత్రమూ విలువ వుండదు. అంతేకాక నా మతవిశ్వాసమూ; నా మతవిశ్వాసమునుంచి ఉత్పన్నమైన నా దేశభక్తిభావమూ కూడా సర్వజీవకోటినీ తమ ఆలింగనంలో ఇముడ్చుకుంటాయి. నేను అనుభూతమొనర్చుకొనగోరే సోదరభావంగాని, సమైక్యతగాని మానవులని పిలువబడే జీవులొక్కరితో మాత్రమేకాదు; సర్వజీవరాశితోటీ, నేలపై ప్రాకే అల్పజీవులతో సహా, నేను సమైక్యభావాన్ని అనుభవించ గోరుతాను. ఎందువల్లనంటే- మనమందరమూ ఈశ్వర పుత్రులమనే చెప్పుకొంటాము. అట్టిచో జీవరాశి అంతా, ఏయే బాహ్య రూపాలలో అది ద్యోతమానమైనప్పటికిని, మూలమునందొక్కటే అని విశదమౌతుంది.

యంగిండియా, 4-4-'29

మనం స్వలాభానికి ఇతరులను చెరపకుండాను, ఇతరులు తమ లాభానికి మనలను చెరపనీయకుండాను వున్నంతవరకు మన జాతీయత పరదేశాలకు ఆపత్కరం కానేరదు. స్వరాజ్యం ద్వారా మనం యావత్ప్రపంచానికీ సేవచేయ గలుగుతాము.

యంగిండియా, 16-4-'31.

సుమారు 50 సంవత్సరాల ప్రజాహిత జీవితం గడిపిన పిమ్మట, స్వదేశసేవ విశ్వమానవ సేవకు విరుద్ధమైనది కాదనే సిద్ధాంతంలో నా విశ్వాసం స్థిరపడిందని ఈనాడు చెప్పగలుగుతున్నాను. ఈ సిద్ధాంతంలో తప్పులేదు. దీనిని స్వీకరించినప్పుడే మన భూగోళ సీమను నివసించే వివిధ జాతుల నడుమను గల పరస్పర స్పర్థలు తొలగిపోయి, ప్రపంచ పరిస్థితి చక్కబడుతుంది.

హరిజన్, 17-11-'33.

అధ్యాయం ౪

భారతీయ ప్రజాస్వామ్యం

ఉచ్చతమమైన స్వాతంత్ర్యంలో అత్యధికమైన శిక్షణము వినయము ఇమిడి వుంటాయి. శిక్షణము యొక్క వినయముయొక్క ఫలితంగా చేకూరే స్వాతంత్ర్యమును ఎవ్వరూ కాదనలేరు; విశృంఖలమైన స్వేచ్ఛ అసభ్యతకు చిహ్నమగుటయే కాక, అది తనకును ఇరుగుపొరుగు వారికిని కూడా హానికరమవుతుంది.

యంగిండియా, 3-6-'26

మానవసంస్థ అయిన ప్రతిదానిలోను ఏవో కొన్ని ప్రమాదములుండక తప్పదు. సంస్థ ఎంతపెద్దదైతే దానిని దుర్వినియోగం చేసే అవకాశములున్నూ అంత అధిక

పరిమాణంలో వుంటాయి. ప్రజాస్వామ్యం అనేది ఒకగొప్ప సంఘటన; కాబట్టి అది అధికంగా దుర్వినియోగం కావడానికి వీలుంది. ఆ కారణం వల్ల ప్రజాస్వామ్య విధానాన్ని నిరాకరిస్తే లాభం లేదు; దానిని దుర్వినియోగ పరిచే అవకాశాలను సాధ్యమైనంతవరకును తగ్గించుటకు ప్రయత్నించడమే తగినమందు.

హరిజన్, 7-5-'31

ప్రజాదరాన్ని చూరగొన దలచిన ఏ ప్రభుత్వం గాని ప్రజాభిప్రాయపు మేరనుమించి ముందడుగు వేయజాలదు. దానిని వ్యతిరేకించినచో, అది అంతమొందుతుంది. సుశిక్షితమూ, విజ్ఞానయుతమూ అయిన ప్రజాస్వామ్య పద్ధతి ప్రపంచంలో అన్నిటికన్నా చక్కనైన విధానం. అసహనంతో అజ్ఞానంతో, మూర్ఖత్వంతో కూడిన ప్రజాస్వామ్యం అరాజక పరిస్థితిలో పడిపోయి, ఆత్మవినాశం పాలౌతుంది.

హరిజన్, 20-7-'31

ఏ సిద్ధాంత కూటం గాని (School of thought) సదసద్వివేచనజ్ఞానం ఒక్కతన సొత్తే అని ఉద్ఘాటింపజాలదని నేను తిరిగి తిరిగి వ్యక్తీకరిస్తూ వచ్చాను. మనం అందరమూ కూడా పొరపాట్లు చేయడానికి వీలుంది; మన తీర్మానాలను తరుచు మనం సరిదిద్దుకొన వలసి వస్తూవుంటుంది కూడా. మన దేశంవంటి విశాలదేశంలో అన్నివిధములైన నిజాయితీతో కూడిన అభిప్రాయ పక్షాలకీ కూడా అవకాశం వుండి తీరాలి. మనకూ ఇతరులకూ మనం చూపవలసిన

కనీసమైన న్యాయదృష్టి ఏమనగా,- మన ప్రత్యర్థియొక్క దృక్పథాన్ని మనం అర్థం చేసికొనుటకు యత్నించాలి; అది మనకు అంగీకార యోగ్యం కానప్పుడు, మనయొక్క దృక్పథాన్ని ఆతడు గౌరవించవలెనని మన మెంత మనస్ఫూర్తిగా కోరుతామో, అతనియొక్క దృక్పథాన్ని మనమున్నూ అట్లే గౌరవించాలి. ఆరోగ్యవంతమైన ప్రజా జీవితానికి, అనగా స్వరాజ్యార్హతకు, ఇదొక తప్పనిసరి అయిన గీటురాయి. మనలో ఉదారగుణమూ, సహనమూ లోపించిన యెడల మన అభిప్రాయభేదాలను ఎన్నటికీ స్నేహభావంతో తేల్చుకొన జాలము. అందున, మనం ఎల్లప్పుడు మూడవవ్యక్తి యొక్క తీర్పునకు ఒడబడవలసి వస్తుంది, పరాయి ఆధిపత్యానికి తలొగ్గడమంటే అదే.

యంగిండియా, 17-4-'24

పాలనాధికారం ప్రజలవశంలో వుంటే, ప్రజల స్వాతంత్ర్యంతో ప్రభుత్వం కలగ జేసికొనడమనేది అత్యల్ప పరిమాణానికి తగ్గుతుంది. ఇదే ఇంకొకలాగ చెప్పాలంటే, ఏ దేశ ప్రజలు తమ వ్యవహారాలను ప్రభుత్వజోక్యం ఎక్కువగా లేకుండా సాఫీగానూ చక్కగానూ నడిపించుకొనగలుగుతారో, ఆ దేశం ఎక్కువ ప్రజాస్వామికమైనదన్నమాట. అట్టి పరిస్థితి లేని సందర్భంలో ఆ ప్రభుత్వం పేరుకిమాత్రమే ప్రజాస్వామిక మనిపించుకుంటుంది.

హరిజన్, 11-1-'36

ప్రజాస్వామ్యానికీ దౌర్జన్యవిధానానికీ ఏ మాత్రం పొసగదు. ఈనాడు నామమాత్ర ప్రజాస్వామికములైన ప్రభుత్వాలు స్పష్టంగా నియంతృత్వపద్ధతినైనా చేపట్టాలి, లేదా, నిజమైన ప్రజాస్వామ్యాలు కావలెనంటే, అవి ధైర్యంగా అహింసాత్మకములైనా కావాలి. అహింసా విధానం వ్యక్తులకు మాత్రమే అవలంబనీయమై, వ్యక్తులతో కూడిన రాజ్యాలకు అవలంబనీయం కాదనడం చాలా హేయమైన మాట.

హరిజన్, 12-11-'38

ఒక దేశంలోని ప్రజలందరియొక్క వివిధ ఆశయాలకూ ప్రతివ్యక్తీ ప్రాతినిధ్యం వహిస్తాడనేదే ప్రజాస్వామ్యానికి సారాంశం. అయితే దానిలో కొన్ని ప్రత్యేక వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం నిరాకరింపబడదన్నమాట, నిరాకరింపబడరాదన్నమాటా కూడా నిజమే కాని, అట్టి ప్రాతినిధ్యం దానికి గీటురాయి కాదు. అది దాని అసంపూర్ణతకు మాత్రమే చిహ్నం.

హరిజన్, 22-4-'39

నిజమైన ప్రజాస్వామ్యం గాని, ప్రజాస్వారాజ్యం గాని అసత్యయుతమూ, దౌర్జన్యయుతమూ అయిన సాధనముల ద్వారా ఎన్నిటికీ సిద్ధింపజాలదు. ఏలననగా, అట్టి సాధనములను ప్రయోగించుట వల్ల ప్రతి ఘటిసమును సమూలంగా తొలగించే నిమిత్తం ప్రత్యర్థులను అణగద్రొక్కుటగాని లేక

వినాశమొందించుట గాని జరుగుతుంది. అట్టివిధానము వ్యక్తిస్వాతంత్ర్యమునకు అనుగుణమైనది కాదు. నిష్కలుషమైన అహింసాత్మకపరిపాలన విధానంలోనే వ్యక్తి స్వాతంత్ర్యం పూర్ణ వికాసం పొందగలుగుతుంది.

హరిజన్, 27-5-'39

స్వతంత్ర ప్రజాస్వామిక భారతం పరులదాడినుంచి పరస్పరమైన ఆత్మరక్షణావసరమునకును, ఆర్థిక సహకారమునకు ఇతర స్వతంత్ర దేశాలతో సంతోషపూర్వకమైన సంబంధబాంధవ్యాలను అంగీకరిస్తుంది. యావత్ప్రపంచ విజ్ఞానాన్నీ, సంపత్తినీ విశ్వమానవశ్రేయోభివృద్ధికరమగునట్లుగా వినియుక్తమొనర్చే ఆదర్శము కలిగి, స్వాతంత్ర్యము ప్రజాస్వామ్యము అను సూత్రముల నాధారముగా చేసికొను నటువంటి సత్యమైన ప్రపంచసంఘటనమును రూపొందించేందుకు కృషిచేస్తుంది.

హరిజన్, 23-9-'39

నేను భావించే ప్రజాస్వామ్యంలో శక్తివంతులకూ అశక్తులకూ కూడా సమానమైన అవకాశాలు లభ్యంకావాలి, అది అహింసద్వారా తప్ప జరగదు. ప్రస్తుత ప్రపంచంలో అశక్తులను సమానభావంతో చూచే దేశమొక్కటీ లేదు. నేటి పాశ్చాత్య ప్రజాస్వామికత అంతా నీళ్లుకలిసిన నాజీతత్వమో, ఫాసిస్టుతత్వమో అయివుంది. అది నాజీల యొక్కయు, ఫాసిస్టుల యొక్కయు సామ్రాజ్యవాద లక్షణాలకు కేవలం ఒక బురఖా అని తప్ప, వేరు విధంగా వర్ణించడానికి

4

ఏమీ లేదు.... భారత దేశం నిజమైన ప్రజాస్వామ్యాన్ని, అనగా దౌర్జన్యరహితమైన ప్రజాస్వామ్యాన్ని రూపొందించుటకు కృషి చేస్తున్నది. చర్ఖాద్వారా అభివ్యక్తమగు సత్యాగ్రహము, గ్రామపరిశ్రమలు, అస్పృశ్యతానివారణ, సాంఘిక సామరస్యం, మద్యనిషేధం, అహమదాబాద్‌లో వంటి అహింసాత్మక కార్మిక సంఘటన అనునవి మన ఆయుధ సంపత్తి. ప్రజలయొక్క సామూహిక కృషికిని, సామూహిక శిక్షణమునకును ఇవి సాధనములు. ఈ కార్యక్రమాలను నడిపేందుకు మనం గొప్ప సంస్థలను ఏర్పరచుకొని వున్నాము. అవి స్వచ్ఛంద సంస్థలు; దీనహీనుల సేవయే వాటికి పునాది.

హరిజన్, 18-5-'40

జన్మతః ప్రజాస్వామికుడైనవాడు జన్మతః సుశిక్షణతా ప్రియుడై వుంటాడు. మానవనిర్మితమూ దైవనిర్మితమూ అయిన శాసనాలకు ఇష్టపూర్తిగా కట్టుబడి వుండే సహజాభ్యాసం కలవానికి ప్రజాస్వామ్యభావం ఉగ్గుతో బెట్టినదై వుంటుంది. ప్రజాస్వామ్యానికి కృషిచేయవలెననే ఉన్నతాశయం కలవారు ప్రజాస్వామికతయొక్క ఈ మొట్ట మొదటి అగ్నిపరీక్షకు అర్హతను పొందగోరుతాను. అంతే కాక ప్రజాస్వామికుడు ఏ మాత్రమూ స్వార్థం లేనివాడై వుండాలి. అతడు తనవ్యక్తిగతమైన దృష్టినుంచిగాని, తన పక్షపు దృష్టినుంచిగాని కాక, కేవలం ప్రజాస్వామికతయొక్క దృష్టినుంచే ఆలోచించాలి, కలలు కనాలి. అప్పుడే ఆతడు శాసనోల్లంఘనాధికారాన్ని ఆర్జిస్తాడు... నేను వ్యక్తిస్వాతం

త్త్వాన్ని విలువగా పాటిస్తాను; అయితే మనిషి స్వభావతః సంఘజీవి అనే విషయాన్ని మీరు మరువకూడదు. సాంఘికాభ్యున్నతియొక్క అవసరాలకు అనుగుణంగా తన వ్యక్తిత్వాన్ని అనుసంధించుట ద్వారానే మానవుడు తన ప్రస్తుత స్థాయికి పెరిగివున్నాడు. విశృంఖలమైన వ్యక్తిత్వతత్వము ఆటవికన్మృగము అనుసరించే శాసనం. మనం వ్యక్తిస్వాతంత్ర్యానికీ, సాంఘికనియమములకూ మధ్యేమార్గాన్ని అనుసరించడం నేర్చుకోవాలి. సంఘసర్వస్వంయొక్క సంక్షేమసాధనార్థం సాంఘికనియమములను ఇష్టపూర్తిగా శిరసావహించడమనేది వ్యక్తికి తాను సభ్యుడైవున్న సంఘమునకును గూడ శ్రేయస్కరం కాగలదు.

హరిజన్, 27-5-'39

సక్రమంగా తన విధులను నిర్వర్తించే వానికి హక్కులు వాటంతట అవే భుక్తమవుతాయి. నిజానికి, తన విధులను నెరవేర్చడానికి స్వాతంత్ర్య మొసగే హక్కు ఒక్కటే జీవించి అనుభవించడానికి గాని, మరణించి ప్రాణము లర్పించడానికి గాని అర్హమైన హక్కు. అందులోనే అన్ని న్యాయసమ్మతమైన హక్కులూ ఇమిడివున్నాయి. తతిమ్మాదంతా ఏదో ఒకమారు వేషం దాల్చిన దురాక్రమణమే; దానిలో హింసాబీజాలు దాగివుంటాయి.

హరిజన్, 27-5-'39

ప్రజాస్వామ్యంలో వ్యక్తి స్వేచ్ఛ సంఘేచ్ఛకు, అనగా ప్రభుత్వమునకు, లోబడి వుంటుంది; ఆ ప్రభుత్వం ప్రజాస్వామ్యం నిమిత్తం, ప్రజాస్వామ్య పద్ధతిని పాలన మొనరుస్తుంది. ప్రతివ్యక్తీ ఇచ్ఛారాజ్యంగా వర్తిస్తే ప్రభుత్వమనేది వుండదు, అది అరాకజమై పోతుంది, అనగా సాంఘిక శాసనం గాని, పరిపాలనా వ్యవస్థగాని లేకుండా పోతుంది. అది స్వాతంత్ర్య వినాశానికి మార్గం. కావున వ్యక్తులు తమ ఆగ్రహాన్ని నిగ్రహించుకొని, ప్రభుత్వం ద్వారానే న్యాయవితరణం జరగనియ్యాలి.

ఢిల్లీ డైరీ, పే. 18

ప్రజాస్వామ్య పాలితులై ప్రజలు ఏవైనా లోటుపాట్లు వుంటే వాటిని ప్రభుత్వం యొక్క దృష్టికి తేవడంతో సంతృప్తి పొందాలి. అదే తమ అభీష్టమైతే ఆ ప్రభుత్వాన్ని తొలగించవచ్చును. కాని వ్యతిరేకాందోళనతో ప్రభుత్వానికి నిరోధం కలిగించ కూడదు. మన ప్రభుత్వం బలవత్తరమైన సైనికబలం పైనా నౌకాదళం పైనా ఆధారపడే పరిపాలనా వ్యవస్థవంటిది కాదు. మన ప్రభుత్వం యొక్క బలం ప్రజల పైననే ఆధారపడుతుంది.

ఢిల్లీ డైరీ, పే. 86

నిజమైన ప్రజాస్వామ్యం కేంద్రంలో ఒక ఇరవై మంది కూటంగా కూర్చుని నడిపిస్తే నడవదు. అట్టడుగు అంతస్తున గల ప్రతిగ్రామపు ప్రజలూ బలమొసగినప్పుడే అది నడుస్తుంది.

హరిజన్, 18-1-'48

సమూహస్వామ్యం (Mobocracy)

ప్రభుత్వంయొక్క ఆగ్రహావేశం కంటె ప్రజాసమూహంయొక్క ఆగ్రహావేశం ఎక్కువ చిక్కైనదని నావ్యక్తిగతాభిప్రాయం. సమూహావేశం దేశమొత్తంయొక్క మనోవైకల్యానికి చిహ్నం కావడంబట్టి, దానిని అరికట్టడం ఎక్కువ కష్టతరమైన కార్యం; ప్రభుత్వం ఒక కొలదిమందితో కూడిన వ్యవస్థ కావడంవల్ల, వారి ఆగ్రహాన్ని అరికట్టడం అంత కష్టమైనపనికాదు. పరిపాలనకు అర్హతను కోల్పోయిన ప్రభుత్వాన్ని తొలగద్రోయడం దుష్కరమైన కార్యంకాదు; ఎవరో తెలియని జనంతో కూడిన సమూహంయొక్క ఉన్మాద దాన్ని నివారించడం అంతకంటె చాలా క్లిష్టతరం.

యంగిండియా, 28-7-'20

సమూహానికి మనస్సూ, ముందాలోచనా వుండవు. కనుక వారిని తరిఫీదు చేయడంకంటె సులభకార్యం ఇంకొకటి లేదు. వారు ఆవేశాతిశయంలో ఏపనైనా చేస్తారు. క్షణంలో పశ్చాత్తాప పడతారు కూడా. సహాయనిరాకరణమును నేను ప్రజాస్వామికతను రూపొందించే నిమిత్తం ఉపయోగిస్తున్నాను.

యంగిండియా, 8-9-'20.

అచ్చపు బంగారం వంటి హృదయాలు, స్వదేశాభిమానం, నేర్చుకొనవలెననియు, నడిపింపబడవలెననియు అభిలాషగల ఈ ప్రజాసమూహాలను మనం సుశిక్షితం చేయాలి.

అయితే ఆ పనికి కొద్దిమంది తెలివైన నిజాయితీగల కార్య కర్తలు అవసరం. అప్పుడు దేశప్రజలంతా జాగరూకతతో వర్తించేలాగున సుసంఘటితం చేయగలుగుతాం. ఆ విధంగా సమూహస్వామికతను ప్రజాస్వామికతగా పరిణత మొనర్చ వచ్చును.

యంగిండియా, 22-9-'20,

ప్రభుత్వసంబంధమైన, లేక ప్రజాసంబంధమైన, దౌర్జన్యపూరిత వాతావరణంలో ప్రజాస్వామ్యభావాన్ని సంఘటిత మొనర్చలేము. కొన్ని అంశాలలో ప్రభుత్వసంబంధ మైన దానికంటె ప్రజాసంబంధమైన దౌర్జన్య పరిస్థితియే ప్రజాస్వామ్యభావ పరిణతికి ఎక్కువ నిరోధకమవుతుంది. కారణం, ప్రభుత్వదౌర్జన్యం ప్రజాస్వామ్యభావాన్ని బలపగు స్తుంది. ప్రజాదౌర్జన్యం దానిని నాశమొందిస్తుంది.

యంగిండియా, 23-2-'21

అధికసంఖ్యాకులు, అల్పసంఖ్యాకులు

Majority & Minority

మనం సత్యమైన ప్రజాస్వామ్యభావాన్ని అలవరచు కొనవలెనంటే అసహనం పనికిరాదు. అసహనం వున్నదంటే మనకు మన ఉద్యమంలో పూర్ణమైన విశ్వాసం లేదన్నమాట.

యంగిండియా, 2-2-21

అభిప్రాయ స్వాతంత్ర్యాన్ని, ఆచరణా స్వాతంత్ర్యాన్ని అభిలషించే మనం వాటిని తదితరులకు కూడా సమానంగా

వర్తింపజేయాలి. అల్పసంఖ్యాకుల నిరంకుశపాలన ఎంత దుర్భరమో, అధికసంఖ్యాకుల పాలనకూడా, అది బలాత్కార విధానాన్ని అవలంబించిన యెడల, అంతే దుర్భరమవుతుంది. మనం సహనంతోనూ, ప్రేమపూర్వకంగా వాదించి బోధపరచడం ద్వారానూ, అల్పసంఖ్యాకులను మన దిక్కు త్రిప్పుకోవాలి.

యంగిండియా, 26-1-'22

అధికసంఖ్యాక పాలన విధానం ఆచరణలో సంకుచిత మార్గాన్ని అవలంబించడం కద్దు— అనగా, ప్రతి చిన్నవిషయంలోనూ సంఖ్యాబలమే ప్రధానమనడం. అయితే, అధికసంఖ్యాకులు ఎటువంటి నిర్ణయం చేసినాసరే దానికి లొంగవలసినదే అనడం బానిసత్వ మవుతుంది. ప్రజలు గొర్రెలమందలా నడిచే వ్యవస్థ ప్రజాస్వామ్య మనిపించుకోదు. ప్రజాస్వామ్యం క్రింద వ్యక్తియొక్క అభిప్రాయ స్వాతంత్ర్యం ఆచరణా స్వాతంత్ర్యం జాగరూకతతో పరిరక్షింపబడతాయి. అందువల్ల అధికసంఖ్యాకుల అభిప్రాయాలకు విరుద్ధంగా వర్తించుటకు సంపూర్ణమైన హక్కు అల్పసంఖ్యాకులకు కలదని నా విశ్వాసం.

యంగిండియా, 2-3-'32

వ్యక్తిని లెక్కచేయకపోతే సంఘంలో ఇక మిగిలేదేమిటి? వ్యక్తిస్వాతంత్ర్యమే మనిషిని సంఘసేవకు తన్నుతాను సంపూర్ణంగానూ, ఇష్టపూర్తిగాను సమర్పితమొనర్చుకొనునట్లు చేయగలదు. అది వానినుంచి బలాత్కారంగా

ఊడలాగుకున్న యెడల, అతడు నిర్జీవయంత్రమైపోతాడు; తద్వారా సంఘమున్నూ పతనమౌతుంది. వ్యక్తిస్వాతంత్ర్య నిరాకరణపై ఏ విధమైన సంఘ నిర్మాణం కాని సాధ్యం కాదు.

హరిజన్, 1-2-'42.

అధ్యాయం ౫

భారతదేశం – సమాజవాదం

(India and Socialism)

సమాజవాదం అనేది పెట్టుబడిదారులు పెట్టుబడిని దుర్వినియోగం చేస్తున్నారనే విషయం కనిపెట్టబడడంతోనే పుట్టినది కాదు. నేను నిరూపిస్తూ వచ్చిన ప్రకారం, సమాజవాదమే కాదు, సామ్యవాదం కూడా. ఈశోపనిషత్తులలోని ప్రథమశ్లోకంలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. నిజమేమిటంటే, కొందరు సంస్కరణాభిలాషులు ఇతరులకు నచ్చచెప్పి తమ వైపు త్రిప్పుకునే పద్ధతిలో విశ్వాసం కోల్పోయినప్పుడు పుట్టింది, శాస్త్రీక్త సమాజవాదం (Scientific Socialism) అనబడే విధానం. శాస్త్రీక్త సమాజవాదులు ఎదుర్కొనే సమస్యయొక్క పరిష్కారానికే నేనున్నూ ప్రయత్నిస్తున్నాను. అయితే నా ప్రయత్నం ఎల్లప్పుడూ కేవలం నిష్కలుషమైన అహింసద్వారానే జరుగుతుందన్నమాట మాత్రం

వాస్తవం. అది విఫలమైతే కావచ్చును. నా ప్రయత్నం విఫలమైతే, అహింసావిధాన విషయికమైన నా అజ్ఞానమే దానికి కారణ మవుతుంది. దేనిలో నా విశ్వాసం దినదినమూ ప్రవర్థమానమవుతున్నదో ఆ సిద్ధాంతానికి నేను యోగ్య వ్యాఖ్యాతను కాకపోవచ్చును. అఖిలభారతచర్ఖాసంఘమూ, అఖిలభారత గ్రామోద్యోగసంస్థ (A. I. S. A. and A. I. V. I. A.) అను వ్యవస్థల ద్వారా అహింసా విధానానికి అఖిలభారతస్థాయిలో ప్రయోగ పరిశీలనములు జరుగుతున్నవి. పూర్తిగా ప్రజాస్వామికమైన కాంగ్రెసువంటి సంస్థకు సహజమైన భావవిపర్యయాలకు బద్ధుడను కాకుండా నా ప్రయోగములను నేను జరుపుకొనుటకు వీలేర్పరిచే నిమిత్తం, కాంగ్రెసు ఈ సంస్థలను ప్రత్యేకమైన స్వయం పాలన వ్యవస్థలుగా ఏర్పాటుచేసినది.

హరిజన్ 20-2-'37.

"భూమి అంతా గోపాలునికే చెందినప్పుడు దానికి సరిహద్దు లెక్కడివి? సరిహద్దు గీతలు మనిషి గీసినవి. వాటిని మనిషి తిరిగి తుడిచివేయవచ్చును" అని చేసిన బోధనద్వారా మన పూర్వీకులే నిజమైన సమాజవాదాన్ని మనకు అందిచ్చివున్నారు. గోపాలుడంటే పశులకాపరి; ఆ పదమే దేవుడని కూడా అర్థమిస్తుంది. ఆధునిక పరిభాషలో అది ప్రభుత్వమని అర్థమిస్తుంది— అంటే ప్రజలని అర్థం. అయితే, ఈ రోజున భూమి ప్రజలందరికిని చెందివుండలేదన్నమాట వాస్తవం. కాని అది పైనచెప్పిన బోధనయొక్క పొరపాటు

కాదు. దానిని అనుసరించక పోవడం మన పొరపాటే. దానిని ఆచరణలో పెట్టడానికి రష్యాతో సహా ఇతర దేశాలకు ఎంతపాటి సాధ్యమైవున్నదో, అంతపాటి సత్ప్రయత్నమును మనము కూడా చేయగల మనడంలో నాకు సందేహం లేదు– అయితే అది మనం దౌర్జన్య రహితంగా చేస్తాము. ఆస్తులపైన వ్యక్తి అధికారాన్ని తొలగించే విషయంలో దౌర్జన్య పద్ధతులకు బదులుగా శక్తివంతమైన ప్రత్యామ్నాయ సాధనం చర్ఖా తత్వమే. భూమిగాని, ఇతర ఆస్తులుగాని వాటి కొరకు ఎవడు కృషిచేస్తే వానికే చెందుతాయి. దురదృష్టవశాత్తూ ఈ చిన్న విషయం శ్రామికులకు ఇంతవరకు తెలియక పోవడమో, లేక తెలుపబడకపోవడమో జరిగింది.

హరిజన్, 2-1'-37

సాంఘిక న్యాయం సిద్ధించడం, దీనాతిదీనులకూ హీనాతిహీనులకూ అయినాసరే, దౌర్జన్య పద్ధతులద్వారా సాధ్యం కానేరదని నా చిరతరాభిప్రాయం. దానితోపాటు, అహింసా పద్ధతులపై వారు అనుభవిస్తూవున్న అన్యాయాలను తొలగించుకొనుటకు ఆ దీనహీనులకు శిక్షణ మొసగుట ద్వారా అది సిద్ధించడం సాధ్యమవుతుందనిన్నీ నేను విశ్వసించివున్నాను. అందుకు సాధనం దౌర్జన్యరహితమైన సహాయనిరాకరణం. సహకరణం ఎంత విధ్యుక్తధర్మమో, ఒక్కొక సమయంలో సహాయ నిరాకరణమున్నూ దానితో సమానమైన విధ్యుక్తధర్మమే అవుతుంది. ఏ వ్యక్తిగాని తనకు వినాశనకరమై, తనను బానిసనుచేసే దానితో సహక

రించవలసిన విధిలేదు. ఇతరుల కృషి ఫలితంగా మనం స్వాతంత్ర్యం పొందిన యెడల, వారాకృషిని నిలుపుచేసినచో మనమా స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనలేక పోతాము. ఇంకొకలా చెప్పవలెనంటే, అట్టి స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదన్నమాట. అహింసాత్మకమైన సహాయ నిరాకరణం ద్వారా దానిని పొందే కౌశలాన్ని నేర్చుకొన్న వెంటనే, ఆ దీనహీనుల మొగాలలో స్వాతంత్ర్య తేజం ప్రకాశమాన మాతుంది .... దౌర్జన్యపద్ధతివల్ల ఎన్నడూ పొందరాని ఫలితాలను అహింసాత్మక సహాయనిరాకరణం సిద్ధింపజేయగలదని నేను నిశ్చితంగా చెప్పగలను. దుష్కార్యపరునిలో తుట్టతుదకు హృదయపరివర్తనం కలిగించడం ద్వారా అది సాధ్యమవుతుంది. భారతదేశంలో మనమింతవరకు అహింసా విధానానికి తగినంత ప్రయోగావకాశం ఒసగి వుండలేదు. మనది కలగాపులగపు అహింసాపద్ధతి అయినా, తద్వారా మనం ఇంతపాటి సాఫల్యసిద్ధిని పొందడమే ఒక ఆశ్చర్యం.

హరిజన్, 20-4-'40.

సగౌరవ స్వపోషణకు కావలసిన దానికి మించిన భూమిని ఏ వ్యక్తిగాని కలిగివుండరాదు. తమదని చెప్పుకొనడానికి ఏ మాత్రం భూమీ లేకపోవడమే ప్రజాబాహుళ్యం యొక్క దుర్భరదారిద్ర్యానికి హేతువన్న వాస్తవసత్యాన్ని ఎవరు కాదనగలరు?

అయితే ఈ సంస్కరణ తొందరపాటుతో జరిగేది కాదని గ్రహించడం అవసరం. దీనిని అహింసాత్మక సాధనములవల్ల తీసుకురావలెనంటే, కలవారికీ లేనివారికీకూడా జ్ఞానబోధ చేయడం ద్వారానే సాధించవలసి వుంటుంది. తమపై ఎన్నడుగాని బలప్రయోగం జరగబోదని స్థితిపరులకు నమ్మకం కలిగించాలి. తమ యిష్టానికి విరుద్ధంగా ఎవరుగాని తమచేత ఏ పని చేయించడానికిగాని నిజంగా బలాత్కరించ లేరని తెలుసుకునేలాగునను, అహింసా విధానంలో కుశలత నేర్వడం ద్వారా— అనగా ఆత్మబాధా సహనం ద్వారా— తమ విముక్తిని తాము సాధించుకొనగలరనిన్నీ, పేదవారికి బోధించాలి. ఈ వాంఛితాశయమును సాధించవలెనంటే, నేను పైన వివరించిన ప్రబోధం వెంటనే ప్రారంభించవలసి వుంటుంది. ప్రథమ సోపానంగా, పరస్పర గౌరవాన్నీ నమ్మకాన్నీ కలిగించే వాతావరణం చేకూర్చాలి. ఉచ్చవర్గాలకూ సామాన్య ప్రజలకూ మధ్య దౌర్జన్యయుత సంఘర్షణ జరుగకూడదు.

హరిజన్, 20-4-'40.

ఎవరు జనతావాది ? (Who is a Socialist ;)

సమాజవాదం అనేది చాలా చక్కటిమాట. నేను గ్రహించినంతవరకు జనతావాదం ప్రకారం సంఘంలో భాగస్థులైన వారందరూ సమానులే— ఎవరుగాని హెచ్చూ కాదు, ఎవరుగాని తగ్గూకాదు. మన వ్యక్తిగతమైన

దేహంలో పైభాగాన్నివున్న హేతువున శిరస్సు ఉచ్చమూ కాదు, నేలనంటివున్న హేతువున అరికాళ్లు నీచమూ కాదు. వ్యక్తిగత దేహంలో భాగస్థములైన అంగములన్నియును ఏ విధంగా సమానములో, అట్లే సంఘంలోని భాగస్థులందరూ కూడా సమానులే. ఇదే సమాజవాదమంటే.

దానిక్రింద రాజూ రైతూ, ధనికుడూ పేదా, కామందూ జీతగాడూ అంతా ఒకే స్థాయికి చెందివుంటారు. మతపరిభాషలో చెప్పాలంటే, సమాజవాదంలో ద్వైతభావం లేదన్నమాట. అందులో అంతా ఏకీభావమే. ప్రపంచంలో ఏ సంఘాన్ని గమనించినాగాని ద్వైతమూ, బహుత్వమూ తప్ప వేరేమీ కనిపించదు. ఈ మనిషి పైతాహతువాడు, ఆ మనిషి క్రిందితాహతువాడు, ఇతడు హిందువు, అతడు ముస్లిము, వేరొకడు క్రైస్తవుడు, మరొకడు పార్సీ, ఇంకొకడు సిక్కు, మిగిలినవాడు యూదుమతస్థుడు. వీరిలో కూడా ఇంకా ఉపశాఖలున్నాయి. నేను తలపోసే సమైక్యతా భావం ప్రకారం బహుళత్వంతో కూడిన వర్గవైవిధ్య చిత్రంలోనే సంపూర్ణమైన సామరస్యం ప్రకాశమాన మవుతుంది.

ఈ గమ్యాన్ని చేరడానికి తాత్వికదృష్టితో విషయ పరిశీలన చేయనక్కరలేదు. మన అందరిలోనూ అనుకూల పరివర్తన ఏర్పడే వరకూ ఆగనవసరమూ లేదు. మనం జీవిత పరివర్తన పొందకుండానే ఉపన్యాసాలూ, పక్షనిర్మాణాలూ చేసి, ఈ ఆటలో మనకు వీలుచిక్కినంతనే గెద్దవలె బంతిని

తన్నుకుపోవచ్చును. అయితే ఇది సమాజవాద మనిపించు కోదు. దీనినొక ఆటగా పరిగణించినంతవరకు, అది మనకు దూరదూరమై పోవడమే జరుగుతుంది.

సమాజవాదం హృదయపరివర్తన పొందిన మొదటి వ్యక్తితో ఆరంభమవుతుంది. అటువంటివాడు ఒక్క మనిషి వుంటే, ఆ ఒకటికి సున్నలు కల్పుకుంటూ పోవచ్చును. మొదటి సున్న పదిమందికి, తర్వాత ప్రతి సున్నయు ఆపూర్వ సంఖ్యకు పది పదిరెట్లు మందికిని చిహ్నమవుతుంది. కాని మొదటిదే కనక సున్న అయితే, అనగా ప్రారంభకు డొక్కడూ లేకుంటే, దానితో కలిసిన సున్నలన్నిటి విలువా కూడా సున్నయే అయిపోతుంది. సున్నలను వ్రాయడానికి వ్యయపరిచే కాగితమూ, కాలమూ కూడా కేవలం దండుగై పోతుంది.

ఈ జనతావాద మనేది స్ఫాటిక స్వచ్ఛమైనది. అందు వల్ల దానిని సాధించుటకు కూడా స్ఫాటికస్వచ్ఛమైన సాధన ములు అవసరం. కలుషపూరితమైన సాధనములు కలుష పూరితమైన గమ్యాన్నే చేరుస్తాయి. కాబట్టి, రాజుకి శిర చ్ఛేదం చేయడం ద్వారా రాజుకీ రైతుకీ సమానత సిద్ధిం చదు; ఈ శిరచ్ఛేదన విధానంతో యజమానీ, కార్మికుడూ సమానం కాజాలరు. అసత్యమార్గం ద్వారా ఎవరూ సత్య గమ్యం చేరుకోనలేరు. సత్యప్రవర్తనయే సత్యాన్ని చేరు స్తుంది. ఇక, "అహింసయు సత్యమును కవలపిల్లలను పోలి

నవా?" అనే ప్రశ్నకు "ఏ మాత్రమూ కాద"ని నేను జవాబిస్తాను. అహింస సత్యంలోనూ, సత్యం అహింసలోనూ అంతర్గర్భితమై వున్నాయంటాను. అందువనే అవి రెండును ఒకే నాణెమునకు రెండు ముఖాలని వర్ణింపబడ్డాయి. అవి రెండూ అవినాభావసంబంధం కలిగినవి. నాణెం ఇరు ముఖాలా చదవండి. ఆ రెండు పదాలకూ వర్ణక్రమం భిన్నమైనా, విలువ ఒకటే. ఇట్టి ఉత్కృష్టస్థితి సంపూర్ణ స్వచ్ఛత లేనిదే సిద్ధించదు. మనోదేహాలలో ఏ మాత్రం కాలుష్యానికి తావిచ్చినా నీలోనికి అసత్యమూ, హింసా ప్రవేశిస్తాయి.

కావున కేవలం సత్యవ్రతులూ, హింసారహితులూ, నిర్మల హృదయులూ అగు సమాజవాదులు మాత్రమే భారతదేశంలోగాని, ప్రపంచంలో ఎక్కడగాని సమాజవాద సంఘాన్ని స్థాపించగలుగుతారు. నా ఎరికలో ప్రపంచంలో ఎక్కడా కేవల సమతావాది అయిన దేశం లేదు. పైన వర్ణించిన సాధనముల ద్వారా తప్ప, అట్టి సంఘ నిర్మాణం అసాధ్యం.

హరిజన్, 13-7-'47

అధ్యాయం ౬

భారతదేశం - సామ్యవాదం

బోల్షివిజమును నేనింకా పూర్తిగా అర్థం చేసికొనలేకపోతున్నానని ఒప్పుకొనవలసివున్నది. అది ఆస్థి వ్యక్తిపరంగా వుండే వ్యవస్థయొక్క నిషేధాన్ని కోరుతుందనే ఒక్క సంగతే నే నెరిగినది. ఇది కేవలం నిరాస్థి పరత్వం అనే నైతికాదర్శాన్ని ఆర్థిక రంగంలో ప్రయోగించడమే అవుతుంది. ఈ ఆదర్శాన్ని ప్రజలే తమ యిష్టపూర్తిగా అంగీకరించినా, లేక, శాంతియుత ప్రచారఫలితంగా వారిని అంగీకరింపజేసినా, అంతకంటె సంతసకరమైన విషయమింకొకటుండదు. కాని నాకు తెలిసినంతవరకు బోల్షివిజంలో బలప్రయోగం నిషేధం కాకపోవుటయే గాక, అది వ్యక్తిగతమగు ఆస్థులను ప్రభుత్వపరం చేసుకొనుటకును వాటిపై ప్రభుత్వాధికారాన్ని నిలుపుకొనుటకును బలప్రయోగ విధానాన్ని పూర్తిగా ఆమోదిస్తుంది. ఇది నిజమైతే ప్రస్తుత విధానానుసారకమైన బోల్షివిజం పరిపాలనము చిరకాలం నిలువజాలదని చెప్పుటకు నేను ఏమాత్రం వెనుకదీయను. ఏమనగా, హింసావిధానం పైన నిర్మితమైనది ఏదిగాని చిరస్థాయిగా నిలువనేరదని నా గాఢతర విశ్వాసం. అదెట్లున్నను, బోల్షివిక్ ఆదర్శానికి వెనుక దానికొరకైతమ సర్వస్వాన్ని అర్పించియున్న అసంఖ్యాక స్త్రీ పురుషుల యొక్క స్వచ్ఛతమ త్యాగం వున్నదనే విషయం కాదన

డానికి వీలులేదు; అంతేకాక లెనిన్‌వంటి మహదాశయుల త్యాగాన్ని పునాది చేసుకున్న ఆదర్శం ఎన్నటికీ వమ్మైపో జాలదు; వారి పరిత్యాగంయొక్క ఉత్కృష్టోదాహరణం శాశ్వతంగా ప్రకాశమానమై కాలం గడచినకొలదీ ఆ ఆద ర్శాన్ని స్వచ్ఛతరమూ, సజీవమూ చేయగలుగుతుంది.

యంగిండియా, 15-11-'28.

పాశ్చాత్యదేశాలకు చెందిన సమాజవాద, సామ్య వాద భావాలు మన దేశపు తాత్త్వికాభిప్రాయాలకు కేవలం విరుద్ధములైన కొన్ని అభిప్రాయములపైన ఆధారపడి వున్నాయి. మానవునిలో స్వభావతః స్వార్థభావం గర్భితమై వున్నదనేది అట్టి అభిప్రాయములలో ఒకటి. నేను ఈ క్రింది కారణములవల్ల ఆ అభిప్రాయంతో అంగీకరించలేను. మని షికీ పశువుకీ ముఖ్యమైన భేదం, మనిషి తనలో గర్భితమైన ఆత్మయొక్క ప్రబోధాన్ని అనుసరించగలడనిన్నీ, మృగము లతోపాటు తనలోగూడ నివిష్టమైవున్న పాశవప్రవృత్తులను విసర్జించి ఉన్నతస్థాయిని అందుకొనగలడనిన్నీ, అందువల్ల తనలోని శాశ్వతమైన ఆత్మచైతన్యమునకు కాక తనలోని పశుప్రకృతికి మాత్రమే చెందిన స్వార్థపరత్వమును, హింసా ప్రవృత్తిని అధిగమించగలడనిన్నీ నాకు తెలుసును. ఇదే హైందవమత ధర్మానికి మూలతత్వం; వేలాది వత్సరముల తపోనిష్ఠల ఫలితంగా వెలసిన సత్యమిది. అందులకే, మన దేశంలో ఆత్మరహస్యముల పరిశీలనమునకుగాను తమ దేహ ములను కృశీభూత మొనర్చుకొని, ప్రాణములనుసైతం మొసగి

యుండిన యోగీంద్రులు గోచరిస్తారేగాని, పశ్చిమ దేశము లలో వలె భూగోళపు అంచుల నందుకొనుటకో, అత్యున్నత పర్వతాగ్రముల నధిరోహించుటకో ప్రాణము లర్పించినవారు కనిపించరు. అందువల్ల మన సమాజవాదముగాని, సామ్య వాదముగాని అహింసా సిద్ధాంతముపైనను, కార్మిక ధనస్వా ముల యొక్కయు, కర్షకభూస్వాముల యొక్కయు సామరస్య పూర్వక సహకారభావము పైనను ఆధారపడి నిర్మితం కావలసివున్నది.

అమృతబజార్ పత్రిక, 2-8-'34.

సామ్యవాదానికి తుది అర్థం ఏమిటని తేలుతుంది? వర్గరహిత సాంఘికవ్యవస్థ అని తేలుతుంది– ఇది పొందడా నికి కృషిచేయదగిన ఆదర్శమే. కాని దానిని పొందుటకు గాను దౌర్జన్యవిధానాన్ని అవలంబించే ఒక్క విషయంలో నే నేను దూరంగా తప్పుకుంటాను. మనమంతా జన్మతః సమానులమే; కాని ఇన్ని శతాబ్దులనుంచీ మనం ఈశ్వర సంకల్పానికి విరుద్ధంగా సంచరించాం. హెచ్చుతగ్గులనే అసమానతాభావం పాపమే; కాని ఖడ్గాగ్ర ప్రయోగంతో మానవ వక్షోంతరంనుంచి పాపనిర్మూలనం చేయగలమని నేను విశ్వసించను. మానవ హృదయం అట్టి సాధనములకు లొంగదు.

హరిజన్, 13-3-'37.

రష్యా దేశం అనుసరించే సామ్యవాద విధానం, అనగా ప్రజలపైన బలాత్కారంగా అమలుచేయబడిన సామ్యవాదం,

భారతదేశానికి కేవలం అయోగ్యమైన పద్ధతి. దౌర్జన్యంతో ఏమీ పనిలేకుండా సామ్యవాదం సాధ్యపడితే అది స్వీకార యోగ్యంగానే భావిస్తాము. ఏమనగా, అప్పుడు ప్రజల తరఫునా ప్రజలకోసమూ తప్ప ఎవరికీ ఆస్తి వుంచుకొనుటకు వీలుండదు. లక్షాధికారి చేతిలో లక్షలధనం వుండవచ్చును; కాని దానిని ప్రజల తరఫునే ఆతడు వుంచుకొనగలుగుతాడు. దేశమొత్తం యొక్క అవసరాలకు అది ఎప్పుడు కావలసివస్తే అప్పుడు, ఆ ధనాన్ని ప్రభుత్వం వశపరచుకొనగలుగుతుంది.

హారిజన్, 13-3-'37.

ఈ రోజున ఆర్థిక సమానత్వం తేవడానికి తామేమీ చేయలేమని చెబుతారు సమాజవాదులూ, సామ్యవాదులూ కూడా. దానిని గురించి ఉత్త ప్రచారం మాత్రం చేస్తారు; ద్వేషాన్ని జనింపజేయడమూ, జ్వలింపచేయడమూ దానికి సాధనాలని నమ్ముతారు. ఇక, తమకు ప్రభుత్వాధికారం చేజిక్కిన తర్వాత సమానతను బలాత్కారంగా అమలుపరుస్తామంటారు. నా ప్రణాళిక ప్రకారం ప్రభుత్వం అనేది ప్రజల అభిమతాన్ని అమలుపరచడానికే వుంటుంది; వారిని ఆజ్ఞాపించుటకుగాని, తన అభిమతాన్ని అనుసరించమని వారిని బలాత్కరించుటకుగాని కాదు. నేను అహింసా విధానం ద్వారా, అనగా, ద్వేషమునకు బదులు ప్రేమసాధనములయొక్క ప్రయోగ ఫలితంగా ప్రజలను నా దృక్పథానికి త్రిప్పుకొని, తద్వారా ఆర్థిక సమానతను తీసుకువస్తాను.

సంఘం యావత్తును నా అభిప్రాయానుగుణంగా మార్చగలిగే వరకూ ఆగను; వెంటనే నా ఒక్కడితోనే దాని ఆచరణారంభం సాగిస్తాను. యాభై మోటారుకార్లు పెట్టుకోగల స్థితిపరుడినై వుండిగాని, తుదకు పదియెకరాల భూమికి అధికారినై యుండిగాని నా భావనలోని ఆర్థికసమానతను తీసుకు రాలేనన్నమాట వేరే చెప్పనక్కరలేదు. అందు నిమిత్తమై నేను దరిద్రాతి దరిద్రులతో సమాన స్థాయికి దిగవలసివుంటుంది. గడిచిన యాభై యేళ్ల పైచిలుకునుంచీ అదే నేను చేస్తూవున్న సాధన. అందువల్ల, స్థితిపరులైనవారు నా కోసగుతూ వచ్చిన కార్లను, ఇతరములగు సౌకర్యాలను నేను వినియోగిస్తూ వున్నప్పటికీ నేను సామ్యవాదులలోకల్లా ముందంజవేసినవారిలో ఒకడనని ఉద్ఘాటించగలను. నేను స్వీకరించే సౌకర్యాలకు నేను దాస్యుణ్ణికాదు; ప్రజాసామాన్య సంక్షేమానికి అవసరమైనప్పుడు వాటిని క్షణంలో విసర్జించగలను.

హరిజన్, 31-3-'46

పరదేశాల ఔదార్యంపైన ఆధారపడడంకంటె మన నేల మన కొసగగలిగిన దానితో బ్రతకగల సామర్థ్యమూ, సాహసమూ మనం కలిగివుండాలి. లేనిచో మనం స్వతంత్ర దేశంగా వుండే అర్హతనే కోల్పోతాము. ఈ సూత్రమే విజాతీయ సిద్ధాంతాలకున్నూ వర్తిస్తుంది. భారతీయ పరిస్థితులకు అనుగుణంగా వాటిని ఎంతవరకు వర్తింపచేయగలమో, ఎంతవరకు జీర్ణించుకొనగలమో, అంతవరకు

మాత్రమే వాటిని నేను స్వీకరిస్తాను. అంతేగాని వాటికి కేవలం వశవర్తినై నలిగిపోవడానికి నేనేమాత్రం అంగీకరించలేను.

హారిజన్, 6-10-'46

అధ్యాయం ౬

The Curse of Industrialism

యంత్రపరిశ్రమా పిశాచి

తీరని లౌకికాధిపత్యాకాంక్ష, తత్ఫలితమైన యుద్ధకాండ అనే రెండు అంచులమధ్య నడిచే నేటికాలపు నాగరికతలో విశ్వాసాన్నికోల్పోయిన సద్వివేచనాపరుల సంఖ్య పశ్చిమ ప్రపంచంలోకూడా పెరిగి బలపడుతూ వుండడం గమనీయం. పాశ్చాత్య నాగరికతావిధానం మంచిదైనను చెడ్డదైనను భారతదేశం ఆ పద్ధతినే అనుసరించవలసిన పనేమిటి? పాశ్చాత్య నాగరికత పట్టణ జీవితాలంబకమైనది. ఇంగ్లాండు, ఇటలీలవంటి చిన్న దేశాలు తమ విధానములను పట్టణావలంబితములుగా చేసుకుంటే ఫరవాలేదు. వైశాల్యము ఎక్కువైనప్పటికి జనసంఖ్య తక్కువైన అమెరికా వంటి దేశానికి కూడా ఆ విధానం తప్పనిసరి అయినది కావచ్చును. కాని క్రిక్కిరిసిన జనాభాతో కూడిన ఒక విశాలదేశం, తన అవసరములను తీర్చుటకు ఇంతకాలంగా

అత్యనుకూలంగా నడుస్తూవున్న ఒక గ్రామీణ సంప్రదాయ మును కలిగివున్న సందర్భంలో, పాశ్చాత్యపు నమూనాను అనుసరించవలసిన పనిలేదనీ, అనుసరించకూడదనీ కూడా తోస్తుంది. కొన్ని పరిస్థితులు కలిగిన ఒక దేశానికి అను కూలమైన పద్ధతి తద్భిన్న పరిస్థితులు కల్గిన మరొక దేశానికి కూడా అనుకూలమైనదై తీరవలెనని ఎక్కడాలేదు. తరుచు ఒక మనిషికి యోగ్యమైన ఆహారం ఇంకొకనికి విషప్రాయం కావడం కద్దు. ఒక దేశంయొక్క సంస్కృతిని రూపొందిం చడంలో ఆ దేశపు భౌతికభూగోళ పరిస్థితులు చాలా ప్రాధా న్యం వహిస్తాయి. ధృవప్రాంత నివాసికి బొచ్చుతోలుతో చేసిన దుస్తులు అవసరవస్తువు కావచ్చును; కాని దానినే భూమధ్యరేఖాప్రాంతవాసులు ధరిస్తే ఉక్కిరిబిక్కిరై పోతారు.

యంగిండియా, 27-5-'29

విపరీత పరిమాణంలో వస్తువులను తయారుచేసే ఉబ లాటమే ప్రపంచపు సంకట పరిస్థితికి హేతుభూతమని నేను ఉద్ఘాటించి చెపుతాను. మానవావసరములన్నిటినీ యంత్ర ములు తీర్చగలవని ప్రస్తుతానికి అంగీకరించి చూచినా, తద్వారా కొన్ని నిర్దిష్ట ప్రాంతములలో ఆ వస్తునిర్మాణము కేంద్రీకృతమై, వాటిని సవ్యమైన రీతిని పంపకమొనర్చుటకు అపసవ్యమైన చుట్టుదార్లను అనుసరించవలసి వస్తుంది. ఏ వస్తువులు ఎక్కడెక్కడ అవసరమో ఆయా స్థలాలలోనే వాటి యొక్క తయారీ, పంపకములు రెండును జరిగిన

మొదల ఆ పని దానంతట అదే చక్కగా జరిగిపోతుంది. అందువల్ల మోసానికి అవకాశమేమీ ఉండదు; అధికలాభ ముల నిమిత్తం నిలవచేయడమనేది అసలేవుండదు.

బలహీనమైనవనియు, సుసంఘటితము కానివనియు పేర్కొనబడుతూవున్న ఇతర ప్రపంచ జాతులతో ఈ దేశ ములు (యూరోపు, అమెరికాలు) బలప్రయోగపూర్వకమైన లాభసాటి వ్యాపారమును జరుపగలుగుతూవున్న సంగతి మీరు చూస్తూనే వున్నారు. ఈ జాతులు కొలదిపాటి ప్రాథ మిక పరిజ్ఞానమునార్జించి, తామికముందు ఇతరుల లాభాలకు ఆస్పాదము కాబోమని నిశ్చయించుకున్నవంటే, అటు పిమ్మట వారు కేవలం తమ అవసరాలకొరకును తాము స్వయంగా తయారుచేసికొన గలిగినవాటితోనే సంతృప్తి పడతారు. అప్పుడు అతిశయమైన వస్తునిర్మాణం అనేది, కనీసం జీవితా వసరాలకు సంబంధించినంతవరకైనా, అదృశ్యమవుతుంది.

తయారీ, పంపకమూ రెండూ స్థానికంగా జరిగితే, లెక్కా జమా లేకుండా అపరిమితవేగంతో వస్తునిర్మాణం చేసే ఉబలాటం తగ్గిపోతుంది. అప్పుడు మన ప్రస్తుతకాలపు ఆర్థికవిధానఫలితములను అంతులేని చిక్కులూ, సమస్యలూ కూడా అంతరిస్తాయి.

హరిజన్, 2-11-'34

యంత్రశక్తికి ఒక స్థానమేర్పడింది; అది స్థావరమై పోయింది. కాని దానిని అవసరమానవ పరిశ్రమయొక్క

స్థానాన్ని ఆక్రమించనీయడం మాత్రం తగనిపని. కుటీర పారి శ్రామిక యంత్రాలలో ఎట్టి అధిక ప్రయోజనకరమైన మార్పులు చేకూర్చినా నేననుమతిస్తాను. కాని లక్షలాది వ్యవసాయదారులకు వేరొక గృహవ్యాపకం చూపగలిగితే తప్ప, యంత్రచాలితములైన కదుళ్లను ప్రవేశపెట్టి వాటిని చేతిపరిశ్రమయొక్క స్థానాన్ని ఆక్రమించనీయడం మాత్రం అక్రమమని నా అభిప్రాయం.

యంగిండియా, 5-11-'25

యంత్రశక్తియొక్క బాహ్యవిజయాన్ని చూచి నేను సమ్మోహితుణ్ణి కాబోను. వినాశకారకమైన యంత్రములన్నిటినీ నేను నిస్సంకోచంగా ప్రతిఘటిస్తాను. అయితే సులభమైన పనిముట్లు, పరికరములు, వేలాది కుటీరపరిశ్రామికులకు పని తేలికచేసి వ్యక్తిశ్రమను తగ్గించే అల్పయంత్రాలు మొదలైనవాటిని నేను సంతోషంతో స్వీకరిస్తాను.

యంగిండియా, 17-6-'26

భారతదేశం నలుదిశలా అవరించివున్న ఏడులక్షల గ్రామాలలో చెల్లాచెదరై నివసించే గ్రామీణుల రూపంలో వున్న కోట్లాది సజీవయంత్రాలకు నిర్జీవమైన యాంత్రికశక్తిని ప్రత్యర్థిగా నిలబెట్టకూడదు. యంత్రశక్తి సద్వినియోగం కావలెనంటే, అది మానవశ్రమను సులువుచేసి సహాయపడాలి. ప్రస్తుతంలో యంత్రశక్తి కోట్లాది స్త్రీపురుషుల కడుపుకొట్టి కొలదిమంది చేతులలో సంపత్తిని అధికాధికంగా కేంద్రీకరించుటకే దారితీస్తున్నది.

హరిజన్, 14-9-'35

అపరిమితస్థాయిలో జరిగే యంత్రపరిశ్రమా విధానము, పోటీ సమస్యయు విక్రయసమస్యయు ఏర్పడగానే, బుద్ధిపూర్వకముగనో సహజసిద్ధముగనో గ్రామీణుల కడుపు కొట్టుటకు దారితీయకమానదు. అందువల్ల, మనం గ్రామములు తమ అవసరవస్తువులను చేసికొని స్వయంసమర్థములుగా అగునట్లు చూచుటలో మన దృష్టిని కేంద్రీకరించవలసి వుంటుంది. పారిశ్రామికతయొక్క ఈ స్వరూపాన్ని సుస్థిరమొనర్చినప్పుడు, గ్రామీణులు తాము స్వయముగా చేసికొనుటకును ఉపయోగించుటకును అనువైన ఆధునిక యంత్రములను, పనిముట్లను వినియోగించుకొనుటకు ఏమీ అభ్యంతరముండదు. అయితే అవి ఇతరులను నష్టపరచుటకు మాత్రం వినియోగింపబడకూడదు.

హరిజన్, 29-8 36

ప్రతి పరిస్థితిలోనూ ప్రతీ దేశానికీ యంత్రపారిశ్రామిక విధానం తప్పనిసరిగా అవసరమని నేను నమ్మను. భారతదేశ విషయంలో ఇది మరీ యదార్థం. నిరాడంబరమూ, ఉన్నతాశయ యుతమూ అయిన జీవితవిధానాన్ని అనుసరించి, తన ఇండ్లలాది కుటీరములలో పరిశ్రమలను పెంపొందించి, లోకమంతటితోనూ శాంతియుత సంబంధం నెలకొల్పుకొనివున్న పక్షమందే స్వతంత్ర భారతదేశము వేదనావిల ప్రపంచ సమక్షమున తన యొక్క విధ్యుక్తధర్మమును నిర్వర్తించగలుగునని నా దృఢవిశ్వాసం. ధనపిశాచారాధనా ఫలితంగా మన మీద వచ్చిపడిన అపరిమిత వేగావేశపూరితమైన క్లిష్ట

లౌకిక జీవితవిధానమునకును, ఆధ్యాత్మికమైన ఉన్నత భావన మునకును ఏ మాత్రమూ సరిపడదు. సదాశయయుతంగా జీవించే కళలో అభినివేశం పొందినప్పుడే, బ్రతుకులోని అందచందాలు ప్రకాశమానం కాగల్గుతాయి.

ప్రమాదకరంగా జీవించడం అనేది ఇంద్రియోద్వేగ జనకమైతే కావచ్చును. ప్రమాదాలను ఎదుర్కొని జీవించ డానికీ, ప్రమాదకరంగా జీవించడానికీ గల తేడాను మనం గ్రహించాలి. క్రూరమృగములతోనూ, అంతకంటె క్రూరులైన ఆటవికులతోనూ నిండివున్న అరణ్యమధ్యంలో, చేతిలో తుపాకి అయినా లేకుండా కేవలం దేవుడే సహాయంగా, ఒంటరిగా జీవించడానికి సాహసం చూపినవాడు ప్రమాదాన్ని ఎదుర్కొని జీవించిన వాడౌతాడు. నిరంతరం ఆకాశమధ్యాన్ని మసలుతూ, హఠాత్తుగా భూమిపైకి పరమ వేగంతో దిగి, నోరు తెరచుకుని విస్ఫారంతో విరగబడి చూచే లోకంయొక్క శ్లాఘనం పొందేవాడు ప్రమాదకరంగా జీవించే వాడౌతాడు. వారిలో ఒకనిది సార్థకమైన బ్రతుకూ, మరొకనిది నిరర్థకమైన బ్రతుకూ అవుతుంది.

సకలాయుధసంపన్నమూ, వివిధాడంబరాలంకృతమూ అయిన ప్రస్తుత ప్రపంచ సమాజాన్ని, భౌగోళికంగానూ జనసంఖ్యలోనూ ఎంతపెద్దదైన దేశంగాని తన మూలాను తాను ఒంటరిగా కూర్చొని పైన వర్ణించియున్న నిరాడంబర జీవితమును ఆచరింపగల్గుట సాధ్యమౌతుందా? అను ప్రశ్న

అవిశ్వాసి మనస్సులో జనించదగిన సందేహం. దీనికి సూక్ష్మమైన సులభమైన జవాబొక్కటే. నిరాడంబర జీవితమే కనక యోగ్యమైనదైతే, అట్లు జీవించుటకు ఒక వ్యక్తి ప్రయత్నించినా ఒక సంఘం ప్రయత్నించినాగాని, వారి కృషి సార్థకమే అవుతుంది.

అయినప్పటికీ, కొన్ని ముఖ్యమైన పెద్ద పరిశ్రమలు కూడా అవసరమే అని నా నమ్మకం. పడకకుర్చీ సోషలిజంలో (సమాజవాదం) గాని పశుబలాధారమైన సోషలిజంలోగాని నాకు నమ్మకంలేదు. దేశమంతా మారేవరకూ ఆగ నవసరం లేదనే నా సిద్ధాంతము ననుసరించి వెంటనే, పనిప్రారంభించే కార్యవిధానమునే నేను విశ్వసిస్తాను. కావున, విస్తృత పరిశ్రమలు, అనగా చాలామంది కార్మికులు ఒక్కచోట పని చేయవలసియున్న కర్మాగారములు ప్రభుత్వాధీనంలో వుండవలెనని మాత్రము ప్రస్తుతానికి వెల్లడిస్తాను. అట్టి ఆ పరిశ్రమలేవియో ప్రస్తుతం వివరించనవసరం లేదు. అక్కడ పనిచేసేవారి శ్రమ కాయకష్టంతోకూడినదైనా, కౌశలంతో కూడినదైనా తత్ప్రతిఫలమైన ఉత్పత్తులపై అధికారం ప్రభుత్వంద్వారా వారికే చెందివుంటుంది. నా భావన ప్రకారం అట్టి ప్రభుత్వం అహింసాత్మకమై వుంటుంది కనుక, ధనికుల ఆస్తిపాస్తులను బలవంతంగా లాగికొనడం నేనొప్పను, ప్రభుత్వవశంవదత్వ విధానాన్ని అమలు పరిచే కార్యక్రమానికి వారి యొక్క సహకారాన్ని కూడా ఆహ్వానిస్తాను. సంఘంలో ఎవరుగాని, వారు లక్షాధికారులైనాసరే, భిక్షాధి

కారులైనాసరే, బహిష్కృతులుగా భావించబడరాదు. వారిరువురూ ఒకే రోగంవల్ల జనించిన ఫుంస్లు. ఎవరెట్టి వారైనాగాని, తుది అంచనాలో అంతా మానవులే.

మనం భారతదేశంలోనూ, ఇతరచోట్లా ఇంతవరకు చూచివున్న, ఇకముందు చూడనున్న దుస్సహాదౌర్జన్య కాండలన్నిటినీ ఎదురొడ్డి, నేను నా యీ విశ్వాసాన్ని ఉద్ఘాటిస్తున్నాను. ఆపత్తులను ఎదుర్కొని జీవిద్దాం మనం.

హారిజన్, 1-9-'46

అధ్యాయం ౮

వర్గసమరం

జనసామాన్యానికి ధనస్వాములను తమకు శత్రువులుగా భావించమని నేను బోధించను, తమకు తామే శత్రువులని ప్రబోధిస్తాను.

యంగిండియా, 26-11-'31

వర్గసమరమనేది భారతదేశపు మూలతత్వానికి విరుద్ధమైన భావం. సమాన న్యాయసిద్ధాంతము పునాదిగాగల ప్రాథమిక హక్కులపైన ఆధారపడునటువంటి సామ్యవాద విధానమును స్వయంగా రూపొందించుకునే సామర్థ్యం భారత దేశానికి వుంది. నా ఆదర్శస్వప్నమైన రామరాజ్యంలో ప్రభువు భిక్షుకుడు కూడా ఒక విధమైన హక్కులను కలిగి వుంటారు.

అమృతబజార్ పత్రిక, 2-8-'34.

ఇతరుల కడుపుకొట్టి స్వలాభమార్జించే విధానముగాని, అట్లు చేయవలెననే అపేక్షగాని ఇంకను పాతుకునివున్న సమయమునందే, అట్టి లాభపరులకును బలిఅయ్యే వారికినీ మధ్య సహకారం వుండి తీరవలెనని నేనెప్పుడుగాని చెప్పి యుండలేదు. ధనస్వాములూ భూస్వాములూ అయిన వారంతా తమలోని ఒకానొక అంతఃప్రకృతి మూలకంగా పరలాభాపహర్తలు అవుతున్నట్లుగాని, వారి శ్రేయస్సుకీ జనబాహుళ్యం శ్రేయస్సుకీ మధ్య అంతర్గతమైన తీరని వైరుధ్యం వున్నదనిగానీ మాత్రం నేను నమ్మను. అపహృత లాభులగువారి యొక్క ఇష్టపూర్వకమైన, లేక బలాత్కృత మైన సహకారంపైననే అట్టి లాభాపహరణమంతా సాగుతూ వుంటుంది. మనకు అంగీకరించడానికి ఎంత యిష్టం లేక పోయినా, ప్రజలు లాభాపహర్త యొక్క అధికారాన్ని శిరసా వహించడానికి అంగీకరించనినాడు ఇక అట్టి లాభాపహరణ విధానమునకు ఆస్కారమే వుండబోదనే వాస్తవిక సత్యాన్ని మాత్రం కాదనలేము. కాని, మన స్వార్థమే మనకు అడ్డు తగిలి, మనలను బంధించే గొలుసులనే మనం కౌగిలించుకుని కూర్చుంటాము. ముందుగా ఇది పోవాలి. జరగవలసినది భూస్వాములయొక్క, ధనస్వాములయొక్క వినాశనం కాదు; వారికిని జనసామాన్యమునకును మధ్యగల ప్రస్తుత సంబంధం మారి, అంతకంటె ఆరోగ్యవంతమూ, స్వచ్ఛమూ అయిన సంబంధం ఏర్పడాలి.

వర్గసమరం అనే భావం నాకు మనస్కరించదు. అహింసా సందేశాన్ని మనం అవగాహన చేసుకున్నట్లయితే, వర్గసమరమనేది భారతదేశంలో తప్పనిసరి కాకపోవుటయే కాదుగదా, అది అవసరం లేకుండా చేయడానికి కూడా వీలుంది. వర్గసమరం తప్పనిసరి అని చెప్పేవారు అహింసా సిద్ధాంతంయొక్క ఆంతర్యాన్ని అర్థం చేసికొననివారైనా అయివుండాలి; లేదా, వారి అవగాహనయొక్క లోతు మోకాలుబంటి మాత్రమైనా అయివుండాలి.

పశ్చిమదేశములనుంచి దిగుమతి అయిన ఊతపదములకును, సమ్మోహనకరములైన ప్రచారవాక్యములకును పరవశులము కాకుందుముగాక. విశిష్టమైన మన ప్రాచ్యసాంప్రదాయం మనకు లేదా? ధనిక శ్రామికసంబంధమైన సమస్యకు మనకు అనుగుణమైన పరిష్కారసూత్రాన్ని మనం కనిపెట్టుకొనలేమా? మన వర్ణాశ్రమ ధర్మవిధానమంటే ఉచ్చ-అధమ, ధనిక-శ్రామికవర్గములకు మధ్యగల భిన్నత్వాన్ని సమగసమొనర్చే సాధనముకాక వేరేమిటి? ఈ విషయమై పశ్చిమమునుంచి వచ్చేదంతా హింసాతూలికతో కలుషీకృతమొనర్చబడినదే. ఈ మార్గాంతమున జరిగివున్న విధ్వంసమునంతను నేను చూచినవాడనగుటచేత దానిని నేను ప్రతిఘటిస్తాను. పశ్చిమప్రపంచంలో కూడా, అచ్చటి ఉన్నత భావుకవర్గం ఈ నాడు తమ విధానం దారితీస్తూవున్న అగాధమును చూచి, నిర్ఘాంతపడి నిలిచిపోతున్నారు. ఈ హింసామార్గముయొక్కయు పరపీడనవిధానముయొక్కయు విషవల

యమునుండి విముక్తిని చేకూర్చగల పరిష్కారమార్గమును కనిపెట్టుటకు నేను చేసే నిరంతర ప్రయత్నములే నాకు పాశ్చాత్యలోకమందేర్పడియున్న ఏ కొలదిపాటి గౌరవమున కైనను హేతుభూతములై వున్నవి. పాశ్చాత్య సంఘవ్యవస్థను గురించి చిరకాలానుగతంగా చేసియున్న పరిశీలనాఫలితంగా నేను కనిపెట్టిన ఒక సంగతి చెప్పగలను. అది ఏమనగా పాశ్చాత్య లోకాంతరంగంలో నిండి నిబిడీకృతమై రగిలే జ్వరోష్టతకు అడుగున నిర్విరామమైన ఒకానొక సత్యాన్వేషణాకాంక్ష కూడా గోచరమాతుంది. ఆ ప్రవృత్తిని నేను విలువైనదిగా పాటిస్తాను. విజ్ఞాన శాస్త్రీయమైన అన్వేషణా దృష్టితో మనము కూడా మన ప్రాచ్య సంస్థాసాంప్రదాయములను పరిశీలన మొనరిస్తే, ప్రపంచం యింతవరకు కలలోనైనా కనివిని యెరగనంతటి సత్యతరమైన సమాజవాదమును, సత్యతరమైన సామ్యవాదమును రూపొందింపగల్గుతాము. జనసామాన్య దారిద్ర్యసమస్యా పరిష్కార విషయంకు పాశ్చాత్య సమాజవాద, సామ్యవాద విధానములే తుది వాక్యమను అపోహకు పాలవడమంత పొరపాటు ఇంకొకటుండదు.

అమృతబజార్ పత్రిక, 3.8.'34

జమీందారుని హతమొనర్చవలెనని నేను కోరను; కాని జమీందారు వుండడం తప్పనిసరి అయిన అవసరమనిన్నీ నేను తలచను. జమీందారులనూ ఇతర ధనాధిపతులనూ కూడా నేను అహింసా విధానంద్వారా మార్చగలనని

ఆసిస్తాను. అందువల్ల, నా దృష్టిలో వర్గసంఘర్షణయొక్క అనివార్యతావాదానికి స్థానమేలేదు. వీలైనంత తక్కువ ఘర్షణతో కూడిన పంథాను అనుసరించడమే అహింసావిధానంలో ఒక ముఖ్యాంశం. భూమిని సాగుచేసేవారు తమ శక్తిని తెలిసికొనిన తక్షణం జమీందారీ పద్ధతిలోని చెడుగు నిర్వీర్యమైపోతుంది. తమకూ, తమ పిల్లలకూ సగౌరవమైన రీతిగా తిండి, బట్ట, విద్య పొందడానికి అవసరమైన జీతభత్యము లిస్తేగాని తాము ఏ మాత్రమూ పనిచేయబోమని వారేకనక చెప్పిననాడు, నిర్వీర్యుడై పోయిన ఆ జమీందారుడు ఇంకేమి చేయగలడు? వాస్తవంగా శ్రమఫలితంగా జరిగిన ఉత్పత్తి అంతా శ్రామికునికే చెందుతుంది. ఆ శ్రామికులే కనక తెలివిగా సమైక్యమైనచో వారొక అజేయమగు శక్తిగా రూపొందగలరు. ఆ దృష్టినుంచి, వర్గసంఘర్షణయొక్క అవసరం నాకు గోచరించదు. అది అనివార్యమని నాకు తోచిన యెడల, దానిని బోధించుటకు గాని, ప్రబోధించుటకు గాని నేను వెనుకాడను.

హరిజన్, 5-12-'36

వర్గమునకును వర్గమునకును మధ్య వైరభావం కల్పించడం కాదు; శ్రామికులలో ఆత్మగౌరవజ్ఞానమును కలిగించడమనేది అసలు సమస్య. ఎన్ని చెప్పినా, ప్రపంచ జనాభాలో ధనాఢ్యులసంఖ్య దుర్భిణీయంత్రానికిగాని దొరకనంత స్వల్పమైనది. శ్రామికలోకం తన శక్తిని గ్రహించుకుని, అయినప్పటికిని న్యాయసమ్మతంగా వర్తించిన యెడల,

ఆ వెనువెంటనే ఆ ధనస్వాములును న్యాయసమ్మతంగా వర్తిం చడం జరుగుతుంది. శ్రామికులను ధనికులమీదికి రెచ్చ కొట్టడంవల్ల వర్గద్వేషాన్ని, దానివలన కలిగే సర్వవిధము లైన దుష్ఫలితాలను చిరస్థాయిగా చేయడం మాత్రమే జరుగుతుంది. ఏ పరిస్థితిలోగాని అట్టి సంఘర్షణ అనే విష చక్రంలో చిక్కడం శ్రేయస్కరం కాదు. అది దౌర్బల్యాన్ని అంగీకరించడంతో సమానం; ఆత్మగౌరవలోపానికి చిహ్నం. శ్రామికలోకం తన తాహతును తాను తెలిసికొన్న మరు క్షణం ధనం తన న్యాయసమ్మతమైన స్థానానికి వస్తుంది; అంటే, శ్రామికులకు హామీగా మాత్రమే భావింపబడుతుంది. ఎందువల్లననగా శ్రమయొక్క విలువ ధనంకంటె అధికం.

హరిజన్, 16-10-'45

అధ్యాయం ౬

సమ్మెలు (Strikes)

సమ్మెలు కట్టుట ఈ నాడు సర్వసాధారణమైపోయింది. అవి నేటి ఆందోళనాయుత వాతావరణకు లక్షణం. అనేక రకాల అస్పష్టభావాలు గాలిలో తేలుతున్నాయి. అస్పష్ట మైన ఒక ఆశాభావం హృదయాలను ఆవేశపూరితం చేస్తు న్నది. ఆ అస్పష్టాశయం స్పష్టరూపం దాల్చని యెడల, గొప్ప విఫలభావానికి తావిస్తుంది. ఇతరచోట్ల వలెనే భారత

దేశంలో కూడా కార్మికలోకం తమకు సలహాదార్లుగాను, నాయకులుగాను బయలుదేరిన కొంతమంది వ్యక్తుల చేతులలో చిక్కుకునివుంది. అట్టివారు సర్వదా నిజాయితీ కలవారు కారు; నిజాయితీవున్నవారైనా సర్వదా సద్వివేకం కలవారై వుండరు. కార్మికసంఘం తమ ప్రస్తుత పరిస్థితిపట్ల అసంతృప్తులై వున్నారు. వారి అసంతృప్తికి తగిన కారణాలు పూర్తిగావున్నాయి కూడా. తమ అధికారులయొక్క లాభసంపాదనమునకు తామే ముఖ్యసాధనములనే పరిజ్ఞానం వారికి బోధింపబడుతూ వున్నది; అది న్యాయసమ్మతమైనదే. అందువల్ల వారిచేత పనిముట్లను కిందపెట్టించడం అట్టే కష్టసాధ్యమైన పనికాదు. భారతీయకార్మికులపైన రాజకీయ పరిస్థితియొక్క ప్రభావంకూడా ప్రసరింప నారంభించింది. దానిని బట్టి, రాజకీయ ప్రయోజనాల నిమిత్తం సమ్మెలు సాగించడానికి దిగే కార్మికనాయకులు కూడా తయారౌతున్నారు.

అట్టి ప్రయోజనానికి కార్మికుల సమ్మెలను వినియోగించడం చాలా గొప్ప తప్పని నా అభిప్రాయం. అట్టి సమ్మెలు రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తాయన్న మాట నేను కాదనను. అయితే అవి దౌర్జన్యరహితమైన సహాయనిరాకరణ ప్రణాళికతో సంపుటీకరణం కావు. కార్మికులు దేశంయొక్క రాజకీయ పరిస్థితిని అవగాహన చేసుకుని, ఉమ్మడిమంచికోసం పనిచేయుటకు సంసిద్ధత చూపినప్పుడు తప్ప, కార్మికవర్గాన్ని రాజకీయరంగంలోకి దింపడం

అత్యంత ప్రమాదకర విషయ మని గ్రహించడానికి ఎక్కువ మేధాశక్తి అవసరంలేదు. ఇటువంటి దృక్పథమును వారి నుంచి హఠాత్తుగా ఆసించడానికి వీలులేదు. ముందు వారు తమ దేహాత్మలను సగౌరవస్థితిలో నిల్పుకొనుటకు తగినపాటిగా తమ పరిస్థితులను చక్కపరచుకొనడం అవసరం.

మహాత్మాగాంధీ రచనలు, ప్రసంగాలు, పే 1049.

కార్మికులు రాజకీయరంగానికి ఈ క్రిందివిధంగా గొప్ప దోహదం కలిగించవచ్చును. ముందు వారు తమ పరిస్థితులను అభివృద్ధిపరచుకొనుట, తదుపరి మరింత విషయ పరిజ్ఞానమును పొందుట, తమ హక్కులను పట్టుదలగా సాధించుకొనుట, ప్రధానంగా తమయొక్క కృషివలన ఉత్పత్తి అయిన వస్తువులను తమ యజమానులు సత్ప్రయోజనములకు మాత్రమే వినియోగించునట్లు ఒత్తిడి చేయుటవరకూ కూడా వారు కృషిచేయవచ్చును. యాజమాన్యంలో భాగస్వామ్యత పొందగల స్థాయికి పెరగడానికి కృషిచేయుటయే కార్మికుల సక్రమ పరిణతికి మార్గమని దీనినిబట్టి స్పష్టమవుతుంది. అందువల్ల కేవలం కార్మికుల పరిస్థితులయొక్క అభివృద్ధిని సాధించే నిమిత్తమే ప్రస్తుతంలో సమ్మెలను ఉపయోగించాలి; వారు దేశాభిమానభావాన్ని అలవరచుకొన్న పిమ్మట, తాము ఉత్పత్తిచేసిన తయారీవస్తువుల ధరలయొక్క సక్రమ నిర్ణయసందర్భంలో కూడా సమ్మెలను ప్రయోగించవచ్చును.

విజయవంతమగు సమ్మెకు షరతులు చాలా సులభమైనవి :

1. సమ్మె కారణం న్యాయసమ్మతమైనదిగా వుండాలి.

2. సమ్మెదార్లమధ్య కార్యక్రమాచరణలో ఏకీభావం వుండాలి.

3. సమ్మెలోచేరని వారిపై దౌర్జన్యం ప్రయోగించ కూడదు.

4. సమ్మెకాలంలో సమ్మెదార్లు కార్మికసంఘపు విరాళంమీద ఆధారపడకుండా తమర్ని తాము పోషించుకో గలగాలి; అందుకని ఉపయోగకరమూ, లాభకరమూ అయిన ఏదో ఒక తాత్కాలిక వ్యాపకం చేకూర్చుకోవాలి.

5. సమ్మెదార్ల స్థానాన్ని ఆక్రమించుకొనుటకు తగి నంత మంది ఇతర కార్మికులు లభ్యమయ్యే పక్షంలో సమ్మె లాభకరమైన సాధనంకాదు. అట్టి పరిస్థితిలో, యజమానుల అన్యాయ ప్రవర్తన, చాలనికూలి మొదలైన వాటికి గురి అయిన సందర్భాలలో పనికి రాజీనామా యిచ్చి తప్పుకొన డమే తగినమందు.

6. పైన పేర్కొన్న షరతులను అనుసరించకపోయినా గాని విజయవంతమైన సమ్మెలు కూడా జరిగివున్నాయి; కాని అవి ఆ యజమానుల దౌర్బల్యాన్నీ, తమ దేతప్పుని వారి మనస్సులోగల కించను మాత్రమే రుజువు చేస్తాయి.

యంగిండియా, 16-2-'21

సమర్థనీయమైన హేతువులమీద ఆధారపడివుంటే తప్ప సమ్మె చేయకూడదన్నమాట స్పష్టం. అక్రమమైన

సమ్మె నెగ్గనూ నెగ్గదు. అటువంటి సమ్మెలపట్ల ప్రజాసాను భూతి నిరాకరింపబడాలి. సమ్మెలవెనుక ప్రజావిశ్వాసాన్ని చూరగొనివున్న పెద్దమనుష్యులయొక్క బలంవుంటే తప్ప, ప్రజానీకమువకు సమ్మె న్యాయబద్ధమైనదని తెలుసుకోనడానికి అవకాశముండదు. తమ వ్యాజ్యంయొక్క మంచిచెడ్డలను అందులో భాగస్వాములైనవారు నిర్ణయించడానికి తగరు. అందువల్ల ఇరుపక్షాలూ మధ్యవర్తి తీర్పునకుగాని, న్యాయస్థాన సంబంధమైన తీర్మానానికి గాని ఒడబడవలసి వుంటుంది...

అంగీకృతమై మధ్యవర్తి తీర్పుగాని న్యాయస్థాన తీర్మానంగాని జరిగిన సందర్భాలలో, ఆ సమ్మెయొక్క మంచి చెడ్డలు ప్రజల దృష్టిని ఆకర్షించనవసరముండదు. అయితే, గర్విష్ఠులగు యజమానులు అట్టి తీర్పులను నిరాదరించిన సందర్భాలూ, ఆ విధంగానే కార్మికులు తప్పుదారి త్రొక్కి, ఒత్తిడికలిగించే శక్తి వున్నదిగదా అని, అట్టి తీరుమానము లను లెక్కించక, ఎక్కువ లబ్ధి నపేక్షించే సందర్భాలూ కూడా లేకపోలేదు.

హరిజన్, 11-8-'46

ఆర్థికోన్నతిని సాధించుకునే నిమిత్తం చేయబడే సమ్మె లలో ఎన్నడూ రహస్యమైన రాజకీయ ప్రయోజనం గర్భితమై వుండకూడదు. అట్టి మిశ్రమం రాజకీయ ప్రయోజనానికి ఏ మాత్రంగాని లాభకరంకాదు. పోస్టలుశాఖవంటి ప్రజా

హితశాఖలలో జరిగే సమ్మెలవలె జనజీవిత సౌకర్యాలను భంగ పరచునటువంటివికాని సందర్భంలో కూడా, పై పద్ధతివల్ల తరుచు సమ్మెదార్లు చిక్కుల పాలౌతూ వుంటారు. అట్టి సమ్మెలద్వారా ప్రభుత్వానికి కొంత ఇబ్బంది కలిగించ వచ్చునుగాని, దానివల్ల ప్రభుత్వం కేవలం ఆగిపోదు. ధనికులైనవారు ఖర్చుకు లెక్కచేయకుండా తమ సౌకర్యానికి స్వంతమైన పోస్టలు ఏర్పాట్లు చేసుకుంటారు. కాని, బహుళ సంఖ్యాకులైన పేద జనానీకం మాత్రం అట్టి సమ్మె మూలంగా తరాలనుంచి అలవాటు పడిన ఒక ప్రధాన సౌకర్యాన్ని కొంతకాలం కోల్పోవడం జరుగుతుంది. ఇతరములైన సర్వ న్యాయసమ్మతసాధనాలూ అనుసరింపబడి విఫలమైన సందర్భంలో మాత్రమే, అట్టి సమ్మెలు సమర్థనీయమౌతాయి.

పైన చెప్పిన దానిని బట్టి, రాజకీయపు సమ్మెలయొక్క ప్రయోజనాలు రాజకీయరంగానికే ప్రత్యేకించబడ వలెననియు, వాటిని ఆర్థికపు సమ్మెలతో కలపడంగాని, అనుబంధించడంగాని ఏ మాత్రం కూడదనియు తేలుతుంది. అహింసాత్మక కార్యరంగంలో రాజకీయపు సమ్మెలకు ఒక విశిష్ట స్థానం వుంది. అవి అయినప్పుడూ కానప్పుడూ జరపబడవు. అవి జరిగినప్పుడు బహిరంగంగా జరగాలి, దౌర్జన్యపరుల నాయకత్వంకింద జరగకూడదు. దౌర్జన్యానికి ఏ మాత్రమూ దారితీయని ప్రణాళికపైననే అవి జరపబడతాయి.

హరిజన్, 11-8-'46

అధ్యాయం ౧౦

కార్మికులు ఏ మార్గం ఎన్నుకుంటారు ?

(Choice before Labour)

ఈ నాడు భారతదేశానికి ముందు రెండు మార్గాలున్నాయి. ఒకటి, "బలమే ధర్మం" అని చెప్పే పాశ్చాత్య సూత్రాన్ని స్వీకరించడం. రెండవది, సత్యమే జయమనీ, సత్యానికి విఘాతమనేది లేదనీ, బలవంతులకూ బలహీనులకూ న్యాయసిద్ధి విషయంలో సమాన హక్కు వున్నదని శాసించే ప్రాచ్యధర్మాన్ని నిలబెట్టడం. వీటిలో ఏది ఎన్నుకోవడమనే ప్రశ్న శ్రామికవర్గంతో ప్రారంభం కావలసివున్నది. శ్రామికులు. ఒకవేళ బలప్రయోగం ద్వారా తమ కూలి పెంపకాన్ని సాధించుకొనగలిగినా అందుకు వారు ఆ దౌర్జన్య మార్గాన్ని అనుసరించవచ్చునా? తమ కోరికలు ఎంత న్యాయసమ్మతమైనవైనాగాని వారు దౌర్జన్యసదృశమైన ఎట్టి చర్యకుగాని దిగకూడదు. హక్కుల సంపాదనకు దౌర్జన్య ప్రయోగం సులభమార్గంగా పైకి కనిపించవచ్చును గాని, పోయినకొలదీ అది ముండ్లదారి అని రుజువవుతుంది. కత్తి మీద బ్రతికేవారు కత్తికే బలౌతారు. ఈతగాడు తరుచు నీటిలో మునిగే చనిపోతాడు. యూరోపు దిశకు దృష్టి పరపండి. అక్కడ ఒక్కడూ సుఖంగా వున్నట్లు కనిపించడు. దానికి కారణం, ఒక్కడికీ సంతృప్తి అనేది లేకపోవుటయే. శ్రామికుడు పెట్టుబడిదారుని నమ్మడు, పెట్టుబడిదారుకి శ్రామి

కునిలో విశ్వాసంలేదు. ఇరువురికీ ఒక విధమైన చురుకూ బలమూ వున్నవి గాని, ఆ జ్యోతులకీ ఆ శక్తులున్నవి. వారు అంతందాకా ఘర్షణపడతారు. చలనమంతా పురోగమనం కాదు. యూరోపీయులు పురోగమిస్తున్నారని మనం నమ్మవలసిన కారణాలేమీ కనిపించవు. వారు సంపత్తిని కల్గివుండడం బట్టి వారు నైతిక, ఆధ్యాత్మిక గుణగణాలనుకూడా కలిగివున్నారని ఋజువుకాదు. దుర్యోధన మహారాజుకి చెప్పరానంత సంపదవుంది. అంతవున్నాగాని విదుర సుధాముల ముందు ఆతడు గర్భదరిద్రుడుగానే కనిపిస్తాడు. ఈ నాడు విదురుడూ, సుధాముడూ లోకపూజ్యులయారు; దుర్యోధనుని పేరు మనచే అసహ్యకరమైన దుర్గుణము లన్నిటికీ ఊతపదంగా మాత్రమే స్మరింపబడుతున్నది.

... పెట్టుబడి, శ్రమ మధ్య జరిగేపోరాటంలో సర్వసాధారణంగా పెట్టుబడిదార్లే తప్పు గడిలో వుండడం జరుగుతూ వుంటుందని మామూలుగా అనుకోవచ్చును. కాని శ్రామికవర్గమే కనక పూర్తిగా తమ బలమును తెలుసుకున్నారంటే, వారు పెట్టుబడిదార్ల కంటె ఎక్కువ నిరంకుశులు కాగలరని నే నెరుగుదును. శ్రామికులకు పెట్టుబడిదార్లతో సరిసమానమైన తెలివితేటలు ఏర్పడిననాడు, పెట్టుబడిదార్లంతా కార్మికులు చెప్పిన షరతుల ప్రకారం పనిచేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే శ్రామికవర్గం ఎప్పుడూ ఆ స్థితికి రాజాలరన్న మాట స్పష్టం. అది జరిగితే శ్రామికులింక శ్రామికులు కారు, వారే యజమానులౌతారు. పెట్టు

బడిదాస్లు ఒక్క ధనశక్తితోనే పోరాడరు; వారికి తెలివి తేటలూ, బుద్ధికౌశలమూ కూడా వున్నాయి.

మనం తేల్చవలసిన ప్రశ్న ఇది : శ్రామికులు శ్రామికులుగానే వుండి, కొంతపాటి చైతన్యాన్ని మాత్రం పెంపొందించుకున్నారను కుందాం. అప్పుడు వారికి అనుసరణీయమైన మార్గమేమిటి? వారు తమ సంఖ్యాబలం మీదగాని, పశుబలం మీద, అనగా హింసావిధానం మీదగాని, ఆధారపడడం ఆత్మహత్యా సదృశమవుతుంది. అట్టిచర్యవల్ల వారు దేశంలోని పరిశ్రమలకే హాని కలిగించిన వారౌతారు. దానికి బదులు, వారే కనక స్వచ్ఛమైన న్యాయశక్తి మీద నిలిచి, న్యాయంపొందడానికి తామే బాధలను సహించిన యెడల వారు తప్పనిసరిగా విజయమునూ పొందుతారు; దానితోపాటు తమ యజమానులలో పరివర్తన కూడా తీసుకురాగల్గుతారు; పరిశ్రమలనూ పెంపొందిస్తారు; యజమానీ, అతనికింద పనిచేసే వారూ ఒకే కుటుంబానికి చెందినవారిలా వర్తించ గల్గుతారు. శ్రామికపురోభివృద్ధి సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం ఈ క్రింది సూత్రాలపై ఆధారపడి వుండాలి :

(1) కొన్ని గంటలు శ్రమచేస్తే, కొన్ని గంటలు విశ్రాంతికి వదలబడాలి.

(2) వారికి విద్యార్జనం చేసికొనుటకు తగిన సౌకర్యాలు ఒసగబడాలి.

(3) పాలు, బట్టలు, పిల్లలకు విద్యాసౌకర్యాలు వారికి లభ్యమగునట్లు ఏర్పాటు చేయాలి.

(4) పనివారి నివాసాలు ఆరోగ్యకరమైనవిగా వుండాలి.

(5) వారి జీతం వృద్ధాప్యంలో ఆత్మపోషణకు తగినంత కూడబెట్టుకొనుటకు వీలుగా ముట్టజెప్పాలి.

ఈ షరతులలో ఏదిగాని ప్రస్తుతం సంతృప్తికరంగా అమలులో లేదు. అందుకు ఇరుపక్షాలూ కూడ బాధ్యులు. యజమానులు పనిరాబట్టటం విషయమై మాత్రమే చూచుకుంటున్నారు. పనివాని గతి ఏమవుతున్నదీ వారు పట్టించుకోవడంలేదు. వారి ప్రయత్నమంతా సాధారణంగా ఎంత తక్కువ కూలికి ఎంత ఎక్కువ పని రాబట్టగలను అనే విషయాన్ని మించిపోవు. రెండవ దిక్కున శ్రామికుడున్నూ వీలైనంత తక్కువపనికి వీలైనంత ఎక్కువకూలి సంపాదించడానికని ఎన్ని జిత్తులు పన్నాలో అన్నీ చేస్తుంటాడు. దీని ఫలితం, కూలి పెంచబడినా పనిమాత్రం ఎప్పటి లెక్కలోనే వుంటుంది. రెండుపక్షాల మధ్యనుగల సంబంధం నిష్కలుషమూ కాదు, పొందిన పెరుగుజీతాలను శ్రామికులు సద్వినియోగం చేసుకోనూచేసుకోరు.

ఈ రెండు పక్షాలకు మధ్య మూడవపక్ష మొకటి బయలుదేరింది. అది శ్రామికుని మిత్రుడయింది. అట్టి పక్షం యొక్క అవసరం లేకపోలేదు. కాని అది ఎంతవరకూ

నిస్వార్థబుద్ధితో శ్రామికునితో సహకరిస్తే, అంతవరకే శ్రామిక మిత్రుడనిపించుకుంటుంది.

శ్రామికవర్గాన్ని అనేక విధాలుగా జూదపు పావులట్లుగా ఉపయోగించుటకు ప్రయత్నాలు కొనసాగే కాలం వచ్చింది. రాజకీయరంగంలో పనిచేయగోరెడి వారందరూ ఆలోచించుకొనవలసిన విషయమిది. వారేమార్గం ఎన్నుకుంటారు? తమ స్వార్థమా, లేక శ్రామికులకూ దేశానికీ సేవచేయడమా? శ్రామికవర్గానికి మిత్రులయొక్క అవసరం చాలావుంది. నాయకత్వం లేనిదే అది ముందంజ వేయలేదు. ఎటువంటి వ్యక్తులు ఈ నాయకత్వం వహిస్తారో దానిపై శ్రామికుల స్థితిగతులు ఆధారపడి వుంటాయి.

సమ్మెలూ, పని నిలుపదలలూ, హర్తాళ్ చేయడాలూ తప్పకుండా అద్భుత కార్యాలే, కాని వాటిని దుర్వినియోగం చేయడం కూడా చాలా సులభం. కార్మికులు బలమైన శ్రామిక సంఘాలుగా తమ్ముదాము సంఘటిత మొనర్చుకుని, ఆ సంఘము అనుమతి లేనిదే ఏ పరిస్థితిలోగాని సమ్మెలు సాగించకూడదు. యంత్రాగారపు యజమానులతో సంప్రతింపు కొనసాగించకుండా, సాహసించి సమ్మెలకు దిగకూడదు. యంత్రాగార యజమానులు మధ్యవర్తి తీర్పునకు అనుమతిస్తే, పంచాయతీ విధానాన్ని అనుసరించి అది జరపించుకోవాలి. ఒకసారి పంచాయతీ ఏర్పాటైనాక, వారి తీర్పు

తమకు నచ్చినా నచ్చకపోయినా, ఇరుపక్షాలవారూ కూడా దానిని తప్పనిసరిగా అంగీకరించాలి.

యంగిండియా, 11-2-'20.

కార్మికుల యెడలగల బాధ్యతలను యజమానులు నిర్వర్తించేకంటె ఎక్కువ సక్రమంగానూ, మనఃపూర్వకంగానూ కార్మికులే సర్వసాధారణంగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తారన్నది నేను సర్వదా గమనించివున్న విషయం. కనుక తమ అభీష్టాలను గురించి యజమానులపై ఎంతగా ఒత్తిడి కలిగించనగుననే విషయం తేల్చుకొనుటకు శ్రామికులే సమాలోచించుకోవడం అవసరం. మనకు సరియైన జీతము, సరియైన నివాస సౌకర్యములు లభించడం లేదని అనుకున్నప్పుడు, చాలినంత జీతము, సౌకర్యమైన నివాసములను పొందడానికి మార్గమేమిటి? శ్రామికులకు ఎట్టి సౌకర్యములు అవసరమో తేల్చేవారెవరు? శ్రామికులైన మీరే మీ హక్కులను గ్రహించుకుని, వాటిని సాధించుకునే విధానాన్ని తెలుసుకుని, స్వయంగా సాధించుకొనడమే తప్పకుండా ఉత్తమమైన మార్గం. అయితే అందునిమిత్తమై మీకు ముందుగా కొంచెం శిక్షణం అవసరం- అనగా విద్య అవసరం.

తగినపాటి సంఘీభావమూ, స్వార్థత్యాగమూ కనక అలవరచుకున్నచో, శ్రామికులు ఎట్టిపరిస్థితిలోగాని తమశక్తిని నిరూపించుకొనగలరని నా వినయపూర్వకమైన అభిప్రాయం. పెట్టుబడిదార్లు ఎంత కఠోరులైనప్పటికీ, శ్రామికులవశంలో

వున్నంతశక్తి సామర్థ్యాలు పెట్టుబడిదార్ల చేతులలో ఎన్నడూ వుండజాలవన్న సంగతి శ్రామికోద్యమాలతో సంబంధం వున్నవారూ, నాయకత్వం వహించేవారూకూడా ఇంతవరకూ ఊహించి వుండలేదని నేను చెప్పగలను. శ్రామికుల సహకారం లేనిదే పెట్టుబడిదారీపద్ధతి కేవలం నిస్సహాయమై పోతుందన్న సంగతి కార్మికవర్గమే కనక గ్రహించి, అర్థం చేసుకున్నట్లయితే, తక్షణం శ్రామికులు తమ అర్హస్థానాన్ని ఆక్రమించగల్గుతారు.

మహాత్మాగాంధీ ప్రసంగాలు, రచనలు; పే. 1046

దురదృష్టవశాత్తు మనం పెట్టుబడిదారీ యొక్క సమ్మోహన ప్రచారానికి, సమ్మోహన ప్రభావానికి వశమై పోయి, తత్ఫలితంగా పెట్టుబడిదారీ అనేది భూతలంలోకల్లా సర్వశక్తివంతమైనదనే నమ్మకంలో పడ్డాం. కాని, ఒక క్షణం ఆలోచిస్తే పెట్టుబడిదార్లకు ఎన్నడూ లభ్యంకాని పెట్టుబడి ఒకటి శ్రామికుల చేతులలో వున్నదన్న సంగతి విశదమవుతుంది. ... ... ఇంగ్లీషు భాషలో ఒక బలవత్తరమైన మాట వుంది. అది ఫ్రెంచిభాషలోనూ వుంది, ఆ మాట ప్రపంచభాష లన్నిటిలోనూ కూడా వుంది– అది "No" అనేమాట– అనగా 'కాదు' అని అర్థం. ఇక మనం కనిపెట్టిన కీలుకు ఏమిటంటే, ధనస్వామి కార్మికునిచే 'ఔ' ననిపించదలచి నప్పుడు, అది కార్మికునికి యిష్టం లేకపోతే, "వల్ల కాదు" అని గర్జించడం. ఆ వెనువెంటనే కార్మికులకు, తమకు ఇష్టమైనప్పుడు "ఔ"ననీ, కానప్పుడు "కా" దనీ

చెప్పగలశక్తి తమలోనే వున్నట్లు తెలిసిపోతుంది. మరుక్షణం శ్రామికవర్గం పెట్టుబడిదారీయొక్క బంధనములను విడివడి స్వతంత్రమౌతుంది; ధనస్వామి కార్మికుని సహకారాన్ని అర్థించవలసివస్తుంది. ధనస్వాముల చేతులలో తుపాకులు వున్నా, విషవాయువు వున్నా, అది కేవలం నిరర్థకమౌతుంది. కార్మికులే కనక తమ ఆత్మగౌరవంమీద నిలబడి, తమ "కాద"న్న మాటను నిలబెట్టుకున్న పక్షంలో, అవి అన్నీ వుండికూడా ధనికవర్గం కేవలం నిస్సహాయం అయిపోతుంది. అప్పుడు కార్మికవర్గం వారితో సమర మొనర్పవలసిన పని లేదు; తుపాకి గుండ్లకూ, విషవాయువుకీ లెక్కచేయ కుండా ధైర్యంగా నిలిచి, "కాద"న్న తన పట్టుదల విడువ కుండా వుంటేచాలు. నేను సూచించినరీతిగా పెట్టుబడిదారీని నిర్వీర్యస్థితికి తేవడానికి బదులుగా కార్మికవర్గం (నేనొక కార్మికునిగానే చెబుతున్నాను) ఆ పెట్టుబడిని తాను వశపర చుకొని, కఠోరతమమైన రూపంలో తానే పెట్టుబడిదారీ విధానమును అవలంబించదలచడమే, కార్మికోద్యమాలు తరచుగా విఫలీకృతం కావడానికి సంపూర్ణమైన కారణం. అందువల్ల, తమ ఉనికిని సుస్థిరమూ, సుసంఘటితమూ ఒన ర్చుకొనివున్న పెట్టుబడిదార్లు, కార్మికవర్గ మధ్యంలోనే పెట్టు బడిదారీ హోదాకు తహతహపడే అభ్యర్థులు కొందరు వున్నట్లు కనిపెట్టి, కార్మికులను అణగద్రొక్కే నిమిత్తం అట్టివారిలో కొందరిని ఉపయోగించడానికి వీలేర్పడుతూ వున్నది. మనం ఈ విధమైన సమ్మోహనశక్తికి లోను

గాకుండా వుంటే, మనలో ప్రతివ్యక్తీ- పురుషులూ, స్త్రీలూ, సర్వులూ- నేను చెప్పివున్న పునాది సత్యాన్ని బహు సులువుగా బోధపరచుకొనగలుగుతారు.

యంగిండియా, 14-1-'32.

అధ్యాయం ౧౧

హక్కులా లేక విధులా?

(Rights or Duties?)

ఈనాడు సంఘమును పీడిస్తూవున్న ఒక గొప్ప దోషాన్ని గురించి వివరించదలచుకున్నాను. ఒకవంక ధన స్వాములూ తమ హక్కులను గురించి మాట్లాడుతున్నారు, మరొకవంక శ్రామికులూ అదే మాట అంటున్నారు. ప్రభువులు తమ హక్కు దేవుడినుంచి దిగిందంటున్నారు, దానిని ప్రతిఘటించే హక్కు తమకుందని రైతులంటున్నారు. ఈ విధంగా అందరూ కేవలం హక్కులనే ఉద్ఘాటించి, విధులను విస్మరిస్తే లోకమంతా భీభత్సమూ, అరాజకమూ కాక తప్పదు.

హక్కులను ఉద్ఘాటించడానికి బదులుగా ప్రతివారూ తమ విధులను నెరవేరిస్తే, ఆ వెంటనే మానవలోకంలో క్రమబద్ధమైన పద్ధతి ఏర్పడుతుంది. రాజులయొక్క దైవభుక్త పాలనాధికారం అనేదికాని, రైతాంగం తమ ప్రభువులకు

తలవొగ్గి విధేయత చూపవలసిన హీనమైన విధి అనేది కాని ఎక్కడా లేదు. సంఘసంక్షేమానికి హానికరమైన యీ పారంపర్యమైన అసమానతలు తొలగిపోవలసినమాట నిజమే. అయినప్పటికీ, ఇంతవరకు అణగద్రొక్కబడి వున్న ప్రజా బాహుళ్యం ఈ నాడు తమ హక్కులకోసం చేసే బహిరంగ మైన బలవత్తరాందోళన కూడా ఆ సంఘసంక్షేమానికి, అంతకంటె హెచ్చుగా కాకపోతే సరిమానంగానైనా, భంగకరమని చెప్పవలసివుంటుంది. అట్టి ఆందోళన దైవ సిద్ధమైన హక్కులను ఉద్ఘాటించే కొలదిమందికి కలిగించే హానికంటె, లక్షలాది అగు ప్రజాబాహుళ్యమునకే ఎక్కువ హానికరంగా పరిణమిస్తుంది. ఆ రాజులు ధీర మరణమునకో, పిరికిచావునకో పాలయి గతించవచ్చును గాని, ఆ కొలది మంది మృతితోనూ సంతుష్టి పూర్ణమైన క్రమబద్ధ జీవిత విధానం వలన కలికే ఆనందకర పరిస్థితి దిగిరాదు. అందున, హక్కులకూ విధులకూ గల పరస్పరాను బంధాన్ని గురించి అవగాహన చేసుకోవడం అవసరం. సక్రమ విధి నిర్వాహణ ఫలితములు కాని హక్కులు అనుభవార్హములు కానేరవని నేను చెప్పసాహసిస్తాను. అట్టి దురాక్రమితములైన హక్కులను ఎంత త్వరగా విసర్జిస్తే అంత మంచిది. పిల్లలకు తాను చేయవలసిన విధులను నెరవేర్చని తండ్రి, వారి విధేయతను పొందే హక్కును ఉద్ఘాటించినచో, వారి కాతని యెడల హేయభావము తప్ప వేరేమియు కలగబోదు. వ్యభిచారి అగు భర్తయు విధేయురాలైన తన భార్య అన్ని విషయము

లలోను తన మాటనే అనుసరించి తీరవలెనని ఆశించడ మున్నా మతధర్మసూక్తికి దురన్వయ మొనర్చడమే అవు తుంది. కాని సర్వదా పిల్లలయెడల విధ్యుక్తధర్మాలను నిర్వ ర్తింప సంసిద్ధుడైన తండ్రిని వారెదురాడినచో అకృతజ్ఞులుగా పరిగణింపబడుటయే గాక, వారు తమతండ్రికి కలిగించే హాని కంటె తమకే ఎక్కువహాని కలిగించుకుంటారు. భార్యా భర్తల సందర్భంలో ఈ మాటే వర్తిస్తుంది. ఈ సులభసాధ్య మైన సార్వజనీన సూత్రాన్ని యజమానులకూ శ్రామికులకు, భూస్వాములకూ రైతులకు, ప్రభువులకూ ప్రజలకు, హిందు వులకూ ముస్లింలకు మధ్య వర్తింపజేసినచో, ఈనాడు భారతదేశంలోనే కాక ప్రపంచమంతటా పరివ్యాప్తమై జీవిత, వ్యాపారవిధానములను రెంటిని ఒడుదుడుకుల పాలొన రుస్తూవున్న ఘర్షణలకూ కలతలకూ సర్వతోముఖ సౌఖ్య దాయకమైన పరస్పరానుబంధములను చేకూర్చవచ్చునని సుగోచరమవుతుంది. నేను నిర్వచించే సత్యాగ్రహ సూత్ర మనునది విధినిర్వహణము యొక్కయు, తద్వారా సంక్రమిత మగు హక్కులయొక్కయు ఆంతర్యమును అవగాహన మొనర్చుకొనుటపై ఆధారపడుతుంది.

హైందవగృహస్థు తన ఇరుగుపొరుగున వున్న ముస్లిం మతస్థునిపట్ల చూపదగిన విధి ఏమి? మనిషిగా ఆతని యెడల స్నేహభావము చూపి, ఆతని కష్టసుఖములలో పాలుపంచు కొని, కష్టకాలములో ఆతని ఆదుకొనుటయే ఆ హైందవుని విధ్యుక్తధర్మం. అప్పుడే ఆతడుగూడ ఆ ముస్లిం సహవాసి

నుంచి తత్సమానమైన ప్రవర్తనమును ఆశించుటకు అర్హత ఏర్పడుతుంది; బహుశా అట్టి ఫలితం సమకూడనూ వచ్చు. ఒక గ్రామంలో చాలామంది హిందూసంఘీయుల మధ్య కొలదిమంది ముస్లింమతస్థులు నివసిస్తున్నారనుకుందాం. అప్పుడు ఆ అల్పసంఖ్యాకులైన ముస్లింలపట్ల అధికసంఖ్యాక సంఘీయులయొక్క బాధ్యతకూడా అధికతరమవుతుంది. అప్పుడు తమ యెడల హిందువులు చూపునట్టి సఖ్యభావానికి మతభేదము ఒక ఆటంకముగా పాటింపబడుట లేదని ఆ ముస్లింలకు విశ్వాసం ఏర్పడుతుంది. అప్పుడే ఆ ముస్లిములును తమ యెడల సహజమైత్రిని చూపవలెననియు, ఆపత్సమయాలలో ఏకీభావంతో సహకరించవలెననియు ఆశించే అర్హతను హిందువులు ఆర్జిస్తారు. తాము ముందుగా పైన పేర్కొనిన వర్తనమును ఆచరణలో పెట్టని యెడల, వారికి ముస్లిముల నుండి ఈ విధమగు ప్రవర్తనను ఆశించుటకు అర్హత కలగదు. ఇక, అప్పటికిని అల్పసంఖ్యాకులగు ఆ ముస్లిములు చూపవలసిన ప్రత్యామ్నాయ ప్రవర్తనను చూపక, అనుగడుగునా ఘర్షణ ప్రదర్శించినయెడల, అది వారి పురుషలక్షణ విహీనమైన పిరికితనమునకు చిహ్నమవుతుంది. అట్టి పరిస్థితిలో అధికసంఖ్యాకులైన హిందువుల విధి ఏమిటి? అది అల్పసంఖ్యాకులైన వారిని తమయొక్క పసుబలాధిక్యంతో అణచిపెట్టుటమాత్రం కాజాలదు. అది అనార్జితమైన హక్కుయొక్క దురాక్రమణ అనిపించుకుంటుంది. అట్టి సమయంలో, తమ రక్తసంబంధీకులైన అన్నదమ్ములను ఏ విధంగా అదుపులో

పెట్టనగునో అట్టి పద్ధతినే ఆ ముస్లిం అల్పసంఖ్యాకులను అనేక సంఖ్యలోని హిందువులు అదుపులో పెట్టడం మాత్రమే వారి విధ్యుక్తధర్మం అవుతుంది. ఈ ఉపమానాన్ని ఇంకా సుదీర్ఘంగా విస్తరించ నవసరంలేదు. హిందువులు అల్ప సంఖ్యాకులై ముస్లింలు అధికసంఖ్యాకులైన పట్లగూడ సరిగా ఈ రీతిసూత్రమే వర్తిస్తుందని మాత్రం చెప్పి విరమిస్తాను. ప్రతి హక్కునకును విధినిర్వహణఫలితంగా అర్హత నార్జించ వలెననే సిద్ధాంతాన్ని ప్రజలు ఆచరణలో పెట్టకపోవుట యొక్క ఫలితంగా పరిష్కారం దుష్కరమైపోయిన ప్రస్తుత పరిస్థితులలో, పైన నేను వివరించిన విధంగా ఈ సిద్ధాంతాన్ని అనుసరించి వర్తించడం కష్టసాధ్యమైన పని కాదని తలుస్తాను.

ఈ సూత్రమే రాజులకూ, రైతులకూ కూడా వర్తించ గలదు. నిజమైన ప్రజాసేవకులుగా ప్రవర్తించడమే రాజుల విధ్యుక్తధర్మం. వారు బయటినుంచి భుక్తమైన హక్కు యొక్క బలంవల్ల పరిపాలనాధికారాన్ని చెలాయించడానికి వీలులేదు; ఖడ్గబలంతో అసలే వల్లకాదు. సేవాహక్కు వల్లను, సద్వివేచనార్హత వల్లను మాత్రమే పాలన మొనర్చ వలసి వుంటుంది. అప్పుడు వారు తమ అధికారగర్వంయొక్క సంతృప్తికికాక, తమ పాలనములోని ప్రజలయొక్క సంక్షేమ సాధనయే తమయొక్క విధిగా భావించి, ప్రజలు యిష్ట పూర్తిగా యిచ్చిన పన్నులను, అట్లే యిష్టపూర్తిగా ఒసగ బడిన ప్రజాసహకారమును పొందగలిగి వుంటారు. ఈ సులభ

సాధ్యమైన ప్రాథమిక విధిని వారు నిర్వహించనిచో, రైతాంగము వారియెడల చూపవలసిన విధులనుండి విముక్తులై పోతారు; అంతేకాక ఆ రాజుయొక్క దురాక్రమితహక్కును ఎదుర్కొనవలసిన విధికూడ ఆ రైతాంగము నిర్వహించవలసిన వారౌతారు. అనగా ఆ దురాక్రమిత ప్రభుత్వాధికారమును, లేక దుష్పరిపాలనమును, ప్రతిఘటించే హక్కును రైతులు ఆర్జించిన వారౌతారన్నమాట. అయితే, ఆ ప్రతిఘటనము హత్యాకాండ, క్రూరహింస, దోపిడీ రూపములను దాల్చినచో, అది విధిసూత్రదృష్టినుంచి మానవత్వముపట్ల అపరాధముగా పరిగణింపబడుతుంది. విధి నిర్వహణంయొక్క సహజఫలితంగా జనించే శక్తి, సత్యాగ్రహ విధానం ద్వారా రూపొందే దౌర్జన్యరహితమైన అజేయశక్తి అయివుంటుంది.

హరిజన్, 6 7-'47.

అధ్యాయం ౧౨

నిరుద్యోగ సమస్య

పాటుపడే శక్తివుండియు పనిగాని, తిండిగాని దొరకని పురుషుడుగాని, స్త్రీగాని దేశంలో ఒక్కరైనా వున్నంత కాలం మనం విశ్రాంతి తీసుకోనడానికిగాని. కడుపునిండుగా తినడానికిగాని సిగ్గుపడవలసి వుంటుంది.

యంగిండియా, 6-10-'21.

రోజుకి అయిదు గంటలు మాత్రమే పనిచేసే ప్రజలతో కూడిన దేశాన్ని ఊహించుకోండి— అదికూడా స్వబుద్ధివల్లకాక, పరిస్థితుల బలాత్కారం వల్ల మాత్రమే. అప్పుడు మీకు భారత దేశాన్ని గురించిన వాస్తవ చిత్రం గోచరిస్తుంది. ఈ చిత్రాన్ని ప్రస్ఫుటంగా అర్థం చేసికొనవలెనంటే నగర వీధులలోని జీవితపు అలజడినీ, కర్మాగారాలలోని చెమటోడ్చే అలసటను, కాఫీ టీ తోటలలోని కూలీల బానిసత్వాన్నీ మరచిపోవాలి. భారత ప్రజాబాహుళ్య సముద్రంలో వీరంతా కేవలం జలబిందు సదృశులు. భారత దేశపు అస్తిపంజరాన్ని దర్శించ గోరితే, తమ పొలాలను తామే సేద్యం చేసుకునే నూటికి ఎనభై వంతులుగావున్న జనాభాను గురించి స్మరించాలి. వారికి ఏడాదిలో నాలుగు మాసాలు చేయగల పని ఏమీ లేకుండుటవల్ల, వారు తిండికి కరువై బ్రతుకవలసిన స్థితిలో వున్నారు. ఇదే వారి దైనందిన పరిస్థితి. ఈ బలవంతమైన సోమరితనానికి తోడు, తరుచుగా వచ్చే కరువుకాటకాలు కూడా వారి దుస్థితిని అతిశయింపజేయుటకు తోడ్పడుతూ వుంటాయి.

యంగిండియా, 3-11-'21.

మన సగటు ఆయుఃప్రమాణం అంచనా శోచనీయమైనంత తక్కువలో వుండడానికీ, మన పేదరికం దిన దిన ప్రవర్థమానం కావడానికీ కారణం, మనం మన 7,00,000 గ్రామాల సంక్షేమం విషయమై ఏ మాత్రం లక్ష్యం చేయక పోవడమే. ఆ గ్రామాలను పిండి స్వలాభాలు పొందడం

వరకే వాటిని గురించి మనం శ్రద్ధవహించాము. ఒకప్పుడు "శ్రీలు పొంగిన" భారత దేశాన్ని గురించీ, పాలు తేనెలు పొంగిన భరతభూమిని గురించీ ఒడలు పులకరించే గాథలను పఠించి వున్నాము; కాని ఈనాడా భూమి ఆకలికి అలమటించే అసంఖ్యాక జనానీకానికి పుట్టిల్లు. విద్యుద్దీపకాంత్యుజ్వలమైన ఈ సభామంటపం క్రింద మన మిప్పుడు ఆసీనులమై వున్నాము, కాని పేదల కడుపుకొట్టి మన మీ దీపాలకు ఖర్చుపెడుతున్నా మన్నమాట మనం విస్మరించాం. వీటి వినియోగానికి మనం పేదవారికి ఋణపడివున్నా మన్నమాట మరచినచో, మన కీ దీపాలను వాడే హక్కులేదు.

ప్రాచ్య, అనగా భారతీయ నాగరికతకును పాశ్చాత్య నాగరికతకు ఒక భేదముంది. ఏ అంశములో ఆ భేదమున్నదో సాధారణంగా ఎవరూ ఆలోచించరు. మన భూగోళ పరిస్థితి వేరు, మన చరిత్ర వేరు, మన ఆచార సంప్రదాయాలు వేరు. మన విశాల భరతఖండము, భూమండల సర్వస్వంతో పోలిస్తే ఒక ఖండాంశమే అయినా, ఒక్క చీనాదేశం తప్ప మిగిలిన అన్ని దేశములకంటెను అది అత్యధికమైన జనాభాతో క్రిక్కిరిసిన ప్రదేశం. భూమికోసం ప్రజానీకపు ఒత్తిడి అధికతమమైన దేశపు ఆర్థిక సూత్రాలూ, నాగరికతా అట్టి ఒత్తిడి అల్పతమమైన దేశాలలో కంటె భిన్నంగా వుండడం సహజమేకాక, అవసరం కూడా. జనాభా స్వల్పమైన అమెరికాలో యంత్రసహాయం అవసరం కావచ్చును. భారత దేశానికి కేవలం అనావసరం కావచ్చును. లక్షలాది పనిలేని

శ్రామికు లున్నచోట శ్రమను సులభీకరించే సాధనాలను గురించి ఆలోచించవలసిన పనేలేదు. ఎవరైనాగాని మనం చేతులతో తినవలసిన బాధలేకుండా చేసే యంత్రసాధనాన్నే కనక కనిపెడితే, దానితో ఇక తిండి తినడంలోని సుఖం చచ్చి, అది ఒక పెనుభూతం అయిపోతుంది. మన చేతి పరిశ్రమల విధ్వంసనమున్నూ, తత్ఫలితమైన నిర్వ్యాపకత్వమున్నూ మాత్రమే మన దేశ దారిద్ర్యానికి మూలహేతువులు. కొన్ని సంవత్సరాలక్రితం భారత దేశపు వ్యవసాయదారుల జనాభా నూటికి 70 పాళ్లు అయివున్నట్లు అంచనా వేయబడింది. ఇప్పుడు నూటికి 90 పాళ్లుగా చెప్పబడుతున్నది. దీనినిబట్టి నూటికి 90 మంది వ్యవసాయకులని అర్థం చేసికొనకూడదు; పూర్వం నూటికి 70 మంది భూమినే ఆధారం చేసుకునివుంటే ఇప్పుడు నూటికి 90 మంది ఆ భూమిపైననే ఆధారపడి బ్రతకవలసిన బలవంత పరిస్థితి ఏర్పడిందని అర్థం. అంటే, కొలదికాలం క్రితంవరకూ ఆ 20 శాతం జనాభాయు ఆధారపడుటకు చాలిన పరిశ్రమలూ చేతిపనులూ వుండేవనిన్నీ, అవి యిప్పుడు నశించుటవల్ల వారు కూడా మార్గాంతరం లేక భూమినే ఆధారంచేసుకు బ్రతకవలసిన వారైనారనిన్నీ తేలుతుంది. ఆ విధంగా ఈ 20 శాతం జనులూ, బుద్ధిపూర్వకంగా కాకపోయినా అదనపు భూమియొక్క లేమి వలన, అసలు వ్యవసాయమే వృత్తిగా బ్రతికే వారి జీవనోపాధిని కొంతవరకు తాము దొంగిలిస్తున్నారని కూడా అర్థమిస్తుంది.

మన 35 కోట్ల ప్రజనూ పోషించడానికి చాలినంత భూమి లేదనికాదు. భారతదేశం తలకుమించిన జనాభా కలిగినదనీ, ఆ అదనపు జనాభా చావవలసినదే అనీ అనడం పరిహాసాస్పదమైన మాట. ఉన్నభూమి అంతా సక్రమంగా వినియోగించి, సాధ్యమైనంత పూర్తిపంట నొసగునట్లు చేసినచో, జనాభానంతను పోషించుటకు అది నిశ్చయంగా సరిపోతుంది. మనం శ్రమపడి, ఒక్క వరిమొలక మొల్చే మేరలో రెండు మొలిపించడానికి పూనుకుంటే చాలు.

పరిస్థితులు చక్కబడాలంటే మనం పేద గ్రామప్రజలతో సమైక్యభావం అలవరుచుకుని, భూమినుంచి వారు బంగారం పండించడానికి సహకరించి, మన అవసరాలకు కావలసిన వస్తువులన్నీ వారిచేతనే చేయించుకుని, వారు తయారుచేసిన వస్తువులతోనే మనం సంతృప్తిపడి, వారి రీతి జీవితమునే మనమూ అవలంబించి, వారు శ్రేష్ఠతరమైన తిండినీ జీవితాభ్యాసములనూ అలవరుచుకొన వలసినదిగా ప్రబోధించవలసి వున్నది.

మనం మరలో విసిరిన పిండినే తింటున్నాం; పేద గ్రామీణుడు కూడా తన అర్థమణుగు గింజల మూటను నెత్తినిడుకొని చేరువనున్న మరలో పిండి చేయించుకొనుటకు నడుస్తున్నాడు. మనం కావలసినంత తిండిపంటలు పండిస్తూ వున్నగాని బయటినుంచి గోధుమ దిగుమతీ చేసుకుంటున్నామనీ, ఆస్ట్రేలియానుంచి దిగే అతిసున్నితమైన పిండినే మనం

తింటూవున్నామనీ మీకు తెలుసా? మన చేతవిసిరిన పిండిని మనం తినం; పాప మా గ్రామీణుడున్నూ మన దురభ్యాసాన్ని అజ్ఞానంతో అనుకరిస్తాడు. ఈ రీతిగా మనం మన సంపదను వ్యర్థం చేసుకుంటున్నాం; అమృతాన్ని విషంగా మార్చుకుంటున్నాం. ఏమంటే, మెరుగుపెట్టని గోధుమ పిండే తినదగిన ఆహారం. మరలో ఆడిసపిండి విటమిన్లులేని పిండి; ఇక రోజులకొలదీ నిలవగా వుంచబడిన మరపిండి విటమిను విరహితమే కాక, విషప్రాయం కూడా. అప్పుడు విసిరిన పిండిని తినడమే అన్నిటికన్నా మంచిది. అయితే రోజూ దానిని చేసుకోనడానికి మనం శ్రమపడం; తక్కువ బలకరమైన పదార్థాలను డబ్బిచ్చికొంటాము, దానితోపాటు అనారోగ్యాన్ని కూడా కొని తెచ్చుకుంటాం. ఇదేమీ ఊహాతీతమైన ఆర్థికసత్యం కాదు; మన కళ్లముందర రోజూ జరుగుతున్న వాస్తవ విషయమే. బియ్యం, బెల్లం, నూనె విషయంలో కూడా ఇదే కథ. మెరుగుతోపాటు బలం కాస్తా పోయిన బియ్యం మనం తింటాం; ఎక్కువ ఆహారపు విలువ గలిగిన బెల్లంకంటె ఎక్కువ ధర యిచ్చుకుని తక్కువ ఆహారపు విలువగల చక్కెరనే సేవిస్తాం. పల్లెటూరి నూనెగానుగ వానిని వినాశమొనర్చి, మనం కల్తీనూనెలనే భుజిస్తాం. గోవును మాతగా పూజిస్తాం, కాని అది రోజురోజూ కృశించి నశిస్తుంటే ఊరుకుంటాం. మనం తేనె తీసుకుని తేనెటీగలని చంపుతాం; తత్ఫలితంగా ఈనాడు తేనె బహు అరుదైన వస్తువైపోయి, నావంటి ఒక "మహాత్ము"నికో, లేక ఆయు

ర్వేద వైద్యులవద్ద మందులకు అనుపానంగా ఔషధప్రాయమైన పరిమాణంలో సంపాదించేవారికో తప్ప దొరకకుండా పోయింది. మనమే కనక శాస్త్రపద్ధతిని నిరపాయంగాచేసే తేనెటీగల పెంపకపు విధానాన్ని నేర్చుకుంటే, చాలా చవకగా తేనెను పొందగల్గుతాం; దానిని సేవించుటవలన మన పిల్లలు వారి ఆరోగ్యానికి అవసరమైన "కార్బొహైడ్రేట్ల"ను పొందగల్గుతారు. మన ఆహారాభ్యాసము లన్నింటిలోనూ కూడా మనం నికరమైన పదార్థాన్ని వదలి, దాని నీడను స్వీకరిస్తాము. బలకరమైన ఎఱ్ఱబెల్లం కంటె బొమికలపొడితో తెలుపుచేసిన చక్కెరను కోరుతాం; శక్తినొసగే తవుడు రొట్టెకు బదులు నీరసమైన తెల్లరొట్టె కావాలంటాం.

ప్రతి దినమూ స్నానంచేసేజాతి అని మన ప్రతీతి. ఆ మాట నిజమేకాని, తత్ఫలితంగా ఎక్కువ శుచిశుభ్రాలు మాత్రం మనకు దక్కడంలేదు. కారణం, మనం అశుభ్రమైన నీటితో స్నానం చేస్తాం; మన చెరువులనూ నదులనూ మలంతో కలుషమొనరుస్తాం; ఆ నీటినే స్నానపానాలకు ఉపయోగిస్తాం. లాయర్లమూ, డిగ్రీదార్లమూ, డాక్టర్లమూ అయిన మనమే దేహపరిశుభ్రత, నగర పారిశుధ్యం విషయాలలో ప్రాథమిక సూత్రాలనైనా నేర్చుకోము. మనయొక్క విసర్జిత మలములను దూరీకృత మొనర్చుటకు తక్కువ ఖర్చుతో అవలంబించగల యోగ్యపద్ధతులను మన మింకను కనిపెట్టలేదు; అందువల్ల మనం మన ఆరోగ్యప్రదములైన బహిరంగ స్థలము లన్నింటిని రోగక్రిములకు పుట్టినిండ్లుగా చేస్తాం.

మీ అలసతను వదలించుకొని, ఈ ప్రాథమిక సత్యాలను స్వయంగా పరిశీలించుటకు తొందరగా పూనుకొనవలె ననియు, ఎక్కువ సహేతుక జీవిత విధానము నలవరచుకొని, చెత్తచెదారములనుండి యైనను సంపత్తి నుద్భవింపజేసే కౌశలమును నేర్వవలసినదనియు నా సంప్రార్థన. తరాలనుండి మనల నావరించిన అలసతను విసర్జించినచో, నేను మీకు వివరించియున్న సులభసత్యాలను వెంటనే గ్రహించి వాటినిమనం ఆచరణలో పెట్టగలుగుతాం. మనం కాయకష్టాన్ని నిరాకరించి మేధశ్శక్తిని నీరసపరుచుకున్నాం; తత్ఫలితంగా హేతువిరుద్ధములైన ఆహారవిహార పద్ధతులతో సంతృప్తులమై ఊరుకుంటున్నాం. మన సర్వశక్తులను కేంద్రీకరించి మనయొక్క దేహమేధస్సులను ఎక్కువ చురుకుతనంతో పనిచేయునట్లు పెంపొందించుకొనుటకు నిశ్చయించుకుందుము గాక.

(గాంధీజీ ఇందోరులో జరిగిన బహిరంగ సభలో ఒనర్చిన ప్రసంగముయొక్క సంగ్రహ వ్యాసమునుండి)
హరిజన్, 11-5-'35

ఒకవిధంగా చూస్తే, మన దేశంలోని నిరుపాధిసమస్య ఇతర దేశములలో అంత కష్టసాధ్యమైనది కాదని చెప్పవచ్చును. జీవిత విధానంలోగల తేడా అందుకు ముఖ్యకారణం. పాశ్చాత్య దేశాలలో పనిలేనివానికి కూడా మిగిలిన వారితోపాటు ఉన్నిబట్టలూ, జోళ్లూ, మేజోళ్లూ అవసరం; వెచ్చని యిల్లూ, చలిదేశాలలో తప్పనిసరి అయిన ఇంకా కొన్ని ఇతర వస్తువులూ కూడా వారికి కావలసివ్వం

టాయి. మనకు అవన్నీ అక్కరలేదు. మన దేశంలో కని పించే పరమ దారిద్ర్యస్థితిని, నిర్వ్యాపారత్వమును చూచి నప్పుడు నిజంగా నా కళ్లు చెమ్మగిల్లాయి; అయితే, మన యొక్క ఉపేక్షాభావము, అజ్ఞానము మాత్రమే దానికి మూలకారణములని నేను చెప్పక తప్పదు. మనకు శ్రమ చేయుటలోని గౌరవమంటే ఏమిటో తెలియదు. అందుకని, జోళ్లు కుట్టేవాడు అది తప్ప ఇంకేపనీ చేయడు; చేస్తే అది తనకు పరువుతక్కువగా భావిస్తాడు. ఆ పొరపాటు అభిప్రాయం పోవాలి. నిజంగా తమ చేతులూ కాళ్లూ ఉపయోగించి కష్టించదలచిన వారందరికీ మన దేశంలో కావలసినంత పని లేకపోలేదు. ప్రతివానికీ దేవుడు కష్టించి తన దైనికభుక్తికి మించిన దానిని ఆర్జించుకొనగల సామర్థ్యాన్ని ఇచ్చి వున్నాడు; ఆ సామర్థ్యాన్ని ఉపయోగించుకొనదలచుకొన్న ప్రతివానికీ పని దొరికి తీరుతుంది. కాసో వీసమో గౌరవంగా గడించుకొనగోరు వానికి ఏ పని చేసినా పరువునష్టం కాదు. దేవుడిచ్చిన చేతులతోనూ కాళ్లతోనూ శ్రమించడానికి సంసిద్ధుడై వుంటే చాలు.

హరిజన్, 19-12-'36.

పెట్టుబడి వ్యాపారికి లోహ మెటువంటిదో, శ్రామిక వర్గానికి పలురకములైన కర్మకౌశలములలో అంతో యింతో పరిజ్ఞానం వుండడం అటువంటిదని నా అభిప్రాయం. కార్మి కునికి వాని కౌశలమే పెట్టుబడి. పెట్టుబడిదారు కార్మికుని సహకారం లేకుండా ఏ విధంగా తన పెట్టుబడిని ఫలవంతం

చేసుకొనలేడో, అట్లే కార్మికుడున్నూ పెట్టుబడిదారుని సహకారం లేనిదే తన శ్రమను ఫలప్రదమొనర్చుకొనజాలడు. ఇక, పెట్టుబడిదారూ కార్మికవర్గమూ, ఇరువురూ సమానమైన బుద్ధికుశలతను పెంపొందించుకుని, ఒకరివల్ల ఒకరు న్యాయమైన లాభం చేకూర్చుకొనగలమనే ఆత్మవిశ్వాసం కలవారైవుంటే, వారు పరస్పర గౌరవభావంతో ఇరువురికీ లాభకరమైన వ్యాపారసంస్థలో తాము సమాన భాగస్థులమనే భావాన్ని ఆకళించుకుంటారు. వారిరువురును తాము ఒకరినొకరు స్వభావతః రాజీకుదరని ప్రత్యర్థులైనట్లు భావించుకొననవసరంలేదు. కాని, చిక్కేమిటంటే, ఈనాడు పెట్టుబడిదార్లు తమ వ్యవస్థను సుసంఘటిత మొనర్చుకొని సుస్థిరంగా పాతుకుని వున్నట్లును, కార్మికవర్గం అట్టి స్థితిలో లేనట్లును గోచరిస్తుంది. మనోవికాసానికి ఏ మాత్రముగాని వ్యవధినీ అవకాశమునూ ఒసగని నిర్జీవమూ యంత్ర సదృశమూ అయిన కర్మాగార పరిశ్రమా ఫలితంగా కార్మికుని ధీశక్తి కుంచితమైపోయింది. అందువన, ఆతడు తన శక్తిని, తన తాహతుయొక్క పూర్ణగౌరవమును తెలిసికొననేరని స్థితిలో పడివున్నాడు. తన హక్కులను తాను ఉద్ఘాటించి వాటిని పొందుటకు బదులు, తన జీతమును నిర్ణయించే అధికారం పెట్టుబడిదార్ల చేతులలోనే వున్నదనే అజ్ఞానపు నమ్మకానికి లోనై వున్నాడు. సక్రమమైన భావానుసారంగా తన శక్తులను కాస్త సంఘటిత పరచుకొని, తన ధీశక్తి జాగృతమొనర్చుకొని, వివిధములైన కర్మకౌశలములలో ప్రవీణత

సంపాదించుకొని వుంటే చాలు, ఆతను తలయెత్తుకొని తిరుగ గల్గుతాడు. అప్పుడాతడికి తన ఆత్మపోషణకు జీవనోపాధి దొరకదని ఎన్నడూ భయపడవలసిన పనివుండదు.

హరిజన్, 3-7-'37.

అధ్యాయం ౧౩
దరిద్ర నారాయణుడు

దరిద్రనారాయణుడను పేరు నామరహితుడూ, అవాఙ్మనసగోచరుడూ అయిన పరమేశ్వరుని పోల్చుకొనుటకు గాను మానవకోటి సృష్టించుకొనినటువంటి వేలాది నామములలో ఒకటి. అది పేదవారి దేవుడనిగాని, పేదవారి హృదంతరమున అధివసించిన దేవుడనిగాని అర్థమిస్తుంది.

యంగిండియా, 4-4-'29.

పేదలకు ఆర్థికమే ఆధ్యాత్మికం. ఆకలితో అలమటించే అసంఖ్యాకులైన పేదలకు మరేవిధమగు ప్రబోధంగాని అర్థం కాదు. అది వారి హృదయాలను కదల్చలేదు. కాని, వారికి ఆహారమొసగి ఆకలి తీర్చినచో, వారు నిన్నొక దేవునిగా భావిస్తారు. తదితరమైన ఏ భావమునుగాని వారు అర్థం చేసికొనలేరు.

యంగిండియా, 5-5-'27.

వారు తమ చింకిపాతలలో గట్టిగా ముడివేచి దాచి కొన్న మైలపైసలను నేనే చేతితోనే పోగుచేసివున్నాను.

వారివద్దకు పోయి నవనాగరికతయొక్క పురోగతిని గురించి ఉపన్యసించినా, వారికి తెలియని దేవుని గురించి ప్రసంగించినా అది వారిని అవమానపరచినట్లే. వారికి దేవుని గురించి ధర్మోపన్యాస మొసగనారంభించినచో, వారు మిమ్ములనూ నన్నూ కూడా రాక్షసులట్లుగా భావిస్తారు. దేవునిగూర్చి వారేమైనను ఎరిగివున్నచో, ఆ దేవుడు భయంకరుడూ, క్రూరుడూ, దయావిరహితుడూ అయిన నిరంకుశ రాక్షసుడై వుంటాడు.

యంగిండియా, 15-9-'27.

భారత దేశము జాగరితము కాగలదనియు, ఈ నిరాశోపహతమైన దుర్భర దారిద్ర్యమునుంచి విముక్తిపొందు మార్గము ననుసరించగల శక్తిని ఆమె కలిగివున్నదనియు నేను విశ్వసించుటచేతనే, నిరాహారదీక్షతో ప్రాణములను వదలకుండా నేనింకను జీవించి యుండగల్గుతున్నాను. అట్టి సాధ్యతలో నాకు విశ్వాసము లేనిచో, నాకు బ్రతుకునందభిరుచియే నశించి వుండేది.

యంగిండియా, 3-4-'31.

వారి యెదుట దైవసందేశమును గురించి ప్రబోధించగల సాహసం నాకులేదు. కన్నులు కాంతిహీనములై, ఆకలితో అలమటిస్తూ, అన్నమే పరబ్రహ్మస్వరూపమైన ఆ అసంఖ్యాకులైన దరిద్రజనానీకం ముందు దైవసందేశ ప్రబోధ మొనర్చినా, ఆ కడుపుకాలే కుక్కముందర చేసినా ఒకటే. వారికి పవిత్రమైన శ్రమావకాశమును కలిగించే సందే

శము నందీయుట ద్వారానే, వారికి దైవసందేశము నందీయ గల్గుతాను. మన మిచ్చట భోజన మొనర్చి కూర్చుని, అంతకంటే మంచి ఫలహారముల కోసం ఎదురుచూస్తూ, దేవుని గురించి ప్రసంగించడం సౌఖ్యప్రదంగానే వుంటుంది, కాని రోజుకి రెండు భోజనములకు నోచుకోనని ఆ లక్షలాది జనుల యెదుట నేను దేవునిగురించి ఏ మొగంతో మాట్లాడ గలను? వారికి దేవుడు అన్నమూ, ఆదరువులూ రూపంగానే అగుపించగలడు. ఇంతవరకు భారత కర్షకులు భూమినుంచి అన్నమును ఉత్పన్నం చేసుకుంటున్నారు; దానితోపాటు వారు ఆదరువులను కూడా ఆర్జించుకోన గల్గుటకుగాను, నేను వారికి నూలువడికే రాట్నచక్రమును అందజేశాను. ఈనాడు నేను కేవలం కొల్లాయికట్టి మీ ముందర కనిపిస్తున్నానంటే అర్ధాకలితోనూ గోచిపాతతోనూ గోచరించే ఆ లక్షలాది నోరులేని పేదలకు నేను ప్రాతినిధ్యం వహించి నిలిచివున్నా నని గ్రహించగోరుతాను

యంగిండియా, 15-10-'31.

లక్షల సంఖ్యలో వున్న నోరులేని పేద ప్రజానీకపు హృదయాలలో నెలసిన పరమేశ్వరుని దప్ప, తదితరమైన దేవుని నే నంగీకరించను. వారు తమలోని దేవుని తా మెరుగరు; నే నెరుగుదును. సత్యస్వరూపి అగు పరమాత్ముని, లేక పరమాత్మ స్వరూపమగు సత్యమును దరిద్ర జనకోటి యొక్క సేవద్వారా నేను ఆరాధిస్తాను.

హరిజన్, 11.3.'39.

దైవశాసనం ప్రకారం మనిషికి ఆ రోజునకు కావలసిన భోజనమునకు మించిన భుక్తిపై అధికారము లేదనే విషయం మన మెరుగకపోవుట, లేక దానిని అశ్రద్ధచేయుట మాత్రమే అసమానతలకును తత్ఫలితమైన సకల విధములగు బాధలకును మూలకారణం. శ్రీమంతుల ఆధీనంలో తమకు అవసరంలేని అదనపు వస్తువు లెన్నో పోగైవుంటాయి; వాటిని వారు అశ్రద్ధగా పాడైపోనిస్తారు. వాటి లేమివలన లక్షలాది పేదలు కూడూ గుడ్డా లేక, చలికి వొళ్లు కొంకర్లు పోయి, చచ్చిపోతారు. ప్రతివ్యక్తీ కేవలం తనకు కావలసినంత వస్తుజాలాన్ని మాత్రమే వుంచుకుంటే, లేమివల్ల ఎవ్వరూ బాధనొందకుండా సంతుష్టిగా బ్రతకగల్గుతారు. ప్రస్తుతం పేదవారితో సమానంగా ధనవంతులున్నా అసంతృప్తితో బాధపడుతున్నారు. నిర్ధనికుడు లక్షాధికారి కావలెననీ, లక్షాధికారి కోటీశ్వరుడు కావలెననీ దురాశాపీడితు లౌతున్నారు. కేవలం కడుపునిండేపాటి భుక్తితో పేదవారున్నా సంతుష్టులు కావడంలేదు; అయితే ఆ పాటి అయినా పొందడానికి వారికి హక్కువున్నదని గ్రహించి. సంఘం వారికది లభ్యమగునట్లు చూచుటకు బాధ్యత వహించాలి. ఈ విషయంలో ముందంజవైచి, సంతుష్టిభావాన్ని విశ్వజనీన మొనర్చే విధ్యుక్తధర్మం ఎక్కువగా ధనికులపైన వున్నది. వారు తమ స్వంత ఆస్తిపాస్తులను సామాన్యమగు హద్దులను మించకుండా చూచుకుంటేచాలు, తద్వారా పేద

వారికి భుక్తి కలుగుతుంది; వారును ధనికులతో సమానంగా సంతుష్టజీవను లౌతారు.

యెరవ్డా మందిర్ నుంచి, అధ్యాయం 6.

నిజమైన నాగరికత అనేది అవసరాలను పెంచుకొనుటలో లేదు, వాటిని బుద్ధిపూర్వకంగాను, యిష్టపూర్తిగాను తగ్గించుకొనుటలోనే వుంది. అట్లు చేసినచో నిజమైన సుఖ సంతృప్తులు సిద్ధించడమేకాక, మనం సేవాచరణమునకు ఎక్కువ శక్తిమంతులం కాగలుగుతాం. పట్టుదలగా ప్రయత్నించడం ద్వారా మన అవసరాలను మనం తగ్గించుకొనగలుగుతాం. తద్వారా సుఖమును, అనగా శరీరారోగ్యమునూ మానసిక శాంతినీ, అనుభవించగల్గుతాం.

యెరవ్డా మందిర్ నుంచి, అధ్యాయం 6.

లక్షల సంఖ్యలోవున్న ప్రజాబాహుళ్య మందరికినీ లభ్యం కాజాలని వాటిని మనమున్నూ నిరాకరించడమనే సూత్రం ఈ విషయంలో చాలా మేలైన పద్ధతి. అట్లు నిరాకరించగల శక్తి ఉన్నపట్టున ఆకాశాన్నించి మనకు సిద్ధించదు. మొదటి సోపానం, ప్రజాబాహుళ్యానికి చిక్కని వస్తుజాలమునూ సుఖసౌకర్యములను మనం కోరకుండా వుండే మనోవైఖరిని అలవరచుకొనడం; రెండవది, ఆ వెనువెంటనే వీలైనంత త్వరలో అట్టి మన తత్వమునకు తగిన రీతిగా మన జీవిత విధానంలో మార్పు తెచ్చుకొనడం.

యంగిండియా, 24-6-'26.

జీససు, మహమ్మదు, బుద్ధుడు, నానక్, కబీరు, చైతన్యుడు, శంకరాచార్యుడు, దయానందుడు, రామకృష్ణ పరమహంస వీరందరును లక్షలాది ప్రజానీకంపై విస్తృత ప్రభావాన్ని నెరపి, వారి జీవితములలో పవిత్ర పరివర్తనమును కలిగించిన మహాపురుషులు. వారు జన్మించుటవలన ప్రపంచ శ్రేయస్సు ఇనుమడించింది. వారెల్లరు బుద్ధిపూర్వకంగా పేదరికమును స్వీకరించియున్న సంగతి గమనీయము.

మహాత్మా గాంధి ప్రసంగములు, రచనలు; పే. 353.

అధ్యాయం ౧౪

భుక్తి పరిశ్రమా సూత్రం

మహత్తరమగు ప్రకృతిమాత మనలను నుదుటి చెమట నోడ్చి భుక్తినార్జించుకొనవలసిదిగా నిర్దేశించి వున్నది. అందువల్ల, ఏ వ్యక్తిగాని ఒక్క నిమిషకాలమైనా సోమరితనంతో వెళ్లబుచ్చినచో, అంతవరకును ఆతడు తన ప్రక్కవారికి భారమైనట్లే; అట్లు చేయుట అహింసా విధానము యొక్క ప్రథమ పాఠమునే భంగ పుచ్చినట్లవుతుంది..... అహింస అంటే ప్రక్కవానికి ఏ మాత్రమును బాధకలిగించకుండా జీవించుటకు మార్గదర్శకమైన అతి సుకుమారమైన భావనము; అట్లు కానిచో అహింస నిరర్థకమన్నమాట. సోమరితనమున బ్రతుకువాడు ప్రాథమికమైన అట్టి సున్నిత భావనమునకు దూరుడన్నమాట.

యంగిండియా, 11-4-'29.

మనిషి తన చేతులతో తాను కష్టపడి తన భుక్తిని ఆర్జించుకొనవలెననే దైవనిర్దేశమును గురించి మొట్టమొదట టి. ఎం. బొండారెవ్ అనే రష్యను రచయిత ఉద్ఘాటించి వున్నాడు. టాల్‌స్టాయ్ దానిని లోకమునకు వెల్లడించి, విస్తృతమైన ప్రచార మొనర్చి వున్నాడు. యజ్ఞపూర్వకము కాకుండా భుజించేవాడు దొంగిలించిన అన్నము తిన్నట్లే అని చెప్పే భగవద్గీత మూడవ అధ్యాయములోని వాక్యములో ఈ సూత్రమే అభివ్యక్తమై వున్నదని నా అభిప్రాయం. ఇక్కడ యజ్ఞమనేమాట భుక్తిశ్రమ (Bread Labour) అని మాత్రమే అర్థమిస్తుందని స్పష్టం.

హేతువాదం కూడా సరిగా ఈ పర్యవసానానికే వస్తుంది. కాయకష్టం పడని మనిషికి తిండి తినుటకు అర్హత ఏ విధంగా కలుగుతుంది? "కష్టించి చెమటోడ్చి పొందిన దానినే భుజింతువుగాక" అని బైబిలు ప్రవచనం. లక్షాధికారి అయినా రోజల్లా ప్రక్కమీద దొర్లి, భోజనంకూడా నోటి కందింపించుకుని కాలం గడిపితే, తుదకు బ్రతుకుపై విసుగు జనించి అట్టి జీవితాన్ని తానే అసహ్యించుకుంటాడు. అందువల్ల అతడు కూడా కొంత శరీరసాధకం చేసి, ఆకలి పుట్టించుకుని మరీ ఆహారం తీసుకుంటాడు. ఆ విధంగా ధనికులూ పేదలూ కూడా ఏదో ఒక విధమైన దేహపరిశ్రమ చేయవలసి వున్నప్పుడు అది ఉత్పత్తికరమైన పరిశ్రమ, అనగా భుక్తిశ్రమ రూపంలో ఎందుకు జరుగకూడదు? కాయకష్టపడే కృషికుణ్ణి ఎవరూ ప్రాణాయామంగాని, కసరత్తుగాని చేయ

మని కోరవలసిన పనిలేదు. ప్రజాబాహుళ్యంలో పదకి తొమ్మిదివంతుల మంది భూమిదున్ని కష్టించి జీవించేవారే అయి వున్నారు. ఆ మిగిలిన ఒక వంతు అల్పసంఖ్యాకులూ కూడా ఆ అత్యధిక సంఖ్యాకుల ఉదాహరణ ననుసరించి, కనీసం తమ భుక్తికి సరిపడు పాటి అయినా శ్రమిస్తే, లోక మింకా ఎంత సుఖవంతమూ, ఆరోగ్యవంతమూ, శాంతి పూరితమూ కాగలుగునో గదా!

ధనికులకూ శ్రామికులకూ మధ్య లోకమంతటా ఘర్షణ పరిస్థితులు ఏర్పడివున్నాయి; పేదవారు ధనికుల యెడల స్పర్థాపూరితులై వున్నారు. అందరూ సమానంగా భుక్తిశ్రమ అవలంబిస్తే, తాహతుభేదాలు అంతరిస్తాయి; ధనికులింకను మిగిలివున్నాగాని వారు తమ ఆస్తిధనములకు తాము ధర్మకర్తలమను భావమును మాత్రమే కలిగివుండి, వాటిని ప్రధానంగా ప్రజాహితానికే వినియోగిస్తారు.

అహింసా సాధకులకు, సత్యారాధకులకు, బ్రహ్మచర్య మును సహజసిద్ధమైన రీతిని ఆచరించదలచిన వారికి, భుక్తి శ్రమసూత్రావలంబనను ఒక ఉత్కృష్టమైన వరప్రసాదం. ఈ శ్రమా సూత్రమునకు వ్యవసాయకృషితోనే సత్యమైన అనుబంధం వుంది. కాని ఈ రోజులలో అందరూ ఆవిధంగా దానిని ఆచరించగలస్థితిలో లేరు. అందున, ఎవరుగాని, వ్యవసాయమును ఆదర్శంగా మాత్రం వుంచుకొని, ప్రస్తుత పరిస్థితులను బట్టి దానికి బదులుగా నూలువడుకుట, బట్టల నేత

పరిశ్రమలనూ, వడ్రంగమూ కమ్మరమూ వంటి పనులనూ అవలంబించవచ్చును. ప్రతివ్యక్తీ తన మలములను తానే శుభ్రపరచుకోవాలి. భోజన మెంత అవసరమో విసర్జన మున్నూ అంత అవసరమైనదే; కావున ప్రతివారూ తమ విసర్జిత మలములను తామే తొలగించుకోవాలి. అది సాధ్యం కానిచో ఒక్కొక కుటుంబమునకు అవసరమైన ఏర్పాట్లను ఆ కుటుంబమువారే నిర్వర్తించుకొన గలగాలి.

మలమూత్ర పారిశుధ్యకార్యం సంఘంలో ఒక వర్గం వారిపైననే మోపే ఏర్పాటు కేవలం అక్రమ పద్ధతి అనే అభిప్రాయం నాకు చాలా వత్సరాలనుంచి ఏర్పడివున్నది. ఈ అత్యవసర పారిశుధ్యకార్య నిర్వహణమునకు అత్యధమమైన తాహతును నిర్దేశించిన వా డెవ్వడో తెల్పే చారిత్రక నిదర్శనము లేమీ కనిపించవు. అత డెవడైనప్పటికి, ఆత డొనర్చిన ఏర్పాటు ఎంతమాత్రమూ సక్రమమైనది కాదు. మల పారిశుధ్యం మనకు పుట్టుకతోపాటు ఏర్పడిన విధి అనే విషయం బాల్యంనుంచీ మన మనస్సులలో నాటబడాలి; ఈ విషయం గ్రహించినవారు దానిని ఆచరణలో పెట్టడానికి సులభమార్గ మేమిటంటే, వారు మల పారిశుధ్యమునే తమ యొక్క భుక్తిశ్రమా విధానంగా స్వీకరించడమే. ఆ విధంగా కౌశలంతో మల పారిశుధ్య క్రియను నెరవేర్చుట ద్వారా నిజమైన మానవ సమానతా భావమును మనం అవగాహన చేసికొన గల్గుతాం.

యెరవ్డా మందిర్ నుంచి, అధ్యాయం 11.

హక్కులకు నిజముగా మూలకందమైనది విధి. మన మంతా మన విధులను నిర్వర్తిస్తే, హక్కుల కోసం అన్వేషణ జరపనక్కరలేదు. విధులను నిర్వహించకుండా హక్కుల నిమిత్తం ఎగబడితే, అవి ఎండమావులవలె కనిపించి మాయమౌతాయి. వాటిని మనం వెన్నాడిన కొలదీ దూరమైపోతాయి. "కర్మాచరణమే నీ పని, ఫలాన్ని గురించి ఏ మాత్రం ఆలోచించకు" అని చెప్పిన కృష్ణభగవానుని వాక్యంలో ఈ సత్యమే ఇమిడి వున్నది. కర్మయే విధినిర్వర్తనం; కర్మఫలితమైనదే హక్కు.

యంగిండియా, 8-1-'25.

మృగ పశ్వాదుల వలెనే ప్రతిమానవుడూ కూడా జీవితావసరములను పొందుటకు సమాన హక్కును కలిగి వున్నాడు. ఇక, ప్రతి హక్కుతోపాటు తత్సంబంధమైన ఒక విధినీ, తత్సంబంధమైన ప్రతిఘటనమును ఎదుర్కొనుటకు తగిన నివారణోపాయమును గూడ వుండడం బట్టి, ఆ విధులను ఆ నివారణోపాయములను తెలిసికొనుట ద్వారా మన యొక్క ప్రాథమికాశయమగు సమానత్వమును నిలుపుకొనగల్గుతాము. కాయకష్ట మొనర్చుటయే తత్సంబంధమైన విధి; మన కష్టఫలమును మనకు దక్కకుండా చేసే వానితో సహాయ నిరాకరణము నవలంబించుటయే తత్సంబంధమైన ప్రతిఘటనా నివారణోపాయము.

యంగిండియా, 26-3-'31.

అందరూ భుక్తికి అవసరమైన మాత్రంగా శ్రమిస్తే చాలు, అందరికీ చాలినంత తిండి, చాలినంత వ్యవధి కలుగు

తుంది. అప్పుడు జనాభా పెరుగుదలను గూర్చిన ఆందోళన గాని, చుట్టూ మనకు నిత్యం దృశ్యమానమయ్యే ఆది వ్యాధులూ దారిద్ర్యమూగాని ఇక వుండవు. అట్టి శ్రమానిర్వహణము కంటె ఉత్కృష్ట త్యాగయజ్ఞ మింకొకటుండదు. మనుష్యులు తమ మానసిక దైహికశక్తులతో ఇంకా చాలా పనులు చేయగలరు; కాని అవన్నీ సర్వజనసంక్షేమార్థమైన ప్రేమపూర్వక పరిశ్రమ క్రిందికి వస్తాయి. అప్పుడు ధనికులూ దరిద్రులూ అనిగాని, గొప్పవారూ కొద్దివారు అనిగాని, స్పృశ్యులూ అస్పృశ్యులూ అనిగాని భేదభావం వుండదు.

ఇది అందరాని ఆదర్శం కావచ్చును. అందుకని దీనికొరకు మనంచేసే కృషి మాననవసరం లేదు. త్యాగ ధర్మాన్ని, అనగా మన జీవితధర్మాన్ని సంపూర్ణంగా ఆచరణలో పెట్టకపోయినా, మన దైనికభుక్తి సంపాదనమునకు తగినపాటి కాయకష్టమైనా చేస్తే, మనం ఆ ఆదర్శానికి చేరిక కాగలుగుతాం.

మనం అట్లు చేసినయెడల మన అవసరాలు హీనమైనంతగా తగ్గుతాయి, మన భోజనమున్నూ సామాన్యమైన మితిలో వుంటుంది. అప్పుడు మనం బ్రతకడానికి తింటామే గాని, తిండికోసం బ్రతకం. ఈ మాటను సందేహించేవారెవరుగాని భుక్తి సంపాదనకు చెమటోడ్చి శ్రమించి చూచుకొన్నచో, తత్ఫలితమైన భోజన మెంత రుచికరముగా

తోచునో, అట్టి శ్రమ ఎంత ఆరోగ్యప్రదమో, తమ కీవరలో అవసరమైన ఎన్నితినుబండారములు నిజంగా తమ కవసరమైనవో తెలుసుకొనగలుగుతారు.

హరిజన్, 29-6-'35.

తెలివితో చేసే భుక్తిశ్రమకంటె ఉత్కృష్టమైన సంఘసేవా కార్యమింకొకటి లేదని నిస్సంశయంగా చెప్పవచ్చును. సాంఘిక ప్రయోజనమును మనసులో పెట్టుకొని మరీ సేవాకార్యముల నొనర్పవలెనను విషయమును తెలుపుటకు గాను పైన పేర్కొన్న శ్రమ అనే మాటకు 'తెలివిగా' అనే విశేషణం చేర్చబడింది. లేనిచో, ప్రతి శ్రామికుడూ సంఘసేవ చేస్తున్నట్లే అర్థమిస్తుంది. ఒకవిధంగా అతడు కూడా చేస్తూవున్నప్పటికీ, ఈ సందర్భంలో అంతకుమించిన అర్థం ఉద్దేశింపబడివున్నది. సర్వజనసంక్షేమార్థం పరిశ్రమించేవాడు సంఘసేవకు డౌతాడు. కూలికి చేసినాగాని ఆ కూలికి అతడు నిజమైన అర్హత కలవాడౌతాడు. కాబట్టి, అట్టి భుక్తిశ్రమకూ సంఘసేవకూ తేడా ఏమీ లేదు.

హరిజన్ 1-6-'35.

మానసికశ్రమ ద్వారా మనుష్యులు తమ భుక్తిని ఆర్జించుకొనకూడదా? కూడదు. దేహంయొక్క అవసరాలను దైహికశ్రమమూలంగానే పొందాలి. "సీజరునకు (రాజునకు) చెందినది సీజరున కర్పించ"మని చెప్పే నానుడి ఇక్కడ బాగా సరిపోతుందనుకుంటాను. కేవలం ధీశక్తివల్ల పడే శ్రమ అనగా మానసిక శ్రమ, ఆత్మ సంబంధి; దాని

కదే సంతృప్తి. అది ఎన్నడూ ధనరూపకమైన ప్రత్యామ్నాయం ఆశించకూడదు. ఆదర్శ రాజ్యంలో డాక్టర్లు, లాయర్లు మొదలైనవారు, స్వార్థమునకు కాక, కేవలం సంఘ సంక్షేమమునకే శ్రమిస్తారు. ప్రయాసంతా బ్రతకడానికే అనే భావంపోయి, ప్రయాసంతా పరస్పర సంసేవమునకే అనే భావంగా పరివర్తనము పొందినప్పుడే మానవుడు సార్థకమైన విజయం పొందినవాడౌతాడు. అప్పుడు జాంతవజీవన విధానమునకు బదులు మానవయోగ్యమైన జీవనవిధానము సుస్థిరమౌతుంది.

గ్రామజీవిత పునఃస్వీకరణమంటే భుక్తిశ్రమ విధిని, దానిలో అంతర్గతమైన సర్వాంశములను స్పష్టంగానూ ఇష్టపూర్తిగానూ స్వీకరించడమన్నమాట. "అయితే మరి, ప్రస్తుతం గ్రామాలలో జీవిస్తూవున్న లక్షలాది ప్రజలు అర్థాకలితో అల్లాడుతున్నారుగదా" అని విమర్శకులంటారు. నిజమే, ఇది శోచనీయమైన వాస్తవికసత్యమే. కాని, వారు నిజంగా గ్రామజీవితాన్ని విధిగా స్వీకరించినవారు కాదు. వారు వీలైతే దైహికశ్రమను తప్పించుకొనుటకే యత్నిస్తారు; జాగావుంటే దగ్గరలోని పట్నానికి పరుగెత్తుటకు కూడా ఆతురతగా వుంటారు. యజమానికి బలాత్కారంగా ఒసగే విధేయత బానిసత్వస్థితి అవుతుంది; తండ్రికి కుమారుడొసగే మనఃపూర్వక విధేయత కుమారుని సౌశీల్యానికి చిహ్నమౌతుంది. అట్లే భుక్తిశ్రమాధర్మాన్ని బలాత్కారంగా అనుసరిస్తే అది దారిద్ర్యానికీ, అది వ్యాధులకూ,

అసంతుష్టికీ హేతుభూత మౌతుంది. అది ఒక బానిసత్వస్థితి. దానినే ఇష్టపూర్తిగా అనుసరిస్తే, అది సంతుష్టికీ, ఆరోగ్యానికీ మూలకందమౌతుంది. ఆరోగ్యమే నిజమైన ధనం, వెండి బంగారు శలాకలుకాదు. ఇష్టపూర్వక భుక్తిశ్రమా ప్రయోగమునకు గ్రామోద్యోగసంస్థ ఒక సాధనముగా ఉపకరిస్తున్నది.

హరిజన్, 29-6-'35.

భిక్షుకత్వం : (Beggary)

ఏదో ఒకవిధమైన నిజాయితీగల శ్రమచేసి అర్హత సంపాదించితే తప్ప, ఆరోగ్యవంతుడైన ఏ మనిషికిగాని ఉచితంగా భోజన మొసగే భావాన్ని నా అహింసాసూత్రం అంగీకరించదు; నేనే అధికారినైతే ఉచితంగా భోజనాలు పెట్టే 'సదావ్రతము'ల (సత్రముల) నన్నింటిని మూయించివేస్తాను. ఆ పద్ధతి జాతిపతనకారకమైనది; అది బద్ధకమును సోమరితనమును, మోసబుద్ధిని, చివరకు దుర్నీతిని సైతము ప్రోత్సహించుటకు సహాయపడింది, అట్టి అనుచితమైన ఔదార్యం భౌతికంగాగాని, ఆధ్యాత్మికంగాగాని దేశ సౌభాగ్యాన్ని ఇసుమంతైనా పెంచదుగదా, ఆ ధర్మకర్తలకు అసత్యమైన ఘనతాభావమును కలిగిస్తుంది. ఆ ధర్మకర్తలే తమ తిండికి తాము పరిశ్రమించే స్త్రీపురుషుల నిమిత్తం ఆరోగ్యకరమూ, పరిశుభ్రమూ అగు పరిసరములలో భోజన సౌకర్యము లొసగే సంస్థలను ఏర్పాటుచేస్తే ఎంత మంచిగానూ, తెలివిగానూ వుంటుంది! అట్టివారికి నూలువడికే

గాట్నముగాని, నేతకు అవసరమైన దూదిపను లన్నిటికీ సంబంధించిన ఇతర పరిశ్రమలుగాని ఆదర్శప్రాయమైన వ్యాప కములుగా ఉపకరించగలవని నా అభిప్రాయము. వారికి అవి యిష్టంలేకపోతే ఇంకేపని అయినాగాని చేయవచ్చును; కాని "శ్రమలేనిదే భోజనం లేదనే సూత్రంమాత్రం అమలు పరచాలి. ఏ పట్నమున కాపట్నంలో క్లిష్టతరమైన భిక్షుక సమస్య వుండనే వుంది; ఆ సమస్యకు ధనికులే కారకులు. నిజాయితీతో పనిచేసినవారికి తగినరీతిగా భోజన సదుపాయ ములు చేకూర్చే సంస్థలు ఏర్పాటుచేయడంకంటె, పనిపాట్లు చేయని సోమరుల మొగాన ఉచిత భోజనాలను గుప్పించడం చాలా సులభమైన పని అని నే నెరుగుదును. డబ్బు దృష్టి నుంచి, ప్రారంభంలో, పని తీసుకుని భోజనం పెట్టే ఏర్పాటు నకు ప్రస్తుతం నడిచే ఉచిత భోజనసత్రములకంటె ఎక్కువ ఖర్చు కావచ్చును. కాని దేశంలో రోజు రోజుకు పెచ్చు పెరిగిపోతూవున్న దేశద్రిమ్మరులగు భిక్షుకుల సంఖ్యను అరి కట్టుటకుగాను, నేను పైన సూచించినరీతి సంస్థలను మరి కొంతకాలం నడిపించిచూస్తే, అవి చౌకగానే నడవగలవని నేను చెప్పగలను.

యంగిండియా, 13-8-'35.

నా అభిప్రాయములో భిక్షుకత్వాన్ని ప్రోత్సహించడం చెడ్డపని అయినా, భిక్షుకుడు వస్తే నేనాతనికి పనీ, తిండీ చూపించకుండా ఊరికే పంపించివేయను. ఆతడు పనిచేయు టకు యిష్టపడకపోతే మాత్రం, తిండిలేకుండా పోనిస్తాను.

కుంటి గ్రుడ్డి మొదలైన వికలాంగులను ప్రభుత్వం పోషించ వలసినదౌతుంది. గ్రుడ్డితనాన్ని నటించేవారి ద్వారానూ నిజంగా గ్రుడ్డిఅయినవారి ద్వారానూ కూడా కావలసినంత మోసకారితనం నడుస్తూవుంది. అట్టి అక్రమపద్ధతులవల్ల డబ్బు గడించి ధనికులైన గ్రుడ్డివాళ్ళు చాలామంది వున్నారు. ఈ వ్యసనానికి లోనుగాకుండా ఆ వికలాంగులను రక్షణశాల లలో వుంచడం మంచిపని అవుతుంది.

హరిజన్, 11-5-'35

అధ్యాయం ౧౫
సర్వోదయం

నైతికప్రవర్తన అంటే మన మనస్సుమీదా ఉద్రేకాల మీదా నిగ్రహశక్తి కలిగివుండడం. మనస్సు నిరంతరము చంచలమైన పక్షి వంటిదని మన మెరుగుదుము; ఎంత వున్నా ఇంకా కావాలంటుంది. అప్పటికీ అసంతృప్తిలో అల్లాడుతూనే వుంటుంది. మన ఉద్రేకములను సంతృప్తి మొనర్చినకొలదీ అవి మరింత విశృంఖలమౌతాయి. అందున, మన పెద్దలు మన ఇంద్రియసుఖాలకు ఒక పరిమితి ఏర్పరి చారు. సుఖమనేది ఒక మానసికస్థితి అనే విషయం వారు గ్రహించి వున్నారు. ఏ వ్యక్తిగాని ధనవంతుడైనంతనే తప్పకుండా సుఖవంతుడూ కాజాలడు, పేదవాడగుట వలన సుఖవిహీనుడూ కాడు. సామాన్యంగా ధనవంతులు అసుఖం గానూ, పేదవారు సుఖంగానూ వుండడం కూడా తరుచు కనిపిస్తుంది. లక్షలాది జనానీకం ఎల్లప్పుడూ పేదరికంలోనే

వుంటారు. ఇదంతా గమనించి మన పెద్దలు మనలను సుఖ సంపదలనుంచి, ఇంద్రియలాలసతనుంచి విముఖత్వము నలవర చుకొనవలసినదిగా ప్రబోధించి వున్నారు. వేలాది సంవత్స రములపూర్వం ఎటువంటి నాగలివుండేదో అట్టినాగలితోనే మనం నేటివరకూ కాలక్షేపం చేశాం; పూర్వకాలపు కుటీర ములలోనే ఇంతవరకు మనం జీవిస్తూవున్నాం. ఆనాడూ ఈనాడూ కూడా ఒకే విధమైన దేశీయ విద్యాపద్ధతి మన దేశంలో నడుస్తూవున్నది. బ్రతుకును రాచిరంపానపెట్టే పోటీ పద్ధతి మన కెప్పుడూ లేదు. ప్రతివారూ తమ సంప్రదాయిక వృత్తి వ్యాపారముల ననుసరించి ఉత్పత్తిచేసి ఆ వస్తువులకు నిర్ణీతమైన ధరలను పొందేవారు. యంత్రనిర్మాణ కౌశలం మనకు లేకపోలేదు కాని, మన పెద్దలు, అట్టివిధానంలో మనం పడితే, బానిసత్వంలో మునిగి నైతికశక్తిని కోల్పోతామని భావించారు. అందున వారు, తగిన ఆలోచనమీదనే, మనం చేతులతోనూ, కాళ్ళతోనూ చేయగల పనులనే చేసుకుంటే చాలునని నిర్ణయించారు. మన చేతులనూ, కాళ్లనూ సరిగా ఉపయోగించుకొనడంలోనే మనయొక్క నిజమైన సుఖమూ, ఆరోగ్యమూ ఇమిడి వున్నవని వారు గమనించారు. అంతేకాక, వారు, పెద్దపెద్ద పట్నాలు ప్రలోభనకరమూ, భారమూ అవుతవనిన్నీ, వాటిలో ప్రజలు సుఖవంతులుగా వుండజాలరనిన్నీ, అక్కడ దొంగల ముఠాలూ, వ్యభిచారం, ఇతర వ్యసనాలూ పెచ్చుపెరుగుతవనిన్నీ, అక్కడ పేదలను ధనికులు దోచుకొనగలరనిన్నీ సమాలోచించారు. అందువల్ల

వారు చిన్న చిన్న గ్రామాలతో సంతృప్తి పొందారు. నైతికఖడ్గంతో పోలిస్తే రాజులూ, వారి కరవాలాలూ హీన మైనవనిన్నీ అందువల్ల ఋషులకంటె ఫకీర్లకంటె భూవల యము నేలే చక్రవర్తులు తక్కువ తరహావారనిన్నీ భావిం చారు మన పెద్దలు. ఇట్టి జీవిత విధానమును కలిగిన దేశం, ఇతరులవద్ద నేర్చుకొనుటకుకంటె, నేర్పుటకే ఎక్కువఅర్హమైన దౌతుంది. ఈ దేశంలో న్యాయస్థానాలూ, న్యాయవా దులూ, వైద్యశాస్త్రజ్ఞులూ కూడా వుండేవారు; కాని వారంతా కొన్నినియమములకు బద్ధులైవుండేవారు. ఈవృత్తు లలో ఇతర వృత్తులకంటె ప్రత్యేకమైన ఆధిక్యత ఏమీ లేదని అందరికీ తెలిసివుండేది; అంతేకాక ఈ న్యాయ శాస్త్రజ్ఞులూ, వైద్యులూ ప్రజలను దోచుకునేవారు కాదు; వారు ప్రజలపై అధికారులుగా కాక, ప్రజలపై ఆధారపడిన వారుగా పరిగణింపబడేవారు. న్యాయవితరణము చాలావరకు ఉచితరీతినే నడిచేది. న్యాయస్థానాలకు తరచుగా పోకుండు టయే యోగ్యసూత్రంగా పాటించబడేది. అక్కడికి ప్రజల నాకర్షించే మధ్యవర్తులు ఆ రోజులలో వుండేవారుకారు. అట్టిపద్ధతి ఏ కొంచెమైనా వుంటే అది ముఖ్యపట్టణప్రాంతము లందే వుండేది. ప్రజాసామాన్యం స్వతంత్రజీవనులై, కర్షక వృత్తి నవలంబించి బ్రతికేవారు. వారు నిజమైన స్వపరిపాల నమును (Home Rule) అనుభవించేవారు.

హింద్ స్వరాజ్, అధ్యాయం 13.

సేనాజీవితము అడకువతో కూడినదై వుండాలి. ఇతరుల సంక్షేమం నిమిత్తం తన ప్రాణములను సైతము త్యాగమొనర్ప సంసిద్ధుడైన వానికి తన సంక్షేమంకోసం తాపత్రయపడడానికి వ్యవధియే వుండదు. అయితే హైందవ సంఘంలో సామాన్యంగా జరిగేలాగ, మందకొడితనమును, అడకువగా పరిగణించే పొరపాటునుమాత్రం చేయకూడదు. కేవలం ప్రజాక్షేమాన్నే ఆశించి చేసే నిర్విరామమైన పూర్ణప్రయత్నమే నిజమైన అడకువను తెల్పుతుంది. పరమేశ్వరుడు ఒక్క క్షణమైనను విరతినెరుగని క్రియాత్మకతను ప్రదర్శిస్తాడు. మన మాతని సేవకులము కాగోరినను, ఆతనితో సమైక్యతను సాధింపవలెనన్నను మనమును ఆతనితోసమంగా అలసత నెరుగని క్రియాశీలతను అలవరచుకోవాలి.

యెరవ్డామందిర్ నుంచి, అధ్యాయం 12.

పరమేశ్వరుని పేరిట, పరమేశ్వరార్పణముగాను చేసిన ఏపనిగాని అల్పమైనది కాదు. అట్లొనర్పబడిన సర్వకార్యములును సమానయోగ్యతను కల్గినవై వుంటాయి. ఈశ్వర సేవకునిగా పనిచేసే పాకీపనివాడైనను ఈశ్వరునిపేరిట తన శక్తులను వినియోగించి తాను కేవలం ధర్మకర్తగా వర్తించే ప్రభువుతో సమానమైన ప్రభువుతో సమానమైన ప్రముఖతను ఆర్జిస్తాడు.

యంగిండియా, 25-11-'26.

అహింసా సాధకుడైనవాడు "అధికతమ సంఖ్యాకుల యొక్క అధికతమ సంక్షేమం" అనే ప్రయోజనాత్మక

సూత్రాన్ని అంగీకరింపజాలడు. ఆతడు సర్వులకూ వర్తించే సర్వాధికసంక్షేమం నిమిత్తమే పాటుపడి, ఆ ఆశయసాధనలో తన ప్రాణములను సైతం సమర్పిస్తాడు. అనగా, ఆతడు ఇతరులు క్షేమంగా జీవించే నిమిత్తం తాను మరణించుటకు సంసిద్ధుడై వుంటా డన్నమాట. తన ప్రాణముల నొసగుట ద్వారా ఆతడు ఇతరులతో పాటు తన సంక్షేమాన్నికూడా సాధించుకుంటాడు. సర్వులకూ వర్తించే అభ్యుదయంలో అధికతమ సంఖ్యాకుల సంక్షేమంకూడా తప్పనిసరిగా ఇమిడి వున్నందున, ఆతడును ప్రయోజనసిద్ధాంతవాదియు తమ కార్యక్రమంలో చాలా అంశాలలో కలుస్తారు; కానికొంత దూరంపోయాక వారిరువురును చీలిపోవలసిన అవసరమేకాక, పరస్పర భిన్నమార్గములను అనుసరించవలసిన అవసరంకూడా ఏర్పడుతోంది. ప్రయోజనవాది (utilitarian) తన హేతు విధానం ప్రకారం ఎన్నడూ తన ప్రాణాన్ని త్యజించడానికి సంసిద్ధం కాడు. కేవలవాది (Absolutist) ప్రాణత్యాగ మైనా సరే చేస్తాడు.

యంగిండియా, 9-12-'26.

ప్రేమభావమున లేక అహింసాభావమున వేరు పాతుకునివుంటే తప్ప సేవాచరణం సాధ్యంకాదు. నిజమైన ప్రేమ భావం సముద్రమువలె అంతులేనిదై, అంతరంగమున పొంగి పొర్లి బయలువడి, సర్వవిధములైన సరిహద్దులను పొలిమేరలను దాటి, యావత్ప్రపంచాన్ని ముంచెత్త గలుగుతుంది. ఈ సేవాచరణ మనునది, ఆ గీతావాక్యమందు యజ్ఞముగా

వర్ణితమైన భుక్తిశ్రమ సూత్రము నవలంబించిన గాని సాధ్యం కాదు. పురుషుడుగాని, స్త్రీగాని సేవాపూర్వకమైన కాయకష్ట మొనర్చినప్పుడే బ్రతికే హక్కును ఆర్జించుకున్నవా రౌతారు.

యంగిండియా, 20-9-'28.

మనము సంపూర్ణమైన అహంకారశూన్యతను అలవరచుకుంటే తప్ప మనలోని చెడుగును జయించలేము. పొందదగినదియు, సత్యమైనదియు, కేవలమైనదియునగు స్వాతంత్ర్యమునకు మూల్యముగా పరమేశ్వరుడు కేవలమును పరిపూర్ణమునునగు ఆత్మసమర్పణమును కోరుతాడు. అట్టి ఆత్మసమర్పణము నొనర్చిన మానవుడు, ఆ వెనువెంటనే తానొనర్చు యావజ్జీవకోటియొక్క సేవాచరణంద్వారా, తిరిగి తన ఆత్మస్వరూపమును దర్శింపగల్గుతాడు. అదే ఆతని ఆనందముగా, ఆటగా పరిణమిస్తుంది. ఆతడిక పరమేశ్వరసృష్టికి సేవచేయుటలో విరతి విరామము నెరుగని నవజీవనమును పొందినవాడౌతాడు.

యంగిండియా, 20-12-'28.

మనయొక్క సర్వకర్మలును సత్యమునందు కేంద్రీకృతములు కావాలి. సత్యము మనం ఎల్లప్పుడూ పీల్చే ప్రాణవాయువుతో సమానం కావాలి. అన్వేషకుని ఆదర్శమార్గంలో ఒకసారి ఈ ఘట్టం చేరుకున్నయెడల, ఇక క్రమబద్ధ జీవితముయొక్క ఇతర నిబంధనలన్నీ సులభసాధ్యములౌతాయి; వాటి అనుసరణమిక స్వాభావికమైపోతుంది. కాని,

సత్యము లేనిచో, జీవితంలో ఏవిధమగు సూత్రనిబంధనల ననుసరించుటగాని సాధ్యంకాదు.

యెరవ్డామందిర్ నుంచి, అధ్యాయం 1

సత్యాన్వేషియు, ప్రేమధర్మావలంబకుడును అగు నాకు రేపటినిమిత్తం ఏమీ మిగుల్చుకొనుటకు వీలుకాదు. దేవుడు రేపటికోసమని ఏమీ ఏర్పాటుచేయడు. దైనందినావసరాలకు కేవలం అవసరమైన దానికిమించి పరమేశ్వరుడెప్పుడూ సృష్టిచేయడు. మనమూ ఈశ్వరప్రసాదమున విశ్వాసము గలవారమైతే, ఆతడు దినదినమును మనకు కావలసినపాటి భుక్తిని చేకూర్చగలడనే నమ్మకంపై ఆధారపడగలిగి వుండాలి.

యంగిండియా, 4-9-'30.

ఫలితములు, సాధనములు : (Ends & Means)

"ఎన్ని చెప్పినా సాధనములు సాధనములేగదా" అని కొందరంటారు. "ఎన్ని చెప్పినా సాధనములే గదా సర్వమూ" అని నేనంటాను. సాధనము లెట్టివైతే ఫలితము లట్టివౌతాయి. సాధనములను, ఫలితములను వేరుపరిచే అడ్డుగోడ ఏమీలేదు. నిజానికి, సృష్టికర్త మనకు సాధనములపైన కొంతపాటి (అది కూడా చాలా పరిమితంగానే) అధికారం ఒసగివున్నాడు; ఫలితములపై ఏ మాత్రమును ఒసగివుండలేదు. సాధనము లెంతపాటివైతే గమ్యప్రాప్తి కూడా అంతపాటిగానే వుంటుంది. ఇది నిషేధమున (Exception) కేమాత్రమూ ఎడమీయని ప్రతిపాదనము.

యంగిండియా, 17-7-'24.

దాక్షిణ్యయుతమైన సాధనములు దాక్షిణ్యయుతమైన స్వారాజ్యమునే ఇస్తాయి. అది ప్రపంచానికే కాక, భారత దేశానికే చేటవుతుంది.

యంగిండియా, 17-7-'24.

కలుషములైన సాధనములు కలుషమైన ఫలితమునే ఒసగగల్గుతాయి. అందువల్ల రాజుయొక్క శిరచ్ఛేదనంవల్ల రాజూ, రైతూ సమానం కాజాలరు; అట్లే ఈ ఛేదన విధానంద్వారా యజమానీ, కార్మికుడూ కూడా సమానం కాలేరు. అసత్యాచరణం ద్వారా ఎవరుగాని సత్యాన్ని చేరు కోలేరు. ఇక అహింస, సత్యము కవలపిల్లలవంటివా?, అని ప్రశ్నిస్తే, "కాద"ని నేను జవాబిస్తాను. అహింస సత్యము లోను, సత్యము అహింసలోను అంతర్గర్భితమై వుంటాయి. కావుననే అవి ఒకే ఒక నాణెముయొక్క రెండుముఖములుగా వర్ణింపబడ్డాయి. అవి ఒకదానినుంచి ఇంకొకటి వేరుపరుప రానివి. ఆ నాణెమును ఏ వైపునుంచి చదివినా చదువ వచ్చును. మాటలవర్ణక్రమం భేదిస్తుందేగాని, విలువఒకటే. సంపూర్ణమైన నిష్కలుషభావం లేనిదే ఈ ఉత్కృష్టస్థితి సిద్ధింపనేరదు. మనోదేహములలో ఏమాత్రం కలుషతకు ఎడమిచ్చినా, నీలో అసత్యము, హింస మిగిలివున్నట్లే.

అందువల్ల కేవలం సత్యవ్రతులు, అహింసాపరులు, నిష్కల్మష హృదయులు అగు సమాజవాదులుమాత్రమే భారతదేశంలోగాని, ప్రపంచంలో మరెక్కడగాని సమాజ వాది సంఘనిర్మాణమును చేయగలుగుతారు.

హరిజన్, 13-7-'47.

అధ్యాయం ౧౬

ధర్మకర్తృత్వ సిద్ధాంతం

వారసత్వరీత్యానో లేక వ్యాపారమువల్లనో, పరిశ్రమల వల్లనో నాకు తగినంత సంపత్తి లభ్యమయిందని ఊహిద్దాం. అప్పుడు అది అంతా కేవలం నాకు ఒక్కనికీ చెందినదిగా భావించక, గౌరవమైన జీవనోపాధికి సరిపోవుపాటి, అనగా లక్షలాదిగా వున్న ప్రజాసామాన్యము అనుభవిస్తూవున్న పాటి, మాత్రమే నాదిగా ఎంచుకొనవలయునని తెలియాలి. నా సంపత్తిలో మిగిలినదంతా సంఘానికి చెందుతుంది కనుక, అది సంఘసంక్షేమానికి వినియుక్తం కావాలి. జమీందార్ల యొక్కయు, సంస్థానాధీశుల యొక్కయు వశమునందున్న ఆస్తులవిషయంలో సమాజవాద సిద్ధాంతాన్ని దేశంముందు ప్రతిపాదించిన సమయంలో నేను ఈసిద్ధాంతాన్ని నిర్వచించి వున్నాను. వారు ఈ ఉచ్ఛవర్గాలను పీకివేయవలెనని ఉద్ఘాటిస్తారు. నేను ఆ వర్గాలవారు తమయొక్క లోభగుణాన్ని విసర్జించి, తమ కెంత సంపత్తివున్నాగాని, కాయకష్టపడి భుక్తి నార్జించుకునేవారియొక్క తాహతుకి దిగి రావాలని వాంఛిస్తాను. శ్రామికులకు తమ సంపత్తిపై, అనగా తమ శ్రామికశక్తిపై, ఉన్న అధికారంకంటె శ్రీమంతులకు తమ సంపదలపై ఉన్న అధికారం తక్కువన్న సంగతి శ్రామికులు గ్రహించాలి.

ఈ నిర్వచనం ప్రకారం ఎంతమంది నిజమైన ధర్మకర్తలుగా వర్తించగలరనే ప్రశ్న ప్రస్తుత విషయంకాదు. సిద్ధాంతం సరియైనదైతే, దానిని తగినవిధంగా ఆచరణలో పెట్టేవారు చాలామంది వున్నా, ఒక్కరేవున్నా ఫరవాలేదు. అది హేతుబుద్ధికి అంగీకృతమా కాదా అన్నది ముఖ్యవిషయం; అహింసాసూత్రాన్ని అంగీకరించిననాడు, అది నెగ్గినా, ఓడినా నీవు దానిని ఆచరించుటకు కృషి చేయవలసిందే. ఈ సిద్ధాంతం ఆచరణకు కష్టసాధ్యమైనదని అంటే అనవచ్చునేమోగాని, ధీశక్తికి దురవగాహమైనదని మాత్రం అనడానికి వీలులేదు.

హారిజన్. 3-6-'39.

ధర్మకర్తృత్వమనేది న్యాయశాస్త్రసంబంధమైన ఒక కల్పన అని మీరభిప్రాయపడవచ్చు. అయితే ఆ భావాన్ని గురించి మీరు మనన మొనర్చి, దానిని ఆచరింప యత్నించినచో, ఈభూతలంలో మానవజీవితము ఇప్పటికంటె ఎక్కువగా ప్రేమభావపరిపాలితమై నడుస్తుంది. కేవల ధర్మకర్తృత్వమనేది గణితజ్ఞుడైన యూక్లిడ్ యొక్క బిందునిర్వచనమువలె ఊహాసాధ్యమైనదే గాని, క్రియాసాధ్యమైనది కాదు. కాని మన మా ఆదర్శనముకై కృషిచేయుటద్వారా సమానత్వస్థితిని సాధించుటలో, మరే పద్ధతివల్లను వీలుకానంత ఎక్కువగా మనం పురోగమనం చేయుగల్గుతాం ... ... ప్రభుత్వం పెట్టుబడిదారీపద్ధతిని దౌర్జన్యశక్తితో అణగద్రొ

క్కిన మొదల, తానుకూడా ఆ దౌర్జన్యవలయంలో చిక్కు కొనిపోయి, ఇక ఏనాటికీ అహింసావిధానమును అనుసరింప లేకపోతుందని నా గట్టినమ్మకం. ప్రభుత్వమనేది సుసంఘటితమూ, కేంద్రీకృతమూ అయిన దౌర్జన్యశక్తికి చిహ్నం. వ్యక్తికి ఆత్మ వున్నందున ఆతడు తన దౌర్జన్యపద్ధతినిమార్చుకొనుటకు వీలుంది. కాని ప్రభుత్వం ఆత్మరహితమైన యంత్రంవంటి దగుటచేత, దాని ఉనికికి మూలాధారమైన దౌర్జన్యవిధానమునుంచి ఎన్నడుగాని మరల్చబడడ మనేది అసాధ్యం; అందువల్ల నేను ధర్మకర్తృత్వ పద్ధతినే ఉత్తమ మార్గంగా భావిస్తాను. తనతో భిన్నాభిప్రాయంగలవారిపై ప్రభుత్వం అపరిమితమైన దౌర్జన్యప్రయోగం చేయగలదనే భయానికి ఎప్పుడూ అవకాశంవుంది. ఆస్తిపరులైనవారు ధర్మకర్తలుగా వర్తింపదలిస్తే నేను చాలా సంతోషిస్తాను, కాని వారట్లు చేయనిపక్షంలో వారి ఆస్తులను ప్రభుత్వశక్తి ద్వారా సాధ్యమైనంత తక్కువ దౌర్జన్యప్రయోగంతో వశపరచుకొనవలసి వుంటుందని తలుస్తాను... (అందువల్లనే నేను రౌండుటేబిలు సమావేశంలో స్థిరభుక్తమైన ఆస్తులను, వ్యాపారాలను గురించి పరిశీలన జరుపవలసివుంటుందనిన్నీ, ఆయా సందర్భాన్నిబట్టి ముజరాయిచ్చిగాని, యివ్వనక్కర లేకుండాగాని అవసరమైన సందర్భాలలో ఆయా ఆస్తులను, వ్యాపారములను ప్రభుత్వవశమొనర్చుకొనుటకు ఉత్తర్వులు జారీచేయవలసివుంటుందనిన్నీ చెప్పివున్నాను.) ప్రభుత్వ గతంగా అధికారాన్ని కేంద్రీకరించుటకంటె ధర్మకర్తృత్వ

సూత్రమును విస్తృతవ్యాప్తం చేయడం ఎక్కువ మంచిదని నా వ్యక్తిగతాభిప్రాయం. ఏమనగా నా అభిప్రాయంలో వ్యక్తిగతఆస్థిపరుల దౌర్జన్యశక్తి ప్రభుత్వదౌర్జన్య ప్రయోగం కంటె తక్కువ హానికరమైనది. అయినా, తప్పనిసరిఅయితే, కనీసపరిమితిలో జరిగే ప్రభుత్వయాజమాన్య విధానాన్ని నేను బలపరుస్తాను.

ది మోడరన్ రివ్యూ, 1935, పే. 412.

అహింసాత్మకమైన సూత్రాలపై సంఘనిర్మాణం అసాధ్యమని వాదించడం ఈ రోజులలో మామూలైపోయింది. ఆ వాదనతో నేనూ కలిసివస్తాను. ఒక కుటుంబంలో ఒక తండ్రి తప్పుచేసిన తన బిడ్డను లెంపలు వాయిస్తే, ఆ బిడ్డ తిరగబడవలెనని తలచనే తలచడు. ఆ బిడ్డ తండ్రికి చూపే విధేయత ఆ లెంపపెట్టుయొక్క ప్రభావం వల్లకాదు, దానికి వెనక తన యెడల తన తండ్రికిగల ప్రేమ దెబ్బతిన్నదని గ్రహించుటవల్లనే. సంఘం ఏ రీతిగా పరిపాలితం కావలెనో, దానికి ఇది ఒక చిన్న ఉదాహరణముగా ఉపకరించగలదని నా అభిప్రాయం. కుటుంబ విషయంలో ఏది నిజమో అది విస్తృతకుటుంబమైన సంఘం విషయంలోనున్నూ నిజమే అవుతుంది.

హరిజన్, 3-12-'38.

దౌర్జన్యరాహిత్యమనేది కేవలం ఒక వ్యక్తిపరమైన సుగుణం మాత్రమేకాదు. సాంఘికమైన ఇతర సుగణములతోపాటు ఇది కూడా అలవరచుకొనదగిన ఒక సాంఘిక

సుగుణం. సంఘంలో పరస్పర వ్యవహారసంబంధాలు చాలా వరకు దౌర్జన్యరహిత ప్రవర్తనమీదనే ఆధారపడి నడుస్తూ వుంటాయి. నేను కోరేదల్లా ఆ విధానాన్ని ఇంకా విస్తృతంగా జాతీయమూ, అంతర్జాతీయమూ అయిన స్థాయిలో వర్తింపజేయవలెనని మాత్రమే.

హరిజన్, 7-1-'39.

నేను ప్రతిపాదించే ధర్మకర్తృత్వసూత్రం తాత్కాలిక ప్రయోజనానికిగాని ఉద్దేశింపబడినదికాదు ; అసలు ఉద్దేశము దాచిపెట్టు ఆచ్ఛాదనమువంటిది అంతకంటే కాదు. ఇది ఇతర సిద్ధాంతము లన్నింటికంటెను శాశ్వతంగా నిలువగల సిద్ధాంతమని నేను నిస్సందేహంగా చెప్పగలను. మతము, వేదాంతము కూడా దీనిని బలపరుస్తాయి. ధనవంతులైనవారంతా దీనిని అనుసరించుట లేదంటే అది వారి దౌర్బల్యమును తెల్పుతుందేగాని, ఈ సిద్ధాంతము తప్పని ఋజువుచేయదు. ఇది తప్ప మరే సిద్ధాంతమును దౌర్జన్య రాహిత్యవిధానానికి అనుగుణంకాదు. దౌర్జన్యరహిత విధానానుసారం తప్పు చేసేవాడు తన తప్పును దిద్దుకొననిచో, తన అంతాన్ని తానే తెచ్చుకుంటాడు. ఏమనగా, దౌర్జన్య రహిత సహాయనిరాకరణంద్వారా ఆతడు తన తప్పును తాను తెలుసుకొనునట్లు చేయబడతాడు ; లేనిచో, ఆతడు కేవలం ఒంటరిగాడై పోవలసివుంటుంది.

హరిజన్, 16-12-'39.

సాధారణంగా ధనికులైనవారు, ఆ మాటకువస్తే లోకంలో చాలామంది, డబ్బు సంపాదించే విషయంలో తామవలంబించే పద్ధతులయొక్క మంచిచెడ్డలను గురించి పట్టించుకోనరనే అభిప్రాయాన్ని నేను కూడా బలపరుస్తాను. అహింసావిధానప్రయోగంలో ఏ వ్యక్తి అయినాగాని, ఎంత అవినీతిపరుడైనాగాని, మనం దయాపూర్వకంగానూ కుశలతతోనూ వ్యవహరించడం మూలంగా సంస్కరింప బడగలడనే నమ్మకం కలిగివుండడం అవసరం. మనుష్యులలోని మంచి తనమును మనము ప్రేరేపించి, వారినుంచి దానికి అనుకూల మైన ప్రవర్తనను ఆసించాలి. సంఘంలోని ప్రతి సభ్యుడూ తన బుద్ధికుశలతను స్వార్థలాభానికిగాక, సర్వజనసంక్షేమ సాధనకు వినియుక్తం చేయడం అనేది సంఘశ్రేయోభివృద్ధికి అనుకూలమైన విషయం కాదా? ప్రతివ్యక్తీ తన శక్తిసామ ర్థ్యములను తనకు సాధ్యమైనంత సంపూర్ణరూపంలో ఉపయో గించడానికి అవకాశమొసగని, అట్టి శక్తిని పెంపొందించని, నిర్జీవమైన సరిసమానతను సృష్టించడం కాదు మన ఆశయం. అట్టి సంఘం తుదిని జడమై నశిస్తుంది. అందువల్ల, ధనికు లైనవారిని తమ కోట్లధనమును (న్యాయసమ్మత పద్ధతుల పైననే), సర్వజనాభ్యుదయానికి దానిని అంకితమొనర్చే ఆశయంతో, ఆర్జించనీయవచ్చుననే ప్రతిపాదనలో తప్పేమీ లేదని నా సూచన. "తేన త్యక్తేన భుంజీథాః" అనే ఉపమ న్మంత్రము అసాధారణమైన పరిజ్ఞానాన్ని అభివ్యక్తం

చేస్తుంది. ప్రతి వ్యక్తీ తన ప్రక్కవాడు ఏమైనాసరే అనే స్వార్థభావంతో జీవించే ప్రస్తుత ప్రపంచవిధానమునకు బదులుగా విశ్వజనీనమైన సంక్షేమాన్ని చేకూర్చగల నూతన విధానాన్ని పరిణతమొనర్చ వలెనంటే, అదొక్కటే నిశ్చితమైన మార్గం.

హారిజన్, 1-2-'42.

అధ్యాయం ౧౫

అహింసాత్మకమైన ఆర్థిక విధానం

మనమందరం ఒకవిధంగా దొంగలమే అని నా సూచన. నాకు వెంటనే అవసరంలేని దేనినిగాని సంపాదించి వుంచుకున్న యెడల, నేను దానిని ఇంకెవరో ఒకనినుంచి దొంగిలించినట్లే. ప్రకృతిమాత మనయొక్క దైనందినావసరములకు సరిపోయే మాత్రంగానే ఫలసాయ మొసగుతూ వుంటుందనేమాట సార్వత్రికమూ, ప్రాథమికమూ అయిన ప్రకృతి సూత్రం. అందులో ప్రతివారూ కేవలం తమకు కావలసినపాటి మాత్రమే తీసుకుంటూవుంటే, లోకంలో దారిద్ర్యం అనేది వుండనే వుండదు; తిండిలేక ఎవ్వరూ చావనవసరం వుండదు. నేను సమాజవాది పక్షానికి చెదినవాణ్ణికాదు, కలవారి ఆస్తులను బలాత్కారంగా ఊడలాగుకొనగోరను, కాని మనలో ఎవరుగాని వ్యక్తిగతంగా అంధకారంలో వెలుగును చూడగోరితే వారు ఈ సూత్రము నను

సరింపవలసి వుంటుందని మాత్రం గట్టిగా చెప్పగలను. నేను ఎవరినీ నిరాస్తిపరులుగా చేయబూనను; అట్లు చేయబూని నచో నా అహింసాధర్మమును వదులుకొనవలసి వుంటుంది. ఎవరికైనా నా కంటె ఎక్కువ ఆస్తి వుంటే వుండనీ. కానీ నా జీవిత విధానమునకు సంబంధించినంతవరకు, నాకు అవసరంలేని దానిని దేనినిగాని నేను వుంచుకొనుటకు సాహసించను. మన భారతదేశంలో ప్రతిరోజూ ఏకభోజనంతో తృప్తులు కావలసినవారు లక్షలాది జనం వున్నారు; అదైనా ఇంత నూనె పదార్థంగాని, ఉప్పుపిసరుగాని లేని చప్పిడి చపాతీ భోజనమే. ఈ లక్షలాది జనానికి తిండీ బట్టా లభ్యమగువరకు, మీకు నాకు గాని మనం ప్రస్తుతం కలిగి వున్న ఏ ఆస్తిపాస్తుల యెడలగాని నిజమైన హక్కు లేదు. జ్ఞానవంతులైన మీరుగాని నేనుగాని, వారంతా పోషణ, తిండి, బట్ట పొందేవరకు, మన అవసరములను తగ్గించుకుని, బుద్ధిపూర్వకమైన పేదరికమును అనుభవించుటకై నా సరే సంసిద్ధులం కావలసివున్నది.

మహాత్మా గాంధీ ప్రసంగాలు, రచనలు; పే. 384.

నైతిక శాస్త్రమూ ఆర్థిక శాస్త్రమూ పరస్పర భిన్నములనిగాని, అసలు వాటిమధ్య ఏవిధమైన భిన్నతగాని వున్నదనిగాని, నేను భావించనని చెప్పవలసివున్నది. ఒక వ్యక్తియొక్కగాని ఒక జాతియొక్కగాని నైతిక సంక్షేమానికి హానికరమైన ఆర్థిక శాస్త్రము అవినీతికరమైనది; అందువలన అది పాపభూయిష్టమైనదిగా భావించబడవలసి వుం

టుంది. దీనినిబట్టి, ఒకదేశం మరొక దేశాన్ని కొల్లగొట్టుకు తినడాన్ని అనుమతించే ఆర్థిక శాస్త్రం అవినీతికరమైన దవుతుంది. శ్రామికులచేత చెమట ఓడ్పించి తయారు చేయ బడిన వస్తువులను కొనుటగాని, వాడుకొనుటకుగాని పాపకార్య మవుతుంది.

యంగిండియా, 13-10-'21.

నా అభిప్రాయ ప్రకారం భారత దేశ రాజ్యాంగ ప్రణా ళికగాని, ప్రపంచ పాలనా ప్రణాళికగాని, ఏతద్రక్షణలోవున్న ప్రతిఒక్కరికీ అన్నవస్త్రాలకు లోటులేకుండా చేయుటకు అనుగుణంగా వుండవలెనని నా అభిప్రాయం. అనగా, శ్రమాఫలితంగా మామూలు అవసరాలను పొందుటకు తగిన పాటి ఆర్జించుకొనే అవకాశం అందరికీ లభ్యంకావాలి. మామూలు అవసరాలను తయారుచేసే ఉత్పత్తి సాధనములు ప్రజాసామాన్యంయొక్క అధీనంలో వున్నప్పుడే, ఈ ఆదర్శ మును విశ్వవ్యాప్తంగా ప్రయోగించుటకు వీలౌతుంది. దేవు డిచ్చే గాలీ వెల్తురూ అందరికీ ఎంత సులభంగా లభ్య మౌతవో, లేక లభ్యం కావలసినవో, అంత సులభసాధ్యంగా మామూలు జీవితావసర వస్తువులు ప్రజలకు లభ్యంకావలసి వుంటుంద; అవి ఇతరులను పిండి లాభములను సేకరించు కొనే వ్యాపార వాహనములు కారాదు. వాటిని ఒకదేశం గాని, ఒక జాతిగాని, ఒక కూటంగాని తమ ఒక్కరి వశం లోనే వుంచుకొనడ మనేది అన్యాయ విధాన మనిపించు కుంటుంది. మన దౌర్భాగ్య భూమిలోనేకాక, ప్రపంచ

మందలి ఇతర ప్రాంతములలోకూడా, ఈ అల్పమైన సూత్రముపట్ల చూపబడిన అశ్రద్ధయే మనం నేడు సర్వత్రా చూచే దారిద్ర్యస్థితికి మూలకారణం.

యంగిండియా, 15-11-'28.

నిజమైన నైతికశాస్త్రం, తనపేరు సార్థకమొనర్చుకొనవలెనంటే, మంచి ఆర్థికవిధానానికి మూలకందం కావలసివున్నరీతినే, నిజమైన ఆర్థికశాస్త్రం కూడా ఎన్నడూ ఉత్కృష్ట నైతికసూత్రాలకు విరుద్ధమైనదిగా వుండదు. ధనపిశాచారాధనమును నేర్పి, దుర్బలులను దోచుకొని బలవంతులు ధనవంతులగుటకు సహకరించు ఆర్థికశాస్త్రము అసత్యపూరితమూ, అంధకారావృతమూ అయినశాస్త్రమవుతుంది. అది మృత్యుకారకమైనది. నిజమైన ఆర్థికశాస్త్రం అట్లుకాకుండా, సాంఘిక న్యాయసూత్రాలపై ఆధారపడి వుంటుంది. అది దుర్బలాతి దుర్బలులతో సహా సర్వులకూ సంక్షేమజనకమై, గౌరవప్రదమైన జీవితవిధానానికి పునాదిగా వర్తిస్తుంది.

హరిజన్. 9-10-'37.

నేను తాహతుల సమానత్వమును చేకూర్చగోరుతాను. ఇన్ని యుగాలనుంచీ శ్రామికవర్గములకు చెందినవారు వేరుపరచబడి, అధమతరగతిగా పరిగణింపబడి వున్నారు. వారు 'శూద్రు' లని పిలువబడి, ఆ పేరు తక్కువ తాహతుకు చిహ్నంగా పాటించబడివున్నది. ఒక సాలివాని కొడుకునకు,

ఒక వ్యవసాయదారుని కొడుకునకు, ఒక ఉపాధ్యాయుని కొడుకునకు, మధ్య ఏ విధమైన తాహతు తేడాలనుగాని నేననుమతించను.

హరిజన్, 15-1-'38.

దౌర్జన్యరహితమైన స్వాతంత్ర్యానికి ఆర్థికసమానత్వం అమూల్యసాధనం. ఆర్థికసమానతకు కృషి చేయడమంటే పెట్టుబడికీ శ్రమకూ మధ్యగల నిరంతర సంఘర్షణకు స్వస్తి చెప్పడమన్నమాట. అనగా, ఒక దిక్కున, దేశసంపత్తిలో హెచ్చుభాగం తమ చేతులలో కేంద్రీకృతమై వున్నటువంటి కొలదిమంది ధనికవర్గీయులను క్రిందికి దింపడమున్నూ, మరొకవంక అర్ధాకలితో, చింకిపాతలతో బ్రతికే లక్షలాది ప్రజాసామాన్యమును పైకిలేవనెత్తడమున్నూ అని అర్థం. ధనికవర్గానికీ ఆకొన్న ప్రజానీకానికీ మధ్య ఏర్పడివున్న అగాధమును తొలగించినగాని దౌర్జన్యరహితమైన ప్రభుత్వ విధానం సాధ్యపడదు. స్వతంత్రభారతంలో పేదవారికి కోటీశ్వరులతో సమానమైన హక్కు లేర్పడిననాడు క్రొత్తఢిల్లీ నగరపు దివ్యభవనములకు, పేదకార్మికులు నివసించే దుర్భర కొటారములకుగల అగాధసదృశమైన తేడా ఒక్కరోజైనా నిలువజాలదు. శ్రీమంతులు తమ స్వీయధనసంపదలను, తద్వారా కలిగే అధికారబలమును ఇష్టపూర్తిగా వదలుకొని, వాటిని సర్వులయొక్క సమానాభ్యుదయానికి వినియుక్తం చేయని పక్షంలో, ఏదో ఒకనాడు దౌర్జన్యయుతమైన విప్లవమూ రక్తపాతమూ జరుగక తప్పదు. ఎవరెంత హేళన

చేసినాగాని, నేను నా ధర్మకర్తృత్వ సిద్ధాంతమునే విశ్వసిస్తాను. ఆ ఆదర్శమును ఆచరణలోకి తేవడం కష్టసాధ్యం కావచ్చును. అహింసా సిద్ధాంతాచరణం కూడా అంతకంటె ఏమీ సులభసాధ్యం కాదు. అయినా ఆ శిఖరము నారోహించుటకు మనం 1920 లో మనోనిశ్చయం చేసుకుని వున్నాము.

కన్‌స్ట్రక్టివ్ ప్రోగ్రాం, పే 20-21.

భారతదేశం దౌర్జన్యరహిత మార్గంలో పరిణతి పొందవలెనంటే చాలా విషయాలలో వికేంద్రీకరణ విధానాన్ని అనుసరించవలసి వుంటుందని నా సూచన. తగినంత దౌర్జన్య ప్రయోగశక్తి లేనిదే కేంద్రీకరణ విధానం నిలబడదు. ఎత్తుకుపోవుట కేమీలేని సామాన్య గృహాలకు రక్షక బలసహాయం అవసరముండదు; ధనికుల మేడ మిద్దెలను దోపిడీదార్లనుంచి కాపాడే నిమిత్తం బలమైన రక్షక దళం అవసరమౌతుంది. బ్రహ్మాండమైన కర్మాగారాల విషయమూ అంతే. సైనిక, నౌకా, విమానదళ సన్నద్ధమైన నగరాధారమైన భారతదేశం కంటె గ్రామపరంగా సంఘటితమైన భారతదేశానికి వైదేశిక దండయాత్రల వలన భయంగాని, హానిగాని తక్కువగా వుంటుంది.

హారిజన్, 30-12-'39.

ఈనాడు అత్యధికమైన ఆర్థిక అసమానత ఏర్పడి వున్నది. సమాజ వాదానికి పునాది ఆర్థిక సమానత్వం.

కొలదిమంది ధనసంపదలతో తులతూగుతూ, అధిక సంఖ్యాకులైన ప్రజాబాహుళ్యానికి తగినపాటి తిండికైనా గతిలేని ఈ న్యాయవిరుద్ధమైన అసమానత ఉన్నంతవరకు రామరాజ్య స్థాపనమనేది అసాధ్యం.

హరిజన్, 1-6-'47.

అధ్యాయం ౧౮

సమాన విభజన విధానం

ప్రతివ్యక్తీ కేవలం తనయొక్క సహజావసరాలను తీర్చుకొనుటకు కావలసినపాటి సంపత్తిని మాత్రమే కలిగి వుండడమనేది అనునదే సమాన విభజన సూత్రమునకు నిజమైన అర్థం. ఉదాహరణకు, దుర్బలమైన జీర్ణశక్తిగల ఒక వ్యక్తికి రొట్టె చేసికొనుటకు పాతికపౌను పిండి అవసరమై, వేరొకనికి పౌను పిండి అవసరమైతే, ఆ ఇరువురూ కూడా తమతమ అవసరమును తీర్చుకొనుటకు తగిన స్థితిలో వుండాలన్నమాట. ఈ ఆదర్శాన్ని అమలులోకి తేవలెనంటే సంఘవ్యవస్థను సంపూర్ణంగా పునర్నిర్మితం చేయవలసి వుంటుంది. అహింసాత్మకమైన సంఘనిర్మాణం ఇంకే ఆదర్శమునుగాని అనుసరింపజాలదు. మనము సంపూర్ణమైన గమ్యసిద్ధిని పొందజాలక పోయినను, దానినే మనసులో వుంచుకొని, దానికి చేరువగుటకు నిరంతరకృషి సల్పుతూనే వుండాలి. మన గమ్యము దిక్కుగా మనమెంత ముందుకుపోతే అంత సుఖ

సంతృప్తులను మనం పొందగల్గుతాం; అంతవరకు అహిం సాత్మక సంఘనిర్మితికి మనం తోడ్పడినవారిమాతాం.

ఏ ఒక్క వ్యక్తిగాని, ఇతరులకోసం ఆగనవసరం లేకుండా, ఈ జీవితవిధానాన్ని ఆచరణలో పెట్టగలగడం పూర్తిగా సాధ్యమైన పని. ఒకవ్యక్తి ఒకానొక సూత్రం ప్రకారం జీవించగల్గితే, కొందరు వ్యక్తులతోకూడిన సంఘం కూడా దానిని అనుసరించగలదని నిరూపితమవుతుంది.

మంచిదారిని త్రొక్కుటకు ఎవరుగాని ఇతరుల నిమిత్తం ఆగనక్కరలేదన్న విషయమును నేను తిరిగి నొక్కి చెప్పడం అవసరం. ఆశయం సంపూర్ణంగా సిద్ధించదని తోచినప్పుడు మనుష్యులు సాధారణంగా ముందడుగు వేయుటకు వెనకాడుతారు. అట్టి మనోవైఖరి వాస్తవంగా ప్రగతి నిరోధకమైనది.

ఇక, దౌర్జన్యరహితమైన పద్ధతిని సమాన విభజనాదర్శమును అమలుపరచుట ఎట్లనే విషయమై చర్చిద్దాం. అందుకు ప్రథమసోపాన మేమిటంటే, ఈ ఆదర్శమును తన బ్రతుకులో భాగంగా చేసుకున్నవాడు దానికి అనుగుణమైన రీతిగా తన వ్యక్తిజీవితంలో మార్పులు తెచ్చుకోవాలి. భారతదేశపు దారిద్ర్యస్థితిని మనసులో వుంచుకొని, అతడు తన అవసరాలను వీలైనంతవరకు తగ్గించుకోవాలి. అతని ఆర్జనా విధానములు నిజాయితీని తప్పకూడదు. సాహస వ్యాపారములను చేయుటలో అభిలాషను విసర్జించాలి. అతని నివాసం కూడా ఈ నూతన జీవిత విధానమునకు తగినరీతిగా

సామాన్యమైనదిగా వుండాలి. ప్రతి జీవితరంగలోనూ ఆత్మ నిగ్రహంతో వ్యవహరించాలి. అట్లాతడు తన వ్యక్తిజీవితంలో చేయవలసినదంతా చేసినపిమ్మటనే, ఆత డీ ఆదర్శమును తన తోడివారికిగాని, ఇరుగుపొరుగువారికిగాని బోధించగలస్థితిలో వుంటాడు.

ఈ సమాన విభజన సిద్ధాంతానికి పునాదిగా ధనికుల అదనపు ఆస్తుల విషయికమైన ధర్మకర్తృత్వ సూత్రం వుండి తీరాలి. ఏమంటే, ఈ సిద్ధాంతానుసారంగా వారు తమ ప్రక్కవారికంటె ఒక్కరూపాయి ఎక్కువగా కలిగివుండ రాదు. ఇది ఎట్లా సాధించడం? దౌర్జన్యరహితంగానా? లేక ధనికుల ఆస్తులను బలవంతంగా ఊడలాగి వేయాలా? ఈ పనికి సహజంగా దౌర్జన్య పద్ధతిని అవలంబించవలసి వస్తుంది. ఈ దౌర్జన్య విధానం సంఘానికి శ్రేయస్కరం కాజాలదు. ఈ విధాన ఫలితంగా ధనం కూడబెట్టే చాక చక్యంగల వ్యక్తులను కోల్పోవడం మూలంగా సంఘం నష్ట పోతుంది. అందువల్ల దౌర్జన్యరహిత మార్గమే ఉత్తమమని స్పష్టపడుతుంది. ధనికుని చేతిలోనే ఆతని ఆస్తిపాస్తులు వుండి, దానిలో న్యాయసమ్మతంగా తన కవసరమైనంతపాటి మాత్రమే ఆతడు వాడుకొని, మిగిలినదంతా సంఘసంక్షే మానికి వినియుక్తం చేయుటకుగాను దాని కాతడే ధర్మ కర్తగా వుంటాడు. ఈ వాదన సందర్భంలో ధర్మకర్త యొక్క నిజాయితీని విశ్వసించవలసి వుంటుంది.

ఒకవ్యక్తి తాను సంఘసేవకుడననే భావాన్ని పెంపొందించుకుని, సంఘం నిమిత్తం ఆర్జించుట, సంఘలాభానికి దానిని వినియోగించుట ప్రారంభించిన వెంటనే, ఆతని ఆర్జనా పద్ధతులు నీతివంతమై, ఆతని వ్యాపారములన్నీ అహింసాత్మకము లౌతాయి. అంతేకాక, ప్రజల మనస్సు ఈ విధమైన జీవితపద్ధతి దిక్కుగా మరలినచో, సంఘ పరిస్థితులలో ఒక ప్రశాంత విప్లవం చేకూరుతుంది; అదికూడా పరస్పర ద్వేషభావములకు తావీయకుండా జరిగిపోతుంది.

మానవస్వభావంలో అటువంటి పరివర్తన ఎన్నడుగాని జరిగివున్నట్లు చరిత్రలో ఎక్కడైనా నిదర్శనం కనిపిస్తుందా అని ప్రశ్నించవచ్చును. అటువంటి వర్తన వ్యక్తులలో జరిగివున్నట్లు నిదర్శనములు వున్నాయి. ఒక సంఘమొత్తంలో అట్టి మార్పులు జరిగివున్నట్లు చూపడం బహుశా కష్టం కావచ్చు. అయితే, దీనినిబట్టి యింతవరకు ఎప్పుడూ విస్తృతస్థాయిని అహింసావిధాన ప్రయోగం జరిగి వుండలేదని అర్థంచేసుకోవాలి. అహింసావిధానం ప్రధానంగా వ్యక్తిపరమైన సాధనం మాత్రమే అనిన్నీ, కావున అది వ్యక్తి జీవితరంగానికే పరిమితమై వుండవలెననిన్నీ ఒక అపోహలో పడివున్నాం మనమంతా. వాస్తవంగా ఆలోచిస్తే ఇది నిజంకాదు. అహింసాత్మకత తప్పకుండా సంఘంయొక్క ధార్మికగుణములలో ఒకటి. ఈ విషయం ప్రజలకు నచ్చచెప్పడమే నేను చేస్తున్న కృషికిని, ప్రయోగములకును పరమార్థం. అద్భుతాలకు ఆలవాలమైన ఈ యుగంలో ఒక

పనిగాని, ఒక భావంగాని క్రొత్తది కనక, అది పనికిరానిదని ఎవ్వరూ అనడానికి వీలులేదు. ఒక విషయం కష్టంకనక అది అసాధ్యమని అనడం కూడా యుగధర్మానికి విరుద్ధమైనదిగా వుంటుంది. కలలోనైనా కనివిని యెరగని వింతలూ విశేషాలూ మన కళ్లముందర జరుగుతున్నాయి; అసాధ్యమనుకొన్నవన్నీ చూస్తుండగా, సాధ్యమైపోతున్నాయి. దౌర్జన్యరంగంలో మనలను విభ్రాంతిలో ముంచే అద్భుతమైన క్రొత్త సాధనాలు ప్రతిదినమూ కనిపెట్టబడుతూవున్నవి. కాని ఇకముందు అహింసారంగంలో కలలోనైనా కనివిని యెరగనివీ, ఇంతవరకు అసాధ్యమనుకున్నవీ అయిన నూతన విషయాలు కనిపెట్టబడనున్నవని నేను ఉద్ఘాటించగలను. మతచరిత్రలో అట్టి ఉదాహరణలు ఎన్నయినా కనిపిస్తాయి. సంఘ జీవితంలోనించి మతాన్ని బహిష్కృతంచేయ యత్నించుట ఎన్నటికీ సాగదు. ఒకవేళ అట్టి ప్రయత్నం నెగ్గితే, అంతటితో సంఘం అంతరిస్తుంది. మూఢవిశ్వాసాలూ, దురాచారాలూ మొదలైన లోపాలు యుగయుగం మతంలో ప్రవేశించి తాత్కాలికంగా దానిని కలుషితం చేస్తూవుంటాయి. తిరిగి అవి పోతూ వుంటాయి. విశాలదృష్టినుంచి చూస్తే లోక జీవితానికి మతమే మూలకందమగుటవలన, ఎన్ని లోపాలు వచ్చినా, పోయినా, మతంయొక్క మూలధర్మం చిరస్థాయిగా నిలిచే వుంటుంది. మానవ జీవితం ఈశ్వర శాసనమునకు విధేయమనుటయే మతంయొక్క పరమముఖ్యమైన నిర్వచనం. ఈశ్వరుడన్నా, ఈశ్వర శాసనమన్నా సమా

సార్థకములే అగుటవలన, దేవుడంటే మార్పుపొందని సజీవమైన ధర్మశాసనమని అర్థంచేసుకోవచ్చును. ఎవరూ పరమేశ్వరుని పూర్ణస్వరూపము నెరిగినవారు లేరు. కాని అవతార పురుషులును, ప్రవక్తలును, తమ తపఃప్రభావం వలన, మానవకోటికి ఆ దివ్యశాసనంయొక్క అల్పమాత్రమైన దర్శనమును ఒడగూర్చి వున్నారు.

అయితే మరి ఎంత ప్రయత్నించినా గాని ధనాధిపతులు నిజమైన అర్థంలో పేదలకు ధర్మకర్తలుగా వర్తించని యెడల, పేదలు ఇంకా ఇంకా నలిగి ఆకలిబాధకు బలి అయిపోతూవుంటే, చేయవలసిన దేమిటి? ఈ సమస్యకు పరిష్కారాన్ని అన్వేషించుటలోనే అందుకు అజేయసాధనములైన దౌర్జన్యరహిత సహాయనిరాకరణము శాసనోల్లంఘనము అను ఆయుధములను నేను కనిపెట్టి వున్నాను. సంఘంలోని పేదవర్గాల సహకారం లేనిదే ధనికవర్గాలు ధనార్జన చేయలేరు. తన స్వభావంలో అంతర్గతమైవున్న పశుప్రకృతియొక్క లక్షణమగుటచేత మానవుడు మొదటి నుంచీ దౌర్జన్యవిధానముతో పరిచితి కలిగియే వున్నాడు. ఆతడు చతుష్పాత్తు స్థితినుండి ద్విపాత్తుస్థితికి పెరిగినప్పుడే అహింసావిధానం యొక్క శక్తి ఆతని ఆత్మాంతరములోనికి ప్రవేశించి వున్నది. ఈ విషయమైన జ్ఞానము ఆతని అంతరంగమున నెమ్మదిగా నిశ్చయముగా పరిణతమైనది. ఈ జ్ఞానమే కనుక పేద వర్గములలోనికి ప్రవేశించి, ప్రచారము పొందినచో, వారు శక్తివంతులై, తమకు తిండీ గుడ్డ

లేకుండా చేసిన ఈ దుర్భరమగు అసమానతలనుండి అహింసాత్మకసాధనములవలన విముక్తినొందు మార్గమును తెలిసికొనగల్గుతారు.

హరిజన్, 25-8-'40.

భారతదేశమునకు అవసరమైనది కొలదిమంది చేతులలో దేశంయొక్క మూలధనమంతా కేంద్రీకృతం కావడం కాదు; 1900 మైళ్ల పొడవు, 1500 మైళ్ల వెడల్పు గల్గి విలసిల్లే ఈ భరతఖండంలో అంతర్గతమైవున్న 7½ లక్షల గ్రామాలలోని ప్రజాసామాన్యానికి సులభలభ్యమగు రీతిగా అది పంపకం కావడమనేది అవసరం.

యంగిండియా, 23-3-'21.

అధ్యాయం ౧౯

భారతదేశంలో అహింసా సిద్ధాంతపు పౌరాతన్యం

నేను భారతదేశం ముందర ఈనాడు బహు పురాతన కాలంనుంచీ వస్తూవున్న స్వార్థత్యాగధర్మాన్ని ఆదర్శంగా ప్రతిపాదించుటకు సాహసించాను. ఏమంటే, సత్యాగ్రహము దానికి అనుబంధములైన సహాయనిరాకరణము శాసనోల్లంఘనము అనునవి ఆత్మబాధా సహన సూత్రానికి కేవలం క్రొత్త పేర్లు మాత్రమే. హింసాత్మకత మధ్యంలో అహింసాత్మకతను కనిపెట్టిన మన పూర్వఋషులు న్యూటను శాస్త్రజ్ఞునికంటె అధిక ప్రతిభావంతులు. వారు వెల్లింగ్టను కంటె

ఘనతర యోధాగ్రేసరులు. వారు స్వయంగా శస్త్రాస్త్ర ప్రయోగము నెరిగియుండియు, దాని వ్యర్థతను తెలిసికొని, అలుపుగొన్న లోకానికి ముక్తి దౌర్జన్యరాహిత్యము ద్వారానే గాని దౌర్జన్యముద్వారా సిద్ధింపజాలదని బోధించి యున్నారు. అహింసాత్మకత ఆచరణాప్రయోగంలో బుద్ధిపూర్వకమైన బాధాసహనమని అర్థమిస్తుంది. దుష్కార్యపరునికి అడకువతో శిరసాగ్గుటకాదు దాని అర్థం; సంపూర్ణమైన ఆత్మశక్తితో నిరంకుశునికి ఎదురొడ్డి నిలుచుటయే దాని ఆంతర్యం. మన బ్రతుకునకు మూలకందమైన ఈ సూత్రము ననుసరించినచో, ఒక్క వ్యక్తి, తన మానమును, మతమును, ఆత్మను సంరక్షించుకొనుటకుగాను అధర్మబద్ధమైన ఒక సామ్రాజ్యముయొక్క బలసర్వస్వమునైనను ఎదుర్కొని, ఆ సామ్రాజ్యమురొక్క పతనమునకో లేక పునరుజ్జీవనమునకో పునాది వేయుట సుసాధ్యము కాగలదని చెప్పవచ్చును. కావున, నేను భారతదేశము దుర్బలమగుటచేత అహింసా విధానమును చేపట్టవలసినదిగా ప్రతిపాదించుట లేదు. తన బలమును, శక్తిని తెలిసికొనియే అహింసా సిద్ధాంతమును ఆచరణలో పెట్టవలసినదిగా కోరుతున్నాను. తన శక్తిని తాను తెలియుటకు ఆయుధశిక్షణంతో పనిలేదు. మనం కేవలం మాంసపు ముద్దలమని అనుకుంటేనే మనకు ఆయుధములయొక్క అవసరం కనిపిస్తుంది. తనలో అనశ్వరమగు ఆత్మచైతన్య మొకటున్నదనిన్నీ, అది దైహిక దౌర్బల్యము లన్నిటిని అధిగమించి, ప్రపంచములోని భౌతిక బల

మంతా ఏకమైవచ్చినా దానికి ఎదురొడ్డి నిలవగదనిన్నీ భారతదేశం గ్రహించవలెనని కోరుతాను.

యంగిండియా, 11-8-'20.

భారతీయులు పిరికిజాతికి చెందినవారు కారని తెల్పుటకు భారతదేశమునందలి హిందూ, ముస్లిం, సిక్కు, గూర్ఖా మొదలగు సంఘములకు చెందిన వీరవంశీయుల వ్యక్తిపరమగు ధైర్యసాహసములే గొప్ప తార్కాణం. అయినప్పటికి యుద్ధాభిలాష అనునది భారతభూమికి యింటబుట్టిన సహజస్వభావం కాదనిన్నీ, బహుశా భావిష్యత్ప్రపంచ పరిణతిక్రమంలో భారతదేశమొక ఉత్కృష్టతరమగు పాత్రను నిర్వహించవలసి వున్నదనిన్నీ నా మనవి. ఆయము భవితవ్యమెట్లున్నదీ కాలమే తెల్పగలదు.

యంగిండియా, 22-6-'21'.

యుగయుగములనుంచీ భారతదేశపు పురాతన శిక్షణము, అనగా జనసామాన్యముయొక్క శిక్షణము, హింసాత్మకతకు విరుద్ధమైనదిగా గోచరిస్తుంది. భారతదేశమున మానవస్వభావము పొందివున్న ఉన్నతపరిణతినిబట్టి, ఇచ్చటి ప్రజాబాహుళ్యమునకు దౌర్జన్యవాదం కంటె దౌర్జన్యరాహిత్యసిద్ధాంతమే ఎక్కువ సహజసిద్ధమైనది.

యంగిండియా, 26-1-'22.

భారతదేశం ఎన్నడూగాని ఏ ఇతరదేశము పైకిగాని యుద్ధమునకు దిగివుండలేదు. కేవలం ఆత్మరక్షణార్థం అప్పుడప్పుడు అసంఘటితమో లేక అర్థసంఘటితమో అయిన

ప్రతిఘటనమును మాత్రం ప్రదర్శించి వున్నది. అందువలన ఆమె ప్రత్యేకంగా శాంతికాంక్షను అలవరచుకొనవలసిన పనిలేదు. తెలిసీ, తెలియకుండానూ కూడా ఆ ఆకాంక్ష ఆమెలో జీర్ణించి, అంతర్గతమైపోయివున్నది. ఇతరులు తన సంపదను చేసే దోపిడీని శాంతియుతపద్ధతులపైన విజయవంతముగా ప్రతిఘటించుటయే ఆమె శాంతిస్థాపనకు చేయగల దోహదం. అనగా, ఆమె శాంతిపద్ధతులపై తన స్వాతంత్ర్యమును సంపాదించుకొనవలెనని అర్థం. దీనిని ఆమె సాధించగలిగినచో, అది ప్రపంచశాంతిస్థాపమునకు ఒక దేశము తాను స్వయముగా ఒసగగల్గిన అత్యధిక సహకారముగా పాటించబడగలదు.

యంగిండియా, 4-7-29

అధ్యాయం ౨౦
సర్వోదయ రాజ్యం

అనేకమంది తలలు పంకించి, "అయితే మీరు అహింసావిధానాన్ని జనబాహుళ్యానికి మాత్రం నేర్పలేరు. అది కేవలం వ్యక్తులకు, అందులోనూ అరుదైన వ్యక్తులకు మాత్రమే సాధ్యం" అంటూ వుంటారు. నా అభిప్రాయంలో వారనేది గొప్ప ఆత్మవంచనకరమైన మాట. మానవకోటి స్వాభావికంగా అహింసాత్మకం కానియెడల, చాలాకాలం క్రితమే స్వవినాశనం పాలై వుండేది. హింసాత్మకశక్తులకూ అహింసాత్మక శక్తులకూ మధ్య జరిగే సంఘర్షణలో అహింసా

త్మక శక్తులే ఎల్లప్పుడును తుది విజయం పొందుతూ వచ్చాయి. యదార్థమేమిటంటే, మనం ఎన్నడూ తుది వరకూ ఓపికచూపి, రాజకీయ ప్రయోజనాలకు సాధనంగా అహింసావిధానాన్ని ప్రజానీకంలో హృదయపూర్వంగా ప్రబోధించి వుండలేదు.

యంగిండియా, 2-1-'30.

నా భావంలో రాజకీయాధికారం దానికదే పరమావధి కాదు ; అది అన్నిరంగములలోను ప్రజలు తమ స్థితిగతులను అభివృద్ధిపరచుకొనుటకు ఒక సాధనం మాత్రమే. రాజకీయాధికారమంటే జాతీయ ప్రతినిధులద్వారా జాతీయ జీవితాన్ని సక్రమమార్గంలో నడిపించుకొనే శక్తి నికల్గివుండడ మని అర్థం. జాతీయజీవితం తనంతట అదే సక్రమమార్గాన్ని ఆనుసరించగలిగినంత ఉచ్చపరిణతికి వచ్చినప్పుడు, ప్రాతినిధ్య పాలనం అనవసరం కావచ్చును. అప్పుడది జ్ఞానయుతమైన అరాజకస్థితిగా నిర్వచింప బడుతుంది. అట్టి రాజ్యంలో ప్రతి వ్యక్తి తనకుతానే పరిపాలకు డౌతాడు. ప్రతి వ్యక్తియు తన పొరుగువానికి అడ్డుకాకుండా తన్నుదాను పాలించు కుంటాడు. దీనినిబట్టి ఆదర్శరాజ్యంలో ప్రభుత్వమనేది వుండదని తేలుతుంది కనక, అప్పుడు రాజకీయాధికారమనేది కూడా వుండదు. కాని ఆదర్శమెప్పుడూ జీవితంలో పూర్తిగా వాస్తవరూపం పొందదు. అందువల్ల, "ఏ ప్రభుత్వమైతే తక్కువ పాలిస్తుందో ఆ ప్రభుత్వం ఉత్తమమైనద"ని థోరో భావుకుడు చెప్పిన ప్రసిద్ధ సుభాషితం స్మరణీయమైన వాక్యం.

యంగిండియా, 2-7-31

నా దృష్టికి ప్రభుత్వాధికారం విస్తృతం కావడమనేది భయహేతువుగా తోస్తుంది; కారణం, అది వ్యక్తుల దోపిడీ విధానాన్ని తగ్గించడం ద్వారా లాభం కలిగిస్తున్నట్లు పైకి కనిపించినా, సర్వమానవ పురోగమనానికి మూలకందమైన వ్యక్తిత్వాన్ని చంపడం ద్వారా మానవసంఘానికి అత్యంత హానికరంగా పరిణమించగలదు.

ప్రభుత్వమనే సంస్థ దౌర్జన్యశక్తియొక్క కేంద్రీకృతమూ సుసంఘటితమూ అయిన రూపానికి చిహ్నం. వ్యక్తి ఆత్మసహితుడైతే, ప్రభుత్వమనేది ఆత్మరహితమైన యంత్రసమానం కావడం బట్టి, దాని ఉనికికి పునాదిగా వర్తించే దౌర్జన్యవిధానమునుంచి మరల్చబడడమనేది ఎన్నటికీ సాధ్యంకాదు.

దౌర్జన్యశక్తిమీద ఆధారపడే ప్రభుత్వ సంస్థవంటి సంఘటనలను నేను అనుమతించను. కాని స్వచ్ఛందమైన సంఘటనలు (Oraganisations) తప్పకుండా అవసరమే అంటాను.

ది మోడరన్ రివ్యూ, 1935, పే. 412.

(ఆదర్శసంఘ సంఘటనలో ఏ విధమైన ప్రభుత్వంగాని వుండవచ్చునా, అసలేకూడదా, అనే విషయమై) మనం ఈ నిమిషాన్ని ఈ విషయమై తాపత్రయపడవలసిన పనిలేదని నా అభిప్రాయం. అట్టి సంఘనిర్మాణానికి మనం నిరంతరం కృషి చేస్తూవుంటే, నెమ్మదిగా అది ప్రజలకు పురోభివృద్ధికరమైన

పాటిగా రూపం దాలుస్తుంది. యూక్లిడ్ గణితజ్ఞుడు నిర్వచించిన గీతకి వెడల్పులేదు, దానిని ఇంతవరకూ ఎవరూ గీయగలగలేదు, ఎన్నడూ గీయలేరుకూడా. అయినప్పటికీ ఆ ఆదర్శప్రాయమైన గీతను మనస్సులో ఉంచుకొనడం ద్వారానే రేఖాగణితంలో మనం ఇంతవరకూ పురోగమనం చేశాం. ఈ విషయంలో ఏ సూత్రం చెల్లుతుందో అదే అన్ని ఆదర్శముల విషయంలోనూ కూడా చెల్లుతుంది.

ప్రభుత్వంలేని రాజ్యం ప్రపంచంలో ఎక్కడా లేదనే విషయం మాత్రం జ్ఞప్తిలో వుంచుకోవాలి. ఒకవేళ ఎన్నడైనా అట్టిది సాధ్యమైతే భారతదేశంలోనే కావలసి వుంటుంది; ఏమంటే, అందునిమిత్తమై ప్రయత్నమాత్రమైనా జరిగివున్నది ఒక్క మనదేశంలోనే. ఏతత్సాధనకుగల ఏకైకమార్గంలో మనమింకా అవసరమైనంత ధైర్యస్థైర్యములను చూపలేదు. ఆ మార్గంలో విశ్వాసం వున్నవారు దానిని ఆచరణలో ఋజువుపరచవలసివున్నది. అది సాధ్యం కావడానికి మనం, కారాగారభీతిని విసర్జించి వున్నట్లే, మృత్యుభీతిని కూడా పూర్తిగా విసర్జించవలసి వుంటుంది.

హరిజన్, 15-9-'46.

పోలీసుదళాలు :

అహింసాత్మకమైన ప్రభుత్వంలోకూడా పోలీసుదళాల అవసరం వుండవచ్చును. ఇది అహింసాత్మకతయొక్క అసంపూర్ణతకు చిహ్నమని నేనంగీకరిస్తాను. సైన్యం అవసరం

లేదని చెప్పినంత బలంగా పోలీసుదళాల అవసరం లేకుండా నడిపించగలమని ఉద్ఘాటించుటకు నా కింకా ధైర్యంచాలదు. పోలీసురక్షణయొక్క అవసరం లేకుండా నడవగల ప్రభుత్వాన్ని గురించి నేను ఊహించుకోగలను, ఊహించుకుంటూ వున్నాను కాని, అట్టి స్థితిని మనం రూపొందించగలమా లేమా అనే సంగతి భవిష్యత్తే చూపవలసివుంటుంది.

అయితే నా భావనలోని పోలీసుదళం ప్రస్తుతకాలపు సిబ్బందీకంటె పూర్తిగా వేరువిధంగా వుంటుంది. దాని శాఖలన్నీ అహింసావిధానంలో విశ్వాసంగలవారితో ఏర్పాటై వుంటాయి. వారు ప్రజలపై అధికారం చెలాయించేవారు కాక, ప్రజాసేవకులై వుంటారు. ప్రజలు వారికి అన్నివిధాలా స్వతస్సిద్ధమైన సహకారాన్ని ఒసగుతారు; క్రమేపి తరిగిపోయే అల్లరులనూ ఆందోళనలనూ అట్టి పరస్పర సహకారంతో వారు సునాయాసంగా అరికట్టగల్గుతారు. ఈ పోలీసుదళానికి కూడా ఏదో ఒక విధమైన ఆయుధాలువున్నా, అవి బహు అరుదైన పరిస్థితులలో తప్ప ఉపయోగింపబడవు. వీలైనంతవరకు అసలే ఉపయోగింపబడవు. ఆ పోలీసుసిబ్బంది ప్రజలస్వభావంలో మార్పు తేవడానికి కృషిచేసే సంస్కరణ భావం కలవారై వుంటారు. వారొనర్చే రక్షణకార్యం ముఖ్యంగా దొంగలూ, దోపిడికాండ్రూ మొదలైనవారికి సంబంధించినది మాత్రమే అయివుంటుంది. అహింసావలంబకులైన అధికసంఖ్యాకుల ప్రభావం సంఘమొత్తంలోని ముఖ్యవర్గీయు లందరియొక్క గౌరవాన్ని చూరగొనగల్గుట

మూలంగా అహింసాత్మక ప్రభుత్వపాలనకింద యజమానులకూ కార్మికులకూ మధ్య ఘర్షణలుగాని, సమ్మెలుగాని అరుదైపోతాయి. అట్లే భిన్నసంఘీయుల నడుమ కలిగే సాంఘిక కల్లోలాలకు కూడా తావుండదు.

హరిజన్, 1-9-'40.

అధ్యాయం ౨౧

సత్యాగ్రహం - దురాగ్రహం

శాంతియుత శాసనోల్లంఘనవిధానమే చట్టసమ్మతమైన ఆందోళనా పద్ధతులలోకల్లా స్వచ్ఛమైనదని నా దృఢమైన అభిప్రాయం. అయితే, దానియొక్క శాంతియుతత్వం, (Civil) అనగా అహింసాత్మకత, ఉత్తుబురఖావంటిదైతే మాత్రం, అది తప్పకుండా అవమానకరమూ, అసహ్యకరమూ అయిపోతుంది.

యంగిండియా, 15-12-'21.

ఉల్లంఘనం శాంతియుతం కావలెనంటే, అది హృదయపూర్వకమూ, సగౌరవమూ, నిగ్రహయుక్తమూ, నిగర్వమూ అయినదిగానూ, తోచినరీతిగా కాక ఏదో ఒక సుగ్రాహ్యసూత్రానుసారితమైనదిగానూ, అన్నిటికంటె ముఖ్యంగా ఏవిధమైన వైరద్వేషభావములపైనా ఆధారపడనిదిగానూ వుండాలి.

యంగిండియా, 24-3-'20.

తమ మనస్సాక్షికిగాని. మతవిశ్వాసానికిగాని బాధాకరం కానంతవరకు ప్రభుత్వం అమలుపరిచే ఇబ్బందికరమైన చట్టాలకు సైతం ఇష్టపూర్వకమైన విధేయతను చూపుటలో నమ్మకమున్నవారూ, శాంతియుతోల్లంఘన ఫలితమైన శిక్షలను అంతటిఓరిమతోనూ సహించుటకు సంసిద్ధులైనవారూ మాత్రమే శాంతియుత శాసనోల్లంఘన కార్యక్రమంలో పాల్గొనుటకు అర్హతకలిగివుంటారు. ఉల్లంఘనం శాంతియుతం కావడానికి అది సంపూర్తిగా అహింసాత్మకమైనదైవుండాలి; ప్రత్యర్థిని బాధాసహనశీలత ద్వారా, అనగా ప్రేమభావంద్వారా, తనవైపు త్రిప్పకొనగలగడమే దానికి మూలసూత్రమై వుండాలి.

యంగిండియా, 3-11-'21,

శాంతియుత ఉల్లంఘనం అనేది ప్రతిపౌరునికిని జన్మహక్కు. అతడు తన మానవత్వాన్ని కోల్పోతే తప్ప దానిని వదలుకొనలేడు. శాంతియుత ఉల్లంఘనానికి ఫలితంగా ఎప్పుడూ అరాజకపరిస్థితి రాదు. అక్రమోల్లంఘనం దానికి తీయవచ్చును. ఏ ప్రభుత్వంగాని అక్రమోల్లంఘనమును బలప్రయోగంతో అణచివేస్తుంది. అట్లు చేయనిచో ఆ ప్రభుత్వం నశిస్తుంది. శాంతియుతోల్లంఘనమును అణచివేయడమంటే మనస్సాక్షిని బంధించడానికి ప్రయత్నించడంతో సమానమౌతుంది.

యంగిండియా, 5-1-'22.

ప్రత్యక్షచర్యలలోకల్లా సత్యాగ్రహం అత్యంత శక్తివంతమైన విధానం కావడంవల్ల, సత్యాగ్రహి అయినవాడు ఇతర పద్ధతులన్నింటిని అవలంబించి చూచి, అది విఫలమైనప్పుడే సత్యాగ్రహమును చేపట్టవలసివుంటుంది. అందువల్ల అతడు ముందుగా శాసన నిర్దిష్టమైన అధికారస్థానానికి తిరిగి తిరిగి విజ్ఞప్తి చేసి, ప్రజాభిప్రాయాన్ని అనుకూలపరచుకొనుటకు ప్రచారప్రబోధములొనర్చి, వినడానికి అభిలషించే అందరి సమక్షాన తన ఉద్యమకారణాలను ప్రశాంతభావంతో సమర్థించి చెప్పెడి, ఈ విధమైన అన్ని మార్గములను అనుసరించి చూచినపిమ్మటనే సత్యాగ్రహవిధానాన్ని అవలంబించాలి. ఒకసారి తన అంతర్వాణియొక్క బలవత్తరాదేశాన్నిపొంది అతడు సత్యాగ్రహయాత్ర నారంభించాడంటే, దానితో అతడు తన పడవలను తగలబెట్టి నడిసముద్రంలో దూకినట్లే, ఇక దానికి వెనుదిరుగుట అనేది వుండదు.

యంగిండియా, 20-10-'27.

సత్యాగ్రహం అనే పదం తరచుగా తేలిక అర్థంలో, అనగా ముసుగులో దాగిన దౌర్జన్యభావానికి జాగా ఒసగే రీతిగా, వాడడం కద్దు. అసలున, ఆ పదానికి కర్తనైన నేను దానిలో ముసుగులోని దౌర్జన్యానికిగాని, బహిరంగ దౌర్జన్యానికిగాని, మనోవాక్కర్మలలో దౌర్జన్యభావానికిగాని ఏ మాత్రమూ తావులేదని చెప్పవలసివున్నది. ప్రత్యర్థియెడల ద్వేషభావం కలిగివున్నా, అతనికి హాని కలిగించే ఉద్దేశంతో ప్రత్యక్షంగాగాని పరోక్షంగాగాని పరుషవాక్యాలు పల్కినా

అది సత్యాగ్రహ ప్రతిజ్ఞాభంగ మనిపించుకుంటుంది. సత్యాగ్రహం మార్దవమైనది; అది ఎన్నడూ గాయపరచదు. అది కోపముపైనగాని, ద్వేషముపైనగాని ఆధారపడినదిగా వుండకూడదు. అది ఎన్నడూ హడావిడికిగాని, తొందరకుగాని, ఆర్భాటానికిగాని తావొసగదు. అది బలాత్కారానికి కేవలం వ్యతిరేకార్థకం. అది దౌర్జన్య ప్రయోగానికి సంపూర్ణమైన ప్రత్యామ్నాయ విధానంగా రూపొందించబడింది.

హరిజన్, 15-4-33.

దురాగ్రహం :

(1919 సం. ఏప్రిలు మాసారంభంలో పంజాబు రాష్ట్రానికి ప్రయాణిస్తుండగా గాంధీజీని అరెస్టు చేసినట్లు వార్తలు రాగానే, బొంబాయిలోను ఇతరచోట్లను దౌర్జన్యయుతమైన అల్లర్లు బయలుదేరాయి. ఆయన పోలీసు ఆధీనంలో బొంబాయికి తీసుకొనిరాబడి, అక్కడ ఏప్రిలు 11వ తేదీని విడుదలకాగానే, ఒక సందేశమును ప్రతి సభలోను చదువునట్లుగా ఆదేశించి వున్నారు. ఆ సందేశంలో గాంధీజీ ఈ క్రిందివిధంగా చెప్పారు.)

నన్ను నిర్బంధించిన వెంబడినే ఇంత ఆవేశానికీ అల్లరులకీ కారణమేమిటో నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. ఇది సత్యాగ్రహం కాదు. ఇది దురాగ్రహంకన్నా హీనమైనది. సత్యాగ్రహ ప్రదర్శనాలలో పాల్గొనేవారంతా తమ కెంత అపాయం వాటిల్లినప్పటికినీ తాము మాత్రం దౌర్జన్యచర్యలకు దిగడంగాని, రాళ్లు రువ్వడంగాని, ఇతరుల కేవిధమైన హాని అయినా కలిగించడంగాని చేయరాదనే

నియమానికి బద్ధులైవున్నారు. కాని మనం బొంబాయిలో రాళ్ళు రువ్వాం. దారిలో అడ్డాలుపెట్టి ట్రాం బండ్లను ఆటంకపరిచాం. ఇది సత్యాగ్రహంకాదు. దౌర్జన్య చర్యలకు అరెస్టుచేయబడిన 50 మందిని వదిలిపెడితేనేగాని వల్లకాదని బలాత్కరించాం. మనలను అరెస్టుచేయించుకోవడమే మన ముఖ్య విధి. దౌర్జన్యకార్యాలలో నిర్బంధనవారిని విడిపించడానికి ప్రయత్నించడమనేది మన మతధర్మానికే విరుద్ధమైన పని. అందువల్ల మనం అరెస్టయినవారి విడుదల నిమిత్తం బలాత్కారం చేయడం ఏవిధంగాగాని సమర్థనీయం కాదు.

మహాత్మాగాంధీ ప్రసంగాలు, రచనలు: పే 474.

సత్యాగ్రహంలో దౌర్జన్యానికిగాని, దోపిడీకిగాని, గృహదహనాలకుగాని స్థానం లేదని నేను లెక్కలేనన్నిసార్లు చెప్పివున్నాను; అయినప్పటికీ సత్యాగ్రహంపేరిట మనం భవనాలను తగలబెట్టాం, ఆయుధాలను బలవంతంగా ఊడలాక్కున్నాం, డబ్బు రాబట్టాం. రైళ్ళు ఆపుచేశాం, టెలిగ్రాఫు తీగెలు తెంపాం, నిర్దోషులను చంపాం, దుకాణాలనూ గృహస్థుల నివాసాలనూ దోపిడిచేశాం. ఇటువంటి పనులవల్ల కారాగృహంనించిగాని, ఉరికంబంనించిగాని రక్షింపబడితే అట్టి విముక్తిని నే నేమాత్రం ఇష్టపడను.

మహాత్మాగాంధీ ప్రసంగాలూ, రచనలూ, పే. 476.

దౌర్జన్యపద్ధతులవల్ల భారతదేశానికి కలుగగల ఫలితం మహావిపత్తుతప్ప, నా కింకేమీ కనిపించడంలేదు. దాని

పర్యవసానాలు కార్మికులకు ఆత్మహత్యాసదృశంగా పరిణ మిస్తాయి. కార్మికజనులు దేశంలో అమలైవున్న చట్టాలను అతిక్రమించడం ద్వారా తమ ఆగ్రహాన్ని తీర్చుకోనడానికి ప్రారంభిస్తే, భారతదేశం చెప్పరాని దురవస్థలపాలు కావ లసి వస్తుంది... నేను సత్యాగ్రహాన్నీ, శాంతియుతోల్లంఘ నాన్నీ ప్రబోధించినప్పుడు, అందులో అక్రమమైన శాస నోల్లంఘనానికి ఏమాత్రం స్థానమొసగబడి వుండలేదు. దౌర్జన్యచర్యలద్వారా సత్యాన్ని ఎన్నడూ ప్రచారం చేయ లేమన్న సంగతి నేను నా అనుభవజ్ఞానంవల్ల తెలిసికొని వున్నాను. తమ ఉద్యమం న్యాయసమ్మతమైనదని నమ్మిన వారు అపారమైన ఓరిమిని కలిగివుండాలి. అక్రమోల్లంఘన మునుగాని, దౌర్జన్యచర్యలనుగాని చేయకుండావుండగలవారే శాంతియుత శాసనోల్లంఘన కార్యక్రమంలో పాల్గొనుటకు అర్హులౌతారు. ఏ మనిషిగాని ఒకేసారి శాంతిస్వభావుడు గానూ, దురాగ్రహపరుడుగానూ కూడా ఎట్లు వుండలేడో, అట్లే ఏ వ్యక్తిగాని ఒకేసారి శాంతియుతోల్లంఘనమూ అక్రమోల్లంఘనమూ కూడా చేయజాలడు. ఏ విధంగా తన ఉద్రిక్తప్రవృత్తులను జయించిన వెనకనే ఏ మనిషికిగాని ఆత్మనిగ్రహశక్తి అలవడినట్లు భావిస్తామో అదేరీతిగా దేశంలో అమలైనచట్టాలను పూర్తిగానూ, ఇష్టపూర్తిగానూ అనుసరించడంలో సుశిక్షితుడైన పిమ్మటనే ఏ వ్యక్తికిగాని శాంతియుత శాసనోల్లంఘనంచేసే సామర్థ్యం చేకూరుతుంది. ప్రలోభనములకు గురికైమె వాటిని జయింపగల్గినవాడే ఇంద్రియ

నిగ్రహంగలవాడుగా పరిగణింపబడవలసి వున్నట్లుగానే, కోపావేశానికి తగిన కారణం వుండికూడా నిగ్రహశక్తిని ప్రదర్శించగల్గినప్పుడే మనం ఆగ్రహాన్ని జయించామని చెప్పడానికి వీలౌతుంది.

యంగిండియా. 28-4-'20.

కొందరు విద్యార్థులు 'ధారణ' కూర్చోడమనే చర్యను అవలంబించడం ద్వారా పురాతనకాలపు మొరటుతనానికి (Barbarity) తిరిగి ప్రాణంపోశారు. అది ఒకరిని బలాత్కరించడానికి ఉద్దేశించిన మూర్ఖవిధానం కావడంవల్ల, నేను దానిని "మొరటుతనం" (Barbarity) అని అన్నాను. అంతేకాక, "ధారణ" కూర్చునేవాడు, ఎదుటివాడు తనని త్రొక్కుకుపోడని ఎరిగివుండి ఆ పనికి దిగడంచేత, అది పిరికితనాన్ని కూడా సూచిస్తుంది. ఆ చర్యను దౌర్జన్యమని అనడానికి వీల్లేదు కాని, అది తప్పకుండా అంతకంటే తక్కువ తరహాకుచెందిన పని అని చెప్పవలసివుంటుంది. మనం ప్రత్యర్థితో కొట్లాడితే, అతడు తిరిగి దెబ్బకొట్టడానికి అవకాశమైనా ఇస్తాం. కాని, అతడు అట్లుచేయడని తెలిసివుండీ కూడా, వానిని మనపై త్రొక్కుకు నడిచిపొమ్మని సవాలు చేసినప్పుడు, అతడిని మనం చాలా ఇబ్బందికరమూ, అవమానకరమూ అయిన పరిస్థితిలో పెట్టినవారమౌతాం. ఆ "ధారణ" కూర్చున్న అత్యుత్సాహపూరితులైన విద్యార్థి బృందం తాము చేస్తున్న పనియొక్క మొరటుతనాన్ని గురించి ఎన్నడూ ఆలోచించి వుండరు. కాని తన మనస్సాక్షి

యొక్క ఆదేశాన్ని అనుసరించవలసివున్నవాడు, ఎంతటి వ్యతిరేకశక్తులు ఎదురైనా వాటిని ఒంటరిగానైనాసరే ఎదుర్కొనవలసివున్నవాడు, అనాలోచితచర్యలకు దిగలేడు... ఏ విధమైన తొందరపాటుగాని, మొరటుతనంగాని, అహంకారంగాని, అక్రమబలాత్కారణంగాని వుండకూడదు. మనం నిజమైన ప్రజాస్వామ్యభావాన్ని పెంపొందించుకొనవలెనంటే, మనకు అసహనం పనికిరాదు. అసహనమంటే మన ఉద్యమంలో మనకు తగినంత విశ్వాసంలేదన్నమాట.

యంగిండియా, 2-2-'21.

నిర్విచక్షణగా అధికారాన్ని ఎదుర్కొనడమనేది అరాజకతకూ, విశృంఖలమైన స్వేచ్ఛకూ, తత్ఫలితమైన ఆత్మవినాశనానికీ తప్పక దారితీస్తుంది.

యంగిండియా, 2-4-'31.

ఏవిధమైన శాంతియుతోల్లంఘనానికి గాని తప్పనిసరిగా అవసరమైన ప్రథమ నిబంధన ఏమనగా, అట్టి సక్రమ ప్రతిఘటనోద్యమ సంబంధీకులుగాని ప్రజాసామాన్యంగాని తద్వారా ఏవిధమైన దౌర్జన్యకాండగాని జరుగబోదని హామీయివ్వగలగాలి. ఏదైనా దౌర్జన్యకాండ తటస్థించిన సందర్భంలో, అది ప్రభుత్వంవల్లనో, ఇతర శత్రువర్గాలవల్లనో ప్రేరేపితమై జరిగినదని చెప్పడం తగిన సమర్థన కాజాలదు. శాంతియుత ప్రతిఘటన దౌర్జన్యయుత వాతావరణంలో నెరవేరజాలదన్నమాట స్పష్టంగా గ్రహించవలసిన విషయం. అయితే సత్యాగ్రహియొక్క ఆయుధాలు ఇక అంతటితో

సమూలాన్తమైపోయినవని అనుకోనవసరం లేదు. అట్టిపరిస్థితిలో సక్రమోల్లంఘనానికి బదులుగా ఇతర సాధనోపాయాలను కనిపెట్టవలసి వుంటుంది.

హరిజన్. 18-3-'39.

సత్యాగ్రహంలో నిరశనదీక్ష :

సత్యాగ్రహంయొక్క ఆయుధాగారంలో నిరశనదీక్ష ఒక శక్తివంతమైన ఆయుధం. అది ప్రతివారూ అవలంబించ దగినదికాదు. ఉపవాసం చేయడానికి తగిన దేహదార్ఢ్యం కలిగి ఉండటం ఒకటే చాలదు. దేవునిలో సజీవమైన విశ్వాసం వుంటే తప్ప నిరశనం నిరుపయోగ మౌతుంది. అది కేవలం యంత్రసదృశంగాచేసే యత్నంగాని, కేవలం ఇతరులను అనుకరించడానికి చేసేపనిగాని కాకూడదు. అది ఆత్మయొక్క లోతులనుంచి పుట్టుకురావాలి. అందువల్ల అది చాలా అరుదుగా జరగవలసిన విషయం.

హరిజన్, 18-3-'39.

స్వచ్ఛమైన నిరశనదీక్షలో స్వార్థానికిగాని, ఆగ్రహానికిగాని, విశ్వాసలోపానికిగాని, అసహనానికిగాని తావుండ రాదు... అపారమైన సహనశీలతా, దృఢనిశ్చయమూ, ఏకాగ్రమైన సంకల్పమూ, పూర్ణమైన శాంతభావమూ, ఆగ్రహ రాహిత్యమూ తప్పక అందులో నివిష్టమైవుండాలి. ఈ గుణగణా లన్నింటిని ఎవరుగాని తమలోఉన్నపట్టున పరిణిత మొనర్చుకోనలేరు కనక, అహింసాసూత్రములన్నింటిని అల

నరచుకొనివున్న సాధకుడుతప్ప ఇతరులెవ్వరును సత్యాగ్రహ నిరశనదీక్షను చేపట్టకూడదు.

హరిజన్. 13-10-'40.

ఈ సందర్భంలో ఒక సామాన్యసూత్రాన్ని సూచిస్తాను. ఇతర విధములుగా న్యాయం పొందడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనప్పుడు, తుది విధానంగామాత్రమే సత్యాగ్రహి నిరశనానికి పూనుకోవాలి. నిరశనవ్రతం విషయంలో అనుకరణకు చోటులేదు. అంతశ్శక్తి లేనివాడు కలలోనైనా నిరశనదీక్షనుగూర్చి తలచకూడదు, ఫలితం మీద అపేక్షపెట్టుకొని చేయడం అసలు పనికిరాదు ... పరిహాసాస్పదమైన నిరశనదీక్షలు మహమ్మారిలా వ్యాపిస్తాయి; అవి హానికరం.

హరిజన్. 21-4-'46.

నిరశనదీక్షలు ఇతరులను బలాత్కరించడానికి వినియుక్తం కాగలవన్నమాటను కాదనడానికి వీలులేదు. స్వార్థప్రయోజనానికి చేసే నిరశనాలు అట్టివి. ఒక మనిషివద్దనుంచి బలవంతంగా డబ్బు రాబట్టుటకుగాని, మరే స్వలాభసాఫల్యతకుగాని చేపట్టిన నిరశనాలు ఇతరులను బలాత్కారం చేయడానికి తగని ఇరకాటంలో పెట్టడానికే ఉద్దేశించినవి. అట్టి అక్రమ బలాత్కారాన్ని లెక్కచేయనవసరం లేదని నేను నిస్సంశయంగా చెబుతాను. నాకు వ్యతిరేకంగా చేయబడిన అట్టి నిరశనాలను, చేస్తానని బెదరించిన

నిరశనాలను, నేను విజయవంతంగా ఎదుర్కొని వున్నాను. స్వార్థప్రయోజనాన్నీ, నిస్స్వార్థప్రయోజనాన్నీ వేరుపరచే అడ్డుగీత సాధారణంగా చాలా అల్పమైనదిగా వుంటూ వుంటుందని ఎవరైనా వాదించే పక్షంలో నేను ఏమి చెబుతానంటే, ఒక నిరశనదీక్ష స్వార్థంతో కూడినదనిగాని, ఇంకే విధమైన హీనప్రయోజనానికి ఉద్దేశింపబడినదనిగాని ఎవరైనా అనుకుంటే, వారు దానికి పట్టుదలతో లొంగకుండా వుండవలెననీన్నీ, అందువల్ల ఆ నిరశనపరుడు మృతిపాలైనా లెక్కించవద్దనీ నేను ఉద్ఘాటిస్తాను.

అందరూ తమ అభిప్రాయంలో అయోగ్య ప్రయోజనానికై చేయఃబడినవిగా తోచిన నిరశనదీక్షలను లెక్కచేయకుండా వుండడం అభ్యసిస్తే ఆ నిరశనదీక్షలలోని బలాత్కారమూ, ఇరకాటం కలిగించడమనే కళంకమూ అదృశ్యమౌతాయి. అన్ని మానవ వ్యవస్థలవలెనే నిరశన దీక్ష అనేదికూడా ధర్మసమ్మతంగానూ, అధర్మసమ్మతంగానూ కూడా వినియుక్తం కావడానికి వీలుంది.

హరిజన్, 6-5-'33.

అధ్యాయం ౨౨

నేలదున్నే రైతాంగం

భారతదేశంలోని సంఘజీవితం నిజమైన పురోభివృద్ధిని పొందవలెనంటే ధనికవరాలవారు రైతాంగానికి కూడా తమ

వలెనే ఆత్మవున్నదనినీ, తమ ధనికత్వం తమకు పేదలపై ఏ విధమైన ఆధిక్యాన్నీ ఒసగనేరదనీ స్పష్టంగా గ్రహించవలసి వుంటుంది. జపానుదేశపు కులీనవంశీయులవలె వీరు కూడా తమ వశంలోవున్న ధనానికి తాము తమ రక్షణలో వున్న రైతుల తరఫున కేవలం ధర్మకర్తలం మాత్రమే అని భావించుకోవాలి. అప్పుడే వారు తమ శ్రమకు తగినపాటి హేతుబద్ధమైన కమిషనుకుమించి ఎక్కువ తీసుకోనకుండా వుండగల్గుతారు. ప్రస్తుతంలో రైతాంగం జీవించే అసహ్యకరమైన పరిసరాలకూ దుర్భరమైన దారిద్ర్యానికీన్నీ, వారి మధ్యనే నివసించే ధనికవర్గాలయొక్క కేవలం అనవసరమైన ఆడంబరానికీ దుర్వ్యయానికీన్నీ మధ్యగల తేడా ఏ మాత్రం అందీపొందకుండావుంది. కావున ఆదర్శప్రాయుడైన జమీందారుడు ప్రస్తుతం రైతాంగం వహిస్తూవున్న భారాన్ని వెంటనే తేలికచేసి, వారితో తాను సంపర్కం కలిగించుకుని, వారియొక్క అవసరాలను తాను తెలిసికొని, వారి ప్రాణాలను పీల్చిపిప్పిచేస్తూవున్న నిరాశను తొలగించి వారి హృదయాలలో ఆశాభావాన్ని రేకెత్తించడానికి ప్రయత్నిస్తాడు. పారిశుధ్య విషయంలోనూ ఆరోగ్య విషయంలోనూ రైతాంగంయొక్క అజ్ఞానాన్ని తొలగించ యత్నిస్తాడు. రైతులకు జీవితావసరాలను చేకూర్చేనిమిత్తం తాను పేదరికాన్ని స్వీకరిస్తాడు. తన రక్షణలోవున్న రైతాంగంయొక్క ఆర్థికపరిస్థితులను పరిశీలనచేసి, రైతుల పిల్లలతో కలసిమెలసి తన పిల్లలు కూడా చదువుకొనడానికి తగిన విద్యాశాలలు

స్థాపిస్తాడు. గ్రామపునూతులను, గ్రామపుచెరువులను పరిశుభ్రం చేయిస్తాడు. గ్రామీణులకు వారు తమ గోడ్లను ఊడ్చుకొనునట్లును, తమ మురుగుదొడ్లను శుభ్రమొనర్చుకొనునట్లును బోధించే నిమిత్తం ముందుగా తాను ఆ పనులను చేసిచూపి, మార్గదర్శకత్వం వహిస్తాడు. తన తోటలను, దొడ్లను తల్పులు బిగించి పెట్టుకొనకుండా రైతాంగం స్వేచ్ఛగా మసలడానికి తెరిచివేస్తాడు. తన కులాసాకోసం వుంచుకున్న అదనపు భవనములన్నిటినీ ఆస్పత్రులూ, స్కూళ్లూ మొదలైన సంస్థలకు నిలయములుగా యిచ్చివేస్తాడు. ధనికవర్గాలే కనక యుగధర్మంయొక్క సూచనలను అర్థంచేసుకుని, తమ అధీనంలోని ఆస్తిపాస్తులన్నింటిపైనా తమకు దైవసిద్ధమైన హక్కు వున్నదనే అపోహలను మార్చుకుంటే, అత్యంత స్వల్పకాలంలో ప్రస్తుతం గ్రామాలపేరిట చలామణీఅయ్యే ఏడులక్షల పేడకుప్పలను శాంతిసౌఖ్యాలకూ ఆరోగ్యానికీ నిలయాలుగా మార్చివేయవచ్చును. ధనస్వాములైనవారు జపానుదేశపు 'సాముురాయి' వంశీయులను అనుకరిస్తే వారికి అంతా లాభమేగాని ఏ మాత్రం నష్టంలేదని నా నిశ్చితాభిప్రాయం. ధనికవర్గాలకు, అనుసరణీయమైన ఒక మార్గం తాము ఇష్టపూర్తిగా తమ అదనపు ఆస్తిపాస్తులనూ ఆడంబరాలనూ విసర్జనమొనర్చి. తద్వారా యావన్మందికీ సుఖకరమైన పరిస్థితిని చేకూర్చడం ; లేదా, దూరదృష్టిరహితంగా తాము నిద్రాముద్రితులై కూర్చుని, అజ్ఞానులూ, క్షుద్బాధాపీడితులూఅయిన జనకోటియొక్క జాగరిత చైతన్యఫలితంగా

దేశాన్ని ముంచెత్తనున్న అరాజకతా సముద్రంలో తామున్నూ మునిగిపోవడం రెండవమార్గం. ఈ విపత్కర పరిస్థితిని తెచ్చుకున్న పక్షంలో వారిని ఎంతబలవత్తర ప్రభుత్వంయొక్క సాయుధ దళాలుగాని రక్షించనేరవు. అట్టి ప్రళయం రాకుండా భారతదేశం తప్పించుకొనగల్గుతుందని నేనింతవరకూ ఆసిస్తూ వచ్చాను.

యంగిండియా, 5-12-'29.

కిసాన్ లేక కృషికుడు-ఇతరుల భూమిని కూలికి దున్నేవాడుగాని, తన భూమి తానే దున్నుకునేవాడుగాని— అందరికంటే ఎక్కువ ప్రథమగణ్యతను పొందవలసి వుంటుంది. అతడు నేలకి ఉప్పువంటివాడగుటచే భూమిపై నిజమైన హక్కు అతనికే చెందుతుంది, లేదా చెందవలసి వుంటుంది; అంతేకాని తాను దూరంగా వుండి ఇతరులచేత భూమి దున్నించుకునే భూస్వామికిగాని, జమీందారునకుగాని అది చెందకూడదు. కాని దౌర్జన్యరహిత విధానంద్వారా శ్రామికుడు దూరస్థుడైన భూస్వామిని తొలగద్రోయలేడు. అందువల్ల అతడు భూస్వామి తనను కొల్లగొట్టడానికి వీలుకాని పద్ధతిని పనిచేయవలసివుంటుంది. రైతాంగంమధ్య అతి సన్నిహితమైన సహకారభావం పెంపొందించుకొనడం అనేది అన్నిటికంటె ముఖ్యమైన అవసరం. అందు నిమిత్తమై ప్రత్యేకమైన సంఘటనాసంస్థలు, లేక సంఘాలు ఏర్పడాలి; ఈవరలో అట్టివి ఏర్పడివున్నచోట అవి చక్కని పద్ధతులపైన నడిచేలాగ సంస్కరింపబడాలి. రైతాంగంలో ఎక్కువమంది

నిరక్షరాస్యులు. వారిలోని వయోజనులూ, బడికిపోయే వయస్సులోవున్న పిల్లలూకూడా విద్యాశిక్షణ పొందాలి. ఇది పురుషులకూ స్త్రీలకూ కూడా సమానంగా వర్తిస్తుంది. వారు భూమిలేని కూలిపనివారుగా వున్నచోట వారికి సభ్య జీవితాన్ని గడపడానికి కావలసినపాటిగా న్యాయసమ్మత మైన కూలి కిట్టుబాటగునట్లు చూడాలి. సభ్యజీవితం అంటే సమాంశములతో కూడిన భోజనం, నివాసగృహాలు, బట్టలు, ఇవన్నీ ఆరోగ్యావసరాలకు తగినరీతిగా వుండాలని అర్థం.

దిబాంబే క్రానికల్, 28-10-'44.

అహింసాత్మక విధానంద్వారా దేశస్వాతంత్ర్యసిద్ధి చేకూరిన పిమ్మట, తదనుకూలమైన ప్రజాస్వామ్య స్వరాజ్య ప్రభుత్వం ఏర్పడినప్పుడు, దానిలో రాజకీయరంగంతో సహా అన్ని రంగములలోను రైతునకు అధికారం కరగతమై వుండాలి.

దిబాంబే క్రానికల్, 12-1-'45.

అహింసా విధానానుసారంగా జరిగే యావత్ప్రజా ప్రయత్న ఫలితంగా స్వరాజ్యసిద్ధిచేకూరినచో, అప్పుడు రైతాంగం తమ యోగ్యస్థానాన్ని తాము ఆక్రమించవలసి వుంటుంది ; వారి మాటే అందరికన్నా ఎక్కువ చెల్లుబడి కావలసివుంటుంది. పూర్తిగా అట్లుకాక, ప్రజానీకానికీ ప్రభుత్వానికీ మధ్య తాత్కాలికంగా పనిజరిగే రాజీ ఏర్పాటు కుదిరి నడిచే సందర్భంలో, భూమిదున్నే కర్షకప్రజల అవసరాల విషయమై జాగరూకతవహించడం చాలా అవసరం.

శాసనసభలు వారియొక్క శ్రేయానికి రక్షణ ఒసగలేకపోయి నప్పుడు, వారిచేతిలో ఎల్లప్పుడూ, సక్రమోల్లంఘన, సహాయనిరాకరణ సాధనములనే దివ్యౌషధాలు ఎల్లాగా వుండనే వున్నాయి. కాగితాలమీద వ్రాయబడే శాసనాలుకాని, ఆడంబర వచనాలుగాని, ఆవేశపూరితమైన ఉపన్యాసాలుగాని అన్యాయంనుంచీ నిరంకుశతనుంచీ నిజమైన రక్షణ ఒసగజాలవు. అజేయమైన తుదిరక్షణాయుధాలు అహింసాత్మక సంఘటన, సుశిక్షణత, త్యాగశీలత అనునవి మాత్రమే.

ది బాంబే క్రానికల్, 12-1-'45.

అధ్యాయం ౨౩

గ్రామాలకు తిరోగమనం

హిందూదేశ నిజస్వరూపాన్ని తెలిసికొనవలెనంటే అందలి 7,00,000 ల గ్రామాలలో దానిని చూడవలెనేగాని, కొలదిపాటి పట్టణాలలో కాదని నే నెల్లప్పుడూ నమ్మివుండడమేకాక, లెక్కలేనన్నిసార్లు తిరిగి తిరిగి ప్రబోధించివున్నాను. కాని పట్టణవాసులమైన మనం భారతదేశం పట్నాలకు చెందినదే అనిన్నీ, గ్రామాలు మన అవసరాలను తీర్చడానికి మాత్రమే సృష్టింపబడివున్నవనిన్నీ నమ్ముతూ వచ్చాం. ఆ గ్రామాలలోని పేదజనాసీకం తినడానికి తగినపాటి తిండిగాని, కట్టుబట్టగాని కలిగివున్నారా లేదా అనిగాని, ఎండవానలనుంచి తలదాచుకునేందుకు వారికి యిల్లూ వాకిలీ

వున్నవా లేదా అనిగాని, మనం ఎన్నడూ ఆలోచించి వుండలేదు.

హరిజన్, 4-4-'36.

సర్వసామాన్యంగా పట్టణవాసి అయినవాడు గ్రామవాసి యొక్క కడుపుకొట్టి లాభాలు పొందుతూవున్నాడనీ, గ్రామ వాసియొక్క భుక్తిని కొల్లగొట్టి తాను అనుభవిస్తున్నా డనీ నేను గమనించివున్నాను. భారతదేశపు ప్రజలస్థితిగతు లను వర్ణిస్తూ అనేకమంది బ్రిటిషు ఉద్యోగులు వ్రాసి వున్నారు. నే నెరిగినంతవరకూ వారెవ్వరూకూడా భారత దేశపు గ్రామీణునికి దేహప్రాణాలను నిల్పుకొనుటకు తగి నంత జీవనాధారం వున్నట్లుగా చెప్పి వుండలేదు. ఇక ప్రజాబాహుళ్యంలో ఎక్కువభాగం సుమారుగా ఉపవాసం చేయవలసిన స్థితిలోవున్నట్లును, నూటికి పదిమంది అర్ధాకలి స్థితిలో వున్నట్లును, మిగిలిన లక్షలాది జనం ఇంత ఉప్పుకల్లు, మిర్చి, మరబియ్యమో లేక మొరమొరాలో తిని బ్రతికే స్థితిలో వున్నట్లునూ వారంతా అంగీకరించివున్నారు.

మనలో ఎవరినిగాని అటువంటి భోజనంమీాద గడప మని అంటే, మనం దానిమీాద ఒకనెలకంటె ఎక్కువకాలం నిలవలేకపోవడమో, మనోవైకల్యస్థితికి దిగజారడమో జరిగి తీసుతుంది. కాని మన గ్రామీణులు దానిమీాదనే ఆధార పడి రోజులు వెళ్లబుచ్చుతున్నారు.

హరిజన్, 4-4-'36.

మన జనాభాలో నూటికి 70 పాళ్లు కృషికులే. వారి యొక్క కృషిఫలితంలో సుమారుగా సర్వమూ మనం తీసు

కున్నప్పటికి, లేదా ఇతరులను తీసుకోనిచ్చినప్పటికీ, అది మనలో స్వపరిపాలనాభావం అంతంతపాటే వున్నదని తెల్పుతుంది.

మహాత్మాగాంధీ ప్రసంగాలూ, రచనలూ, పే. 323.

నగరాలు వాటి జాగ్రత్త అవి పడగలవు. మనం చూడవలసినది గ్రామాల విషయమే. అక్కడ పాతుకొని వున్న మూర్ఖత్వమును, మూఢవిశ్వాసములను, సంకుచిత దృష్టిని పోగొట్టవలసి వున్నది. అందు నిమిత్తమై మనం ఆ గ్రామీణులమధ్య నివసించి, వారి కష్టసుఖాలలో పాల్గొని, వారిలో విద్యను, వివేకయుతమైన విషయపరిజ్ఞానమును పరివ్యాప్తం చేయడం తప్ప వేరుమార్గం లేదు.

యంగిండియా, 20-3-'31.

మనం పారిశుధ్యం, ఆహారం మొదలైన విషయాలలో మూర్ఖత్వంతో కూడిన వింత అభిప్రాయాలు కలిగిన అజ్ఞాన గ్రామీణులవలెగాక, ఆదర్శప్రాయులమైన గ్రామవాసులం కావలసివున్నది. మనం కూడా గ్రామీణులలో అధికసంఖ్యాకులవలె ఏదో ఒకటి వండుకుని, ఎట్లో ఒకట్ల తిని, ఏదో ఒక విధంగా బ్రతుకు వెళ్లబుచ్చే రీతిగా వుండకూడదు. ఆదర్శప్రాయంగా భుజించడం వారికి మనం నేర్పాలి. మనం మన ఇష్టాయిష్టాలమీద మాత్రమే ఆధారపడకుండా, ఆ ఇష్టాయిష్టాలకు అడుగున వుండే మంచి చెడ్డలను పరిశీలన మొనర్చాలి.

హరిజన్, 1-3-'35.

మండుటెండలో నడుమువంచి కాయకష్టమొనరించే గ్రామీణులతో మనం ఐక్యభావం పెంపొందించుకోవాలి. వారు స్నానాలుచేసి, బట్టలు ఉదికి, కుండలు కడిగి, ఆవులూ బర్రెలూ పడిదొర్లే ఆ గ్రామ చెరువులలో నీళ్లు త్రాగితే ఎల్లా వుంటుందో మనం తెలుసుకోవాలి. అట్లుచేసి, అవన్నీ తెలుసు కున్నప్పుడుగాని మనం గ్రామీణులయొక్క నిజమైన ప్రతి నిధులం కాజాలము. మనం ఆ విధంగా చేసినచో, వారున్నూ, నేనిప్పుడెంత నిశ్చితంగా వ్రాస్తున్నానో అంత నిశ్చితం గానూ, మన పిలుపునందుకొని మనలను అనుసరిస్తారు.

హరిజన్, 1-3-'35.

వారు తమకు అవసరమైన కూరగాయలను ఆకుకూర లను తామే చౌకగా పండించుకొని, ఆరోగ్యమును పెంపొం దించుకొనవచ్చునని మనం బోధించాలి. ఆకుకూరలను అతిగా వండితే విటమిన్లు చాలాభాగం నష్టమైపోతాయని కూడా మనం వారికి తెలపాలి.

హరిజన్, 1-3-'35.

కాలమును, ఆరోగ్యశక్తిని, ధనమును ఎట్లు పొదు పుగా వాడుకొనవలసినదీ వారికి మనం బోధించాలి. లయో నల్ కర్టిస్ అనే ఆయన మన గ్రామాలను పేడకుప్పలని చెప్పి వర్ణించాడు. వాటిని మనం ఆదర్శ గ్రామములుగా మార్చాలి. మన గ్రామస్థులు, తమచుట్టూ శుభ్రమైన గాలి ఆవరించి వున్నా, దానిని వారు అనుభవించరు. అప్పుడే

పండిన అహారపదార్థాలు తమచుట్టూవున్నా, వారికి శుభ్రమైన ఆహారం లభ్యంకాదు. నేనీ ఆహారవిషయంలో ఈ రీతిగా ఒక మతప్రచారకునిలా మాట్లాడడానికి హేతువేమిటంటే, మన గ్రామాలను సౌందర్యనిలయములుగా రూపొందించడమే నా జీవిత పరమావధిగా భావిస్తాను కనక.

హరిజన్, 1-3-'35.

భారతదేశపు గ్రామాలు పూర్వంనుంచీ ఈవిధంగానే వున్నవా అనే విషయమై తర్జనభర్జనచేయడం లాభంలేని పని. ఎప్పుడూ అవి ఇంతకంటె మంచి స్థితిలో వుండనిచో, అది మనమెంతో గర్వించే మన పురాతన సంస్కృతియొక్క లోపమనుకోవలసుంటుంది. అయితే అవి ఎప్పుడుగాని ఇంతకంటె మంచిస్థితిలో లేకుండా వున్నయెడల, శతాబ్దులనుంచీ జరుగుతూ మనచుట్టూ ఈనాడు దృశ్యమానమవుతూన్న ఈ పతనస్థితికి తట్టుకుని అవి ఎలా నిలిచివున్నాయని అనుకోవాలి. ఈ పతనాన్ని ఏవిధంగా అరికట్టాలా అనేదే ప్రతిదేశభక్తుడూ కూడా కృషిచేయవలసిన పని. అనగా, నగరాలలో జీవించడం ఎంత సౌకర్యంగా వుంటుందని మనం భావిస్తామో, యీ గ్రామాలలో జీవించడంకూడా అంత సౌకర్యంగావుండేలాగ మనం వాటిని పునర్నిర్మాణ మొనర్చాలి. నిజంగా ఈకార్యం దేశాభిమానంగల ప్రతి వ్యక్తికీ విధ్యుక్తధర్మం. గ్రామీణులయొక్క దుస్థితి ఒకవేళ ఉద్ధరించడానికి అలవికానిది కావచ్చును; ఒకవేళ గ్రామ నాగరికతకు కాలం చెల్లిపోయి, ఇప్పుడున్న యీ ఏడులక్షల గ్రామాలకును, వాటివల్ల

పోషణ పొందే 30 కోట్ల జనాభాకును బదులుగా 3 కోట్ల జనాభాను మాత్రమే పోషించగల చక్కటి సౌఖ్యవంతమైన ఏడువందల నగరాలు వాటిస్థానం ఆక్రమించవలసి వుంటే వుండవచ్చును. ఒకవేళ భారతదేశానికి అటువంటి గతి పట్టవలసి వున్నప్పటికీ, అదైనా ఒకరోజులో రాదు. ఈ గ్రామాలనూ, గ్రామస్థులనూ అందర్నీ తుడిచివైచి, ఆ మిగిలిన వారితో నగరాలనూ, నాగరికపౌరులనూ సృష్టించవలెనంటే దానికి కూడా చాలాకాలం పడుతుంది. అది ఇంతలో జరిగే పనికాదు.

హారిజన్, 7-3-'36.

గ్రామోద్యమం గ్రామస్థులతో సమంగా నగరవాసులకుకూడా చాలా శిక్షణదాయకమైనది. నగరవాసులలో నుంచి వచ్చిన కార్యకర్తలు గ్రామమనస్కతను అలవరచుకొని, గ్రామీణుల జీవితవిధానం ప్రకారం తాముకూడా జీవించవలసి వుంటుంది. అంటే, వీరుకూడా ఆ గ్రామీణుల వలె తిండికిమాడవలెనని కాదు అర్థం. కాని వారి పూర్వ జీవితవిధానంలో సమూలమైన పరివర్తన కలిగించుకోవడం అవసరమని అర్థం.

హరిజన్, 11-4-'36.

మనలోని పూర్వాపు దురభిప్రాయాలనూ దురూహాలనూ మరచిపోయి, నిశ్చలవిశ్వాసంతో, వారియొక్క రాజపోషకులమనే దృష్టితో కాక కేవలం వారికి పారిశుద్ధ్య సేవకులముగాను ఉపచారకులముగాను, సహాయకులముగాను వర్తిస్తూ, వారి నడుమ తిష్టవేసి కూర్చొనడ మొక్కటే

మనకు అనుసరణీయమైన మార్గం. మనం ఒక క్షణకాలం స్వరాజ్యాన్నికూడా మరచిపోదాం; అడుగడుగునా మనకు ఆటంకంగా కనిపించే స్థితిపరులసంగతి కూడా ఆలోచించవద్దు. వారిని అలాగే వుండనీయండి. ఆ పెద్ద సమస్యల పరిష్కారాలకు చాలామంది పనిచేసేవారున్నారు. ఈ నిమిషంలో ముఖ్యావసరమైనదీ, గమ్యసిద్ధి అనంతరంకూడా మిగిలేదీ అయిన యీ అల్పమైన గ్రామోద్ధరణ కార్యాన్ని మనం నిర్వహిద్దాం. నిజంగా చూస్తే, ఈ గ్రామోద్ధరణ కార్యక్రమమే కనక విజయవంతమైతే అదిమన గమ్యసిద్ధిని తప్పక చేరువచేయగలుగుతుంది.

హరిజన్, 16-3-'36.

మన గ్రామసంఘాలు పునరుద్ధరింపబడాలి. భారతదేశపు పట్నాలకూ, నగరాలకూ కావలసిన అవసరాలన్నింటినీ పూర్వం మన గ్రామాలే తయారుచేసి సరఫరాచేసేవి. మన నగరాలు విదేశీసరకులకు అమ్మకపు మార్కెట్లుగా మారి, విదేశములనుండి వచ్చిన చవకబారు సరకులను చవక ధరలకు దేశమంతటా దిగుబడిచేసిన పిమ్మటనే భారతదేశం దారిద్ర్యంలో మునిగిపోయింది.

హరిజన్, 27-2-'37.

నగరాలు గ్రామాలను దోచుకొని స్వంతలాభాలు పొందడానికి బదులుగా, గ్రామములనుంచి తాము పొందే బలపోషణలకు తగిన ప్రతిఫలం తిరిగి వాటికి తాము ముట్ట చెప్పవలసిన విధిని గ్రహించినప్పుడే ఆ రెండిటికిని మధ్య

ఆరోగ్యవంతమూ, నీతివంతమూ అయిన పరస్పరానుబంధం ఏర్పడుతుంది. నగరయువకులు ఉత్కృష్టమైన ఈ సాంఘిక పునర్నిర్మాణ కార్యంలో పాల్గొనవలెనంటే, వారు విద్యాభ్యాస మొనర్చుట కాధారమైన కార్యకలాపాలు పూర్తిగా గ్రామావసరాలకు సంబంధించినవై ఉండాలి.

హరిజన్, 19-10-'37.

మన గ్రామాలను పిడికిటిలో బిగించి బాధించే వ్యాధి త్రయాన్ని మనం ఎదుర్కొనవలసి వున్నది. (i) గ్రామ మొత్తానికి సంబంధించిన పారిశుధ్యం; (ii) ఆహారలోపాలు, (iii) నిర్వీర్యత... మన గ్రామవాసుల కీనాడు తమ యొక్క పురోభివృద్ధి విషయంలో తమకే ఏమాత్రమూ అభిలాష లేదు. ఆధునిక పారిశుధ్యపద్ధతులను వారు ఆమోదించలేరు. మామూలుగా అలవాటైన పాటిగా శ్రమించడమూ, పొలాలను పైపైన ఊడ్చుకు తినడమూతప్ప, అంతకు మించి కష్టపడడానికి యిష్టపడరు. ఈ చిక్కులు చాలా వాస్తవికమైనవీ, ముఖ్యమైనవీ అన్నమాట నిజమే. కానీ అందువల్ల మనం నిరుత్సాహపడకూడదు. మన ఆశయ సంకల్పంలో మనకి ఆరని విశ్వాసం వుండాలి. గ్రామసేవాకార్యంలో మనకి అనుభవజ్ఞానం తక్కువ. మన మొక దీర్ఘవ్యాధితో పోరాడవలసివున్నది. మనకు ఓరిమి, పట్టుదల అనేవి ఉంటే, అవి పర్వతసదృశమైన కష్టాలను సైతము జయించగలవు. ఈ విషయంలో మన మిప్పుడు నివారణలేని వ్యాధితో బాధ

పడుతున్నాడని చెప్పబడిన రోగికి సేవచేయవలసివున్న పరి చారికతో పోల్చదగిన పరిస్థితిలో వున్నాం.

హరిజన్, 16-5-'36.

నీవు వారిని (భారతీయ కర్షకులను) ఒకసారి పలకరించి వారిచేత తిరిగి మాట్లాడించి చూశావంటే, వారి నోటినుంచి దివ్యమైన జ్ఞానబిందువులు జాలువారుతాయని తెలుసుకుం టావు. అసభ్యంగా కనిపించే వారి బాహ్యరూపం యొక్క ఆంతర్యంలో అగాధమైన ఆధ్యాత్మిక జలాశయం మరుగు పడివుంది. నేను దీనినే సంస్కృతి అంటాను— అట్టిది పాశ్చాత్యలోకంలో మీకెక్కడా కనిపించదు. యూరోపీయు డైన ఒక రైతుని మీరు పలకరించి చూస్తే, అతడికి ఆధ్యా త్మిక విషయాలలో కించిత్తైనా అభిలాష లేదని తెలుసు కుంటారు.

హరిజన్, 28-1-'39.

భారతీయ గ్రామవాసిలో, పైకి కనిపించే మొరటుతన మనే పొర అడుగున యుగయుగాల పురాసంస్కృతి దాగి వున్నది. మీరే కనక పైన ఏర్పడిపోయిన ఆ పొరను తొల గించి, చిరకాలంగా ఆతని నావరించిన దారిద్ర్యాన్ని నిరక్ష రాస్యతనూ నిర్మూలించి చూశారంటే, ఆతనిలో సంస్కృతీ యుతుడూ వివేకవంతుడూ అయిన ఆదర్శపౌరునికి ఉండవల సిన లక్షణాలన్నీ రూపొందివున్నట్లు మీరు తెలుసుకుంటారు.

హరిజన్, 28-1-'39.

అధ్యాయం ౨౪

ప్రతి గ్రామం ఒక ప్రజా ప్రభుత్వం

నా అభిప్రాయం ప్రకారం, గ్రామస్వరాజ్యం అంటే, ప్రతి గ్రామం తన ప్రాథమికమైన అవసరాల విషయంలో పొరుగు గ్రామాలమీద ఆధారపడకుండా స్వయంపోషకంగా వుంటూ, తతిమ్మా అనేక అవసరాల విషయంలో పరస్పరాధారకంగా వుండే స్వతంత్రమైన ఒక ప్రజాప్రభుత్వంగా వర్తించాలి. అందువల్ల ప్రతి గ్రామం ప్రప్రథమంగా తన ఆహారధాన్యాలను, తన బట్టకు చాలిన ప్రత్తిని పండించుకోవలసివుంటుంది. ఆ గ్రామపు పశుసంపద నిమిత్తం ఉమ్మడి బీడును కలిగివుండాలి, పిల్లా పెద్దా ఆటవిడుపుగా ఉపయోగించుకునే నిమిత్తం ఒక బహిరంగస్థలంకూడా కలిగివుండాలి. ఇంకా అదనపు భూమివుంటే అందులో గంజాయి, పొగాకు, నల్లమందు మొదలైనవి తప్ప, మిగిలిన డబ్బు పంటలు పండించుకొనవచ్చును.

ప్రతి గ్రామం ఒక వినోదశాలనూ, విద్యాలయాన్ని, సభామందిరాన్ని నిర్మించుకొని నడిపించుకోవాలి. పరిశుభ్రమైన మంచినీటి సరఫరా నిమిత్తం ఒక నీటిసరఫరా పద్ధతిని కూడా స్వయంగా ఏర్పాటుచేసుకోవాలి. నూతులను చెరువులను స్వాధీనంలో వుంచుకొని తగినకట్టుదిట్టాలు చేసుకోవడంద్వారా ఇది సాధ్యమౌతుంది. ఆఖరు బేసిక్ పరీక్ష వరకు నిర్బంధవిద్య అమలు కావాలి. వీలైనంతవరకు ప్రతి

కార్యక్రమం సహకారపద్ధతిని జరగాలి. కొంచెం ఎక్కువ తక్కువలతో కూడిన అంతరానితనం మీద ఆధారపడే ఇప్పటి వర్ణభేదం వంటిది అప్పుడు వుండకూడదు.

హరిజన్, 26-7-'42.

సత్యాగ్రహ, సహాయనిరాకరణరూపకమైన అహింసా విధానం గ్రామీణ ప్రజాసంఘంయొక్క అనుమతిపై ఆచరణలో పెట్టబడవచ్చును. గ్రామంయొక్క రిజిస్టరులో నమోదైన పేర్లపట్టిక ప్రకారం వంతులుగా నిర్బంధ గ్రామరక్షక దళాలు పనిచేయాలి. కనీసపు అర్హతలు గలిగిన యుక్తవయస్కులైన గ్రామీణ స్త్రీ పురుషులలోనుంచి ఎన్నికైన అయిదుగురు సభ్యులతో కూడిన పంచాయతీసంఘం ద్వారా గ్రామ పరిపాలనం జరగాలి. వీరు గ్రామమంతటిమీదా అన్ని విధములైన అధికారములను కలిగివుంటారు. మామూలు అర్థంలో శిక్షలు వేసేపద్ధతివుండదు కనుక, ఈ పంచాయతీ సంఘమే తన అధికారకాలమైన సంవత్సరంపాటు తానే గ్రామప్రజలయొక్క ప్రతినిధిసభగానూ, న్యాయాధికారసంస్థగాను, కార్యనిర్వాహకసంఘంగాను కూడా పనిచేస్తుంది.

గ్రామాలతో సుమారుగా ఒక్క పన్నుల వసూలు మాత్రమే సంబంధంగాగల ప్రస్తుత ప్రభుత్వంక్రింద కూడా, ఈరోజున అయినా ఏ గ్రామంగాని పైన పేర్కొన్నరీతిగా దేశ ప్రభుత్వంయొక్క జోక్యం అట్టే లేనటువంటి, ప్రజా ప్రభుత్వంగా నడవడానికి వీలుంది. నేనింకా ఈసందర్భంలో ఇరుగుపొరుగు గ్రామాల పరస్పర సంబంధాలనుగురించి గాని

ఏమైనా వుంటే కేంద్రప్రభుత్వంతో వుండదగిన సంబం ధాన్ని గురించిగాని చర్చించలేదు. ఇక్కడ కేవలం గ్రామ పరిపాలన పద్ధతిని సూచనప్రాయంగా తెలుపుటయే నా ఉద్దేశం. వ్యక్తిస్వాతంత్ర్యంతో కూడిన సంపూర్ణ ప్రజా స్వామ్య స్వరూపం ఇందులో ఇమిడి వున్నది. ఇందులో వ్యక్తియే తన పరిపాలనమునకు నిర్మాత అవుతాడు. అతడినీ అతని పరిపాలనమునూ అహింసాసూత్రం నడిపిస్తుంది. అతడూ, అతని గ్రామమూ ప్రపంచబలాన్నంతటినీ ఎదురొడ్డి నిలవగల్గుతారు. ఎందువల్లనంటే, తన యొక్క, తనగ్రామం యొక్క, గౌరవాన్ని రక్షించుకొనుటకుగాను తన ప్రాణముల నైనా అర్పించడమే ప్రతి గ్రామీణునికీన్ని అనుసరణీయ మైన శాసనంగా నడుస్తుంది.

అట్టి ఆదర్శప్రాయమైన గ్రామనిర్మాణకార్యం ఒకని జీవితకాలమంతా పట్టవచ్చును. ప్రజాస్వామికతనూ, గ్రామ జీవితాన్నీ ప్రేమించే ఏ వ్యక్తిగాని ఒక గ్రామాన్ని ఎన్ను కుని, అదే తన లోకంగా తన జీవితపరమావధిగా భావించి, పనిచేస్తే, తప్పకుండా అతడు సత్ఫలితాలను పొందగలుగు తాడు. అతడు ఒకేసారి గ్రామపారిశుధ్యకర్తగా, నూలు వడికే సాలీపనివానిగా, గ్రామరక్షకభటునిగా, వైద్యునిగా, బడిపంతులుగా వర్తించడంతో తన కార్యక్రమాన్ని ప్రారంభిం చవలసివుంటుంది. ఎవరూ తన దగ్గరకు చేరరానిచో, అతడు పారిశుధ్యకార్యమూ, నూలువడుకు పనిచేస్తూవాటితో సంతృ ప్తుడు కావచ్చు.

హరిజన్, 26-7-'42.

గ్రామతయారీవస్తువులు, ఇతర ప్రాంతాలలో వెంటనే అమ్ముడుపోయేందుకు అనుగుణంగా గ్రామపు పనివారు తమ తమ వృత్తులలో అధిక కౌశలం కలిగి వుండాలి. మన గ్రామాలు పూర్తిగా పురోభివృద్ధిని పొందిన పిదప, అక్కడ ఉత్తమమైన వస్తునిర్మాణ నైపుణ్యమూ కళాకౌశలమూ గల పనివారికి లోపముండదు. అప్పుడు గ్రామకవీశ్వరులూ, గ్రామశిల్పులూ, గ్రామవాస్తుశాస్త్రజ్ఞులూ, భాషావేత్తలూ, పరిశోధకులూ కూడా వుంటారు. నిజానికి జీవితంలో పొందదగినదేదీ గ్రామజీవితంలో లోపించి వుండదు. ఈనాడు మాత్రం మన గ్రామాలు పేడకుప్పలవలె ఉన్నమాట నిజం. రేపు అవే ఇతరులు వాటిని మోసగించుటకుగాని స్వలాభసాధనములుగా ఉపయోగించుకొనుటకుగాని వీలొసగని ఉన్నత మేధస్కులు వసించే చిన్నచిన్న నందనవనములుగా మారగలవు.

ఈ పద్ధతులపైన జరిగే గ్రామపునర్నిర్మాణకార్యం ఇప్పుడే ప్రారంభం కావాలి. గ్రామపునర్నిర్మాణ కార్యక్రమం తాత్కాలిక సూత్రములపైనగాక, శాశ్వతమైన పునాదులమీద జరగాలి.

చేతిపనులు, శిల్పం, ఆరోగ్యం, విద్య ఇవన్నీ ఒకే ఒక ప్రణాళికలో అనుబంధింపబడాలి. నయీతాలిమ్, లేక నవీనవిద్యాపద్ధతి, ఈ నాల్గింటికిని చాలాచక్కని సంపుటీకరణం; అది ఒక వ్యక్తి, తల్లిగర్భంలో పిండాకారం దాల్చినది మొదలు మరణంతో అంతమొందే వరకూ వానికి

కావలసిన విద్యాశిక్షణము నంతను తనలో రూపొందించు కొన్నటువంటి విధానం. అందువల్ల నేను గ్రామోద్ధరణ కార్యాన్ని మొదటినుంచీ పరస్పరభిన్నమైన విభాగాలుగా వేరుపరచకుండా, ఈ నాలుగు అంగాలను సమీకరణం చేసే కార్యక్రమరూపంలో అవలంబిస్తాను. చేతిపనులును, పరిశ్రమలును విద్యాశిక్షణమునకు భిన్నమైనవిగా భావించుటకు బదులు, విద్యాశిక్షణమునకు నేను వాటిని వాహనప్రాయములుగా వినియోగిస్తాను. కనక, నయీతాలిం (నవీనవిద్యాపద్ధతి) అనేది గ్రామోద్ధరణ ప్రణాళికలో ఒక భాగంగా పాటించాలి.

హరిజన్, 10-11-'46.

నేను ఊహించుకునే ప్రామాణిక గ్రామం (a village unit as conceived by me) బలవత్తరమైన వాటిలోకల్లా బలమైనదిగా వుంటుంది. నా భావనలోని గ్రామం ఒక 1,000 మంది గ్రామస్థులతో కూడినదై వుంటుంది. అట్టి ప్రమాణంగల గ్రామం స్వయంపోషకసూత్రం మీాద సుసంఘటితమై వుంటే, తప్పక సంతృప్తికరమైన ఫలితాలను చూపగలదు.

హరిజన్, 4-8-'46.

ఆదర్శ భారతీయగ్రామంయొక్క నిర్మితి ఉత్తమమైన పారిశుధ్యవిధానానికి వీలొసగునట్టిదిగా వుండాలి. అది అచటికి అయిదుమైళ్లలోపు దూరంలో లభ్యంకాగలిన పరికరాలతో నిర్మితమై, గాలీ వెలుతురూ తగినంత ఒసగే కుటీర

గృహాలతో కూడివుండాలి. ఆ కుటీరాలు ఇంటి వాడకానికి సరిపోయే కూరగాయలను పెట్టుకొనుటకును, పశువులను కట్టు కొనుటకు సరిపడునంత పెరడులను కలిగివుండాలి. గ్రామం లోని సందులూ, వీధులూ వీలైనంతవరకు దుమ్మూ ధూళీ లేనివిగా వుండాలి. గ్రామావసరాలకు తగినన్ని నూతులను కలిగివుండి, అవి అందరికీ అందుబాటులో వుండాలి. గ్రామీ ణులందరికీ వర్తించే దేవాలయాలను, అందరూ కలవడానికి అనుకూలమైన సభాస్థలమును, గ్రామపశువులు మేసేనిమిత్తం ఉమ్మడి బీడును, ఒక సహకార పాలకేంద్రమును, పారిశ్రామిక శిక్షణముపై కేంద్రీకృతమైన విద్యాబోధనం చేసే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను, తగాయిదాలను తీర్చేందుకు ఒక గ్రామపంచాయతీని కలిగివుండాలి. అది తన ఆహారధాన్యా లను, కూరగాయలను, పండ్లను, తనకు అవసరమైన వస్తు నూలుబట్టలను తానే ఉత్పత్తి చేసుకోవాలి.

మహాత్మా, సంపుటం 4, పే. 144.

అధ్యాయం ౨౫

పంచాయతీ రాజ్యం

స్వాతంత్ర్యం అట్టడుగునుంచి ప్రారంభం కావాలి. అందువల్ల ప్రతి గ్రామమున్నూ సంపూర్ణాధికారయుక్తమైన ఒక ప్రజాప్రభుత్వం లేక పంచాయతీ రాజ్యంగా వుండాలి.

కాబట్టి ప్రతి గ్రామమున్నూ స్వయంపోషకమై తన వ్యవహారాలను తానే నిర్వహించుకోగల సమర్థతను కలిగి, లోకమంతా ఎత్తివచ్చినా ఆత్మరక్షణచేసుకోతగినంత శక్తివంతముగా వుండాలన్నమాట. బయటినుంచి తనపైకి ఏ విధమైన దాడివచ్చినాగాని, దానిని ప్రతిఘటించి ఆత్మరక్షణ చేసుకొనే ప్రయత్నంలో తాను సమూలంగా అంతమొందడానికైనా సంసిద్ధమై వుండునట్లు అది సుశిక్షితం కావాలి. ఈ విధంగా ఆఖరి లెక్కలో ప్రామాణికాంశం (unit) వ్యక్తే అయివుంటాడు. అయితే ఈవిధమైన సంఘటనంలో ఇరుగు పొరుగులయొక్కయు, లోకంయొక్కయు సహాయాన్ని అపేక్షించుటకుగాని, వారు ఇష్టపూర్తిగా యిచ్చిన సహకారాన్ని పొందుటకుగాని నిషేధం ఏమీ వుండదు. అది ఆ పరస్పర శక్తుల మధ్య స్వతంత్రంగానూ, ఇష్టపూర్తిగానూ నడిచే సంబంధ బాంధవ్యరూపంగా వుంటుంది అట్టి సాంఘిక వ్యవస్థ సహజసిద్ధంగానే ఉత్తమసంస్కృతికి నెలవై వుంటుంది. కావున ప్రతి స్త్రీ పురుషవ్యక్తీకూడా తనకు కావలసిన అవసరాలను తెలిసినవారుగానూ, అంతకంటె ముఖ్యంగా ఇతరులు సమానశ్రమఫలితంగా పొందజాలని దేనినిగాని ఎవరుగాని కోరరాదని తెలిసికొన్నవారుగానూ వుంటారు.

ఈవిధమైన సంఘనిర్మాణం సహజంగా సత్యాహింసలపై ఆధారపడినదై వుంటుంది. నాఅభిప్రాయంలో సత్యము, అహింస సజీవమైన ఈశ్వరవిశ్వాసం లేనిదే సాధ్యం కావు.

నా భావంలో పరమేశ్వరుడంటే ఇతరమైన ఏ శక్తులపైనను ఆధారపడనటువంటిన్నీ ప్రపంచంలోని ఇతరశక్తు లన్నింటిని తనలో ఇముడ్చుకున్నటువంటిన్నీ, ఇతరశక్తులన్నీ నిశ్చేతనమై నాశమొందినప్పటికీ తాను శాశ్వతమై నిల్చునటువంటిన్నీ అయిన స్వయంసిద్ధమూ సర్వజ్ఞమూ అగు ఒకానొక చైతన్యశక్తి. అట్టి సర్వవ్యాప్తమగు చైతన్య జ్యోతిని విశ్వసిస్తేతప్ప నాలోని జీవచైతన్యానికి మూలాధారమేమిటో నేను అవగాహన చేసికొనజాలను.

అసంఖ్యాకమైన గ్రామాలతో కూడిన ఈ నిర్మాణంలో ఎప్పుడూ ఒక దానికంటె ఒకటి విశాలతరమైన వలయాలే గాని, ఒకదాని కంటె ఒకటి ఉచ్చతరమైన వలయాలు వుండవు. అది నీచతమమైన మూలమట్టంమీద నిల్చే ఉచ్చతమ కోణంతో కూడిన గోపురాకారం (Pyramid) గా వుండదు. అది వ్యక్తి నికేంద్రంగాగల సముద్రవలయరూపంలో వుంటుంది. అనగా, వ్యక్తి తన గ్రామంకోసం ప్రాణమొసగ సంసిద్ధుడుగానూ, ఆ గ్రామం గ్రామమండలానికి ప్రాణమొసగ సంసిద్ధంగానూ వుండి, తుట్టతుదను దేశమంతా తాము సమభాగస్థులైన ఆ మహాప్రజాజీవన సముద్రవలయంయొక్క వైభవంలో పాలుపంచుకొనే నిత్యవినయశీలురూ, సదావిధేయులూ అయినటువంటి వ్యక్తులతో కూడిన ఒకే ఒక జీవితరంగంగా వర్తిల్లుతుంది. అందువల్ల అన్నిటికన్నా వెలుపలి పరిధి తన శక్తితో అంతరవలయాలను అణగద్రొక్కుటకుగాక వాటి

నన్నిటిని బలపరచుటకును, అన్నిటికిని మూలకందమైన కేంద్రింనుంచి తాసును బలపడుటకును యత్నిస్తుంది. ఇదంతా కేవలం నా స్వాప్నికాదర్శమనిన్నీ, కావున దీనిని గురించి ఆలోచించవలసిన పనిలేదనిన్నీ ఇతరులు నన్ను హేళనభావంతో అపహాసించవచ్చును. యూక్లిడ్ గణితజ్ఞుడు నిర్వచించిన చుక్క మానవమాత్రు డెవడూ గీయడానికి అసాధ్యమైనప్పటికిని అనశ్వరమైన విలువను కలిగివున్నట్లే నేను వర్ణించిన ఆదర్శచిత్రంకూడా మానవజీవితాన్ని నడిపించుటకు అట్టి అమూల్య ప్రయోజనమునే కలిగివున్నది. ఇది ఎన్నడూ సంపూర్ణరూపంలో సిద్ధించనిదైనప్పటికిని, భారతదేశం నేను నిర్వచించిన సత్యచిత్రాన్ని అనుసరించును గాక అని కోరుతాను. ఒకదానికి చేరికైన దానిని మనం పొందవలెనంటే, మన మనస్సులో మన వాంఛితార్థం యొక్క సరియైన చిత్రాన్ని ఏర్పరచుకోవాలి. భారతదేశం లోని ప్రతి గ్రామం ఏనాటికైనా ఒక స్వపరిపాలితకేంద్రంగా ఏర్పడవలెనంటే, తుదివారూ తొలివారూ సరిసమానులై — అనగా ఎవ్వరూ తొలివారుగా గాని, ఎవ్వరూ తుదివారుగా గాని భావింపబడకుండా వుండునట్టి నా ఆదర్శచిత్రణం సత్యసంయుతమైనదని నేను ఉద్ఘాటిస్తాను.

ఈ చిత్రణంలో ప్రతిమతమునకును సంపూర్ణమూ, సమానమూ అయిన స్థానం వుంటుంది. వేళ్లు భూగర్భంలో లోతుగా పాతుకొనివుండుటవల్ల పెకలించసాధ్యంకాని ఘనకాండంతో కూడిన వైభవోపేతమైన వృక్షానికి మనమంతా

పర్వతాలవంటివారం. ఎంతబలవత్తర జంఝామారుతం వీచినా దానిని చలింపజేయజాలదు.

ఇందులో మనుష్యులశ్రమయొక్క స్థానాన్ని ఆక్రమించే, కొలదిమంది చేతులలో అధికారబలాన్ని కేంద్రీకృతంచేసే యంత్రాలకు తావుండదు. సంస్కృతీయుతమైన మానవకుటుంబంలో శ్రమకు అనితరసాధ్యమైన ఒక ప్రత్యేక స్థానం వుంది. ప్రతి వ్యక్తికీ సహకారంగా వుండే ప్రతి యంత్రానికీ అందులో స్థానం వుంటుంది. అయితే అటువంటి యంత్రం ఎటువంటిదై వుంటుందో నే నింతవరకూ కూర్చుని ఆలోచించి వుండలేదని ఒప్పుకోక తప్పదు. సింగర్సు సూయింగు మిషీను (సింగరు కంపెనీవారి కుట్టు యంత్రం) ఒకటిమాత్రం నా స్ఫురణలో వుంది. అదికూడా అస్పష్టమైన అభిప్రాయమే. నా చిత్రణాన్ని నింపడానికి అది కూడా అవసరం లేదు.

హరిజన్, 28-7-'46.

పంచాయతీ రాజ్యం స్థాపితమైన పిమ్మట దౌర్జన్య శక్తికి ఎన్నడూ సాధ్యంకాని ఒక పని ప్రజాభిప్రాయంచేయగలుగుతుంది. ప్రజాసామాన్యం తమ బలాన్ని తాము తెలిసికోనకుండా వున్నంతకాలమే జమీందార్లయొక్క, పెట్టుబడిదార్లయొక్క, రాజులయొక్క ప్రస్తుతాధికారం చెలామణీ కాగలుగుతుంది. జమీందారీయొక్కగాని, పెట్టుబడిదారీయొక్కగాని దౌష్ట్యంతో ప్రజానీకం సహాయనిరాకరణం అవలంబించినయెడల, అది నిర్వీర్యమై అంతరించక తప్పదు.

పంచాయతీ రాజ్యంలో ప్రజలు పంచాయతీకి మాత్రమే విధేయులై వుంటారు, పంచాయతీ స్వయం నిర్ణయములైన చట్టాల ప్రకారమే పనిచేయునదై వుంటుంది.

హరిజన్, 1-7-'47.

అధ్యాయం ౨౬

గ్రామ పరిశ్రమలు

గ్రామ పరిశ్రమలు అంతరిస్తే భారత దేశపు 7,00,000 గ్రామాలయొక్క వినాశనం సంపూర్ణమౌతుంది.

నేను ప్రతిపాదించిన సూచనలను గురించి దినపత్రికలలో వెలువడిన విమర్శలను చూచాను. మానవ మేధస్సుయొక్క ఊహాశక్తివల్ల వశంవద మొనర్చుకొనబడిన ప్రకృతి శక్తులను వినియోగించుకొనుటయే ముక్తిమార్గమని నాకు సలహా ఒసగబడింది. ముందుకి ఉరుకులు పెట్టి పరిగెడుతూవున్న పశ్చిమ దేశాలు నీరు, గాలి, నూనె విద్యుచ్ఛక్తులను ఏవిధంగా వినియోగించుకుంటున్నారో ఆవిధంగా మనంకూడా వాటిని వినియోగించుకొనవలెనని విమర్శకు లన్నారు. ఈ ప్రకృతిగర్భితములైన శక్తులను వశంవదం చేసికొనుటద్వారా ప్రతి అమెరికా దేశస్థుడు ముప్పదిముగ్గురు బానిసలను కలిగి వుండజాలుతున్నాడని వా రంటున్నారు.

ఆ విధానాన్ని భారతదేశంలో ఆచరణలో పెట్టి చూస్తే, అది ఈ భూమిని పుట్టిన ప్రతివ్యక్తికీ ముప్పది

ముగ్గురు బానిసలను ప్రసాదించడానికి బదులుగా, వానిని ముప్పదిమూడు రెట్లు ఎక్కువగా బానిసత్వంలో ముంచుతుందని చెప్ప సాహసిస్తాను.

జరగవలసిన పనికి చాలినంతమంది పనివాళ్లు లేనప్పుడు యంత్రసహాయం మంచిదే. కాని భారతదేశంలోవలె అవసరానికి మించినంతమంది శ్రామికజనం వున్నచోట అది హానికరమవుతుంది. కొలది చదరపుగజాల నేలను త్రవ్వటకు మనం నాగలిని ఉపయోగించడం అవసరం కాదు. మన గ్రామాలలో క్రిక్కిరిసి నివసించే లక్షలాది జనానికి ఎలాగ విశ్రాంతి చేకూర్చడమనేది కాదు మన ప్రస్తుత సమస్య. ఏడాదికి ఆరుమాసాల పనికాలంతో సమానమైనవారియొక్క పనిలేకుండా గడిచే గంటలను ఎట్లా వినియుక్తం చేయడమనేదే మన సమస్య. సుమారుగా ప్రతిమిల్లూ మన గ్రామీణులకు పెనుభూతంగా వర్తిస్తున్నదని చెపితే అది ఆశ్చర్యకరంగా తోచవచ్చును. నేను సరిగా లెక్క తేల్చి చూడలేదు గాని, ప్రతిమిల్లు పనివాడూ కనీసం ఆ పనినే గ్రామాలలో చేసే పదిమంది శ్రామికులపెట్టుగా వర్తిస్తాడని అనడంలో పొరపాటుండదని మాత్రం చెప్పగలను. అనగా, అతను పూర్వం తను గ్రామంలో గడించేదానికంటె ఇప్పుడు పదింతలు ఆర్జిస్తాడనిన్నీ, తద్వారా పదిమంది తోడి గ్రామస్థులకు నష్టం కలిగిస్తాడనిన్నీ అర్థమిస్తుంది. ఆ విధంగా వడుకూ నేతా చేసే మిల్లులు గ్రామీణులయొక్క ప్రధానజీవనోపాధిని పడగొట్టాయని స్పష్టపడుతుంది. అయితే ఆ మిల్లులు చౌక

ధరలకు మునుపటికంటె మంచి రకపుబట్టని తయారుచేస్తాయి గదా అని చెప్పడం— అది కూడా సందేహాస్పదమే అనుకోండి— తగిన జవాబుకాదు. ఏమంటే, వాటిమూలంగా వేలాది శ్రామికులు పనిలేనివారై పోయేటప్పుడు, గ్రామాలలో తయారైన అతిప్రియమైన ఖద్దరుబట్టకంటె ఎంతచౌకఅయిన మిల్లుబట్టఅయినా గాని ఎక్కువఖరీదే అవుతుంది. బొగ్గుగని పనివానికి, అక్కడి కక్కడే ఉపయోగించుకుంటాడు కనక, బొగ్గుప్రియం కానట్లే, తన వడుకునూలుబట్ట తానే తయారు చేసుకుని ఉపయోగించుకుంటాడు కనక, గ్రామీణుని కది ఎన్నడూ ఎక్కువ ఖరీదుకాదు. ఇక, మిల్లుబట్ట ఒక్క గ్రామీణులైన శ్రామికులకు మాత్రమే పనిలేకుండా చేస్తే ధాన్యపు మిల్లులూ, పిండిమరలూ వేలాది గ్రామీణస్త్రీజనానికి పని లేకుండా చేయడమేకాక, మొత్తం ప్రజానీకంయొక్క ఆరోగ్యాన్నికూడా పాడుచేస్తాయి. మాంసాహారం తినేందుకు అభ్యంతరం లేనివారికిని, దానికి ఖర్చుపెట్టే స్తోమతగలవారికిని, మరపిండివల్లను, మరబియ్యంవల్లను హాని కలుగకపోవచ్చును; కాని మాంసాహారం దొరికితే తినడానికి అభ్యంతరం లేకపోయినాగాని లక్షలాది జనానికి అది లభ్యంకాని యీ భారతదేశంలో, వారందరికీ విసురుడు గోధుమపిండి ద్వారాను, దంపుడు బియ్యంద్వారాను లభ్యంకాగల బలకరమూ, ప్రాణాధారకమూ అయిన పదార్థాన్ని దొరకకుండా చేయడం పాపకార్యమౌతుంది. మరపిండి, మరబియ్యం వుపయోగించడంవల్ల కలిగే నష్టాలనుగురించి డాక్టర్లైనవారూ,

తదితరులూకూడా ప్రజలకు బోధించి ప్రచారం చేయడం చాలా అవసరం.

గ్రామీణ ప్రజలకు పనికల్పించడానికి మార్గం వారింతవరకూ అనుసరిస్తూవచ్చిన పరిశ్రమలను పునరుద్ధరించుట వల్లనేగాని, యంత్రసహాయంవలన కాజాలదని తెలుపుటకు అవసరమైన కొన్ని అంశాలను ప్రస్తుతం క్లుప్తంగా మీ దృష్టికి తెచ్చాను.

హరిజన్, 16-11-'34.

మన దైనికావసరాల సరఫరాకు మనం గ్రామాల మీదనే ఆధారపడవలెననిన్నీ, గ్రామాలద్వారా సరఫరా కాని అవసర వస్తువులేమైనా మిగిలివున్నచో, అవి కూడా కొంచెం శ్రమపడి ప్రయత్నంచేసి గ్రామాలలోనే తయారగునట్లును తద్వారా గ్రామాలకు లాభం చేకూరునట్లును చూడవలెననిన్నీ గ్రామపరిశ్రమా ప్రణాళికకు వెనుకవున్న ఉద్దేశం. ఆయా తయారీవస్తువుల వలన కలిగేలాభం లెక్క వేయునప్పుడు మనకుకలిగే లాభమునుగాక ఆయా గ్రామములకు కలిగే లాభమునే మనం మనసులో వుంచుకోవాలి. ప్రారంభదశలో మామూలు వస్తువులకంటె కొంచెం తక్కువతరహా వస్తువులకు మనం మామూలు ధరలకంటె కొంచెం ఎక్కువ ధరలను యివ్వవలసి వుండవచ్చును. మన అవసరాలను తీర్చే గ్రామ పారిశ్రామికుని యెడల మనం అభిమానం చూపి, ఆతడు ఇంకా మంచిగా తయారీ చేయవలసినదిగా ప్రోత్సహించి,

అందుకు మనం సహకారం చూపినయెడల, తప్పక పరిస్థితులలో సత్వరాభివృద్ధి చేకూరుతుంది.

హరిజన్, 23-11-'34.

గ్రామాలు నశిస్తే భారతదేశం కూడా నశించక తప్పదని నేనంటాను. భారతదేశ మప్పుడింక భారతదేశమనిపించుకోదు. ప్రపంచానికి ఆయమ ఒసగవలసిన సందేశమే శూన్యమైపోతుంది. గ్రామాలను దోచుకొని తినడమనేపద్ధతి పోతేనేగాని గ్రామపునరుద్ధరణకార్యం సాధ్యంకాదు. విస్తృతస్థాయిని యాంత్రికవిధానం అమలులోనికి వచ్చినయెడల, తత్ఫలితమైన పోటీసమస్యయు, అమ్మకపు సమస్యయు ఏర్పడడంద్వారా గ్రామాలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో దోచుకొని లాభాలు సేకరించడమనేది తప్పక జరిగి తీరుతుంది. అందుకని గ్రామాలు ముఖ్యంగా అవసరవస్తువులను తయారుచేయునవిగావుండి, తద్వారా స్వయంసమృద్ధంగా వుండేటట్లు చూడడానికి మనం మన దృష్టిని కేంద్రీకరించాలి. గ్రామపరిశ్రమలయొక్క ఈ రూపాన్ని పరిరక్షిస్తూ, గ్రామీణులు స్వయంగాచేసుకుని ఉపయోగించుకొనుటకు అనుగుణమైన ఆధునికయంత్రములనుగాని, పనిముట్లనుగాని వాడుటకు అభ్యంతరముండదు. అవి స్వలాభంకోసం ఇతరులను నష్టపరిచే పద్ధతినిమాత్రం వినియుక్తం కాకూడదు.

హరిజన్, 29-8-'36.

భారతదేశం తనతోపాటు పురాతనకాలంనుంచీ నిలిచివున్న గ్రామములతోగూడిన దేశంగా వుండవలెనా, లేక

వి దేశీయపాలన ఫలితంగా ఏర్పడిన నగరములతో కూడినదిగా వుండవలెనా అనే విషయంలో మనం ఏదో ఒక నిర్ధారణకు రావలసివున్నది. ఈనాడు నగరాలు గ్రామాలను పీల్చి పిప్పి చేసి, వాటి వినాశనానికి కారణమవుతున్నాయి. ఆ ఆధిక్యం తొలగినపిమ్మట నగరాలు గ్రామావసరాలకు తగిన రీతిగా వర్తించే పరిస్థితిలో వుండవలసి వుంటుందని ఖద్దరు మనస్కతకు వశంవదుడనైన నా యొక్క అభిప్రాయం. గ్రామాలను దోచుకొని లబ్ధి పొందడమనేదే ఒక రీతి సుసంఘటితమైన దౌర్జన్యవిధానం. అహింసాత్మకమైన పునాదిపై నిర్మితమైన స్వరాజ్యాన్ని కోరేపక్షంలో, మనం గ్రామాలకు వాటియొక్క స్వతసిద్ధమైన అర్హస్థానం చేకూరునట్లు చూడవలసివున్నది.

హరిజన్, 20-1-'40.

ఖద్దరు :

నా దృష్టిలో ఖద్దరు వస్త్రం భారతీయప్రజానీకంయొక్క సమైక్యతకూ, ఆర్థిక స్వాతంత్ర్యానికీ, సమానత్వానికీ చిహ్నం; అన్నిటికన్నా మిన్నగా, జవహర్లాల్ నెహ్రూ చక్కని కావ్యోక్తిలో నిర్వచించినట్లు దానిని నేను "భారత స్వాతంత్ర్యసేనకుల ఉడుపు" గా భావిస్తాను.

అంతేకాక, ఖద్దరు మనస్కత అంటే జీవితావసర వస్తువుల ఉత్పత్తి, పంపకములయొక్క వికేంద్రీకరణమని కూడా అర్థమిస్తుంది. అందువల్ల ప్రస్తుతానికి పరిణతమై వున్న సూత్రమేమిటంటే, ప్రతి గ్రామం తనయొక్క సర్వావసర

వస్తువులనూ తామే ఉత్పత్తి చేసుకోవాలి, దానితోపాటు నగరములకు సరఫరాచేసే నిమిత్తం మరికొంత అదనపు ఉత్పత్తి కూడా చేయగలిగి ఉండాలి.

బహుపరిశ్రమలను కేంద్రీకృతమూ, జాతీయమూ చేయకతప్పదు. అయితే అవి ప్రధానంగా గ్రామాధారంగా జరిగే విస్తృతమైన జాతీయ ఉత్పత్తి కార్యక్రమంలో చాలా స్వల్పమైన స్థానాన్ని మాత్రమే ఆక్రమిస్తాయి.

ఖద్దరు ఉత్పత్తి కార్యక్రమంలో ప్రత్తి పండించడం, గింజలు తీయడం, శుభ్రం చేయడం, ఏకడం, ఏకులు చేయడం, నూలు వడకడం, ముతకాసన్నం వేర్పరచడం, రంగులు వేయడం, పడుగుపేకా తయారుచేయడం, బట్ట నేయడం, ఉతికి శుభ్రపరచడం అనే పనులన్నీ ఇమిడి వుంటాయి. ఇందులో ఒక్క రంగులు వేయడం తప్ప మిగతా వన్నీ ప్రాథమిక ప్రక్రియలే. వాటిలో ప్రతిపనీ గ్రామాలలోనే నిపుణంగా చేయబడగలదు; అఖిలభారత చర్ఖాసంఘం ఆధ్వర్యం క్రింద భారతదేశం నలుమూలలకూ చెందిన గ్రామాలన్నిటిలోనూ ఆ పనులు ప్రస్తుతం అట్లే నైపుణ్యంతో చేయబడుతూ వున్నాయి.

గ్రామ పరిశ్రమలన్నిటికీ నాయకమణి వంటి ఈ పరిశ్రమ యొక్క దానికి సంబంధించిన ఇతర చేతి పనులయొక్క బలాత్కార వినాశనం జరిగిననాటినుంచీ బుద్ధికుశలతా, తెలివితేటలూ గ్రామాలను విడనాడి పరారీ అయిపోయి, వాటిని నిర్జీవమూ, కాంతి హీనమూ, చేసివేసి, తగినపోషణ

లేక నీరసించిన గ్రామీణ పశుజాలంతో సమానమైన పతన స్థితికి పాలొనర్చి వేశాయి.

కన్‌స్ట్రక్టివ్ ప్రోగ్రాం, పే. 12

ఇతర గ్రామ పరిశ్రమలు :

వీటి సందర్భం ఖద్దరు పరిశ్రమకంటె కొంచెం భిన్న మైనది. వీటిలో స్వచ్ఛంద శ్రామికత్వానికి హెచ్చు అవ కాశంలేదు. ప్రతి పరిశ్రమా ఎంతో కొంతమంది శ్రామికు లకు మాత్రమే పనియిస్తుంది. ఈ పరిశ్రమలు ఖద్దరుకు చేదోడు వాదోడుగా మాత్రమే ఉపకరిస్తాయి. ఖద్దరు లేకుండా అవి నిలవనూలేవు ; అవి లేకుండా ఖద్దరుయొక్క గౌరవమూ నిలవదు. చేతివిసురుడు, చేతిదంపుడు, సబ్బు తయారీ, కాగితపు తయారీ, అగ్గిపెట్టెలతయారీ, తోళ్లు బాగు చేయుట, నూనెగానుగ పని, మొదలైన ముఖ్యావసరములైన గ్రామ పరిశ్రమలన్నీ వుంటేతప్ప గ్రామీణ ఆర్థికప్రణాళిక సంపూర్ణంకాదు. కాంగ్రెసు కార్యకర్తలు వీటన్నిటి విష యంలోనూ శ్రద్ధవహించవచ్చును. వారు సహజంగా గ్రామీణులైవున్నా, లేక యిప్పుడు గ్రామవాసం చేపట్ట దలచినా గాని, వారు యీ పరిశ్రమ లన్నింటికిని నూతనో జీవనం, నూతన స్వరూపం ఒసగ గల్గుతారు. అందరూ, అవి ఎక్కడదొరికినా ఎప్పుడు దొరికినాగాని వాటిని సంపా దించుకుని, కేవలం గ్రామతయారీ వస్తువులను మాత్రమే వాడడమనేది తమకు అభిమాన విషయంగా పాటించాలి.

విక్రయావకాశం కలిగిస్తే మనకు అవసరమైన వస్తువులలో చాలా భాగం మన గ్రామాలనుంచి సరఫరా కాగలవు. మనం గ్రామ మనస్కతను పెంపొందించుకున్న యెడల, పాశ్చాత్యపు అనుకరణలనుగాని, మరతయారీ వస్తువులను గాని ఇక కోరం. దారిద్ర్యాన్నీ, ఆకలిబాధనూ, పనిలేని తనాన్నీ పటాపంచలొనరించే నవభారతాదర్శానికి అనుగుణమైన నిజమైన జాతీయాభిరుచిని మనం పెంపొందించుకుంటాం.

కన్‌స్ట్రక్టివ్ ప్రోగ్రాం, పే. 15.

కంపోస్టు ఎరువు:

భారతదేశపు ప్రజాబాహుళ్యంయొక్క ఇష్టపూర్తి అయిన సహకారం వుంటే, ఈ దేశం ఆహారపు కొరతను పారదోలడమేకాక కావలసినదానికంటె అదనపు ఆహారోత్పత్తిని కూడా చేయగలుగుతుంది. ఈ దైహికమైన ఎరువు భూమిని అత్యంతమూ బలపరుస్తుందేగాని, ఏ మాత్రమూ సారహీనం చేయదు. మన దైనికవిసర్జనములను జాగ్రత్తగా కంపోస్టు పద్ధతిని ఎరువుగా చేసినయెడల, అది బంగారంతో సమానమైన సారాన్ని భూమికి తిరిగి ఇస్తుంది. తద్వారా దేశానికి లక్షల ధనం ఆదా అగుటయే కాక, ఆహార ధాన్యాలూ, పప్పు దినుసులూ ఇనుమడించిన పరిమాణంలో పండుతాయికూడా. దానికితోడు విసర్జనమలములను వివేచనాపూర్వకంగా ప్రయోజనకరమొనరించడంవల్ల మన పరి

పర స్థలములుకూడా పరిశుభ్రపడతాయి. పారిశుధ్యత భక్తి భావానికి ప్రక్కమెట్టు అగుటయేకాక, ఆరోగ్యానికి కూడా అది మూలకందం.

హరిజన్, 28-12-'47.

గ్రామాలలో తోళ్ళపరిశ్రమ :

గ్రామాలలో తోళ్లను నునుపుచేసే పని భారతదేశ మెంత పురాతనమో అంతపురాతనమైన పరిశ్రమ. తోళ్లను నునుపుచేసే పని ఎప్పుడు నీచవృత్తిగా పరిగణింపబడడం మొదలైనదో ఎవరూ చెప్పలేరు. పురాతనకాలంలో అలా వుండేదికాదని తోస్తుంది. కాని ఈ రోజున అన్నిటిలోకీ ప్రయోజనకరమూ, అవసరమూ అయిన ఈ పరిశ్రమవల్ల సుమారు పదిలక్షలమంది జనులు పారంపర్యమైన అంటురాని తనం పాలయివున్న సంగతి మనం చూస్తూనే వున్నాము. శ్రామికులను హేయంగా చూసి, వారి యెడల అశ్రద్ధ చూపిన నాడే ఈ దురదృష్ట దేశానికి చెడ్డకాలం సంప్రాప్తమయింది. భూతలానికి మిక్కిలి ఉపయోగకరమైన లక్షలాదిజనులు, ఎవరి పరిశ్రమమీదైతే ఈ దేశంయొక్క ఉనికి ఆధారపడి వున్నదో వారందరూ హీనవర్గీయులుగా చూడబడడమున్నూ, వారిలో సహస్రాంశమైన విశ్రాంతిపరులగు అల్పసంఖ్యాకులు అధికారయుతమైన ఉన్నత వర్గానికి చెందినవారుగా పరిగ ణింపబడడమున్నూ జరిగి, తత్ఫలితంగా భారతదేశానికి నైతికంగానూ, ఆర్థికంగానూ కూడా నష్టకరమైన దురదృష్ట

పరిస్థితి ఏర్పడింది. ఈ రెండువిధాల నష్టంలోనూ ఏది ఎక్కువో అంచనావేయలేము. కాని కృషికుల యెడలను, గ్రామ పారిశ్రామికులయెడలను మనం చూపిన క్షమింపరాని అశ్రద్ధాభావం మూలంగా మనం దారిద్ర్యంలోనూ, మాంద్యంలోనూ, నిరంతరమైన నిర్వ్యాపారత్వంలోనూ పడిపోయాం. ఉత్కృష్టమైన శీతోష్ణస్థితితోనూ, సమున్నత పర్వత పంక్తులతోనూ, శక్తివంతములైన నదులతోనూ, విస్తారమైన సముద్రతీరంతోనూ కూడివున్న భారతదేశానికిగల అపారమైన ద్రవ్యసంపత్తిని తన గ్రామాలద్వారా వినియోగించడమేకనక జరిగితే, మనకు ఈ దారిద్ర్యమూ, ఆదివ్యాధులూ వుండేవేకావు. అంతేకాక మన మనశ్శక్తిని దైహిక శ్రమనుంచి దూరంచేయడంవల్ల మనం అందరిలోకీ అల్పాయుష్కులుగానూ, నిరుపాయజీవులుగానూ, భూతలంలోకల్లా కొల్లబోయిన జాతిగాను అయిపోయాం. గ్రామీణమైన తోళ్ళపరిశ్రమకు కలిగిన పతనావస్థనుబట్టి నేను పైన వ్యక్తంచేసిన నిందారోపణము ఋజువవుతుంది.

ఈనాడు మన దేశంనుంచి 9 కోట్ల రూపాయలవిలువగల ముడితోళ్లు విదేశాలకు ఎగుమతి అయి, అందులోచాలాభాగం తయారీ వస్తువులరూపంలో తిరిగి ఇక్కడికి దిగుమతి అవుతున్నట్లుగా అంచనావేయబడి వుంది. ఇది కేవలం ఆర్థికంగానే కాక, మానసికంగాకూడా మనకి నష్టకరమైన పని. దీని ఫలితంగా తోళ్లను నునుపుచేయుటలోను, దైని

కోపయుక్తములగు అనేకవిధములైన తోలు వస్తువులను చేయుటలోను పొందదగిన శిక్షణావకాశమునుగూడ మనం కోల్పోతున్నాము.

నూటికి నూరుపాళ్లు స్వదేశీ వస్తువులను ప్రేమించేవా రెవరికిగాని ఇది కావలసినంత పనియిస్తుంది. ఈ గొప్ప సమస్యయొక్క పరిష్కారసాధన విషయంలో పారిశ్రామిక నైపుణ్యప్రయోగానికి కావలసినంత అవకాశం వుంది. ఇది హరిజనులకు ఉపకరిస్తుంది; గ్రామీణులకు సహాయపడు తుంది; దీనిద్వారా ఉద్యోగాలకోసం వెదకాడే చదువు కున్న మధ్యతరగతి వ్యక్తులకు గౌరవయుతమైన వ్యాపారం ఏర్పడుతుంది. అంతేకాక దీనివల్ల విద్యావంతులకు గ్రామీ ణులతో ప్రత్యక్షసంపర్కం కలిగేందుకు తగిన అవకాశం కూడా కలుగుతుంది.

హరిజన్, 7-9-'34.

ఏవిధంగా ప్రారంభించడం:

గ్రామపరిశ్రమోద్ధరణ కార్యక్రమం ఏవిధంగా ప్రారం భించాలి?, మొదట చేయవలసిన దేమిటి?, అని ప్రశ్నిస్తూ విలేఖరులు నాకు వ్రాస్తున్నారు; మిత్రులు నన్ను కలుసు కుని అడుగుతున్నారు.

నీతోటే పని ప్రారంభం చేయమనీ, నీకు అన్నిటికన్నా ఏది చేయడానికి సులభమైతే ఆపని ముందుచెయ్యమనీ చెప్ప డమే ఈ ప్రశ్నకు స్పష్టమైన జవాబు.

అయితే కుతూహలపరులు ఈ జవాబుతో సంతృప్తి పొందరు. అందువల్ల ఈవిషయం మరికొంత విపులీకరించడం అవసరం.

ప్రతివ్యక్తీ తాను అనుదినమూ ఉపయోగించే తిండి పదార్థములనూ, బట్టలనూ, ఇతర వస్తువులనూ పరిశీలనచేసుకుని, వాటిలో విదేశములలోగాని నగరాలలోగాని తయారైనవాటికి బదులుగా గ్రామాలలో గ్రామీణులు తమ పొలాలలోనూ, గృహాలలోనూ, తాము స్వయంగా ఉపయోగించుటకును బాగుచేసుకొనుటకును సులభసాధ్యములైన చవకగా దొరికే పనిముట్లయొక్క సహాయంతో తయారుచేసిన వస్తుజాలమును మాత్రమే వాడుకొనవలెనని నిశ్చయించుకోవాలి. అంతకు పూర్వంవాడే వస్తువులకు బదులుగా వీటిని వాడుకొన నారంభించుటయే ఒక మంచి శిక్షణముగాను, సత్ప్రారంభముగాను ఉపకరించగలదు. తరువాత మెట్టు దానికదే ప్రత్యక్ష మవుతుంది. ఉదాహరణకి, ఈ ప్రారంభకుడు ఇంతవరకు ఒక బొంబాయి ఫ్యాక్టరీలో చేసిన పండ్లు తోముకునే బ్రష్షును ఉపయోగిస్తున్నాడని అనుకుందాం. అతడు దానికి బదులుగా గ్రామీణమైన బ్రష్షును వాడగోరినయెడల, ఒక వేపపుల్లను కోసితెచ్చుకొని దానిని ఉపయోగించమంటాను. అతడి పళ్లు దుర్బలమైనవి అయినా, లేక అతడు పండ్లు లేనివాడైనా, అప్పుడు ఆతడు ఆవేపపుల్ల ఒక చివరను రాయితోగాని, సుత్తితోగాని చితకగొట్టి మెత్తగా చేసికొని, దానితో పళ్లు తోముకోవచ్చును. రెండవకొసనుంచి

దానిని చీల్చి రెండుబద్దలుగా చేసి, ఆ బద్దలను నాలుకగీచి కొనుటకు ఉపయోగించవచ్చును. చాలా అపరిశుభ్రమైన ఫ్యాక్టరీ బ్రష్షుకంటె ఈ దేశీయమైన బ్రష్షు ఎక్కువ చవకగా దొరుకుతుంది, శుభ్రంగాను పనిచేస్తుంది. పట్నంలో తయారైన పండ్లపొడులకు బదులుగా అతడు కట్టె బొగ్గూ, ఉప్పూ సమభాగములలో కలిపి మెత్తనిపొడిగా చేసి, ఆ సహజమైన పండ్లపొడిని వాడుకొనవచ్చును. అట్లే అతడు మిల్లుబట్టలకు బదులు గ్రామంలో వడికిననూలుతో తయారైన ఖద్దరుబట్టను, మిల్లుబియ్యమునకు బదులుచేతితో దంచిన మెరుగుపెట్టని బియ్యమును, తెల్లచక్కెరకు బదులు గ్రామ తయారీఅగు చెరకు బెల్లమును వాడ నారంభించాలి. ఇవి ఈ పత్రికలో ఈవరలో ఉదాహరణలుగా పేర్కొనివున్నవే. నాతో ఈ విషయం లోగడ చర్చించిన మిత్రులకు విశదీకరించే నిమిత్తం వాటిని ఇప్పుడు తిరిగి ఉటంకిస్తున్నాను.

హరిజన్, 25-1-'35.

అధ్యాయం ౨౮

ప్రభుత్వం చేయదగిన సహాయం

ఇప్పుడు అధికారంలోకి వచ్చారుకనుక, కాంగ్రెసు మంత్రులు ఖద్దరుపరిశ్రమకు, ఇతరములైన గ్రామపరిశ్రమలకు ఏమిసహాయం చేస్తారనేది అడగవలసిన ప్రశ్న. అందునిమిత్తం ప్రత్యేకమైన ఒకమంత్రి నియామకమైనా కాకపోయినా,

ఆ పనికోసం ఒక ప్రత్యేక ప్రభుత్వశాఖను ఏర్పాటుచేయడం మాత్రం తప్పకుండా అవసరం. ఆహారపదార్థాలకూ, వస్త్రాలకూ గిరాకీ ఏర్పడిన ఈ రోజులలో అటువంటి ప్రభుత్వశాఖ చాలా ప్రయోజనకరమైన పనిచేయగలుగుతుంది. అఖిల భారత చర్ఖాసంఘం, అఖిలభారత గ్రామోద్యోగ సంస్థల ద్వారా మంత్రులకు నిపుణుల సలహాలు లభ్యం కాగలవు. బహుస్వల్పమైన పెట్టుబడితో సాధ్యమైనంత తక్కువ గడువులో భారతదేశమంతకును ఈ నాడు ఖద్దరు బట్టను సరఫరా చేయడానికి వీలుంది. ప్రతి ప్రదేశ ప్రభుత్వమున్నూ అందలి గ్రామప్రజలకు తమకు అవసరమైన ఖద్దరుబట్టను తామే తయారుచేసికొనవలెనని తెలుపుడి చేయాలి. తద్వారా స్థానికమైన తయారీ, పంపకమూ కూడా హాటంతట అవే జరిగిపోతాయి. దానితోపాటు అంతోయింతో నగరాల అవసరాలకు కూడా మిగిలి, తద్వారా స్థానికమిల్లులపై ఒత్తిడికూడా కొంత వరకు తగ్గుతుంది. అప్పుడు ఆ మిల్లులు బట్టగిరాకీవున్న ప్రపంచంలోని ఇతరచోట్లకు ఎగుమతీ చేసే నిమిత్తం అదనపు తయారీ చేయగలుగుతాయి కూడా.

ఈ విధంగా జరిగేటట్లు చూడడం ఎలాగ?

ప్రతిగ్రామమూ ఒక నిర్ణీతమైన తేదీలోగా తన అవసరాలన్నిటికి సరిపోయే ఖద్దరు ఉత్పత్తి చేసుకునే స్థితిలో వుండవలెననిన్నీ, అటుపిమ్మట వారికి బయటనుంచి బట్ట సప్లయికాదనిన్నీ గ్రామస్థులందరికీ ప్రభుత్వప్రకటన ద్వారా

తెలుపుడి చేయాలి. తమ దిక్కున ప్రభుత్వమున్నా వారికి ప్రతివిత్తనాలుగాని, ప్రత్తిగాని అవసరమైనప్పుడల్లా కొనుబడి ధరలకు సప్లయి చేయాలి; ఉత్పత్తి సాధనాలు కూడా కొను బడి ధరలకు సరఫరా చేయాలి; గ్రామీణులవద్దనుంచి వీటి విలువ సులభమైన వాయిదాలలో అయిదు సంవత్సరములకు తక్కువకాని కాలంలో వసూలుచేయవచ్చును. అవసరమైన చోట్లకు నిపుణులను పంపి తరిఫీదు యివ్వడానికి ఏర్పాటు చేయాలి. గ్రామీణులు తమ తయారీబట్టతో ముందుగా తమ అవసరాలు పూర్తిగా తీర్చుకున్న పిమ్మట, అదనపు బట్ట మిగిలిన పక్షంలో, దానిని ప్రభుత్వం తాను కొనడానికి హామీ యివ్వాలి. ఇట్టి విధానంద్వారా ఏమీ అడావిడి లేకుండానూ, బహుతక్కువైన అదనపు ఖర్చులతోనూ బట్టల కొరతసమస్యను రూపుమాపవచ్చును.

ఏయే గ్రామాలలో ఏయే వస్తువులు స్థానికంగా ఉత్పత్తి చేయడానికి వీళ్ళు ఉన్నవి; ఏయే వస్తువులు గ్రామీణుల నిత్యజీవితానికి అవసరమైనవి, ఏవి ఇతరచోట్ల అమ్మకానికి పనికివచ్చేవి, అనే వివరాలన్నీ తెలుసుకొనుటకుగాను గ్రామ ప్రాంతాలలో సర్వే జరిపించి, జాబితాలు తయారుచేయాలి. ఉదాహరణకి, గానుగలో తయారగు వంటనూనెలు, తెలక పిండి, గానుగలో తయారగు దీపపునూనెలు, దంపుడుబియ్యం తాటిబెల్లం, తేనె, ఆటబొమ్మలు, చాపలు, చేతి తయారీ కాగితం, గ్రామతయారీ సబ్బు వస్త్రాలనుగూర్చి ఈ సర్వే

జరిపించవచ్చును. ఈ విధమైన అవసరచర్యలను అమలుచేసి శ్రద్ధ చూపినచో, ఇంతవరకు పూర్తిగానో సుమారుగానో నిర్జీవమై పోయివున్న గ్రామసీమ తిరిగి నూతన జీవంతో ప్రతిధ్వనించ గలుగుతుంది. తన అవసరాలను తీర్చుకొను టతోపాటు, గ్రామసీమ నగరాలకూ పట్నాలకూ కూడా ఎన్ని సరుకులను సరఫరా చేయగలదో అప్పుడు ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

ఇక, క్షమింపరాని అశ్రద్ధపాలై నీరసించిపోయిన భారతదేశపు అపారమైన గోసంపత్తి విషయం. ఈ సందర్భంలో, ఇంకా అవి తగినంత అనుభవం గడించివుండక పోయినా, గోసేవా సంఘముల ద్వారా ఎంతో కొంత విలువైన పని జరగడానికి అవకాశం వుంది.

ప్రాథమిక విద్యా శిక్షణం కోసం మన గ్రామాలు తహతహ పడుతున్నాయి. ఈ ముఖ్యమైన అవసరాన్ని హిందూస్థానీ తాలిమీ సంఘముద్వారా తీర్చవచ్చును.

హరిజన్, 28-4-'46.

అధ్యాయం ౫౮

గ్రామ ప్రదర్శనములు

గ్రామం నశించకుండా నిలవడమేకాక అది బలపడి పురోభివృద్ధిని పొందవలెనని కోరేపక్షంలో, మనం గ్రామీణ

మైన దృక్పథాన్ని అలవరచుకోవడమే దానికి తగిన మార్గం. ఇది నిజమైతే మనం ఏర్పాటుచేసే ప్రదర్శనాలలో నగరా లకు చెందిన వైభవానికీ ఆర్భాటానికీ తావొసగ కూడదు. నగరజీవితానికి చెందిన క్రీడలూ, ఇతరవిధములైన వినో దాలూ అక్కడ వుండనవసరంలేదు. ప్రదర్శనం అనేది "తమాషా" (వినోదస్థలం) కాకూడదు; ఆదాయం రాబట్ట డానికి ఉపకరణంగాకూడా అది వర్తించకూడదు; వ్యాపార స్థులకు అది ప్రచారసాధనంగా కూడా ఉపకరించకూడదు; అక్కడ అమ్మకాలు జరపడమనేది అనుమతించబడకూడదు. ఖద్దరూ గ్రామపారిశ్రామిక వస్తువులూ అయినాకూడా అక్కడ అమ్మకం జరపకూడదు. ప్రదర్శనం విద్యాసాధనంగా మాత్రమే ఉపకరించాలి, ఆకర్షణీయంగా వుండాలి; గ్రామీ ణులకు ఏదో ఒక పరిశ్రమను చేపట్టుటకు ఉత్సాహమొసగే రీతిగా వుండాలి. ప్రస్తుతం గ్రామజీవితంలో ఏర్పడివున్న ముఖ్యమైన లోపాలను అసౌకర్యాలనూ వెల్లడించి, వాటిని బాగుపరిచే నిమిత్తం అవలంబించదగిన పద్ధతులను ప్రదర్శిం చేవిగా వుండాలి. గ్రామోద్ధరణ కార్యక్రమం అమలైనది మొదలు నేటివరకు జరిగివున్న ఉన్నతిని గురించిన అంచ నాలను తెలిపేదిగా కూడా వుండాలి. గ్రామజీవితాన్ని కళాయు తమూ, సుందరమూ ఒనర్చే మార్గాలనుకూడా ప్రదర్శనం ద్వారా గ్రామీణులకు నేర్పాలి.

ఇక, పైన చెప్పిన షరతులను అనుసరించే ప్రదర్శనం యొక్క రూపం ఎట్లా వుంటుందో చూద్దాం.

1. రెండువిధములైన గ్రామపు నమోనాలు చూప బడాలి—ఒకటి ఈనాడు వున్న పరిస్థితిని తెలిపేది, రెండవది పురోభి వృద్ధిపొందిన తర్వాత వుండే పరిస్థితిని తెల్పేది. ఈ ఆదర్శగ్రామం అన్నివిధాలా పరిశుభ్రంగా వుంటుంది. దానిలోని యిళ్లూ, వీధులూ, పరిసరాలూ, పొలాలూ అన్నీ శుభ్రంగా వుంటాయి. పశువుల పరిస్థితిలో జరుగుతున్న అభివృద్ధి కూడా ప్రదర్శితం కావాలి. ఏయేపరిశ్రమలు ఎక్కువ లాభం చేకూరుస్తాయో, ఏ విధంగా చేకూరుస్తాయో తెలిపే పుస్తకాలూ, చిత్రాలూ, అంచనాలు వేసిన పటాలూ ప్రదర్శనంలో వినియుక్తం కావాలి.

2. వివిధములైన గ్రామపరిశ్రమలను ఏ రీతిగా నడిపించుకోవాలో, వాటికి అవసరమైన పరికరాలు ఎక్కడ దొరుకుతాయో, వాటిని ఎట్లా తయారు చేసికొనవలెనో కూడా అక్కడ ప్రదర్శింప బడాలి. ఆయా పరిశ్రమలు ఆచరణలో ఎట్లా చేయాలో తెల్పడానికి, వాటిని అక్కడ జరిపించి చూపాలి. ఈ విషయాలతోపాటు ఈ క్రింది అంశాలు కూడా అక్కడ వుండాలి:

(i) గ్రామీణులకు ఆదర్శప్రాయమైన ఆహారవిధానం.

(ii) గ్రామపరిశ్రమలను, యంత్రపరిశ్రమలను పోల్చి చూపడం.

(iii) జంతువుల పెంపకం విషయంలో ఆదర్శపాఠాలు.

(iv) కళా విభాగం.

(v) గ్రామపు మరుగుదొడ్డి నమోనా.

(vi) పశువుల ఎరువు, దానితో పోల్చి రసాయన ఎరువు.

(vii) జంతువుల తోళ్లు, ఎముకలు వగైరాల వినియోగం.

(viii) జానపద సంగీతం, సంగీతవాద్యాలు, జానపద నాటకాలు.

(ix) గ్రామీణ క్రీడలు, గ్రామపు "అఖాడాలు" (దేహ పరిశ్రమశాలలు), రకరకాల దేహపరిశ్రమ పద్ధతులు.

(x) "నయీ తాలిమ్" (నూతన విద్యావిధానం)

(xi) గ్రామ వైద్యం.

(xii) గ్రామ ప్రసూతి వైద్యశాల.

మొదట వివరించిన సూత్రాల ననుసరించి ఈ జాబితాను ఇంకా పెంచవచ్చును. నేను పేర్కొన్నవి ఉదాహరణప్రాయమైనవే; ఇది సంపూర్ణమైన జాబితాగా ఎంచనక్కరలేదు. చర్ఖాను గురించీ, ఇతర గ్రామపరిశ్రమలను గురించీ నేనేమీ ప్రత్యేకంగా చెప్పలేదు, వాటికి ఎలాగూ స్థానం వుంటుందనే అభిప్రాయంతో. అవి లేకుండా గ్రామ ప్రదర్శనం అనేది పూర్తిగా నిరుపయోగమవుతుంది.

గ్రామోద్యోగపత్రిక, జూలై 1946.

అధ్యాయం ౭౬

రాట్నపు సంగీతం

నేను రాట్నంమీద దారం తీసినప్పుడల్లా భారత దేశంలోని పేదవారిని తలుచుకుంటాను. భారతదేశంలోని పేదలు ఈనాడు, మధ్యతరగతులకంటెను ధనికులకంటెను ఎక్కువగా, దేవునిలో తమ విశ్వాసాన్ని కోల్పోయారు. ఆకలిబాధతో అలమటించి, కడుపునిండడం తప్ప అంతకు మించిన కోరికలేనివానికి, కడుపే పరమేశ్వరసదృశమౌతుంది. ఎవడు వానికి తిండిపెడితే ఆతడే వానికి ప్రభువు. ఆతని ద్వారా వాడు దైవదర్శనంకూడా పొందవచ్చును. అటు వంటి వికలాంగులు కానివారికి ముష్టివేయడం మనలనూ వారినీకూడా హీనపరచుకున్నట్లే అవుతుంది. వారికి కావల సింది ఏదో ఒక పని. లక్షలాది జనానికి పని కల్పించడానికి అనువైనది నూలు వడుకుట ఒక్కటే ... నా నూలు వడు కుటను నేనొక తపస్సుగాను, ఈశ్వర నివేదనగాను వర్ణించి వున్నాను. పేదలగురించిన స్వచ్ఛమూ, క్రియాత్మకమూ అయిన ప్రేమ ఎక్కడ నివిష్టమైవుంటే అక్కడ పరమేశ్వరు డున్నాడని నేను నమ్మ్నటనుబట్టి, నేను రాట్నముపై తీసే ప్రతి నూలుపోగులోను పరమేశ్వర దర్శనమును అనుభూత మొనర్చుకుంటాను.

యంగిండియా, 20-5-'20

వడుకునూలు, చేనేత పరిశ్రమల పునరుద్ధరణద్వారా భారతదేశంయొక్క ఆర్థిక, నైతిక పునరుజ్జీవనమునకు అపార

మైన లాభం కలుగుతుందని నా దృఢ విశ్వాసం. ప్రజానీకానికి వ్యవసాయమునకు తోడుగా వుండే సులభసాధ్యమైన మరొక పరిశ్రమ చాలా అవసరం. నూలువడికే వృత్తి చిరకాలానుగతంగా వున్నటువంటి కుటీరపరిశ్రమ. ప్రజాబాహుళ్యం క్షుద్బాధయొక్క బారినుండి రక్షింపబడవలెనంటే, వారు తిరిగి తమయిండ్లలో చేతి రాట్నమును ప్రవేశపెట్టుకొనుటకు మనం సహాయంచేయాలి; ప్రతి గ్రామము తిరిగి తన స్వంత నేతపనివారిని కలిగి వుండునట్లుగా చూడాలి.

యంగిండియా, 21-7-'20.

నూలు వడకడమొక్కటే పరమేశ్వరార్పణపూర్వకమైన దైహికశ్రమగా ఆచరించుటకు అనుకూల్యతను, యోగ్యతను కలిగి వున్నదని నాకు తోస్తుంది. అంతకంటె ఉత్కృష్టమూ, జాతీయము అయినదానిని నేను ఊహించలేను. ఎందువల్లనంటే, తద్వారా పేదవారు తప్పనిసరిగా చేయవలసిన పరిశ్రమను మనంకూడా ప్రతిదినమూ ఒకగంటసేపైనా చేసి, ఆ పేదలతోనూ, వారిద్వారా సర్వమానవకోటితోనూ తాదాత్మ్యమును అనుభవించగల్గుతాము. పేదలు ఏరీతిగా శ్రమిస్తారో అదేరీతిని ఈశ్వరార్పితంగా నేనుకూడా ఆ పేదల నిమిత్తం పనిచేయుటకంటె ఉత్తమమైన దైవారాధన విధానమును నేను ఊహించుకొనలేను. భూతలమందలి సంపత్తియొక్క న్యాయతరమైన పంపకానికి చిహ్నాత్మకమైనది నా రాట్న చక్రం.

యంగిండియా, 20-10-'21.

ఆర్థికమస్థితిని తొలగించడానికి అతి సహజమైన, సులు నైన, చవకైన, వ్యాపారానుకూలమైన ప్రధాన సాధనము రాట్నచక్రమే అని నేను గట్టిగా చెప్పగలను. అందువల్ల రాట్నమును నిరుపయోగకరమైనదిగా భావించడం పొర పాటు. అది ప్రతియింటా తప్పనిసరిగా వుండవలసిన అత్యంత ప్రయోజనకరమైన వస్తువు. అది దేశసౌభాగ్యానికిచిహ్నం. అందునుబట్టి అది స్వాతంత్ర్యానికి కూడా చిహ్నం. అది యుద్ధసన్నద్ధమైన వ్యాపారానికికాక, శాంతినిబద్ధమైన వ్యాపా రానికి సంకేతం. అది ప్రపంచంలోని ఇతరదేశాలకు ద్వేష యుతమైన సందేశాన్ని అందీయదు. సౌహార్ద, స్వయం సహాయభావములతో కూడిన సందేశమును అందజేస్తుంది. దానికి లోకశాంతిని భంగపరిచి అందలిద్రవ్యసంపత్తినంతను దోచుకునే నౌకాదళంయొక్క సహాయం ఏమీ అక్కరలేదు, దేశంలోని ప్రజానీకం అందరూ రోజూ తమ యిండ్లలోనే తమ తిండిని వండుకునే రీతిగానే తమ నూలును తాము వడుకుకొనడానికి భక్తిపురస్సరంగా తీర్మానించుకోవడం మాత్రమే అవసరం. నేను చేసిన ఇతరములైన ఏ తప్పొప్పుల కైనను ముందుతరంవారు నన్ను దూయబట్టవచ్చునేమో గాని, రాట్నచక్రమును పునఃస్థాపితం చేసినందుకు మాత్రం నేను తప్పక వారియొక్క మన్ననలనుమాత్రమే పొందగల నని నిశ్చయంగా చెప్పగలను. నా సర్వస్వమును దానిపై ఒడ్డివున్నాను. ఎందువల్లననగా, రాట్నచక్రంయొక్క ప్రతి

చుట్టులోనూ శాంతి, సౌహార్ద్రి, ప్రేమభావములనే దారం వడకబడుతుంది. ఈ కారణము లన్నిటినిబట్టి, ఏ విధంగా రాట్నచక్రంయొక్క వినాశంతో పాటు భారతదేశం బానిసత్వంలో మునిగిపోయినదో, అదేవిధంగా పైన పేర్కొన్న అంతరార్థము లన్నిటిని అర్థంచేసుకుని మనఃపూర్వకంగా రాట్నచక్రమును పునఃప్రతిష్ఠితం చేయడంతోపాటు భారతదేశ స్వాతంత్ర్యసిద్ధికూడా లభ్యమౌతుంది.

యంగిండియా, 8-12-'21.

నా అభిప్రాయంలో రాట్నమువలన ఏయే లాభములు సిద్ధించగలవంటే—

1. పనిలేకుండా వుండి కాసిని పైసలు చేసుకోనదలచిన వారికి ఉన్నపట్టున చేయగల వ్యాపకాన్ని కల్పిస్తుంది;

2. వేలాది జనానికి అది పరిచితమైన వస్తువు;

3. అది సులభంగా నేర్చుకోడానికి వీలైనది.

4. దానికి సుమారుగా పెట్టుబడి ఏమీ అవసరం లేదు.

5. దానిని సులభంగాను, చౌకగాను చేయవచ్చును. ఇంత పెంకుముక్క ఒక పుల్లసహాయంతోకూడా నూలువడకవచ్చుననే సంగతి ఇంకా మనలో చాలామందికి తెలియదు;

6. ప్రజలకు దీనియెడల ఏమీ అయిష్టతలేదు,

7. కరువు కాటకాల సమయంలో ఇది తక్షణప్రయోజనకరంగా ఉపకరిస్తుంది.

8. విదేశీబట్టల దిగుమతీవల్ల కలిగే దేశసంపత్తియొక్క నష్టాన్ని అరికట్టగలిగిన సాధనం ఇదొక్కటే.

9. ఆ విధంగా దేశానికి మిగిలే లక్షలధనాన్ని అన్నార్తులైన పేదలకు పంపకం చేయడానికి ఇది సహజసిద్ధమైన సాధనం;

10. ఇది ఎంతవరకు జయంపొందితే అంతవరకు వెంటనే ప్రజలకు లాభాన్ని చూపిస్తుంది.

11. ప్రజలలో సహకారభావం పెంపొందించుటకు ఇది అన్నిటికంటె శక్తివంతమైన సాధనం.

యంగిండియా, 21-8-'24.

“మీరు కోరేది కేవలం చేతినూలువడకడం మాత్రమే కదా. అది ఇంకా దేశమంతటా ఎందుకు వ్యాప్తంకాలేదు?” అని విమర్శకుని ప్రశ్న. ఈ ప్రశ్న సబబైనదే. దీనికి జవాబు కూడా సులభమే. ఆశ అడుగంటిపోయి, కార్యోత్సాహం కృశించి, వారికి వారిని వదలివేస్తే పనిచేసి బ్రతకడానికంటె పస్తుండి చావడానికే యిష్టపడేటటువంటి ప్రజానీకానికి ఈ రాట్న సందేశాన్ని మనం అందజేయవలసివున్నది. వారు పూర్వం ఇలా వుండేవారుకాదు; చిరకాలానుగతమైన నిస్సహాయస్థితివల్ల వారికి ఈ విధమైన మందకొడితనం అలవాటయిపోయింది. పట్టుదల, క్రియాశీలత కలిగిన కొందరు వ్యక్తులు వారితో సంబంధం కలిగించుకుని, వారి ముందర రాట్నం వడికి చూపించి దారిజూపితే, తద్వారా వారిలోని సోమరితనం తొలగిపోయి చురుకుతనం జనించగలుగుతుంది. రెండవచిక్కు, వడుకునూలుబట్టకు తయారుగావున్న విక్రయావకాశాలు లేకపోవడం. ప్రస్తుత దశలో అది మిల్లుబట్టతో

పోటీచేయలేదని నేను ఒప్పుకుంటాను. అట్టి చంపుకునే పోటీని నేను అనుమతించనూ అనుమతించను. అమ్మకపు మార్కెట్లును వశపరచుకొనే నిమిత్తం పెట్టుబడిదారీ వ్యాపారి తన మిల్లు తయారీబట్టను ఖరీదువాడులుకుని కూడా అమ్మ వచ్చును. తన శ్రమయే తనకున్న పెట్టుబడి అయిన శ్రామికుడు ఆ విధంగా చేస్తే బ్రతకలేడు. కృత్రిమంగా చేయబడిన గులాబీపువ్వు, అది ఎంత సమపరిమాణంలో వున్నా, దానికీ సజీవమైన గులాబీపువ్వుకీ మధ్య పోటీ ఏమిటి? క్రాంవెల్ యొక్క మైనపు ప్రతిమకీ, ఆయన సజీవ వ్యక్తికీమధ్య పోటీ అంటే అర్థముంటుందా? అట్లే ఖద్దరు అనేది సజీవమైన వస్తువు. కాని భారతదేశం నిజమైన కళాదృష్టిని కోల్పోయి, పైమెరుగులతో సంతృప్తి పడుతూవున్నది. ఖద్దరు మొదల ఆరోగ్యవంతమైన జాతీయాభిరుచిని పునరుజ్జీవింప జేసిననాడు, తిరిగి ప్రతిగ్రామం ఒక తేనెపట్టులాగ జుమ్మని ప్రతిధ్వనిస్తూ వుంటుంది. ప్రస్తుతం వడుకునూలుబట్టకు విక్రయావకాశాలు కల్పించే నిమిత్తం ఖద్దరు సంస్థలన్నీ సాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఇన్ని ఆటంకాలు వున్నాగాని, ఈ ఉద్యమం ఇంతవరకూ పురోగమించడమే ఒక అద్భుత విషయం.

నేనింతవరకు చేతిమగ్గానికి ప్రతిగా రాట్నచక్రమును ఒక సహాయపరిశ్రమగా సమర్థిస్తూ క్లుప్తంగా విశదీకరించాను. నా భావాన్ని అపార్థం చేసుకోవద్దని కోరుతాను. నేను చేతిమగ్గానికి వ్యతిరేకినికాను. అది చాలా లాభసాటి వ్యాపా

రంగా నడిచే గొప్పపరిశ్రమ. చేతిరాట్నం విజయం పొందితే అదిన్నీ తనంతతానే అభివృద్ధి పొందుతుంది. కాని చేతి రాట్నానికి ఓటమి కలిగితే మాత్రం, దానికి కూడా వినష్టి తప్పదు.

యంగిండియా, 11-11-'26.

నేను రాట్నచక్రాన్ని ప్రజానీకంయొక్క ఆశా చిహ్నంగా పరిగణిస్తాను. పూర్వంలో ప్రజాబాహుళ్యానికి ఎంతపాటి స్వాతంత్ర్యంవున్నా, రాట్నంపోగానే అది కాస్తా కూడా అదృశ్యమైపోయింది. చర్ఖా గ్రామీణుల వ్యవసాయ కృషికి అనుబంధంగా వర్తించి, దానికి పరపతి కలిగించేదిగా వుండేది. అది అనాథలైన స్త్రీ జనానికి అండగా వుండి, మిత్రునివలె సహకరించేది. గ్రామీణులు సోమరితనంలో పడకుండా పనికల్పించేది. ఏమనగా, చర్ఖా పరిశ్రమ అంటే దానికి ముందు అవసరమైన పనులూ, తర్వాత అవసరమైన పనులూ— అనగా విత్తులు తీయుట. ఏకుట, పడుగుచేయుట, తరగతివారీగాచేయుట, రంగులు వేయుట, నేతనేయుట అనే వన్నీకూడా— దానిలో భాగములుగా ఇమిడి వుండేవి. ఇవి గ్రామపు వడ్రంగికీ, కమ్మరికీకూడా పని కల్పించేవి. చర్ఖా సహాయంతో మన ఏడులక్షల గ్రామసమూహమూ కూడా స్వయంసమర్థంగా వుండగలిగేది. చర్ఖా పోగానే నూనెగానుగ వంటి గ్రామపరిశ్రమలన్నికూడా రూపుమాసిపోయాయి. ఈ పరిశ్రమలస్థానే క్రొత్త వృత్తులేమీ రాలేదు. అందువల్ల క్రమేపీ గ్రామాలు వివిధములైన తమ వృత్తివ్యాపారాలనూ,

కర్మకౌశలమునూ కోల్లబోయి, వాటివల్లవచ్చే కొలదిపాటి అదాయాన్నికూడా కోల్పోయాయి.

అందువల్ల మన గ్రామాలు తిరిగి స్వస్థత పొందవలె నంటే, సాంగోపాంగమైన చర్ఖా పరిశ్రమయొక్క పునరుద్ధరణం ఒక్కటే సహజసిద్ధమైన సాధనమని గోచరిస్తుంది. ఏకాగ్ర మనస్కతతో ఈ చర్ఖా సందేశాన్ని గ్రామసీమలో ప్రచారమొనర్చి, కాంతివిహీనమైన గ్రామప్రజల కండ్లలో ఆశాజ్యోతియొక్క కిరణప్రసారం కలిగింపజాలిన దేశభక్తి పూరితులూ, వివేకవంతులూ, స్వార్థరహితులూ అయిన భారతీయులతోకూడిన సేవాదళాలు ఏర్పడి అందుకు పూనుకుంటే తప్ప, ఈ పునరుద్ధరణకార్యం కొనసాగ నేరదు. ఇది క్రమబద్ధమైన సహకార విధానమును, పయోజన విద్యాప్రణాళికను అమలులోనికి తెచ్చుటకు చేసే బ్రహ్మాండమైన సముద్యమం. రాట్నచక్రంయొక్క ప్రశాంతమూ, ప్రస్ఫుటమూ అయిన పరివర్తనమువలెనే ఈ ఉద్యమమున్నూ ఒక నిశ్శబ్దమైన, నిశ్చయమైన సాంఘికపరివర్తనమును తీసుకురాగలదు.

హరిజన్, 13-4-'40.

అధ్యాయం ౩౦

మిల్లు పరిశ్రమ

ఇవాళ మన మిల్లులు మన అవసరాలకు తగినంత నూలు తయారుచేయలేవు; ఒకవేళ చేసినా, బలవంతమైతే

తప్ప అవి ధరలను అదుపులో వుంచవు. అవి బహిరంగంగా లాభాలకోసమే నడుస్తాయి కనక, దేశపు స్థితిగతులనుబట్టి ధరలను నిర్ణయం చేయవు. ఇక చేతివడుకు పరిశ్రమవల్ల పేద గ్రామీణులచేతులలో లక్షలధనం మిగుల్తుంది. వ్యవసాయా ధారమైన ప్రతిదేశంలోనూ రైతాంగం పనిలేనికాలంలో చేసుకొనడానికి సహాయకపరిశ్రమ ఒకటి అవసర మవుతుంది. భారతదేశంలో చిరకాలానుగతంగా నూలు వడుకుట అట్టి సహాయపరిశ్రమగా వుంటూ వచ్చింది. ఒకానొకప్పుడు ఏ పరిశ్రమలో అయితే దేశీయమైన పనితనంయొక్క కళా నైపుణ్యం సుందరదుకూలరూపంగా లోకపరివ్యాప్తమై దేశ దేశాలను అద్భుతావహ మొనరించినదో, ఏ వ్యాపారం యొక్క వినాశనం మూలంగా మనదేశం బానిసత్వంలోనూ దారిద్ర్యంలోనూ మునిగిపోయిందో, అట్టి పురాతన పరిశ్ర మకు యీనాడు తిరిగి ఉజ్జీవనం కలిగించేందుకు చేసే ప్రయ త్నాన్ని కేవలం స్వాప్నికాదర్శమని అనగలరా?

యంగిండియా, 16-2-'21.

పెద్దస్థాయిని నడిచే మిల్లు పరిశ్రమకూడా భారతీయ మైన పరిశ్రమయే గదా అని చెప్పవచ్చును. జపానుతోటీ ల్యాంకషైర్‌తోటీ అది పోటీ చేయగలిగితే చేయవచ్చును గాని, భారతదేశంలోమట్టుకు అది పేదప్రజానీకాన్ని కొల్ల గొట్టే పరిశ్రమగా వర్తిస్తుందని చెప్పకతప్పదు. అది ఖద్దరు బట్టకు ఎంత ఓటమిని కలిగిస్తే అంతగా పేదప్రజానీకాన్ని దారిద్ర్యంలో ముంచినదవుతుంది. ఆధునిక లోకానికి

యంత్రపరిశ్రమలమీద ఏర్పడిన మోజులో నా ప్రతిపాదన, పూర్తిగా త్రోసివేయబడకపోయినా, ఎదుర్కొనబడుతూ వున్నది. యంత్రపారిశ్రామికతా వ్యాప్తివల్ల ప్రజాబాహుళ్యంయొక్క పేదరికం పెరగడం తప్పనిసరి కాబట్టి, దానికి ఒడబడకతప్పదని వాదింపబడుతూవున్నది. గ్రామీణులు పని లేనికాలంలో నూలువడుకుట, దానికి ప్రాథమికమైన పనులు చేయుటద్వారా భారతదేశమంతటికీ బట్ట సరఫరా కాగలదని అఖిలభారత చర్ఖాసంఘం విజయవంతంగా నిరూపించివున్నది. దేశప్రజలను మిల్లుబట్టల వాడకంనుంచి మరలించడమనే కష్టతరమైన కార్యాన్ని మనమింకను సాధించవలసి వున్నది.

హరిజన్, 23-10-'37.

చేతిమగ్గం తమకు పోటీగా తయారైనప్పుడు, చేతిమగ్గాలకు మిల్లుదారమును సరఫరా చేయడానికి మిల్లు యజమానులు లేమీ లోకోద్ధారక బిరుదాంకితులుకారు.

హరిజన్, 25-8-'46.

తమకు లాభసాటిగా చేయడానికి వీలైన వెంటనే, మిల్లు యజమానులు మిల్లునూలును అమ్మడం మానివేసి, తామే దానితో చేయడం ఆరంభిస్తారు. వారు లోకసేవాపరాయణులుకారు. వారు డబ్బు చేసుకొనే నిమిత్తమే మిల్లులను స్థాపించారు. తమ నూలుతో తామే బట్ట నేయడం లాభసాటిగా కనిపించినవెంటనే, వారు చేతిమగ్గపు నేతగాండ్రకు నూలు అమ్మడం నిలుపుదల చేస్తారు.

హరిజన్, 31-3-46.

మిల్లునూలు వాడడ మనేదే చేనేత పరిశ్రమకు ముఖ్యమైన ఉరిత్రాడు. చేతివనుకు నూలును వాడడంలో ఒక్కటే చేనేతపరిశ్రమకు ముక్తిమార్గం. చేతిరాట్నం నశించిందంటే చేతిమగ్గంకూడా నశించవలసిందే.

హరిజన్, 25-8-'46.

పెద్దపెద్ద ట్రస్టులు ఏర్పడ్డానికి, క్లిష్టమైన యంత్రాగారాలద్వారా పరిశ్రమలు కేంద్రీకృతం కావడానికి నేను వ్యక్తిగతంగా వ్యతిరేకిని. భారతదేశమే కనక ఖద్దరునూ, దానిలో నివిష్టమైవున్న అంతర్భావాన్నీ స్వీకరించినయెడల, సామాన్యమైన జీవితసౌకర్యాల నిమిత్తమూ, శ్రామికులకు సౌలభ్యం చేకూర్చేనిమిత్తమూ అవసరమైనపాటిగామాత్రమే ఆధునిక యంత్రపరికరాలను వినియుక్తం చేస్తుందేగాని, అంతకు మించిచేయదనే ఆశను నేను విడనాడను.

యంగిండియా, 24-7-'24

అల్పసంఖ్యాకుల చేతులలో ధనమును, అధికారమును కేంద్రీకరించుటకును, అధికసంఖ్యాకులను కొల్లగొట్టుటకును అనుగుణమైన రీతిగా సంఘటిత మొనర్చబడే యాంత్రిక విధానం కేవలం తప్పని నా అభిప్రాయం. నేటికాలపు యాంత్రికవిధానం చాలావరకు అటువంటిదే. చేతిరాట్నపు ఉద్యమం యంత్రవిధానాన్ని అటువంటి స్వార్థభావ సంకలితమూ పరార్థ వినాశకారకమూ అయిన స్థితినుంచి మరల్చి యోగ్యస్థితికి తీసికొనివచ్చుటకే ఉద్దేశింపబడింది. అందున, నా ప్రణాళిక ప్రకారం, యంత్రవిధానంపైన యాజమాన్యం

గలవారు తమ స్వార్థమును గురించి ఆలోచించువారుగాగాని, తమ దేశలాభమును గురించి ఆలోచించువారుగాగాని కాక, యావత్తు మానవకోటినీ గురించి ఆలోచించువారుగా వుంటారు. ఆ ప్రకారం ల్యాంకషైరు మిల్లుయజమానులు తమ యంత్రాగారబలంతో భారతదేశాన్ని ఇతరదేశాలనూ కొల్లగొట్టుటకు బదులుగా భారతదేశంలో పండిన ప్రత్తిని అక్కడి గ్రామీణులే వినియోగించుకుని తయారుచేసుకోడానికి సహకరించే మార్గాలను కనిపెడతారు. అట్లే అమెరికాదేశీయులు కూడా, నా ప్రణాళికానుసారం, లోకంలోని ఇతర జాతులను కొల్లగొని కేవలం తాము మాత్రమే ధనవంతులగుటకు తమ యంత్రనిర్మాణ కౌశలాన్ని వినియుక్తం చేయరు.

యంగిండియా, 17-9-'25.

అధ్యాయం ౬౧

స్వదేశీ సందేశం

(The Gospel of Swadeshi)

మనకు సుదూరమైన లోకముద్వారాకాక, మనకు చేరికగానూ, ప్రత్యక్షంగానూ వున్న పరిసరలోకంద్వారానే మన అవసరాలను తీర్చుకోనవలెననియు దానికి సేవచేయవలెననియు, మనలో సహజసిద్ధంగా వుండే కోరికయే స్వదేశీఅనే భావానికి మూలకందం. దానినిబట్టి, మతవిషయకంగా పై నిర్వచనాన్ని సంతృప్తిపరచవలెనంటే, నేను నా సనాతన

సంప్రదాయకమైన మతమునే అనుసరించాలి. అంటే, నాకు ప్రత్యక్షంగా వున్న మతపరిసరములను నా అవసరానికి వినియోగపరచుకోవడం అన్నమాట. అది లోపభూయిష్టంగా వుంటే, ఆ లోపములను ప్రక్షాళన మొనర్చడంద్వారా నేను దానికి సేవచేయాలి. రాజకీయరంగంలో అయినట్టయితే దేశీయమైన ప్రజాసంస్థలను ఉపయోగించుకొని, వాటిలో నిజమైన లోపము లేమి వున్నాగాని, ఆ లోపములను సరిదిద్దుట ద్వారా వాటికి నేను సేవచేయాలి. ఇక, ఆర్థిక రంగంలో, ఇరుగు పొరుగున తయారైన వస్తువులనే వాడుకొని, వాటిని ఉత్పత్తిచేసే పరిశ్రమలలోగల లోపములను తీర్చి వాటిని బలపరచడంద్వారా వాటికి నేను సేవచేయాలి. అట్టి స్వదేశీప్రవృత్తిని అలవరచుకొని ఆచరణలో పెట్టిన యెడల, అది తప్పక స్వర్ణయుగానికి దారి జూపగలదని నా సూచన.

పైన సూచితమైన స్వదేశీసూత్రంయొక్క మూడు శాఖలను గురించి క్లుప్తంగా పరిశీలిద్దాం. హిందూమతం పూర్వాచారపరాయణమైనది కావడంచేత, అది స్వదేశీభావగర్భితమైన బలవత్తరశక్తిగా రూపొందివున్నది. అంతేకాక అది ఇతరులను తనలో కలుపుకునే ప్రచారకమతం కాకపోవుటచేత, అది అన్నిటికంటెను సహనగుణప్రధానమైనది ; అది పురాతనకాలంలో ఎంతవైశాల్యమునకు తావొసగివున్నదో ఈనాడుకూడా అంతవిస్తృతికిని అవకాశ మొసగే స్వభావాన్ని

ప్రదర్శిస్తూనేవున్నది. కొందరు అపోహపడేలాగ, అది బౌద్ధ మతమును ఎన్నడూ పారద్రోలి వుండలేదు. సరిగదా, దానిని తనతో జీర్ణమొనర్చుకొన్నదని నా అభిప్రాయం. స్వదేశీ ఆదర్శము ననుసరించే హిందూమతస్థుడు తన మతమును మార్చుకొనుటకు అంగీకరించడు. దానికి కారణం అదే సర్వోత్తమమైన మతమనే అభిప్రాయం కాదు, దానిని సంస్కరించి విస్తృతం చేసికొనవచ్చుననే నమ్మకం. నేను చెప్పే ఈ గుణాలు ఇతర ప్రపంచమతములకు కూడా వర్తించవచ్చును ; అయితే అవి హిందూమతం విషయంలో ప్రధాన గుణాలుగా వర్తిస్తాయని నాకు తోస్తుంది. ఇక నేను చెప్ప దలచిన ముఖ్యాంశానికి వస్తాను. నేను పైన చెప్పిన భావాలలో ఏమైనా సత్యం వున్నయెడల, దానినిబట్టి, భారత దేశంలో పనిచేస్తూ వున్నటువంటి మిషనరీ సంస్థలు ఇతరులను తమ మతంలోకి కలుపుకునే ప్రయత్నం మాని కేవలం ప్రజాసేవా కార్యనిర్వహణమును మాత్రమే అనుసరించిన యెడల, తద్వారా వారు ఇంతవరకు భారతదేశానికి చేసి వుండిన సేవను ఇనుమడింపచేయుటయేకాక, తమ క్రైస్తవ మతాదర్శమునకు కూడా సత్యతరమైన సేవ చేసినవారౌతారు గదా అని నా సూచన.

ఇక స్వదేశీ ఆదర్శంయొక్క మార్గంలో జాతీయసంస్థా స్వరూపములుగా గ్రామ పంచాయతీలు నన్నాకర్షిస్తాయి. హిందూదేశం నిజమైన ప్రజాపాలిత దేశం. అందువల్లనే అది ఇంతవరకు కలిగిన అఘాతవిఘాతము లన్నింటికినితట్టుకుని ఇంత

వరకూ నిలబడగలిగింది. ఈ దేశమునేలిన రాజులుగాని, సామ్రాట్టులుగాని, వారు స్వజాతీయులైనా, విజాతీయులైనా ఒక్క పన్నులవసూలు విషయంలోతప్ప ఇతర అంశాలలో ప్రజాజీవితాన్ని ఏ మాత్రం స్పృశించి వుండలేదు. ఇక ప్రజానీకంకూడా తమ వైవున "రాజునకు చెందిన భాగాన్ని రాజునకిచ్చివేసి", ఇతర విషయాలన్నిటిలోనూ తమ యిష్టానుసారంగా కాలక్షేపం చేసినట్లు కనిపిస్తుంది. వర్ణధర్మమనే విశాలతరసంఘటన ప్రజాసామూహ్యాన్నయం యొక్క మత విషయికావసరములనే కాక, రాజకీయావసరములను కూడా సంతృప్తికరంగా తీర్చుటకు ఉపకరించింది. వర్ణధర్మం గ్రామవాసులైన ప్రజానీకానికి, తమయొక్క ఆంతరంగిక వ్యవహారాలను సమర్థించుకొనుటకేకాక, అప్పటప్పటి రాజులయొక్క, లేక రాజ్యాధికారులయొక్క నిరంకుశత్వం నుంచి రక్షణ మొనర్చుకొనుటకు కూడా సాధనప్రాయంగా ఉపకరించింది. వర్ణవ్యవస్థనుంచి ఇంత అద్భుతమైన సంఘటనాశక్తిని సృష్టించుకొనగల్గిన జాతిని సంఘటనా ప్రావీణ్యావిరహితమని భావించడానికి వీలులేదు. హరిద్వారంలో జరిగే కుంభమేలాను ఒక్కసారి దర్శిస్తేచాలు, పదిలక్షలపైగా అక్కడకు చేరే యాత్రిక జనసమూహానికి అంత సునాయాసంగానూ, అంత చక్కగానూ సౌకర్యాదికములన్నీ చూడగల ఆ సంఘటనా కౌశల మెటువంటిదై యుండవలెనో ఊహించుకొనగల్గుతాం. అయినాగాని మనం సంఘటనా శక్తిరహితులమని ఆత్మనింద చేసికొనడం ఒక నవీనాభ్యాసమైపోయింది. నవీన

సంప్రదాయాలలో పెరిగినవారి విషయంలో మాత్రం ఆమాట కొంతవరకు నిజమేనేమో అని నా భయం.

మనం స్వదేశీ ఆదర్శమునుంచి దూరంకావడ మనే దురదృష్టంయొక్క ఫలితంగా చాలా క్లిష్టపరిస్థితిలో పడి పోయాం. విద్యాధికవర్గానికి చెందిన మనం, మన విద్యాభ్యాసం అంతా ఒక విజాతీయభాషలో చేశాం. ఆ కారణం వల్ల మనం ప్రజాబాహుళ్యంతో సజీవానుబంధం అనుభూత మొనర్చుకొనలేకపోయాం. మనకు ప్రజాప్రాతినిధ్యం వహించవలెనని అభిలాష వుంది; కాని విఫల మనోరథులమైపోతున్నాం. ప్రజలు ఆంగ్లేయోద్యోగులను ఏవిధంగాచూస్తారో మనలనుకూడా అదేవిధంగా చూస్తున్నారు. వారి ఆశయాలు మనవి కావు. అందువల్ల వారికీ మనకీ మధ్య ఒక అగడ్త ఏర్పడింది. తత్ఫలితంగా ద్యోతకమయ్యేది మన సంఘటనాశక్తిలో లోపంకాదు. ప్రాతినిధ్యం ఒసగవలసిన వారికీ ప్రాతినిధ్యం వహించగోరేవారికీ మధ్యవున్న సామరస్య లోపం మాత్రమే. మనం గడిచిన ఏభై యేళ్ళలోనూ మన మాతృభాషలలోనే కనక విద్యార్జన చేసివుంటే, మన వృద్ధులూ, మన భృత్యులూ, మన ఇరుగుపొరుగు వారూ కూడా మన జ్ఞానంలో పాలు పంచుకొనగలిగి వుండేవారు; జగదీశచంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రే వంటివారు కనిపెట్టిన విజ్ఞానశాస్త్ర విశేషాలు, రామాయణ మహాభారతములవలె యింటింటా నెలసే అమూల్య విషయాలుగా

వుండేవి. ప్రస్తుతంలో ప్రజానీకానికి సంబంధించినంతవరకు ఆ విజ్ఞాన విశేషాలు వారు కనిపెట్టినా, ఏ విదేశీయుడు కనిపెట్టివున్నా ఒకటేలాగ వర్తిస్తున్నది. అన్ని విజ్ఞానశాఖల లోనూ మాతృభాషలోనే బోధనం జరిగివుంటే, ఆయా భాషలు అద్భుతంగా అభివృద్ధి పొందివుండేవని నేను ఉగ్గడించ సాహసిస్తాను. గ్రామపారిశుధ్య సమస్యవంటివిషయాలు ఏనాడో పరిష్కారమైపోయి వుండేవి. ఈనాటికప్పుడే గ్రామ పంచాయతీలు విశిష్టరీతిని శక్తివంతములై, తద్వారా భారత దేశం తన అవసరాలకు అనుకూలమైన ప్రజాపాలనాన్ని అనుభవిస్తూ, తన పవిత్రభూమిపై జరుగుతూవున్న సుసంఘటిత ప్రజాజీవిత విధ్వంసన దృశ్యాన్ని నిర్వీర్యంగా చూస్తూ వూరుకోనవలసిన అవమానకరపరిస్థితికి అవకాశమొసగకుండా వుండగలిగేది. ఇప్పటికైనా పరిస్థితులను చక్కబరచుకొనుటకు కాలాతీతం కాలేదు.

ఇక, స్వదేశీ ఆదర్శంయొక్క తుది విభాగాన్ని గురించి, ఆర్థిక, పారిశ్రామిక జీవితరంగంలో మనం స్వదేశీయ భావాన్ని అనుసరించకపోవుటవల్లనే మన ప్రజాబాహుళ్యం అనర్థదాయకమైన అగాధ దారిద్ర్యకూపంలో పడిపోయారు. భారతదేశంలోకి విదేశాలనుంచి ఒక్క వస్తువైనా దిగుమతి కాకుండా జాగ్రత్తపడివుంటే, ఈనాడు భారతదేశం దుగ్ధ మధుస్రవంతులలో తేలియాడే స్వర్గసీమగా వుండేది కాని ఆ విధంగా జరగలేదు. మనం లోభగుణానికి వశమైనాం; ఆంగ్లదేశమూ ఆ విధంగానే అయింది. ఆంగ్లదేశానికీ భారత

దేశానికీ సంబంధం తప్పు పునాదిమీద ఏర్పడింది. కాని ఆ తప్పు పునాదిమీద ఆంగ్లదేశం చిరకాలం భారతదేశంలో నిలవలేదు. భారతదేశాన్ని దేశప్రజలతరఫున ధర్మకర్తృత్వ భావంతో మాత్రమే తన చేతులో వుంచుకున్నట్లు ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించివున్నది. ఈ మాట నిజమైతే, ల్యాంకషైరు వైదొలగవలసి వుంటుంది. మన స్వదేశీసూత్రం ధర్మబద్ధమైనదైనప్పుడు, తాను ప్రస్తుతానికి కొంచెం దెబ్బ తిన్నాగాని, ల్యాంకషైరు మానసికంగా నొచ్చుకొనకుండానే వైదొలగవచ్చును. స్వదేశీ అంటే ప్రతీకారభావంతో చేసే బహిష్కరణోద్యమంగా నేను భావించను. అది సర్వులూ ఆచరించదగిన ధార్మికసూత్రంగా నేను పరిగణిస్తాను. నేను ఆర్థికశాస్త్రజ్ఞుణ్ణి కానుగాని, ఆంగ్లదేశం కూడా తనకు కావలసిన పంటల నన్నిటిని తానే పండించుకుని స్వయంసమృద్ధంగా వుండగలదని నిరూపించే కొన్ని పరిశోధనాగ్రంథాలను నేను చదివి వున్నాను. ఇది పూర్తిగా హాస్యాస్పదమైన ప్రతిపాదన అయితే కావచ్చును; ఆంగ్లదేశం అన్ని దేశాలకంటెను ఎక్కువగా దిగుమతులమీద ఆధారపడేది అయివుండడమే దీని అసాధ్యతను ఋజువుపరచవచ్చును. కాని భారతదేశం మాత్రం, ముందుగా తనకోసం తాను బ్రతకగలిగితే తప్ప, ల్యాంకషైరు నిమిత్తంగాని ఏ ఇతరదేశం నిమిత్తంగాని బ్రతకజాలదు. తన పొలిమేరలలోననే తనకు కావలసిన అవసరములనన్నిటిని ఉత్పత్తి చేసికొన గలిగినప్పుడే, దానికి సహకారం పొందినప్పుడే, భారతదేశం తనకోసం తాను

బ్రతకడం సాధ్యపడుతుంది. సోదరులను సోదరులు హత మొనర్చుకొనడానికిని, ఈర్ష్యలకును, ఇతర దుష్ఫలితాలకును దారితీసే ఉన్మాదపూరితమూ, వినాశనకరమూ అయిన పోటీ సుడిగుండంలోకి ఆమె దిగనవసరం లేదు. దిగకూడదు కూడా. కాని భారతదేశంలోని కోటీశ్వరులను ఈ ప్రపంచపు పోటీలోకి దిగకుండా ఆపగలవారెవరు? శాసనములవల్ల ఏ మాత్రమూ లాభంలేదు. ప్రజాభిప్రాయబలమూ, యోగ్యమైన విద్యాజ్ఞానాలూ చాలవరకు సరియైన దారిలో నడిపించడానికి ఉపకరించవచ్చును. చేనేతపరిశ్రమ మరణావస్థలో వుంది. నేను నా దేశసంచారంలో వీలైనంత మంది నేతపనివారిని చూడడానికి అవకాశం కలిగించుకుని వున్నాను. వారి దివాలా పరిస్థితిని గమనించి నప్పుడు, ఒకప్పుడు పరువు ప్రతిష్ఠలతో వర్థిల్లిన యీ సంప్రదాయిక పరిశ్రమను విడిచిపెట్టి వారిలో అనేకమంది ఏ విధంగా నిరాధారులై పోయినదీ చూచినప్పుడు నేను చాలా హృదయావేదన పాలైనాను.

మనం స్వదేశీ సిద్ధాంతాన్ని అనుసరించదలిస్తే, మన ఇరుగు పొరుగున వున్న ప్రజలలో ఎవరుగాని నిర్వ్యాపారంగా వున్నయెడల వారికి గృహ పారిశ్రామిక పరిజ్ఞానం కలిగించి అయినా, అట్టి స్థానిక ఉత్పత్తి వస్తువులను మాత్రమే వాడుకొనడం మన విధిగా భావించాలి. అప్పుడు భారతదేశంలోని ప్రతి గ్రామం సుమారుగా స్వయం పోషకం గానూ, స్వయం సమృద్ధిగానూ అయి, స్థానికంగా ఉత్పత్తికాజాలని వస్తువుల విషయంలో మాత్రమే ఇతర గ్రామాలనుంచి యిచ్చి

పుచ్చుకునే సంబంధం కలిగివుంటుంది. ఇదంతా ఉత్త పిచ్చి ధోరణిగా కనిపించవచ్చును. అవును, భారత దేశమే ఒక పిచ్చి ధోరణిగల దేశం. సహృదయుడైన ముస్లింమతస్థుడు స్వచ్ఛమైన శీతజలాన్ని అందిచ్చేందుకు సిద్ధంగావుంటే దాహంతో గొంతెండిపోతున్నా అది ముట్టుకోనని శఠించి కూచోడం పిచ్చికాదా ? కాని వేలాది హిందువులు దాహంతో ప్రాణాలైనా వొదులుకుంటారుగాని, మహమ్మదీయుల గృహాలలో మంచినీళ్లైనా ముట్టడానికి అంగీకరించరు. ఈవిధమైన పిచ్చివాళ్లకి, తమ దేశంలో తయారైన వస్త్రాలనుమాత్రమే వాడవలసినదనీన్ని, తమ దేశంలో పండిన పదార్థాలను మాత్రమే తినవలసినదనీ తమ మతధర్మం బోధిస్తున్నదని ఒకసారి నచ్చచెప్పగలిగినయెడల వారు సునాయాసంగా విదేశవస్త్రాలనూ, విదేశ ఆహారవస్తువులనూ కూడా క్షణంలో విసర్జించివేయగలరు.

భగవద్గీతలో ఒక శ్లోకముంది; సులభంగా అనువదిస్తే, "సామాన్యజనులు ఉన్నతవర్గాలను అనుసరించి నడుస్తారు" అని అర్థమిస్తుంది. అందువల్ల కొంతకాలంపాటు కొంత అసౌకర్యం కలిగినాగాని సహించి, సంఘంలోని భావుకవర్గమే కనక స్వదేశీదీక్షను స్వీకరిస్తే, పైన పేర్కొన్న దుష్పరిస్థితిని సులభంగా అరికట్టగలుగుతాం. ఏ జీవితరంగంలోగాని శాసనపూర్వకమైన బలాత్కారాన్ని నేను ఏమాత్రం ఇష్టపడను. అత్యవసరమైనప్పుడు దానిని తప్పనిసరి అయిన కనీసపు విధానంగా మాత్రమే అంగీకరిస్తాను. కాని విదేశీ

దిగుమతి సరుకులమీద బరువైన రాక్షససుంకాన్ని విధించే పక్షంలో మాత్రం నేను దానిని సహించడమేకాదు గదా, దానిని మనఃపూర్వకముగా ఆహ్వానిస్తాను– అంతే కాదు, అట్లుచేయడం అత్యవసరమని వాదిస్తాను కూడా. సేటాల్ అనే ఒక బ్రిటిష్ కాలనీ తన చక్కెర పరిశ్రమను రక్షించుకునే నిమిత్తం మారిషస్ అనే ఇంకొక బ్రిటీషు కాలనీనుంచి దిగుమతి అయ్యే చక్కెరపై సుంకం విధించింది, ఆంగ్ల దేశం హిందూదేశ విషయంలో స్వేచ్ఛావ్యాపారసూత్రాన్ని (Free Trade) బలవంతంగా అమలుపరచడ మనే పాప కార్యంచేసింది. ఆ విధానం తనకు అమృతతుల్యం కావచ్చు; మన దేశానికిమాత్రం అది విషప్రాయం అయింది.

భారతదేశం ఆర్థికరంగంలో స్వదేశీసూత్రాన్ని అవలంబించడం మాత్రం అసాధ్యకార్యమని చెప్పేవాదన తరుచుగా వినిపిస్తూవుంటుంది. ఈ అభ్యంతరాన్ని ప్రతిపాదించేవారు స్వదేశీని ఒక జీవితసూత్రమనే దృష్టినుంచి చూడరు. వారి దృష్టిలో ఇది ఒక దేశాభిమానపూర్వకమైన చర్య మాత్రమే. ఆ చర్యవల్ల తాము స్వయంగా అసౌకర్యముల ననుభవించవలసి వచ్చినవెంటనే వారు దానిని విడిచిపుచ్చడానికి సంసిద్ధులై వుంటారు. ఇక్కడ నిర్వచించినరీతి స్వదేశీ భావం. ఎట్టి వ్యక్తిగత దైహిక అసౌకర్యములు కలిగినప్పటికిని లెక్కచేయకుండా అనుసరించవలసిన ధార్మికనియమం. ఈ ఆదర్శానికి వశులైనవారు, మనదేశంలో తయారుకాని ఒక గుండుసూదో, కుట్టుసూదో లేకుండా గడపవలసి వచ్చిన

యెడల దానికోసమని భీతావహం పాలుకాదు. స్వదేశీ దీక్షను వహించిననాడు ఇవాళ తనకి అవసరమనుకున్న వందలాది వస్తువులు లేకపోయినాగాని గడుపుకొనడానికి నేర్చుకుంటాడు అంతేకాక, స్వదేశీ సిద్ధాంతంయొక్క అసాధ్యతను గురించి తర్కించి దాన్ని త్రోసివైచే వారు అది పట్టుదల అయిన ప్రయత్నఫలితంగా క్రమేపి సిద్ధించదగిన ఆదర్శమన్న సంగతి మరచిపోతున్నారు. ప్రస్తుతంలో స్వదేశీ సిద్ధాంతాన్ని కొన్ని నిర్దిష్టమైన వస్తువుల విషయంలో మాత్రమే పూర్ణంగా అనుసరించి, ఇంకా దేశీయంగా లభ్యంకాని వాటి విషయంలో ఆ నియమం పాటించకుండా గడిపినా, మనం మన గమ్యసిద్ధికి క్రమేపి చేరిక కాగలం.

ఇక స్వదేశీకి వ్యతిరేకంగా చెప్పబడే ఇంకొక అభ్యంతరాన్ని గురించి చర్చించవలసిన అవసరం వుంది. స్వదేశీ సిద్ధాంతం సభ్యతయొక్క నైతిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైనదీ, స్వార్థభావప్రధానమైనదీ అని వారి అభిప్రాయం. వారి దృష్టిలో స్వదేశీదీక్షను ఆచరణలో పెట్టడమనేది అనాగరక స్థితికి దిగిపోవడంతో సమానం. ఈ ప్రతిపాదనగురించి సాంగోపాంగమైన విమర్శలోకి ఇప్పుడు దిగలేను. కాని మానవత్వానికీ, ప్రేమసూత్రానికీ సంపూర్ణానుగుణ్యాత కలిగిన సిద్ధాంతం స్వదేశీయే అని మాత్రం ఉద్ఘాటిస్తాను. నేను నా కుటుంబానికే సేవచేయలేని పరిస్థితిలో వున్నప్పుడు, భారతదేశ మంతటికీ సేవచేయడానికి పూనుకుంటే, అది నా మదహంకారాన్ని మాత్రమే తెల్పుతుంది. అటువంటప్పుడు

నా ప్రయత్నము లన్నిటినీ నా కుటుంబ విషయంలోనే కేంద్రీకరించి, తద్వారానే నేను దేశమొత్తానికి సేవచేస్తు న్నట్లుగాని, మానవకోటికి చేస్తున్నట్లుగాని భావించడం మంచిదని తలుస్తాను. ఇది అడకువకు నిదర్శనం, ప్రేమకు చిహ్నం. ఉద్దేశమే కార్యంయొక్క విలువను నిర్ణయిస్తుంది. ఒక వేళ నా కుటుంబానికి సేవచేయడంలో నేను ఇతరులకు కలిగించే బాధను లెక్కించకుండా వర్తిస్తా ననుకోండి. ఉదాహరణకి, ప్రజలనుంచి డబ్బుపిండి వసూలుచేసే ఉద్యో గాన్ని స్వీకరిస్తా ననుకోండి. తద్వారా నేను ధనికుడనైనా కుటుంబంయొక్క న్యాయసమ్మతం కాని కోరికలను తీర్చ గలుగుతా ననుకోండి. అట్టి కార్యంవల్ల నేను నా కుటుం బానికిగాని, నా ప్రభుత్వానికిగాని నిజమైన సేవచేయడంలే దన్నమాట. లేక, దేవుడు నాకు చేతులూ కాళ్లూ ఒసగినది తద్వారా నాయొక్కయు, నాపై ఆధారపడినవారియొక్కయు పోషణమునకుగాను కృషిచేసే నిమిత్తమే అని గ్రహించా ననుకోండి. అప్పుడు నేను వెంటనే నాయొక్కయు, నాకు అందుబాటులో వున్న ఇతరులయొక్కయు జీవిత విధానాన్ని సామాన్య స్థాయికి దింపి నడిపిస్తాను. ఈ ఉదహరణలో. నేను ఇతరుల కేమాత్రమూ హానికలిగించకుండా నా కుటుంబ పోషణవిధిని నిర్వర్తించినవాడి నౌతాను. అందరూ యిట్టి విధానాన్నే కనక అనుసరించినట్లయితే ఆ మరుక్షణం మనం మన ఆదర్శ పరమావధిని అందుకున్నట్లే అవుతుంది. కాని అందరూ ఆస్థితిని ఒక్కసారిగా చేరుకోలేరు. మనలో అందరి

సత్యాన్ని గ్రహించినవారు ముందు దానిని తమ ఆచరణలో పెట్టడం ద్వారా ఆ శుభముహూర్తాన్ని ఆహ్వానితమొనర్చి, చేరువకు తేగలుగుతారు. ఈ ప్రణాళిక ప్రకారం, నేను ఇదర దేశాల జోలికిపోకుండా కేవలం భారతదేశానికి మాత్రమే సేవచేస్తున్నట్లు కనిపించినా, తద్వారా ఇంకే దేశానికి హాని కలిగించను. నా దేశాభిమానం ప్రత్యేకమైనదీ, విశ్వజనీన మైనదీకూడా. నేను అణకువతోనే నాజన్మభూమి విషయమై శ్రద్ధ వహించడం ద్వారా నా దేశాభిమానం అప్రత్యేక భావాన్ని వెలువరిస్తుంది, కాని నా స్వదేశీసేవ పోటీవిధానం మీదగాని ఇతరులయెడల వ్యతిరేకభావంమీద గాని ఆధార పడనిది అయినంతవరకు అందులో విశ్వజనీనతకూడా ఇమిడి వుంటుంది. Sic utere tuo ut alienum non laedas (నీ యాస్తిని నీ వనుభవించవచ్చును, కాని అది నీ పొరుగువాని యాస్తికి భంగము కారాదు) అనే సూత్రం కేవలం న్యాయ శాస్త్రానికి చెందిన వాక్యం మాత్రమేకాదు. జీవితప్రవర్తన మునకే అది మార్గదర్శకమైన మహత్తర సిద్ధాంతం. అదియే అహింసా ప్రేమసూత్రములయొక్క యోగ్యాచరణమునకు మూలాధారమైనది.

మహాత్మా గాంధీ ప్రసంగాలు, రచనలు పే. 336-44

ఇతరములైన సద్విషయములన్నిటి వలెనే స్వదేశీ సిద్ధాంతం కూడా ఒక మూఢవిశ్వాసంగా పరిణమించిన యెడల, అది రూపభ్రంశం పొందేదాకా దానిని తీసుకు పోవచ్చును. అట్టి ఆపత్తు కలగకుండా మనం జాగ్రత్తపడాలి.

విదేశీ వస్తువులను అవి కేవలం విదేశీవి కనుక మాత్రమే వాటిని నిరాకరించడమున్నూ, మన దేశంలో ఉత్పత్తికి అనువుకాని వస్తువులయొక్క తయారీని సాధించడం కోసం దేశపు ధనాన్ని, కాలాన్ని దుర్వ్యయ మొనర్చడమున్నూ గొప్ప తెలివితక్కువ పనులగుటయేకాక అవి స్వదేశీ భావానికే విరుద్ధం. నిజమైన స్వదేశీ అభిమాని విదేశస్థులయెడల ద్వేషభావం కలిగివుండడు, లోకంలో ఎవరియెడలగాని విరోధభావంతో వర్తించడు. స్వదేశీ సిద్ధాంతమంటే ద్వేష భావారాధనం కాదు. అది పరిశుద్ధమైన అహింసాభావంలో అనగా ప్రేమభావంలో, వేరుపాతుకొన్నటువంటి స్వార్థనిరహితసేవాధర్మాన్ని ప్రతిపాదించే ఉత్తమ సిద్ధాంతం.

యెరవ్డామందిర్ నుంచి, అధ్యాయం 16

అధ్యాయం ౬౨

గోసంరక్షణ

హిందూ మతానికి సారాంశంవంటిది గోసంరక్షణం. గోసంరక్షణ మనేది నాకు మానవపరిణతిలో ఒక అద్భుతాంశంగా గోచరిస్తుంది. అది మానవుణ్ణి తన జాతియొక్క పొలిమేరను దాటిస్తుంది. నా దృష్టిలో గోవు మనిషికి దిగువగా వున్న జంతుజాలమంతటికిని చిహ్నంగా గోచరిస్తుంది. గోవుద్వారా మానవుడు సర్వజీవకోటిలోనూ తాదాత్మ్యం పొందవలసినదిగా నిర్దేశింపబడివున్నది. గోవునందు ఈ విధమైన దివ్యత్వాపాదనం ఎందుకు చేయబడినదో నాకు

స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశంలో గోవు మానవునికి అత్యంతాప్తమైన సహచరిగా వర్తించి వున్నది. గోవు సంపదను పెంపొందించింది. గోవు పాలనొసగుట మాత్రమే కాక, వ్యవసాయాన్ని సాధ్యంచేసింది. గోవు కరుణరస ప్రధానమైన కావ్యం వంటిది. గోవుయొక్క సాధుమూర్తిలో కరుణభావం తొణికిసలాడుతుంది. లక్షలాది భారతీయ ప్రజానీకానికి గోవు మాతృసమానమైనది. గోసంరక్షణమంటే దైవసృష్టిలోని నోరులేని జీవము లన్నిటియొక్కయు సంరక్షణమని అర్థం. ఎవరో ఒక పూర్వఋషీశ్వరుడు గోవుతో ఆ రక్షణకార్యాన్ని ప్రారంభించాడు. అవి నోరులేనివగుట చేత, సృష్టిలోని హీనతరగతికి చెందిన జీవులయొక్క ఆక్రోశం మరింత గుండెలు కరిగించే శక్తిని కలిగివుంటుంది. గోసంరక్షణ అనేది భారతదేశం ప్రపంచమున కొసగిన వరప్రసాదము. గోవును సంరక్షించే హిందువులు మిగిలివున్నంతవరకు, హిందూ మతం సురక్షితంగా నిలుస్తుంది.

హిందువుల గొప్పతనం వారు మొగానపెట్టే బొట్టువల్లనూ, వారు చేసే స్వచ్ఛమైన మంత్రపఠనవల్లనూ, వారొనరించే తీర్థయాత్రలవల్లనూ, వారు ఎక్కడా లోపంలేకుండా ఆచరించే కులధర్మాలవల్లనూ కాక, వారు గోసంరక్షణవిధిని చక్కగా నిర్వహించడంద్వారానే నిరూపితమౌతుంది.

యంగిండియా, 6-10-21.

గోమాత చాలా విషయాలలో మన కన్నతల్లికంటె గూడా ఘనతరమైనది. మన కన్నతల్లి ఒక రెండేళ్లపాటు

మనకు పాలిచ్చి, దానికి ప్రతిఫలంగా మనం పెద్దయినాక మన సేవను ఆసిస్తుంది. గోమాత ఇంత గడ్డీ గింజలూ తప్ప ఇంకేమీ మననించి ఆసించదు. మన తల్లి తరుచు సుస్తీపడి, మన పరిచర్యను కోరుతుంది. గోమాత సుస్తీపడ్డమే అరుదు. ఆమె మనకు ఒసగే నిరంతరాయమైన సేవ ఆమె మరణించినా అంతంకాదు. మన కన్నతల్లి మరణిస్తే ఆమె అంత్యక్రియలకు కొంత డబ్బు ఖర్చవుతుంది. గోమాత బ్రతికి వున్నప్పుడెంత ఉపయోగకరమైనదో మరణించిన పిమ్మట కూడా అంత ఉపయోగకరంగా వర్తిస్తుంది. ఆమె శరీరంలోని ప్రతిభాగమూ కూడా—మాంసము, ఎముకలు, పేగులు, కొమ్ములు, చర్మం— మనకు ఏదో ఒక విధమైన ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. ఈ విషయాలన్నీ నేను మన కన్నతల్లి యెడల నిరసనభావంతో చెప్పడంలేదు; గోవును నేనెందుకు పూజనీయంగా భావిస్తానో దానికిగల వాస్తవమైన కారణాలను తెలియజేయుటకు మాత్రమే చెపుతున్నాను.

హరిజన్, 15-9-'40.

మన పశుసంపదయొక్క దౌర్భాగ్యపరిస్థితికి మూలహేతువు మనయొక్క అపరిమితమైన అశ్రద్ధాభావమే. మన పశురక్షణశాలలు (Prinjrapoles) మనలోని దయాప్రవృత్తిని సంతృప్తి పరచుకొనుటకు ఉద్దేశింపబడినవే అయినా, ఆచరణలో అవి చాలా అసంతృప్తికరమైనస్థితిలో వున్నవని చెప్పక తప్పదు. అవి ఆదర్శప్రాయమైన పాల ఉత్పత్తి కేంద్రములుగాపనిచేసి లాభకరమైన దేశీయసంస్థలుగావర్తించుటకు

బదులు ముసలితనంతో నీరసించే గోవ్రులను కట్టిపెట్టే కేంద్ర ములుగా మాత్రమే ఉపకరిస్తున్నాయి. గోసంరక్షణ మన మతధర్మమని చెప్పుకుంటూ మనం గోవును, గోసంతతిని బానిసలు చేసి, తత్ఫలితంగా మనం కూడా బానిసల మైపోయాం.

యంగిండియా, 6-10-21.

నేను తిరిగి చెబుతున్నాను. గోరక్షణోద్యమానికి సంబంధించిన ఏవిధమైన కార్యక్రమానికిగాని శాసనపూర్వక మైన నిషేధంవల్ల కలిగే లాభం బహు స్వల్పం... ఏ చెడు గును గాని పోగొట్టే నిమిత్తం ఒక శాసనం చేయగానే, ఆ చెడుగు ఇంకే ప్రయత్నమూ అవసరం లేకుండా అంతరిస్తుందని చాలామంది అనుకునేలా కనిపిస్తుంది. అంతకంటె ఆత్మ వంచనం ఇంకోటుండబోదు. అజ్ఞానులైన ప్రజలను అదుపులో వుంచడానికిన్నీ, లేదా అల్పసంఖ్యాకులైన దుర్మార్గవర్తను లను అరికట్టడానికిన్నీ శాసన నిర్మాణం ఉద్దేశింపబడింది ; అట్టి సందర్భములందే అది బాగా పనిచేయ గలుగుతుంది. తెలివి తేటలుగల సుసంఘటితమైన ప్రజాభిప్రాయం వ్యతిరే కించినప్పుడు గాని, మూర్ఖులూ, ఆవేశపరులూ అయిన అల్ప సంఖ్యాకులు మతంపేరిట వ్యతిరేకించినప్పుడుగాని ఏవిధమైన శాసన నిర్మాణమైనా నెగ్గలేదు. గోసంరక్షణ సమస్యను గూర్చి పరిశీలించిన కొలదీ గోవుయొక్కయు, గోసంతతి యొక్కయు రక్షణకార్యము నేను సూచించివున్న కార్యక్రి మానుసారంగా పట్టుదలతో కూడిన నిరంతరకృషి కొనసాగిస్తే

తప్ప నెరవేరజాలదన్న అభిప్రాయం నాలో బలపడుతూ వుంది.

యంగిండియా, 7-7-27.

ఆర్థికదృష్ట్యా లాభకరమైన పరిమాణంలో పాలను ఇవ్వగల శక్తిని కోల్పోయినప్పుడుగాని ఇంకే కారణంవల్లనైనా ఆర్థికంగా నష్టకరమూ, భారమూ అయిపోయినప్పుడుగాని గోవును చంపివేయనవసరం లేకుండా సంరక్షించుటకు వీలైన మార్గమేమిటి? ఈ ప్రశ్నకు జవాబును ఈ క్రింది విధంగా క్లుప్తీకరించవచ్చును.

1. గోవుయెడలను, గోసంతానము యెడలను హిందువులు తమ విధ్యుక్తధర్మమును నెరవేర్చుటద్వారా వారు ఆ పని చేసినచో మన పశుసంపత్తి మన భారతదేశమునకేగాక ప్రపంచమంతటికిని కూడా గర్వకారణం కాగలదు. ఈనాటి పరిస్థితి అందులకు కేవలం విరుద్ధమైనదిగా వున్నది.

2. పశుపోషణశాస్త్రమును తెలిసికొనుటద్వారా ఈనాడు పశువుల పెంపకం ఒక పద్ధతిలేకుండా నడుస్తున్నది.

3. ప్రస్తుతం వాడుకలో వున్న క్రూరమైన విత్తుకొట్టేపద్ధతికి బదులు పశ్చిమదేశాలలో అమలులో వున్న బాధలేని విధానమును అవలంబించుటద్వారా.

4. ప్రస్తుతం ఆ కార్యమునందు అనుభవమేమీ లేనివారిచే అజ్ఞానంగానూ, ఒక పద్ధతి లేకుండాను నడుపబడుతూ వున్న పశురక్షణశాలలను పూర్తిగా సంస్కరించుటద్వారా.

5. ఈ ప్రాథమిక కార్యాలను నెరవేర్చినయెడల, ముస్లింమతస్థులు తమ హిందూసోదరుల మనస్సుకి బాధ కలగకుండే నిమిత్తమై తమంత తామే పశువులను మాంసం కోసంగాని. ఇతర హేతువులకుగాని వధించడం మానుకోన వలసిన అవసరాన్ని తప్పక గుర్తిస్తారు.

పైన పేర్కొన్న సూచనలన్నిటికిని ఆధారంగా ఒక సూత్రం ఇమిడి వున్నదని పాఠకులు గమనించగలరు— అది అహింసా సూత్రం. ఆ పరమధర్మాన్ని ఆచరిస్తే చాలు, మిగిలినదంతా సులభసాధ్య మవుతుంది. అహింస వున్న చోట అపారమైన ఓరిమి, ప్రశాంత మనస్కత, వివేచన జ్ఞానము, స్వార్థత్యాగము, సత్యమైన జ్ఞానము వుంటాయి. గోసంరక్షణ అనేది అంత సులభమైనపనికాదు. ఆ పేరిట చాలా ధనం దుబారా చేయబడుతూవుంది. అయినప్పటికిని హిందువులు అహింసాధర్మమును ఏమరడంవల్ల, గోవులకు వారు రక్షకులగుటకు బదులుగా నాశనకారకు లయారు. ఈ విషయంలో సంస్కరణ తీసుకురావడం భారత దేశా న్నుంచి విదేశీయపాలనమును పారద్రోలుటకంటె కూడా కష్ట సాధ్యమైన కార్యం.

(పరా :- భారతదేశపు ఆవు యిచ్చే సగటుపాలు అంచనా సుమారుగా రోజుకి 2 పౌనులనిన్నీ, న్యూజీలాండు ఆవు 14 పౌను లనిన్నీ, ఇంగ్లాండు ఆవు 15 పౌనులనిన్నీ, హాలెండు ఆవు 20 పౌను లనిన్నీ లెక్కవేయబడింది. పాలపిండకం యొక్క పెరుగుదలను అను సరించి ఆరోగ్యం యొక్క సూచనాంకం పెరుగుదలని చూపుతుంది.)

హరిజన్, 31-8-47.

మనకి గేదెపాలమీదా గేదె నెయ్యి మీదా ఇంత మోజు ఏర్పడివుండడం చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఈ విషయంలో మన ఆర్థికపు అంచనాలు మన హ్రస్వ దృష్టిని వెల్లడిచేస్తాయి. ఈ నిమిషాన్ని కలిగే లాభాన్నే మనం చూస్తున్నాం; కాని ఆఖరి అంచనాలో గోవే మనకు ఎక్కువ లాభదాయకమైనదన్న సంగతి మనం గ్రహించడంలేదు. ఆవుయొక్క వెన్న, నెయ్యి సహజమైన ఒక పసుపు రంగును కలిగివుంటాయి; గేదె వెన్న, గేదె నెయ్యికంటె ఆవుపాలలో "కెరొటీన్" అనే ఒక విలువైన పదార్థం ఎక్కువగా వున్నదని ఆ పసుపురంగు తెల్పుతుంది. ఆవు వెన్నకీ, ఆవు నెయ్యికీ ఒక సహజమైన సువాసనవుంది. సేవాగ్రాంకి వచ్చే విదేశస్థులైన అతిథులు అక్కడ దొరికే అచ్చమైన ఆవుపాలను రుచిచూచి తన్మయులైపోతూ వుంటారు. యూరోపు దేశాలలో గేదెపాలుగాని, గేదెవెన్న గాని ఎరగనే ఎరగరు. గేదెపాలమీదా గేదెనెయ్యి మీదా అభిమానంచూపడం ఒక్క భారతదేశంలోనే గోచరిస్తుంది. మన గోసంపద సుమారుగా నశింపుపాలు కావడానికి ఇదే ముఖ్యకారణం. అందుకే, మనం గోవులవిషయమై ప్రత్యేకమైన అభిమానం చూపితే తప్ప, గోరక్షణ అనేది సాధ్యం కాదని చెబుతాను.

హరిజన్, 8-2-42.

అధ్యాయం ౩౩

సహకార పశుపోషణ విధానం

ప్రతివ్యవసాయదారుడూ వ్యక్తిపరంగా తనయింటి వద్దనే పశువుల్నివుంచుకొని తగినశాస్త్రపద్ధతిప్రకారం వాటిని పెంచగలగడం కేవలం అసాధ్యమైన విషయం. గోసంతతి మాత్రమేకాక మొత్తం పశుజాతి అంతా క్షీణదశకు రావడానికి, ఇతర కారణాలతోపాటు సాముదాయికమైన ప్రయత్నమేమీ జరగకపోవడమే ఒక ముఖ్య హేతువు.

ప్రపంచమంతా ఈనాడు అన్నిరంగాలలోనూ కూడా సాముదాయికమైన, లేక సహకారాత్మకమైన కృషివిధానం దిశగానడుస్తున్నది. ఈవిషయంలో చాలా ఫలప్రదమైన పని జరిగివున్నది; ఇంకా జరుగుతున్నదికూడా. ఈపద్ధతి మన దేశంలోకికూడా వచ్చిందిగాని, అది చాలా వికృతరూపంలో అమలై వుండుటవల్ల, పేదలు దాని లాభాలను పొందలేకుండా వున్నారు. మన జనభా పెరుగుతూవున్నకొలదీ మన దేశపు సామాన్య వ్యవసాయదారుని చేతులలోని భూముల యొక్క విస్తీర్ణం దినదినమూ తరిగిపోతూవుంది. అంతేకాక వ్యక్తిపరంగా మన వ్యవసాయదారుల హక్కు-భుక్తములలో వున్న భూమి చిన్నపేలికలుగా వుంటుంది. అటువంటి వ్యవసాయదార్లు తమ యిండ్లవద్ద పశువులను నిలుపుకుని పోషించడం ఆత్మవినాశనకరమైన పద్ధతి; అయినప్పటికీ ఇదీ వారి ప్రస్తుత పరిస్థితి. మత, నైతిక, జీవకారుణ్య సంబంధమైన

భావాల నన్నిటిని అటుంచి, కేవలం ఆర్థికశాస్త్ర దృష్టి నుంచి మాత్రమే చూచేవారు మన వ్యవసాయదారుణ్ణి ఆతని పశువులే మింగివేస్తున్నాయనిచెప్పి గొంతెత్తి చాటుతున్నారు - కారణం, వాటి పాడికంటె వాటి తిండిఖర్చు ఎక్కువ కావడమే. అందువల్ల పనికిరాని గొడ్లన్నింటినీ తెగవేసి వొదిలించుకొనకపోవడం గొప్ప తెలివితక్కువ అని వారి అభిప్రాయం.

అటువంటి పరిస్థితిలో జీవకారుణ్యాభావం కలవారు చేయవలసిన దేమిటి అనేది ప్రశ్న. ఈ సమస్యా పరిష్కారానికిగాను, పశువుల ప్రాణరక్షణతోపాటు అవి భారం కాకుండావుండే మార్గాన్ని కనిపెట్టవలసి వుంటుందన్నమాట స్పష్టం. ఈ విషయంలో సహకారాత్మకమైన పశుపోషణ విధానం మనకు చాలావరకు సహాయపడగలదని నా నమ్మకం.

ప్రస్తుత పద్ధతిని సాముదాయిక పద్ధతితో పోల్చిచూపే ఈ క్రింది పట్టిక ఈసందర్భాని కుపకరించగలదని తలుస్తాను.

(1) సాముదాయిక పద్ధతికింద ఏ వ్యవసాయదారుడుగాని ఇప్పటివలె తనయింటిదగ్గరనే పశువులను వుంచుకొనుటకు వీలుగాదు. అల్లా వుంచుకుంటే యిల్లుచుట్టును దుర్గంధము, మురికి వ్యాప్తమవుతుంది. మనం జంతువులతో కలసి బ్రతకడం అనేది తెలివినిగాని భూతదయనిగాని తెల్పదు. మనిషికి ఆ విధంగా బ్రతకడం అర్హమైన పనికాదు. సాముదాయిక పద్ధతిని అవలంబిస్తే, రైతు యింట్లో యిప్పుడు పశువులు ఆక్రమించే జాగా మిగిలి ఆతని కుటుంబంలోని వారికి విశాలంగా వుపయోగపడుతుంది.

(2) పశువుల సంఖ్య పెరిగినకొలదీ వ్యవసాయదారుడు తనయింట్లో బ్రతకడమే కష్టమైపోతోంది, అందుమూలంగా అతడు దూడలను అమ్మివైచి, దున్నపోతులను చంపడమో లేక మాడి చనిపోవునట్లుగా వాటిని వదలివేయడమో చేయ వలసివస్తున్నది. సహకార విధానంప్రకారం పశుసంరక్షణకు ఏర్పాట్లుచేస్తే ఈ దయావిహీనమైన పద్ధతి తొలగిపోతుంది.

(3) సాముదాయిక పద్ధతిని పశుశాలలు నడిపిస్తే పశువులకు తెగుళ్లు వచ్చినప్పుడు సులభంగా పశువైద్యుల సహాయం లభిస్తుంది. మామూలు వ్యవసాయదారునికి అట్టి సహాయం స్వయంగా పొందడం సాధ్యంకాదు.

(4) సాముదాయికపద్ధతికింద చాలా ఆవులకు ఒక ఆబోతును వుంచడం సులభంగా వీలౌతుంది. ఇతర విధంగా ఇది సాధ్యంగాదు, ధర్మంగా వదలబడే ఆబోతులవల్ల తప్ప.

(5) సహకార విధానంకింద ఉమ్మడిగా పశువులు మేయడానికీ, తిరగడానికీ తగినంత విశాలమైన బంజరుభూమి సులభంగా లభ్యమౌతుంది. ఇప్పుడు సామాన్యంగా ఒంటరి రైతుకి ఎవనికీ అట్టి సౌలభ్యం లేదు.

(5) సాముదాయిక పద్ధతికింద పశుగ్రాసానికి అయ్యే ఖర్చుకూడా చాలా తగ్గుతుంది.

(7) తగినధరలకు పాల అమ్మకం విరివిరిగా జరుగ డానికికూడా అవకాశం కలుగుతుంది. ఇప్పటివలె ఒంటరి రైతు పాలల్లో నీళ్లుకలిపి అమ్ముకోవలసిన అవసరంగాని, అట్లుచేయవలెననే ప్రలోభంగాని వుండవు.

(8) ప్రతి పశువుకీ వేరువేరుగా ఆరోగ్యపరీక్ష చేయడం అసాధ్యమైనపని. ఒక గ్రామంతాలూకు పశువులన్నీ కలిసి వుంటే అది సుసాధ్యమౌతుంది. తద్వారా పశుజాతిని అభివృద్ధి పరచడం సులభమౌతుంది.

(9) పైన పేర్కొన్న లాభాలనుబట్టి సహకార పశుసంరక్షణ విధానం లాభదాయకమని స్పష్టపడుతూంది. వ్యక్తిగత పద్ధతివల్ల ఈనాడు మనమూ మన పశువులూకూడా ఎంత జాలికరమైన పరిస్థితికి దిగజారివున్నామో అదే సహకార పద్ధతియొక్క లాభాన్ని తెల్పుటకు తగిన నిదర్శనం. ఈ అత్యవసరమైన మార్పును ఆచరణలో పెట్టడం ద్వారా మనమూ, మనపశుసంపదకూడా ఉచ్చస్థితికి రాగలుగుతాము.

మనం వ్యవసాయ విషయంలోకూడా సహకారపద్ధతిని అవలంబిస్తేతప్ప, వ్యవసాయంవలని పూర్తిలాభములను పొందజాలమని నా గట్టి నమ్మకం. భూమి ఏదో ఒకలెక్కని ఒక నూరుపీలికలుగా చేసుకుని, ఎవరి దారిని వారు సాగుచేసుకునేకంటె, ఒక గ్రామంలోని నూరు కుటుంబాలూ కలిసి తమ భూములన్నిటిని కలిపి సాముదాయకపద్ధతిని సాగుచేసి పండించి, దానివల్లవచ్చిన ఆదాయాన్ని పంచుకొనడం ఎక్కువ హేతుబద్ధమైన పద్ధతికాదా? అది భూమి విషయంలో యుక్తియుక్తమైనయెడల పశువులపరిపోషణ విషయంలో కూడా అట్లే వర్తించగలను.

ప్రజలు ఈవిధమైన పద్ధతిని ఉన్నపట్టున అవలంబించునట్లు చేయుట కష్టమన్నది వేరేవిషయం. సూటిగా సన్నగాపోయే దారిని అనుసరించడం ఎప్పుడూ కష్టమే అనిపిస్తుంది. గోసేవా కార్యక్రమంలో ప్రతి అంశమూ కంటకిత సమస్య

లతో కూడి వుంటుంది. చిక్కులను దాటుటద్వారానే మన దారి చదును చేసుకొనగల్గుతాం. వ్యక్తిగతమైన వ్యవసాయకృషికంటె సాముదాయక కృషి ఎంత ఎక్కువ లాభకరమైనదీ చూపడమే నా ప్రస్తుత కార్యం. వ్యక్తిగతవ్యవసాయ పద్ధతి తప్పనీ, సాముదాయకపద్ధతే అనుసరణీయమనీ కూడా నా అభిప్రాయం. నిజానికి వ్యక్తి తన స్వాతంత్ర్యాన్ని సహకారం ద్వారానే సంరక్షించుకొన గలుగుతాడు. పశుపోషణవిషయంలో వ్యక్తిగత ప్రయత్నం స్వార్థానికీ, నిర్దయకూ దారితీసింది; సాముదాయక యత్నంద్వారా ఈ దుర్గుణాలు పూర్తిగా కానిచో చాలావరకైనా తొలగడానికి వీలౌతుంది.

హరిజన్, 15-2-'43.

పశువులయొక్కయు మనుష్యులయొక్కయు మలవిసర్జనములను ఇతరములైన చెత్తచెదారములతో కలిపి ఎరువుగా చేస్తే, అది బంగారంతో సమానమైన విలువగల ఎరువు అవుతుంది. అది వ్యవసాయానికి అత్యంతోపయుక్తమైన ద్రవ్యంగా మారుతుంది. ఆ పెంటను ప్రయోగించిన భూమి మిక్కిలి ఫలవంతమౌతుంది. ఈ ఎరువును తయారు చేయడమే ఒక గ్రామ పరిశ్రమగా అవుతుంది. మన దేశంలోని కోట్లాది జనం అందరూ సహకారభావంతో ఈ పరిశ్రమనే కాక, అన్నివిధములైన యితరగ్రామ పరిశ్రమలనుకూడా పెంపొందించుకొనుటకు పూనుకుంటే తప్ప, వాటివలన కలుగగల సత్ఫలితాలు చేతికి అందిరావు; అట్టి సహకార ప్రయత్నం వల్లనే దేశం సౌభాగ్యవంత మౌతుంది.

ఢిల్లీ డైరీ 370-71.

అధ్యాయం ౨౪

గ్రామ పారిశుధ్యం

తెలివి తేటలూ, శ్రమా ఒకదానికొకటి దూరమైపో వుటమూలముననే మన గ్రామాలు కేవలం అశ్రద్ధపాలై పాడై పోయాయి. అందువల్ల, దేశంలో ఎక్కడచూచినా చక్కటి అందమైన పల్లెలకు బదులుగా పెంటకుప్పలను పోలిన గ్రామాలు కంటబడుతున్నాయి. చాలా గ్రామాలకు ప్రవేశ మార్గాలు అసహ్యకరంగా అయిపోయాయి. ఆ చుట్టుపట్ల వుండే మురికినీ, కంపునూ భరించలేక కళ్లూ, ముక్కూ మూసుకొనవలసి వస్తూంది. మన కాంగ్రెసు సభ్యులలో అధిక సంఖ్యాకులు గ్రామాలనుంచి వచ్చినవారై వుంటారు. వారందరూ తలుచుకుంటే మన గ్రామాలన్నీ అక్షరాలా పారిశుద్ధ్యానికి నమూనాలుగా పరివర్తన పొందగలరు. కాని వారింకా తమ దైనిక జీవితరంగలో గ్రామ జీవితంలో సమైక్యతను సాధించుకొనవలసిన విధిని గుర్తించినట్లు కనిపించదు. జాతీయమూ లేక సాంఘికమూ అయిన పారిశుద్ధ్యాభిలాష యింకా మనకొక స్థిరలక్షణంగా పరిణతి పొందలేదు. మనం ఏదోఒక రీతిగా స్నానం చేస్తాముగాని, మనం స్నానాదికాలకు వినియోగించే నూతులను, చెరువులను, నదులను, వాటి వాటి పరిసర ప్రదేశములను పాడుచేస్తాంకూడా. ఈ లోపం మనలోని ఒకగొప్ప దుర్గుణంగా నేను భావిస్తాను. మన గ్రామాలూ, మన పవిత్ర నదీ నదములయొక్క పవిత్ర

తీరాలూ ప్రస్తుతం వున్న అసహ్యాకరస్థితిలో వుండడానికీ, అపరిశుద్ధతవల్ల ప్రజలలో వ్యాప్తిపొందే వ్యాధులకీ మన లోని ఈ లోపమే కారణభూతమని నా అభిప్రాయం.

కన్‌స్ట్రక్టివ్ ప్రోగ్రాం: పే. 15.

గ్రామ పారిశుద్ధ్యం నిమిత్తం మనం చేయవలసిన పనులు చెరువులను, నూతులను శుభ్రపరచి, అవి తిరిగి అశుభ్రము కాకుండా చూడాలి; పేడకుప్పలను, పెంటకుప్పలను తొలగించాలి. మన కార్యకర్తలు ప్రతిదినమూ జీతాలకు పని చేసే "భంగీలు"వలె (పాకీపనివారివలె) స్వయంగా పారిశుద్ధ్య కార్యాలను చేయనారంభించి, గ్రామీణులుకూడా కలసి వచ్చినచో ఎల్లప్పుడూ స్వయం సహాయం ద్వారా గ్రామాలను శుభ్రంగా వుంచుకొనవచ్చునని ప్రచారంకూడా చేసిన యెడల, కొంచెం ముందో వెనకో గ్రామ ప్రజలందరూ తప్పక సహకారం చూపుతారని నేను చెప్పగలను.

గ్రామ వీధులను, సందులను శుభ్రంగా తుడిచి, ఆ పోగుచేసిన చెత్తను రకంవారీగా ఏర్పాటు చేయాలి. అందులో కొంతభాగం ఎరువుగా చేయదగినదై వుంటుంది; పనికిరాని భాగాన్ని పాతిపెట్టవలసుంటుంది; మరికొన్ని రకాల చెత్త వెంటనే విలువైన పదార్థంగా వినియోగపరచ దగినదిగా వుంటుంది. ఆ పెంటలో దొరికిన ప్రతి ఎముక ముక్కా విలువైన వస్తువులను చేయుటకు ముడిపదార్థంగా ఉపయోగించవచ్చును, లేదా దానిని పొడిచేసి సారవంత మైన ఎరువుగా ప్రయోగించవచ్చును. గుడ్డపీలికలు, చిత్తు

కాగితాలు కాగితపు పరిశ్రమకు ఉపకరిస్తాయి. పేడ, పెంట గ్రామపు పొలాలను బలపరిచేందుకు ఎరువుగా పనికివస్తాయి. మలమూత్ర విసర్జనాలను ఎరువు చేయవలెనంటే, వాటిని ఒక అంగుళంలోతుకు మించకుండా త్రవ్విన గోతులో, ఆ మట్టి ముక్కపై పొరతో దానికి కలిపి. పాతిపెట్టివుంచాలి. డాక్టరు పూర్ అనే ఆయన గ్రామ పారిశుధ్యాన్ని గురించి వ్రాసిన గ్రంథంలో విసర్జనమలములను పాతేగొయ్యి మొక్కలోతు తొమ్మిది అంగుళములు మొదలు పన్నెండు అంగుళములకు మించి వుండరాదని చెప్పినట్లు నాజ్ఞాపకం. మట్టియొక్క పైపొరలో సూక్ష్మజీవులు నిండివుంటాయనిన్నీ, అవి ఆ పొర లోనికి సులభంగా ప్రవేశంపొందే గాలీ వెల్తురుతో కలిసి అక్కడ పాతిపెట్టిన విసర్జనమలములను ఒకవారంరోజుల వ్యవధిలో చక్కని సువాసనగల ఎరువుమట్టిగా మార్చివేయగలవనిన్నీ ఆ రచయిత వివరించి వున్నారు. ఏ గ్రామస్థుడుగాని ఇది స్వయంగా పరిశీలనచేసి చూడవచ్చును. దీనికి సులభ మార్గం ఏమనగా, గ్రామాలలోని స్థిరమైన మరుగుదొడ్లను ఏర్పాటుచేసి అక్కడ మట్టికుండలనో ఇనప బకెట్లనో విసర్జన కార్యమునకు ఉపయోగించి, వాటిని దినదినమూ అంతకు ముందు తగినరీతిగా తయారుచేసివుంచిన స్థలాలలో కాళీ చేస్తూ వుండడం ఒకపద్ధతి; లేనిచో, చదరములుగా త్రవ్వి ఏర్పాటు చేసివున్న ప్రదేశములలోనే విసర్జన కార్యములను నిర్వర్తించుకొనడం అనేది రెండవ పద్ధతి. అట్లు పోగైన విసర్జనములను గ్రామపు ఉమ్మడి బంజరు ప్రదేశంలోనో, లేక

వ్యక్తులకు చెందిన పొలములలోనో పూడ్చిపెట్టవచ్చును. ఈ పనిఅంతా గ్రామీణుల సహకారం వుంటేనే సాధ్యమౌతుంది. అంతా కూడిరానియెడల, గ్రామీణులలోకల్లా సాహసవంతుడైనవా డెవడుగాని గ్రామపు పెంటనంతను తాను పోగుచేసుకొని, దానిని పైవిధంగా విలువైన ఎరువుగా మార్చి, స్వలాభం పొందవచ్చును. ప్రస్తుతం ఈ లక్షల రూపాయల విలువగల సారవంతమైన ఎరువు పదార్థమంతా ప్రతిదినం ఉత్తినే వ్యర్థమైపోవడమేకాక, గాలిని దుర్గంధ పూరితంచేసి, వ్యాధులకు మూలకందం అవుతూ వున్నవి.

గ్రామ చెరువులు స్నానానికీ, గుడ్డలు ఉతకడానికీ, త్రాగడానికీ, వంటపనులకూ, అన్నిటికీ కలగాపులగంగా ఉపయోగించడం జరుగుతూ వుంది. గ్రామాలలో చాలా చెరువులను పశువులు సైతం ఉపయోగిస్తాయి. వాటిలో మన్నపోతులు పడి దొర్లుతూవుండడం గమనించవచ్చును. గ్రామ చెరువులను ఇంతగా దుర్వినియోగం చేస్తున్నాగాని, అంటు జాడ్యాలవల్ల మన గ్రామాలు ఇంతవరకూ నాశనం కాకుండా నిలిచి వుండడమే ఆశ్చర్యకరం. గ్రామాలలో వ్యాప్తమైవున్న అనేకములైన వ్యాధులకు పరిశుభ్రమైన మంచినీటి సరఫరా లేకపోవుటయే మూలకారణమని వైద్య శాస్త్రజ్ఞు లందరూ ఏకగ్రీవంగా చాటి చెపుతూ వున్న విషయమే.

ఈ పారిశుధ్య కార్యక్రమం భారతదేశపు బాధిత ప్రజానీకానికి అపారమైన లాభంచేకూర్చే ప్రయోజనకర

నైన అస్పృశ్యతసేవా కార్యముగా అందరూ అంగీకరించగల
రని తెలుస్తాను. ఈ సమస్యాపరిష్కారం విషయమై ఉపయో
గించడంలో గల నే నొసగివున్న సూచనల ప్రకారమే కనక
కలముూ, పెన్సిలూ ఉపయోగించడంలో ఎంత సౌలభ్యమూ
గర్వమూ పొందుతారో అంత సౌలభ్యంతోనూ, గర్వం
తోనూ చీపురూ, పారాకూడా ఉపయోగించగల స్వచ్ఛంద
సేవకులు ముందుకు వచ్చిననాడు, కానీ ఖర్చులేకుండా ఈ
కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టవచ్చునని స్పష్టపడుతుంది.
దీనికి కావలసిన పెట్టుబడల్లా కేవలం ఒక చీపురూ, తట్టా,
ఒక గడ్డపారా, వీటితోపాటు బహుశా కొంచెం క్రిమిసంహా
రకమైన మందున్నూ మాత్రమే. రాసాయనికపు మందుల
షాపులలో దొరికే ఔషధము లన్నిటికంటె పొడిబుగ్గి క్రిమి
సంహారానికి ఎక్కువ చక్కగా ఉపయోగించగలరని నా
అభిప్రాయం.

హరిజన్. 8-2-'35.

ఆదర్శప్రాయమైన భారతీయ గ్రామంయొక్క నిర్మాణ
విధానం గ్రామపారిశుధ్యకార్యానికి పూర్తిగా అనుగుణమైన
రీతిగా వుండాలి. తగిన గాలీ వెలుతురూ ప్రవేశించడానికి
వీలైన, గ్రామానికి అయిదుమైళ్ల చుట్టులో లభ్యంకాగల
పరికరాలతో నిర్మితమైన కుటీరపంక్తితో కూడినదై వుండాలి.
ప్రతి కుటీరమున్నూ కూరగాయలు పండించుకొనడానికేనీ,
పశువులను కట్టివేయడానికిని వలసినంత పెరడు కలిగినదై
కూడా వుండాలి. గ్రామ వీధులూ, సందులు, దుమ్ము ధూళి

లేనివిగా వుండాలి. గ్రామావసరాలకు తగిన నూతులను కలిగి వుండాలి; అవి అందరికీ అందుబాటుగా వుండాలి. ప్రతి గ్రామంలోనూ అందరికీ ఆరాధనయోగ్యమైన దేవాలయాలు వుండాలి; ఉమ్మడి సభాస్థలంకూడా వుండాలి; గ్రామపశువులు మేత మేసే నిమిత్తము ఉమ్మడి బంజరూ, సహకారపాలకేంద్రం, పారిశ్రామిక శిక్షణముపై ఆధారపడిన ప్రయిమరీ సెకండరీ స్కూళ్లూ, తగాయిదాల పరిష్కారం కోసం పంచాయితీలుకూడా కలిగివుండాలి. ప్రతి గ్రామం తన ఆహారధాన్యాలను, కూరగాయలను, పండ్లను, తనకు కావలసిన వడుకునూలుతో నేసిన ఖద్దరు బట్టను తానే స్వయంగా తయారుచేసుకోవాలి. ఇది సుమారుగా నా ఆదర్శ గ్రామం యొక్క స్వరూపం. ప్రస్తుత పరిస్థితులలో కొలది మార్పులతో గ్రామకుటీరాలు ఉన్నరూపంలోనే వుండవలసి వుంటుంది. ఒక జమీందారు వున్నచోట ఆతని సహకారంతోగాని, లేనిచోట ప్రజల స్వయగ సహకారంతోగాని, ఆదర్శ కుటీర నిర్మాణంతప్ప మిగతా గ్రామ కార్యక్రమమంతా, ప్రభుత్వ సహాయంతో నిమిత్తం లేకుండా, అక్కడి జమీందారుయొక్క, లేక జమీందార్లయొక్క లేక ప్రజల యొక్క సాధ్యతలోగల వ్యయంతో జరగడానికి వీలుంది. ఆపాటి సహాయంతో ఎంతైనా గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమం కొనసాగించవచ్చును. అయితే, నాగ్రామస్థులు పరస్పర సహకారభావంతో పనిచేసి, అందరి క్షేమం కోసం ఇష్టపూర్వకమైన శ్రమదానం ఒసగినపక్షంలో వారెంత

వరకు స్వయంసహాయం చేసికొనగలుగుతారన్న విషయమే నా ప్రస్తుత పరిశీలనాంశం. జ్ఞానయుతంగా వారిని నడిపించిన పక్షంలో, ప్రతి గ్రామంలోని ప్రజలున్నూ తమ గ్రామ మొత్తంయొక్క ఆదాయాన్ని— వ్యక్తుల స్వంతఆదాయాన్ని కాదు— రెట్టుకి రెట్టుగా పెంచుకొనగలుగుతారని నా గట్టి నమ్మకం. మన గ్రామాలలో, ప్రతిచోటా వ్యాపారదృష్ట్యా కాకపోయినా అన్నిచోట్లా స్థానికావసరాలదృష్ట్యా, కావలసినంత ముడి పదార్థాలు లభించగల అవకాశాలున్నాయి. అయితే గ్రామీణులకు తమ పరిస్థితిని బాగుపరచుకొనవలెననే అభిలాష లోపించడమే అన్నిటికంటె గొప్పదురదృష్టం

గ్రామ సేవకుడు మొట్టమొదట పరిష్కరించవలసివున్న సమస్య గ్రామ పారిశుధ్యం. ఇది మన కార్యకర్తలను ఎదుర్కొనే టలువంటి దైహికసంక్షేమ భంగకరములను, వ్యాధి వ్యాపకములును అగు క్లిష్ట సమస్య లన్నిటిలోకీ ఇంతవరకు అశ్రద్ధపాలైన సమస్య. గ్రామ సేవకుడు ఇష్టపూర్వకంగా "భంగీ"పని (పాకీపని) స్వీకరించే పక్షంలో, అతడు తొల్దొలిని మనుష్యమలమును ప్రోగుచేసి ఎరువుగా చేయుటతోను, గ్రామవీధులను తుడిచి శుభ్రపరచుటతోను, ప్రారంభించాలి. దైనిక కాలకృత్యములను ఏ రీతిగా ఎచ్చట చేయదగునో అతడు గ్రామస్థులకు బోధించి, గ్రామపారిశుధ్యంయొక్క అవసరమునుగురించీ, దాని విషయంలో అశ్రద్ధచూపుటవల్ల కలిగే అపారమైన హానినిగురించీ గ్రామీణులలో ప్రచారం

గావించాలి. గ్రామస్థులు తన మాటలను విన్నను వినకపోయినను కూడా గ్రామా సేవకుడైన వాడు తన కార్యక్రమం తాను అనుసరిస్తూనే వుండాలి.

హరిజన్. 9-1 : 37.

అధ్యాయం ౩౫

గ్రా మా రో గ్యం

వ్యక్తిగతమూ, కుటుంబగతమూ, ప్రజాగతమూ అయిన పారిశుధ్య సూత్రాలను పూర్తిగా అనుసరించి, ఆహార విహారాల విషయంలో తగిన జాగ్రత్త తీసుకున్నయెడల సుస్తీలకు, వ్యాధులకు అవకాశమే వుండదని నా అభిప్రాయం. అంతరంగంలోనూ బహిరంగంలోనూ సంపూర్ణమైన పారిశుధ్యం వున్నచోట జబ్బులు రావడమే అసాధ్యమవుతుంది. గ్రామ ప్రజలు దీనినే కనక బోధపరచుకుంటే వారికి డాక్టర్లతోనూ, హకీంలతోనూ, వైద్యులతోనూ పనేవుండదు.

ప్రకృతి చికిత్సావిధానంలోని అంతర్భావం, ఆదర్శజీవితప్రతిపాదకం. అదర్శజీవిత మనేది మన పట్నాలలోనూ గ్రామాలలోనూ ఆదర్శప్రాయమైన జీవితపరిస్థితులయొక్క అవసరాన్ని ప్రతిపాదిస్తుంది. అన్నిటికంటె ప్రధానంగా ప్రకృతిచికిత్సావిధాన మనేది పరమేశ్వరనామమనే ఇరుసు చుట్టూ తిరిగే చక్రంవంటిది.

ప్రకృతిచికిత్స అనగానే అది అన్నిటిలోకీ తక్కువ ఖర్చుతో కూడిన సులభవైద్యపద్ధతి అని అర్థమిస్తుంది.

గ్రామాలలోనే చికిత్స సాధ్యం కావలెననేది దాని ఆదర్శం. దానికి అవసరమైన సాధనములున్నూ, ఏర్పాట్లున్నూ గ్రామస్థులే స్వయంగా చేసికొనడానికి సాధ్యమైనవిగా వుండాలి. గ్రామాలలో లభ్యంకానివేవైనా కావలసివుంటే అవి బయట నుంచి సంపాదించవచ్చును. ప్రకృతి చికిత్స జీవితవిధానం లోనే ఉత్తమతరమైన వ్యక్తిత్వాన్ని కోరుతుంది. అది జీవితాన్ని ఆరోగ్యసూత్రానుసారంగా నడుపవలసిన ఆవసరాన్ని బోధిస్తుంది. ప్రకృతి చికిత్స అంటే ఆస్పత్రిలో ఉచితంగా గాని, డబ్బుయిచ్చిగాని మందు తీసుకోవడం కాదు. ఆస్పత్రులలో ఉచితంగా మందులు తీసుకునేవాడు ఇతరుల దయాధర్మాలమీద ఆధారపడుతున్న వాడౌతాడు. ప్రకృతి చికిత్సను అనుసరించేవాడు ఎన్నడూ బిచ్చాన్ని ఆశించడు. స్వయంసహాయం ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేస్తుంది. ఆతడు తనశరీరంలోనుంచి అందుప్రవేశించిన విషయములను తొలగించుకొనుట ద్వారా తనకు తానే చికిత్సచేసుకుని, ఇక ముందు తిరిగి జబ్బులు రాకుండా ముందుజాగ్రత్తలుకూడా తీసుకుంటాడు.

యోగ్యాహారమూ, సమాంశములతోకూడిన ఆహారమూ మిక్కిలి ముఖ్యమైనవి. ఈనాడు మనతోపాటు మన గ్రామాలుకూడ దారిద్ర్యంలో మునిగివున్నాయి. కావలసినన్ని కూరగాయలను, పండ్లను, పాలను గ్రామాలలోనే ఉత్పత్తి చేయవలెననేది ప్రకృతి చికిత్సాపద్ధతిలో ప్రధాన

మైన అంశం. ఈపనికి వినియోగించిన కాలం వ్యర్థమైనట్లుగా భావించనవసరంలేదు. దీనివల్ల గ్రామస్తులంతా లాభంపొందుతారు. ఆవిధంగా ఇది భారతదేశ మంతటికీకూడ లాభం చేకూరుస్తుంది.

హారిజన్ 2-6-46

శరీరారోగ్య సూత్రాలను, పారిశుధ్య పద్ధతులను, బలవర్ధకాహార విషయకమైన నియమాలను తెలిసికొని, వాటిని అనుసరించుటయే ప్రకృతి చికిత్సయొక్క సారాంశం. ఆ విధంగా ప్రతివ్యక్తీనీ తనకుతానే వైద్యం చేసుకోవచ్చును. కేవలం బ్రతకడానికేఆహారం సేవించేవాడు, పృధివ్యాపస్తేజో వాయురాకాశము లనే పంచశక్తులతోనూ మైత్రినెరపి జీవించేవాడు. ఆపంచభూతములకును సృష్టికర్తఅయిన పరమేశ్వరునికి సేవకునికిగా వర్తించేవాడు ఎన్నడుగాని అనారోగ్యంపాలు కాకూడదు. ఒకవేళ అయినచో, ఆతడు పరమేశ్వరునిపైననే ఆధారపడి నిశ్చలమనస్కుడై వుండి, అవసరమైతే అంతరంగ శాంతితో మరణించగల్గుతాడు. ప్రకృతిచికిత్సావలంబకుడైన వాడు తనగ్రామపు పొలాలలో దొరికే ఓషధు లేమైనావుంటే వాటిని వాడుకొనవచ్చును. కోట్లకొలది జనులు ఈవిధంగా మారుమాట చెప్పకుండా బ్రతుకుతున్నారు, మరణిస్తున్నారు. వారు డాక్టరుపేరైనా ఎన్నడూ విననూలేదు, డాక్టరు ఎలావుంటాడోకూడా ఎన్నడూ చూడనూలేదు. మనం నిజంగా గ్రామమనస్కులమౌదాం. గ్రామంలోని పిల్లాపెద్దా మనదగ్గరకు వస్తారు. వారికి నిజమైన జీవితం ఎట్లాగడపాలో

బోధిద్దాం. రోగాలలో నూటికి 99 వంతులు అపరిశుద్ధతవల్లను, అయోగ్యాహార సేవనంవల్లను, మనం తినే ఆహారంలో పోషకశక్తి లేనందునను వస్తాయని డాక్టర్లు ఉద్ఘాటిస్తున్నారు. ఈనూటికి 99 మందికిని మనం ప్రతికేకళను బోధించగలిగితే, ఆమిగిలిన ఒకవంతు విషయమై మనం పట్టించుకొన నక్కర లేదు. వారు తమఆరోగ్య రక్షణకు ఏఉచిత వైద్యుడినో దొరికించుకొనగలరు. వారికోసం మనకీ ఆదుర్దా అవసరం లేదు. ఈనాడు శుభ్రమైన నీరు, మంచిమన్ను, మంచిగాలి అనేవి మనకు లేకుండాపోయాయి. మనం ఆకాశంలోనూ సూర్యునిలోనూ గర్భితమైవున్న అమూల్యమైన విలువను ఎరగం. మనం ఈపంచభూతములయొక్క శక్తులను వినియోగించుకొని, యోగ్యమూ సమాంశయుక్తమూ అయిన ఆహారం తీసికొనగల్గితేచాలు, యుగయుగాలకు సరిపోయే పనిని నెరవేర్చినవారమౌతాం. ఈజ్ఞానాన్ని ఆర్జించడానికి మనకి డిగ్రీలుగాని, కోట్లకొలది ధనంగాని అక్కరలేదు. మనం దైవవిశ్వాసాన్నీ, సేవానిరతినీ, పంచభూత విషయకమైన పరిజ్ఞానాన్నీ, యోగ్యాహార సంబంధమైన శాస్త్రజ్ఞానాన్నీ మాత్రం కలిగివుంటేచాలు. ఇదంతా స్కూళ్ళలోను, కాలేజీలలోను కాలం వ్యర్థపుచ్చ నవసరంలేకుండానే మనం నేర్చుకొనవచ్చును.

హరిజన్ 1-9-46

ప్రకృతి సూత్రాలను మనం అజ్ఞానపూర్వకంగానో, బుద్ధిపూర్వకంగానో మీరడంవల్లనే రోగాలనేవి పుడతాయి.

దానినిబట్టి, ఆసూత్రాలను సకాలంలో మానం తిరిగి అనుస రించ నారంభించినచో పునరారోగ్యాన్ని పొందవచ్చునని కూడా స్పష్టపడుతుంది. ప్రకృతిని అతిగా మీరినవాడు ప్రకృతి ఒసగే శిక్షను అనుభవించనైనా అనుభవించవలసుం టుంది; లేదా దానిని తప్పించుకునే నిమిత్తం పరిస్థితినిబట్టి డాక్టరు సహాయమో, సర్జనుసహాయమో పొందవలసైనా వుంటుంది. అర్హమైన శిక్షను అనుభవించుట కంగీకరించిన ప్రతిసందర్భంనుంచీ మానవుని మనశ్శక్తి బలపడుతుంది; దానిని తప్పించుకున్న ప్రతిసందర్భంనుంచీ అది దుర్బల మౌతుంది.

హరిజన్, 15-9-46

వైద్యశాస్త్రజ్ఞులూ, విజ్ఞాన శాస్త్రవేత్తలూ దేశానికి చేస్తూవున్న సేవఏమిటో నాకుకొంచం చెప్పమనికోరుతాను. వీలుచిక్కినదే తడవుగా వారు ప్రత్యేకవ్యాధులకు నూతన చికిత్సావిధానాలు నేర్చుకొనుటకై విదేశాలకు పోయిరావ డం చూస్తున్నాం. వారందరూ తమయొక్కదృష్టిని భారత దేశపు ఏడులక్షల గ్రామాలదిక్కుగా ప్రసరించవలసినదని నేను వారికి సూచన ఒసగుతున్నాను. వారాపని చేసిన యెడల, వైద్యంలో సుశిక్షితులైవున్న స్త్రీ పురుషులందరి సేవయు గ్రామాలలో ఎంతఅవసరమో తెలిసికొనగలుగు తారు; అయితే ఆసేవ పాశ్చాత్యపద్ధతినికాక ప్రాచ్యపద్ధతిని జరగవలసి వుంటుందనికూడా గ్రహిస్తారు. అప్పుడు వారు దేశీయమైన వైద్యపద్ధతులనుకూడా అవలంబించనారంభిస్తారు.

మనగ్రామాలలోనే పెరిగే లెక్కలేనన్ని రకముల ఓషధులు దేశీయమైనవివుండగా, భారతదేశానికి పశ్చిమదేశాలనుంచి దిగుమతిఅయ్యే మందులయొక్క అవసరమేలేదు. మందుల కంటె మనప్రజానీకానికి యోగ్యమైన జీవితపద్ధతిని నేర్పడం ఎక్కువ అవసరం.

హరిజన్, 15-6-47

నాప్రకృతి చికిత్సావిధానం కేవలం గ్రామీణుల కును, గ్రామములకును మాత్రమే ఉద్దేశింపబడినటువంటిది. అందువల్ల దానిలో సూక్ష్మదర్శిని, ఎక్సరేయంత్రముల వంటివాటికి తావులేదు. క్వైనైన్, ఎమెటిన్, పెనిసిల్లిన్‌ల వంటి మందులకుకూడా ప్రకృతిచికిత్సలో స్థానంలేదు. వ్యక్తి పారిశుధ్యమూ, ఆరోగ్యజీవనమూ అందులో ప్రాధాన్యం వహిస్తాయి. ఇదిచూచుకుంటే చాలు ఈచికిత్సాకళలో ప్రతి వారూ ఉత్తీర్ణత గడిస్తే అసలు వ్యాధులేవుండవు. ప్రకృతి సూత్రాలన్నింటిని అనుసరించి బ్రతుకుతున్నప్పటికిని ఒకవేళ ఏదైనా జబ్బుచేసిన పక్షంలో దాని నివారణమునకు దివ్యౌ షధం రామనామమే. ఈరామనామ పూర్వకమైన చికిత్సా విధానం ఒకక్షణంలో సార్వజనీనమైన ప్రచారంలోకి రాలేదు. రోగికి విశ్వాసం కలిగించేనిమిత్తం ముందుగా వైద్యుడు తనలో రామనామమునకు సజీవమైన మూర్తీభావం పెంపొం దించుకోనవలసివుంటుంది.

హరిజన్. 11-8-46.

అధ్యాయం ౭౯

గ్రామాలకు యోగ్యాహారం

మెరుగుపెట్టిన బియ్యం - మెరుగుపెట్టని బియ్యం :

పూర్వకాలపు పద్ధతిప్రకారం గ్రామాలలోనేకనక బియ్యం దంపించుకున్నయెడల ఆకూలిడబ్బు ఆ దంపుదంపే మన అక్కచెల్లెళ్ల చేతులలోకి వెడతాయి, దానితోపాటు బియ్యమే ముఖ్యాహారమైన మనదేశంలోని లక్షల ప్రజలకు, మెరుగుపెట్టిన మరబియ్యంలోని ఉత్తపిండి పదార్థమునకు బదులు, దంపుడుబియ్యంలోని బలకర పదార్థాలవల్ల కొంత పోషణ కలుగుతుంది. తనకాలిక్రింద చిక్కిన ప్రజానీకం యొక్క ఆరోగ్యానికిగాని, సంపదకుగాని కలిగేనష్టాన్ని పరిగణించని మానవ స్వభావాంతర్గతమైన లోభగుణమే ధాన్యం పండే ప్రాంతాలలో మనకీనాడు ఎక్కడపడితే అక్కడ కనిపించే అసహ్యకరమైన బియ్యపుమరలకు మూలకందం. ప్రజాభిప్రాయమేకనక బలంగా దంపుడుబియ్యమే కావలెనని కోరిన యెడల, బియ్యపుమరలు నడవడం అసాధ్యమవుతుంది; దానితోపాటు మిల్లుయజమానులకు మనజాతియొక్క ఆరోగ్యమునంతను ధ్వంసమొనర్చి, పేదల కింతతిండిపెట్టే దంపుడు వృత్తిని నాశనమొనర్చిన తమ దుర్వ్యాపారాన్ని మానుకొనవలసినదిగా విజ్ఞప్తికూడా చేయవచ్చును.

హరిజన్, 26-10-44.

విసురుడు గోధుమపిండి :

మెరుగుపెట్టినబియ్యం మాదిరిగానే తౌడుపొరలేని గోధుమపిండికూడా బలరహితమైన ఆహారపదార్థం బలహీన మైన ఆహారమవుతుందని వైద్యులందరూ అంగీకరించి వున్నారు. బజారులోదొరికే సన్ననిపిండికంటె మనయింట్లో తిరగలిమీద విసిరినపిండియే పూర్తిగా శ్రేష్ఠమైనదీన్నీ, చౌక అయినదీన్నీ అయివుంటుంది. మనంస్వయంగా విసురు కొనడంవల్ల ఆఖర్చు ఆదాఅయి, తద్వారా విసురుడుపిం డియే ఎల్లప్పుడూ చౌకగా కిట్టుబాటవుతుంది. అంతేకాక తౌడుపొరతోవుండే గోధుమలయొక్క పిండికి బరువులో తరు గేమీవుండదు. సన్నపిండిలో బరువు తరిగిపోతుంది. గోధుమ లలోకల్లా విలువైన పదార్థం ఆతౌడుపొరలోనే వుంటుంది. ఆపొర తొలగించడంతో గోధుమలలోని బలం చాలాభాగం పోతుంది. గ్రామాలలో తమస్వంత తిరుగళ్ళమీద విసురు కునే ముడిగోధుమపిండి ఉపయోగించే వారందరును, ఖర్చు లో ఆదాచేసికొనడమేకాక, అంతకంటె విలువైన తమ ఆరోగ్యాన్నికూడా ఆదాచేసుకుంటున్నారన్నమాట. గ్రామా లలో విసురుడువృత్తిని తిరిగి పునరుద్ధరించడంవల్ల, యిప్పుడు పిండిమరల యజమానులు చేసుకుంటూవున్న లక్షల ధనం గ్రామాలలోనే మిగిలివుండి, అర్హులైన పేదలకు అది పంపకం కావడానికి అవకాశం ఏర్పడుతుంది.

హరిజన్, 1-2-35.

బెల్లం :

వైద్యులసాక్ష్యాన్ని బట్టిచూస్తే, సన్నచక్కెరకంటె బెల్లమే ఆహారపువిలువలో ఎంతో శ్రేష్ఠమైనదని స్పష్టమౌతూంది. ప్రస్తుతం చాలాచోట్ల జరుగుతూవున్నట్లుగా గ్రామీణులు బెల్లం తయారీని మానివేసినయెడల, వారిపిల్లలకు అత్యవసరమైన ఒక ఉపాహారద్రవ్యాన్ని కోల్పోయినవారౌతారు. బెల్లం తయారీని, దానివినియోగాన్నీ మానకుండా నిలుపుకొన్నయెడల అనేకకోట్ల రూపాయిలు నిలవైనట్లే భావించవచ్చును.

హరిజన్, 1-2-35.

ఆకుకూరలు :

ఆహారాన్ని గురించిగాని, విటమిన్లను గురించిగాని తెలిపే ఏఆధునిక పాఠ్యపుస్తకాన్నిగాని తీసిచూడండి; ఏదో ఒక తినయోగ్యమైన పండని ఆకుకూరను భోజనంతోపాటు కొంచెంగా తీసుకుంటే అదిఆరోగ్యానికి చాలా లాభకరమని ఆపుస్తకాలు బోధిస్తాయి. అయితే ఆకుకూరలను ముందుగా మురికిపోవునట్లు కనీసం అరడజనుసార్లైనా కడిగి శుభ్రపరచడం మిక్కిలి అవసరం. అట్టి ఆకుకూరలు అలాతుంపుకువస్తేచాలు, ప్రతిగ్రామంలోనూ సులభంగా లభ్యమౌతాయి. అయినా ఈరోజులలో ఆకుకూరఅనేది పట్నవాసపు సుతారమైన ఆహారపదార్థములలో ఒకటిగా మాత్రమే పరిగణింపబడుతోంది.

భారతదేశంలోని వివిధప్రాంతాలలోను గ్రామీణులు ఉత్తపప్పూ. అన్నం లేక రొట్టీమాత్రమే తింటారు, దానితో పాటు వంటికి చాలాహానికలిగించే మిరపకాయలకారం ఒకటి అనుపానంగా వాడుతారు. గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమం ఆహారసంస్కారముతో ప్రారంభించివున్నాం. కనుక, గ్రామీణుల ఆరోగ్యపునరుద్ధరణకు తగిన సులభ సాధ్యమూ, చౌకఅయిన ఆహారపదార్థములను మనం కనిపెట్ట వలసివుంటుంది. ఆకుకూరలను భోజనంతో కలిపితే గ్రామీణులు ప్రస్తుతం అనుభవించే అనేక వ్యాధులనుంచి రక్షణ కలుగుతుంది. గ్రామీణులభోజనంలో విటమిను ద్రవ్యలోపం చాలావుంది, అది పచ్చిఆకుకూరల వినియోగంద్వారా పూటీఅవుతుంది. నేను నాఆహారంలో సర్సావ్, (sarsav—ఆవయొక్క ఆకు) సువా (suva —) ఆకుకూరలను, టర్నిప్, క్యారట్, రేడిష్ దుంపలపై ఆకులను, బటాణీ మొక్కల ఆకులనుచేర్చి, ప్రయోగించి చూచివున్నాను. ఇవి కాక, రేడిష్, టర్నిప్, క్యారట్ దుంపలనుకూడా పచ్చి వాటిని తినవచ్చునని వేరుగా చెప్పనవసరంలేదు. పచ్చివి తినడానికి వీలైన ఇటువంటి ఆకులను, దుంపలను ఉడకబెట్టడ మనేది అనవసర వ్యయమేకాక, తద్వారా వాటియొక్క రుచికూడా నష్టమవుతుంది. ఈఆకుకూరలలోని విటమిన్లు ఉడకబెట్టుట మూలకంగా పూర్తిగాగాని, చాలావరకుగాని నశిస్తాయి. వీటిని ఉడకబెట్టడంవల్ల 'రుచినష్టం' జరుగు తుందని ఎందుకన్నానంటే, పచ్చికూరలకు ఒకవిధమైన

చక్కటి సహజమైన రుచివుంది. ఉడకబెట్టడంతో అదిపోయి, అవి చప్పగా తయారౌతాయి.

హరిజన్, 15-2-35.

అధ్యాయం ౨౭

గ్రామ సేవకుడు

గ్రామసేవ అనగానే మనకి భయం కలుగుతుంది. పట్నవాసాలలో పెరిగిన మనకి గ్రామజీవితం అవలంబించడం కష్టతరంగా తోస్తుంది. అందుకు అవసరమైన కష్టం చేయడానికి మనకి వొళ్ళు వంగదు. ఒకవర్గపాలనకు బదులు మరొక వర్గపాలన కాకుండా ప్రజానీకమంతకు సంబంధించిన స్వరాజ్యాన్ని, మనం స్థాపించదలిస్తే, ఈకష్టాన్ని మనం ధీరత్వంతో, అవసరమైతే వీరత్వంతోకూడా, ఎదుర్కొని సాధించవలసివుంటుంది; గ్రామోద్ధరణకు ఇప్పుడు మనం పడవలసిన బాధకంటె వర్గపాలనవల్ల కలిగేబాధ ఇంకా అధికతరమైవుంటుంది. ఈవరలో మన బ్రతుకు క్షేమంగా నడిచే నిమిత్తం వేలాది గ్రామస్థులు తమప్రాణాలర్పించి వున్నారు. ఇప్పుడు వారి బ్రతుకునిమిత్తమై మనం ప్రాణము లర్పించవలసివుంటుంది. అయితే ఈరెండిటికి చాలా భేదంవుంది. వారు అజ్ఞానంతో తెలియకుండానే మనకు ప్రాణమిచ్చారు. వారి బలవంతపు ప్రాణత్యాగం మనలను చాలా అవమానం పాలుచేసింది. మనమిప్పుడు వారినిమిత్తం బుద్ధిపూర్వకంగానూ, ఇష్టపూర్వకంగానూ ప్రాణమొసగితే, మనత్యాగం

వల్ల మనకూ, మన దేశ మొత్తానికీకూడా గౌరవలాభం సిద్ధిస్తుంది. స్వతంత్రమూ, ఆత్మగౌరవయుతమూ అయిన జాతిగా మనం బ్రతకదలిస్తే, అత్యవసరమైన ఈ త్యాగానికి మనం వెనుదీయకుందుముగాక.

యంగిండియా, 17-4-24.

గౌరవమైన గృహజీవితంతో సమానమైన విద్యాశాల వేరొకటిలేదు; సత్యశీలురూ, సుగుణవంతులూ అయిన తలిదండ్రులతో సమానమైన గురువులు ఇంకొకరులేరు. ఆధునిక (ఉన్నత) విద్య గ్రామీణుల కొకదుర్భారమువంటిది. వారి పిల్లలు దానివల్ల లాభంపొందలేరు; అందుకు విచారించవలసిన పనిలేదు. వారికి గౌరవమైన గృహజీవిత మనే విద్యాశాలలో శిక్షణవుంటే చాలు. వారు అదృష్టవంతులన్నమాటే. గ్రామసేవకుడుగా పనిచేయదలచిన పురుషులుగాని స్త్రీలుగాని సగౌరవమైన, గృహజీవితాన్ని గడపగల యోగ్యశీలురు కానిచో, వారు గ్రామసేవకు లనే ఉత్కృష్టమైన తాహతును పొందుటకు దురాశ పడడం మానుకుంటేనే మంచిది. వారికి (గ్రామీణులకు) ఉత్త పాఠ్యపుస్తకాలలోని వ్రాత, చదువు, లెక్కలు వస్తేచాలదు; వారికి గ్రామజీవితపు ఆర్థిక పరిజ్ఞానం అవగాహన చేసుకునే జ్ఞానం కలగాలి; ఆ ఆర్థిక పరిస్థితిని ఎట్లు బాగుపరచవలెనో దానిని గూర్చికూడా పరిజ్ఞానం ఏర్పడాలి. ఈనాడు వారు తమ పరిసరములను అభివృద్ధి పరచుకొనుటకు బాధ్యతాపూర్వకమైన

అభిలాష ఏమీ లేకుండా, చేసే కష్టంలో ఏవిధమైన సంతోషమూ లేకుండా, యంత్రాలవలె కష్టజీవితం గడుపుతున్నారు.

హరిజన్, 23-11-35.

విద్యాలాభం పొందినవారే గ్రామాల విషయంలో చిరకాలానుగతంగా అశ్రద్ధ చూపారు. వారు నగర జీవితాన్ని సుఖప్రదంగా భావించారు. తీవ్రమైన సేవా భావపూరిత హృదయులై గ్రామీణులకు సేవచేయుట ద్వారా తమ ఆత్మాభివ్యక్తతను పొందవలెనని ఆశించేవారిచేత గ్రామవాసం స్వీకరింపజేసి, తద్వారా గ్రామసీమతో వారికి సజీవసంపర్కం పెంపొందించుటకు చేసే ప్రయత్నమే ఈ గ్రామోద్ధరణోద్యమం. సేవాభావంతో గ్రామవాసం స్వీకరించినవారు తమకు ఎదురైన కష్టాలనుచూచి నిస్పృహ చెందరు. వారు అచటికి పోవుటకుముందే అనేక కష్టములను ఎదుర్కొనవలసి వుంటుందనిన్నీ, గ్రామస్థులే తమయెడల నిరపేక్షాభావం ప్రదర్శించవచ్చుననిన్నీ కూడా ఎరిగే వుంటారు. అందువల్ల తమలోను, తమ సందేశంలోను విశ్వాసం కలిగివున్నవారే గ్రామవాసులకు సేవచేసి, వారి బ్రతుకుపై ప్రభావం చూపగల్గుతారు. ప్రజామధ్యాన్ని వుండి గడిపిన సత్యవంతమైన జీవితం దానికదే ఒకఆదర్శప్రాయతను గడించుకొని, తనచుట్టునువున్న పరిసర పరిస్థితులపై బలవత్తరమైన ప్రభావమును అంకిత మొనర్చగల్గుతుంది. గ్రామవాసంతో నిరుత్సాహంపొందిన యువకుడెవరైనావుంటే, అతడచ్చటికి సేవాదర్శంతో కాక కేవలం

జీవనోపాధి నిమిత్తం వెళ్ళినవాడైవుంటాడు. కేవలం డబ్బు కోసం వెళ్ళినవారికి గ్రామజీవితం ఆకర్షణీయంగా కనిపించ దని నేనంగీకరిస్తాను. సేవాభావం అనే ప్రోద్బలం లేనప్పుడు, క్రొత్తఉబలాటం పోయినతర్వాత, అది విసుగుపుట్టిస్తుంది. గ్రామవాసులను స్వీకరించి వెళ్ళిన యువకుడెవరుగాని, కాస్త కష్టం కలగగానే వెన్నుజూపితే లాభంలేదు. ఓపికతో పని చేస్తే గ్రామవాసులు నగరవాసులకంటె ఏమీ భిన్నమైన వారుకారనిన్నీ, సానుభూతిని శ్రద్ధాభావమును చూపినచో వారు దానికి అనుగుణంగానే వర్తించగలరనిన్నీ బోధపడు తుంది. గ్రామవాసం స్వీకరించడంవల్ల దేశంలోని ప్రముఖు లతో సంపర్కానికి అవకాశ ముండదన్నమాట నిజమే. గ్రామమనస్కత అనేది వ్యాప్తినొందినకొలది, ఆనాయకులే గ్రామములకు తరుచువచ్చి గ్రామీణులతో సజీవసంబంధం కలిగించుకొనడం ఆరంభిస్తారు. అదికాక, చైతన్యుడు, రామ కృష్ణపరమహంస, తులసీదాసు, కబీరు, నానకు, దాదు, తుకారాం, తిరువళ్ళువారు, ఇంకా ఎందరో తత్తుల్యులైన భక్తాగ్రేసరులయొక్క రచనల పఠించడంద్వారా మహాత్ములు సచ్ఛీలురుఅయిన వారందరియొక్క సాంగత్యమును ఎల్ల ప్పుడూ అనుభవించడానికి అవకాశం వుండనేవుంది. శాశ్వత మైన విలువలవైపు మనస్సును మళ్ళించుకొనడమే అసలు కష్టం. ఒకవేళ ఆధునిక భావనయెడల అది రాజకీయమైనా, సాంఘికమైనా, ఆర్థికమైనా, విజ్ఞానశాస్త్ర సంబంధమైన దైనాగాని కోరికవుంటే ఆయా విషయములను గూర్చిన

సాహిత్యం సంపాదించుకొని ఆ అభిలాషను తీర్చుకొన వచ్చును. కాని మతవిషయిక గ్రంథములకంటె అవి దొరకడం ఎక్కువ కష్టమని నేను ఒప్పుకుంటాను. భక్తులు ఏమి వ్రాసినా, ఏమిచెప్పినా, అది ప్రజాబాహుళ్యం నిమిత్తం ఉద్దేశించి చేశారు. ఆధునికభావాలను జనసామాన్యం ఆకళించుకొనగలిగినట్లుగా మార్చిచెప్పే విధానం ఇంకా బాగా ప్రచారంలోకి రాలేదు. క్రమేపి అదికూడా తప్పక సాధ్యమాతుంది. అందువల్ల గ్రామవాసం స్వీకరించదలచిన యువకులు నిరుత్సాహమునకు వశంకాకుండా, పట్టుదలతో తమ కృషిని సాగించి, తమ ఉనికివల్ల గ్రామాలను ఎక్కువ నివాసయోగ్యములుగానూ, ప్రేమాస్పదములుగానూ చేయవలసిందని నాసలహా. గ్రామీణులకు అనుగుణమైన రీతిగా గ్రామసేవా కార్యమును నిర్వహించుటద్వారా పైనపేర్కొన్న ఫలితం సిద్ధించగలదు. ప్రతి గ్రామసేవకుడును స్వయంగా గ్రామ పరిశుభ్రతకు శ్రమించుటతోడను, తమ సాయశక్తులా నిరక్షరాస్యతను నిర్మూలించుటకు కృషి సల్పుటతోను తన కార్యక్రమాన్ని ఆరంభం చేయవచ్చును. వారి వ్యక్తిజీవితాలు నిష్కలుషమూ, సుశిక్షితమూ, శ్రమాయుతమూ అయివుంటే, ఆ ప్రభావం వారుపనిచేసే గ్రామాలలో తప్పకుండా పరివ్యాప్తమాతుంది.

హరిజన్ 20-2-37

గ్రామకార్యక్రమంలోని ముఖ్యాంశాలు :

గ్రామోద్ధరణ కార్యక్రమంలో గ్రామపారిశుధ్యం ఒకభాగంగా వుండనిమెడల, మనగ్రామాలు యిప్పటిరీతిగా

పెంటకుప్పలవలెనే వుండిపోతాయి. గ్రామ పారిశుధ్యం గ్రామజీవితానికి ఆయువుపట్టువంటిది. అది ఎంతకష్టసాధ్యమో అంతప్రధానం. తరముల తరబడిగా సాగుతూవున్న అపరిశుద్ధతను నిర్మూలించుటకు మిక్కిలి ధీరత్వంతో కూడిన కృషి అవసరమౌతుంది. గ్రామపారిశుధ్యమును గురించిన శాస్త్రజ్ఞానములేని గ్రామసేవకుడు, పాకీపని బాగాచేయలేనివాడు, గ్రామసేవా కార్యమునకు అనర్హుడౌతాడు. నవీనవిద్య లేక బేసిక్ శిక్షణ విధానం అవలంబిస్తే తప్ప భారత దేశంలోని లక్షలాది పిల్లలయొక్క విద్యాభ్యాసం సాధ్యపడడం కష్టమని ఇప్పుడు సుమారుగా అందరూ అంగీకరించినట్లే ద్యోతకమౌతుంది. అందువల్ల గ్రామసేవకుడు దానిని అవగాహన చేసుకొని, తానే ఒక బేసిక్ విద్యాశిక్షకుడుగా పనిచేయవలసి వుంటుంది. బేసిక్ విద్యతోపాటు, సహజంగా వయోజన విద్యకూడా అవసరమౌతుంది. నవీనవిద్య వేరు పాతుకున్న చోట, ఆపిల్లలే తమ తలిదండ్రులకు చదువు చెప్పగలుగుతారు. అదట్లావుంచి, గ్రామసేవకుడు వయోజనవిద్యను తన కార్యక్రమంలో భాగంగా చేపట్టడం అవసరం.

స్త్రీని పురుషునిలో ఉత్తమార్థమని వర్ణిస్తూవుంటారు. శాసనరీత్యా ఆమెకు పురుషునితో సమానమైన హక్కులు లేనంతవరకూ, ఆడపిల్లయొక్క పుట్టుక మగపిల్లవాని పుట్టుకతో సమానమైన సంతోషవిషయంగా పరిగణింపబడనంత వరకూ భారతదేశంయొక్క అర్ధశరీరం పక్షవాతక్రుశీభూతమై

వున్నట్లే భావించవలసి వుంటుంది. స్త్రీని అణగద్రొక్కి వుంచినచో అహింసా సూత్రమును తిరస్కరించినట్లే అవుతుంది. అందువల్ల ప్రతి గ్రామసేవకుడును ప్రతిస్త్రీని ఆయా సందర్భమునుబట్టి తనతల్లిగానో, సోదరిగానో, కుమార్తెగానో భావించి, ఆమెను గౌరవదృష్టితో చూడవలసి వుంటుంది గ్రామ సేవకుడు ఆరీతిగా వర్తించినప్పుడే గ్రామ ప్రజలయొక్క విశ్వాసాన్ని చూరగొనగల్గుతాడు.

అనారోగ్యవంతులైన ప్రజలు స్వరాజ్యమును సాధించుట అసాధ్యమైన పని. అందువలన ఇకనుంచి మనం మన ప్రజానీకంయొక్క ఆరోగ్యం విషయమై అశ్రద్ధచూపుతున్నామనే నిందకు అవకాశ మీయకూడదు. అందుకని ప్రతి గ్రామసేవకుడును ఆరోగ్య విషయకమైన సామాన్య సూత్రములను తెలిసికొనివుండడం అవసరం.

అందరికీ సమానంగా తెలిసిన ఉమ్మడిభాష ఒకటి వుంటేతప్ప, ఏజాతికిగాని స్వరూపం ఏర్పడదు. హిందీ - హిందూస్థానీ - ఉర్దూ వివాదంతో బాధపడక, గ్రామసేవకుడైన వాడు హిందువులకు ముస్లింలకు సమానంగా బోధపడే "రాష్ట్రభాష"లో ప్రవేశం పొందివుండాలి.

మనం ఆంగ్లభాషా వ్యామోహంలోపడి, ప్రాదేశిక భాషల విషయమై శ్రద్ధవహించడం మానేశాం. ఈఅశ్రద్ధకు పరిహారంగా గ్రామసేవకుడు గ్రామప్రజలలో తమ వాడుక భాషమీద అభిమానం ఏర్పడేలాగ చేయవలసివుంటుంది.

అతడు తన మాతృభాషతో సమానంగా ఇతర భారతీయ భాషలయెడలకూడా అభిమానం కలిగివుండాలి. అతడు ఏ ప్రాంతంలో పనిచేస్తూవుంటే అక్కడి భాష నేర్చుకోవాలి. తద్వారా అచ్చటి ప్రజలకు తమ వాడుకభాషలో అభిమానం రేకెత్తించ గల్గుతాడు.

ఈ కార్యక్రమ మంతటికీ పునాదిగా ఆర్థిక సమానత్వం అనేది వుండకపోతే, అది ఇసుకమీద కట్టిన ఇల్లులా కూలిపోతుంది. ఆర్థిక సమానత్వం అంటే ప్రతివారూ లౌకికమైన ఆస్తిపాస్తులు కేవలం సరిసమానంగా కలిగివుండడమని అర్థంకాదు. కాని ప్రతివారికీ యోగ్యమైన నివాసగృహమూ, చాలినంత సమాంశయుక్తమైన భోజనమూ, ధరించడానికి కావలసినపాటి ఖద్దరువస్త్రమూ వుండాలని మాత్రం తప్పకుండా అర్థమిస్తుంది. ప్రస్తుతం అమలులోవున్న నిర్దయాత్మకమైన అసమానతను అహింసాయుత సాధనములద్వారానే తొలగించవలసి వుంటుందనికూడా అర్థమిస్తుంది.

హారిజన్. 18-8-40.

అవసరమైన అర్హతలు

(గాంధిజీ సత్యాగ్రహికి వుండవలసిన అర్హతలుగా పేర్కొన్నవానిలో కొన్ని ఈక్రింద పొందుపరచబడినవి. గ్రామ సేవకుడుకూడా సత్యమైన సత్యాగ్రహి అయివుండవలెనని ఆయన అభిప్రాయం కావడంచేత, ఈఅర్హతలు గ్రామసేవకునికికూడా వర్తించగలవని భావించవచ్చును.)

1. భగవంతు డొక్కడే ఆతనిఅండ అగుటచే ఆతడు భగవంతునియెడల సజీవమైన విశ్వాసం కలిగివుండాలి.

2. అతడు సత్యమును, అహింసను తనధర్మంగా భావించుకొనవలెను. త్యాగశీలత ద్వారా అభివ్యక్తమగు సత్యాహింసల ప్రభావంవల్ల ఆతడు మానవునిలోని మంచిని ప్రేరేపించగలనని విశ్వసించాలి.

3. అతడు నిగ్రహయుతమూ, నీతివంతమూ అయిన జీవితం గడపాలి. తనఉద్యమం నిమిత్తం తనప్రాణాన్ని, తన ఆస్తులనూ సైతం వదలుకొనడానికికూడా సిద్ధపడివుండాలి.

4. ఆతడు అభ్యాసపూర్వకంగా నూలువడకు, ఖద్దరు ధారణమూ చేయాలి. ఇది భారతదేశంలో తప్పనిసరిగా అవసరం.

5. ఆతడు మద్యపానాది దుర్వ్యసనములు లేనివాడై, తన హేతుశక్తిని ఎప్పుడూ నిర్మలంగానూ, అచంచలం గానూ వుంచుకోవాలి.

6. అప్పటప్పట నిర్దేశింపబడే శిక్షణ విధులను హృదయపూర్వకంగా ఆచరణలో పెడుతూవుండాలి.

ఈఅర్హత నియమాలు పట్టిక సమగ్రమైనది కాదు. ఇది కేవలం ఉదాహరణ పూర్వకం మాత్రమే.

హరిజన్, 25-3-39.

అధ్యాయం ౭౮

సమగ్ర గ్రామసేవా కార్యక్రమం

సమగ్ర గ్రామసేవకుడు గ్రామవాసులలో అందరినీ ఎరిగివుండాలి, అందరికీ తాను చేయగలిగినంతవరకు సహాయం చేస్తూవుండాలి. అంటే ఆ కార్యకర్త ఒక్కడూ అన్నిపనులూ చేయగలడని కాదు. అతడు వారికి స్వయంసహాయం నేర్పి, అవసరమైన సహకారం, పరికరాలూ సరఫరా చేయాలి. తనకు సహాయకారులను తానే తయారుచేసుకోవాలి. గ్రామస్థులు తనసలహాలను తీసుకొని, వాటిని అనుసరించేలాగున వారిని అతడు ఆకర్షించాలి. నేనే ఒక గ్రామంలో నూనెగానుగ ఒకటి పెట్టుకుని మకాం చేశాననుకోండి. నేనప్పుడు కేవలం నెలకి 15 - 20 రూపాయలు సంపాదించుకునే మామూలు తెలకలవానిగా వుండను. నేను 'తెలకల మహాత్ముడు'గా అవుతాను. ఇక్కడ మహాత్మశబ్దం హాస్యానికి వాడాననుకోండి; నాఅభిప్రాయం నేను గ్రామీణు లందరికీ ఆదర్శప్రాయంగా వర్తిస్తానని మాత్రమే. భగవద్గీత, కొరాను పఠించే తెలకలవాడుగా వుంటానన్నమాట. నేను వారి పిల్లలకు చదువుచెప్పే గురుతుల్యుడుగా వుంటాను. నాకు వ్యవధి తీరక, ఆపని నేను స్వయంగా చేయలేకపోతా ననుకోండి. అప్పుడు గ్రామస్తులు నాదగ్గరకువచ్చి, "అయ్యా, దయచేసి మాపిల్లలు చదువుకోడానికి తగిన ఏర్పాటు చేసిపెట్టండి" అని అడుగుతారు. "సరే, మీరు ఒకఉపాధ్యాయుణ్ణి సంపా

దించి పెడతానుగాని, ఖర్చులు మీరు భరించవలసి వుంటుంది.” అని నేను జవాబిస్తాను. వారు దానికి సంతోష పూర్వకంగా సంసిద్ధులౌతారు. నేను వారికి నూలువడకడం నేర్పుతాను. తర్వాత వారువచ్చి నేతగాడు కావలెనంటే, ఉపాధ్యాయుణ్ణి సంపాదించిపెట్టిన షరతులమీదనే ఒక నేత గాణ్ణికూడా సంపాదించి పెడతాను. ఆనేతపనివాడు వారికి నేతనేయడం నేర్పిస్తాడు. ఆరోగ్యవిధులయొక్క, పారిశుద్ధ్యం యొక్క ప్రాముఖ్యాన్ని గురించి నేను వారికి బోధచేస్తాను. తర్వాత వారు తమకు వీధులుతుడిచే పనివాడు కావలెనని వచ్చి అడిగినప్పుడు, “నేనే మీకు ఆపని చేసిపెడతాను; మీ అందరికీకూడా అందులో తరిఫీదిస్తాను,” అని చెబుతాను. సమగ్ర గ్రామసేవను గురించి ఇదీ నాఅభిప్రాయం. ఇటు వంటి తెలకలవాడు ఈయుగంలో నాకెక్కడా దొరకడని మీరంటే అనవచ్చును. అట్లాఅయితే మనగ్రామాల పురోభి వృద్ధిని మనం ఈయుగంలో సాధించలేమని నేను చెప్పవల సుంటుంది. రష్యాలో ఒకతెలకలవాణ్ణి ఉదాహరణకి తీసు కోండి. నూనెమర నడిపేవాడుకూడా తెలకలవాడే అవుతాడు. అతడికి డబ్బువుంది; కాని అతనిబలం ఆడబ్బులో లేదు. నిజమైనబలం జ్ఞానంవల్లవస్తుంది. నిజమైన జ్ఞానం కలిగివుంటే, తత్ఫలితంగా నైతికమైన పరపతి, బలమూ చేకూరుతాయి. అటువంటి వ్యక్తియొక్క సహాయం అంతా అపేక్షిస్తారు.

హరిజన్, 17-3-46.

గ్రామ తగాయిదాలు :

మన భారతదేశంలో నగరాలలోవలెనే గ్రామాలలో కూడా పార్టీలూ, కక్షలూ, ఏర్పడివుండడం చాలా శోచనీయమైన విషయం. గ్రామ సంక్షేమంకంటె పార్టీబలమే ప్రధానంగా భావించే అధికారాత్మక రాజకీయాలు (power politics) మనగ్రామాలలోనే కనక ప్రవేశిస్తే, అది మన గ్రామాలయొక్క పురోభివృద్ధికి సహాయం చేయుటకు బదులు విరోధంగా పనిచేస్తుంది. ఎట్టిపరిస్థితిలోగాని సాధ్యమైనంత వరకు. స్థానిక సహాయంతోనే కార్యక్రమం నడిపించాలి; పార్టీ రాజకీయాలు మనలను అంటకుండా చూసుకుంటే మనం అడుగు తడబడకుండా పని సాగించగల్గుతాం. నగరాలలోని ఆంగ్ల విద్యాధికులైన పురుషులూ స్త్రీలూ భారతదేశానికి వెన్నెముకతో సమానమైన గ్రామసీమయెడల ఇంతవరకును అపారంగా అశ్రద్ధచూపిన సంగతి మనం మరవకూడదు. మన అశ్రద్ధను జ్ఞప్తికి తెచ్చుకొనడంవల్ల, మనకు ఓరిమియొక్క అవసరం ఎక్కువ నాటుకుంటుంది. నేనింతవరకు వెళ్ళిన ప్రతిగ్రామంలోను ఎవరో ఒకసదాశయుడైన గ్రామ సేవకుడు నాకంట పడుతూనేవున్నాడు. మనకు మనగ్రామాలలోని మంచిని తెలిసికొనజాలిన వినయభావం లోపించినప్పుడే మనగ్రామాలలో గ్రామసేవకులకు కొరత ఏర్పడుతుంది. మనం స్థానిక రాజకీయాలతో మట్టుకు జోక్యం పెట్టుకొనకూడదు. మనం అన్నిపార్టీలనుంచీ సహాయం తీసుకొనడంగాని, లేదా, ఆయా పరిస్థితినిబట్టి ఏపార్టీనుంచీ

సహాయం తీసికొనకుండా వుండడంగాని అవలంబిస్తే స్థానిక రాజకీయాలలో చిక్కుకొనకుండా వుండగలుగుతాం.

హారిజన్, 2-3-47.

అధ్యాయం ౩౯

యువజనులకు సందేశం

దేశంలోని యువజనులలోనే నాఆశలన్నీ నిల్చి వున్నాయి. వారిలో కొందరు దురభ్యాసాలకు వశులైన వారైనప్పటికి, స్వభావతః వారు దుష్టులుకారు. వారు నిస్సహాయతవల్లను, అనాలోచనవల్లను తప్పుదారికి ఆకర్షింపబడివుంటారు. అట్టి దుష్ప్రవర్తన తమకూ, సంఘానికీ కూడా ఏవిధంగా హానికరమో వారు గ్రహించుకోవాలి. కఠిన నియమబద్ధమైన జీవితమొక్కటే వారినిగాని, దేశమునుగాని పూర్ణవినాశమునుండి రక్షించగలదని వారు బోధపరచుకోవాలి.

యంగిండియా, 9-7-25.

అన్నిటికన్నా ప్రధానంగా వారు దైవసాక్షాత్కారం కలిగించుకొని, తాము ప్రలోభనములలో పడకుండా ఈశ్వర సహాయముకొరకు ప్రార్థిస్తేతప్ప, కేవలం నిర్జీవమైన నిబంధనలవల్ల ఎక్కువ ప్రయోజనం కలగదు. నిదర్శన మవసరం లేకుండానే శిశువు తల్లియొక్క ప్రేమను ఏవిధంగా విశ్వసిస్తాడో, అట్లే దేవుడు మన హృదయపీఠమైన అధివసించివున్నాడని విశ్వసిస్తే దైవసాక్షాత్కారం లభిస్తుంది.

యంగిండియా, 9-7-25.

రేపటి తండ్రులు కావలసిన యువకులు దేశజీవితానికి రుచికలిగించే ఉప్పు వంటివారు. అట్టి ఉప్పే తనరుచిని కోల్పోయినచో ఇక దేనితో దానిని రుచివంతం చేయగలం.

యంగిండియా, 22.12.27.

లోకమంతటా యువకులు ఉద్రిక్త హృదయులుగానే వుంటారు. అందువల్లనే చదువు పూర్తి అయ్యేవరకు, అనగా 25 సంవత్సరములు వయస్సువరకు, నిర్దిష్టమైన పద్ధతిని బుద్ధి పూర్వకమైన బ్రహ్మచర్యదీక్షను అవలంబించడం చాలా అవసరం.

హరిజన్ 6.5-33

నిష్కలుషమైన యౌవనం అమూల్యమైన సంపద దానిని సుఖమనే తప్పుపేరుతో పిలువబడే క్షణికోద్రేకము నకుగాను దుర్వ్యయమొనర్చి వేయరాదు.

హరిజన్, 21-9-35.

మీవిజ్ఞానాన్ని, మీవిద్యనీ, మీపాండిత్యాన్ని ఒక త్రాసు చిప్పలోఉంచి, సత్యాన్ని, నిర్మలతనూ రెండవ చిప్పలోఉంచి తూచిచూచినచో రెండవదే ఎక్కువతూగి మొదటిది తేలిపోతుంది. ఈనాడు మనవిద్యాశాలలకు పోయే బాలురలో నైతిక కాలుష్యమనే దుర్గంధం వ్యాప్తమై, కనిపించని అంటుజాడ్య మట్లువారిని పాడుచేస్తున్నది. అందువల్ల బాలురును బాలికలును అగు మీఅందరినీ మీమనస్సులను మీ దేహములను నిష్కలుషంగా వుంచుకొనవలసినదిగా కోరుతున్నాను. మీపాండిత్యముగాని, మతగ్రంథ పఠనముగాని, అందలి బోధనములను దినజీవితంలో ఆచరణలో పెట్టనియెడల, కేవలం నిష్ప్రయోజనమౌతుంది. ఉపాధ్యా

యులలోకూడా కొందరు నిష్కలుషమూ, పరిశుద్ధమూ అయిన జీవితములను గడపనివారుంటారని నేనెరుగుదును. ప్రపంచంలోవున్న విద్యనంతను వారు తమ విద్యార్థులకు నూరి పోసినను, సత్యమును పారిశుధ్యమును వారిలో పాదుకొల్పనిచో, వారు ఆవిద్యార్థులను మోసపుచ్చిన వారౌతారనిన్నీ, వారిని ఉన్నతికి తీసుకొనిపోవుటకు బదులు నరకమార్గమున కూలద్రోయుదురనిన్నీ అట్టిఉపాధ్యాయులకు నేను చెబుతాను. సత్యశీలములులేని విజ్ఞానము దుష్టత్వమును బలపరచుటకే వినియోగిస్తుంది; అందువల్లనే లోకంలో మనం "తెలివైన దొంగలను", "పెద్దమనుష్యులైన మోసగాండ్రను"కూడా చూస్తూవుంటాం.

యంగిండియా, 21-2-29.

యువకులైన మిమ్ములను నేను గ్రామములకుపోయి, గ్రామప్రజలకు అధికారులూ, ఉద్ధారకులూ అయినట్లుకాక, వారికి మీరు వినమ్రులైన సేవకులట్లుగా భావించుకుని, గ్రామజీవితమునందు మీహృదయములను పూర్ణముగా విలీనమొనర్చుకొనమని కోరుతాను. మీయొక్కదైనందిన జీవిత విధానమునుబట్టీ, ప్రవర్తననుబట్టీ వారు తమ భవితవ్యమును, తమ జీవితములను మార్చుకొనవలసిన మార్గమును తెలిసికొందురుగాక. ఉత్త ఆవేశము ఆవిరివలె నిష్ప్రయోజనమైనది. కాని ఆవిరిని తగినరీతిగా అదుపులోవుంచి ఉపయోగించినయెడల ఏరీతిగా అది బలవత్తరమైన శక్తిగామారునో, అట్లే ఆవేశమునుగూడా నియమబద్ధ మొనర్చినచో అది

బలవత్తరమైన శక్తిగా పరివర్తన పొందుతుంది. భారత దేశపు గాయపడిన ఆత్మకు ఉపశాంతిని చేకూర్చే ఈశ్వర సందేశహారులవలె మీరు ముందంజ వేయవలసినదిగా కోరుతున్నాను.

యంగిండియా, 29-12-27.

చాలామంది బాలబాలికలకు తండ్రిగా - వేలకొలది బాలబాలికలకు తండ్రిగా అనికూడా మీరు చెప్పవచ్చును - బాలురైన మీకు నేనీ సందేశం ఒసగుతున్నాను. వాస్తవంగా మీభవితవ్యం మీచేతులలోనే వుంది. మీరేకనక రెండు షరతులను పాటించేపక్షంలో; మీరు మీపాఠశాలలో చెప్పే చదువులు చదువుకున్నా చదువుకొనకపోయినాగాని నేను లెక్కచేయను. ఒకషరతు - ఎటువంటి పరిస్థితులలో గాని, ఎన్నికష్టములు ఎదురైనాగాని మీరు నిర్భయంగా సత్యవర్తనులుగా వుండాలి. సత్యప్రవర్తనుడైన బాలుడు, ధైర్యశీలుడైన బాలుడు, చిన్న ఈగకైనాసరే బాధ కలిగించవలెనని తలపోయడు. అట్టిబాలుడు తనపాఠశాలలోని బలహీనులైన ఇతర బాలురకు తాను రక్షకుడుగావర్తించి, బడిలోగాని వెలుపలగాని తనయొక్క సహాయం అవసరమైన వారందరికిని తాను సహాయపడతాడు తన మనస్సులోను, దేహంలోను, తానుచేసే పనులలోను వ్యక్తిగతమైన పారిశుధ్యమును అలవరచుకొననటువంటి, బాలుడెవరుగాని పాఠశాలలలో వుండడానికి అర్హుడుకాడు. మర్యాదగల పిల్లవాడు

ఎల్లప్పుడూ తన మనస్సును నిష్కల్మషంగాను, తనకండ్లను నిదానంగాను, తనచేతులను అమలినంగాను వుంచుకుంటాడు. జీవితానికి మూలకందములైన ఈసూత్రములను నేర్చుకొనుటకు మీరు ఏపాఠశాలకుగాని పోనవసరంలేదు. మీప్రవర్తన ఈ శీలత్రయంతోను కూడినదై వున్నయెడల మీభవిష్య జీవితం గట్టిపునాదిపైన నిర్మితమౌతుంది.

సిలోన్‌లో గాంధీజీతో; పే. 109.

మనం గ్రామీణమైన నాగరికతకు వారసులం. మన దేశంయొక్క బ్రహ్మాండమైన వైశాల్యమూ, బ్రహ్మాండమైన జనసంఖ్య, మన దేశపు ఉనికి, శీతోష్ణస్థితి ఇవన్నీ మన దేశాన్ని గ్రామీణ నాగరకతకు నెలవగునట్లు నిర్ణయించి వున్నవని నాఅభిప్రాయం. మననాగరికతలోని లోపములు లోకప్రసిద్ధములేగాని, అవిఏవీ తీరనిలోపములు మాత్రం కావు. మనమిప్పుడు దీనిని సమూలముగా పెకలించి, దాని స్థానే పట్టణ నాగరికతను స్థాపించదలచినయెడల, మన దేశపు ముప్పదికోట్ల జనాభాను ముప్పదిలక్షలకో లేక పోనీ 3 కోట్లకో మనం తగ్గించగల్గితే తప్ప, అది సాధ్యంకానేరదు. అందువల్ల మనం ఈగ్రామీణ నాగరికతా విధానమునే చిరస్థాయి చేసికొనవలసి వున్నదిగా స్థిరీకరించుకుని, అప్పుడు దానిలోని సర్వాంగీకృతమైన లోపములను సరిదిద్దుటకు అవసరమైన సూచనలను చేస్తాను. మన దేశపు యువజనులంతా గ్రామవాసాన్ని స్వీకరించుటకు తీర్మానం చేసుకుంటేనేగాని ఈపని నెరవేరదు. అట్లుచేయదలిస్తే వారు ఇప్పటినుంచీ తమజీవిత

ములను పరివర్తించుకుని, సెలవు దినములు వచ్చినప్పుడల్లా వారు తమ కళాశాలలకు పాఠశాలలకు చుట్టుపట్లవుండే గ్రామాలకు పోయి గడుపుతూవుండాలి. విద్యాభ్యాసం ముగించుకున్న యువకులుగాని, విద్యాభ్యాసం మానుకున్నవారుగాని గ్రామంలోనే తమజీవితాన్ని స్థిరపరచుకొనుటకు నిశ్చయించుకోవాలి.

యంగిండియా, 7-11-29,

కాయకష్ట మొనర్చడమంటే అవమానకరమనే అపోహను తొలగించుకొన గలిగినచో. సామాన్యపు తెలివితేటలు గల యువకులకును, యువతులకును చేయడానికి కావలసినంత పనివుంది.

హరిజన్, 1-3-35.

నిజాయితీగా కాసిని పైసలు సంపాదించుకొన దలచినవానికి ఏపనీ నీచమైనది కాదు. కావలసినదల్లా దేవుడిచ్చిన కాళ్ళూ చేతులూ ఉపయోగించడానికి సంసిద్ధత కలిగివుండడమే.

హరిజన్, 19-12-36.

అధ్యాయం ౪౦

మనదేశపు ఆరోగ్యము, పారిశుధ్యము, ఆహారము.

మానవకోటికి సంక్రమించిన రోగములలో అధిక భాగం ఆరోగ్య సూత్రములను, పారిశుధ్య విధులను అనుసరించకపోవుటవల్లనే పుట్టివున్నమాట నిస్సందేహంగా రుజు

నదైన విషయం. మన దేశంలోని మరణపులెక్క అత్యధికంగా వుండడానికి చాలవరకు మన ప్రజలయొక్క దుర్భర దారిద్ర్యమే కారణం. అయినప్పటికీ, ప్రజానీకానికి ఆరోగ్య పారిశుధ్య విషయమైన పరిజ్ఞానమును తగినరీతిగా బోధపరచుట ద్వారా దానిని తగ్గించవచ్చును.

'Mens Sano in Corpore Sano' అనేది ప్రధాన మైన మానవజీవిత సూత్రం. "ఆరోగ్యవంతమైన శరీరమే ఆరోగ్యవంతమైన మనస్సుకి నిలయం" అన్నమాట స్వయం ప్రకాశితమైన సత్యం. మనస్సుకీ శరీరానికీ అవినాభావమైన సంబంధంవుంది. మన మనస్సులు ఆరోగ్యవంతమైనవిగా వున్నయెడల మనం అన్నివిధములైన హింసాకార్యములను విసర్జిస్తాము. అప్పుడు మనం సహజంగానే ఆరోగ్యవిధులను అనుసరిస్తాం. తద్వారా అప్రయత్నంగానే ఆరోగ్యవంతమైన శరీరములను కలిగివుంటాం.

ఆరోగ్యానికీ, పారిశుధ్యానికీ సంబంధించిన ప్రాథమిక సూత్రాలు చాలా సులభగ్రాహ్యమైనవి. వాటిని ఆచర ణలో పెట్టడం విషయంలోనేవుంది కష్టమంతా. ఈదిగువ కొన్ని సూత్రాలను పొందుపరుస్తున్నాను :

నిర్మలమైన ఆలోచనలనే ఆలోచించు; వ్యర్థమైన తల పులను, కలుషమైన భావాలను మనసులోనికి ప్రవేశించ నీయవద్దు.

రాత్రిగాని, పగలుగాని పరిశుభ్రమైన గాలినే పీల్చు. కాయకష్టానికీ మానసిక శ్రమకీ సమపాళమైన స్థానం స్థిరీకరించుకో.

నిదానంగా నిలబడు, నిదానంగా కూర్చో: నీవుచేసే ప్రతీపని ముచ్చటగా, శుభ్రంగా చేయడం అభ్యసించు. అవి నీ అంతరంగస్థితికి ప్రతిబింబము లగురీతిని ప్రవర్తించు.

తోడి మానవులకు సేవచేయడానికి బ్రతికే నిమిత్తమే తిను. సుఖలాలసత నిమిత్తం బ్రతకకు. అందువల్ల, నీఆహారం మనోదేహములను ఆరోగ్యస్థితిలో వుంచుకొనుటకు తగిన పాటిగా మాత్రమే వుండాలి. మానవుడు ఏవిధమైన ఆహారం తింటే ఆవిధమైన వాడౌతాడు.

నీవుసేవించే నీరు, తిండి, గాలి పరిశుభ్రమైనవిగా వుండాలి. కేవలం వ్యక్తిపారిశుధ్యంతో సంతృప్తిపొందక, నీవు అనుసరింపగోరే పైమూడు పారిశుధ్య సూత్రాలను నీ పరిసరప్రాంతము లంతటనుకూడా పరివ్యాప్త మగునట్లుగా చూడు.

Constructive Programme పే 18-19

కనీసపు ఆహారం:

ఒక్కొక్క భోజనానికి ఒకేఒకరకం ధాన్యం ఉపయోగించాలి. ఒకభోజనంలోనే చపాతీ, అన్నం, పప్పులు, పాలు, నెయ్యి, బెల్లం, నూనె, ఇవికాక ఇంకా కూరగాయలూ, పండ్లుతోసహా, మనమామూలు గృహాలలో కలగా

పులగంగా ఉపయోగిస్తారు. ఇన్నీ కలిసిన భోజనం ఆరోగ్యకరం కాదని నాఅభిప్రాయం. పాలు, పెరుగు, గ్రుడ్లు, లేక మాంసమువల్ల జంతు సంబంధమైన మాంసకృత్తులను పొందే వారు పప్పులను వాడనే అవసరంలేదు. పేదవారికి పప్పుదినుసులద్వారా మాత్రమే మాంసకృత్తులు లభ్యమౌతాయి. ధనవంతులైనవారు పప్పులను, నూనెలను వాడడం మానివేస్తే, జాంతవమైన మాంసకృత్తులుగాని, జాంతవమైన కొవ్వుగాని లభ్యంకాని పేదవారి ఉపయోగానికి అవి విడుదల అవుతాయి. ఇక మనంతినే గింజధాన్యాలు జావగావండి తినకూడదు. ముద్దగావండినది తింటే జావగా వండినదానిలో సగంభాగం మనకు సరిపోతుంది. మన ముఖ్యాహారమునకు అనుపానములుగా పచ్చిస్థితిలోని ఉల్లిగెడ్డ, కేరట్, రేడిష్, ఈదుంపల తాలూకు ఆకులు, టొమాటోలువంటి వాటిని ఉపయోగించడం మంచిది. ఒకఔన్సు లేక రెండు ఔన్సులు పచ్చికూరలు ఎనిమిది ఔన్సుల వండిన కూరలతో సమానమైన ఆహారాన్ని ఇస్తాయి. చపాతీగాని, రొట్టెగాని పాలతో చేర్చి తినకూడదు. మొదటి భోజనం పచ్చికూరలు, చపాతీ లేక రొట్టెతోనూ, రెండవ భోజనం వండినకూరలు, పాలు లేక పెరుగుతోనూ, చేయవచ్చును.

తీపి వంటకములను పూర్తిగా మానడం మంచిది. వాటికి బదులు బెల్లము లేక చక్కెర కొలదిపాలతోగాని, రొట్టెతోగాని, లేక ఉత్తినేగాని తీసికొనవచ్చును.

తాజాపండ్లు తినడం రుచికేగాని, శరీరానికి సౌష్టవం ఇచ్చేందుకుగాను వాటిని స్వల్పంగా తీసుకుంటే చాలు. ఇది ఖరీదైన వస్తువు. వీటిని ధనవంతులు అత్యధికంగా వాడడం మూలంగా, వారికంటె వీటియొక్క అవసరం ఎక్కువగావున్న పేదవారికిని, రోగులకును అవి దొరకకుండా పోతున్నాయి.

యోగ్యాహార విషయికమైన శాస్త్రం తెలిసిన ఏ వైద్యుడుగాని నేను సూచించినరీతి ఆహారం దేహారోగ్యము నకు ఏమీ హానికలిగించదనిన్నీ, పైగా ఆరోగ్యమును చాలా బాగుపరచ గలదనిన్నీ ధృవపరచగలడు.

హరిజన్, 25-1-45.

మనిషికి ఉత్తమాహారమును ఒసగుటలో కూరమొక్క లకుగల అపారశక్తిని గురించి ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా పరిశీలనచేసి తెలిసికొనివుండలేదు. అందువల్ల ఆశాస్త్రం, పూర్వపుఅభ్యాసం ప్రకారం, తనవిశ్వాసాన్ని కసాయిశాలల లోను, లేక పాలు, పాలసంబంధమైన ఇతర ద్రవ్యాలలోను మాత్రమే కేంద్రీకరించివున్నది. భారతీయ వైద్యశాస్త్రజ్ఞులు కాయగూరలతోకూడిన ఆహార సంప్రదాయమునకు చెందిన వారగుటచేత ఈవిధిని నిర్వర్తించవలసిన బాధ్యత వారిపై వున్నది. విటమిన్లను గురించి అతివేగంగా జరుగుతూవున్న పరిశీలనలవల్లను, ముఖ్యంగా ప్రధానమైన విటమిన్ద్రవ్యాలు సూర్యకాంతినుంచి లభ్యమౌతాయనే సిద్ధాంతంవల్లను

ఇంతవరకు చలామణిలోవున్న పూర్వ వైద్య శాస్త్రాభిప్రాయములలో గొప్పమార్పు రానున్నదని స్పష్టపడుతూవున్నది.

యంగిండియా, 18-7-29.

పర్వత ప్రమాణమైన కష్టముల నడిమిని దారిచేసికొని ప్రాణములకైనా తెగించి సత్యమును తెలిసికొనుటకే ప్రయత్నించడమనే కార్యమును ఉత్సాహపరులైన సామాన్య మనుష్యులే నెరవేర్చవలసివున్నట్లు తోస్తుంది. అట్టి వినమ్రములైన అన్వేషణా పరులకు శాస్త్రజ్ఞులు తమ సహకారం ఒసగితే చాలు, నేను సంతోషిస్తాను.

యంగిండియా, 15-8-29.

మనిషికి నిజంగా మందులు తీసికొనవలసిన అవసరం లేదని నానమ్మకం. వెయ్యికి 999 మంది రోగులవిషయంలో సక్రమమైన ఆహార నియమములవల్లను, నీరూ మట్టితో చేసే చికిత్సా పద్ధతివల్లను, అటువంటివే ఇతరములైన గృహవైద్యములవల్లను పునరారోగ్యం కలిగించవచ్చును.

ఆత్మకథ పే 270 (ఆంగ్లంలో)

మన దేహాన్ని మనం దేవుని ఆలయంగా కాక ఇంద్రియ లాలసలకు వాహనంగా ఉపయోగించి, ఆలాలసలను అధికం చేసికొని, ఈభౌతికమైన ఈశ్వరాలయమును దుర్వినియోగ మొనర్చు నిమిత్తమై వైద్యసహాయమునకు పరుగెత్తుటకు సిగ్గుచెందము.

యంగిండియా, 8-8-29.

మనిషి ఎటువంటి తిండితింటే అటువంటివాడౌతాడని చెప్పే నానుడిలో చాలా సత్యముంది. మనంతినే ఆహారం ఎంతమొరటైనది అయితే మనదేహమున్నూ అంతమొరటుగా అవుతుంది.

హరిజన్, 5-8-32.

ఆధ్యాత్మికమైన ఉన్నత పరిణతిక్రమంలో, ఏదోఒక స్థాయిని, మనశరీరావసరముల నిమిత్తం మనతోడి జీవరాశిని చంపడమనే కార్యమును విసర్జించడం అవసరమవుతుందని నేననుకుంటాను. నాశాకాహార విషయకమైన పిచ్చిని గురించి చెప్పే సందర్భంలో గోల్డుస్మిత్ కవీశ్వరుని ఈక్రింది అందమైన పద్యపాదములు నాకు స్ఫురణకు వస్తున్నాయి :

వచ్చికబయలున హాయిగ మసలెడి
ముచ్చటైన గొఱ్ఱెల మందన్
కసాయి కత్తికి బలిచేయగ నా
కసలొప్పదు మన సెన్నటికిన్;

ఇలనను కారుణ్యమ్మున గను పర
మేశ్వరు డొసగిన జ్ఞానమునన్
నేర్చితినే జీవుల నెల్లను దయ
జూడగవలెనను పాఠమ్మున్.

ఇండియాస్ కేస్ ఫర్ స్వరాజ్, పే. 402.

మామూలుగా మనుష్యులు జీవించుటకు అనుకూలమైన ఏభూప్రదేశమునగాని, ఎన్నడుగాని మనకు మాంసాహారమును భుజించుట తప్పనిసరిగా అవసరమని నేను భావించను.

మాంసాహారం మానవజాతికే అనుగుణమైనది కాదని నా సిద్ధాంతం. మనం తక్కువ తరగతి జీవులకంటె ఎక్కువ పరిణతిపొందిన వారమని తలిస్తే వాటిని మనం అనుకరించడం పొరపాటని అంగీకరించక తప్పదు. ఉద్రేకములను నిరోధించుకొనదలచినవారికి జాంతవమైన ఆహారం పనికి రాదని అనుభవజ్ఞానం తెలుపుతుంది.

అయినప్పటికిని, శీలనిర్మాణ విషయమునగాని, ఇంద్రియనిగ్రహ విషయమునగాని ఆహార నియమమునను అతిశయ ప్రాధాన్యము నొసగుట పొరపాటవుతుంది. యోగ్యాహారమనేది శ్రద్ధచూపవలసిన బలవత్తరమైన అంశమే. కేవలం రసనా సంతృప్తికోసం ఆహారనియమాలన్నిటినీ విసర్జించడం ఎంతతప్పో, భారతదేశంలో అలవాటైవున్న రీతిగా మతమంతా ఆహారనియమాలలోనే వున్నదని భావించడంకూడా అంతేతప్పు. శాకాహారమనేది హిందూమతం లోకమునకొసగిన అమూల్యమైన కానుకలలో ఒకటి. అది సులభంగా విసర్జించవలసిన విషయంకాదు. అందువల్ల శాకాహారం మనలను మనోదేహములందు దుర్బల మొనర్చినదనిగాని, కార్యోత్సాహమునూ, కార్యశూరతనూ పోగొట్టి నిర్వీర్య మొనర్చినదనిగాని వాదించే పొరపాటు అభిప్రాయాన్ని తొలగించుకోవాలి. హిందూమత సంస్కర్తలలో ప్రాధాన్యత గడించిన వారందరూ వారికాలంలోని మనజులందరిలోనికిని కార్యశూరతను ప్రదర్శించివున్న వ్యక్తులే; అయినా

వారంతా శాకాహారులే. శంకరాచార్యుడు, దయానందుడు కంటె వారికాలంలో ఎక్కువ కార్యశూరతను ప్రదర్శించిన వారి నింకెవరినైనా చూపగలరా ?

యంగిండియా. 7-10-26.

ఉపవాసం ఎప్పుడు చేయ్యాలి ?

నానిండైన అనుభవాన్నిబట్టీ, వక్రబుద్ధులైన (cranks) నాఅనుచరవర్గంయొక్క అనుభవాన్నిబట్టీ ఈక్రింది సందర్భాలలో తప్పక ఉపవాసం చేయుమని నిస్సందేహంగా చెబుతాను :

(1) మలబద్ధంగా వున్నప్పుడు, (2) రక్తహీనంగా వున్నప్పుడు, (3) పులకరంగా వున్నప్పుడు, (4) అజీర్తిగా వున్నప్పుడు, (5) తలనొప్పిగా వున్నప్పుడు, (6) కీళ్ళనొప్పులుగావున్నప్పుడు, (7) ఒళ్ళు ఉబ్బుచూపినప్పుడు, (8) చిరాకుగాను, కోపంగాను వున్నప్పుడు, (9) మనస్సు దిగులుగా వున్నప్పుడు, (10) సంతోషాతిశయంగా వున్నప్పుడు, ఉపవసిస్తే ఇకవైద్యుల ఔషధ పత్రాలతోగాని, బజారుమందులతోగాని పనివుండదు.

యంగిండియా, 17-12-25.

జాతీయాహారం !

మనం మనప్రాంతపు భోజనమునేకాక తదితర ప్రాంతాలవారియొక్క భోజన పద్ధతినికూడా అలవరచుకొన గలిగి వుండాలని నానమ్మకం. ఇది పైకికనిపించేటంత సులభమైన

విషయంకాదని నేనెరుగుదును. గుజరాతీ భోజనానికి అల వాటు చేసికొనుటకు ప్రయత్నించి విఫలమైన కొందరు దాక్షిణాత్యులను నేనెరుగుదును. గుజరాతీవారు దక్షిణాత్యుల వంటకములకు అలవాటు పడలేదు. వంగదేశీయులు రుచ్య ములుగా భావించినవాటిని ఇతరప్రాంతీయులు ఇష్టపడరు. మనం ప్రాంతీయులం మాత్రమేకాక జాతీయులంకూడా కావలెనంటే భోజన విషయంలో ఒకరి అభ్యాసములను ఇంకొ కరం అలవాటు చేసికొనవలసివుంటుంది. మన అభిరుచులను తగ్గించుకుని, అందరూ ఇష్టపూర్తిగా తినగలిగే ఆరోగ్యకర మైన వంటకములను చేసికొనడం అభ్యసించవలసివుంటుంది. ఈపని చేయవలెనంటే, వివిధ ప్రాంతములలోని వివిధ వర్ణ ములవారు, వివిధ తరగతులవారు తినే భోజన విధానముల నన్నిటినిగురించీ జాగ్రత్తగా పరిశీలన చేయవలసివుంటుంది. అది అదృష్టమైనా, దురదృష్టమైనాగాని, మనదేశంలో వివిధ రాష్ట్రముల భోజన విధానములమధ్య తేడాలు వుండ డమేకాక, ఒకరాష్ట్రంలోనే వివిధ వర్గాలలో వివిధములైన వంటకపు పద్ధతులు వుండడం కూడా కనిపిస్తుంది. అందువల్ల జాతీయసేవకులు వివిధ ప్రాంతములలోను అమలులోవున్న భోజన విధానములను, వంటకపు పద్ధతులను తెలిసికొని, వాటిలో అందరికీ ఇష్టంగావుండేవీ, సులభంగానూ చౌక గానూ చేయుటకు వీలైనవీ, జీర్ణకోశాన్ని పాడుచేయనివీ అయిన కొన్ని వంటకములను కనిపెట్టవలసి వుంటుంది. ఎలై నాగాని, దేశసేవకులు వివిధ ప్రాంతములలోను, వివిధ సంఘ

ములలోను ద్యోతకమగు ఆచారవ్యవహారాలను, మర్యాద లను తెలిసికొనక పోవుట లజ్జాకరమైన విషయం. ... ... మనం చేయగలిగినదీ, చేయవలసినదీ సామాన్య ప్రజలకు పనికివచ్చే సామాన్యపు వంటకములను కనుపెట్టడ మనేదే. మనం కొంచెం శ్రద్ధచూపితే ఇది కష్టమైనపని కాదనుకుం టాను. అయితే ఇది సాధ్యంకావడానికి మన స్వచ్ఛంద సేవకులు పచనకళనుకూడా కొంచెం అభ్యసించవలసి వుంటుంది. అంతేకాక, ఇందునిమిత్తమై వారు వివిధములైన భోజన పదార్థములయొక్క గుణములనుకూడా తెలిసికొని, సులభంగానూ చౌకగానూ చేసికొనదగిన వంటకములను కని పెట్టవలసివుంటుంది.

హరిజన్, 5-1-34.

కుష్ఠువ్యాధి :

కుష్ఠురోగి అనుమాటే మనకి అసహ్య మనిపిస్తుంది. మధ్యఆఫ్రికా తర్వాత మనభారతదేశమే కుష్ఠురోగులకు ప్రధాన నిలయము. కాని మనలోకల్లా ఉన్నతులైనవారికి సంఘంలో ఎంతస్థానమున్నదో ఆకుష్ఠురోగులకుకూడా అంతే స్థానమున్నది. అయితే ఔన్నత్యం గలవారియెడల, వారికి ఏమాత్రం అవసరం లేకపోయినా, మనం అత్యంతమైన శ్రద్ధాభావం చూపిస్తాం. శ్రద్ధాభావంయొక్క అత్యంతావస గంలోవున్న కుష్ఠురోగుల దురదృష్టస్థితిని గురించి మనం ఆలోచించనైనా ఆలోచించం. నిజంగా హృదయహీ

త్యాన్ని తెలిపే ఈప్రవర్తనను అహింసాసూత్ర దృష్ట్యా కఠోరత అని పిలువవచ్చునని నాకనిపిస్తుంది. ఈవిషయంలో చాలావరకు శ్రద్ధవహిస్తూవున్నది క్రైస్తవమత ప్రచారకులే అని చెప్పవలసివుంటుంది. ఇది వారిపక్షమున చాలా అభివందనీయమైన విషయం. కుష్ఠురోగుల నినిమిత్తం కేవలం ప్రేమ పూర్వకమగు సేవాభావంతో ఒకభారతీయునిచే నడుపబడుతూవున్న ఏకైకసంస్థ ఒకటి వార్ధా సమీపంలో వున్నది. అది శ్రీ వినోబాభావేయొక్క ప్రోత్సాహంక్రిందను, ఆయన ఆదేశానుసారంగాను శ్రీ మనోహర్ దేశాయ్‌చే నడుపబడుతూవున్నది. భారతదేశం నూతనోజ్జీవనం పొందిన పిమ్మట అక్కడ ఒక్కకుష్ఠురోగిగాని, ఒక్కముష్టివాడుగాని అశ్రద్ధపాలై నిస్సహాయుడుగా వుండడు. మనచుట్టూవున్న ప్రపంచాన్ని మనంకొంచెం గమనించి చూచినచో, భారతదేశంలో కుష్ఠురోగి ఏవిధంగా చూడబడుతున్నాడో ఆధునిక నాగరిక లోకపుదృష్టిలో భారతీయులమైన మనమందరమూ ఆవిధంగా చూడబడుతున్నామని తెలుసుకుంటాం. సముద్రముల కావల విదేశాలలో వసించే మనభారతీయ సోదరుల పరిస్థితిని మీరుకొంచెం పరిశీలించినచో, నేనన్న మాటలోని సత్యం మీకు బాగానాటుతుంది.

ఢిల్లీడైరీ, పే. 108.

ఈకుష్ఠువ్యాధి ఒక్కటేమాత్రమేకాక ఇంకాచిడుమూ, కలరా, ప్లేగువ్యాధి, తుదకు మామూలు పడిసెభారం మొదలైన అంటువ్యాధులు ఇంకా చాలావున్నాయి. బహుశా

వీటన్నిటికంటె కుష్ఠువ్యాధినే తక్కువరకం అంటువ్యాధిగా పరిగణించవచ్చునేమో అనుకుంటాను. ఇతరములైన అంటువ్యాధులకంటె ఒక్కకుష్ఠువ్యాధి అంటేనే ఎందుకు హేయభావంతో చూడాలి? అసలు కుష్ఠురోగం అపరిశుద్ధములైన మనస్సులనే అంటబెట్టుకుని వుంటుంది. తోడిమానవులను హేయంగా చూడడమూ, ఒకసంఘానికిగాని ఒకవర్గానికిగాని చెందిన మనుజులను దూరంచేయడమూ అనేగుణాలు రుజాగ్రస్త మనస్కతకు చిహ్నాలు; అట్టి మానసికమైన రోగము దైహికమైన కుష్ఠువ్యాధికంటె చాలాచెడ్డది. అట్టి వ్యక్తులే నిజంగా సంఘదృష్టినుంచి కుష్ఠురోగులు - పేరువల్ల అందమూ, అసహ్యమూ ఏర్పడతాయని నేననమ్మను. గులాబిపుష్పాన్ని మరొక పేరుపెట్టి పిలిచినా దాని పరిమళం ఎప్పటిలాగే వుంటుంది.

ఢిల్లీడైరీ, పే. 111.

అధ్యాయం ౬౧

మద్యము - మత్తుపదార్థాలు

మద్యమును రాక్షససృష్టి అని అంటూవుంటారు. ఇస్లాంమతంలో సైతాను స్త్రీ పురుషులకు ప్రలోభనము గొల్పు నిమిత్తం "రక్తిమ ద్రావక్" ఒకదానిని వారికళ్ళముందర చూపేవాడని అభివర్ణిత మయింది. మద్యపానం మనుష్యుల డబ్బునేకాక, హేతుశక్తినికూడా నష్టపరచిన ఉదాహరణలు నేను చాలాచూచివున్నాను. త్రాగినవానికి

భార్యా తల్లీభేదం, యుక్తాయుక్త జ్ఞానం నశిస్తాయి. తప్ప త్రాగి తూముకాలువలలో వొళ్ళు తెలియక దొర్లుతూవున్న బ్యారిస్టర్లను పోలీసులు తీసికొనిపోయి వారియిళ్ళదగ్గర వప్ప గించిన సందర్భాలు నేనెరుగుదును. ఓడలోని అధికారో ద్యోగులు తమ ఉద్యోగధర్మాలను ఏమాత్రం నిర్వహించ లేనంత వొళ్ళుతెలియని స్థితిలో తప్పత్రాగి పడివుండడం నేను రెండుపర్యాయములు చూశాను. మాంసాహారం విష యంలోనూ, త్రాగుడు విషయంలోనూ ఒకటే తిరుగులేని సూత్రం : "మనం బ్రతకడం తిని, త్రాగి, ఖులాసాగా అనుభవించడానికి కాదు; తినడమూ, త్రాగడమూ మన శరీరాలను దేవునికి అర్హమైన ఆలయములుగాచేసే నిమిత్త మున్నూ, వాటిని మానవసేవకు వినియోగించే నిమిత్త మున్నూ మాత్రమే". అప్పుడప్పుడు మద్యం వైద్యంకోసం అవసరం కావచ్చును. ప్రాణం పోయినట్లుకనిపించిన ఒకొ్కక సందర్భంలో మద్యం ఒసగడంద్వారా మరికొంతసేపు ప్రాణం నిలపగలగవచ్చునని అంటారు. మద్యానికి అను కూలంగా అంతకుమించి చెప్పదగిన దేమీలేదు.

ఇండియాస్ కేస్ ఫర్ స్వరాజ్, పే. 403.

భారతదేశాన్ని నిషాలేనిదిగా చేయడానికి బలా త్కారం పనికిరాదనీ, మద్యపానం చేయగోరేవారికి తగిన సౌకర్యాలు కలిగించవలెననీ చేసే విపరీత వాదనకు మోస పోరాదు. ప్రజల దురభ్యాసాలకు సౌకర్యాలు కలిగించడం

ప్రభుత్వం పనికాదు. భోగగృహాలను తగినరీతిగా నడపడానికి గాని, అనుమతించడానికిగాని మనప్రభుత్వం ఎన్నడూ పూను కోదు. దొంగలు తమ దొంగతనాలను చక్కగా నెరవేర్చ డానికి మనం సౌకర్యాలు కలిగించడ మనేది ఎక్కడాలేదు. దొంగతనంకంటెను, బహుశా వ్యభిచారంకంటెనుకూడా మద్యపానం ఎక్కువ చెడ్డదని నాఅభిప్రాయం. సాధార ణంగా పైరెండిటికిని మద్యపానం మూలహేతువు కావడం కూడా అందరికీ తెలిసిన విషయమే.

యంగిండియా, 8-6-21.

త్రాగుడును దురభ్యాస మనుటకంటె, దానినొక జబ్బుగా భావించడం ఎక్కువ యుక్తంగా వుంటుందని తోస్తుంది. త్రాగుడు మానవలెనని నిజంగా కోరికవున్నా గాని మానడం చేతకానివారిని అనేకులను నేనెరుగుదును. ఎలాగైనా తాము త్రాగుడు మానగల్గునట్లు చేయమనికోరిన వారినికూడా కొందరిని నేనెరుగుదును. వారికోరిక మీదనే వారికి మద్యం దొరకకుండా భద్రపరిస్తే, దానిని వారు దొంగతనంగా తీసుకుని త్రాగినసందర్భాలుకూడా నేనెరుగు దును. ఈహేతువులనుబట్టి, అట్టిప్రలోభనమును బలవంతంగా తొలగించడంలో తప్పేమీ లేదనుకుంటాను. జబ్బుగనున్నమనుష్యు లకు వారికోరికలను లెక్కచేయకుండా మనం సహాయపడ వలసివుంటుంది.

యంగిండియా, 12-1-28.

నేను కార్మికులతో సమానభావమును అలవరచుకొని వుండుటచే, త్రాగుడు అభ్యాసంలోపడిన కార్మికులయొక్క కుటుంబాలకు అందువల్ల ఎంతనష్టం వాటిల్లుతున్నదీ ఎరుగుదును. వారికి అది సులభంగా అందుబాటులో లేకుండావున్న పక్షంలో వారు మద్యాన్ని ముట్టుకుంటారని నేననుకోను. ప్రస్తుతంలో చాలా సందర్భాలలో త్రాగుడుకు అలవాటు పడినవారే మద్యనిషేధం అమలుకావలసినదిగా కోరుతూ వుండడం మనం చూస్తూనేవున్నాము.

హారిజన్, 3-6-38.

మద్యపానం మనిషియొక్క ఆత్మనుచంపి, ఆతడిని పశువుతో సమానంగాచేసి, భార్యా తల్లీ తోబుట్టువూ అనే భేదాలను తెలియనిస్థితికి తెస్తుంది. త్రాగి వొళ్ళెరుగనిస్థితిలో ఈభేదాలను తెలియకుండా వర్తించేవారిని నేనుచూచాను.

హారిజన్, 9-3-34.

త్రాగుడువల్ల ఇతర మత్తుపదార్థాలవల్ల కలిగే నష్టం మలేరియావంటి వ్యాధులవలన కలిగేదానికంటెకూడా ఎక్కువైనదనీ మలేరియావంటి జబ్బులు కేవలం శరీరానికి మాత్రమే హానికలిగిస్తే, మత్తుపదార్థాలు శరీరాన్నీ ఆత్మనీ కూడా నాశనం చేస్తాయి.

యంగిండియా, 3-3-27.

మన సంఘమధ్యంలో వేలాదిజనులు త్రాగుబోతులై పోవడంకంటె మన భారతదేశం దారిద్ర్యంలో మునిగి

పోయినా నేను విచారించను. మద్యనిషేధం అమలుపరచి నందుకు ప్రత్యామ్నాయంగా భారతదేశంలో విద్యాశాఖను వదలుకొనవలసి వచ్చినా నేను విచారించను.

యంగిండియా, 15-9-27.

త్రాగుడు అభ్యాసానికి వశమైన జాతికి వినాశం మొగంమీద వ్రాసిపెట్టి వుంటుంది. ఈ దురభ్యాసం మూలంగా మహాసామ్రాజ్యాలు రూపం నశించిన ఉదాహరణలు చరిత్రలో కనిపిస్తాయి. శ్రీకృష్ణుడు జన్మించుటవలన విఖ్యాతమైన యాదవవంశము ఈఅభ్యాసం మూలంగా నాశ మొందిన విషయం మనదేశంలో అందరికీ తెలిసినదే. రోమనుసామ్రాజ్య పతనానికికూడా ముఖ్యహేతువులలో ఈ భయంకరమైన దురభ్యాసం ఒకటని నిస్సందేహంగా చెప్ప వచ్చును.

యంగిండియా, 4-4-29.

ఒకగంటసేపు నన్నేకనక భారతదేశానికి నియంతగా నియమించినట్లయితే, నష్టపరిహార మేమీ యివ్వనవసరం లేకుండా త్రాగుడు దుకాణాలన్నీ మూసివేయడం, ఫ్యాక్టరీ యజమానులు తప్పనిసరిగా తమకింత పనిచేసే కార్మికులకు యోగ్యమైన సౌకర్యములు కలిగించునట్లు చేయడం, ఆ కార్మికులకు నిరపాయమైన పానీయములను, హానికలిగించని వినోదములను సరఫరాచేయుటకు అనువైన అల్పాహార శాలలు, క్రీడాగృహాలు తెరిపించడం అనేపనులు మొట్ట మొదట జరిపిస్తాను.

యంగిండియా, 25-6-31.

తాటికల్లు :

పరిమితంగానూ, క్రమబద్ధంగానూ మద్యపానం చేయ వచ్చుననీ, అందువల్ల కొన్నిలాభము లున్నవనీ నమ్మే కూటానికి చెందినవారు కొందరున్నారు. నాకు వారి వాద నలో బలమేమీ కనిపించలేదు. కొంచెంసేపు వారివాదన అంగీకరించి చూచినా, అసంఖ్యాకమైన మనుష్య సంఘ మంతను క్రమబద్ధమైన అభ్యాసంలో నిలపడం అసాధ్య మన్న విషయం మనకళ్ళ ముందర కనిపిస్తుంది. పరిమితికి లొంగశక్యముకాని ఆ అత్యధిక సంఖ్యాకుల నిమిత్తమైనా మద్యపానీయములను నిషేధించడం మన విధ్యుక్తధర్మం అవుతుంది.

పార్సీమతస్థులు తాటి మద్యమును (టాడీ) Tadi వాడుటలో తప్పులేదని చాలా బలంగా వాదిస్తున్నారు. తాటిమద్యం మత్తుపదార్థమే అయినప్పటికి అందులో ఆహా రపు విలువకూడా వున్నదనీ, అది ఇతర ఆహారములను అరి గించుటకు సహకరిస్తుందనీ వారంటారు. వారి యీవాదనను నేను చాలా జాగ్రత్తగా పరిశీలించడమేగాక, ఈవిషయమై తగినంత గ్రంథపరిశీలనంకూడా చేసివున్నాను. కాని తాటి మద్యం మూలకంగా పేదవారు ఎన్ని బాధలకు పాలౌతూ వున్నదీ నేను కళ్ళారా చూచివుండుటచే, దానికి మనిషి యొక్క ఆహారంలో తావొసగుటకు వీలులేదనే నిర్ణయానికి వచ్చివున్నాను.

తాటిమద్యానికి ఆపాదించబడిన లాభాలన్నీ ఇతరము లైన ఆహారపదార్థముల ద్వారా లభ్యంకాగలవు. ఈమద్యం (Tadi) ఖజూరీ (ఖర్జూర ? - ఈత ?) రసంనుంచి చేయబడు తుంది. అప్పుడే దింపిన ఖజూరీరసం మత్తు కలిగించదు. అది హిందూస్తానీలో 'నీరా' అనబడుతుంది. ఈ 'నీరా'ను త్రాగు టద్వారా చాలామందికి మలబద్ధం నయమౌతూవుండడం కద్దు. అది నేనుకూడా తీసుకుని చూచాను. నాసందర్భంలో అది విరోచనకారిగా ఉపకరించకపోయినా, ఆహారపు విలువ విషయంలో అది చెరుకురసంతో సమానమైనదని తోచింది. ఎవరుగాని ఉదయమే తేనీరు వగైరాలకు బదులుగా ఒక గ్లాసు 'నీరా' త్రాగితే, ఇక ఆప్రొద్దుట వారేమీ ఇతర ఉపాహారం తీసికొననక్కరలేదు.

చెరుకురసంవలెనే తాటిరసాన్నికూడా కాచి తాటి బెల్లం తయారుచేయవచ్చును. ఖజూరీఅనేదీ తాటిజాతికి చెందినదే. తాటిజాతికిచెందిన అనేకరకాల చెట్లు మన దేశంలో వాటంతటఅవే పెరిగి వ్యాప్తమైవున్నాయి. అవన్నీ కూడా త్రాగుటకు వీలైన రసాన్ని ఇస్తాయి. 'నీరా' చాలా త్వరగా పులుస్తుంది కనక, దానిని వెంటనే ఎక్కడదింపితే అక్కడ ఉన్నపట్టున ఉపయోగించివేయాలి. ఈవరకు బహు పరిమితంగా తప్ప ఆచరణలో పెట్టడం కష్టసాధ్యం కనక, నీరాని బెల్లంగా తయారుచేయడమే ఎక్కువ ప్రయోజన కరమైనపని. చెరుకు బెల్లమునకు బదులుగా తాటి బెల్లమును

సౌలభ్యంతో వాడవచ్చును. నిజానికి కొందరు దానిని చెరుకు బెల్లంకంటెకూడా శ్రేష్ఠమైనదిగా భావిస్తారు. చెరుకుబెల్లం కంటె తాటిబెల్లంలోని ఒకసుగుణం ఏమిటంటే, అది తక్కువ తీపి కావడంవల్ల ఎక్కువ తినడానికి వీలుగావుం టుంది. ఇప్పుడు తాటిమద్యం చేయడానికి ఉపయోగిస్తూ వున్న తాటిచెట్లన్నిటినీ బెల్లం చేయడానికే కనక వినియో గించినయెడల, భారతదేశంలో బెల్లపుకొరత ఎన్నడూ ఏర్ప డదు. పేదవారికి బహుస్వల్పమైన వెలకు శ్రేష్ఠమైన బెల్లం లభ్యమౌతుంది.

తాటిబెల్లమును పటికి బెల్లంగానూ, తెల్ల చక్కెర గానూ కూడా మార్చవచ్చును. కాని తెల్లచక్కెరకంటె బెల్లమే ఎక్కువ ఉపయోగకరం. తెలుపు చేయడంవల్ల బెల్లంలోవుండే క్షారద్రవ్యాలు వృథా అయిపోతాయి. మర గోధుమపిండీ, మెరుగుపెట్టిన బియ్యమూ పైపొర పోవడం వల్ల ఏరీతిగా కొంతఆహారపు విలువను కోలుపోతాయో, అట్లే సన్నచక్కెరకూడా బెల్లంలోవుండే కొంత ఆహారపు విలువను కోలుపోతుంది. వీలైనంతవరకు సహజస్థితికి చేరికగా వుండే ఆహారపదార్థాలలోనే ఎక్కువ బలం వుంటుందని సామాన్య సూత్రంగా చెప్పుకొనవచ్చును.

కీటు హెల్తు, పే. 32 - 4.

పొగత్రాగుడు :

మద్యపానీయములవలెనే నాకు పొగత్రాగడ మంటే కూడా చాలాఅసహ్యం. పొగత్రాగడం నిస్సందేహంగా

దురభ్యాసములలో లెక్కించవలసినదే అని నాఅభిప్రాయం. అది మనవివేకబుద్ధిని మందంచేస్తుంది. తెలియకుండా పని చేయడంవల్ల, ఇది మద్యంకంటె చెడ్డదనికూడా చెప్ప వచ్చును. దానికి ఒకసారి వశమైన మనిషి తిరిగి తప్పించు కొనడం చాలా కష్టసాధ్యమైన పని. ఇది అధికవ్యయంతో కూడిన దురభ్యాసం. ఇది మననోటికి దుర్వాసన కలిగిస్తుంది. పండ్లను గారపట్టిస్తుంది. ఒక్కొకపుడు కేన్సరువ్యాధినికూడా కలిగించవచ్చును. ఇది అపరిశుభ్రమైన అభ్యాసం.

యంగిండియా; 12-1-21.

పొగత్రాగుటవలన కలిగే నష్టమును దానికి వశమైన వాడు సకాలంలో తెలిసికొనలేడు. అందువల్ల ఇది ఒక విధంగా త్రాగుడుకంటె ఎక్కువ హానికరం. దీనిని అనాగ రకమైన అభ్యాసంగా భావించకపోవడమేకాక, ఇది సభ్యతకు చిహ్నంగాకూడా భావింపబడుతూవుంది. దీనిని మానగల శక్తివున్నవారు ఈఅభ్యాసాన్ని మాని ఇతరులకు మార్గదర్శ కులు కావలసినదని మాత్రమే నేను చెప్పగలిగినది.

యంగిండియా, 4-2-26.

పొగాకు మానవజాతికి అపారమైన హాని కలిగించింది. ఒకసారి దానివలలో చిక్కిన వారెవరుగాని తిరిగి బయట పడడం చాలాఅరుదు. ... టాల్‌స్టాయి ఇది మత్తుపదార్థము లన్నిటిలోకీ చెడ్డదని చెప్పాడు.

భారతదేశంలో పొగాకు పొగత్రాగుటకును, పొడుం పీల్చుటకును, నములుటకునుకూడా ఉపయోగింపబడుతూ

వుంది ... ఆరోగ్య ప్రియులెవరుగాని (లేక ఆరోగ్యాన్వేషకులుగాని) ఈ అభ్యాసములలో దేనికిగాని అలవడివున్న పక్షంలో, ఆ బానిసత్వం నుండి వెంటనే పట్టుదలతో తప్పించుకోవలసినదిగా కోరుతాను. చాలామంది ఇందులో ఒక్క అభ్యాసమునకుగాని, రెండింటికిగాని, లేదా మూడు అభ్యాసములకుకూడాగాని అలవడివుంటారు. వారికి అవి అసహ్యకరమైన అభ్యాసములుగా తోచవు. మనం కొంచెం తాపీగా ఆలోచించి చూచినయెడల, మాటిమాటికీ పొగ ఊదడంలోగాని, తంబాకు తాంబూలమును సుమారు రోజల్లా నోటినిండుగా వుంచుకుని నములుతూ ఊస్తూవుండడం కాని, క్షణాని కొకసారి పొడుండబ్బీ తెరుస్తూ పొడుంపీలుస్తూ వుండడంలో గాని అందమేమీ లేదని స్పష్టపడుతుంది. ఇవిమూడూకూడా పరమ అసహ్యకరమైన అభ్యాసాలు

కీ టు హెల్తు. పే. 39-42.

అధ్యాయం ౪౨

నగర పారిశుధ్యము

మనం పాశ్చాత్య దేశాలనుంచి నేర్చుకొనగలిగినదీ, తప్పకుండా నేర్చుకొనవలసినదీ అయిన ముఖ్యవిషయం నగరపారిశుధ్య విధానం. పశ్చిమదేశాలవారు సాముదాయిక పారిశుధ్య, ఆరోగ్య విషయములకు సాంగోపాంగమైన శాస్త్రములుగా రూపొందించివున్నారు. మనం దానినుంచి

చేసుకొనవలసినది చాలావున్నది. అయితే పాశ్చాత్య పారిశుధ్య పద్ధతులను మనఅవసరములకు అనుగుణంగా మార్పు చేసికొనవలసివుంటుంది.

యంగిండియా. 26-12-24.

"భక్తి తర్వాత ప్రధానమైనది పారిశుధ్యమే" మన మనస్సు కళంకితమైనయెడల దేవునిదయను ఏవిధంగా పొందలేమో అల్లే మన దేహము కళంకితమైతేకూడా పొందలేము. అపరిశుభ్రమైన నగరంలో పరిశుభ్రతగల శరీరం నివసించలేదు.

యంగిండియా, 19-11-25,

ఏ నగరపాలకసంఘుంగాని కేవలం పన్నులు విధించుట ద్వారాను జీతానికి పనిచేసే ఉద్యోగులద్వారాను అపరిశుభ్రత, ఇరకాటము అనే సమస్యలను సాధింపజాలదు. ధనికులూ పేదలూ అనే భేదంలేకుండా, పౌరప్రజానీకమందరియొక్కయు సంపూర్ణమైన ఇష్టపూర్వక సహకారం వుంటేతప్ప, ఈముఖ్యమైన సంస్కరణలు నెరవేరజాలవు.

యంగిండియా. 26-11-25.

మన మాలమాదిగలు నివసించే పల్లెలను పరిశుభ్రపరచడంతో మనపని పూర్తికాదు. పల్లెవాసులు మంచీ చెడ్డా చెబితే వింటారు. నగరాలలో నివసించే ఉన్నత తరగతులకు చెందిన పౌరులుఆరోగ్యవిధులను పారిశుధ్యనియమాలను పాటించడంలో అంతపాటి మంచిచెడ్డలను వినరను

కొనవలసిందేనా ? విశాలమైన గ్రామపరిసరంలో మనం నిర్భయంగా కొన్నిపనులు చేయవచ్చును. కాని పీల్చడానికి గాలేదొరకని రద్దీఅయిన నగరవీథులలో మనం ప్రవేశించ గానే, పరిస్థితి మారుతుంది. అక్కడ అవలంబించవలసిన పారిశుధ్యవిధులు మారుతాయి. మనం ఆప్రకారం వర్తిస్తు న్నామా ? మనదేశంలోని పెద్దనగరాలన్నిటిమధ్యా కని పించే అపరిశుద్ధస్థితికి కేవలం పురపాలకసంఘాలదే బాధ్యత అంతా అనిఅనుకుని వూరుకుంటే లాభంలేదు. కొన్నితర గతుల జనానికీ తరాలనుంచీవచ్చే అభ్యాసాలకు ప్రపంచం లోని ఏమునిసిపాలిటీగాని నిరోధించలేదని అనుకుంటాను.

ఈపెద్దనగరాలలో జరగవలసిన ఈపారిశుధ్య సంస్క రణ ప్రజలు యిష్టపూర్తిగా ఒసగే సహకారంకూడావుంటేనే సాధ్యపడుతుందని నాసూచన. అందుకని నేను మ్యునిసిపాలి టీలకు ఈవిషయంలో బాధ్యత అవసరం లేదంటున్నానని పొరపడకండి.

గాంధీజీ ప్రసంగాలు. రచనలు; పే. 375-76.

నేను పురపాలకసంఘ జీవితంలో అభిమానంగల వాడననే భావించుకుంటాను. నేను పురపాలక సంఘసభ్యుడుగా ఎన్నుకొనబడడం అనేది ఒకఅరుదైన అవకాశంగా భావి స్తాను. అయితే ప్రజాసేవలో అనుభవంగలవానిగా ఈ సం దర్భాన్ని మీకొక ముఖ్యవిషయం చెప్తాను. స్వార్థంతో గాని, స్వలాభాపేక్షతోగాని ఎన్నడూ మీరు పురపాలక సంఘంలో ప్రవేశించకండి. అందులో స్థానంపొందేవారు

పవిత్రమైన సేవాభావంతోనే అడుగుపెట్టాలి. తాము పారిశుధ్య సేవకులమని వారు భావించుకోవాలి. నామాతృభాషలో పురపాలకసంఘాలకు ఒకసార్థకమైన నామధేయాన్ని వాడుతోవుంటారు - కచ్రాపట్టీఅని. అంటే పాకీపనిచేసే డిపార్టుమెంటు అనిఅర్థం. ఒకనగరంలోని ప్రజాజీవిత సంబంధమైన, సాంఘిక సంబంధమైన అన్నివిషయములను ఇముడ్చుకొన్న అగ్రగణ్యమైన పారిశుధ్య సంఘంగాకాక మునిసిపాలిటీకి నిజంగా వేరేఅర్థం ఏమీలేదు. నగరంయొక్క బహిరంగ పారిశుధ్య కార్యమునకేకాక నగరవాసులైన పౌరులయొక్క అంతరంగ పారిశుధ్యమునకుకూడా పురపాలక సంఘంఅనేది బాధ్యత వహించవలసివుంటుంది.

యంగిండియా, 28-3-29.

నేనుకనక ఏదోఒక లోకల్‌బోర్డునకు లేక ఒకమ్యునిసిపాల్టీకి చెందిన ప్రదేశంలో నివాసిగావుంటే, ఏదైనా అదనపుపన్ను విధించినపుడు, దానికి నాలుగురెట్లు ప్రతీ ప్రజలకు ఫలం ముట్టుతుందంటేతప్ప, అట్టి అదనపుపన్ను కట్టడానికి నిరాకరిస్తాను; నేను నిరాకరించడమేకాక ఇతరులందరినీకూడా నిరాకరించమని ప్రోత్సహిస్తాను. లోకల్‌బోర్డులలోనికిగాని, మ్యునిసిపలు సంఘాలలోనికిగాని ప్రతినిధులుగా వెళ్ళేవారు హోదాకోసంగాని, తమలోతాము పోటీలుపడడానికిగాని కాక, ప్రేమపూర్వకమైన ప్రజాసేవ చేయడానికి వెడుతున్నామని గ్రహించాలి. అట్టిసేవ కేవలం డబ్బుమీదనే ఆధారపడదు.

మనది దరిద్రదేశం. మన మ్యునిసిపలు సభ్యులేకనక నిజమైన సేవాభావంకలవారైతే తామంతా జీతంలేని పాకీపనివారు గాను, రోడ్లు తుడిచేవారుగాను, రోడ్లువేసేవారుగాను భావించుకోవాలి; అందుకు గర్వించాలి. కాంగ్రెసు టికెట్టుమీద ఎన్నికకాని ఇతరసభ్యులనుకూడా తమసేవా కార్యంలో పాల్గొనమని ఆహ్వానించాలి. తమలోను, తమధర్మంలోనూ వారికి విశ్వాసం వున్నయెడల ఇతరులుకూడా తమత్రోవను అనుసరించునట్లు చేసికొనగలుగుతారు. దానినిబట్టి మ్యునిసిపల్ సంఘసభ్యులైనవారు తనకాలమంతా ఆపనికే ఒసగవలసివుంటుందని గ్రహించవచ్చును. అట్టిసభ్యుడు ఆపని ద్వారా తనవ్యక్తిగత లాభాలను తీర్చుకొనుటకు ఏమాత్రం ఆశించకూడదు. ఇకతర్వాత చేయవలసినది ఆమ్యునిసిపాలిటీ యొక్క లేక ఆలోకల్‌బోర్డుయొక్క అధికారంలోవున్న వయోజనపౌరుల జనసంఖ్యయొక్క పూర్తిఅంచనా తయారుచేయడం. వారందరూకూడా మ్యునిసిపల్ కార్యాలకు తమసహకారాన్ని ఒసగవలసినదిగా విజ్ఞప్తిచేయాలి. ఈపనికి సంబంధించిన ఒక సక్రమమైన రిజిష్టరు నిర్వహింపబడాలి. డబ్బు రూపకంగా రుసుములను చెల్లించలేని పేదవారి విషయంలో, వారిలో ఆరోగ్యవంతులైనవారివద్ద ఉచితశ్రమను నిరాళంగా తీసుకోవాలి.

హరిజన్, 18-2-39.

మలమూత్రాలను తగినరీతిగా వినియోగిస్తే లక్షల రూపాయల విలువగల ఎరువును తయారుచేసికొనగల్గుటయే

కాక, అనేకమైన వ్యాధులనుంచి రక్షణకూడా పొందగల్గు తాము. మన దురభ్యాసంమూలంగా మనం మనపవిత్రమైన నదీతీరాలను పాడుచేసి, ఈగలకు మిక్కిలి అనుకూలమైన జనన స్థలాలను తయారుచేస్తాం. మన అజాగ్రత్తవలన బహిరంగంగా వదలబడిన మలమూత్ర విసర్జనములపై అవి వ్రాలి ఆ వెంటనే అవి స్నానంచేసిన మనశరీరములపైనకూడా వ్రాలి మలినపరచడానికి వాటికి అవకాశం కలిగిస్తాం. ఒకచిన్న పారను ఉపయోగిస్తేచాలు, మనమీగొప్ప ప్రమాదంనుంచి విముక్తి పొందగల్గుతాం. మలమూత్రాలను బహిరంగంగా వదలివేయడంగాని, రోడ్లమీద చీదుట, ఉమియుటగాని చేస్తే దేవునియెడలా మానవునియెడలా మనం పాపంచేసినట్లే అవుతుంది; అట్టిపనులు ఇతరుల సౌకర్యముయెడల మనకు ఏమాత్రమూ గౌరవంలేదని తెల్పుతాయి. అడివిలో నివసించే మనిషైనాసరే తన మలవిసర్జనములను మట్టితో కప్పిపుచ్చనిచో, కఠినశిక్షకు పాత్రుడౌతాడు.

దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం, పే. 240.

అధ్యాయం ౭౩

విదేశభాషలో విద్యాభ్యాసంవలని నష్టములు

లక్షల జనానికి ఆంగ్లభాష నేర్పడంఅంటే వారిని బానిసలను చేయడం అన్నమాట. మెకాలే పునాదివేసిన విద్యావిధానం మనలను బానిసలను చేసింది. ఆయనకు అట్టి వంటి దురుద్దేశం వున్నదని నేనుచెప్పనుగాని, ఫలితం

మట్టుకు ఆవిధంగా పరిణమించింది ... ... నేను కోర్టుకి పోవాలంటే ఇంగ్లీషుభాషద్వారా తప్ప వ్యవహరించడానికి వీలుకాకపోవడం, నేను బ్యారిష్టరు అయినంతనే నామాతృభాషను మరచిపోయి ఇంకొకరు ఇంగ్లీషులోకి తర్జుమాచేస్తే గాని నడవకపోవడం, ఇటువంటి పరిస్థితి బాధాకరంకాదా? ఇది కేవలం పరిహాసాస్పదమైన విషయంకాదా? ఇది బానిసత్వానికి చిహ్నంకాదా? దీనికి ఇంగ్లీషువారినా నిందించవలసింది. లేక నన్ను నేనే నిందించుకోవాలా? ఇంగ్లీషుభాష నేర్చిన మనమే భారతదేశాన్ని బానిసత్వంలో బంధించాం. మనదేశమాత శాపం ఆంగ్లేయులకు కాదు, మనకే తగుల్తుంది.

హింద్ స్వరాజ్, 1908.

విదేశభాష వాహనంగా విద్యాభ్యాసం చేయడంలో గల క్లేశం చాలా దుస్సహమైనది. మనపిల్లలు ఎట్లాగో దానిని భరిస్తున్నారు, కాని దానివల్ల నష్టాలనుకూడా వారు అనుభవించక తప్పదు. దానివల్ల వారు ఏవిధమైన ఇతర శ్రమకుగాని ఇక పనికిరానివారవుతున్నారు. ఈ హేతువువల్లనే మనపట్టభద్రులు వంట్లో ఏవిధమైన స్తోమతు లేనివారుగాను, బలహీనులుగాను, అశక్తులుగాను, జబ్బువారుగాను, కేవలం ఇతరులను అనుకరించడానికి మాత్రమే పనికివచ్చేవారుగాను అవుతున్నారు. స్వయంప్రతిభ, పరిశోధనాశక్తి, సాహసం, నిరంతర పరిశ్రమ, ధైర్యం, నిర్భయత్వం మొదలైన గుణగణాలన్నీ వారిలో చచ్చిపోయాయి. అందువల్ల మనం

ఏవిధమైన నూతన కార్యోద్యమాలను చేపట్టుకొనుటకుగాని అశక్తులమైపోయాం; ఒకవేళ చేపడితే వాటిని తుదిదాకా కొనసాగించడానికి చేతకాని వారిమైపోయాం. అట్టిశక్తి సామర్థ్యాలను ప్రదర్శించగలిగినవారు ఏకొద్దిమందైనా వుంటే, వారు అల్పాయుష్కులై అకాలమృతి పాలౌతూ వున్నారు ... ఈఅసహజమైన పద్ధతిమూలంగా కలుగుతూ వున్న అపారమైన నష్టాన్ని ఇంగ్లీషు చదువులు చదువుకున్న మనతరగతివారు బోధపరచుకొనలేదు. మనకు ప్రజాహృదయంమీాదవున్న ప్రభావం ఎంత అల్పతరమో గమనిస్తే, తద్వారా పైవిషయం కొంతగ్రాహ్యం కాగలదని తలుస్తాను.

పాఠశాలలోపొందిన శిక్షణమునకును కన్నతల్లి ఉగ్గుపాలతోను తీయనిమాటలలోను ఒసగే గృహశిక్షణమునకును వుండవలసిన అనుగుణ్యత పరాయిభాషలో విద్యాబోధనం జరిగినయెడల పూర్తిగా లోపిస్తుంది. ఆవిధంగా గృహజీవితమునకును పాఠశాలా జీవితమునకును వుండదగిన బంధనమును తెగ్రెంచినవానిని, ఆతని ఉద్దేశము లెంతస్వచ్ఛమైన వైనప్పటికిని, దేశద్రోహిగా భావించవలసివుంటుంది. అట్టిపద్ధతి క్రింద వుండడానికి అంగీకరిస్తే మనం మనతల్లులకు ద్రోహం చేసినవారల మవుతాము. ఈవిధానంవల్ల కలిగేహాని ఇంతటితో అంతంకాదు. దీనివల్ల విద్యావంతుల వర్గానికీ విద్యావిహీనమైన జనబాహుళ్యానికీమధ్య ఒకఅగడ్త ఏర్పడిపోతుంది. ప్రజానీకం మనలను ఎరుగనివారౌతారు. మనం

ప్రజాబాహుళ్యాన్ని అర్థంచేసికోలేని వారల మవుతాం. వారు మనలను "సాహెబ్‌లోగ్" (పెద్దమనుషులు) కింద పరిగణిస్తారు. మనమంటేనే భయపడతారు. మనలను నమ్మరు. అదృష్టవశాత్తు విద్యావంతులవర్గం నిద్రనుంచి మేల్కొంటున్నారు. తమకు ప్రజాసంపర్కం కలిగించుకోడం ఎంత కష్టమో వారు గ్రహిస్తున్నారు. తమకు జాతీయోద్యమంలో గల ఉత్సాహాన్ని ప్రజానీకంయొక్క మనస్సులలోనికి ఏవిధంగా ప్రవేశపెట్టగలరు? ఇంగ్లీషుద్వారా ఆపని జరగదు. ఆవిధంగా అడ్డంకు ఏర్పడుటవల్ల జాతీయజీవిత ప్రవాహం నిరోధం పాలౌతుంది.

ఇంగ్లీషుభాష తన పరిమితస్థానంలో తానుండి, దేశభాషలు అర్హమైన ప్రాధాన్యాన్నిపొందిన పిమ్మట ఈనాడు కారాబంధితమైవున్న మనమస్సులు విముక్తములై మన మేధస్సులు విద్యార్జన మొనరించి సుశిక్షితమైనప్పటికిని నవచేతనాపూరితములై భాసించినప్పుడు, ఇంగ్లీషునుకూడా ఒక భాషగా నేర్చుకొనదలిస్తే, అది భారమనిపించదు. ఆరీతిగా నేర్చిన ఆంగ్లభాషాజ్ఞానము ఈనాటి మనఇంగ్లీషు పాండిత్యం కంటె చాలా ఉత్తమంగా వుంటుందని నానమ్మకం.

మాతృభాషలో విద్యాభ్యాసం పొందనారంభించినప్పుడు మనగృహ వాతావరణం మారిపోతుంది. ప్రస్తుతం మన భార్యలను మన విద్యాభ్యాసంలో భాగస్వామ్యత ఒసగలేకపోతున్నాం. మనం ఏమినేరుస్తున్నదీ వాళ్ళకేమీ

తెలియదు. మన తలిదండ్రులకుకూడా మనం ఏమిచదువుతున్న దీ తెలియదు. మాతృభాషలోనేకనక మనం విద్యాభ్యాసం పొందితే, మనచాకలికి, మంగలికి, మన పాకీపనిచేసేవానికి కూడా మనం ఆర్జించే ఘనమైన విజ్ఞానంలో పాలుపంచి పెట్టగల్గుతాం. ఇంగ్లాండుదేశంలో గెడ్డంచేసే మంగలి వానితో పెద్దపెద్ద రాజకీయాలు చర్చిస్తూవుంటారు. మన దేశంలో కుటుంబసభ్యులతో అయినా ఆపని చేయలేక పోతున్నాం. దానికికారణం మనకుటుంబ సభ్యులుగాని, ఆమంగలి వగైరాలుగాని జ్ఞానశూన్యులై వుండడంకాదు. మనమంగలి బుద్ధిశక్తి ఇంగ్లాండుదేశపు మంగలికేమీ తీసి పోదు. మనదేశంలో అన్నితరహాలవారితోనూ మహాభారత రామాయణాదులలోని విషయాలను గురించీ, తీర్థస్థలాలను గురించీ చర్చించగలుగుతూనే వున్నాము. కారణం, ఆ దిశ గా మనజాతీయజీవన ప్రవాహం ప్రవహిస్తూ వుండడమే. అయితే మనం పాఠశాలలలో ఆర్జించిన విద్యను గృహాలకు అందచేయలేకపోతున్నాం. ఆంగ్లభాషలో నేర్చిన విషయా లను మనం మనకుటుంబసభ్యుల సమక్షంలో తిరిగి చెప్పలేక పోతున్నాం.

ఈనిమిషాన్ని మన శాసనసభలలోని చర్చలు ఇంగ్లీషులో నడుస్తున్నాయి. ఇంకా అనేకవిధములైన సంస్థ లలోకూడా అదేవిధంగా జరుగుతున్నది. అందువల్ల మనం తనసంపత్తినంతనూ భూగర్భంలో పాతిపెట్టికూర్చున్న పిసి

నారివాని స్థితిలోవున్నాం ... మనం మనబుద్ధిమాంద్యం వల్ల వానాకాలంలో కొండశిఖరాలనుంచి ప్రవహించే నదీ జలాలనంతా నిరుపయోగంగా వృధాపుచ్చుతామనిన్నీ, అట్లే లక్షల ఖరీదుచేసే ఎరువుపెంటను వృధాచేసి పైగా తద్వారా జబ్బులు తెచ్చుకుంటామనీ మనమీద నిందమో పుతూవుంటారు. ఆవిధంగానే, ఇంగ్లీషుభాషను నేర్చుకునే నిమిత్తంపడే బాధాభారంతో నలుగుటవలనను, దూరదృష్టి లేకపోవుటవలనను మనం దేశమునకు చేయవలసిన సేవ సంతను చేయజాలకపోతున్నాం. ఇందులో అతిశయోక్తి ఏమీ లేదు. ఈమాటలలో నాహృదయంలో పొంగిపొర్లుతూ వున్న బాధను వ్యక్తంచేస్తున్నాను. మన మాతృభాషల యెడల మనం దీర్ఘకాలంనుంచీ చూపివున్న అశ్రద్ధకు ప్రతిఫలం అనుభవించవలసి వుంటుంది. అందుమూలంగా మన దేశానికి అపారమైన నష్టం కలుగుచున్నది. విద్యావంతుల వర్గానికి చెందిన వారంతా దేశమాతను ఈ దుర్భరావేదన నుంచి విముక్తిపొందించడం తమ ప్రథమ విధిగా భావించవలసి వుంటుంది.

— 1917 సం. అక్టోబరు 20 తేదీని బ్రోచ్‌లో జరిగిన రెండవ గుజరాత్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్సు యొక్క అధ్యక్షోపన్యాసంనుంచి.

ఇంగ్లీషు భాష రావడమే గౌరవప్రదమనుకునే మూఢవిశ్వాసంనుంచి మనలను, సంఘమును కూడా విముక్తి పరచుకొనడమే మనం సంఘానికి చేయగల గొప్ప సేవ అని

భావిస్తాను. మన పాఠశాలలలోను, కళాశాలలలోను దానిని విద్యాబోధనమునకు వాహనంగా చేసుకున్నాము. అది మన దేశమొత్తానికే (Lingua Franca of India) రాష్ట్రాంతర వ్యవహార భాషగా అవుతున్నది. మన ఉత్తమభావా లన్నింటిని అందులోనే వ్యక్తం చేస్తున్నాము. ... ఇంగ్లీషుభాషా శిక్షణయొక్క అవసరంలో మనకు గల ఈ నమ్మకం మనలను తనకు బానిసలను చేసుకుంది. ఇది మనలను దేశ సేవకు పనికిరానివారినిగా చేసింది. అభ్యాస బలం అడ్డుకావడంవల్ల తెలిసికొనలేకపోతున్నాంగాని, లేనియెడల, ఇంగ్లీషు భాష విద్యాబోధనకు వాహనం కావడంమూలంగా మన మేధాశక్తి సంకుచితమైపోయినదనీ, మనం జనబాహుళ్యంనుంచి వేరుపరచబడ్డామనీ, దేశంలోని ధీశాలురైనవారు అభివ్యక్తత లేనివారైపోయినారనీ, మనం నేర్చిన నూతన భావాలు ప్రజాసామాన్యానికి చేరడంలేదనీ మనం గ్రహించగలుగుతాం. గత అరవై సంవత్సరాలనుంచీ మనం విషయ పరిజ్ఞానాన్ని అవగాహన చేసికొనడంకంటె పరభాషా పదములనూ, వాటి ఉచ్చారణమునూ వల్లెవేయడంలోనే గడిపాం. మన తలిదండ్రులు ఒసగిన శిక్షణ మనే పునాదిపై నిర్మాణమొనర్చుకొనుటకు బదులు, దానిని తిరుగదోడుకొనుటకే ప్రయత్నించాం. ఇది చరిత్రలో ఎన్నడూ ఎక్కడా కని విని యెరుగని పరిస్థితి. జాతీయదృష్ట్యా ఇది ఒక విషాద సంఘటన. మన దేశ భాషలను తిరిగి చేపట్టి, జాతీయ భాషగా హిందీకి గల సహజస్థానాన్ని తిరిగి ఒసగి, ప్రాంతీయములైన సంస్థల

కార్యక్రమములన్నీ ఆయా ప్రాంతీయ భాషలలోను, జాతీయ కార్యక్రమములన్నీ హిందీ భాషలోనూ నడిపించుకొనుటకు ప్రారంభం చేయడమే మనం చేయగల సంఘసేవా కార్యక్రమంలో ప్రప్రథమమూ, ఉత్కృష్టమూ అయిన అంశం. మన పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ విద్యాబోధన దేశ భాషలలో జరిగేవరకూ మనం నిద్రపోకూడదు. ... మన ప్రాదేశిక శాసన సభలలో ఆయా దేశ భాషలలోనూ, మన రాష్ట్ర శాసనసభలో హిందీలోనూ జాతీయ వ్యవహారాలు చర్చింపబడేరోజు చేరువగాక తప్పదు. ఇంతవరకు అచట జరిగే చర్చలకు ప్రజలు దూరులై వున్నారు. ఆ నష్టాన్ని కొంతవరకు మన దేశభాషా పత్రికలు తీర్చుటకు ప్రయత్నించాయి. కాని ఆపని వాటిశక్తికి మించినటువంటిది. "అమృత బజార్ పత్రిక" తన తీవ్రమైన విమర్శక శైలినీ, "బెంగాలీ" పత్రిక తన విషయ పరిజ్ఞానాన్నీ ఆంగ్లభాషకు శ్రుతి చేసి కొన్ని శ్రవణములకు మాత్రమే నివేదిస్తున్నాయి. ఉత్కృష్ట భావుకులకు నెలవైన ఈ పురాతన భూమిలో ఈనాడు మన మధ్యన మసలే ఒక టాగూరును, ఒక బోసును, ఒక రేని చూచి మనం అద్భుత పడవలసిన పనిలేదు. కాని ఈనాడు అట్టివారు బహుస్వల్ప సంఖ్యలో వున్నారన్న మాటే శోచ నీయమైన విషయం.

—1917 సం. డిసెంబరు 27 తేదీని కలకత్తాలో జరిగిన ప్రథమ అఖిలభారత సంఘసేవా సభలో ఒసగబడిన అధ్యక్షోపన్యాసంనుంచి.

ప్రస్తుతం అమలులోవున్న ఆంగ్లవిద్యా విధానం ఆంగ్ల విద్యనుపొందిన భారతీయులను నిర్వీర్య మొనర్చివైచినదనీ, భారతీయ విద్యార్థుల నరాలయొక్క శక్తిని సడలించనైచినదనీ, మనందరినీ ఆంగ్లేయులను అనుకరించడంతప్ప వేరేమీ చేత గాని వారినిగా చేసివైచినదనీ నా నిశ్చితాభిప్రాయం. దేశ భాషలను పదభ్రష్ట చేసినవిధానం బ్రిటీషుపాలన చరిత్రలో అత్యంత విచారకరమైన అధ్యాయం. తమ భావాలను ఆంగ్లంలో ఆలోచించవలసిరావడమూ, ప్రధానంగా ఆంగ్లం లోనే వ్యక్తం చేయవలసిరావడమూ అనే ప్రతిబంధకంతో ప్రారంభించి వుండకపోతే, రామమోహనరాయి ఇంకా గొప్ప సంస్కర్తగాను, లోకమాన్య తిలక్ ఇంకా గొప్ప పండితుడుగాను అయివుండేవారు. ఇంతకంటె సహజమైన విధానం క్రిందనే కనక పెరిగివుంటే, ఇప్పటికే వారు ప్రజా నీకంపై ప్రసరింపగలిగిన ప్రభావంకంటె ఇంకా ఎంతో అద్భుతమైన ప్రభావాన్ని చూపగలిగి వుండేవారు. ఆంగ్ల సాహిత్యసంపదను ఆకళించుకొనుట ద్వారా వారిరువురూ కూడా చాలా లాభం పొందివున్నమాట కూడా నిజమే అనుకోండి. అయితే ఆ సంపత్తి వారికి తమ భాషలద్వారా లభ్యం కాగలిగివుండవలసింది. ఏ దేశంగాని పరానుకరణా పరుల పరంపరను తయారు చేయడంద్వారా గొప్ప జాతీయ తగా పెంపొంది వుండలేదు. బైబిలుకి ఆంగ్లంలో అధి కారానువాదం వెలివడకుండా వుంటే ఆంగ్లేయజాతి ఏస్థితిలో వుండేదో ఊహించుకోండి. చైతన్యుడు, కబీర్, నానక్,

గురుగోవిందసింగ్, శివాజీ, రాణాప్రతాప్‌లు రామమోహన రాయి, తిలక్‌ల కంటె గొప్ప వ్యక్తులని నా నమ్మకం. పోలికలు అపోహలకు తావిస్తాయని నాకు తెలుసు. అందరూ వారివారి తరహాల ప్రకారం సమానమైన గొప్పతనం గల వారే. కాని ఫలితములనుబట్టి విమర్శించి చూస్తే ప్రజా సామాన్యంమీద రామమోహనుని యొక్క, తిలక్ యొక్క ప్రభావాన్ని వారికంటె అదృష్ట పరిస్థితులలో జన్మించియుం డిన అంతకుపూర్వపు ప్రభావంతో పోలిస్తే తత్తుల్యమైన శాశ్వతగుణం వీరిలో కనిపించదు. అయితే వారు ఎదుర్కొన వలసివచ్చిన ప్రతిబంధకములనుబట్టి చూస్తే వారి ఘనత యొక్క ఉత్కృష్టత గోచరిస్తుంది కాని, వారు శిక్షణ పొందిన విధానంయొక్క అడ్డంకు లేకపోయినచో వారింకను ఉత్కృష్టతరమైన ఫలితములను సాధించగల్గి వుండేవారని కూడా స్పష్టమౌతుంది. రాజారామమోహనరాయ్‌గాని, తిలక్‌గాని ఆంగ్లభాష నేర్వకున్నచో వారు భావించిన భావా లను తలపోయ లేకపోయేవారని అంటే నే నేమాత్రం నమ్మను. స్వాతంత్ర్య భావాలను అవగాహన చేసికొనుటకుగాని, సులక్షణంగా ఆలోచించుటకుగాని ఆంగ్లభాషా జ్ఞానం అవ సరమని తలపోయడంకంటె గొప్ప మూఢవిశ్వాసం ఇంకొక టుండదు. గత ఏబది సంవత్సరాలనుంచీ మన దేశంలో ఒకే ఒక విధమైన విద్యావిధానం అమలై వున్నదనిన్నీ, భావవ్యక్తతకు ఒకేఒక సాధనాన్ని మనమందరం బలవం తంగా ఉపయోగించవలసి వచ్చినదనిన్నీ మరచిపోకూడదు.

అందువల్ల ఇప్పటి పాఠశాలలలోను కళాశాలలలోను పొందే విద్యేకనక లేకపోతే, మనం ఏ విధంగా వుండేవారమో తెలిసికొనుటకు ఋజు వేమీలేదు. ఏబందేళ్ల పూర్వంకంటె ఈనాటి భారతదేశం అధికమైన దారిద్ర్య స్థితిలో మునిగి వున్న సంగతి, ఆత్మరక్షణ విషయంలో ఎక్కువ శక్తిహీన మైపోయిన దన్న విషయం, ఈ దేశపు ప్రజానీకం అపారంగా నీరసిల్లిపోయి వున్నదనే వాస్తవ పరిస్థితి మాత్రం మన కళ్ల ముందర కనిపిస్తూనే వుంది. దీనికి కారణం ప్రభుత్వ విధానంలో లోపములే అని నాకు బోధపరచ నవసరంలేదు. అయితే ఆ ప్రభుత్వ విధానంలోని అత్యంత లోపభూయిష్ట మైన భాగం ఈ విద్యాపద్ధతే అని నే నంటాను.

ఈ విద్యావిధానం అపోహలో భావింపబడి, అపోహలో పుట్టింది. ఏమనగా, మన దేశీయ విద్యావిధానం నిజంగా ఎందుకూ పనికిరాదని మన ఆంగ్లేయ పరిపాలకుల యొక్క విశ్వాసం. ప్రస్తుత విద్యావిధానంయొక్క ఫలితం భారతదేశపు దేహ మనస్సులనూ, ఆత్మనూ కుంచిత మొన ర్చుటకావడంచేత అది పాపపు పునాదిపైన పెరిగిందని కూడా చెప్పవచ్చును.

యంగిండియా, 27-4-21.

టాగూరుకు జవాబు :

... ఈ రోజున వ్యాపార విషయికంగా అవసరం కావడంవల్లను, రాజకీయంగా అవసరమని అపోహ పడడం

వల్లను, ఆంగ్లభాష మన దేశంలో అభ్యసింపబడుతోంది. మన బాలురు, ప్రస్తుత పరిస్థితులలో, వాస్తవ దృష్టితోనే, ఆంగ్లభాష వస్తే తప్ప ప్రభుత్వోద్యోగాలు దొరకవని అనుకుంటున్నారు. బాలికలకు వివాహానికి ప్రవేశ పత్రంగా ఆంగ్లభాష నేర్పబడుతూ వున్నది. ఆంగ్లేయ పురుషులతో ఆంగ్లంలో మాట్లాడే నిమిత్తం ఆంగ్లభాషను నేర్చుకొనవలెనని చాలా మంది స్త్రీలు కోరడం నే నెరుగుదును. తమతోనూ తమ మిత్రులతోనూ తమ భార్యలు ఆంగ్లభాషలో మాట్లాడ లేనందుకు విచారం పొందే భర్తలను నే నెరుగుదును. ఆంగ్లభాషను కేవలం తమ మాతృభాషగా చేసుకునే కుటుంబాలను కూడా నే నెరుగుదును. ఆంగ్లభాష రానిదే భారతదేశం స్వాతంత్ర్యం పొందనేరదని నమ్మే వందలాది యువకులు కూడా వున్నారు. విద్యకు అర్థంగా ఆంగ్లభాషా జ్ఞానమే అని ఆపోహ పడేదాకా కూడా ఈ విషక్రిమి మన సంఘ జీవితాన్ని దొలిచివేసింది. ఇవన్నీ నా దృష్టిలో మన బానిసత్వానికీ, మన అవమానకర పరిస్థితికీ చిహ్నాలు. ప్రస్తుతంలోలాగున మన దేశభాషలు అణగద్రొక్కబడి, నీరసించిపోవడం అనేది నాకు దుర్భరమైన విషయం. మన దేశంలో తలిదండ్రులు తమ పిల్లలకుగాని, భర్తలు తమ భార్యలకుగాని తమ మాతృభాషలో కాక ఆంగ్లంలో లేఖలు వ్రాసుకోవడం అనేది నాకు దుస్సహంగా కనిపిస్తుంది. మన కవీంద్రులైన రవీంద్రులతో సమానంగా నేనుకూడా స్వేచ్ఛా వాయువునే పీల్చ గోరుతాను. నేను నివసించే గృహానికి

చుట్టూ గోడకట్టుకొని, కిటికీలనుమూసుకొని కూర్చొనవలెనని కోరను. నా యింట్లో అన్నిదేశాల సంస్కృతులూ గాలుల వలె వీలైనంత నిరాటంకంగా విహరిస్తూ వుండవలయుననియే కోరుతాను. కాని అందులో దేనివల్లగాని నా కాళ్లు తేలిపోయి నేనే ఎగిరిపోవడమనేది అంగీకరించను. ఇతరుల గృహాలలో నేను పిలవని పేరంటంగా గాని, భిక్షార్థిగా గాని, బానిసగా గాని నివసించడ మనేదిమాత్రం నే నిష్టపడను. అసత్యమైన గర్వభావాన్ని తృప్తిపరచుకొనుటకుగాని, సందేహాస్పదమైన సాంఘిక లాభాన్ని చేకూర్చుకొనుటకుగాని, నా సోదరీమణులపైని ఆంగ్లభాషను నేర్చుకునే శ్రమభారాన్ని మోపడం నే నొప్పుకోను. సాహిత్యాభిరుచి కలిగిన మన యువజనులు తమకు యిష్టమువచ్చినంత ఆంగ్లభాషను, ఇతర ప్రపంచ భాషలను నేర్చుకొనమనే కోరుతానుగాని, వారు తద్వారా పొందిన జ్ఞానలాభమును, ఒక బోసువలెనో, ఒక రాయ్‌వలెనో, లేదా మన కవీంద్రునివలెనో తిరిగి భారతదేశానికీ, ప్రపంచానికీ ముట్ట జెప్పవలసి వుంటుందని మాత్రం కోరుతాను. అయితే ఏ ఒక్క భారతీయుడుగాని తన మాతృభాషను మరచిపోవడమూ, దానియెడల అశ్రద్ధ చూపడమూ, దానిని లజ్జాకరంగా భావించడమూ లేక అట్టి స్త్రీ పురుషు లెవరుగాని తమ తమ మాతృభాషలలో ఉత్తమ భావాలను తలపోయ లేమనీ, వ్యక్తం చేయలేమనీ అనుకోవడమూ మాత్రం నేను సహించను. నా మతం బందిఖానా

పంటిదికాదు. అందులో దైవ సృష్టిలోని అల్పాల్ప జీవికి కూడా చోటుంది. కాని అది నరహంకారాన్ని, జాతి మత వర్గ సంబంధమైన దుర్గర్వాన్నీ మాత్రం ఏమాత్రమూ దరి జేరనీయదు.

యంగిండియా, 1-6-21.

విదేశభాషద్వారా విద్యాబోధనం జరగడం మూలంగా మన పిల్లలయొక్క మేధస్సు అలసటపాలు కావడమూ, వారి నరములశక్తి నీరసిల్లడమూ, వారు బట్టీపట్టడంలోనూ అనుకరణలోనూ మాత్రమే ప్రవీణులు కావడమూ, కార్యనిర్వహణలోనూ ఆలోచనలోనూ స్వతంత్ర ప్రతిభను చూపలేక పోవడమూ, తమ జ్ఞానాన్ని తమ కుటుంబములకుగాని ప్రజానీకమునకుగాని ప్రసరింపజేయ లేకపోవడమూ జరిగింది. వైదేశిక విద్యాసాధనం వారిని తమ స్వదేశంలోనే పరదేశులనుగా చేసింది. ఇది ప్రస్తుత విద్యావిధానం యొక్క పరమ విషాదకరమైన ఫలితం. ఈ వైదేశికభాషా బోధనమే దేశభాషలను పెంపొందకుండా అరికట్టింది. నా చేతిలో నేకనక నిరంకుశాధికారం వుంటే, నేను తక్షణం మన బాలబాలికలు పరాయిభాషలో విద్యాభ్యాసం చేయడం నిలుపుదల చేసి, స్వభాషలలో వెంటనే విద్యాబోధనం ప్రారంభించ లేని ఉపాధ్యాయులను, ప్రొఫెసర్లను ఉద్యోగాలు ఊడదీసి పంపించివేస్తాను. పాఠ్యగ్రంథాలు తయారయేవరకూ నే నాగను. ముందు విధానాన్ని మార్చివేసిన పిమ్మట, అవి

తయారుకావచ్చును. ఈ దుష్టవిధానాన్ని తొలగించడానికి తక్షణ చర్యయే అవసరం.

యంగిండియా. 1-9-21.

మనం పొందిన ఏకైకమైన ఉన్నతవిద్య, మనం పొందివున్న చెప్పదగిన విద్యాశిక్షణ అంతా ఆంగ్లభాషా వాహనంద్వారా జరిగివున్న హేతువునతప్ప, లేనియెడల ఏ దేశపు యువకులు గాని, వారొక జాతీయతగలవారుగా పరిగణింపబడవలెనంటే, వారియొక్క విద్యాబోధన, అత్యున్నత విద్యతోసహా, ఆ దేశపు మాతృభాషలోనో, మాతృభాషల లోనో మాత్రమే జరుగవలసివుంటుందనే స్వయంప్రకాశిత సత్యాన్ని ఇంత కష్టపడి నిరూపించి చూపవలసిన అవసరం వుండేదికాదు. ప్రజానీకానికి అర్థమయ్యే భాషద్వారా తాము విద్యార్జనచేస్తేతప్ప ఏ దేశపు యువజనులుగాని జన సామాన్యంతో సజీవమైన సంపర్కమును కలిగించుకొననేరరనే ప్రతిపాదనయొక్క సత్యాన్ని గ్రహించడానికి వేరే రుజువు లేమీ అవసరం లేదు; అది నిదర్శనపూర్వకంగా మన మెరిగిన విషయమే. వేలాది యువజనులు తమ దైనందిన జీవితానికి ఏమాత్రం అవసరం లేని ఒక వైదేశిక భాషనూ, దాని తాలూకు నుడికారమునూ అభ్యసించుటలో సంవత్సరాలకాలం వెచ్చించుటద్వారాను, దానిని అభ్యసించుటకుగాను తమ మాతృభాషను తమ సాహిత్యమును అశ్రద్ధచేయుటద్వారాను మనదేశానికి వాటిల్లివున్న అపార

నష్టాన్ని ఎవరు అంచనా వేయగలరు? ఏ ప్రత్యేక భాషగాని నైశాల్యతను పెంపొందించుకొనుటకుగాని, క్లిష్టమూ శాస్త్ర సంబంధమూ అయిన భావాలను వ్యక్త మొనర్చుటకుగాని అశక్తమని భావించుటకంటె మించిన మూఢవిశ్వాసం ఎక్కడా వుండదు. ఏ భాషగాని దానిని మాట్లాడేవారి యొక్క ప్రకృతినీ పరిణతినీ సరాసరిగా ప్రతిబింబిత మొనర్చ గల శక్తిని కలిగివుంటుంది.

మన దేశపు యువజనులపై బలాత్కారంగా ప్రయోగించబడిన ఈ వైదేశికభాషాపూర్వక విద్యావిధానమనే వినాశకరమైన అత్యాచారం పరపాలనఫలితంగా మన దేశమునకు కలిగిన నష్టములలోకల్లా గొప్ప నష్టముగా చరిత్రలో శిలాక్షరాంకితం కాక మానదు. అది మన జాతిశక్తిని పీల్చి పిప్పిచేసింది; మన విద్యార్థులను అల్పాయుష్కులుగా చేసేసింది. వారిని అది జనసామాన్యానికి దూరం చేసింది; విద్యాభ్యాసాన్ని అనవసరంగా ఖరీదుచేసేసింది. ఈ విధానం ఇంకా ఈరీతిగానే నడిస్తే, తప్పకుండా అది మన జాతినే ఆత్మవిరహిత మొనర్చివేయగలదు. అందువల్ల భారత దేశంలోని విద్యావంతులైనవారంతా ఈ వైదేశికభాషావాహనం యొక్క సమ్మోహన మంత్రప్రభావాన్ని ఎంతత్వరగా విదిలించుకొని విముక్తిపొందితే, వారికీ దేశానికీకూడా అంత శ్రేయస్కరంగా వుంటుంది.

యంగిండియా, 5-7-'28.

అధ్యాయం ౪౪

నా స్వా ను భ వం

నా స్వానుభవం నుంచి ఒక అధ్యాయం ఇక్కడ ఉటంకిస్తాను. నాకు పన్నెండేళ్లవరకూ నేను పొందిన జ్ఞానమంతా నా మాతృభాష అయిన గుజరాతీ ద్వారానే పొందాను. అప్పటికి నాకు కొంచెం లెక్కలు, చరిత్ర, భూగోళశాస్త్రం వచ్చును. అప్పుడు నేనొక హైస్కూలులో చేరాను. మొదటి మూడు సంవత్సరాలూ మాతృభాషే బోధన భాషగా నడిచింది. కాని విద్యార్థుల బుర్రలలోకి ఎలాగో ఒకలాగ ఆంగ్లభాషని ఎక్కించడం ఉపాధ్యాయుల ముఖ్యవిధి కావడంవల్ల మా అభ్యసనకాలంలో సగం పై చిలుకు ఆంగ్లభాషని నేర్చుకొనడంలో, అనగా మాటల యొక్క క్రమరహితమైన వర్ణక్రమం, ఉచ్చారణ నేర్చుకొనడంలో గడిచేది. వ్రాసినట్లుగా పలుకబడని భాషని సాధించడం ఎంత బాధాకరమైన పనో అప్పుడు నాకు విశదమయింది. వర్ణక్రమాన్ని కంఠస్థం చేయవలసిరావడం ఒక కొత్తరకం అనుభవంగా తోచింది. ఇది సందర్భవశాత్తుగా చెప్తున్న సంగతి; నా వాదానికి ఇది ముఖ్యంకాదు. ఏమైతేనేమి, మొదటి మూడు సంవత్సరాలూ కొంతవరకు సులభంగానే గడిచాయి.

చిత్రవధ నాలుగవ సంవత్సరంతో ప్రారంభమయింది. ప్రతి విషయమూ ఆంగ్లంద్వారానే నేర్చుకోవలసివచ్చింది—

రేఖాగణితం, బీజగణితం, రసాయనశాస్త్రం, ఖగోళశాస్త్రం, చరిత్ర, భూగోళశాస్త్రం అన్నీ ఆంగ్లభాషయొక్క నిరంకుశత్వం ఎంతవరకు పోయిందంటే,-సంస్కృతం, పార్సీభాషలుకూడా, మాతృభాషద్వారా కాక, ఆంగ్లంద్వారానే నేర్చుకోవలసి వచ్చింది. పిల్లవాడెవరుగాని క్లాసులో తనకు బోధపడే గుజ రాతీ భాషలో మాట్లాడితే శిక్షింపబడేవాడు. తనకు బోధ పడకుండా తప్పుడు ఉచ్చారణతో అయినా వచ్చీరాని ఆంగ్లంలో మాట్లాడితే చాలు, ఉపాధ్యాయులు సంతృప్తి పడేవారు. ఆయనకు బాధేమిటి? తన ఇంగ్లీషుమాత్రం తప్పులు లేనిదా! దాని గతి అంతే. ఆంగ్లభాష విద్యార్థుల కెంత పరాయిభాషో ఉపాధ్యాయుడికీ అంతే. అయితే ఫలితం మాత్రం అరాజకం. మాకు పూర్తిగా బోధపడక పోయినా, తరుచు అసలేమీ బోధపడకపోయినా కూడా, అన్ని విషయాలూ కంఠోపాఠం చేయవలసివచ్చేది. మా ఉపాధ్యాయుడు రేఖాగణితాన్ని మాకు బోధపరిచేందుకు తంటాలు పడటంచూస్తే నాకు తల తిరిగిపోయేది. యూక్లిడ్ మొదటిభాగంలోని 13వ థీరం దగ్గరికి వచ్చేదాకా నాకు రేఖాగణితం అంటే ఏమిటో తలాతోకా తెలియలేదు. చదువరికి నిజం చెప్పాలంటే, ఇవాళదాకా నాకు జామెట్రీ, ఆల్జీబ్రా వగైరాలలోని పారిభాషికపదాలకి గుజరాతీ మాట లేమిటో తెలియనే తెలియదు. నేను నాలుగు సంవత్సరాల కాలంలో నేర్చిన లెక్కలు, జామెట్రీ, ఆల్జీబ్రా, కెమిస్ట్రీ,

ఏష్ట్రానమీ శాస్త్రాలలో జ్ఞానాన్ని, ఇంగ్లీషుద్వారా కాక గుజరాతీలోనే కనక నేర్చుకుంటే, ఒక ఏడాదిలో సునాయాసంగా నేర్చుకోనగలిగేవాడినని ఇప్పుడు నేను చెప్పగలను. ఏ బాధా లేకుండా ఎక్కువ స్పష్టంగా ఆ శాస్త్రవిషయాలను వశంవదం చేసుకోన గలిగేవాణ్ణి. నా గుజరాతీ పదజాలం కూడా చాలా అభివృద్ధి పొందివుండేది. అలా పొందిన జ్ఞానాన్ని గృహజీవితంలో వినియుక్తం చేయగలిగి వుండే వాణ్ణి ఆంగ్లం ద్వారా నేర్చుకోవడంవల్ల, ఆంగ్ల విద్యను అభ్యసించివుండని మా యింట్లోని వారలకూ నాకూ మధ్య ఒక దాటరాని అడ్డంకు ఏర్పడింది నేను ఏమి నేర్చుకుంటు న్నానో ఏమిటో మా నాన్నకు ఏమీ తెలియనే తెలియదు, నాకు తెలుపవలెననే కోరికవున్నాగాని, ఆయన మనస్సుని నేను నేర్చుకునే విషయాలలోకి ఆకర్షించడమూ అసాధ్యమే. ఆయన సహజంగా చాలా తెలివైనవాడైనా ఇంగ్లీషుముక్క మాత్రం ఒకటైనా ఆయనకు రాదుగా. ఈవిధంగా నేను ఇంట్లోనే ఒక పరాయివాడుగా అయిపోతూ వచ్చాను. అయితే అందరికంటే ఘనుడిగామాత్రం పరిగ ణింపబడ్డాను. నాకు తెలియకుండానే నా వేషంలోకూడా మార్పు రా నారంభించింది. నాకు జరిగిన ఇదంతా ఏమీ అసాధారణమైన అనుభవం కాదు. అధికసంఖ్యాకులకు తెలిసిన అనుభవమే.

నేను హైస్కూలులో చదివిన మొదటి మూడేళ్ళ లోనూ నా విషయజ్ఞానంలో ఎక్కువ అభివృద్ధి ఏమీ జరగ

లేదు. పిల్లలకు అన్ని విషయాలూ ఆంగ్లంలో నేర్పడానికి అది తరిఫీదుకాలం. ఈ హైస్కూల్సు అనేవి ఆంగ్లేయులు మనలను సంస్కృతివిషయికంగా జయించడానికిగాను ఏర్పాటైన సంస్థలు. నా హైస్కూలులోని మూడువందలమంది పిల్లలు ఆర్జించిన జ్ఞానం ఒక సంకుచితవలయానికి బద్ధమైనటువంటిది. అది ప్రజాసామాన్యానికి అందజేయడానికి వీలైనది కాదు.

ఇక సాహిత్య విషయమై ఒకమాట. మేము ఇంగ్లీషు వచనంలోనూ, ఇంగ్లీషు కవిత్వంలోనూ చాలా పుస్తకాలు చదవవలసివుంది. అది చాలా మంచిసంగతే. కాని ఆ జ్ఞానం నేను ప్రజాసామాన్యానికి సేవ చేయడానికిగాని, వారితో అనుబంధం కలిగించుకొనడానికి ఏమాత్రం అక్కరకు రాలేదు. ఆంగ్లవచనసాహిత్య విషయంలోనూ, కవిత్వ విషయంలోనూ నేను నేర్చుకున్న శాస్త్రం నేర్చుకొని వుండకపోతే ఒక అరుదైన భాండారాన్ని కోల్పోయినవాడినై వుండేవాణ్ణని చెప్పలేను. ఈ విలువైన ఏడు సంవత్సరాలూ నేను కనక గుజరాతీ భాషని బాగా నేర్చుకొనడానికి వినియోగించి, గుజరాతీ భాషద్వారానే కనక లెక్కలు, భౌతికశాస్త్రాలూ, సంస్కృతం, ఇతరవిషయాలూ అభ్యసించగలిగి ఉన్నయెడల, ఆవిధంగా నేను ఆర్జించిన జ్ఞానాన్ని నా ఇరుగుపొరుగు వారందరితోటీ పాలుపంచుకొనగలిగేవాణ్ణి. నేను గుజరాతీభాషని అభివృద్ధిపరచగలిగేవాణ్ణి. అంతేకాదు, నా సహజ కార్య

కుశలత, దేశభక్తి, మాతృభాషాభిమానముల ఫలితంగా ఎక్కువ విలువైన ప్రజాసేవకూడా చేయగలిగి వుండేవాణ్ణని అనుకోడానికి అవకాశముంది.

నేను ఆంగ్లభాషనిగాని, అందలి ఉదాత్త సాహిత్యాన్నిగాని తూలనాడుతున్నట్లు అర్థంచేసుకోవద్దని మనవి. 'హరిజన్' పత్రికలోని పుటలే నాకు ఆంగ్లభాషయెడల గల అభిమానానికి నిదర్శనం. ఆంగ్లదేశపు సమశీతోష్ణత, అక్కడి ప్రకృతి దృశ్యాలు మన దేశానికి ఎంత నిష్ప్రయోజనమో ఆ దేశపు సాహిత్యపు ఉదాత్తతకూడా మనకు అంతే నిష్ప్రయోజనం. భారతదేశం తనకు సహజసిద్ధమైన శీతోష్ణత, ప్రకృతిదృశ్యాలు, సాహిత్యం వీటి ద్వారానే పురోభివృద్ధి పొందవలసివుంది— ఈ మూడు అంశాలలోను ఆంగ్లదేశంకంటె మనదేశం ఎంత తక్కువస్థితిలో వున్నా సరే మనమూ, మన పిల్లలూ మనయొక్క సహజమైన వారసత్వం మీదనే నిర్మాణం చేసుకొనవలసి వుంటుంది. ఇంకొకరిది మనం అరువు తెచ్చుకుంటే మనదానిని నీరసింపచేసుకుంటాము. విజాతీయమైన, పోషకద్రవ్యాలమీద మనం పెంపొందలేము. ఆంగ్ల భాషలోని భాండారమే కాదు. ప్రపంచ భాషలన్నిటిలోని భాండారాన్ని కూడా మనదేశం చవిచూడవలసినదే; అయితే ఆ పని మన దేశభాషల ద్వారా చేసుకోమంటాను నేను. రవీంద్రుని అసమానమైన రచనలలోని అందాలను తెలుసుకొనడానికి నేను వంగ భాషను నేర్చుకో నవసరం లేదు. మంచి తర్జుమాలద్వారా

తెలుసుకోగలను. టాలుస్టాయి కథలు చదివి ఆనందించా లంటే గుజరాతీ బాలబాలికలు రష్యనుభాష నేర్చుకోనక్కర లేదు. మంచి భాషాంతరీకరణాలద్వారా తెలుసుకోగలరు. ప్రపంచ సాహిత్యాలన్నిటిలోని ఉత్తమ గ్రంథాలున్నూ, ఆయా భాషలలో అవి ప్రకటితమైన వారం రోజులలోగా, సులభమైన అనువాద రూపంలో తమ భాషలో లభ్యమౌతాయని ఆంగ్లేయులు గర్వం వెలిబుచ్చుతూవుంటారు. అలాగే నేనుమాత్రం షేక్స్పియరు యొక్క, మిల్టను యొక్క వ్రాతలోని, భావాలలోని ఉత్తమాంశాలు చవిచూడటానికి ఆంగ్లభాష నేర్చుకోవలసిన అవసరం ఏమిటి?

ఈ విషయం సులభీకరించడానికిగాను, వివిధ ప్రపంచ భాషలలోనుగల యోగ్యమైన విషయాలను తెలుసుకుని వాటిని దేశభాషలలోకి అనువదించే నిమిత్తం మన విద్యార్థులలో కొందరిని ప్రత్యేక శాఖగా ఏర్పాటుచేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. మనకోసమై మన అధికారులు ప్రస్తుతం అవలంబించివున్న తప్పుడు మార్గం అభ్యాసబలం వల్ల మనకు మంచిమార్గంలా అగుపిస్తోంది.

భారతీయ స్వభావాన్ని నాశనమొనర్చే యీ అసత్య విద్యావిధానంవల్ల లక్షలాది జనానీకానికి దైనందినం అధికాధికంగా కలుగుతూవున్న నష్టానికి సర్వదా నాకు నిదర్శనాలు కనిపిస్తూనేవున్నాయి. నా అమూల్య సహచరవర్గానికి చెందినవారిలో విశ్వవిద్యాలయ స్నాతకులైనవారే తమ

ఆంతరంగిక భావాలను అభివ్యక్తం చేయవలసివచ్చినప్పుడు అశక్తులైపోతూవున్నారు. వారి గృహాలలోనే వారు పరాయి వారైపోయారు. మాతృభాషలో వారికిగల శబ్దజ్ఞానం చాలా తక్కువ కావడంవల్ల, ఆంగ్లపదాలు, ఒక్కొక్కప్పుడు వాక్యాలు సహా, ఉపయోగించకుండా వారు తమ భావాలను పూర్తిగా వ్యక్తంచేయలేకపోతున్నారు. ఇంగ్లీషు గ్రంథాలులేకుండా వారు అసలే బ్రతకలేరు. సర్వసామాన్యంగా వారు ఒకరితో ఒకరు ఇంగ్లీషులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకుంటారు. ఈ చెనుగు ఎంతలోతుగా జీర్ణించినదీ స్పష్టపరచడానికిగాను నా అనుచరులను ఉదహరిస్తున్నాను. బుద్ధిపూర్వకంగా ఈ దురభ్యాసాన్ని తొలగించుకోడానికి ప్రయత్నించిన మాపరిస్థితే ఇలావున్నదని గ్రహించవచ్చును. మన కాలేజీ చదువుల ఫలితంగా జగదీశచంద్రబోసు వంటి ఒక్కవ్యక్తి తయారై తేచాలు, వాటివల్ల కలిగే మిగతా నష్టమంతను గురించీ బాధపడనవసరంలేదని కొందరి వాదన. ఆ మిగతా నష్టమంతా తప్పనిసరి అయినదిగా నిరూపిస్తే, నేనుకూడా నిశ్చింతగా ఆ వాదనతో ఏకీభవిస్తాను. ఆనష్టాన్ని ఈవరలోగాని, ఈ నిమిషాన్నిగాని తొలగించడానికి ఏలున్నదని నేను స్పష్టపరిచానని భావిస్తాను. అంతే కాక, ఒక బోసుగారిని సృష్టించగలగడం అనేది ఈవాదనికి సహకరించదు. ఏమంటే, బోసుగారు ప్రస్తుత విద్యావిధానానికి ఫలితంగా ఉద్భవించలేదు. దీనియొక్క విపరీతమైన ప్రతిబంధకాలను జయించి ఆయన పైకి లేచాడు. అయినా

ఆయన విజ్ఞానం సుమారుగా ప్రజాసామాన్యానికి అందజేయ డానికి అసమర్థమైపోయిందికూడా. ఆంగ్లభాష వస్తేగాని ఎవరూ బోసంతటివారు కాలేరనే భావంకూడా మనకు ఏర్పడిపోయింది. ఇంతకంటె మూర్ఖమైన విశ్వాసాన్ని నేను ఊహించుకోలేను. మనలో వున్నలాంటి ఈ నిస్సహాయ భావం జపాను దేశీయులలో ఎక్కడా కనిపించదు.

ఏమైనాసరే, బోధన భాషావిషయంలో మాత్రం వెంటనే మార్పు తీసుకురావాలి; ప్రాంతీయ భాషలకు వాటి ఉచిత స్థానం వెంటనే లభింపజేయాలి. దిన దిన ప్రవర్ధమానంగా పెరిగిపోతూవున్న యీ నష్టాన్ని వెంటనే అరికట్టే నిమిత్తం మన ఉన్నత విద్యావిధానంలో తాత్కాలికంగా అరాజక పరిస్థితి ఏర్పడినా నేను లెక్కచేయను.

ప్రాంతీయ భాషల తాహతును, విలువను పెంచే నిమిత్తం ఆయా ప్రాంతీయములైన న్యాయస్థానాలలో ఆయా ప్రాంతీయ భాషలనే వాడవలెనని నా అభిప్రాయం. ప్రాదేశిక శాసన సభలలోని కార్యకలాపాలు ఆ ప్రాదేశిక భాషలో గాని, అది పలుభాషలతో కూడిన ప్రదేశమైనచో ఆ భాష లన్నిటిలోగాని నడిపింపబడాలి. ప్రాదేశిక శాసనసభలు, కొంచెం శ్రమపడితే, ఆయా ప్రాదేశిక భాషలను ఒక నెల రోజుల గడువులో అర్థంచేసుకునేస్థితికి రాగలవని నా సూచన. ఉదాహరణకి ఒక తమిళుడు, తన భాషఅగు తమిళమునకు చేరిక అయిన తెలుగు, మళయాళం, కన్నడం భాషల

గొక్క ప్రాథమిక వ్యాకరణమున్నూ, ఆ భాషలలోని కొలది వందల మాటలను వశంవదం చేసుకొనడానికి పూనుకుంటే, అది దుర్ఘటం కాదని భావిస్తాను. కేంద్రంలో మాత్రం హిందూస్థానీకే ప్రాధాన్యం ఉండాలి.

నా అభిప్రాయంలో ఇది విద్యాశాస్త్రజ్ఞులు నిర్ణయించవలసిన విషయం కాదు. ఒక ప్రాంతపు బాలబాలికలకు ఏ భాషలో విద్యాబోధనం జరగవలసినది అనే విషయం వారు తీర్మానించలేరు. ఆ ప్రశ్న ప్రతి స్వతంత్ర దేశంలోను ఈవరకే పరిష్కారం పొందివున్నది. ఏయే విషయాలు బోధించబడాలి అనే విషయమున్నూ వారు నిర్ణయించలేరు. అది వారు ఏ దేశానికి చెందుతారో ఆ దేశ పరిస్థితులను బట్టి వుంటుంది. ఒక దేశపు కోరికపైన ఆధారపడిన విద్యాపద్ధతిని చక్కగా అమలుపరచడానికి తోడ్పడటమే విద్యావేత్తల కార్యము. మన దేశం నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందినప్పుడు బోధన భాషాసమస్య ఒకే ఒక విధంగా నిర్ణయింపబడుతుంది. దాని ప్రకారం విద్యావేత్తలు పఠనాంశ వివరణాన్ని ఏర్పరచి, పాఠ్యపుస్తకములను తయారుచేస్తారు. ఇప్పటి విద్యార్థులు ఏరీతిగా మన వైదేశిక పాలకులయొక్క అవసరాలను తీరుస్తున్నారో అట్లే స్వతంత్ర భారతంలోని విద్యార్థులున్నూ స్వదేశపు అవసరాలను తీర్చుటకు యోగ్యమైన రీతిగా తయారౌతారు. విద్యాధికుల వర్గానికి చెందిన మనం ఈ సమస్యను తేలికగా

పాటించినంతకాలం, మనం కలలుగనే ఆరోగ్యవంతమూ స్వతంత్రమూ అయిన భారతదేశాన్ని నిర్మింపజాలమని నా భయం. విద్యావిషయికమూ, ఆర్థికమూ, సాంఘికమూ, రాజకీయమూ అయిన బంధనాలనుండి మనం విడివడి ముందంజ వేయవలెనంటే మనం ఎంతైనా శ్రమపడవలసి వుంటుంది. మనం ఈ విషయాలలో తగినంత శ్రమపడితే, మన స్వాతంత్ర్య సమరంలో ముప్పాతికపాలు జయం మనకు హస్తగతమైనట్లే భావించవచ్చును.

హరిజన్: 9-7-'38.

అధ్యాయం ౬౫

మనకు సంక్రమించిన భారత సంస్కృతి

మనం అడ్డుగోడలు కట్టుకొని, సంకుచితత్వాన్ని అలవరచుకోవలెననే భావం నాకేమాత్రమూ లేదు. అయితే, ముందుగా మన సంస్కృతిని అవగాహన చేసుకొని అలవరచుకున్న పిమ్మటనేగాని మనకు ఇతర సంస్కృతులను అవగాహన చేసుకునే అర్హతకలగదని మాత్రం నేను సవినయంగా వాదిస్తాను. మన సంస్కృతిలో గర్భితమైవున్నంత పెన్నిధి ఇతరమైన ఏ సంస్కృతిలోనూ లేదని నా దృఢవిశ్వాసం. మనం దానిని తెలిసికొనివుండలేదు. దానిని హేయంగా చూచునట్లును, దాని విలువను తృణీకరించునట్లును, కూడా మనం తయారుచేయబడివున్నాము. దానిని జీవితంలో అను

సరించడంకూడా సుమారుగా మానివేశాము. ఆచరణతో సంబంధంలేని కేవల మానసికజ్ఞానం రాసాయనిక ప్రక్రియల ద్వారా భద్రపరచబడిన మృతశరీరం లాగున కనులకింపుగా కనిపించవచ్చునేగాని, హృదయానికి ఆవేశాన్ని ఉదాత్తతను ఒసగే గుణమేమీ అందులోవుండదు. నా మతధర్మము ఒకవైపున సంఘం సజీవంగా వుండవలెనంటే, స్వసంస్కృతిని అలవరచుకొని అనుసరించడం అవసరమని ఏవిధంగా ప్రభోధిస్తుందో, అదేవిధంగా మరొకవైపున పరసంస్కృతులను తూలనాడి తృణీకరించరాదనికూడా బోధిస్తుంది.

యంగిండియా. 1-9-'21.

భారతదేశంలో కోట్లాది, భారతీయ జీవితంమీద తమ ప్రభావాన్ని నెరపి, తాామున్నా భారతీయ జీవిత ప్రభావానికిలోనైన వివిధ సంస్కృతులను సమరసభావంతో స్వీకరించడం మన సంస్కృతియొక్క లక్షణం. భారత సంప్రదాయానుసారమైన ఈ సామరస్యసూత్రం ప్రకారం ఆయా సంస్కృతులన్నీ తత్తదుచితస్థానాలను పొందుతాయి. మన సంస్కృతి అమెరికా దేశపు సంస్కృతివలె ఒక ప్రధాన సంస్కృతి. మిగిలినవాటన్నిటినీ మింగివేసే విధానాన్ని అనుసరించివుండదు. ఈ పద్ధతివల్ల కృత్రిమమూ, బలాత్కృతమూ అయిన ఐక్యత సిద్ధించవచ్చునేగాని సామరస్యం చేకూరదు.

యంగిండియా. 7-11-20.

ప్రస్తుత కాలానుగుణమైన నవభారత సంస్కృతి ఇంకా పరిణామస్థితిలో వున్నది. ఈనాడు పరస్పర వైరుధ్యంతో కూడివున్నట్లు కనిపించే సంస్కృతు లన్నింటిని సమీకరణమొనర్చే ఒక రూపాన్ని సృష్టించే విషయమై మనలో చాలామంది కృషిచేస్తున్నారు. సంకుచితభావంతో తనకు తానుగా వుండవలెనని ప్రయత్నించే సంస్కృతి ఏది గాని నిలబడలేదు. ఈనాడు భారతదేశంలో పరిశుద్ధమైన ఆర్యసంస్కృతి అనేది ఎక్కడాలేదు. ఆర్యులు కేవలము భారతదేశోద్భవులా లేక బలవంతంగా ఇక్కడ ప్రవేశించారా అనే విషయం నాకు ముఖ్యం కాదు. నా పూర్వీకులు ఒండొరులతో స్వేచ్ఛగా కలిసిమెలిసి సంలీనమై జీవించారనే విషయమూ, ఈ కాలానికి చెందిన మనం ఆ సమ్మేళనంయొక్క ఫలితంగా జనించి వున్నామనే విషయమూ మాత్రమే నాకు ముఖ్యం. మనం మన జన్మభూమి అయిన దేశమునకు, మనకు ఆధారభూతమైన ఈ అల్పమైన భూమిగోళమునకు ఏమాత్రమైనా మంచి చేస్తున్నామా, లేక భారమౌతున్నామా అన్న విషయాన్ని భవిష్యత్తే నిరూపించవలసి వుంటుంది.

హరిజన్, 9-5-'36.

అధ్యాయం ౪౮

నవీన విద్య

ఇతర దేశాలకు ఏది అనుగుణమైనప్పటికిని నూటికి ఎనభై మందికి పైగా వ్యవసాయదారులూ, మిగిలిన పది మంది మాత్రమే పారిశ్రామికులూ అయిన జనాభాతో కూడిన భారతదేశంలో మాత్రం పిల్లలకు కేవలం భాషా జ్ఞానంమీద ఆధారపడే విద్యనే గరపి, పెద్దయినాక వారు కాయకష్టంతో కూడిన పనులకు పనికిరానివారుగా అగునట్లు చేయుట గొప్ప నేరమని తలుస్తాను. నిజానికి నా అభిప్రాయం ప్రకారం మనం భుక్తిసముపార్జనకోసం కాయకష్టపడటం లోనే ఎక్కువకాలం గడపవలసివున్నందువల్ల, మన పిల్లలకు చిన్ననాటినుంచీకూడా అట్టి కాయకష్టాన్ని గౌరవప్రదంగా భావించి అభ్యాసంచేయడం అవసరం. మన పిల్లలకు కాయ కష్టాన్ని హేయంగాచూసే రీతిగా విద్యగరపకూడదు. ప్రస్తు తంలో వలె ఒక రైతుబిడ్డ స్కూలువిద్య అభ్యసించిన ఫలి తంగా పొలం పనులు చేయడానికి పనికిరానివాడుగా తయారు కావలసిన పనిలేదు. స్కూళ్లలో చదువుకునే మన పిల్లలు కాయకష్టంతోకూడిన పనులను హేయంగా భావించడం, లేదా కనీసం అట్టి పనులుచేయుటకు అయిష్టత చూపడం చాలా శోచనీయమైన విషయం.

యంగిండియా, 1-9-21.

తిండిలేక మలమలమాడే లక్షలాది జనాభాతోకూడిన మన దేశంలో, ప్రాథమికవిద్య గాని, వయోజనవిద్యగాని

తెలివితేటలతో గ్రామికకార్యాలు చేసుకొనడం నేర్పేదిగా వుంటే ప్రస్తుతానికి చాలునని నా అభిప్రాయం ... ... చేతి పనులలో కౌశలం గరపిన పిమ్మటనే భాషాధారమైన విద్య గరపబడాలి. ఎందువల్లనంటే, చేతులు ఉపయోగించి పని చేయగలగడమే మనిషికీ జంతువుకీ భేదాన్ని తెలుపుతుంది. వ్రాతా, చదువు వస్తేనేగాని మానవుని పూర్ణపరిణతి సాధ్యంకాదని భావించడం ఒక మూఢవిశ్వాసం. భాషా జ్ఞానం జీవితానికి శోభగూరుస్తుందన్నమాట నిశ్చయమే గాని, అది మనిషియొక్క నైతికమూ, భౌతికమూ, ఆర్థికమూ అయిన పురోగతికి తప్పనిసరిగా అవసరంకాదు.

హరిజన్, 8-3-'35,

చేతులు, కాళ్లు, కళ్లు, చెవులు, ముక్కు మొదలైన శరీరావయవములను చక్కగా ఉపయోగించే అభ్యాస శిక్షణముల ద్వారానే, నిజమైన మనశ్శక్తులకు సంబంధించిన విద్య చేకూరగలదని నా అభిప్రాయం. అనగా, పిల్లవాడు తన శరీరావయవములను నైపుణ్యంతో ఉపయోగించడం ద్వారా వాని మానసిక వికాసం వేగంగా జరుగుతుందని నా నమ్మకం. కాని శారీరికమూ మానసికమూ అయిన పరిణతి ఆత్మయొక్క వికాసంతోకూడా సమాన స్థాయిని నడవని పక్షంలో, మొదటి రెండును అసమర్థమూ, అసమాప్తమూ అయిపోతాయి. ఆధ్యాత్మిక శిక్షణమనగా హృదయ సంబంధమైన విద్య అని నాభావం. బాలుని మానసిక శిక్షణము వానియొక్క దైహిక, ఆధ్యాత్మిక శక్తులయొక్క

శిక్షణముతోపాటుగా జరిగినప్పుడే, వానికి సర్వతోముఖమైన మానసికపరిణతి ఏర్పడగలుగుతుంది. అవి మూడును విడదీయరాని సంబంధముగల ఒకే ఒక వస్తువు. ఈ సిద్ధాంతం ప్రకారం చూస్తే, వాటిని వేరు వేరుగాను, ఒకదాని కొకటి సంబంధం లేనివిగాను పెంపొందించవచ్చుననుకోడం గొప్ప (fallacy) హేత్వాభాసంగా గోచరించగలదు.

హరిజన్, 8-5-'37.

దేహము, మనస్సు, ఆత్మలయొక్క వివిధములైన శక్తులమధ్య సముచితమైన సహకార సామరస్యాలు లేకపోవుటవలన కలిగే దుష్ఫలితాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అవి మన చుట్టూ వ్యాప్తమై ఉన్నాయి, మనం ప్రస్తుతం వశులమైపోయి వున్న భావవైపరీత్యంవల్ల వాటిని గమనించే శక్తిని మనం కోల్పోయాం.

హరిజన్, 8-5-'37.

మనిషంటే ఉత్త మేధశ్శక్తిగాని, పశుప్రవృత్తులతో కూడిన కేవల దేహంగాని, కేవలం హృదయం లేక ఆత్మగాని కాదు. పూర్ణమైన మానవవ్యక్తిత్వసిద్ధికి ఈ మూడింటియొక్క సమంజసమూ, సామరస్యపూర్వకమునూ అయిన సమ్మేళనం అవసరం. అదే లాభదాయకమైన విద్యావిధానం.

హరిజన్, 8-5-'37.

ఒక బాలునిలోగాని ఒక మనిషిలోగాని— ఆతని దేహము, మనస్సు, ఆత్మలయొక్క— సర్వతోముఖశక్తులను

బహిర్గతంచేయడమే విద్య అని నేను భావిస్తాను. అక్షరాస్యత విద్యకు అంతమూ కాదు, ఆదీ కాదు. అక్షరాస్యత ఒక్కటే విద్య అని అనిపించుకోదు. నేను పిల్లలవిద్యను వారికి ఏదో ఒక ప్రయోజనకరమైన చేతిపనిని నేర్పుటతో ప్రారంభిస్తాను; శిక్షణారంభంనుంచీ వస్తువులను తయారు చేయగలిగేలాగ చూస్తాను. అట్టి విద్యావిధానం ద్వారానే మనస్సు యొక్క, ఆత్మయొక్క ఉచ్చతరమైన పరిణతి సాధ్యంకాగలదని నా నమ్మకం. అయితే, ఇప్పటివలె అజ్ఞానంగా చేయడంకాదు నేర్పవలసినది; శాస్త్రయుక్తంగా నేర్పాలి. అంటే, ప్రతి కార్మిక ప్రక్రియయొక్కయు కీలకములు, వీలుచాళ్లు అన్నీ బాలునికి బోధపరుస్తూ నేర్పాలి,

హరిజన్, 31-7-37,

నా విధానం ప్రకారం చేతితో అక్షరాలను దిద్దడమూ వ్రాయడమూ అభ్యసించుటకు ముందు చేతితో పనిముట్లను ఉపయోగించడం నేర్పుతాను. కళ్లు లోకములో ఇతర వస్తువులను చూచి తెలుసుకున్నట్లే అక్షరముల యొక్కయు, వాక్యములయొక్కయు చిత్రములను చూచి చదవడం నేర్చుకుంటాయి; చెవులు వస్తువులపేర్లను, అర్థాలను, వాక్యాలను విని గ్రహిస్తాయి. అటువంటి శిక్షణం సహజమైనది, ఆకర్షణీయమైనది అగుటచేత అతి త్వరితమైనది, లోకంలోకెల్లా తక్కువ ఖర్చుతో కూడినదికూడా అయి వుంటుంది.

హరిజన్, 28-8-37.

ఆ పరిశ్రమాశిక్షణం స్కూలులోని ప్రదర్శనశాలలో వుంచడానికి మాత్రం పనికివచ్చే వస్తువులను, లేక విలువ లేని ఆటబొమ్మలను తయారుచేయునదిగా వుండకూడదు. అమ్మకానికి పనికివచ్చే వస్తువులను తయారుచేయునదిగా వుండాలి. పిల్లలచేత ఈ వస్తువులను, ఫ్యాక్టరీల ప్రారంభ దశలో కొరడాలతో కొట్టి బలవంతంగా చేయించినరీతిగా చేయించకూడదు. అది వాళ్లకు సంతోషకరంగాను, తమ మనస్సులకు ప్రకోపించునదిగాను ఉండుటవల్లనే వారా పనులు చేస్తారు

హరిజన్, 21-9-'37.

భారతదేశంలో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా విధానం అమలుకావలెననే సూత్రాన్ని నేను దృఢంగా నమ్ముతాను. పిల్లలకు ప్రయోజనకరమైన వృత్తి విద్యను నేర్పి, దానిని వారి మానసిక, దైహిక, ఆధ్యాత్మిక శక్తులను పెంపొందించే సాధనంగా వినియోగించడం ద్వారా మాత్రమే ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టగలమనికూడా నా నమ్మకం. రోజురోజూ అధికాధికంగా మన గ్రామీణులను ఆవరిస్తూవున్న వినాశనాన్ని ఈపద్ధతివల్ల అరికట్టగలుగుతాం. కలవారికీ లేనివారికీ మధ్య అసహజమైన భిన్నభావం లేనటు వంటి న్యాయతరమైన సాంఘికనిర్మాణానికి పునాది వేయ గలుగుతాం. తద్వారా ప్రతి వ్యక్తికీ జీవించడానికి సరిపడే కూలి, స్వాతంత్ర్యహక్కులు నిష్కర్షగా కలుగుతాయి.

హరిజన్, 9-10-'37.

నూలువడకడం, దూది ఏకడం వగైరా గ్రామీణ మైన చేతిపనులపైన ఆధారపడిన ప్రాథమిక విద్యావిధానాన్ని అమలుపరిచే నా ప్రణాళిక సుదూరభవిష్యత్తులో గొప్ప మార్పులను చేకూర్చే, ప్రశాంత సాంఘిక విప్లవానికి ప్రథమ సోపానంగా సృష్టించబడింది. అది నగరాలకు గ్రామాలకు మధ్య ఎక్కువ ఆరోగ్యవంతమైన నైతికానుబంధాన్ని చేకూర్చగలదు. తద్వారా ప్రస్తుతం సంఘంలో ద్యోతకమయ్యే ఆర్థికమైన అస్థిరత్వమూ వర్గాల నడుమ కనిపించే విద్వేషభావమూ అనే చెడుగులను నిర్మూలించుటకు కూడా వీలవుతుంది.

హరిజన్, 9-10-'37.

అధ్యాయం ౬౩

బేసిక్ విద్యావిధానం

ఈ విద్యాపద్ధతి గ్రామీణుల పిల్లలను ఆదర్శప్రాయమైన గ్రామస్థులుగా చేయుటకు ఉద్దేశింపబడినది. ఇది ప్రధానంగా వాటికి అనుగుణమైన రీతిగా ఏర్పాటు చేయబడినది. దీనికి ప్రోద్బలం గ్రామజీవితంనుంచే కలిగివున్నది... బేసిక్ విద్యావిధానం పిల్లలకు— వారు నగరవాసులైనా, గ్రామవాసులైనా సరే— భారతదేశంలోని ఉత్తమమూ, శాశ్వతమూ అయిన సంప్రదాయములతో అనుబంధం కలిగిస్తుంది. అది శారీరకంగానూ, మానసికంగానూ కూడా

ఉన్నత పరిణతి చేకూరుస్తుంది. పిల్లలకు జన్మభూమిలో వ్రేళ్లుపాతుకొనునట్లుగా చేస్తుంది. వారిలో భవిష్యత్తును గూర్చిన ఉత్కృష్టస్వప్నాలను రేకెత్తించి, విద్యాభ్యాసారంభంనుంచీ వారు దానిని రూపొందించుటలో పాల్గొనునట్లుగా చేస్తుంది.

నిర్మాణకార్యక్రమం, పే 15-16.

పిల్లలకు చేతిపనులద్వారా శారీరికంగానూ, మానసికంగానూ పరిణతమొనర్చడమే బేసిక్‌విద్యకు ఆదర్శము. అంతేకాక, నా అభిప్రాయంలో విద్యావిధానదృష్ట్యా సక్రమమైన ఏ ప్రణాళికనుగాని సమర్థతతో నిర్వహించినచో అది ఆర్థికంగాకూడా లాభకరంగా వుండితీరుతుంది. ఉదాహరణకి - మన పిల్లలచేత మట్టిబొమ్మలు చేయించి, తర్వాత వాటిని చెత్తలో పారవేయనచ్చును, అదీ మానసిక పరిణతిని చేకూరుస్తుంది; కాని అది మానవ శ్రమనుగాని, ద్రవ్యాన్ని గాని ఏవిధమైన ప్రయోజనంగాని, లాభంగాని లేనిరీతిగా ఎన్నడూ వినియుక్తం చేయరాదనే ప్రధాన నైతికసూత్రాన్ని వ్యతిరేకించిన దవుతూంది. ప్రతివ్యక్తీ తన జీవితంలో ప్రతి నిమిషమూ ప్రయోజనకరంగా గడుపవలసి వున్నదనే సూత్రానికి ప్రాముఖ్యత నొసగడమే పౌరసత్వానికి అర్హత కలిగించే ఉత్తమవిద్య అవుతూంది; దానికితోడు అది బేసిక్ విద్యను స్వయంపోషకంగా కూడా చేస్తుంది.

హరిజన్, 6-4-40.

ఇప్పుడు మనం బేసిక్ విద్యయొక్క మూలసూత్రా లేమిటో పరికిద్దాం :

1. ఏ విద్యగాని సత్యమైనదైతే స్వయంపోషకమై నదిగా వుండాలి. అనగా విద్యపూర్తి అయేసరికి, మూలధనం అలావుండగా, తన ఖర్చును తాను భరించగలిగినదై వుండాలి.

2. విద్య ముగిసేవరకుకూడా చేతులయొక్క కౌశలము వినియుక్తం కావాలి. అనగా, విద్యార్థులు ప్రతిదినం కొంత సేపు హస్తకౌశలంతోకూడిన పరిశ్రమ నెరవేర్చాలి.

3. విద్య అంతా ప్రాంతీయభాషలోనే నేర్పాలి.

4. ఈ విధానంలో వర్గీయమైన మతవిషయిక శిక్షణకు స్థానంలేదు; మౌలికమూ, విశ్వజనీనమూ అయిన నైతిక శిక్షణకు పూర్తిగా అవకాశం వుంటుంది.

5. ఈ విధానంద్వారా విద్య నభ్యసించేవారు పిల్ల లైనా పయోజనులైనా, బాలురైనా బాలికలైనా, వారు అభ్యసించిన విద్య వారివారి గృహాలలో వ్యాప్తిపొందగలిగి నదై వుండాలి.

6. ఈ పద్ధతిని విద్యాభ్యాసంపొందే లక్షలాది విద్యార్థు లంతా తాము భారతదేశ మంతటికీ చెందినవారుగా భావించుకుంటారు కనక, వారొక అంతర రాష్ట్రభాషను నేర్చుకుని వుండాలి. అట్టి అంతరరాష్ట్రభాష నాగరిలిపిలో గాని ఉర్దూలిపిలోగాని వ్రాయబడే హిందూస్థానీభాష

ఒక్కటే. కావున విద్యార్థులు పై రెండు లిపులను కూడా నేర్వాలి.

హరిజన్, 2-11-47.

మన దేశంవంటి పేదదేశంలో దైహిక పరిశ్రమా విధానాన్ని ప్రవేశపెట్టడం రెండు విధాలుగా ఉపయుక్తం అవుతూంది. ఒకవంక, అది మనపిల్లల చదువు ఖర్చును ఆర్జిస్తుంది. రెండవవంక, ముమ్ముందువారు తమకు ఇష్టమైతే జీవనోపాధికి వినియోగించుకొనుటకు పనికివచ్చే ఒక వృత్తి విద్యను ఒసగుతుంది. అట్టి పద్ధతి మనపిల్లలకు స్వయంపోషక శక్తిని చేకూరుస్తుంది. శ్రమఅంటే హేయంగా చూడడం అనేదే జాతీయ నైతిక బలాన్ని అన్నిటికన్నా ఎక్కువగా క్రుంగదీస్తుంది.

యంగిండియా, 1-9-21.

అధ్యాయం ౪౮

ఉన్నత విద్య

నేనైతే కళాశాలా విద్యావిధానాన్నంతను దేశం యొక్క అవసరాలకు అనుబంధించి వుండేలాగున పూర్తిగా మార్చివేస్తాను. మెకానికలు, తదితర ఇంజనీర్లకు డిగ్రీలు వుంటాయి. వారు వివిధములైన పరిశ్రమలకు అనుబంధించి వుంటారు. ఆయా పరిశ్రమాసంస్థలు తమ అవసరాలకు కావలసిన ఆ విద్యార్థులయొక్క శిక్షణ ఖర్చులను భరించవలసివుంటుంది. ఆవిధంగా టాటా కంపెనీవారు ఇంజనీర్లకు

శిక్షణ ఒసగే కాలేజీని ప్రభుత్వపర్యవేక్షణక్రింద నడిపించి, దాని ఖర్చును భరించగలరు; అట్లే మిల్లు పరిశ్రమల సంఘములున్నూ తమకు కావలసిన ఉన్నత విద్యార్థులకు శిక్షణ ఒసగే కాలేజీలను తమ ఉమ్మడి ఖర్చుతో నడుపుకుంటారు.

మిగతా పరిశ్రమ లన్నింటి విషయంలోనుకూడా ఈ పద్ధతే నడుస్తుంది. ఇంక మిగిలేవి కళావిద్యలు (Arts) వైద్యశాస్త్రం, వ్యవసాయం. ప్రస్తుతం ప్రజలచే నడుపబడే కళాశాలలు చాలామట్టుకు స్వయంపోషకంగానే ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం స్వయంగా అట్టి కళాశాలలను నడుపవలసిన పనిలేదు. మెడికల్ కాలేజీలు ప్రభుత్వామోదంపొందిన ఆస్పత్రులకు అనుబంధింపబడి వుంటాయి. వైద్యవిద్యఅంటే ధనికులకు మోజు అధికంగావుంది కనక, ఆకాలేజీలను వారు ఇష్టపూర్తిగా విరాళాలొసగి పోషించగలరని ఆసించవచ్చును. వ్యవసాయ విద్యాలయాలు, తమ పేరు సార్థకపరచుకొనదలిస్తే, తప్పనిసరిగా స్వయంపోషకంగా వుండితీరాలి. వ్యవసాయ విద్యలో ఉత్తీర్ణులైన కొందరిని చూచి నేను చాలా బాధపడ్డాను. వారి జ్ఞానం ఉత్త పైమెరుగులాగే కనిపించింది. వారికి అనుభవజ్ఞానం ఏమాత్రమూ లేదు. వారే కనక దేశావసరాలను తీర్చే స్వయంపోషకములైన వ్యవసాయ కేంద్రాలలో తరిఫీదు పొందివున్నచో, డిగ్రీలుపొందిన తర్వాత తమకు ఉద్యోగాలిచ్చినవారిని దండుగపరచి అనుభవం ఆర్జించవలసిన అవసరముండదు.

హరిజన్, 31-7-'37

ప్రభుత్వ విశ్వకళాపరిషత్తులు (State Universities) కేవలం పరీక్షలు జరుపుటకు ఉద్దేశింపబడినవై, పరీక్ష రుసుముల ద్వారా స్వయంపోషకములై వుండాలి.

విశ్వకళాపరిషత్తులు (Universities) విద్యారంగమంతటిపైనను పర్యవేక్షణాధికారం కలిగివుండి, వివిధ విద్యా శాఖలద్వారా విద్యాప్రణాళికలను తయారుచేయించి, వాటిని ఆమోదిస్తాయి. ముందుగా ఆయా యూనివర్శిటీలు అనుమతి పొందితే తప్ప ప్రయివేటు కాలేజీ లేవీ నడిపించబడకూడదు. తగిన యోగ్యత, నిజాయితీకలిగిన వ్యక్తులతోకూడిన సంఘాలకు యూనివర్సిటీని స్థాపించే శాసనానుమతి సులభంగా ఒసగుతుండ వచ్చును; అవి ప్రభుత్వాఖర్చుపై ఆధారపడకుండామాత్రం నడవాలి. ప్రభుత్వం ఒక్క కేంద్ర విద్యా శాఖను మాత్రమే నడుపుతుంది.

క్రొత్త యూనివర్సిటీలు :

వివిధ రాష్ట్రాలలోను క్రొత్త విశ్వవిద్యాలయాలను స్థాపించాలనే వ్యామోహం ప్రబలుతూవుంది. గుజరాత్ గుజరాతీలకు, మహారాష్ట్రం మరాఠీలకు, కర్నాటకం కన్నడులకు, ఒరిస్సా ఒరియాలకు, అస్సాం అస్సామీయులకు, ఇంకా వగైరా, వగైరా, ఆయా ప్రాంతీయ భాషలూ, వాటిని మాట్లాడేవారూ పూర్ణవికాసం పొందవలెనంటే అటువంటి యూనివర్సిటీలు వుండడం అవసరమనే నా నమ్మకమున్నూ.

అయితే ఆ ఆశయాన్ని పొందే విషయంలో మనం కొంచెం అతి తొందర చూపుతున్నామేమో అనిమాత్రమే నా భయం. దీనికిముందుగా అమలుకావలసిన మొదటిమెట్టు రాజకీయ రంగంలో భాషాప్రయుక్తమైన రాష్ట్రపునర్విభజనం జరగడం. అప్పుడు ఆయా ప్రత్యేకపాలనసంస్థలు ఎట్లాగా యూనివర్సిటీలు లేనిచోట్ల క్రొత్తవాటిని స్థాపించడానికి పూనుకుంటాయి.

క్రొత్త యూనివర్సిటీలు నెలకొల్పడానికి ముందు తదనుకూల పరిస్థితులు కొన్ని ఏర్పడడం అవసరం. వాటికి అనుబంధించబడేందుకు ఆయా ప్రాంతీయ భాషల ద్వారా విద్యాబోధనం చేసే స్కూళ్లు, కాలేజీలు ఏర్పడి వుండాలి. అప్పుడే వాటికి తగిన వాతావరణం కలుగుతుంది. యూనివర్సిటీ అనేది శిఖరం వంటిది. ఉన్నతమైన శిఖరం బలమైన పునాది వుంటేనేగాని నిలవదు.

మనం ఇప్పుడు రాజకీయంగా స్వతంత్రులమైనా, ఇంకా పాశ్చాత్యప్రభావ వశత్వం మనల్ని సూక్ష్మరూపంలో ఆవరించియే వున్నది. జ్ఞానం ఒక్క పశ్చిమంనుంచే దిగి రావలసివున్నదని నమ్మే రాజకీయజ్ఞుల కూటానికి నేను చెప్పవలసినదేమీ లేదు. అయినా పశ్చిమ ప్రపంచంనుంచి వచ్చే మంచి ఏమీ లేనేలేదనే అభిప్రాయాన్ని నేను ఒప్పుకోను. ఈ విషయాన్ని గురించి మనం ఇంకా సరియైన నిర్ధారణకు రాలేదేమో అనిమాత్రం అనుకుంటాను. నైదేశిక ప్రభుత్వ

వశంనుంచి రాజకీయంగా మనం విముక్తి పొందగానే వైదే శిక భాషా భావాల సూక్ష్మప్రభావాన్నుంచి కూడా అప్పుడే విముక్తిపొందామని ఎవరూ వాదించబోరని ఆసిస్తాను. మనం వివేకంతో వర్తించవలెనన్నా, దేశంయెడల విధ్యుక్తధర్మాన్ని సరిగా నెరవేర్చవలెనన్నా, కొత్తవిశ్వవిద్యాలయాలనుస్థాపించ బోయేముందు మనం కొంచెంఆగి, మనంకొత్తగా పొందిన స్వాతంత్ర్యపు ప్రాణవాయువుతో మన ఊపిరితిత్తులను నింపు కొనడం మంచిదికదా? యూనివర్సిటీ అనేదానికి గంభీరమైన భవనశ్రేణిగాని, వెండి బంగారు నిధులుగాని అవసరంలేదు. దానికి ముఖ్యమైన అవసరం వివేకవంతమైన ప్రజాభిప్రాయ బలం. అవసరమైనవారిని వినియోగించుకొనడానికి తగినంత ఉపాధ్యాయులబలగంకూడా అందుబాట్లోవుండాలి. స్థాపకులు దూరదృష్టికలవారై వుండాలి.

నా అభిప్రాయంప్రకారం ప్రజాస్వామ్య ప్రభుత్వంలో విశ్వకళాపరిషత్తుల స్థాపనకు ప్రభుత్వఖర్చు వినియోగించ నవ సరంలేదు. అవి కావాలని ప్రజలుకోరుకుంటే వాటివ్యయాన్ని వారేభరించగలరు. ఆ విధంగా స్థాపితమైన విశ్వకళాపరి షత్తులు తాము ప్రాతినిధ్యంవహించే దేశానికి ఆభరణాయ మానంగా వెలుగొందుతాయి. పరిపాలనపరాయివారి చేతు లలో వున్నచోట ప్రజలకు ఏమిలభించినా అది పైనుంచేదిగి వస్తుంది; అందువల్లవారు అధికాధికంగా పరాధీనులై పోతారు. అది ప్రజాభీష్టమనే విశాలమైన పునాదిమీద

నిలచినచోట ప్రతీది అడుగునుంచి పైకి పెరుగుతుంది ; అందు వల్ల అది నిలకడగా నిలుస్తుంది. అది సుందరరూపంగా పెంపొంది ప్రజలకు బలమొసంగుతుంది. అట్టి ప్రజాస్వామికప్రణాళికలో విద్యాభివృద్ధినిమిత్తం వ్యయపరచినధనం, సారవంతమైన నేలలో నాటిన విత్తు పుష్కలమైన పంటనొనగినరీతిగా, ప్రజలకు పదిరెట్లు ప్రతిఫలం ముట్టజెబుతుంది. పరాయిపాలనంలోస్థాపితమైన విశ్వకళాపరిషత్తులు దీనికికేవలం వ్యతిరేకమైన దారిని నడిచాయి. అలాకాక ఇంకోవిధంగావుండడం అసాధ్యమనుకుంటాను. కావున, భారతదేశం తన నూతనార్జితమైన స్వాతంత్ర్యాన్ని జీర్ణించుకొనేవరకు క్రొత్తవిశ్వవిద్యాలయాలను స్థాపించేవిషయములో జాగరూకత వహించవలెనని చెప్పడానికి తగినంత కారణమున్నదని గ్రహించవచ్చును.

హరిజన్, 2-11-'47.

వయోజనవిద్య :

వయోజనవిద్యాశిక్షణం నాచేతులలోవుంటే మొట్టమొదట తమదేశంయొక్క ఔన్నత్యాన్ని, వైశాల్యాన్ని వయోజనులమనస్సులకు అవగాహన అయేలాగ చేస్తాను. మన గ్రామస్థులకు భారతదేశాన్నిగురించిన పరిజ్ఞానం తమగ్రామపు పొలమేరను దాటినదై వుండదు. తాను ఇంకొక్కగ్రామం వెళ్లడం జరిగినప్పుడు అతడు తన గ్రామాన్ని గురించి మాత్రమే, అదే తనజన్మభూమిగా మాట్లాడుతాడు. అతని దృష్టిలో హిందూదేశమంటే భూగోళశాస్త్రపు ఒకపారి

భాషికపదం మాత్రమే. మనం గ్రామాలుఎంతఅజ్ఞానంలో మునిగివున్నదీ ఊహించుకోలేము. పరాయిపాలనమును గురించిగాని, దానివల్లకలిగే నష్టాలనుగురించిగాని వారి కేమి తెలియదు. దానినివదలించుకోవడం ఎలాగో వారికసలే తెలియదు. తమదౌర్భల్యంవల్లనే, పరిపాలనము తొలగించు కొనేశక్తి తమలోనే వున్నదనేవిషయం తాము ఎరగకపోవడం వల్లనే, విదేశీయ ప్రభుత్వం ఇక్కడ సాగజాలుతున్నదని వారికి తెలియదు. అందువల్ల వయోజనవిద్య విషయంలో నా మొదటిసూత్రం, వారికి నోటిమాటద్వారా నిజమైన రాజకీయపరిజ్ఞానం బోధచేయడమే......ఆనోటిబోధనాన్ని అనుసరించి వ్రాత, చదువుమీదఆధారపడే విద్యాబోధనం నడుస్తుంది. ఇదిఒకప్రత్యేకపద్ధతి. తక్కువకాలపరిమితిలో విద్యాబోధన జరపడానికిగాను ఇంకాచాలా రకాలపద్ధతులు ప్రయోగించబడుతూవున్నాయి.

నిర్మాణకార్యక్రమం, పే 16-17.

భారతదేశంలో కనిపించే సాముహికమైన నిరక్షరాస్యత సహించరాని పాపమున్నూ, లజ్జాకరమైనవిషయమున్నూకూడా. దానిని వెంటనేనిర్మూలించడానికి కృషిచేయాలి అయితే ఆఉద్యమంయొక్క ఆద్యంతాలు ఆక్షరజ్ఞానం ఒసగడంమాత్రమే కాకూడదు. ఉపయుక్తమైన జ్ఞానాన్నివారికి బోధిస్తూ దానితోపాటు అక్షరజ్ఞానంకూడా నేర్పాలి. చదవడం, వ్రాయడం, అంకెలుకూడడంతోకూడిన నిర్జీవ

మైన పుస్తకవిద్య, ఇప్పుడుగాని ఎప్పుడుగాని గ్రామస్థుని జీవితానికి శాశ్వతప్రయోజనాన్ని చేకూర్చదు. వారిదైనందిన జీవితానికి ఉపయుక్తమైన విజ్ఞానంవారికి ఒసగబడాలి. విద్యను వారిమీాదబలవంతంగా రుద్దకూడదు. దానిలో వారికిఅభిరుచి ఏర్పడాలి. ప్రస్తుతంవారు పొందేవిద్య వారికి అవసరమైనదీ కాదు, వారికి అర్థమయేదీకాదు. గ్రామస్తులకు గ్రామలెక్కలకుకావలసిన గణితజ్ఞానం, గ్రామసంబంధమైన భూగోళజ్ఞానం, గ్రామాలచరిత్రజ్ఞానం, వారికి దినజీవితంలోపనికివచ్చే భాషాజ్ఞానం, అనగా చదవడమూ, ఉత్తరాలువ్రాసుకోవడం మొదలైనపనులకు ఉపయోగించేవి నేర్పాలి. అట్టి విద్యాజ్ఞానాన్ని వారు విలువగాపాటించి స్మృతిలోవుంచుకుని, తర్వాత అంతకుమించిన జ్ఞానం అవగాహనచేసుకొనే స్థితికి వస్తారు. దైనికప్రయోజనాలకి ఏమీాసంబంధించని పుస్తక విద్య వారికి కేవలం నిరుపయోగం.

హరిజన్,22-6-'40.

మతవిషయక విద్య:

......ప్రభుత్వ విద్యాలయాలలో చదివేవిద్యార్థి సమూహంలో అత్యధికసంఖ్యాకులు ఏవిధమైన మతవిషయక శిక్షణముగాని లేకుండా బయటపడుతున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చును. ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యాసంస్థలలో కేవలం లౌకిక విద్యమాత్రమే ఒసగబడాలని ఉగ్గడించే వాదంకూడా వుందని నేనెరుగుదును. సుమారుగా ప్రపంచ మతాలన్నీ ప్రాతినిధ్యం పొందివున్నటువంటిదిన్నీ,

ఒకమతంలోనే అనేకములైనఉపశాఖలు ఏర్పడివున్నటువంటి దిన్నీఅగు భారతదేశంలో మతవిషయకమైన విద్యాశిక్షణం ఒసగేసందర్భంలో చాలా చిక్కులున్నాయనికూడా నాకు తెలుసుకాని భారతదేశం ఆధ్యాత్మిక దారిద్ర్యం పాలు కాకుండా వుండవలెనంటే మనయువకులకు కనీసం లౌకిక విద్యతో సమానంగాఅయినా మతవిషయకమైన విద్యాశిక్షణ ఒసగబడవలసి వుంటుంది. ఉత్త మతగ్రంథపరిజ్ఞానం మతం కాదన్నమాట నిజమే. కాని మతాన్ని మనం విద్యాలయాలలో బోధించలేకపోతే మనపిల్లలలోకనీసం తత్తుల్యమైన విలువలనైనా నాటుకొన జేయగలగాలి. విద్యాశాలలో మత విషయిక శిక్షణం ఒసగబడినా లేకున్నా, యుక్తవయస్కులైన విద్యార్థులు మత విషయంలోనూకూడా స్వయం సహాయం చేసుకునే కౌశలం అలవరచుకోవాలి. వారు స్వయంగా వక్తృత్వ సంఘాలనూ, నూలువడికే సమితులనూ నడిపించుకుంటున్నట్లే మత పరిజ్ఞానం పొందడానికి కూడా స్వయంగా తరగతులను నడిపించుకొనవచ్చును.

యంగిండియా, 25-8-27

మత శిక్షణానికి ప్రభుత్వం పూనుకొనగలదని గాని, నిర్వహించగలదని గాని నే ననుకోను. మతశిక్షణమును ఒసగవలసినపని మత సంఘాలే నెరవేర్చవలసి వున్నదని నా నమ్మకం. మతాన్నీ, నైతికశాస్త్రాన్నీ మనం ఒకదానితో ఒకటి కలిపివేయకూడదు. మౌలికమైన నైతిక సూత్రాలు అన్ని మతాలకూ సమానమే అని నా విశ్వాసం. ఆ మౌలిక నైతిక

సూత్రాలను బోధించడంమాత్రం నిస్సందేహంగా ప్రభుత్వ విధి అని, నేను భావిస్తాను. ఈ సందర్భంలో మతం అనే మాటను నేను, మౌలిక నైతిక సూత్రాలతో సమానార్థంలో కాక, కొన్ని కొన్ని పేర్లక్రింద చలామణీ అయ్యే మతము లనే అర్థంలోమాత్రమే ప్రయోగిస్తున్నాను. (State aided religion and a State Church) ప్రభుత్వ పోషితమతాల వలనను, ప్రభుత్వ స్థాపిత మతపీఠాలవలనను కలిగే సాధక బాధకాలను అనుభవించియే ఉన్నాము. తన మత స్థావరతకు కొంతగా గాని, పూర్తిగాగాని ప్రభుత్వ సహాయంమీద ఆధారపడివుండే ఏ సంఘంగాని, సమితిగాని నిజమైన మతాన్ని కలిగి వున్నదని గాని అందుకు అర్హత కలిగివున్న దనిగాని అనుకోడానికి వీలులేదు.

హరిజన్, 23-3-47.

మతవిషయికమైన శిక్షణ ప్రణాళికలో స్వీయమత సూత్రాలతోపాటు ఇతర మతముల మూలసూత్రాలుకూడా స్థానం పొందాలి. అందునిమిత్తం విద్యార్థులకు ప్రపంచ ప్రముఖ మతముల మూలసూత్రాలను గౌరవభావంతోటీ, విశాలమనస్కతతోటీ అర్థమూ, అవగాహన చేసుకునే అభ్యాసం కలిగించాలి. ఈ పని సక్రమంగా జరిగితే, అది వారికి ఆధ్యాత్మిక మనఃస్థైర్యమును, తమ మతధర్మాన్ని ఎక్కువ బాగా అర్థం చేసుకునే శక్తినీ చేకూరుస్తుంది..... ప్రముఖ మతాలనుగూర్చి తెలుసుకునే సందర్భంలో ఒక ముఖ్యసూత్రాన్ని మనసులో వుంచుకొనవలసి వుంటుంది;

ఆయా మతములందు విశ్వాసంకలవారు వ్రాసిన గ్రంథముల ద్వారానే ఆ మతములను గురించి తెలుసుకోవాలి.

యంగిండియా, 6-12-28.

పాఠ్య పుస్తకాలు :

ప్రభుత్వ పాఠశాలలలో ముఖ్యంగా చిన్నపిల్లలకు ఉపయోగింపబడుతూవున్న పాఠ్యపుస్తకాలు నా దృష్టికి కేవలం హానికరమైనవిగాను, లేనిచో చాలావరకు నిరుప యోగమైనవిగానూ కనిపిస్తాయి. వాటిలో చాలా పుస్తకాలు చాకచక్యంతో వ్రాయబడినవనడానికి సందేహం లేదు. అవి ఎవరికోసం వ్రాయబడినవో వారికీ వారియొక్క పరిసర పరిస్థితులకి చాలా అనుకూలమైనవే కావచ్చుననికూడా ఒప్పు కోవచ్చును. కాని అవి భారతదేశపు వాతావరణానికి గాని, భారతీయ బాలబాలికలకుగాని అనుకూలంగా వ్రాయబడినవి కావు. ఈ ఉద్దేశంతో వ్రాయబడిన వాటి విషయంలో కూడా, అవి మిడిమిడి జ్ఞానంతో వ్రాయబడినవిగాను, పిల్లల అవసరాలను నిర్వర్తించుటకు సరిపోనివిగాను వుంటున్నాయి.

అందువల్ల నేను పిల్లలకంటెముందు ఉపాధ్యాయుల యొక్క శిక్షణకు పుస్తకాలు అవసరమనే అభిప్రాయానికి వచ్చాను. అంతేగాక ప్రతి ఉపాధ్యాయుడును పిల్లలకు తృప్తికరంగా చదువు చెప్పవలెనంటే, తాను సేకరించిన విషయములనుంచి రోజూ తానే పాఠం తయారుచేసుకొన వలసి వుంటుంది. అందులోనూ అవి ఆయా తరగతుల అవ

సరాలకు సరిపడేలాగున చూసుకోవాలి. నిజమైన విద్య దానిని అభ్యసించే బాలబాలికలలో గర్భితమైవున్న ఉత్తమ శక్తులను వికసింపచేయగలిగినదై వుండాలి. కలగూరగంప వలె అనవసర వివరాలన్నీ పిల్లల తలలలోనికి ఎక్కించడం ద్వారా ఈపని జరగదు. అట్టి బోధనము నిర్జీవమైన బండ రాయిలా వారిలోని సృజనశక్తిని అణచివైచి, వారిని యంత్రసదృశంగా చేసేస్తుంది.

హరిజన్, 1-12-33

ఉపాధ్యాయులు :

ఉపాధ్యాయులు కేవలం ఆత్మపోషణకు కావలసినంతతో సంతృప్తిపొంది, విద్యాబోధనకార్యంపట్ల తమకుగల ప్రేమాభిమానాలవల్లనే పిల్లలకు విద్యగరపవలెననే సనాతన భావంలోనే నాకు నమ్మకం వుంది. రోమను క్యాథలిక్కు మతస్థులు ఈ భావాన్ని ఇంతవరకు నిలుపుకుని వున్నట్లు గోచరిస్తుంది; అందువల్లనే వారు నడిపించే విద్యాసంస్థలు ప్రపంచంలోకల్లా ఉత్తమమైన విద్యాసంస్థల శ్రేణికి చెందినట్టివిగా పేర్కొనవచ్చును. మన పూర్వఋషులు అంతకంటె గొప్ప విధానాన్ని ఆచరణలో పెట్టారు. వారు విద్యార్థులను తమ కుటుంబాలలో సభ్యులుగా కలిపేసుకున్నారు. అయితే వారి విద్యాపద్ధతి జనబాహుళ్యానికి ఉద్దేశింపబడినవి కాదు. వారు భారత దేశంలో జనప్రబోధకశక్తిగల నిజమైన ఒక ఉపాధ్యాయకులాన్ని తయారు చేశారు. జన బాహుళ్యంయొక్క శిక్షణ వారి గృహసీమలలోనే, వంశ

పారంపర్యమైన కులవృత్తులద్వారానే జరిగేది. ఆ పద్ధతి ఆకాలానికి ఆదర్శప్రాయంగానే వర్తించింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఇప్పుడు సర్వత్రా భాషాజ్ఞానాధారమైన విద్యకోసం అభిలాష ఎక్కువయింది. విద్యావంతుల వర్గాలతో తాముకూడా సమానం కావాలని జనబాహుళ్యం కోరుతున్నారు. అది ఎంతవరకు సాధ్యమో, ఎంతవరకు మానవసంఘానికి ప్రయోజనకరమో ఇక్కడ చర్చించడానికి అవకాశం లేదు. విద్యకొరకు వాంఛించడంలో తప్పేమీ లేదు. దానిని సరియైన మార్గంలోకి పెడితే మంచి ఫలితమే కలుగుతుంది. తప్పనిసరి అయినదానిని అడ్డుపెట్టడానికి ప్రయత్నించేకంటె దానిని వీలైనంత ఉత్తమ ప్రయోజనానికి మళ్ళించడానికి కృషిచేయడమే మంచిది. అయితేవేలాది సంఖ్యలో ఉపాధ్యాయులు కావలెనంటేవారు ఆకాశంనుంచి దిగిరారు. వచ్చినవారు ముష్టెత్తుకుని బ్రతకనూ లేరు. వారందరికీ నిర్ణీతమైన జీతాలీయవలసి వుంటుంది. అటువంటి ఉపాధ్యాయుల సైన్యమొకటి వుంటేగాని ఈపని జరగదు. అటువంటప్పుడు వారి జీతాలు వారి వృత్తివిలువకు తగినంత ఉచ్ఛస్థాయిలో వుండడం కష్టం ; దేశసంపత్తినిబట్టి వారికెంత యివ్వడానికి వీలైతే అంతపాటిలో వారికి జీతాలు ముట్టచెప్పవలసివుంటుంది. ఆయా వృత్తుల ప్రాధాన్యాన్నిబట్టి అటువంటి జీతాలస్థాయిని పెంచుతూ వుండవచ్చును. ఆ పెరుగుదల చాలా నెమ్మదిగా జరుగవలసివుంటుంది. అట్టి పరిస్థితులలో ఉపాధ్యాయవృత్తి చేపట్టేవారు తద్వారాకలిగే

ఆర్జనలాభం కోరకై కాక, దేశభక్తి ఆదర్శంతో ముందుకు రావలసి వుంటుంది. ఆ విధంగా వచ్చినవారిని దేశం తక్కువ చూపు చూడకుండా గౌరవిస్తుంది. అట్టి స్వార్థరహితులైన స్త్రీ పురుషులను దేశం అత్యంత ప్రేమగౌరవాలతో ఆదరిస్తుంది. దీనినిబట్టి గ్రహించవలసినదేమంటే, మన స్వరాజ్య సాధన ఏవిధంగా మన స్వయంకృషిపైన ఆధారపడివున్నదో అట్లే ఉపాధ్యాయవృత్తి చేపట్టినవారి పురోభివృద్ధి కూడా చాలావరకు వారి స్వయంకృషిపైననే ఆధారపడి వుంటుంది. వారు ధైర్యంతోనూ ఓరిమితోనూ ఉన్నతస్థితికి పురోగమించవలసి వుంటుంది.

యంగిండియా 6-8-25

స్వయంపోషక విద్యావిధానం

దేశంలో నిర్బంధవిద్యావిధానాన్ని అమలుపరచవలెనన్నా, కనీసం అభిలషించే బాలబాలికలందరికీ విద్య అందుబాటగునట్లు చేయవలెనన్నాగాని, మన స్కూళ్లూ కాలేజీలూ, పూర్తిగా కానిచో చాలావరకైనా, స్వయంపోషకంగా నడవగలగాలనే అభిప్రాయం ఒకటి ప్రచారమవుతూ వున్నది. ఈ స్వయంపోషకస్థితి విరాళాలవల్లను ప్రభుత్వ సహాయంవల్లనుకాక, విద్యార్థులు స్వయంగా ఒనర్చే లాభసాటి శ్రమఫలితంగా సిద్ధించవలెనని అందలి అంతర్భావం. పారిశ్రామిక శిక్షణమును నిర్బంధం చేస్తేనేగాని ఈ ఆశయం సిద్ధించదు. భాషావిద్యలతో పాటు పారిశ్రామిక శిక్షణం కూడా మన విద్యార్థుల కొసగడం అవసరమనేది క్రిమేపి

స్పష్టతరంగా అంతా గ్రహిస్తూవున్న విషయమే దానికి తోడు మన దేశంలో విద్యాసంస్థలు స్వయంపోషకం కావడానికి కూడా విద్యాబోధనంతోపాటు పారిశ్రామిక శిక్షణం అవసరమని తేలుతుంది. ఈ పద్ధతి అమలులోకి రావలెనంటే మన విద్యార్థులు దైహికశ్రమలో గర్భితమైన గౌరవాన్ని అవగాహన చేసుకొనవలసి వుంటుంది. అంతేకాక కాయకష్టంతో కూడిన వృత్తిపని చేతకాకపోవడం లజ్జాకరమైన విషయంగా భావించే సంప్రదాయం ప్రచారంలోకి రావాలి కూడా. లోకంలోకల్లా ఎక్కువ ధనవంతమైన అమెరికా దేశంలో, విద్య స్వయంపోషకం కావలసిన అవసరం లేకపోయినాగాని, విద్యార్థులు తమ ఖర్చులను పూర్తిగాగాని కొంతవరకుగాని పనిచేసి ఆర్జించే పద్ధతి ఆచరణలో వున్నది. ......అమెరికావంటి చోటనే విద్యార్థులు చదువు ఖర్చు నిమిత్తం పనిచేసి ఆర్జించే ఏర్పాటుమీద విద్యాసంస్థలు నిర్మాణం అయివున్న సందర్భంలో, మన స్కూళ్లలోను కాలేజీలలోను అట్టి పద్ధతి ఇంకా ఎంతఅవసరమో గ్రహించవచ్చును. ఉచితవేతనాలొసగి విద్యార్థులను దివాలాకోరులుగా చేయుటకంటె వారు స్వయంకృషిద్వారా ఖర్చులను గడించుకొనగలుగునట్లు చేయడం నయంగదా? జీవనోపాధికిగాని, విద్య నిమిత్తంగాని చేతులనూ కాళ్లనూ ఉపయోగించి శ్రమచేయడం పెద్దమనిషి తరహాకు లోపమనే భావం మన విద్యార్థుల మనస్సులలో నాటుకొని వుండడం ఎంత హానికరమో చెప్పనలవికాదు. అందువలన కలిగే

హాని నైతికమూ, ఆర్థికమూ కూడాను. అందులోను, ఆర్థికంగాకంటె నైతికంగా కలుగుతూవున్న హానియే ఎక్కువ. ఉచితంగా విద్యార్థి వేతనం పొందడం అనేది ఆ పొందిన విద్యార్థియొక్క మనస్సుమీద ఆజన్మాంతం ఋణభారంలా నిలిచిపోతుంది. పెద్దయిన తర్వాత ఎవరికిగాని తన విద్యాభ్యాసం ఇతరుల బిచ్చంమీద ఆధారపడి నడిచిందని అనిపించుకొనడం ఇష్టకరమైన విషయం కాదు. రెండవదిక్కున తన మనస్సు, దేహము, ఆత్మల యొక్క అభ్యున్నతినిమిత్తం ఏ వడ్రంగపు కార్ఖానాలోనో ఇంకో చోటో తాను కష్టించి పనిచేసి, తన విద్యావ్యయాన్ని ఆర్జించుకున్నవాడు కలకాలం ఆ విషయం సగర్వంగా స్మరించుకొనగలుగుతాడు.

యంగిండియా 2-8-28

అధ్యాయం ౪౯

విద్యా విషయటలో ఆశ్రమాదర్శం

(విద్యావిషయంలో తన ఆశ్రమాదర్శాన్ని వివరిస్తూ గాంధీమహాత్ముడు గుజరాతీలో వ్రాసిపెట్టిన అంశాలలో కొన్నిటికి శ్రీ వి. జి. దేశాయిగారుచేసిన ఈ క్రింది ఆంగ్లానువాదం 1950వ సంవత్సరపు హరిజనపత్రిక యొక్క జూలై 15, అగస్టు 5వ తేదీల సంచికలలో ప్రచురితమైనది.)

నాతోడి ఆశ్రమవాసులు వాటిలో పూర్తిగా అంగీకరించకపోయినా, నాకుగల విద్యావిషయికమైన ప్రత్యేకాభిప్రాయాలను ఈక్రింద పొందుపరుస్తున్నాను:

1 అల్పవయస్కులైన బాలబాలికలు ఎనిమిదేండ్ల వయస్సువరకు కలసి విద్యాభ్యాసం చేయాలి.

2 వారి విద్యాశిక్షణం ప్రధానంగా చేతిపనులపై ఆధారపడినదై, తగిన విద్యాశిక్షకుని పర్యవేక్షణక్రింద జరగాలి.

3 ఒక్కొక బాలుడుగాని బాలికగాని చేయవలసిన పని నిర్ణయించే సందర్భంలో వారి వారి వ్యక్తిగత అభినివేశములను గమనించి, వాటినిబట్టి అవి ఏర్పాటు చేయాలి.

4 ఏ పని వారికి నేర్పినా, ఆపనికి సంబంధించిన వివిధ ప్రక్రియలకు నడుమగల కార్య కారణసంబంధం వారికి పూర్తిగా అవగాహన అగునట్లు చూడాలి.

5 విషయ గ్రహణశక్తి ఏర్పడగానే పిల్లలకు అన్ని విషయాలను గురించీ సామాన్య జ్ఞానం నోటి మాటని చెప్పాలి. వ్రాయనూ చదవనూ అటుపిమ్మటి స్థితిలో చెప్ప వచ్చును.

6 పిల్లలకు మొట్ట మొదట రేఖా రూపాలను (Geometrical figures) వ్రాయడం నేర్పాలి. ఇవి సుల భంగా గీయడం అలవడిన తర్వాత అక్షరాలను వ్రాయడం నేర్పాలి. ఈ విధంగా చేస్తే వారికి మొదటినుంచీ చక్కని దస్తూరీ అలవడుతుంది.

7 వ్రాయడం కంటె ముందు చదవడం నేర్వాలి, ముందు అక్షరాలను బొమ్మల మాదిరిగా చూచి పోల్చు కొనడం నేర్పి, తర్వాత వాటిని చూచి వ్రాయడం అలవరచాలి.

8 ఈపద్ధతి ప్రకారం బోధనం పొందిన పిల్లలు ఎనిమి దేండ్ల వయస్సు వచ్చేసరికి వారి వారి శక్తిసామర్థ్యములను బట్టి తగినపాటి విషయజ్ఞానాన్ని పొందగల్గుతారు.

9 పిల్లలకు ఏదిగాని బలాత్కారంగా బోధించరాదు.

10 పిల్లలకు నేర్పే ప్రతివిషయం వారికి ఆకర్షణీయంగా వుండేలాగ చూడాలి.

11 పిల్లలకు విద్యాశిక్షణం ఒక ఆటలాగు కనిపించాలి. విద్యాశిక్షణలో ఆట కూడా ఒక భాగం.

12 విద్యా బోధనం అంతా మాతృభాషలోనే జరగాలి.

13 పిల్లలకు అక్షరాలు నేర్పేముందే హిందీ-ఉర్దూ జాతీయ భాషగా నేర్పించాలి.

14 మతశిక్షణకు తప్పనిసరి అయిన స్థానం వుండాలి. పిల్లలు దానిని ఉపాధ్యాయుల వర్తనమును గమనించుటను బట్టి, ఉపాధ్యాయులు ఆయావిషయాలనుగురించి చేసే ప్రసం గాలను బట్టి తెలుసుకోవాలి.

15 పిల్లల విద్యావిధానం యొక్క రెండవభాగం తొమ్మిది మొదలు పదహారేళ్ల వయసుకు చెందినదై వుంటుంది.

16 ఈ రెండవ స్థాయిలో కూడా వీలైనంతవరకు మగపిల్లలూ ఆడపిల్లలూ కలిసి చదువుకొనే పద్ధతి అవలంబించడం మంచిది.

17 ఈస్థాయిలో హిందూ బాలబాలికలకు సంస్కృతం ముస్లిం బాలబాలికలకు అరాబిక్కు నేర్పాలి.

18 ఈ రెండవ విభాగంలో కూడా విద్యాపద్ధతి చేతి పనులతో కూడినదిగానే వుండాలి. అవసరమైన పాటిగా భాషావిద్యకు ఎక్కువకాలం ఒసగవచ్చును.

19 ఈ విభాగంలో మగపిల్లలకు తమ తండ్రుల వృత్తి పనులను నేర్పాలి. పెద్దవారైనాక ఆపిల్లలు ఆకుటుంబ పరిశ్రమను తమకు యిష్టమైతే తమ జీవనోపాధి నిమిత్తమై అవలంబించుటకు వీలైనరీతిగా శిక్షణ మొసగాలి. ఇది ఆడ పిల్లలకు వర్తించదు.

20 ఈ విభాగంలోని పిల్లలు ప్రపంచ చరిత్ర, భూగోళ శాస్త్రం, వృక్షశాస్త్రం, ఖగోళశాస్త్రం, అంకగణితం, రేఖా గణితం, బీజ గణితములను గూర్చి సామాన్య జ్ఞానం పొందాలి.

21 పిల్లలందరకు ఇప్పుడు కుట్టుపని, వంటపని నేర్పాలి.

22 పదహారు మొదలు ఇరువది అయిదేండ్లవరకు మూడవ విభాగం. ఈ స్థితిలో ప్రతి యువవిద్యార్థియు వారి వారి పరిస్థితులనుబట్టి, అతనికి లేక ఆమెకు యిష్టమైన విద్యను పొందవచ్చును.

23 రెండవ విభాగంలో (9-16) విద్యావిధానం స్వయంపోషకంగా వుండాలి. అనగా, విద్యార్థి ఆదినుంచీ నేర్చుకుంటూవున్న వృత్తి విద్యాశిక్షణం యొక్క ఫలితంగా వచ్చేలాభం స్కూలు ఖర్చులకు సరిపోవాలి.

24 వస్తునిర్మాణం తొలినుంచీ జరుగుతూనే వుంటుంది గాని, మొదటి స్థితిలో దానివల్ల ఇంకా స్కూలు ఖర్చులకు సరిపోయే లాభం రాదు.

25 ఉపాధ్యాయుల జీతాలు మరీ హెచ్చుగా ఉండ కూడదు, జీవితావసరాలకు సరిపడేలా మాత్రమే వుండాలి. ప్రాథమిక విద్యావిభాగంలో ఉపాధ్యాయులుగా ఎవరుపడితే వారు పనికిరారు. ఉపాధ్యాయు లందరూ శీలవంతులై వుండాలి.

26 విద్యా సంస్థలకు పెద్ద పెద్ద ఖరీదైన భవనాలు అవసరంలేదు.

27 ఆంగ్లం వివిధ భాషలలోను ఒకటిగా మాత్రమే నేర్పాలి. హిందీ ఏ విధంగా జాతీయ భాషగా భావిస్తామో, అల్లే ఆంగ్లం విదేశాలతో వ్యవహరించడానికే, విదేశ వ్యాపార విషయకంగానూ వినియోగించవచ్చును.

స్త్రీ విద్య :

స్త్రీ విద్య విషయంలో అది పురుషుల విద్యకు భిన్న మైనదిగా వుండాలా, ఎప్పుడు ప్రారంభించాలి, అనే అం శములను గురించి నాకు నిశ్చితమైన అభిప్రాయం ఏమీ లేదు.

కాని విద్య విషయంలో వారికి పురుషులతో సమానమైన, అవసరమైతే ఇంకా ప్రత్యేకమైన అవకాశాలు వుండాలని మాత్రం నాకు దృఢాభిప్రాయం వుంది.

నిరక్షరాస్యులైన వయోజనుల నిమిత్తం రాత్రి పాఠశాలలు నడపాలి. వారికి చదవడం వ్రాయడం తప్పనిసరిగా అవసరమని నాకు తోచదు. కాని ప్రసంగాలు మొదలగు పద్ధతులద్వారా వారికి సామాన్య విషయ పరిజ్ఞానం కలిగించాలి. వారు కావలెనని కోరితే వ్రాత, చదువు నేర్పే ఏర్పాట్లు కూడా చేయవచ్చును.

ఆశ్రమంలో జరిపిన ప్రయోగములను బట్టి ఒక్క విషయం స్పష్టంగా తేలింది. అదేమంటే, ఏదో ఒక పరిశ్రమ, ముఖ్యంగా నూలువడికే పరిశ్రమ, విద్యా విధానంలో ప్రధాన స్థానం పొందాలి; విద్యావిధానం చాలావరకు స్వయంపోషకంగా వుండాలి; గ్రామజీవితానికి సంబంధించినదిగాను, దాని పురోభివృద్ధికి తోడ్పడునదిగాను వుండాలి.

నిజమైన విద్యార్జనం పిల్లవాడు పాఠశాలవిద్యను పూర్తి చేసిన పిమ్మటనే ప్రారంభమవుతుంది. విద్యాభ్యాసం యొక్క విలువను గ్రహించిన వ్యక్తి జీవితకాలమంతా విద్యార్థిగానే వుంటాడు. ఆతడు తన జీవిత విధులను నిజాయితీతో నిర్వర్తించడం ద్వారానే ఆతని జ్ఞానం దినదిన ప్రవర్ధమానం అవుతుంది.

బోధకుడు లేనిదే విద్యాభ్యాసం అసాధ్యమనే భావం విద్యయొక్క పురోగతి నిరోధకమైన మూఢాభిప్రాయం. మనిషి తనకు తానే నిజమైన బోధకుడు. ఈ రోజులలో స్వయంగా విద్యార్జన చేసుకునేందుకు విపులమైన సాధనాలు అందుబాట్లో వున్నాయి. తెలుసుకొనడానికి శ్రమపడేగుణం గలవాడు అనేక విషయాలను గురించి సునాయాసంగా జ్ఞానం ఆర్జించడానికి వీలుంది; గట్టిగా అవసరమైనప్పుడు బోధకుని సహాయం కూడ పొందవచ్చును. స్వానుభవమే అన్నిటికంటె విశాలమైన విద్యాశాల. చాలా విధములైన చేతిపనులు కార్ఖానాలలోనే గాని పాఠశాలలో నేర్చుకోడం సాధ్యం కాదు. వీటిని గురించి బడులలో నేర్చుకునేది సాధారణంగా చిలుక పలుకులకు సమానమైనదిగానే వుంటుంది. ఇతర విషయాలు పుస్తకాలసహాయంతో నేర్చుకోవచ్చును. అందువల్ల వయోజనులకు పాఠశాలలకంటె ముఖ్యంగా జ్ఞాన తృష్ణ, అందుకు శ్రమపడే బుద్ధి, ఆత్మవిశ్వాసము అవసరం.

పిల్లల విద్యాశిక్షణ ప్రధానంగా తలిదండ్రులు నెరవేర్చవలసిన విధి. అందువల్ల అసంఖ్యాకంగా పాఠశాలలను నిర్మించడం కంటె, విద్యాభిలాషను కలిగించే వాతావరణను కలిగించడం ఎక్కువ ముఖ్యం. ఈ వాతావరణ బలంగా ఏర్పడితే, క్రమేపి పాఠశాలలు అవే పుట్టుకొస్తాయి.

ఈ సూత్రాలపై ఆధారపడిన ఆశ్రమ విద్యాదర్శం కొంతవరకు ఆచరణాత్మకంగా రూపం దాల్చినదని చెప్ప వచ్చును. నిజానికి ఆశ్రమంలోని ప్రతి కార్యక్రమశాఖ ఒక పాఠశాల అన్నమాటే.

అధ్యాయం-౨౦

జాతీయ భాష – లిపి

మనం ఒకే ఒక జాతికి చెందినవారమని చెప్పుకొనే మాట రుజువు కావలెనంటే మనకు అనేక విషయాలు సమానంగా వర్తిస్తాయని నిరూపించుకోవాలి. వివిధ మతాల ద్వారా, వాటి ఉపశాఖలద్వారా అనుస్యూతమైవున్న ఒక సంస్కృతి మన అందరికీ సమానంగా వర్తిస్తున్నదని చెప్పుకొనవచ్చును. మన ప్రతికూల పరిస్థితులు కూడా అందరికీ సమానంగా వర్తిస్తాయి. అలాగే మనం అందరమూ ధరించే వస్త్రాలు తయారయే బట్టకూడా ఒకేరకమైనదై వుండడం అభిలషణీయమూ, అవసరమూ అని నా అభిప్రాయం. దానితోపాటు, మన ప్రాంతీయ భాషలకు హానికరం కాని రీతిని, వాటితోపాటు అందరికీ సమానంగా వర్తించే ఒక జాతీయభాషను కలిగి వుండడం కూడా అవసరం. ఆ అవసరాన్ని తీర్చగల భాష హిందీ ఉర్దూల సమ్మేళన జనితమును ఎక్కువ సంస్కృతంతో గాని, ఎక్కువ పెర్షియను, అరబ్బీలతో గాని కూడ నటువంటిదిన్నీ అయిన హిందూస్థానీయే అన్న విషయం సామాన్యామోదం పొంది వున్నది. ఇక మనకు గొప్ప అడ్డంకులుగా మిగిలినవి మన ప్రాంతీయ భాషలయొక్క వివిధరకములైన లిపులు. ఈ నియమాన్ని స్వప్నరూపంగానే మిగిలివున్న మన సమాన భాషాభిలాష వాస్తవరూపం దాల్చవలెనంటే, ఈ మన ప్రాంతీయ భాషలన్నిటికీ మనం ఒకే ఒక లిపిని స్వీకరించవలసి వుంటుంది.

లిపి వైవిధ్యం అనేది అనేకవిధాల మనకు అడ్డంకుగా నిలుస్తుంది. అది జ్ఞాన సంపాదనమునకు బలీయమైన అటంకంగా వర్తిస్తుంది. వివిధములైన లిపులను నేర్చుకోన వలసిన బాధలేని యెడల ఆర్యభాషా సంజనితములై తద్వారా పరస్పర సంబంధం కలిగివున్న మన ప్రాంతీయ భాషలలో చాలా వాటిని ప్రతివారూ సులభసాధ్యంగా నేర్చుకోన గలుగుతారు. రవీంద్రుని అసమానమగు సాహిత్యరచన అంతా దేవనాగరి లిపిలోనే కనక ముద్రితమైవుంటే, కొంచెం సంస్కృత పరిజ్ఞానం కలవారిలో అనేకులు ఆయన రచనలను చదివి అర్థం చేసికోన గలుగుతారు. అది బెంగాలీ లిపిలోనే బంధితమైవున్నంతకాలం తదితకుల కది "నన్ను ముట్టుకోకు" అని చెబుతున్నట్లే వుంటుంది. అట్లే బెంగాలీ వారు దేవనాగరి లిపి నేర్చుకుని వుంటే తులసీదాసు మొదలైన అనేక హిందూస్థానీకవీంద్రుల భక్తి భరితములైన సుందర కావ్యములను చదివి ఆనందించ గలుగుతారు.

భారతదేశ మంతకీ ఒకేలిపి వుండవలెననే ఆశయం నెరవేరడానికి చాలాకాలం పడుతుంది. (Indo - Sancritic) భారత - సంస్కృత భాషామూలానికి చెందిన భాషలను మాట్లాడే వారంతా, దక్షిణ ప్రాంతీయులతోసహా, ఒకే ఒక లిపిని స్వీకరించడం అనేఆశయం, మనం మన ప్రాంతీయాభిమానాలను మాత్రం విసర్జించినచో, సులభసాధనమైన ఆశయమే అని చెప్పవచ్చును. ఉదాహరణకి, గుజరాతీయులు

గుజరాతీ లిపియే కావలెనని పట్టుకు కూర్చొనడంలో సుగుణం ఏమీలేదు. మన భారత దేశాభిమానం విశాల ప్రపంచ శ్రేయానికి భంగం కానిదిగా వుండడం ఏవిధంగా మంచిదో, అట్లే మన ప్రాంతీయాభిమానాలు కూడా భారతదేశ మొత్తపు శ్రేయస్సుకి విరుద్ధం కానివిగా వుండడం మంచిది. "భారతదేశంతో పనిలేదు, గుజరాతీ మా సర్వమూ" అని చెప్పే ప్రాంతీయాభిమానం దుష్టత్వ మవుతుంది.

లిపి విషయంలో మనకందరికీ సమానంగా వర్తించ గలిగినది దేవనాగరి లిపియే అనే విషయానికి రుజువులు చూపవలసిన పనిలేదని తలుస్తాను, - అది దేశంలో ఎక్కువ భాగానికి పరిచితమైనదై వుండడమే అన్నిటికన్నా ప్రధాన మైన రుజవని పేర్కొనవచ్చును ... ప్రతి మాట్లాడే భాషనూ అభివృద్ధిచేసి శాశ్వత మొనరించాలనేటంత ప్రత్యేకతా ప్రతి పాదకమూ, సంకుచితమూ అయిన భావం జాతీయతకూ, విశ్వ జనీనతకూ కూడా విరుద్ధమైనది. అపరిణతమూ, లిపి రహితమూ అయిన భాషలన్నిటినీ త్యజించి హిందూస్థానీ ప్రవాహినిలో మిళితం చేసివేయడం మంచిదని నా వినయ పూర్వకమైన సూచన. అట్టిపని ఉన్నతి ప్రదమైన త్యాగమే అవుతుందిగాని, ఆత్మహత్య వంటిది కాదు. భారతీయ సంస్కృతీ పరులకు ఒక సమానభాష కావలెనంటే, భాషల యొక్కయు లిపులయొక్కయు విశీర్ణతను, అధికసంఖ్యాకతను కూడా అరికట్టాలి. అందరికీ సమానంగా వర్తించే ఒక

భాషను పెంపొందించాలి. నా చేతులలోవుంటే, గాఢమైన ప్రాంతీయభాషల లిపులతోపాటుగా, దేశమంతటా దేవ నాగరి, ఉర్దూ లిపులను కూడా నేర్చుకొనడం తప్పనిసరి చేస్తాను; వివిధ ప్రాంతీయ భాషలలోని ప్రధాన గ్రంథా లన్నిటిని, సరాసరి అయిన హిందూస్థానీ భాషాంతరీకరణా లతోసహా, దేవనాగరి లిపిలో ముద్రింపిస్తాను.

యంగిండియా, 27-8-25

ఇప్పుడు మనం జాతీయభాషను గురించి సమాలో చిద్దాం. ఆంగ్లభాషనే మన జాతీయభాషగా స్వీకరిస్తే, దానిని మన పాఠశాలలలో నిర్బంధ బోధనాంశంగా చేయ వలసివుంటుంది. మొట్టమొదట, ఆంగ్లభాష మన జాతీయ భాష కాగలదా అనే విషయం ఆలోచిద్దాం.

దేశభక్తివిషయంలో లోపంలేని మనవిద్యావేత్తలలో కొందరు ఈ విషయమై ప్రశ్నించడమే అజ్ఞానాన్ని తెలుపు తుందని వాదించేవారున్నారు. ఆంగ్లభాష అప్పుడే ఆస్థానం పొందివున్నదని వారి అభిప్రాయం.

స్థూలంగాచూస్తే ఈఅభిప్రాయం నిజమే అనిపిస్తుంది. మన సంఘంలోని విద్యావంతులైన వర్గాన్ని చూచినప్పుడు, ఆంగ్లభాష లేకపోతే మన పనులన్నీ నిలిచిపోతాయనే భావం కలగడానికి అవకాశం లేకపోలేదు. కాని మరికొంచెం లోతుగా ఆలోచిస్తే, ఆంగ్లభాష మన జాతీయభాష కాలే దనీ, కారాదనీ స్పష్టమవుతుంది.

జాతీయభాషకు కావలసిన లక్షణాలేమిటో పరికిద్దాం.

1. అది ప్రభుత్వోద్యోగులకు నేర్చుకొనుటకు సులభ సాధ్యంగా వుండాలి.

2. భారతదేశం అంతటా మత, ఆర్థిక, రాజకీయ విషయాలలో పరస్పర సంబంధాలకు తగిన వాహనంగా ఉపకరించగలిగి వుండాలి.

3. భారతదేశంలోని అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాష అయి వుండాలి.

4. దేశంలో సర్వులూ నేర్చుకొనడానికి సులభమైన దిగా వుండాలి.

5. అట్టిభాషను ఎన్నుకొనడంలో తాత్కాలికమూ, క్షణికమూ అయిన అభిమానాలకు తావొసగకూడదు.

ఆంగ్లభాష ఈ అవసరాంశాలలో దేనినీ సంతృప్తి పరచదు.

ఇందులో నిజానికి మొదటి అంశం చివర చేర్కొన వలసినది; కాని దానిని ఆంగ్లభాష సంతృప్తిపరుస్తున్నట్లుగా పైకి కనిపించడంబట్టి దానికి ప్రథమస్థానం ఇచ్చాను. కొం చెం నిశితంగా చూస్తే, ప్రస్తుతక్షణమందు కూడా అది ఉద్యోగస్తులు నేర్చుకొనడానికిగాని, ఉపయోగించడానికి గాని సులభసాధ్యమైనది కాదని తేటపడుతుంది. ప్రస్తుతం అమలులోవున్న మన రాజ్యాంగ ప్రణాళిక ప్రకారం కొలది కాలంలో మన ఉద్యోగ శాఖలలోని ఆంగ్లేయుల సంఖ్య

తగ్గించి వేయబడుతుంది; తుదిని పైౖస్రాయి, మరికొలదిమంది తప్ప మిగలరు. ప్రభుత్వోద్యోగస్తులలో ప్రస్తుతంలోకూడా భారతీయుల సంఖ్యయే అత్యధికమైవుంది; ఇది అచిరకాలంలో ఇంకా పెరుగుతుంది. ఇది ఎవరూ కాదనరనుకుంటాను. ఆ భారతీయోద్యోగులకు అన్ని భాషలకంటె ఆంగ్లభాష నేర్చుకొనడమే కష్టతర మవుతుంది.

ఇక రెండవ అంశం: మనదేశపు జనభా అంతా ఆంగ్లభాష మాట్లాడగలిగితే తప్ప, ఆంగ్లం ద్వారా మత విషయిక సంబంధాలు నడవడం అసాధ్యం.

ఆంగ్లభాష మన దేశంలోని అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషకాదు కనుక, పైమూడవ అంశాన్ని ఎలాగూ సంతృప్తి పరచదు.

మన దేశస్తులంతా మొత్తం జనభా అంతా నేర్చుకొనడానికి అది సులభమైన భాషకానందున, ఆంగ్లంపై నాల్గవ అంశాన్నికూడా తృప్తిపరచలేదు.

ఇక అయిదవ అంశాన్ని పరిశీలనగా ఆలోచిస్తే, ప్రస్తుతం ఆంగ్లభాష పొందివున్న ప్రాధాన్యం తాత్కాలికమైన దే అని చెప్పవలసివుంటుంది. నిజానికి మున్ముందు భారతదేశములో జాతీయ విషయాలలో ఆంగ్లభాషయొక్క అవసరం అట్టే వుండదు; అసలే వుండదని కూడా చెప్పవచ్చును. సామ్రాజ్యసంబంధ విషయాలలో దాని అవసరం వుంటుందని అంగీకరిస్తాను. సామ్రాజ్యాంతర్గతమైన వివిధ రాజ్యాలమధ్య

రాజకీయ సంపర్కాలకు అవసర భాషగా మాత్రం ఆంగ్లం ఉపకరించగలదు. అయితే అది వేరువిషయం. ఆ సందర్భములో ఆంగ్లభాషను వినియోగించుకో వచ్చును. ఆంగ్ల భాషను మనం ద్వేషించనక్కరలేదు. మనకు కావలసినది దానిని మనకు అవసరమైన పరిమితిని మించకుండా చూచుకొనడం మాత్రమే. సామ్రాజ్యభాషగా ఆంగ్లం మనకు అవసరం కనక, మన మాలవ్యాజీ, శాస్త్రి, బెనర్జీలవంటివారు తప్పక ఆంగ్లభాషా విశారదులగునట్లు ప్రోద్బలంచేసి, వారి ద్వారా వారి ప్రపంచ పర్యటనలలో భారతదేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేలాగ ప్రచారం చేయించుకోవచ్చును. అయితే మన జాతీయభాషగా చేసుకొనడానికి మాత్రం ఆంగ్లభాష పనికిరాదు. దానికి ఆస్థానం ఒసగడం అనేది భారతదేశంలో "ఎస్పెరాన్టో" భాషను ప్రవేశపెట్టినట్టుగా వుంటుంది. ఆంగ్ల భాష మన జాతీయభాషగా కాగలదని అనుకోవడం మన దౌర్బల్యాన్ని, అజ్ఞానాన్ని మాత్రమే తెల్పుతుంది.

అయితే పై అయిదుషరతులను సంతృప్తిపరిచే భాష ఏమిటి? హిందీభాష ఒక్కటే అని అంగీకరించక తప్పదు.

ఈ అయిదు అంశాలను తృప్తిపరడంలో ఇతర భాష ఏదీ హిందీతో పోటీపడలేదు. హిందీతర్వాత బెంగాలీభాష వస్తుంది. కాని బెంగాలీవారే బెంగాల్ దేశం దాటితే హిందీని వాడుతూవుంటారు. హిందీభాష మాట్లాడేవారు మాత్రం ఎక్కడికిపోయినా హిందీయే మాట్లాడుతారు. అది ఎవరికీ ఆశ్చర్యం కలిగించదు. హిందీమాట్లాడే హిందూమత

ప్రచారకులూ, ఉర్దూ మాట్లాడే మౌల్వీలూ భారతదేశ మంతటా తమ మతవిషయిక ప్రసంగాలను హిందీ, ఉర్దూల లోనే చేస్తారు. అక్షరజ్ఞానంలేని ప్రజాసామాన్యంకూడా అవి అర్థం చేసుకుంటారు. అక్షరాలురాని గుజరాతీయుడైనా ఉత్తరదేశం వెడితే ఏవో కొన్ని హిందీమాటలు మాట్లాడ డానికి ప్రయత్నిస్తాడు. కాని బొంబాయినగరంలోని సేఠ్ గారికి గేటుకాపలా పనిచేసే ఉత్తరాది "భైయ్యా"తో వాని యజమాని అయిన సేఠ్ గారు హిందీలో మాట్లాడవలసిందే కాని, ఆ "భైయ్యా" మాత్రం గుజరాతీలో మాట్లాడడానికి ఒప్పుకోడు. దూరస్థమైన దాక్షిణాత్య దేశంలో కూడా హిందీ మాట్లాడటం నేను విన్నాను. మద్రాసు రాష్ట్రంలో ఇంగ్లీషు లేకుండా గడవదనడం పొరపాటు. అక్కడ వున్న ప్పుడు నా కార్యకలాపాలన్నిటికీ నేను హిందీనే వాడాను. రైలుప్రయాణాలలో మద్రాసీలు ఇతర ప్రయాణీకులతో హిం దీనే మాట్లాడటం నేను గమనించాను. అంతేకాక మద్రాసు రాష్ట్రంలో ముస్లింలు తగినపాటిగా హిందీభాష మాట్లాడి వ్యవహరించగలరు. భారతదేశంలోని అన్నిప్రాంతాలలో తగినంత సంఖ్యలో వ్యాప్తమైన ముస్లింలంతా ఉర్దూ మాట్లాడగలరు.

ఈ విధంగా ఇప్పటికే హిందీభాష మన జాతీయ భాషగా స్థావరపడి వున్నది. ఆవిధంగా దానిని మనం చాలా కాలంనుంచి వాడుతూనేవున్నాం. ఈ వాస్తవ పరిస్థితినిబట్టే ఉర్దూభాష పుట్టింది.

ముస్లిం ప్రభువులైనా పెర్షియను భాషనుగాని, అరబ్బీ భాషనుగాని జాతీయ భాషగా చేయలేకపోయారు. వారు హిందీ వ్యాకరణాన్ని స్వీకరించారు. అందులో ఎక్కువగా పెర్షియను మాటలను జొప్పించడం, ఉర్దూలిపిని వాడడం మాత్రమే చేశారు. అంతేకాని విజాతీయ భాషద్వారా ప్రజాబాహుళ్యంతో వ్యవహరింప లేకపోయారు. ఆంగ్లేయ పాలకుల విషయంలోకూడా అలాగే జరిగింది. వారు సైన్యం లోని సిపాయీలతో ఏ పద్ధతిని వ్యవహరిస్తారో తెలిసినవారు అందునిమిత్తమై హిందీ లేక ఉర్దూ పరిభాషాపదాలు సృష్టింప బడిన సంగతి అంగీకరిస్తారు.

ఈ హేతువులన్నిటినిబట్టి హిందీభాష ఒక్కటే జాతీయ భాష కావడానికి అర్హత కలిగినదని గమనించవచ్చును. మద్రాసు రాష్ట్రంలోని విద్యావంతులైన వర్గాలకు ఇది కొంచెం ఇబ్బంది కలిగిస్తుందన్నమాట మాత్రం నిజమే. కాని మహారాష్ట్రీయులకు, గుజరాతీలకు, సింధీలకు, బెంగాలీలకు ఇది చాలా సులభసాధ్యమే అని అంగీకరించవచ్చును. హిందీని జాతీయభాషగా వాడుకొనడానికి కావలసినపాటి పరిజ్ఞానాన్ని వారు కొలది మాసాలలో గడించగలరు. తమిళు లకు అంత సులభంకాదు.

తమిళము మొదలైన దాక్షిణాత్య భాషలు ద్రవిడ మూలానికి చెందినవి. వాటి నిర్మాణం, వ్యాకరణం సంస్కృతానికి తేడాగా వుంటుంది. ఈ రెండు భాషాకూటాలకు

సామాన్యమైన అంశం దక్షిణభాషలలో కూడా సంస్కృత పదజాలం వాడడమే.

అయితే మన సమస్య ఒక్క విద్యావంతులగు వర్గానికి సంబంధించినది మాత్రమే. వారు కూడా మాతృదేశాభిమానం కలవారే కనక, హిందీ నేర్చుకొనడానికి వారు కొంత కష్టపడవలసినదని మనం కోరడానికి హక్కువుంది.

హిందీభాషకు రావలసిన ఆహాతు వచ్చినతర్వాత అది మద్రాసురాష్ట్రపు పాఠశాల లన్నిటిలోనుకూడా ప్రవేశపెట్టబడుతుంది. తద్వారా అక్కడివారు ఇతర రాష్ట్రాలతో పరిచితలాభం పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆంగ్లభాష ప్రజాబాహుళ్యాన్ని అందుకో లేకపోయింది. ఆ పని హిందీ కొలదికాలంలో చేయగల్గుతుంది. తెలుగువారు ఈ దిక్కుగా అప్పుడే ముందంజ వేస్తున్నారు.

(గుజరాతీనుంచి)

20-10-1917 సం॥ తేదీని బ్రోచ్‌లో జరిగిన రెండవ గుజరాత్ విద్యావిషయిక మహాసభలో గాంధీజీ ఒసగిన అధ్యక్షోపన్యాసం నుంచి.

ఆంగ్లభాష నేర్చుకొనడానికిగాను ఎన్ని సంవత్సరాలు వ్యయపరుస్తామో, అన్ని నెలలైనా హిందీ నేర్చుకొనడానికి మనం శ్రమపడడానికి యిష్టపడకపోతే, మనకు ప్రజాబాహుళ్యంపైన గల ప్రేమాభిమానాలు పైమెరుగే అని చెప్పవలసివుంటుంది.

(నిర్మాణ కార్యక్రమం, పే. 20.

అధ్యాయం ౫౧

ప్రాంతీయ భాషలు.

మనకు మన మాతృభాషయెడల కంటె ఆంగ్లభాష యెడల గల ప్రేమాధిక్యతయే మనలోని విద్యావంతులూ రాజకీయమనస్కులూ అయిన వర్గాలకును ప్రజాసామాన్యమునకును మధ్య దాటరాని ఒక అగడ్తను సృష్టించినది. తద్వారా భారతీయ భాషలన్నీ దుర్బలమైపోయినవి. అందువల్లనే క్లిష్టమైన భావాలను మాతృభాషలో వ్యక్తం చేయడానికి ప్రయత్నించినప్పుడు మనం ఉక్కిరిబిక్కిరై పోతాం. శాస్త్రీయ పారిభాషిక పదాలకు మనకు సమానార్థకాలు లేవు. దీనంతకు ఫలితం చాలా వినాశకరమైనదిగా పరిణమించింది. ప్రజాసామాన్యం అధునిక భావ ప్రపంచానికి దూరమైపోయారు. ఉత్కృష్టమైన భారతీయ భాషలయెడల చూపబడిన ఈ అశ్రద్ధవలన దేశానికి కలిగే నష్టం మన సమకాలికదృష్టికి ఇంకా స్పష్టంగా గోచరం కావడంలేదు. ఈ నష్టకర పరిస్థితిని మారిస్తే తప్ప, సామాన్య ప్రజానీకంయొక్క మనస్సు సంకుచితమైన చెరలో చిక్కిపోయి నట్లవుతుందని మాత్రం సులభంగానే ఊహించుకోవచ్చును. మన స్వరాజ్య నిర్మాణానికి ప్రజాసామాన్యం చెప్పదగిన సహకారం ఏపాటిగాని చేయలేకపోతారు. స్వాతంత్ర్యోద్యమానికి ప్రతివారు తమ వ్యక్తిగత సహకారం చేయవలెననేది అహింసాత్మక స్వరాజ్య సంపాదన విధానంలో గర్భితమైవున్న ముఖ్యసూత్రం. మన

కార్యక్రమంలోని ప్రతి అడుగూ పూర్ణంగా అవగాహన చేసుకుంటేతప్ప ప్రజా సామాన్యం సహకరించలేదు. ఏతత్కార్య కారణాలన్నీ వారికి వారి మాతృభాషలలో బోధిస్తేతప్ప వారి సహకారం పొందడం అసాధ్యం.

నిర్మాణ కార్యక్రమం, పే. 19-20.

నా మాతృభాషలో ఎన్ని లోపాలున్నాగాని, తల్లి రొమ్ముకు శిశువువలె నేను దానికి హత్తుకొని వుండాలి. అది మాత్రమే నాకు జీవదుగ్ధము నొసగ గలిగినది. దాని హద్దులో అది ఉన్నంతవరకు నాకు ఆంగ్లభాషయెడల ప్రేమ లేకపో లేదు; కాని అది దానికి చెందని స్థానమును ఆక్రమిస్తేమట్టుకు నేను దానిని తప్పనిసరిగా ఎదుర్కొంటాను. ఆంగ్లభాష ప్రపంచభాష తాహతు పొందినమాట సర్వాంగీకృతమైన విషయమే. అందువల్ల దానికి నేను పాఠశాలలలో కాక కళాశాలా ప్రణాళికలో రెండవభాషగా, వైకల్పికభాషగా, స్థాన మొసగుతాను. అది లక్షల సంఖ్యలోగల విద్యార్థులందరికి కాకుండా, కొలదిమందికి మాత్రమే ఉద్దేశింపబడినదిగా వుంటుంది. ఈనాడు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యనైనా మనం అమలుపరచలేని సమయంలో ఆంగ్లాన్ని నేర్పడానికి కూడా మనం ఏమి ఏర్పాటు చేయగలం? రష్యాదేశం ఆంగ్లభాషతో పనిలేకుండానే శాస్త్రవిషయకంగా ప్రగతిని సాధించింది. ఆంగ్లం లేనిదే ముందడుగు వేయలేమని మనం

అనుకోవడం మన మానసిక దాస్యాన్ని మాత్రమే తెల్పుతుంది. అట్టి మనోదౌర్బల్యాన్ని తెల్పే అభిప్రాయంతో నే నెన్నటికీ ఏకీభవించ లేను.

హారిజన్, 25-8-46.

మన ప్రభుత్వాలూ, వాటి కార్యాలయాలు తగిన జాగ్రత్తపడనిచో ఆంగ్లభాష హిందూస్తానీయొక్క స్థానాన్ని ఆక్రమించుకోగలదు. అందువల్ల ఆంగ్లభాషని ఎన్నటికీ నేర్చుకోలేని లక్షలాది జనసామాన్యానికి తీరని హాని కలుగుతుంది. ప్రాదేశిక వ్యవహారాలన్నిటిని ప్రాదేశికమైన మాతృభాషలలోను, అంతర ప్రాంతీయ వ్యవహారాలను నాగరి లిపిలోగాని ఉర్దూలిపిలోగాని వ్రాయబడే హిందూస్తానీ భాషలోను నడుపుకొనగల కార్యాలయపు సిబ్బందీలను చేకూర్చుకొనడం మన ప్రాదేశిక ప్రభుత్వాలకు సులభసాధ్యమైన కార్యమనే నేను భావిస్తాను.

ఈ అవసరమైన మార్పును అమలులోనికి తేవడానికి ఎంత ఆలస్యంచేస్తే అంతగా మనకు సంస్కృతి విషయికంగా నష్టం కలుగుతుంది. భారతదేశంలో ప్రాంతీయ భాషాసంపదను పునరుజ్జీవింప చేయుడం అనేది మున్ముందుగా జరుగవలసిన పని. మన కోర్టులలోను, స్కూళ్లలోను, సెక్రెటేరియట్లలోను ఈ మార్పు తేవడానికి కొంత గడువు అవసరమని వాదించడం మన అలస మనస్కతను మాత్రమే తెల్పుతుంది. భాషాప్రయుక్తరాష్ట్ర పునర్విభజనం జరిగేవరకు బహుభాషా

రాష్ట్రములుగావున్న బొంబాయి, మద్రాసు ప్రాంతాలలో ఇది అమలుకావడం కొంచెం కష్టంకావచ్చు. ఆ ప్రాంతీయ ప్రజలు ప్రభుత్వం తమదిగా భావించుకొనునట్లు చేయుటకు ఆ ప్రాదేశిక ప్రభుత్వాలు తమకు తోచిన అవసరచర్యలను స్వయంగానే అమలుచేసుకొనవచ్చును. అంతర ప్రాదేశిక భాషవిషయమై, అనగా నాగరి లేక ఉర్దూ లిపులలో వ్రాసే హిందూస్తానీయా లేక కేవలం నాగరిలిపిలో వ్రాసే హిందీయా అనే విషయమై కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేదాకా వారు ఆగనవసరంలేదు. ప్రాదేశిక ప్రభుత్వాలలో అవసరమైన మార్పు తెచ్చుకోవడానికి ఈ సమస్య ఆటంకం కాకూడదు. ఇది కేవలం అనవసర వివాదం. ఇది ఆంగ్లానికి తలుపు తెరచి దారి ఒసగి, తద్వారా భారతదేశానికి అవమానకరమైన పరిణతి కలిగించడానికి హేతుభూతం కాగలదు. వెంటనే ప్రాదేశికపాలన శాఖలన్నీ దేశభాషలలో నడపడం ప్రారంభిస్తే, అంతరప్రాదేశిక భాషా నిర్ణయంకూడా ఆ వెనువెంటనే జరిగితీరుతుంది. ప్రదేశ ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంతో వ్యవహరించవలసిన అవసరం ఏర్పడగానే కేంద్రం సమస్యానిర్ధారణ చేసుకోవలసి వుంటుంది. ఏ పక్షానికికాని, వర్గానికిగాని బాధలేకుండా దేశమొత్తానికి అనుకూలమైన భాషను నేర్చుకొనడానికి యిష్టపడని కొలదిమంది బద్ధకస్తుల కొరకై దేశానికి సంస్కృతి విషయికంగా నష్టదాయకమైన ఆంగ్లభాషను అంతరప్రాంతీయ పాలనభాషగా చేయడానికి

కేంద్రప్రభుత్వం సాహసించలేము. ఆంగ్లేయులయొక్క రాజకీయ దురాక్రమణను మనం పారద్రోలిన రీతిగానే ఆంగ్లభాషయొక్క సంస్కృతిక దురాక్రమణను కూడా పారద్రోలవలెనని నా వాదన అంతర్జాతీయ వ్యాపారానికీ, రాజకీయాలకు మాత్రం మిక్కిలి అనుగుణ్యాం కలిగివున్న ఆంగ్లభాషకు ఆ స్థానం ఎలాగూ మిగుల్తుంది.

హరిజన్, 21-9-47.

సంస్కృత భాషయొక్క స్థానం :

మత సంబంధమైన విషయాలలో సంస్కృతం తప్పనిసరిగా అవసరమని నా అభిప్రాయం. భాషాంతరీకరణాలు, ఎంతజాగ్రత్తగా చేయబడినవైనాగాని, స్వయంశక్తిమంతములైన అసలు మంత్రములయొక్క స్థానమును ఆక్రమించలేవు. అంతేకాక పలుశతాబ్దులనుండి సంస్కృతభాషలో ఉచ్ఛారితములైన ఆ మంత్రములను ఈనాడు మన దేశభాషలలోకి తర్జుమాచేసి పలికితే వాటి శబ్దగాంభీర్యమూ, భావగౌరవమూ కుంటుపడిపోతుంది. అయితే ప్రతిమంత్రమును, ప్రతికర్మకాండను దానిని ఉచ్ఛరించేవానికి లేక దానిని ఆచరించేవానికి అది చక్కగా తెలిసేలాగున బోధపరచడం అవసరమని తలుస్తాను. సంస్కృతభాషలో తగుమాత్రం పరిచితిలేనిదే ఏ హిందూమతస్థుని విద్యాభ్యాసంగాని పూర్తి అయినట్లు నేను భావించను. సంస్కృత భాషాజ్ఞానము,

సంస్కృత పాండిత్యము తగినరీతిగా వ్యాప్తిపొందనినాడు హిందూమతం అంతరించిపోతుంది. దానిని నేర్వడం సులభమే అయినా ప్రస్తుత విద్యావిధానంవల్ల అది కష్టసాధ్యమై పోయింది. ఒకవేళ అది కష్టమని తలచినా, మతసాధన అంతకంటె కష్టతరమని గ్రహించగలరు. కావున మతవిషయంలో సాధకుడైనవాడు దానికి సోపానప్రాయమైన దేనినిగాని, అది ఎంత కష్టమైనదిగా కనిపించినా, సులభతర మైనదిగానే భావిస్తాడు.

యంగిండియా 13-5-26.

అధ్యాయం ౫౨

* దక్షిణదేశంలో హిందీభాష.

ద్రావిడదేశీయులు ఏదో ఒకనాడు హిందీభాషను నేర్చుకొనడానికి గట్టి ప్రయత్నం చేయగలరని నాకు గాఢానమ్మకం వున్నది. ఆంగ్లం నేర్చుకొనుటకు వారు వ్యయపరిచే శ్రమలో ఎనిమిదవవంతు హిందీని నేర్చుకొనుటకు వినియోగించినచో ఇంతవరకు వారికి అపరిచితంగావున్న భారతదేశపు దూరభాగాలన్నీ వారికి కరతలామలకములై మాకందరికీ వారు అత్యంత సన్నిహితులు కాగలుగుతారు. ఈ వాదం ఇరుపక్షాలకూ

వర్తించగలదని కొందరు అంటారని నే నెరుగుదును. మిగతా భారతదేశస్థులంతా ద్రావిడ భారతంతో సంపర్కం కలిగించుకొనుటకుగాను తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం భాషలను నేర్చుకొనడంకన్న అల్ప సంఖ్యా

* ఆంగ్లభాషలో అక్షరాస్యత.

1951 వం॥ జనాభా లెక్కలపై ఆధారపడిన ఈ క్రిందిఅంకెలు ఉద్యోగ భాషాకమీషన్ రిపోర్టు (Official Language Commision Report) పే. 468 నుంచి ఉటంకించ బడినవి:

(వేలలో)

రాష్ట్రములు	జనసంఖ్య	అక్షరాస్యుల సంఖ్య	ఆంగ్లంలో అక్షరాస్యుల సంఖ్య	3వ కాలంలో 4వ కాలం శాతం	2వ కాలంతో 4వ కాలం శాతం
1	2	3	4	5	6
బొంబాయి	35,956	8,829	458	5.19	1.27
పంజాబు	12,641	2,039	325	15.93	2.56
పశ్చిమ బెంగాలు	24,810	6,088	597	9.81	2.41
అజ్మీరు	693	139	18	13.11	2.63
దక్షిణ భారతం (అనగా, మద్రాసు, మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిను, కూర్గు)	75,600	17,234	876	5.08	1.15
మద్రాసు (ఆంధ్ర విభజనాంతరం)	35,735	7,800	400	5.13	1.12
ఆంధ్ర	20,508	3,108	165	5.36	0.81
మైసూరు (బళ్లారి తాలూకాలతో సహా)	9,849	1,956	136	6.94	1.38

కులైన ద్రావిడ ప్రాంతీయులు మిగతా భారతదేశమంతకు సామాన్యమైన భాషను నేర్చుకోవడమే సమంజసమని జాతీయ సౌలభ్యదృష్ట్యాచూస్తే గోచరంకాగలదు. ఆ కారణంవల్లనే మదరాసు రాజధానిలో తీవ్రమైన హిందీప్రచార కార్యక్రమం నడుస్తూవుంది.

ద్రావిడ ప్రాంతీయు లెవరుగాని హిందీభాష నేర్చుకోవడం ఏ మాత్రం కష్టమని అనుకోనక్కరలేదు. ప్రతిదినం ఆటవిడుపు కాలంలో కొంచెంభాగం ఇందునిమిత్తం వినియోగించి, క్రమపద్ధతిని కృషిచేస్తే, సామాన్య బుద్ధికుశలతగల ఏ వ్యక్తినిగాని ఒక సంవత్సర కాలంలో హిందీ భాషను నేర్చుకో గలుగుతాడు. పెద్ద పురపాలకసంఘాలు యిప్పటి

హిందీలో అక్షరాస్యత

హిందీలో అక్షరాస్యతా వ్యాప్తినిగురించి ఈక్రిందిఅంకెలు, 1918-1955 సం॥ రములకు చెందినవి, దక్షిణభారత హిందీప్రచారసభ, మద్రాసు యొక్క నివేదికనుండి ఉటంకించ బడినవి.

(లక్షలలో)

	జనసంఖ్య	అక్షరాస్యులు	హిందీలో అక్షరాస్యులు
ఆంధ్ర	203.2	30.4	8.02
తమిళనాడు	277.7	51.8	8.98
కేరళం	140.1	72.8	14.22
కర్నాటకం	228.4	48.7	9.87
తెలంగాణం	80.0	13.3	1.36
మద్రాసునగరం	14.2	4.3	1.75

నుంచీ తమకు చెందిన స్కూళ్ళలో హిందీని వైకల్పిక (Optional) భాషగా ప్రవేశపెట్టవచ్చుననికూడా నాసూచన. ద్రావిడప్రాంతపు పిల్లలు చాలా సులభంగా హిందీభాషలో ప్రవేశం పొందగలరనికూడా నాఅనుభవాన్నిబట్టిచెప్పగలను. దక్షిణాఫ్రికావాసులైన తమిళ, తెలుగు భాషలవారు హిందీలో సులభంగా సంభాషించే పరిజ్ఞానం కలిగివున్న సంగతి అందరికీ తెలియును. కావున మద్రాసు ప్రాంతానికి చెందిన యువజనులు వారికి ఉచితంగా హిందీ నేర్చుకొనడానికి ఏర్పాటుచేసిన మార్వాడీవారి ఔదార్యాన్ని చక్కగా వినియోగించుకొనగలరని ఆసింప సాహసిస్తాను.

యంగిండియా, 16-6-20

బెంగాలు, మద్రాసు రాష్ట్రాలు రెండే హిందూస్థానీ రాకపోవడం మూలంగా భారతదేశపు ఇతర ప్రాంతాలనుంచి దూరం చేయబడ్డాయి. బెంగాలు విషయంలో వారు భారతదేశపు ఏ ఇతర భాషనుగాని నేర్చుకొనడానికి అయిష్టభావం కలిగివుండడమున్నా, మద్రాసు విషయంలో ద్రావిడ ప్రాంతీయులు హిందూస్థానీ నేర్చుకొనడం కొంచెం కష్టం కావడమున్నా అందుకు కారణాలు. రోజుకి మూడుగంటలు వెచ్చిస్తే, బెంగాలీ ఎవరుగాని రెండునెలలలో హిందూస్తానీ అభ్యసించగలరు; అదేకాలం వ్యయపరిస్తే ద్రావిడప్రాంతీయులెవరుగాని ఆరునెలలలో దానిని నేర్చుకొనగలరు. ఏ బెంగాలీగాని, ద్రావిడ ప్రాంతీయుడుగాని అదే గడువులో ఆంగ్ల

భాషలో సమానఫలితం పొందలేరు. ఆంగ్లభాషాజ్ఞానంవల్ల అదివచ్చిన కొలదిమందితో మాత్రమే సంపర్కం కలుగుతుంది; హిందూస్థానీ పరిజ్ఞానంద్వారా మన దేశస్తులలో అత్యధిక సంఖ్యాకులతో సంపర్కం సులభసాధ్యమవుతుంది. ద్రావిడప్రాంతీయులకు గల ఇబ్బందిని నేను అర్థం చేసికొనగలను; కాని వారి శ్రమాయుతమైన దేశభక్తిముందర ఇదొక కష్టతరమైన కార్యమని నేను ఎంచను.

యంగిండియా 2-2-21.

ఆంగ్లభాష అంతర్జాతీయరంగంలో వాణిజ్యవ్యాపారాలకును, రాజనీతి కార్యాలకును ఉపకరించే భాష, రసవంతమైన సాహిత్యసంపద కలిగినభాష; పాశ్చాత్యభావనా సంస్కృతులలో ప్రవేశమొసగేభాష. అందువలన మనలో కొలదిపాటిమందికి ఆంగ్లభాషా పరిచయం అవసరం కావచ్చును. అట్టివారు జాతీయ వ్యాపారశాఖను, అంతర్జాతీయ రాజనీతి శాఖను నడిపించి, పాశ్చాత్య సాహిత్య, తాత్విక, శాస్త్రీయ సంబంధమైన ఉత్తమ విషయాలను భారతదేశానికి అందీయవచ్చును. అది ఆంగ్లభాషయొక్క యోగ్యప్రయోజనాన్ని సిద్ధింపజేసుకునే మార్గం. కాని ఈ నాడు అది మన హృదయాలలో అత్యంత ప్రేమపాత్రమైన స్థానాన్ని ఆక్రమించి, మన మాతృభాషలను సింహాసన భ్రష్టమొనర్చినది. అది గడించిన ఈ అసహజమైన స్థానప్రాప్తికి ఆంగ్లేయులతో ఈ నాడు మనకు ఏర్పడివున్న అసమానమైన సంబంధమే కారణం. ఆంగ్లభాషాజ్ఞానం అవసరం లేకుండా భారతీయ

మనస్సు ఉచ్ఛతమపరిణతిని అందుకోగలగాలి. మన బాల బాలికల మనస్సులలో ఆంగ్లభాషాజ్ఞానం లేనిదే సభ్యసంఘంలో ప్రవేశంకలగదనే అభిప్రాయాన్ని మనం ప్రోద్బల పరచడం అనేది భారతీయుల పురుషకారానికీ, భారతనాకుల స్త్రీత్వానికీ అత్యాచారం చేయడమే అవుతుంది. అట్టి అవమానకరమైన అభిప్రాయం సహింపరానిది. ఆంగ్లభాషా వ్యామోహాన్ని వదలించుకోవడం అనేది స్వరాజ్య నిర్మాణానికి ప్రాతిపదికలలో ఒకటి.

యంగిండియా, 2-2-21.

మనం కృత్రిమ పరిస్థితులలో జీవిస్తూవుండడం బట్టి తప్ప, లేనియెడల దక్షిణదేశవాసులైనవారు హిందీ నేర్చుకోవడం కష్టతరమనిగాని, అనవసరమనిగాని అనుకోవడం వుండేదికాదు. హిందీ మాట్లాడేవారికి దాక్షిణాత్యభాషలను నేర్చుటకంటె దాక్షిణాత్యులకు హిందీ నేర్చుకోవడం ఎక్కువ అవసరమన్న సంగతి నిస్సంశయం. భారతదేశ మొత్తాన చూస్తే, దాక్షిణాత్యభాషలు మాట్లాడే వారందరికంటే హిందీభాష మాట్లాడే జనభా రెట్టుకి రెట్టు ఉంటారు. భారతదేశమంతటికి అంతరరాష్ట్ర సంపర్కాలకుగాను ఒక సామాన్య భాష అవసరం. అది ప్రాంతీయభాషలయొక్క లేక భాషలయొక్క స్థానే కాక, వాటికి తోడుగావుండాలి. అట్టి భాష హిందీ - హిందూస్తానీ ఒక్కటే.

ప్రజాసామాన్యాన్ని గురించి ఏ మాత్రం ఆలోచించని వారు కొందరు దానికి బదులుగా ఆంగ్లభాషను ఉప

యోగించవచ్చునని మాత్రమేకాక, ఆంగ్లభాష ఒక్కటే అందుకు అనుకూలమైన వాహనమనికూడా భావించడం కలదు. విదేశీయుల పాలనయొక్క వ్యామోహావశత్వంవల్ల తప్ప, లేనియెడల ఈ రీతి అభిప్రాయం అనూహ్యమని తేటతెల్లమవుతుంది. జాతీయవ్యవహారాలలో అధికాధికంగా పాల్గొనవలసిన దాక్షిణాత్య ప్రజాసామాన్యానికి తమ భాషలతో చాలావరకు సమానపదాలు కలిగివుండి, ఉత్తరదేశమంతటితోను సంపర్కాన్ని సాధ్యమొనర్చె హిందీభాషను నేర్చుకొడడం సులభమా? లేక బహు కొలదిమందికి మాత్రమే వచ్చిన కేవల వైదేశికభాషను నేర్చుకొనడం సులభమా?

ఈ నిర్ధారణ మనయొక్క స్వరాజ్య నిర్వచనంమీద ఆధారపడుతుంది. అది ఆంగ్లభాషావిదులైన భారతీయుల కోసం మాత్రమే అయినచో అందుకు ఆంగ్లభాషయే నిస్సందేహంగా సామాన్య వాహనమని చెప్పవచ్చును. అది లక్షలాది పేదలకు, నిరక్షరాస్యులైన పురుషులకు, అక్షరజ్ఞానం లేని స్త్రీలకు, పతితులైన అస్పృశ్యులకు ఉద్దేశింపబడినదనిగాని, వారికి చెందినదనిగాని నిర్వచించుకుంటే మాత్రం, హిందీ ఒక్కటే అందరికీ సామాన్యమైన భాషావాహనమని అంగీకరించక తప్పదు.

యంగిండియా 18-6-31.

ఈ దక్షిణభాషలు కూడా సంస్కృతభాషాపుత్రికలే అయినా, వాటికిని హిందీ, ఒరియా, బెంగాలీ, అస్సామ్,

పంజాబీ, సింధీ, మరాటీ, గుజరాతీ భాషలకును తేడావున్న దని నాఅభిప్రాయం. వాటి వ్యాకరణానికీ హిందీ వ్యాకరణానికీ పూర్తిగా భేదం వున్నది. వాటిలోకూడా సంస్కృతపదాలు అత్యధికసంఖ్యలో వున్నవనిన్నీ, వాటిలో అభివ్యక్తత కష్ట మైనప్పుడల్లా తల్లివద్ద పిల్లలవలె అవి సంస్కృతభాషయొక్క సహాయంకోరి తమ పరిపోషణకు అవసరమైన నూతనపదాలను గ్రహిస్తాయనిన్నీ తెలియజెప్పడానికే వాటినికూడా సంస్కృత భాషా ప్రతికలనిచెప్పి వర్ణించాను. పురాతనకాలంలో అవి ప్రత్యేకమైన స్వతంత్రభాషలుగా వుండివుండవచ్చును. కాని ఇప్పుడవి సంస్కృతపదాలను చేర్చుకుని పుష్టి పొందు తున్నాయి. వాటినికూడా సంస్కృత ప్రతికలుగా భావించ డానికి ఇంకా అనేక కారణాలు ఉన్నవికాని, అవన్నీ ఇప్పుడు వివరించనవసరం లేదు.

ప్రాంతీయ భాషలకు హానికలిగించడంకాని, అణగ ద్రొక్కడంగాని, నశింపచేయడంగాని ఏమాత్రం కూడదనియే సర్వదా నా అభిప్రాయం. అంతరప్రాంతీయ సంపర్కాలకు గాను హిందీభాషను సామాన్య భాషావాహనంగా భావించి అందరును దానిని నేర్చుకోనవలసినదని మాత్రమే మన అభి మతం. అంటే హిందీయెడల మనకు పక్షపాతమని అర్థంకాదు. హిందీని మన జాతీయభాషగా మాత్రమే భావిస్తామన్నమాట. అట్లు దానిని స్వీకరించుటకు అది అనుగుణమైనది. అందరూ నేర్చుకొనుటకు సులభసాధ్యమైనదే జాతీయభాష కాగలదు.

ఈ అభిప్రాయానికి చెప్పదగిన ప్రాతికూల్యత ఏమీ వున్నట్లు గోచరించదు.

ఆంగ్లభాషయొక్క స్థానాన్ని హిందీ ఆక్రమించినచో నా మట్టుకు నేను సంతసిస్తాను. అయినా ఆంగ్లభాషయొక్క ప్రాధాన్యతను కూడా మన మెరుగుదుము. ఆధునిక విజ్ఞానాన్ని పొందుటకును, ఆధునిక సాహిత్యాన్ని తెలిసికొనుటకును, ప్రపంచపరిస్థితులను గ్రహించుటకును, మన ప్రస్తుత పరిపాలకులతో వ్యవహరించుటకును, ఇంకా అట్టి ఇతర విధములైన కార్యములకును మనకు ఆంగ్లభాషాపరిజ్ఞానం అవసరం. ప్రస్తుత పరిస్థితులలో, మనకు ఇష్టం లేకపోయినా గాని, ఆంగ్లభాషను నేర్చుకోవలసిన అవసరం ఉన్నది. ఆంగ్లభాష అంతర్జాతీయభాష.

అయితే, ఆంగ్లభాష మనకు జాతీయభాషగా మాత్రం ఎన్నటికీ కాజాలదు. ఈ రోజున అది సర్వప్రధానమైనదిగా కనిపిస్తున్నమాట వాస్తవమే. దాని వంశంనుంచి ఎంత తప్పించుకొనవలెనని ప్రయత్నించినాగాని, అది మనజాతీయ వ్యవహార నిర్వాహణలో అధికతరమైన స్థానాన్ని ఆక్రమించి వుంటూనే వుంది. కాని దీనినిబట్టి అది మన జాతీయభాష కాగలదనే భ్రమలోమాత్రం పడకూడదు.

ఏ రాష్ట్రాన్నిగాని తీసుకుని, మన అనుభవజ్ఞానాన్ని బట్టి ఈ మాట రుజువుపరచవచ్చును. ఆంగ్లభాషాప్రభావం అధికతరంగా ఏర్పడివున్న బెంగాలునుగాని, దక్షిణ యిండి

యానుగాని ఉదాహరణగా తీసుకుందాం. ఈ ప్రాంతాలలోనైనా ప్రజానీకంచేత ఏ పనిగాని చేయించవలెనంటే, అది ఈ క్షణాన్ని హిందీద్వారా వీలుకాకపోయినా, ఆంగ్లంద్వారా అసలు జరుగదు. ఏవో కొన్ని హిందీమాటల సహాయంతో ఎంతో కొంత మన అభిప్రాయాలను ప్రజలకు తెలపగలమేమోగాని, ఆంగ్లంద్వారా అంతపాటి కూడా సాధ్యంకాదు.

ఇంతవరకు ఇంకా జాతీయభాషగా స్థిరపడగలిగిన భాష ఏదీలేదన్న విషయం మాత్రం అంగీకరించవచ్చును. ఆంగ్లం ఉద్యోగభాషగా నడుస్తున్నది. ప్రస్తుత పరిస్థితులలో ఇది సహజం. అది ఇంతకుమించిన స్థానం పొందడం కేవలం అసాధ్యమని నా అభిప్రాయం. భారతభూమిని మన ఏకదేశంగా చేయవలెనంటే, మీరు నమ్మినా నమ్మకపోయినా, జాతీయభాష కాగల అర్హత ఒక్క హిందీకి మాత్రమే ఉన్నదంటాను. ఆ విషయంలో హిందీకి ఉన్న అనుకూల్యాలు మరి ఏ భాషకూ లేకపోవడమే దానికి కారణం. హిందీ హిందూస్తానీ భాషను, కొలది తేడాలతో, మాట్లాడేవారి సంఖ్య, హిందూవులూ, ముస్లిములూ కలిపి, సుమారు 22 కోట్ల జనాభా ఉంటుంది.

దీనినిబట్టిచూస్తే, ప్రస్తుతపరిస్థితులలో, ప్రాదేశికభాషను ప్రాదేశిక ప్రభుత్వకార్యాలకును, హిందీని యావద్భారత వ్యవహారాలకును, ఆంగ్లభాషను అంతర్జాతీయ ప్రయోజనాలకును

వినియుక్తం చేయడం ఒక్కటే యోగ్యమూ, సాధ్యమూ అయిన విధానమని గోచరిస్తుంది. హిందీభాష మాట్లాడే వారి సంఖ్య కోట్లసంఖ్యలో వుంటుంది; ఆంగ్లం మాట్లాడే వారి సంఖ్య ఎంత పెరిగినా లక్షలకు మించలేదు. అది పెంచ డానికి ప్రయత్నించడం కూడా ప్రజలకు అన్యాయం చేయడ మవుతుంది.

(హిందీనుంచి)

1935 సం॥లో ఇండూరులో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనపు 24వ సమావేశంలో గాంధీజీ ఒసగిన అధ్యక్షోపన్యాసం నుంచి.

హిందూస్తానీ ప్రస్తుతం మన రాష్ట్రభాషగాని లేక యావద్భారత సంపర్కానికి వాహనమైన భాషగా పరిగణింప బడుతున్నదనిగాని లేక కొలదికాలంలో పరిగణింపబడనున్న దనిగాని మనంచేసే ప్రకటనలు హృదయపూర్వకమైనవే కనక అయితే, హిందూస్తానీ అభ్యసించడాన్ని నిర్బంధం చేయ డంలో తప్పేమీ వుండదు. ఆంగ్లదేశంలోని పాఠశాలలలో ఇంతవరకు, బహుశా ఇప్పుడుకూడా, లాటిన్ భాషాభ్యాసం నిర్బంధమైనదిగా వుండేది. దానిని అభ్యసించడం ఆంగ్ల భాషాభ్యాసానికి ఏ మాత్రం ఆటంకంగా వర్తించలేదు. ఆ భాష నేర్వడంవల్ల ఆంగ్లభాషకూడా పరిపుష్టిపొందింది. "మాతృభాషలకు ఆపత్తు కలుగుతున్నద"నే వివాదం అజ్ఞాన జనితమైనా కావాలి, లేదా కాపట్యంతో కూడినదైనా అయివుండాలి. నిజాయితీతో కూడినదైనపట్ల, మన పిల్లలు

రోజుకొక గంటసేపు హిందూస్తానీ అభ్యసించడం వల్లకాదనడం అట్టివారియొక్క దేశభక్తి లోపాన్నిమాత్రమే చాటుతుంది. అఖిలభారతజాతీయతను నెలకొల్పదలిస్తే కరడుకట్టిన ప్రాంతీయాభిమానాలను ఛేదించుకు ముందంజ వేయవలసివుంటుంది. భారతదేశాన్ని ఒకే ఒక దేశంగాను, ఒకే ఒక జాతీయతగాను నిర్మిద్దామా, లేక వివిధములైన దేశములుగాను, వివిధములైన జాతులుగాను ఛేదిద్దామా?

హరిజన్, 10-[illegible]-38.

అధ్యాయం ౫౩

విద్యార్థుల కొక నియమావళి.

(1) విద్యార్థులు పాక్షిక రాజకీయాలలో పాల్గొనకూడదు. వారు విద్యార్థులు, అన్వేషకులు; అంతేకాని రాజకీయవేత్తలు కారు.

(2) వారు రాజకీయమైన సమ్మెలు చేయరాదు. వారికి తమ వీరనాయకులపట్ల ఆరాధనభావం ఉండవచ్చును. అయితే వారు తమ వీరనాయకులలోని సుగుణాలను అలవరచుకొనడంద్వారా తమ పూజ్యభావములను వెల్లడించవలసినదేగాని ఆ నాయకులు కారాబద్ధులైనా, మరణించినా, ఉరికంబ మెక్కవలసివచ్చినా కూడా సమ్మెలుమాత్రం చేయకూడదు. వారి దుఃఖం దుర్భరమైనప్పుడు, అందరు విద్యార్థులూ సమానంగా అట్టి భావం కలిగివున్నప్పుడు, తమ

విద్యాలయాధికారుల అనుమతితో పాఠశాలలుగాని కళాశాలలుగాని మూసివేయవలసినదిగా కోరవచ్చును. అట్టి కోరికను అధికారులు పెడచెవిని పెట్టిన పక్షంలో విద్యార్థులు క్రమపద్ధతి ననుసరించి ఆయాసంస్థలను విడిచి బయటికి రావచ్చును; వాటియజమానులు పరితప్తులై తిరిగి ఆహ్వానించేవరకు ఆ విధముగా చేయవచ్చును. తమతో కలిసిరానివారి యెడలగాని, అధికారుల యెడలగాని ఏ పరిస్థితిలోగాని బలాత్కారం ప్రయోగించకూడదు సమైక్యతతోను. సగౌరవ ప్రవర్తనతోను నడచుకొన్నయెడల తాము తప్పనిసరిగా జయంపొందగలమనే ఆత్మవిశ్వాసం కలిగివుండాలి.

(3) వారు శాస్త్రపద్ధతిని సూత్రయజ్ఞం అలవరచుకోవాలి. వారు తమ పనిముట్లను సర్వదా ఏర్పాటుగాను, పరిశుభ్రంగాను, తయారుగాను ఉంచుకోవాలి. వీలైతే వాటిని స్వయంగా తయారుచేయడం నేర్చుకోవాలి. అట్లు వున్నచో వారు సహజంగా మంచిరకం నూలు వడకగలిగి వుంటారు. వడుకు నూలుపరిశ్రమనుగురించిన ఆర్థిక, సాంఘిక, నైతిక, రాజకీయ విషయికమైన వివరాలను తెలిపే రచనలు పఠించి తెలుసుకోవాలి.

(4) వారు నిత్యం ఖద్దరుబట్టనే వాడాలి. గ్రామ పరిశ్రమా నిర్మితములైన వస్తువులనేవాడి, విదేశములోగాని యాంత్రికంగాగాని తయారైన ఆయావస్తువులను విసర్జించాలి.

(5) 'వందేమాతరం' పాడమనిగాని, జాతీయపతాకం ప్రతిష్ఠించమనిగాని ఎవరినీ బలవంతం చేయకూడదు. జాతీయ

పతాకముద్రితమైన గుండీలను తాము ధరించవచ్చునుగాని, ఇతరులను ధరించమని బలాత్కరించకూడదు.

(6) వారు త్రివర్ణపతాకపు సందేశాన్ని వ్యక్తిగతంగా అవలంబించి, కులతత్వాన్ని అస్పృశ్యతనూ తమ హృదయాలనుంచి పారద్రోలాలి. ఇతర మతములకు చెందిన విద్యార్థులతోను, హరిజనులతోను మనఃపూర్వకంగా స్నేహం చేసుకుని, వారిని తమ బంధుజను లట్లుగా భావించాలి.

(7) తమ ఇరుగు పొరుగువా రెవరైనా గాయపడితే వారికి ప్రథమ చికిత్సచేయాలి; ఇరుగు పొరుగు గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమం నెరపాలి; గ్రామీణులైన బాలబాలికలకు, వయోజనులకు విద్యగరపాలి.

(8) ప్రస్తుతం భాషణంలోనూ లిపిలోనూ ద్విరూపకంగావున్న హిందూస్తానీని జాతీయభాషగా భావించి, అభ్యసించాలి; తద్వారా హిందీ, ఉర్దూభాషలతోనూ నాగరి, ఉర్దూలిపులతోను పరిచితులై వుండాలి.

(9) తామునేర్చిన ప్రతినూతన విషయమును తమ మాతృభాషలోకి అనువదించి, ప్రతివారమూ ఇరుగుపొరుగు గ్రామాలకుపోయి దానిని ప్రచారం చేయాలి.

(10) ఏ పనిలోగాని రహస్య ముండకూడదు. వారు వ్యవహరించే కార్యకలాపాలన్నీ బహిరంగమైనవిగా వుండాలి. వారు ఆత్మనిగ్రహంతో కూడిన స్వచ్ఛజీవితాలు అలవరచుకోవాలి. నిర్భయంగావుండి, దుర్బలులైన తమ తోడి విద్యా

ర్థులకు రక్షణ ఒసగాలి. కొట్లాటలు జరిగినప్పుడు తమ ప్రాణా మైనా ఒడ్డి, దౌర్జన్యరహితమైన ప్రవర్తనద్వారా వాటిని ఉపశమింపజేయుటకు సంసిద్ధులై వుండాలి. ఉద్యమంయొక్క తుదిసంఘర్షణ ఆసన్నమైనప్పుడు, వారు తమ విద్యాసంస్థలను విడనాడి, తమ దేశ స్వాతంత్ర్య సంపాదనమునకు అవసర మైతే తమ ప్రాణములనైనా సమర్పించాలి.

(11) తమ తోడి విద్యార్థినులయెడల (scrupulously correct & chivalrous) వారి ప్రవర్తన మిక్కిలి క్రమ బద్ధంగాను, సాహసోదారంగాను వుండాలి.

నేను సూచనప్రాయంగా తెలిపిన ఈ కార్యక్రమాన్ని అచరించడానికి విద్యార్థులు తగిన వ్యవధి సంపాదించుకోవాలి. వారు సోమరితనంగా కావలసినంతకాలం వెళ్లబుచ్చుతారని నాకు తెలుసు. కాలాన్ని జాగరూకతతో వినియోగించినచో వారు కొన్నిగంటల వ్యవధిని సంపాదించుకొనవచ్చును. ఏవిద్యార్థిపైనగాని ఎక్కువభారం మోపడం నేనిచ్ఛగించను. అందువల్ల, దేశభక్తిపూరితులైన విద్యార్థులు తమ విద్యా భ్యాస కాలమంతటిలోను అప్పుడప్పుడు కొంత వ్యవధి సేక రించుకొని మొత్తంమీద ఒక సంవత్సరకాలం ఈ కార్య క్రమానికి వినియోగించడానికి ప్రయత్నిస్తే బాగుంటుందని నా సలహా. అందు నిమిత్తం గడిపిన ఆ సంవత్సరకాలం దుర్వ్యయం కాబోదు. ఆ ప్రయత్నం వారికి మానసికమూ, నైతికమూ, దైహికమూ అయిన క్రమశిక్షణను, అనుభవ

మును చేకూరుస్తుంది. అంతేకాక వారు తమ విద్యాభ్యాస కాలంలోనే స్వాతంత్ర్యోద్యమానికి యోగ్యమైన కృషి చేసిన వారుకూడా అవుతారు.

ది బొంబే క్రానికల్, 9-1-46.

పాశ్చాత్యులను మనం హేయంగా అనుకరించడం వల్లగాని, సున్నితమైన ఆంగ్ల భాషలో వ్రాయనూ చదవనూ రావడంద్వారాగాని మన స్వాతంత్ర్యాలయ నిర్మాణానికి ఒక్క ఇటుకముక్కనైనా సమర్పించలేము. ప్రస్తుత విద్యార్థి లోకం దరిద్రభారతానికి తగని వ్యయభారంకలిగించే విద్యాభ్యాసాన్ని పొందుతూవుంది. అది పొందే అవకాశం జనాభా మొత్తంలో అత్యల్పసంఖ్యాకులకు మాత్రమే వుంది. అట్టి విద్యను పొందుటకు వారు తమ అర్హతను నిరూపించుకొనవలెనంటే, వారు తమ జీవరక్తాన్ని దేశానికి ధారపోయడానికి సంసిద్ధులై వుండాలి. విద్యార్థులు పూర్వాచార సంస్కరణ రంగంలో ముందంజ వేయాలి. మన జాతీయతలోని మంచినంతను సేకరించి, సంఘ జీవితంలో ప్రవేశించిన అసంఖ్యాకమైన దురాచారాలను నిర్భయంగా తొలగించడానికి పూనుకోవాలి.

విద్యార్థులు లక్షలాదిగావున్న నోరులేని ప్రజాసామాన్యంపై తమ ప్రభావాన్ని ప్రసరింపచేయాలి. ఒక ప్రాంతము, ఒక పట్నము. ఒక వర్గము, ఒక కులము దృష్ట్యాకాక కోట్లకొలది ప్రజానీకంతో కూడిన ఒక ఖండానికి చెందిన దృష్టి

నుంచి ఆలోచించడం అలవరచుకోవాలి. ఆ కోట్లాది జన సామాన్యం అస్పృశ్యులతోను, త్రాగుబోతులతోను, గూండాలతోను, భోగస్త్రీలతోనూ కూడా కూడిన సమూహమనిన్నీ, మన మధ్యనే అట్టి వారందరూ వుండడానికి మనలో ప్రతిఒక్కరూ బాధ్యులనిన్నీ కూడా గుర్తించాలి. పూర్వం విద్యార్థులు బ్రహ్మచారులని పిలువబడేవారు. అనగా దేవుని సాంగత్యంలో, దేవునియెడల భయభక్తులతో, వర్తించే వారని అర్థం. వారు ప్రభువులచేత, పెద్దలచేత గౌరవం పొందేవారు. వారు దేశంవల్లనుంచి ఉచితపోషణ పొందేవారు; వారును దానికి నూరురెట్లు ప్రత్యామ్నాయంగా తమ దేశానికి శక్తివంతమైన ఆత్మలను, శక్తివంతమైన మేధస్సులను, శక్తివంతమైన బాహువులను ఒసగేవారు. ఆధునిక లోకంలో పతనావస్థపాలైవున్న ప్రతి దేశంలోను విద్యార్థులే భవిష్యదాశా ప్రదీపకులుగా భావింప బడుతూ వున్నారు; ప్రతిరంగమునందును వారే స్వార్థత్యాగపూరితులైన సంస్కరణోద్యమ నాయకులుగా రూపొందుతున్నారు. భారతదేశంలోనూ అట్టి ఉదాహరణలు లేకపోలేదు. కాని అవి ఇంకా చాలవు. విద్యార్థిమహాసభలు బ్రహ్మచర్యాదర్శానికి అనుగుణమై ఇట్టి కార్యక్రమానికి నిలబడవలసి వున్నదని నా అభిప్రాయం.

యంగిండియా 9-6-27.

విద్యార్థులు తమ సెలవుకాలం అంతా కూడా గ్రామసేవకు వినియోగించాలి. అట్లు చేయవలెనంటే వారు నడ

చిన దారినే నడవడం మాని, తమ విద్యాలయాలకు చేరికలో వుండే గ్రామాలవైపు నడిచి, గ్రామీణులతో స్నేహం చేసుకుని, గ్రామ పరిస్థితులను పరిశీలన చేయాలి. ఈ విధంగా విద్యార్థిదశలో గ్రామస్థులతో అప్పుడప్పుడు, వారు కలిగించు కున్న పరిచితి మున్ముందు వారు గ్రామస్తులమధ్య పనిచేయు టకు పోయినప్పుడు, వారి దృష్టిలో అనుమానాస్పదులైన క్రొత్తవారుకాక పూర్వపరిచితులుగా గోచరిస్తారు. పెద్ద సెలవులు వచ్చినప్పుడు విద్యార్థులు గ్రామాలలోనే మకాం చేసి, వయోజన తరగతులను నడపడం, గ్రామపరిశుభ్య సూత్రాలను బోధించడం, సామాన్య వ్యాధిగ్రస్తులకు చికిత్స చేయడం మొదలైన పనులు చేయాలి. గ్రామాలలో నూలు వడికే రాట్నాన్ని ప్రవేశపెట్టి, గ్రామస్తులకు ప్రతి వ్యవధి క్షణమును లాభకరంగా గడపడం నేర్పాలి. ఈ కార్యక్రమం నెరవేర్చదలిస్తే, విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా సెలవు దినముల ప్రయోజనములను గురించి తమ పూర్వాభిప్రాయా లను మార్చుకోవలసి వుంటుంది. తరచుగా, ఆలోచనలేని ఉపాధ్యాయులు పిల్లలకు సెలవుదినములలో చేయడానికి పాఠ క్రమం అప్పచెపుతారు. ఇది అన్నివిధాలా చెడ్డ అలవాటని నా అభిప్రాయం. చర్వితచర్వణమైన మామూలు పాఠాల నుంచి విద్యార్థుల మనస్సులు విముక్తములై, స్వేచ్ఛగా స్వతసిద్ధ వికాసనమును పొందడానికి ఈ సెలవురోజులే తగిన అవకాశం. నేను పైన పేర్కొన్న గ్రామసేవా కార్యక్రమమే వారికి ఆ వ్యవధిలో ఉత్తమమైన ఆటవిడుపును, తేలికైన శిక్ష

ణమును ఒసగే విధానమని తలుస్తాను. విద్యాభ్యాసానంతరం గ్రామసేవాకార్యానికి ప్రధానంగా కృషిచేయదలచిన వారికి ముఖ్యంగా ఇది మిక్కిలి ఉపయోగకరమైన తరిఫీదు కాగల దని వేరుగా చెప్పనవసరంలేదు.

యంగిండియా, 26-12-29.

మీ తెలివితేటలను రూపాయి అణా పైసలలోకి మార్చ డానికి బదులు దేశసేవ నిమిత్తం వినియోగించండి. నీవు వైద్యం అభ్యసించిన వాడివైతే నీ వైద్యనైపుణ్యం చూప డానికి భారతదేశంలో కావలసినన్ని వ్యాధులు పరివ్యాప్తమై వున్నాయి. నీవు న్యాయశాస్త్రం నేర్చినవాడివైతే భారత దేశంలో కావలసినన్ని తగాదాలూ, పేచీలూ నిబిడీకృతమై వున్నాయి. వాటిని మరింత పెంచక, ఉన్న తగాదాలను రాజీపరచడానికి, లావాదేవీలు తగ్గించడానికి ప్రయత్నించు. నీవు (Engineer) సాంకేతిక శాస్త్రజ్ఞుడవైతే నీ దేశపు ఆర్థిక స్థితికిని ప్రజావసరాలకును అనుగుణమై, గాలీ వెల్తురూవచ్చే ఆరోగ్యవంతమైన ఆదర్శగృహనిర్మాణం చెయ్యి. నీవు ఏ విద్యను నేర్చివున్నప్పటికీ దానిని ప్రయోజనకరంగా వినియుక్తం చేయడానికి అవకాశమున్నది.

యంగిండియా, 5-10-31.

విద్యార్థులు, రాజకీయాలు!

విద్యార్థులకు వీలైనంత ఎక్కువగా అభివ్యక్తతా స్వాతంత్ర్యము, అభిప్రాయ స్వాతంత్ర్యము వుండాలి. వారు

తమకు నచ్చిన ఏ రాజకీయ పక్షంతోగాని బహిరంగంగా తమ సానుభూతిని ప్రదర్శించవచ్చును. కాని విద్యాభ్యాస కాలంలో మాత్రం వారు కార్యాచరణ స్వాతంత్ర్యాన్ని కోరకూడదని నా అభిప్రాయం. ఏ విద్యార్థిగాని ఒకవంక రాజకీయ కార్యకర్తగా వుండడము, మరొకవంక విద్యాభ్యాసం చేయడం, రెండూ పొసగవు.

హరిజన్. 2-10-37.

విద్యార్థులు పక్ష రాజకీయాలలో పాల్గొనడం కుదరదు. వారు అన్నిరకాల పుస్తకాలను చదివినట్లుగానే అన్నిపక్షాల అభిప్రాయాలను వినవచ్చును. వారు వాటిలోని సత్యాన్ని మాత్రమే అవగాహన చేసుకుని, మిగిలినదానిని విసర్జించాలి.

అధికార ప్రయుక్త రాజకీయాలు (power politics) విద్యార్థుల దృష్టిలోకే పోకూడదు. అటువంటి కార్యకలాపాలలోకే కనక వారు దిగితే, ఇకవారు విద్యార్థులే కాకుండా పోతారు. అందువల్ల దేశానికి ప్రాణావసరం కలిగినప్పుడు వారు దేశసేవకు పనికిరాకుండా పోతారు.

టు ది స్టూడెంట్సు, పే. 283

అధ్యాయం ౫౮

భారత నారీజన పునరుజ్జీవనం.

ఆచారములవల్లను, శాసనములవల్లను స్త్రీ అణగ ద్రొక్కబడివున్నది. ఆ ఆచారములకును, శాసనములకును పురుషునిదే బాధ్యత. వాటి నిర్మాణంలో స్త్రీ భాగస్వామిని

కాదు. అహింసాత్మకమైన జీవితప్రణాళికలో తన జీవితమును రూపొందించుటకొనుటకు స్త్రీకిని పురుషునితో సమానమైన హక్కువున్నది. అయితే అహింసాత్మకమైన సంఘంలో విధినిర్వర్తనాన్ని బట్టియే ప్రతిహక్కూ సిద్ధిస్తుంది కనుక, సాంఘికప్రవర్తనా నియమాలన్నీ స్త్రీ పురుషుల పరస్పరసహకారం ద్వారాను, సంప్రతింపుద్వారాను ఏర్పాటుకావాలి. అవి ఎన్నడును బయటినుంచి బలవంతంగా అమలుకారాదు. స్త్రీలవిషయంలో పురుషులు ఈ సత్యాన్ని గ్రహించి అనుసరించుటలేదు. పురుషులు స్త్రీలను తమ మిత్రులుగాను, సహధర్మిణులుగాను భావించుటకు బదులు వారిపై తాము అధికారులుగాను, ప్రభువులుగాను వర్తిస్తున్నారు. స్వతంత్రంగా వుండగలమనీ, వుండవలెననీ ఎరగని పూర్వకాలపు బానిసలు ఏ స్థితిలో వుండేవారో, స్త్రీలీనాడు ఆ స్థితిలో వున్నారు. అట్టి బానిసకు హఠాత్తుగా స్వతంత్రంవస్తే వెంటనే ఏమి చేయవలెనో తెలియని నిస్సహాయస్థితిలో ఉంటాడు. తాము పురుషులకు బానిసలమని అనుకొనునట్లుగా స్త్రీలకు బోధచేయబడినది. స్త్రీలు తమ పూర్ణవ్యక్తిత్వసిద్ధిని పొంది, పురుషులతో సమానముగా సర్వకార్యములలోను పాల్గొనునట్లు చూచే బాధ్యత కాంగ్రెసు సభ్యులందరిపైనను ఉన్నది.

మనోనిశ్చయం కలిగివుంటే, ఈ పరివర్తన తీసుకురావడం కష్టసాధ్యంకాదు. భార్యలను కేవలం ఆటబొమ్మలవలె, సౌఖ్యసాధనములవలె కాక కలిసిమెలసి చేయవలసిన

సేవాకార్యములలో సగౌరవమైన సహధర్మిణులనుగా పరిగణించాలి. అందుకు వీలగునట్లు, ఈ వరలో విద్యాలాభం పొందని భార్యలకు భర్తలే చేతనైనంతపాటి విద్యాజ్ఞానం బోధించాలి. ఆ విధంగానే, తగిన మార్పులతో, వారు తమ తల్లులకు, తమ పుత్రికల విషయంలోనుకూడా వర్తించగలరు.

నేను పైనచూపినది భారతీయ స్త్రీ జనమునకు సంబంధించిన ఏకపక్ష చిత్రణమే అని వేరుగా చెప్పనవసరంలేదు. గ్రామప్రాంతాలలోని స్త్రీజనం సర్వసాధారణంగా తమ పురుషులతో సమానత్వంతోనే వర్తిస్తూ వుంటారనీన్నీ, కొన్ని విషయాలలో వారిపై అధికారంకూడా చెలాయిస్తూ వుంటారనీన్నీకూడా నాకు తెలుసును. కాని బయటినుంచి నిష్పాక్షికంగా చూచేవారికి మొత్తంమీద మన స్త్రీజనంయొక్క తాహతు ఆచారదృష్ట్యాను, న్యాయశాస్త్రదృష్ట్యాను అసంతృప్తికరంగా వున్నదనీన్నీ, దానిని పూర్తిగా మార్చవలసి వున్నదనీన్నీ గోచరించక మానదు.

నిర్మాణకార్యక్రమం, పే. 17-18.

శాసననిర్మాణం సుమారు అంతా పురుషనిర్మితమైనదే; ఆ స్వయంనియమిత కార్యమును పురుషుడు అన్నివిషయాలలోను న్యాయసమ్మతంగాను, వివేచనాయుతంగాను నిర్వహించివుండలేదు. మన శాస్త్రములలో స్త్రీస్వభావంలో స్వతస్సింధంగా పాతుకువున్నట్లుగా వర్ణింపబడిన లోపాలను సరిదిద్దుటయే మనంచేసే స్త్రీజనోద్ధరణ కృషిలో ప్రాధాన్య

తను పొందవలసిన విషయం. ఈ కృషికి పూనుకొనువా రెవరు? దీనిని నిర్వహించు విధాన మేమిటి? మనము సీత, దమయంతి, ద్రౌపదులవంటి స్వచ్ఛశీలము, ధైర్యము, ఆత్మ నిగ్రహముగల స్త్రీలను తయారుచేయుడమే ఈ కృషికి తొలి సోపానమని నా వినయపూర్వకమైన అభిప్రాయము. దానినే కనక మనం చేయగలిగినచో, అట్టి శీలవతులగు మన ఆధునిక సోదరీమణులు శాస్త్రసమానమైన అధికార ప్రభావమును ప్రదర్శించగలుగుతారు. అప్పుడు మనస్మృతులలో స్త్రీలను గూర్చి చెప్పబడిన నిందారోపణములకు మనమే సిగ్గుపొంది, త్వరలోనే వాటిని స్మరించుట మానివేస్తాము. ఇటువంటి భావపరివర్తనలు హిందూమతంలో ఈ వరకు జరిగివున్నవి; ఇకముందు కూడా జరుగగలవు. తద్వారానే మన మతధర్మం నిలబడగలుగుతుంది.

గాంధీమహాత్ముని రచనలు, ప్రసంగములు. పే. 424.

స్త్రీ కూడా పురుషునితో సమానమగు మానసికశక్తులతో జనించినది, ఆమె పురుషునికి సహచరి. పురుషుని ప్రతి అల్పమైన కార్యకలాపములందును పాల్గొనుహక్కు ఆమెకు కలదు; అతనితో సరిసమానమగు స్వతంత్రమును, స్వేచ్ఛను (freedom & liberty) ననుభవించుటకు కూడ ఆమెకు హక్కున్నది. తన కార్యరంగములో పురుషుని కెంత ఉచ్చ స్థానమున్నదో, అమె కార్యరంగములో ఆమెకును అట్టి స్థానమున్నది. ఇది చదువు, వ్రాతలతో కూడిన విద్యాఫలితంగా మాత్రమేకాక, ఆమెకు సహజసిద్ధంగా చెందవలసిన పరిస్థితి.

ప్రస్తుతం అమలులోవున్న దురాచారములయొక్క బలం వల్లపురుషులలో పరమజ్ఞానహీనులు, సుగుణరహితులు అయిన వారు కూడా స్త్రీలపై ఆధిక్యమును అనుభవిస్తున్నారు. అట్టి అర్హతలేని ఆధిక్యతను ఆపాదించుకొనుటకు వారికి హక్కు లేదు. మన స్త్రీల దుస్థితి మూలంగా, మనం తలపెట్టిన ఉద్యమము లెన్నో మధ్యలో ఆగిపోయి, నిష్ఫలమవుతున్నాయి. మన కృషికి తగిన ఫలితం చేకూరడంలేదు. మనం వ్యాపారానికి తగిన పెట్టుబడి పెట్టక దమ్మిడీలకు కక్కుర్తిపడి కాసులను కోలుపోయే వర్తకుని స్థితిలో వున్నాము.

గాంధీమహాత్ముని ప్రసంగాలు, రచనలు, పే. 425.

స్త్రీ పురుషుల సమానత్వం :

స్త్రీలహక్కుల విషయంలో నాకు రాజీమార్గంలేదు. పురుషుల విషయంలో వర్తించని న్యాయశాస్త్ర విచక్షణ ఏదిగాని స్త్రీలకును వర్తించరాదని నా అభిప్రాయం. నేను కొడుకులను, కూతుళ్లను పూర్తిగా సరిసమానమైన తాహతు కలవారుగా పరిగణిస్తాను.

యంగిండియా 17-10-29.

స్త్రీ పురుషుల సమానత్వమంటే వారిరువురును ఒకే రకం వ్యాపకాలను అనుసరించవలెనని అర్థంకాదు. వేటాడడం, ఈటె విసరడంవంటి పనులనైనాసరే స్త్రీ చేయరాదని శాసననిషేధం వుండకూడదు. అయితే పురుష సహజమైన అట్టి కార్యములయెడల ఆమె స్వభావతః విముఖత చూప

వచ్చును. ఒకరిలో లేని గుణములను రెండవవారు పూరించు నిమిత్తమే ప్రకృతి లింగభేదమును సృష్టించివున్నది. వారి బాహ్యరూప నిర్వచనముపైననే వారి ధర్మనిరూపణము కూడా ఆధారపడివున్నది.

హరిజన్, 2-12-39.

వివాహము :

స్త్రీపురుషులమధ్య ఉండదగు సంబంధములను గురించి ఆరోగ్యకరమును, అకలుషమును అయిన దృష్టితో పరిశీలించి రాబోయే తరములవారి నైతిక సంక్షేమమునకు మనము ధర్మ కర్తలమనే భావముతో వాటిని పరిష్కరించినచో, ప్రస్తుతం ద్యోతకమమయ్యే దుష్పరిస్థితులు చాలావరకు తొలగి పోగలవు.

యంగిండియా, 27-9-26.

వివాహమనునది జీవితంలో జరుగవలసిన సహజవిధి; దానిని ఏ దృష్టినుంచిగాని హేయమైనదిగా భావించడం పొరపాటు ... వివాహమును పవిత్రకార్యముగా భావించి, వివాహజీవితమును ఆత్మనిగ్రహయుతంగా గడపడమే మన ఆదర్శం.

హరిజన్, 22-3-42.

పర్దా :

పాతివ్రత్యం అనేది తెరమాటున పెరిగి పెంపొందే వస్తువుకాదు. 'పర్దా' అనే ఆవరణవల్ల అది సంరక్షితంకాదు.

అది అంతరంగంలో వేరూని, పైకి పెరగవలసిన గుణం అభిలషించకుండా ఎదురయ్యే ప్రలోభనముల నన్నటిని జయించేశక్తిని కలిగివున్నప్పుడే, అది సార్థకమవుతుంది.

యంగిండియా, 3-2-27.

స్త్రీలయొక్క సచ్ఛీలం విషయమై ఇంత అనారోగ్య కరమైన ఆదుర్దా ఎందుకు? పురుషులయొక్క సచ్ఛీలం విషయమై స్త్రీలకు మాట్లాడే హక్కు ఉన్నదా? పురుషుల శీలపరిశుద్ధతనుగూర్చి స్త్రీలు పడే ఆదుర్దా మన చెవి నెన్నడూ సోకనేసోకదు. ఇక స్త్రీల శీలపరిశుద్ధతను అమలుపరిచే అధి కారం తమకే వున్నట్లు పురుషు లెందుకు గర్వించాలి? దానిని బయటనుంచి నిర్భంధములు అమలుచేయడంద్వారా సృష్టించలేము. అంతరంగంనుంచి వెలువడదగిన పరిణతి. కావున, అది వ్యక్తిగత సాధనవల్లనే చేకూరగలవస్తువు.

యంగిండియా, 25-11-26

కట్నాలపద్ధతి :

ఈపద్ధతి పోవాలి. వివాహమనేది తలిదండ్రులు డబ్బు కోసంచేసే ఏర్పాటుగా నడవడం అంతరించాలి. ఈ పద్ధతి చాలావరకు కులభేదంమీద ఆధారపడినటువంటిది. ఒకేఒక కులానికి చెందిన ఒక కొలదివందల యువకులకు, యువతులకు మధ్య మాత్రమే వివాహములు జరుగవలెననే నియమం అమలులో వున్నంతకాలం, మనం ఎన్నిచెప్పినాగాని, ఈ పద్ధతి మారదు. ఈ దురాచారం నిర్మూలం కావలెనంటే మగపిల్లలో, ఆడపిల్లలో, లేక వారి తలిదండ్రులో ఈ కుల

నియమాన్ని అధిగమించడానికి పూనుకొనవలసి వుంటుంది. ఈ మార్పు రావలెనంటే, మన దేశపు యువజనుల మనస్సులలో భావవిప్లవం తీసుకొనిరాగల శక్తివంతమైన విద్యా ప్రచారం అవసరం.

హరిజన్, 23-5-36.

తన వివాహానికి కట్నం ఒక షరతుగా చేసే ప్రతి యువకుడూ తన విద్యకును తన దేశమునకును ద్రోహంచేసినవాడు, స్త్రీత్వమును అవమానపరచినవాడు అవుతాడు. మన దేశంలో యువజనోద్యమా లెన్నో నడుస్తున్నాయి. ఆఉద్యమాలు ఇటువంటి సమస్యల పరిష్కారానికి కృషిచేయవలసినదని నా కోరిక. అట్టి సంఘాలు మామూలుగా అంతర సంస్కార నిర్వహణానికి ప్రాతినిధ్యం వహించే సంస్థలుగా కాక, కేవలం ఆత్మస్తుతికి నెలవైన సమితులుగా మాత్రమే పని చేస్తున్నాయి... లజ్జాకరమైన ఈ శుల్కవిధానాన్ని ప్రతిఘటించడానికి బలవత్తరమైన ప్రజాభిప్రాయాన్ని సృష్టించాలి. అట్టి అవినీతికరమైన డబ్బుకోసం ఆశించే యువకులను సంఘం నుంచి బహిష్కరించాలి. ఆడపిల్లల యొక్క తలిదండ్రులు ఇంగ్లీషుడిగ్రీల వ్యామోహమునకు వశులుకాకుండా, తమ కులములయొక్కయు ప్రాంతములయొక్కయు పొలిమేరలను దాటి, తమ పిల్లలకు తగినవారైన యువకులకు వరులుగా సంపాదించడానికి ప్రయత్నించాలి.

యంగిండియా, 21-6-28.

వితంతు పునర్వివాహం :

తన జీవిత భాగస్వామియెడల ప్రేమానుభూతి నెరిగిన ఒక స్త్రీ బుద్ధిపూర్వకముగా స్వీకరించిన వైధవ్యము ఆమె జీవితానికి సౌమ్యతను, గౌరవాన్నీ చేకూర్చుటయే కాక, అది గృహమును పవిత్రమొనర్చి, మతమునకే ఉదాత్తత కలిగిస్తుంది. మతనియమం వల్లగాని, ఆచారంయొక్క నిర్బంధంవల్లగాని బలాత్కృతమైన వైధవ్యం దుర్భరమైన బంధనంగా పరిస్తుంది. అది రహస్యమైన అవినీతికి తావొసగి గృహమును అపవిత్రమొనర్చి, మతమునే పతనస్థితికి తెస్తుంది.

మనం పరిశుద్ధంగా వుండవలెనంటే, హిందూధర్మమును సంరక్షించవలెనంటే, ఈ నిర్బంధ వైధవ్యమనే విష శృంఖలమునుండి విముక్తులం కావాలి. వితంతు బాలికలకు సంరక్షకులైన కుటుంబీకులు ధైర్యమువహించి, తమ రక్షణలోని ఆ బాలవితంతువులను యోగ్యమైన వరులకొసగి సహజ రీతిని వివాహమొనర్చడం ద్వారానే ఈ సంస్కరణ నెరవేరుతుంది. అట్టి వివాహములను పునర్వివాహములుగా భావించ నవసరంలేదు. వారికి అజ్ఞానస్థితిలో జరిగిన వివాహములు వివాహములే కావు.

యంగిండియా 5-8-26.

విడాకులు :

వివాహం అనే కార్యం ఇరువురు భాగస్వాములు తమ ఇరువురియొక్క సంయుక్తాభిలాషానుసారంగా తదితరుల కెవ్వ

రికిని తావులేని పరస్పర సమ్మేళన సంబంధమును ఏర్పరచు కొనే హక్కును స్థిరీకరిస్తుంది. కాని వివాహమువల్ల ఒక భాగస్వామి రెండవవారిని అట్టి సమ్మేళనమునకు బలవంత పరిచే అధికారం మాత్రం కలగదు. నైతికమైన, లేక ఇతర ములైన హేతువులవల్ల ఒకరు రెండవవారి కోరికలను అనుస రించలేని పరిస్థితి ఏర్పడితే ఏమిచేయాలి, అనేది ఒక ప్రత్యేక సమస్య. అట్టి పరిస్థితిలో, నేనైతే వ్యక్తిపరంగా నాయొక్క నైతికమైన ఉన్నత పరిణతిని నిరోధించుకొనుటకు బదులు, అందుకు వేరుమార్గములేని సందర్భంలో, వివాహ విచ్ఛేదము నంగీకరించుటకు వెనుదీయను. నైతిక హేతువులనుబట్టి అవ సరమైనప్పుడే నేనీ పరిష్కారమును అంగీకరిస్తాను.

యంగిండియా, 8-10-25.

నా దృష్టిలో జీవితంలోని ఇతరస్థితి లన్నిటిలోను వలెనే వివాహితస్థితిలోకూడా నియమనిగ్రహములు అవసరం. జీవితం ఒక విధినిర్వర్తనము, ఒక శిక్షణము. వివాహజీవితం ఇరువురకును ఇహపరములలో శ్రేయస్సును సాధించునిమిత్తం ఉద్దేశింపబడినది. మానవసేవ నిమిత్తం కూడా ఉద్దేశింప బడినది. దానియొక్క నియమబంధనమును ఒక భాగస్వామి తెగత్రెంచినచో, రెండవవారికి కూడా అట్టి విచ్ఛేదన హక్కు సంక్రమిస్తుంది. ఇక్కడ సూచితమైన విచ్ఛిత్తి నైతికమైనదే గాని భౌతికమైనది కాదు. ఇందులో విడాకులపద్ధతికి తావు లేదు. ఈ సందర్భంలో భార్యాభర్తలు విడిపడుట జరిగినా,

అది వివాహాదర్శమును సాధించుకొను నిమిత్తమే అవుతుంది. హిందూధర్మం ప్రకారం భార్యాభర్తలు ఒండొరులతో కేవలం సరిసమానమైన తాహతుకలవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయినది. ఎప్పుడు ఈ మార్పు జరిగినదీ ఎవరూ చెప్పలేరు. ఈ విధంగానే హిందూధర్మంలోకి ఇంకా చాలా చెడుగులు ప్రవేశించివున్నవి. స్త్రీ జన్మకును, పురుషుని జన్మకును సమాన పరమార్థమైన ఆత్మజ్ఞానసాధన నిమిత్తం స్త్రీగాని, పురుషుడుగాని ఎట్టి చర్యల నవలంబించుటకు గాని హిందూధర్మం స్వాతంత్ర్యం ఒసగుతుందనే విషయం మాత్రం నేను నిస్సంశయంగా చెప్పగలను.

యంగిండియా, 21-10-26.

స్త్రీయొక్క మానం:

ఆమెకు ఇష్టంలేనిదే స్త్రీకి మానభంగ మొనర్చుట దైహికంగా అసాధ్యమని నా నమ్మకం. ఆమె భయమునకు తావొసగినప్పుడుగాని, తన నైతికబలాన్ని గ్రహించలేనిచో గాని మాత్రమే అట్టి బలాత్కారం జరగడానికి వీలౌతుంది. పైనబడేవాని బలమును ఎదుర్కొనజాలనప్పుడు, ఆమెయొక్క పవిత్రశీలమే ఆమెకు బలాత్కారం జరిగేలోగా ప్రాణత్యాగ మొనర్చే శక్తిని ఒసగగలదు. సీతాదేవి ఉదాహరణ తీసుకోండి. రావణాసురుని ముందు ఆమె దైహికంగా అబల అయినా ఆమె పవిత్రతయొక్క శక్తిముందు అతని రాక్షస బలం నిర్వీర్యమైపోయింది. అతడామెను, సర్వవిధములైన

ఆశలను, ఆకర్షణలనుచూపి, వశపరచుకొనుటకు ప్రయత్నిం చెనేగాని, ఆమె యిష్టమునకు వ్యతిరేకంగా ఆమె గాత్రమును తన మోహాపూరిత హస్తములతో స్పృశింప లేకపోయాడు. ఇక స్త్రీయేకనక తన దైహికబలం మీదగాని, ఆయుధముల మీదగాని ఆధారపడితే మాత్రం, ఆమె శక్తి ఆలసిపోయిన వెంటనే మానభంగంపాలు కావలసివస్తుంది.

హరిజన్, 14-1-40.

బలాత్కారంపాలైన స్త్రీ హింసాహింసలను గురించి తర్కిస్తూ కూర్చోనవసరంలేదు. ఆత్మరక్షణమే ఆమెయొక్క ప్రాథమిక ధర్మం. తన మానరక్షణార్థం ఆమె ఆసమయాన తనకు తోచిన ఏ మార్గమునుగాని. ఏ సాధ్యమునుగాని, అవ లంబించుటకు స్వతంత్రురాలు. దేవుడామెకు గోళ్లు, పళ్లు ఒసగినాడు. తన శక్తికొలది ఆమె వాటిని ఉపయోగించ వచ్చును. ఆత్మరక్షణ ప్రయత్నంలో అవసరమైతే తన ప్రాణ ములనైనా వదలవలసినదే. చావంటే భయపడని ఏ పురుషుడు గాని, స్త్రీగాని తనయొక్క ఆత్మరక్షణచేసికొనగలుగుటయే కాక, తమ ప్రాణములనైనా అర్పించి ఇతరులకు కూడా రక్షణ ఒసగగల్గుతారు.

హరిజన్, 1-3-42.

వ్యభిచారం :

ప్రపంచ మెంత పురాతనమో వ్యభిచారమును అంత పురాతనమైనది. కాని అది ప్రస్తుతకాలపు పట్టణ జీవితంలో

పరివ్యాప్తమైనంత విరివిగా ఎన్నడుగాని వున్నదని నేనను కోను. ఏదెట్లైనప్పటికి, మానవజాతి ఈ వరలో అనేకము లైన పురాతన దురాచారములనుండి విముక్తిపొందినట్లే, ఈ ఆచారపిశాచమును కూడా ఎదుర్కొని, నిర్మూలించి, విముక్తిపొందేకాలం ఆసన్నం కాగలదని నా ఆశ.

యంగిండియా, 28-5-25.

అధ్యాయం ౫౫

స్త్రీ విద్య.

స్త్రీలు నిరక్షరాస్యులన్న హేతువున పురుషులు వారికి తమతో సమానమైన హక్కులను ఒసగకుండుటగాని, ఉన్న హక్కులను తొలగించుటగాని సమర్థనీయము కానేరదనే అభి ప్రాయాన్ని నేను తరచు వెల్లడించి వున్నాను. అయితే స్త్రీలు తమ సహజహక్కులను నిలబెట్టుకొనుటకును, పెంపొం దించుకొనుటకును విశాల మొనర్చుకొనుటకును వారికి విద్య ముఖ్యంగా అవసరం. అట్టి విద్యాజ్ఞానములను పొందనిదే, లక్షలసంఖ్యలోవున్న జనానీకానికి నిజమైన ఆత్మజ్ఞానం సాధ్యంకాదు.

పురుషుడును, స్త్రీయును తాహతులో సమానులేగాని, పోలికలో సరిసమానులుకారు వారు ఒకరిగుణముల నొకరు పూర్ణమొనర్చుకొనుటకు ఉద్దేశింపబడిన ఒక అసమానమైన జంట. వారు ఒకరికొకరు సహాయకులగుటచే, ఒకరులేనిదే

రెండవవారి ఉనికి అసంభావ్యమైపోతుంది. ఈ హేతువులను బట్టి, వారిలో ఏ ఒక్కరి తాహతు క్షీణించినా, అది ఇరువురిని కూడా పతనస్థితి పాలుచేస్తుందని తెల్లమవుతుంది. స్త్రీ విద్యావిషయికమైన ప్రణాళికను దేనినిగాని తయారుచేసే టప్పుడు, ఈ ప్రాథమిక సత్యాన్ని సర్వదా మనస్సులో వుంచుకోవాలి. వివాహితులైన దంపతుల జీవితంలో పురుషుని ప్రజ్ఞ బహిరంగమైన లౌకిక కార్యకలాపములలో ప్రకాశమానమవుతుంది కనుక, అట్టి విషయాలలో పరిజ్ఞానం సహజంగా అతనికి ఎక్కువగా అవసరముంటుంది. రెండవ దిక్కున గృహజీవనరంగం కేవలం స్త్రీకి చెందినదగుటచేత, గృహనిర్వహణం, పిల్లలపెంపకం, వారి విద్యాశిక్షణ మొదలగు విషయాలలో ఆమెకు ఎక్కువ పరిజ్ఞానం అవసరమవుతుంది. జ్ఞానాన్ని పరస్పర సంబంధంలేని రెండు పొరుగులుగా విభజించవలసినదనిగాని, ఏ విద్యాశాఖగాని ఎవరికిగాని నిషిద్ధము చేయవలసినదనిగాని దాని అర్థంకాదు. ఈ మూలసూత్రములను గ్రహించి విద్యాప్రణాళికలను విచక్షణాపూర్వకంగా తయారుచేయనిచో స్త్రీ పురుషుల జీవితములయొక్క పూర్ణ పరిణతి సాధ్యపడదు.

మన సామాన్య జీవితరంగంలో మన పురుషులకుగాని, మన స్త్రీలకుగాని ఆంగ్లభాషాజ్ఞానాన్ని కలిగివుండడం తప్పనిసరి అయిన అవసరం కాదనే నిర్ధారణకువచ్చి వున్నాను. జీవనోపాధి నిమిత్తమున్నా, మన రాజకీయోద్యమాలలో

పాల్గొని కార్యనిర్వహణ మొనర్చుటకును ఆంగ్లభాషయొక్క అవసరమున్నమాట నిజమే. స్త్రీలు జీవనోపాధికోసం పని చేయుటలోగాని, వ్యాపారసంస్థను నడుపుటలోగాని నాకు నమ్మకంలేదు. ఆంగ్లవిద్య అవసరమైన, లేక అభిలషించే, కొలదిమంది స్త్రీలును పురుషుల విద్యాశాలలలోనే చేరి తమ కోరిక తీర్చుకొనవచ్చును. కేవలం స్త్రీలకు ఉద్దేశింపబడిన విద్యాశాలలలో ఆంగ్లవిద్యను ప్రవేశపెట్టుట మన నిస్సహాయ స్థితిని ఇంకా దీర్ఘతరం చేయుటకుమాత్రమే ఉపకరిస్తుంది. ఆంగ్లసాహిత్యంలోని అమూల్యసంపద అంతా మన పురుషులకూ, స్త్రీలకూ సమానంగా లభ్యమగుటకు అవకాశముండవలెనని కొందరు ప్రసంగించుట, ప్రకటించుట నేను గమనించి వున్నాను. అట్టి అభిప్రాయవైఖరి అపోహపై ఆధారపడినదని నా వినయపూర్వక సూచన. ఆ భాషాసంపదను పురుషుల కొక్కరికే వదలి, స్త్రీలనుమాత్రమే లేకుండా చేయవలెనని ఎవరూ అనుకోవడం లేదు.

నీకు సాహిత్యాభిరుచియే కనక వుండి ప్రపంచసాహిత్యమంతను నీవు పఠించదలిస్తే, లోకంలో నిన్ను అడ్డపరిచేదేదీలేదు. కాని ఒకానొక సంఘ మొత్తంయొక్క అవసరాలను దృష్టిలో వుంచుకుని విద్యాప్రణాళికలను తయారు చేసేటప్పుడు, సాహిత్యసంబంధమైన అభిరుచుల నలవరచుకొన్న కొలదిమందియొక్క అవసరాలను తీర్చుటకు వీలు కాదు. మన పురుషులను, స్త్రీలను ఆంగ్లభాషాపఠనానికి

వారిప్పుడు వ్యయపరుస్తూవున్న కాలాన్ని తగ్గించమని నేను కోరడంలోని అభిప్రాయం వారికి ఆ ఆనందం లభ్యం కాకుండా చేయవలెననికాదు. ఇప్పటికంటె ఎక్కువ సహజమైన పద్ధతుల ననుసరించడంద్వారా ఆ ఆనందాన్నే తక్కువ ఖర్చుతోను, తక్కువశ్రమతోను పొందవచ్చునని నా అభిప్రాయం. ప్రపంచంలో అమూల్య సుందరములైన రత్నాలనేకం వున్నాయి; అయితే ఆ రత్నాలన్నీ ఒక్క ఆంగ్ల పతకంలోనే పొదగబడిలేవు. ఆంగ్ల సాహిత్యంతో తులతూగే ఉత్తమరచనలు ఇతరభాషలలో కూడా లేకపోలేదు. అవన్నీకూడా మన ప్రజాసామాన్యానికి లభ్యం కావలసి వున్నది. మన పండితాగ్రేసరులు వాటన్నిటిని మన దేశ భాషలలోనికి అనువదించడానికి పూనుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

గాంధీమహాత్ముని ప్రసంగాలు, రచనలు, పే. 426-8.

స్త్రీలకు యోగ్యమైన విద్య అవసరమనే నా నమ్మకం. కాని పురుషునికి వెకిలినమోనాగా తయారవడంవల్లగాని, పురుషులతో పరుగుపందెం పెట్టుకోవడంవల్లగాని ప్రపంచానికి స్త్రీ ఒసగవలసిన ప్రత్యేక సహకారమును ఆమె ఒసగజాలదనికూడా నా నమ్మకం. ఆమె పోటీపడితే పడవచ్చునుగాని, పురుషునికి నమోనాగా అవడానికి ప్రయత్నించడంద్వారా ఆమె తనకు సహజసాధ్యమైన ఉన్నతస్థాయిని అందుకోలేదు. పురుషుని అర్థమునకు తన అర్థమును కలిపి పూర్ణమొనర్చుటయే ఆమె సహజధర్మము.

హరిజన్, 27-2-37.

సహవిద్య :

ఈ పద్ధతి నెరవేరుతుందో లేదో నేనింకా నిర్ధారణగా చెప్పలేను. పాశ్చాత్యదేశాలలో ఇది నెరవేరినట్లు కనిపించదు. చాలా సంవత్సరాలక్రితం నేను కూడా ఈ పద్ధతిని అనుసరించి చూచాను. బాలబాలికలను, మధ్యను ఏమీ అడ్డంలేకుండా, ఒకే వరండామీద పడుకోనిచ్చాము; నేనూ నా భార్యాకూడా వారితోనే పడుకొనేవారం. కాని ఈ ప్రయోగంవల్ల అనభిలషణీయమైన ఫలితములు కలిగినట్లు చెప్పకతప్పదు.

బాలబాలికల సహవిద్యావిధానం ఇంకా ప్రయోగ స్థితిలోనేవున్నది. దాని ఫలితములను గురించి ఇటుగాని, అటుగాని నిర్ధారణగా చెప్పలేము. ఇది కుటుంబరంగంలో ముందు ప్రయోగించవలసిన విషయమని నా అభిప్రాయం. అక్కడ మగపిల్లలు, ఆడపిల్లలు స్వేచ్ఛగాను సహజంగాను కలిసిమెలసి మసలడానికి అలవాటుపడాలి. అప్పుడు సహవిద్య దానంతట అదే వస్తుంది.

అమృతబజారు పత్రిక, 12-1-35.

మీరు పాఠశాలలలో మాత్రం సహవిద్యను అవలంబించి, ట్రెయినింగు పాఠశాలలో అవలంబించకపోతే, పిల్లలు ఎక్కడో ఏదో లోపమున్నదని అనుకోవడం మొదలుపెడతారు. నేను ఈ పద్ధతిని అమలుచేయదలిస్తే నిర్భయంగా అమలుచేస్తాను. ఏదో ఒకనాడు మనం ఈ (sex mentality)

స్త్రీ పురుష విభేద మనస్కతనుంచి విముక్తి పొందవలసివున్నది. మనం పాశ్చాత్య దేశాలనుంచి ఉదాహరణలను వెదకనవసరంలేదు. ట్రెయినింగు పాఠశాలలలో అయినా ఉపాధ్యాయులు తెలివైనవారు, శీలవతులు, 'నయీాతాలిం' యొక్క ఆదర్శాలను అవగాహన చేసుకున్నవారు అయివుంటే, ఆపత్తేమీావుండదు. ఒకవేళ ఏవైనా పొరపాట్లు జరిగినప్పటికి, అంతటితో మనం భయపడిపోనక్కరలేదు. అట్టివి ఎక్కడైనా జరుగుతాయి. నేను ఇంత ధైర్యంగా చెబుతూవున్నా, అందలి అపాయములను ఎరుగకపోలేను.

హరిజన్. 9-11-47.

అధ్యాయం ౫౬

సంతాన నిరోధం.

సంతాననిరోధంయొక్క అవసరముగురించి అభిప్రాయభేదానికి తావులేదు. కాని దానికి పురాతనకాలంనుంచీ వచ్చిన ఏకైకవిధానము ఆత్మనిగ్రహం లేక బ్రహ్మచర్యం మాత్రమే. దానిని అనుసరించినవారికి అది మేలు చేకూర్చే తిరుగులేని ఔషధరాజము. వైద్యశాస్త్రజ్ఞులు సంతాన నిరోధమునకు కృత్రిమ సాధనములను కనిపెట్టుటకంటె ఆత్మనిగ్రహమునకు తగిన ఉపాయములను కనిపెట్టిన యెడల వారు మానవజాతియొక్క కృతజ్ఞతను చూరగొనగలరు.

కృత్రిమ పద్ధతులు కనిపెట్టడం అనేది అవినీతికి బహూ కృతి ఒసగడం వంటిది అవి స్త్రీపురుషులను విచ్చలవిడి చేస్తాయి. ఆ పద్ధతులకు ఒసగబడుతూవున్న గౌరవస్థానం యొక్క ఫలితంగా ప్రజాభిప్రాయ భీతివలన ప్రస్తుతం అమ లవుతూవున్న నిరోధాలు కొలదికాలంలో సడలిపోతాయి. కృత్రిమ పద్ధతులను అవలంబించుటవల్ల నిర్వీర్యత, నరముల దౌర్బల్యము ఏర్పడగలవు. ఆ విధంగా ఔషధం రోగం కంటె హానికరంగా పరిణమించగలదు.

ఎవరుగాని తమ చర్యలయొక్క ఫలితములనుండి తప్పించుకొనజూచుట అధర్మము, అవినీతికూడా అవుతుంది. అతిగా తినేవాడికి కడుపునొప్పి కలగడమూ, ఉపవాసం చేయ డమూ కూడా మంచిదే. తన లాలసతకు (appetite) వశం కావడం ఒక తప్పు; టానిక్కులవల్ల, ఇతరమైన మందులవల్ల తత్ఫలితములనుంచి తప్పించుకొన యత్నించుట అంతకంటె తప్పు. ఇక తన పశుతుల్యమైన ఇంద్రియోద్రేకములకు వశుడై, తన చేష్టలయొక్క ఫలితమునుండి తప్పించుకొన జూచుట మరీతప్పు. ప్రకృతి తిరుగులేనిది; తన శాసనముల నాక్రీతిగా ఉల్లంఘించిన వారిపై పూర్తిగా పగతీర్చుకుం టుంది. నైతికమైన సత్ఫలితములు నైతికమైన నిగ్రహసాధ నలవలననే చేకూరగలవు. ఇతర విధములైన నిరోధోపాయము లేవిగాని వాటి ఉద్దిష్ట ప్రయోజనములనే నిష్ఫలం చేస్తాయి.

యంగిండియా, 12-3-25.

కృత్రిమ పద్ధతులద్వారా సంతాన నిరోధమునకు ప్రయత్నించడమనేది క్రొత్తవిషయంకాదు. ఈ వరలో అట్టి పద్ధతులు రహస్యంగా అవలంబింపబడేవి. ఆ పద్ధతులు మోటుగావుండేవి. ఆధునికసంఘం వాటికి గౌరవస్థానమొసగి వాటిని నాజూకుచేసింది. వాటికి లోకోపకారమనే వేషంతో అలంకరించింది. గర్భనిరోధ కౌషధములను సమర్థించేవారు కామేచ్ఛను స్వాభావిక గుణంగా నిర్వచిస్తారు — కొందరు అదొక వరప్రసాదమని కూడా వర్ణిస్తారు. కావున దానిని నిగ్రహించుట సాధ్యమైనప్పటికీకూడా అట్టి నిగ్రహం అభిలషణీయం కాదంటారు. ఆత్మనిగ్రహంద్వారా సంతాన నిరోధం చేయడం కష్టసాధ్యమని వారు అభిప్రాయపడతారు. ఆత్మనిగ్రహం స్థానే ఇంకొక నిరోధకసాధనమును చూపితే తప్ప, తరచు గర్భముదాల్చుట మూలంగా అసంఖ్యాకమైన స్త్రీ జనం ఆరోగ్యమును కోల్పోవడం జరుగుతుంది. అంతే కాక సంతానాన్ని పరిమితం చేయనిచో జనసంఖ్య అత్యధికమైపోయి, కుటుంబాలు దారిద్ర్యంపాలయి, వారి పిల్లలు తిండి, బట్ట, విద్యలేనివారైపోతారని కూడా వారంటారు. అందువల్ల సంతాననిరోధాన్ని చేకూర్చడానికి నిరపాయమూ, నిశ్చితమూ అయిన పద్ధతులను కనిపెట్టుట శాస్త్రజ్ఞులయొక్క విధ్యుక్తధర్మమని వారి వాదన.

ఈ వాదన నా మనస్సునకు ఒప్పిదంగా కనిపించదు. గర్భనిరోధ కౌషధాలను ఉపయోగించడంవలన మనం ప్రస్తు

తం ఊహించలేని హానికరఫలితాలు కలగవచ్చును. అన్నిటి కన్నా అపత్కరమైన ఫలిత మేమిటంటే వాటిమూలమున ఆత్మనిగ్రహేచ్ఛ క్షీణిస్తుంది. అట్టి పరిస్థితి తద్వారా కలిగే తక్షణలాభానికి ఎన్నిరెట్లోమించిన నష్టాన్ని కలిగిస్తుందని నా అభిప్రాయం ... అన్నిటికన్నను అభ్యంతరకరమైన విషయం ఈ పద్ధతిలో ఇమిడివున్న ఆత్మవంచన. పాశతోద్రేకాలన్నిటికీ మూలకందమైన మనస్సును నిగ్రహించుకోనకుండా, స్త్రీపురుషులు దేహసంబంధాన్ని తప్పించుకోడానికి ప్రయత్నం చేస్తారు. ఆలోచనలను, చర్యలను అరికట్టుకొనుటకు మనస్సును దిటవుపరచుకున్నయెడల, అట్టి ప్రయత్నం తప్పక జయంపొందుతుంది. పురుషుడు స్త్రీని తన సహచరిగాను, జీవిత సహకారిణిగాను భావించవలెనేగాని, ఆమె కేవలం తన కామసంతృప్తికి సాధనమైనట్లు భావించకూడదని అవగాహన చేసుకోవాలి. మానవజాతి పశుస్వభావాన్ని సంతృప్తి పరచుకొనుటకుకాక, దానిని నిగ్రహించుటకే సృష్టింపబడిన దనే విషయాన్ని స్పష్టంగా గ్రహించవలసి వున్నది.

కీ టు హెల్తు, పే. 52-54.

స్కూలు విద్యార్థులైన మగపిల్లలలోను, ఆడపిల్లలలోను రహస్యపు అవినీతి అభ్యాసాలు ప్రబలి ఎంత హాని కలిగిస్తున్నదీ నాకు తెలుసును. విజ్ఞానశాస్త్రం పేరిట గర్భనిరోధక సాధనములను ప్రచారంలోకి తేవడంవల్లను, అవి ప్రసిద్ధులైన సంఘనాయకులయొక్క ఆమోదముద్ర పొందడం

వల్లనః ఈ సమస్య మరింత క్లిష్టమయింది. అందుమూలమున సంఘజీవిత పారిశుధ్యమునకై పాటుపడే సంస్కర్తల కృషి ఈ నిమిషాన సుమారుగా అసాధ్యమైపోతున్నది. మన స్కూళ్లలోను, కాలేజీలలోను చదువుకునే అవివాహితలైన లేత వయస్సు బాలికలలో చాలామంది గర్భనిరోధవిషయికమైన రచనలను, పత్రికలను అతి కుతూహలంగా చదివేవా రున్నారని చెప్పినా, వారిలో కొందరు గర్భనిరోధ సాధనములను కూడా సేకరించినవారుకూడా వున్నారని చెప్పినా అందులో రహస్యమేమీలేదు. వాటి వినియోగము ఒక్క వివాహిత స్త్రీలకుమాత్రమే పరిమితంచేయడం అసాధ్యమైన పని. ఫలితముల నాలోచించకుండా మన పశుప్రవృత్తిని సంతృప్తిపరచుకోవడమే వివాహంయొక్క ఉద్దేశమనీ, అదే దాని ప్రయోజనమని భావించినయెడల వివాహకర్మయొక్క పవిత్రతయే నశిస్తుంది.

గర్భనిరోధ సాధనములను ధార్మికోత్సాహంతో ప్రచారం చేసే విజ్ఞానధనులు, ఇష్టంలేని పిల్లలనుకనే బాధ్యతనుంచి పేద స్త్రీలను రక్షిస్తున్నామనే అపోహతో, మన యువజనులకు తీరనిహాని కలిగిస్తున్నారని నేను నిస్సందేహంగా చెప్పగలను. నిజంగా సంతానాన్ని నిరోధించుకొనవలసిన స్థితిలో వున్నవారు వారికి సులభంగా అందుబాటులో వుండనే వుండరు. పైగా మన పేదవర్గాల స్త్రీలకు పాశ్చాత్య స్త్రీలకు వున్న జ్ఞానంగాని, శిక్షణగాని లేదు. ఈ ప్రచారం మధ్య

తరగతి స్త్రీలకు ఉద్దేశింపబడినదికాదని తలుస్తాను. అసలు పేదవర్గాల స్త్రీల అంతగా మధ్యతరగతి స్త్రీలకు ఆ సాధనములయొక్క అవసరంలేదు; అంతేకాక వారు తగిన పరిజ్ఞానం కలవారే అయివుంటారు కనుక, వారినిమిత్తం ప్రచారమున్నూ అనవసరం.

ఈ ప్రచారంద్వారా, పూర్వాదర్శాలను త్రోసిపుచ్చి, నైతికంగానూ దైహికంగానూ జాతివినాశనానికి దారితీసే నూతనాదర్శాలను ప్రవేశపెట్టడం జరుగుతూవున్నది. ఇది అన్నిటికన్నా ఎక్కువ హానికరమైన విషయం. నిష్ఫలమైన వీర్యవ్యయాన్ని గురించి పురాతన గ్రంథాలలో కనిపించే జుగుప్సాభావం అజ్ఞానజనితమైనది కాదు. తనకు చెందిన ఉత్తమ బీజములను రాతి నేలపై వెదజల్లే కర్షకుని గురించిగాని, తన సారవంతమైన పొలంలో మొక్క మొలవడానికి వీలుకాని పరిస్థితి నేర్పరిచి, సద్బీజాన్ని స్వీకరించే క్షేత్రాధికారిని గురించికాని మనంమాత్రం ఏమనవలసి వుంటుంది? పరమేశ్వరుడు పురుషునికి పరమవీర్యవంతమైన బీజాన్నీ, స్త్రీకి భూమండలంలో కల్లా సారవంతమైన క్షేత్రాన్నీ ప్రసాదించి వున్నాడు. పురుషుడు తన పరమమూల్యవంతమైన సొత్తును నిరర్థకంగా వ్యయపరచడం గొప్పనేరమూ, తెలివితక్కువా కాదా? దాని నాతడు అమూల్య మౌక్తికసంపదకంటె ఎక్కువ జాగరూకతతో కాపాడుకోనవలసి వుంటుంది. అట్లే కేవలం వృథాపరిచే బుద్ధిపూర్వకమైన ఉద్దేశంతో స్త్రీయును

తన జీవదాయకమగు క్షేత్రంలో బీజమును స్వీకరించుట కూడా గొప్ప నేరమూ, తెలివితక్కువా అవుతుంది. అట్టి స్త్రీ పురుషులు తమకు ప్రసాదితములైన ప్రజ్ఞాశక్తులను దుర్వినియోగ మొనర్చిన వారుగా తీర్మానింపబడి, తత్ఫలితంగా తమ కొసగబడిన ఆ వరమును కోల్పోవడం జరుగుతుంది. కామవాంఛ అనేది శృంగారము, గంభీరము అయిన వస్తువు. అది లజ్జాకరమైన విషయం కాదు. కాని అది సృష్టికార్యానికి మాత్రమే ఉద్దేశింపబడినది. ఇంకేవిధంగా దానిని వినియోగించినా అది దేవునియెడల, మానవత్వము యెడల కూడా పాపం చేసినట్లే అవుతుంది. ఏదో ఒకవిధమైన గర్భనిరోధ సాధనాలు పూర్వం కూడా ఉన్నాయి, ఇకముందూ ఉంటాయి. కాని పూర్వంలో అది పాపకార్యంగా భావింపబడేవి. అవినీతిని నీతి పేరిట గొప్పచేసే భాగ్యం మనతరానికే లభించింది. ఈ గర్భనిరోధ ప్రచారకులు మన దేశపు యువజనుల మనస్సులలో దోషయుతమైన సిద్ధాంతములను నాటుట ద్వారా వారికి అపరిమితహాని కలిగిస్తున్నారని చెప్పవలసి వుంటుంది. భారత దేశ భవిష్యత్తుకు వారసులైన యువతీ యువకులు ఈ కృత్రిమ దేవతకు బలికాకుండా, పరమేశ్వర ప్రసాదితమైన తమ వీర్యసంపదను కాపాడుకుని, దానిని దైవనిర్దిష్టమైన ప్రయోజనమునకు మాత్రమే వినియోగింతురు గాక.

హరిజన్, 28-3-36.

స్త్రీ పురుషునంతగా కామేచ్ఛకు వశమౌతుందని నేననుకోను. పురుషునికంటె సులభముగా ఆమె ఆత్మనిగ్రహ శక్తిని చూపగలదు. తన భర్త చేతులలో ఆటబొమ్మగాను, కేవలం సాధనంగాను, వర్తించడం తన విధులలో ఒకటి కాదని స్త్రీలకు బోధించడం మన దేశంలో చాలాఅవసరమని తలుస్తాను. తన భర్తతోనైనా అవసరమైతే 'వల్లకాద'ని చెప్పే చాకచక్యాన్ని మన స్త్రీలు నేర్చుకోవాలి. ఆమెకు విధులేకాక హక్కులుకూడా వున్నవని ఆమె గ్రహించుకునే లాగ చేయాలి. ... మొట్టమొదట ఆమెను మానసికదాస్యం నుంచి విముక్తమొనర్చాలి; తన దేహంయొక్క పవిత్రతను ఆమెకు అవగాహనచేయాలి. దేశసేవ, మానవసేవ చేయుట లోని గౌరవాన్ని ఆమెకు అవగతం కావించాలి. భారత దేశపు స్త్రీలకు ఇక మోక్షం లేదనీ అందువల్ల వారికి పిల్లలను కనకండావుండే మార్గమొకటి నేర్పితే సరిపోతుందనీ, వారికి ఉన్నపాటి ఆరోగ్యాన్ని నిలబెట్టడానికి అదొక్కటే సాధన మనీ నిర్ణయించడం న్యాయంకాదు.

తమ యిష్టాయిష్టాలతో సంబంధంలేకుండా పిల్లలను కని బాధపడే స్త్రీలోకంయొక్క దుస్థితిని గురించి న్యాయ సమ్మతమైన ఆరాటం పొందే నా సోదరీమణులను కొంచెం ఓపిక పట్టవలసినదిగా కోరుతాను. గర్భనిరోధక పద్ధతులు అమలుచేసే ప్రచారం ఒక్కరోజులో ఫలితం చూపదు. ఏ విధానంగాని ప్రజలకు అవగాహన కావడానికి, వారికది

బోధచేయాలి. ఆ చేసేబోధన సక్రమమైన విధానంకోసమే ఎందుకు చేయకూడదని మాత్రమే నా వాదం.

హరిజన్, 2-5-36.

వంధ్యత్వప్రక్రియ :

ప్రజలమీద వంధ్యత్వప్రక్రియను (Sterilization) అమలుపరచడం అమానుష విధానమని నా అభిప్రాయం. కాని తీరని దీర్ఘరోగముల పాలైన వ్యక్తుల విషయంలో, వారు ఇష్టపడినయెడల, వారిని వంధ్య మొనర్చవచ్చునని భావిస్తాను. వంధ్యత్వప్రక్రియ కూడా గర్భనిరోధక సాధనములలో ఒకటి అగుటవలనను, నేను స్త్రీలవిషయంలో గర్భనిరోధానికి వ్యతిరేకి నగుటవలనను, బలాత్కారం అవలంబించగలవాడు పురుషుడే అగుటచేతను, పురుషుల విషయంలో మాత్రం, ఇష్టమైనవారు వంధ్యత్వ ప్రయోగమును పొందవచ్చునని తెలుస్తాను.

అమృతబజారు పత్రిక, 12-1-35.

జనాభా ప్రవృద్ధి అనే పెనుభూతం :

జనాభా పెరిగిపోతున్నదనే హేతువున దేశానికి గర్భనిరోధం అవసరమని వాదించే పక్షంలో, నేనా ప్రతిపాదనను వ్యతిరేకిస్తాను. అది ఇంతవరకెప్పుడుగాని రుజువుకాలేదు. తగిన భూమి పంపకపు విధానంవల్లను, దానికి సహకారకమైన పరిశ్రమల ఏర్పాటువల్లను ఈ దేశం ఈనాటి జనాభాకు రెట్టింపు సంఖ్యను భరించగలదని నా అభిప్రాయం.

యంగిండియా, 2-4-25.

ఈ మన అల్పమైన భూమిగోళం నిన్న మొన్నటి ఆట వస్తువు కాదు. కోట్లకొలది సంవత్సరాలనుండి ఇది నడుస్తూ వున్నా, ఇంతవర కెన్నడుగాని జనసంఖ్యయొక్క ఆధిక్యతా భారంవల్ల ఇది క్రుంగిపోలేదు. అటువంటప్పుడు ఈనాడు హఠాత్తుగా గర్భనిరోధ సాధనాలద్వారా జననసంఖ్యను పరిమితం చేస్తేతప్ప, భూమండలం ఆహారలోపంవల్ల నిజంగా నశిస్తుందనే అభిప్రాయం కొందరి మేధస్సులలో జనించడానికి హేతువేమిటి ?

హరిజన్, 14-9-35.

జననాలసంఖ్య పెరిగిపోతున్నదనే కృత్రిమ పెనుభూతం క్రొత్తగా పుట్టిందికాదు. అప్పుడప్పుడది వాదనకోసంబయటికి వదలబడుతూనేవుంది. జనసంఖ్య పెరుగుదల ఒక భయంకర విపత్తుగా భావింపబడనవసరంలేదు. కృత్రిమ పద్ధతులతో దానిని అరికట్టే ప్రయత్నం. మనకు తెలిసినా తెలియక పోయినా, అన్నిటికన్నా ప్రముఖమైన ఆపత్తు. అది సర్వజనాదరం పొందిననాడు జాతిపతనానికి దారితీయగలదు. అదృష్టవశాత్తు అది అట్టి తాహతు నార్జింపజాలదనుట కొంతవరకు సంతోషకరమైన విషయం. అక్కరలేని సంతానం కలగడానికి కారణమైన కామపిశాచానికి విరుగుడుగా మహాత్ములు, యుద్ధాలు, కాటకాలు పుడతాయి. ఈ త్రివిధములైన పిశాచములనుండి మనం విముక్తులం కాగోరితే మనం ఆత్మనిగ్రహ సాధనంద్వారా అనవసర సంతానసృష్టి అనే పిశాచమునుంచి కూడా విముక్తులం కావలసివుంటుంది. అతి

శయ సంతానప్రాప్తిద్వారా జాతి పెరుగుదలను సాధించే అభిలాషను తప్పకుండా అరికట్టవలసినదే. అందుకు జీవిత సమస్యలన్నింటిని సమీకరించే విద్యాప్రచారం అవసరం. అనగా, ఒక సమస్యయొక్క పరిష్కారాన్ని గురించిన సమాలోచన ఇతర సమస్యలన్నింటిని గురించిన సర్వతోముఖ పరిశీలనపై ఆధారపడివుండాలి. ఎత్తుకి ఎక్కవలసి వుంటుంది గదా అని ఉన్నతమార్గాన్ని విసర్జించకూడదు. మానవుని ఉన్నతపరిణతి పథం కష్టనిష్ఠురతలతో కూడి వుండకతప్పదు. అందుకని దానికి వైదొలగుటకు బదులు, దానిని ఆహ్వానించి అనుసరించడమే వివేకమార్గం.

హరిజన్, 31-3-46.

అధ్యాయం ౫౯

జననేంద్రియ విజ్ఞాన బోధన.

జననేంద్రియ విజ్ఞాన విషయికమైన శాస్త్రబోధనమునకు మన విద్యావిధానంలో స్థానమేమిటి?— అసలు స్థానముండవలెనా, లేదా? ఇంద్రియ విజ్ఞానం రెండువిధములైనదిగా ఉంది— ఇంద్రియోద్రేకమును నిగ్రహించి అరికట్టుటకు ఉపకరించునదొకటి, దానిని రేకెత్తించి ఇనుమడింపజేయుటకు ఉపయుక్తమగునదింకొకటి. మొదటిదానియొక్క బోధనమునకు బాలుర విద్యావిధానంలో అవసర స్థానం ఉన్నది. రెండవది హానికరము, ఆపత్కరము అగుటచే

వర్జనీయమైనది. మతములన్నికూడా క్రోధద్వేషములకంటె మానవునికి కామమే ప్రధానశత్రువనే సముచిత నిర్ణయాన్ని చేసివున్నవి. భగవద్గీతలో కామమే క్రోధద్వేషాలకు మూలమని చెప్పబడింది. గీతలో కామశబ్దం కోరిక అనే విశాలార్థంలో ఉపయోగించబడిన మాట నిజమే. కాని గీతలో చెప్పిన అభిప్రాయం ప్రస్తుతం నేను సంకుచితార్థంలో ఉపయోగించే కామవిషయంలో కూడా వర్తిస్తుంది.

అది అట్లావుంచి, యువవిద్యార్థులకు జననేంద్రియముల ప్రయోజన, ధర్మములను గూర్చిన విజ్ఞానాన్ని బోధించడం అభిలషణీయమా, కాదా అనే ప్రశ్నకు సమాధానమొసగవలసి వున్నది. ఆ విషయమైన విజ్ఞానాన్ని కొంతవరకు ఒసగవలసినదే అని నాకు తోస్తుంది. ఈనాడు వారు ఆ విషయాలను ఎట్లో ఒకట్లు తెలుసుకుంటూనే వున్నారు; అట్లు తోచినరీతిని తెలుసుకొన్న వివరాలకు ఫలితంగా దురభ్యాసాలకు పాలవుతున్నారు. మనం కళ్లుమూసుకోవడం ద్వారా ఇంద్రియోద్రేకాన్ని తగినరీతిగా జయించడంగాని, నిగ్రహించ గలగడంగాని సాధ్యపడదు. అందువల్ల మన బాలబాలికలకు తమ జననేంద్రియముల విశిష్టప్రయోజనాన్ని గురించీ, వాటిసద్వినియోగాన్నిగురించీ తప్పకుండా బోధించవలసినదే అని నేను అభిప్రాయపడుతున్నాను. నా బాధ్యతలో వున్న బాలబాలికలకు నా పద్ధతి ననుసరించి నేనున్నూ అట్టి పరిజ్ఞానాన్ని బోధించి వున్నాను.

కాని నేను ప్రతిపాదించే ఇంద్రియ విజ్ఞానానికి ఇంద్రియవాంఛను జయించి, ఉదాత్త మొనర్చుకొనడమే, ఆదర్శంగా వుండాలి. అట్టి బోధనము మన పిల్లలకు మనుష్యునికీ పశువుకీ మధ్యగల ముఖ్యభేదమును స్పష్టపరచునదిగా వుండాలి. మానవుడు మనస్సు, హృదయము అనే రెండు శక్తులనూ కలిగివున్నందున మనం గర్వమొందవలసి వున్నదనిన్నీ మనుష్య శబ్దంయొక్క మూలార్థమును బట్టియే మానవుడు ఉద్రేకాలను అనుభవించే శక్తినే కాక, ఆలోచనా శక్తిని కూడా కలిగివున్నట్లు స్పష్టమవుతుందనిన్నీ, అందువల్ల అంధమైన ఇంద్రియోద్రేకాలను హేతుశక్తికి లోబడునట్లు చేయనిచో మానవుడు తన మానవస్థితిని కోల్పోవుననిన్నీ కూడా మనపిల్లలకు బోధపరచాలి. మానవునిలో జాగృతమైన హేతుశక్తి ఉద్రేకాలను క్రమమార్గాన నడిపిస్తుంది. పశుజాతిలో అంతరాత్మ గర్భితమై దాగివుంటుంది. హృదయాన్ని మేల్కొల్పడమంటే నిద్రితమైన ఆత్మను లేపడమన్న మాట; హేతువును మేల్కొల్పడమంటే మంచిచెడ్డల విచక్షణజ్ఞానం ప్రకాశమానం కావడమన్నమాట.

అట్టి ఇంద్రియ విజ్ఞాన బోధకులు ఎట్టివారై ఉండాలి? వారు లాలసలను జయించేశక్తిని ఆర్జించినవారై వుండాలి. ఖగోళశాస్త్రము, ఇతర శాస్త్రాలు బోధించేనిమిత్తం ఆయా శాస్త్రాలలో శిక్షణపొంది, ఉత్తీర్ణులైనవారే నియమితులౌతున్నారు. ఆ విధంగానే ఇంద్రియ విజ్ఞానశాస్త్రమునకును,

అనగా ఆత్మనిగ్రహ శాస్త్రమునకును, బోధకులుగా అట్టి విద్యలో సాధనచేసినవారిని, అందు ఉత్తీర్ణతసిద్ధించినవారిని మాత్రమే నియమించాలి. అనుభవపూర్వకమూ, మనఃపూర్వకమూ కానిదే ఎంత ఉదాత్తబోధనమైనాగాని నిర్జీవమూ, ప్రభావరహితమూ అయిపోగలదు; అట్టి బోధనము మనుష్యుల హృదయాలలో ప్రవేశించి వానిని జాగృతమొనర్పనేరదు. ఆత్మజ్ఞానంనుంచీ, నిజమైన అనుభూతినుంచి వెలువడినమాటలు వెంటనే ఫలప్రదమాతాయి.

ఈనాడు మన వాతావరణ అంతా — మన చదువు, మన ఆలోచనా, మన సాంఘిక ప్రవర్తన — మొత్తంమీద చూస్తే, ఇంద్రియోద్రేకాన్ని ప్రోద్బలపరచునదిగాను, తృప్తిపరచునదిగాను ఉన్నది. దాని బంధనములనుంచి విడివడుట సులభమైనపనికాదు. అనుభవజ్ఞులూ, ఆత్మనిగ్రహమే మానవుని పరమాదర్శమనీ నమ్మేవారూ, తాము బోధచేసే విషయంలో సత్యమైన, అజేయమైన విశ్వాసబలం కలవారూ, అప్రమత్తమైన నిరంతర జాగరూకతను చూపగలవారూ అయిన బోధకులు ఏ కొలదిమంది ఉన్నాగాని, అజ్ఞానంవల్ల కామోద్రేకమనే పంకిలంలోకి పడిపోయేవారిని రక్షించగల్గుతాను; అందులో ఈ వరకే మునిగిపోయి వున్నవారిని బైటికి లాగగల్గుతాను.

హరిజన్, 21-11-36.

అధ్యాయం ౫౪

పసిపిల్లలు.

పసిపిల్లలకు తలిదండ్రులనుంచి బాహ్యమైన పోలికలు ఏ విధంగా సంక్రమిస్తాయో అట్లే వారిగుణాలుకూడా సంక్రమిస్తాయి. పరిసరాలయొక్క భావానికికూడా ప్రాముఖ్యత వున్నదిగాని, పసిపిల్లలు తమ జీవితాన్ని ప్రారంభించే మూలధనం మాత్రం పెద్దలనుంచి సంక్రమించినదే అయివుంటుంది. పిల్లలు తమకు పెద్దలవలన పుట్టుకతో సంక్రమించిన దుర్గుణాలను తరచు జయించగలగడం నేను గమనించాను. పరిశుద్ధత ఆత్మగర్భితమైన గుణం కావడంవల్లనే అది సాధ్యమవుతున్నది.

ఆత్మకథ, పే 312.

తల్లిగాని, తండ్రిగాని తన పిల్లలందరకు సమానంగా అందజేయగలిగిన ఆస్తి ఆమెయొక్క లేక ఆతనియొక్క శీలసంపద ఒకటి; వారికి విద్యాభ్యాస సౌకర్యం కలిగించడం రెండవది. ...తలిదండ్రులు తమ కొడుకులను, కుమార్తెలను, (self-reliant) తమపై తాము ఆధారపడగల్గునట్లుగను, తమ చెమటోడ్చి చేసేకష్టంద్వారా న్యాయసమ్మతమైన జీవనోపాధిని ఆర్జించుకొనగల్గునట్లుగను చేయుటకు ప్రయత్నించాలి.

యంగిండియా, ౭౨-10-31.

పిల్లలెవరుగాని దుష్టమైన అల్లరిగుణంతో పుట్టరని నేను పూర్తిగా నమ్మతాను. శిశుజననానికి పూర్వమును,

శిశుజననాంతరమందును తలిదండ్రులే కనక సత్ప్రవర్తన కలిగివున్నవారైతే శిశువు స్వతస్సిద్ధంగా సత్యసూత్రాన్నీ, ప్రేమసూత్రాన్నీ మాత్రమే అనుసరిస్తాడన్న సంగతి ప్రసిద్ధ విషయమే. ...వందలాది-లేక వేలాది-పిల్లలను గురించిన నా అనుభవాన్ని బట్టి పసిపిల్లలకు మీ కంటె నా కంటె ఎక్కువ నిజాయితీ, ఆత్మగౌరవభావమూ ఉన్నదని చెపితే నమ్మండి. మనమేకనక వినయబుద్ధితో క్రిందిస్థాయికి దిగి గమనించినచో, జ్ఞానవిదులైన పెద్దలనుంచి కాక అజ్ఞానులనబడే పసిపిల్లలనుంచే జీవితంలోకల్లా ఉత్కృష్టమైన గుణపాఠాలను నేర్చుకొనగల్గుతాం. 'శిశువులనోటనే నిజమైన జ్ఞానం వెలివడుతుం'దనేమాటకంటె ఉన్నతమైన ప్రవచనం జీససు నోట వెలువడి వుండలేదు. నేనా మాటను విశ్వసిస్తాను. మనం అడకువతోను, అమాయికతతోను పసిపిల్లలను దరిసినచో, వారినుంచి మనకు సత్యమైన జ్ఞానం లభించగలదని స్వానుభవపూర్వకంగా నేను గ్రహించివున్నాను. మానవునికి అసాధ్యమైనది దేవునికి శిశుక్రీడవంటిదనిన్నీ, తన సృష్టిలోని అల్పాల్పమైన జీవిలోకూడా నిక్షిప్తమైయున్న ఆతని దివ్యశక్తిలో మనకు విశ్వాసమున్నయెడల నిస్సందేహంగా, మనకూ సర్వమూ సాధ్యం కాగలదనిన్నీ నేను అవగాహన చేసుకున్నాను. ఆ తుది ఆశనే నమ్ముకుని, ఆ ఈశ్వరేచ్ఛననుసరింప యత్నిస్తూ, నేను నా జీవితకాలం వెళ్లబుచ్చుతున్నాను. మనం ఈ ప్రపంచంలో నిజమైన శాంతిని అందుకొనవలెనంటే, యుద్ధములను నిర్మూలించే నిమిత్తం నిజమైన

యుద్ధం చేయదలిస్తే, మనకృషి పసిపిల్లలతోనే ప్రారంభం కావలసి వుంటుంది. వాళ్లే కనక సహజమైన అమాయిక శీలంతో పెరిగితే మన మింత శ్రమపడవలసిన పనిగాని, వృథా తీర్మానాలతో విఫలతపొందవలసిన పనిగాని వుండదు; అప్పుడు మనం ప్రేమనుంచి మరింత ప్రేమభావానికీ, శాంతినుంచి మరింత శాంతిస్థితికీ పురోగమించ గల్గుతాం; తుట్టతుదకు ఆ శాంతి ప్రేమలు, వాటి కొరకు తెలిసియో, తెలియకనో, ఆకలిగొని తపించే లోకపు దిగంతాలవరకూ విస్తరించ గల్గుతాయి.

యంగిండియా, 19-11-31

అధ్యాయం ౫౮

సాంఘిక సామరస్యం.

సాంఘిక సామరస్యంయొక్క అవసరాన్ని గురించి అందరూ అంగీకరిస్తారు. కాని ఆ సామరస్యంయొక్క అర్థం పైనుంచి బలవంతంగా అమలుచేయబడే రాజకీయ సామరస్యం కాదన్నసంగతి అందరికీ తెలియదు. సామరస్యమంటే నిజమైన హృదయైక్యత అని అర్థం. ప్రతికాంగ్రెసు సభ్యుడును, తాను ఏమతానికి చెందినవాడైనప్పటికి, హిందువులు ముస్లింలు, క్రైస్తవులు, జొరాస్ట్రియనులు, యూదులు మొదలైన అన్ని మతస్థులకును - అనగా భారతదేశపు కోట్లకొలది ప్రజానీకంలో ప్రతి ఒక్కనికిని, తాను వ్యక్తిగతంగా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా భావించుకొనడం అట్టి సామరస్య

సాధనకు మొదటిమెట్టు. దీనిని అలవరచుకొనవలెనంటే, ప్రతికాంగ్రెసు సభ్యుడును తన మతమునకు భిన్నమైన ప్రాతినిధ్యం వహించే వారితో వ్యక్తిపరమైన స్నేహసంబంధాలు కలిగించుకోవాలి. తన మతంతో సమానంగా ఇతర మతాలను కూడా గౌరవించాలి.

నిర్మాణకార్యక్రమం, పే. 8.

హిందువులు, ముసల్మానులు, క్రైస్తవులు, శిక్కులు, పార్సీలు మొదలగువారినడుమ గలుగు తగాదాలయొక్క పరిష్కారానికి వారు దౌర్జన్యపద్ధతుల నవలంబించకూడదు. హిందువులు, ముస్లింలుకూడా మతవిషయాలలో బలాత్కారం పనికిరాదని ఉత్తరకబుర్లు చెబుతారు. ఒక గోవును రక్షించడానికని ఒక ముసల్మానుని చంపే హిందువులచర్య బలాత్కారం కాక మరేమిటి? అది దౌర్జన్యపద్ధతిని ఒక ముసల్మానుని హిందూమతంలో కలపడానికి కోరడంతో సమానమే అవుతుంది. అల్లే ముసల్మానులు మసీదులముందు హిందువులు వాయిద్యాలు మ్రోగింపకుండా ఆటంకపరచడంకూడా బలాత్కారం కాక ఇంకేమవుతుంది? ఎంతగోల, గందరగోళం జరుగుతూవున్నా, దానిని పాటించకుండా మన ప్రార్థనలలో మనం నిమగ్నులం కాగలగడంలోనే గొప్పతనం వుంది. మన ఒక్కొక్కరి మతసంబంధమైన కోరికలను ఇతరులచేత బలవంతంగా అంగీకరింపజేయడానికి మన మొనర్చే వృథా ప్రయత్నాలను ఇంకా ఇంకా సాగించినచో, ముందు

తర్వాలవారు మన ఇరువురను మతవిశ్వాసంలేని అడవి మను ష్యులవలె పరిగణిస్తారు.

ఒక ఆర్యసమాజ ప్రచారకుడుగాని, ఒక ముసల్మాను మత ప్రచారకుడుగాని తన అంతరంగ ప్రోద్బలానుసారంగా ఆయా మతవిశ్వాసములను ప్రచార మొనర్చడంవల్ల హిందూ ముస్లిం సామరస్యం ఆపత్తులో పడిపోయిందనుకుంటే, అట్టి సామరస్యం ఎంతమాత్రమూ లోతైనది కాదన్నమాట. అట్టి ఉద్యమాలకు మనమెందుకు బెదిరిపోవాలి? అవి నిజాయితీతో కూడినవైతే ఏమీ భయపడవలసిన అవసరం లేదు. మాల్కా నాలు హిందూమతంలోకి తిరిగి కలవాలని కోరితే, వారట్లు చేయుటకు సర్వదా సంపూర్ణమైన హక్కువుంది. కాని ఇతరమతాలను తూలనాడే ప్రచారాన్ని మాత్రం అనుమతించ డానికి వీలులేదు. అది సహనసామరస్యాలకు విరుద్ధమైన దవు తుంది. అట్టి ప్రచారాన్ని బహిరంగంగా ఖండించడమే దానికి విరుగుడు. ప్రతి ఉద్యమం గౌరవమైన పై వేషంతో ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంది. ప్రజలు ఆ పైవేషాన్ని చించివారవైచిన వెంటనే అది సంఘ గౌరవాన్ని కోల్పో యినదై నశిస్తుంది.

ఇక, నిరంతరఘర్షణలకు మూలమైన రెండు అంశాల పరిష్కారాన్ని గురించి పరిశీలన చేయవలసివున్నది.

మొదటిది గోవధ. గోసంరక్షణ అనేది ఉన్నతవర్గా లకును, జనసామాన్యానికిని కూడా సమానాభిమానం గల

విషయం కావడంవల్ల అది హిందూమతానికి కేంద్రమైన సూత్రంగా నేను భావించినప్పటికీ, దీనికోసమని ముసల్మానులయెడల శత్రుభావం చూపడం ఎందుకో నాకెన్నడూ అర్థంకాలేదు. ప్రతిరోజు ఆంగ్లేయులకొరకై జరిగే గోవధను మనం ఏమాత్రం పట్టించుకోము. కాని ఒక ముసల్మాను మతస్థుడు గోవును వధించగానే మన ఆగ్రహావేశం అగ్నిజ్వాలలా రగుల్తుంది. గోవుపేరిట జరిగిన కొట్లాటలన్నీ ఉన్మాదపూరితమైన విఫలప్రయత్నాలే అనిపించుకుంటాయి. వాటివల్ల ఒక్క గోవైనా రక్షింపబడలేదు సరిగదా, అవి ముసల్మానుల పట్టుదలనుమాత్రం మరెంత రేకెత్తించి మరింత గోవధకు కారణభూతమైనాయి. గోసంరక్షణ ముందుగా మనతోటే ప్రారంభం కావాలి. ప్రపంచంలో బహుశా ఏ ఇతర ప్రాంతంలోగాని పశువులను మనదేశంలో చూచేటంత హీనంగా చూడరు. హిందువులైన బండ్లవాళ్లు తమ అలసిపోయిన ఎద్దులను ములుగోలతో నిర్దయగా పొడడం చూచి నేను కన్నీరు కార్చాను. మన పశుసంపత్తిలో చాలాభాగం తిండిలేక ఎంత నీరసస్థితిలోవున్నవో గమనిస్తే, మనం సిగ్గుతో తల వంచుకోవలసివుంటుంది. హిందువులు గోవులను విక్రయించడం వల్లనే అవి కసాయివాని కత్తికి ఎరకావలసి వస్తున్నది. ముసల్మాను మతస్థులతో సఖ్యత నలవరచుకుని గోరక్షణమును వారి సౌజన్యతకు వదలిపెట్టడమే సాఫల్యతాప్రదమూ, సగౌరవమూ అయిన విధానం. గోరక్షణ సంఘాలు పశువులకు ఆహారపుకొరత లేకుండా చూడడం, వానియెడల క్రూర

ప్రవర్తనను తొలగించడం, పచ్చికబయళ్లు ఇంకా తరిగి పోకుండా కాపాడడం, పశువుల వంగడమును అభివృద్ధిపరచ డం, పేదవారైన పశువులకాపరులవద్ద పశువులను కొనడం, పశురక్షణశాలలను స్వయంపోషకమైన పాలపరిశ్రమా కేం ద్రాలుగా పెంపొందించడం మొదలైన పనులయందు మనం శ్రద్ధవహించాలి. నేను పైన పేర్కొనిన కార్యములన్నిటిని నెరవేర్చని యెడల దేవుని సమక్షంలోను, మనుష్యుని సమక్షం లోనుకూడా మనం పాపంచేసినట్లవుతుంది. ముసల్మానులు చేసే గోవధను తప్పించలేకపోతే తాము పాపంచేసినట్లుగా హిందు వులు భావించుకొన నవసరంలేదుగాని, గోవును రక్షించే నిమిత్తం వారు ముసల్మానులతో అది తప్పక కొట్లాటలలోకి దిగితేమాత్రం నిజంగా గొప్పపాపకార్యం చేసినవారౌతారు.

మసీదులముందర వాద్యముల విషయమూ, హిందూ ఆలయాలలో 'ఆరతి' విషయముకూడా నేను ప్రార్థనాపూర్వక మైన శ్రద్ధాభావంతో ఆలోచించాను. గోవధ హిందువుల కెట్టి ఘర్షణహేతువో ఈ విషయం ముసల్మానుల కట్టి ఘర్షణ హేతువు. హిందువులు ఏ విధంగా ఖడ్గబలంతో ముసల్మాను లను బలాత్కరించడంద్వారా గోవధను నివారింపలేరో, అట్లే ముసల్మానులును బలాత్కారంద్వారా హిందువులు వాయిద్యములను వాయించకుండాను, ఆరతిని ఒసగకుండాను నివారింపలేరు. వారును ఈ అంశమును హిందువుల సౌజ న్యానికి వదలవలసిందే. హిందువులలో ఒకనిగా నేను ఈ

విషయములలో హిందూసంఘీయులు ముసల్మానుసంఘీయులతో ముందు సంప్రదిస్తూ వుండవలసినదిగాను, వీలైనంతవరకు వారి అనుకూల ప్రకారం వర్తించవలసినదిగాను తప్పక సలహా చేస్తాను. ఈ మాట నేను బేరంకోసం చెబుతున్నది కాదు. కొన్ని చోట్ల హిందువులు కేవలం ముసల్మానులను రెచ్చగొట్టే బుద్ధిపూర్వకమైన ఉద్దేశంతో సరిగా వారి ప్రార్థన సమయ మప్పుడే 'ఆరతి' ప్రారంభిస్తూ వున్నట్లుగా నేను వినివున్నాను. ఇది మైత్రీవిరుద్ధమైన మతిమాలిన పని. మిత్రభావం కలిగినవారు మిత్రుని హృదయానికి ఏ మాత్రంగాని కష్టం కలిగించకుండా వర్తించాలి. దానికి ప్రత్యామ్నాయం ఏమీ కోరకూడదు. అయితే ముసల్మానులును బలప్రయోగం ద్వారా హిందువుల వాయిద్యములను తాము ఆపగలమని కూడా భావించకూడదు. దౌర్జన్యపు బెదరింపులకుగాని. దౌర్జన్యచర్యలకుగాని లొంగిపోవడం ఆత్మగౌరవానికీ, మత విశ్వాసానికీ భంగకరం. అట్టి బెదిరింపులకు ఎన్నడుగాని లొంగుటకు ఇష్టపనివాడు ఎదిరిపక్షమును రెచ్చగొట్టే పనులను వీలైనంతవరకు చేయకుండా వుండాలి.

నాయకులు ఒకరితో ఒకరు తలపడకుండా ఊరకుంటే జనసామాన్యం కొట్లాటలలోనికి దిగబోరని నా నమ్మకం. నాగరిక దేశాలన్నిటిలోనూ అనుకునేలాగ మన నాయకులు కూడా కొట్లాటలపద్ధతి అనాగరికమూ, మతవిరుద్ధమూ అయిన విధానమని అనుకుని, దానిని ప్రజాహితరంగంలో

నుంచి తుడిచివైచిన యెడల జనసామాన్యమునూ్నా వారి యొక్క అడుగుజాడలలో నడుస్తారని నేను నిస్సందేహంగా చెప్పగలను.

మనదేశంలో ఆంగ్లేయులపాలన ఇంకా ఏర్పడక పూర్వం, ఇంకా ఆంగ్లేయుల మొగమైనా మనదేశంలో కనిపించని క్రితం హిందువులును, ముసల్మానులును, శిక్కులును ఇక్కడ నిరంతరం ఒకరితో ఒకరు యుద్ధాలు చేసుకుంటూనే గడిపారా? అప్పుడుకూడా మనమంతా చాలావరకు ప్రశాంతంగానే గడిపివున్నట్లు హిందూ చరిత్రకారులును, ముస్లిం చరిత్రకారులును కూడా తమ తమ రచనలలో స్పష్టపరచివున్నారు. గ్రామీణులైన హిందూ ముసల్మానులు ఈనాడైనా ఎట్టి ఘర్షణలుగాని లేకుండానే జీవిస్తున్నారు. ఆ రోజులలో వారు అసలు ఘర్షణలంటే ఏమిటో ఎరగనే ఎరగరు. ... ఈ సాంఘిక ఘర్షణ అనేది పురాతనమైనది కాదు. ఇది ఆంగ్లేయుల ఆగమనంతోనే ప్రారంభమైనదని నేను నిష్కర్షగా చెప్పగలను. ఆంగ్లదేశానికీ భారతదేశానికీ ఏర్పడివున్న ఈ దురదృష్టవంతమూ, కృత్రిమమూ, అసహజమూ అయిన సంబంధం మారి, ఏనాడుగాని పరస్పరం ఇష్టపూర్వకమైన భాగస్వామ్యతగా, ఎవరికి ఎప్పుడు కావలెనంటే అప్పుడు విడిపోయే అవకాశంతో కూడిన బాంధవ్యంగా రూపొందిన యెడల, ఆ మరుక్షణంలో మనదేశంలోని హిందువులు, ముసల్మానులు, శిక్కులు, ఐరోపీయులు, ఆంగ్లో-

ఇండియన్లు, క్రైస్తవులు, అస్పృశ్యులు అంతా కలసిమెలసి తప్పక సంఘీభావంతో జీవించగలరని నేను ఘంటాపథంగా ఉగ్గడిస్తాను

యంగిండియా, 24-12-31.

స్వాతంత్ర్య సూర్యుని ఉదయకిరణాలు సోకినవెంటనే సాంఘికఘర్షణ అనే మంచుపర్వతం కరగి నూాయంకాగలదని నేను నిస్సందేహంగా విశ్వసిస్తాను.

యంగిండియా, 29-10-31.

అధ్యాయం ౬౦

వర్ణాశ్రమ ధర్మము.

ప్రపంచంలోని ప్రతివ్యక్తీ ఏవోకొన్ని సహజప్రవృత్తులతో జన్మిస్తాడని నా నమ్మకం. ప్రతిమనిషీ తాను అధిగమించలేని కొన్ని స్వాభావిక పరిమితులతో పుడతాడనికూడా చెప్పవచ్చును. ఆ పరిమితులను గురించి జాగరూకతతో చేసిన పరిశీలనయొక్క ఫలితంగా వర్ణధర్మం అనేది నిర్ధారణ చేయబడింది. తద్వారా కొన్నికొన్ని రకముల ప్రవృత్తులుగల కొందరు కొందరికి కొన్నికొన్ని క్రియారంగములు స్థిరీకరింపబడ్డాయి. దీనివలన అక్రమమైన పోటీలకు అవకాశం తొలగించబడింది. వర్ణధర్మం ఒకవంక శక్తిసామర్థ్యముల పరిమితులను అంగీకరించినా, తాహతుల ఎక్కువ తక్కువలను

మాత్రం అంగీకరించదు. ఒకదిక్కున అది ప్రతివానికిని తన శ్రమఫలితమును నిశ్చయంగా కలిగిస్తూ, మరొకదిక్కున అతడు తన ఇరుగుపొరుగు వారితో పోటీకిదిగకుండా నివారిస్తుంది. ఈ ఉత్కృష్టధర్మం ఈనాడు దుష్పరిణతిని పొంది అపయశం పాలైపోయింది. కాని ఈ గర్భితమైన రహస్యమును అవగాహన చేసుకుని, దానిని ఆచరణలో పెట్టినప్పుడే ఆదర్శప్రాయమైన సాంఘిక నిర్మాణం రూపం పొందగలదని నా విశ్వాసం.

ది మోడరన్ రివ్యూ, అక్టోబరు '35, పే. 413

వర్ణాశ్రమ ధర్మమనేది భూమిపై మానవునియొక్క నిర్దిష్టప్రయోజనం ఏమిటో నిర్వచిస్తుంది. దినం తర్వాత దినం ధనసంపాదనకు నూతన మార్గాలను అన్వేషించడం లోను, జీవనోపాధికి కొత్తకొత్త దారులు త్రొక్కడంలోను గడపడానికి మానవుడు జన్మమొందలేదు; తన జీవశక్తిలోని ప్రతి అణువు తన సృష్టికర్త అయిన పరమేశ్వరుని తెలిసికొనుటకు వినియోగించు నిమిత్తమే మానవుడు జన్మించాడు. అందువలన వర్ణధర్మం, మానవుడు తన శరీరమును, ఆత్మను పోషించి నిల్పుకొనేనిమిత్తం, తన పూర్వీకుల సంప్రదాయిక వృత్తినే అవలంబించునట్లుగా నిర్దేశిస్తుంది. వర్ణాశ్రమ ధర్మానికి ఇదే సరియైన అంతరార్థం.

యంగిండియా, 27-10-27.

చాతుర్వర్ణ్య విభజనము ఒక్కటే ప్రాథమికమూ, సహజమూ, ప్రధానమూ అయినదిగా నేను పరిగణిస్తాను. అసం

ఖ్యాకంగావున్న ఉపకులాలవల్ల ప్రయోజనమున్నా, అవి ఎక్కువగా ప్రతిబంధకములుగానే వర్తిస్తాయని చెప్పవల సుంటుంది. అవి ఎంతత్వరగా కలిసి ఏకమైపోతే అంతనయం.

యంగిండియా 8-12-20.

ఈనాడు బ్రాహ్మణ, క్షత్రియనామాలూ, వైశ్య శూద్రనామాలూ ఉత్తముద్రలుగా మాత్రమే మిగిలాయి. నేను నిర్వచించే వర్ణధర్మం పూర్తిగా సంకరమైపోయిన స్థితిలోవుంది. అందువల్ల నేటికాలపు హిందువు లందరూ ఇష్టపూర్తిగా ఒక్క శూద్రనామాన్ని ధరిస్తే సమంజసంగా వుంటుందని నా అభిప్రాయం. బ్రాహ్మణత్వంలోని సత్యాన్ని నిరూపితం చేయడానికీ, వర్ణధర్మంయొక్క నిజమైన స్థితిని పునరుద్ధరించడానికీ అదొక్కటే మార్గం

హరిజన్, 25-3-33.

కులము :

ఆధునికమైన అర్థంలో నాకు కులమంటే నమ్మకం లేదని అనేక సందర్భాలలో చెప్పివున్నాను. అది శరీరం మీద పెరిగిన ఒక దుర్మాంసం వంటిది. అది పురోగమన నిరోధకమైనది. మనుష్యులమధ్య అసమానత అనేదే నేను నమ్మను. మనమంతా సంపూర్ణంగా సమానులమే. కాని సమానత అనేది ఆత్మలకు చెందినదేగాని శరీరములను చెంది నదికాదు. కావున అది ఒక మనఃస్థితి. భౌతికప్రపంచంలో గొప్ప అసమానతలను మనం చూస్తూవుండబట్టే, సమాన

భావాన్నిగురించి మనం ఆలోచించవలసిన అవసరం, నొక్కి చెప్పవలసిన అవసరం ఏర్పడుతుంది. పైకి కనుపించే ఈ బాహ్యమైన అసమానతల మధ్యలోనే మనం సమానభావాన్ని సిద్ధింపజేసుకోవాలి. ఏ వ్యక్తికంటెగాని మరొకవ్యక్తి తాను ఆధిక్యత కలవానిగా భావించుకోడం దేవునియెడల కూడా పాపంచేసినట్లవుతుంది. ఆవిధంగా కులమనేది, తారతమ్యములలో ఎక్కువ తక్కువలను తెలుపునదిగా వున్నంతవరకు, అది హానికరమైనదే అవుతుంది. కాని సంప్రదాయిక వృత్తులపై ఆధారపడే వర్ణధర్మంలో నాకు నమ్మకముంది. వర్ణవ్యవస్థ విశ్వవ్యాప్తమైన నాలుగువృత్తులను తెలిపే నాలుగు వర్గాలుగా విభజితమై ఉంటుంది. ఆ నాలుగువృత్తులును జ్ఞానబోధనలు, నిస్సహాయుల రక్షణము, సేద్యము, వాణిజ్యము, కాయకష్ట యుతమైనసేవఅనేవి. ఈవృత్తులు మానవకోటి కంతటికి సమానముగా వర్తిస్తాయి. హిందూమతం వాటిని మన జీవితవిధానానికి మూలసూత్రముగా గ్రహించి, సంఘసంబంధాలను, సాంఘిక ప్రవర్తనను నియమబద్ధం చేయడానికి ఆ సూత్రాలను ఉపయోగించింది. భూమ్యాకర్షణశక్తి అనేది ఒకటున్నట్లు మనం ఎరిగినా ఎరగకపోయినా, అది మన అందరిపైన తన ప్రభావం చూపుతూనే వుంటుంది. కాని ఆ సూత్రాన్ని తెలిసికొన్న విజ్ఞానశాస్త్రజ్ఞులు దాని ప్రయోగమువల్ల లోకాన్ని ఆశ్చర్యంలో ముంచే ఫలితాలను పొందివున్నారు. హిందూమతమున్నూ వర్ణధర్మాన్ని కనిపెట్టి, దానిని ప్రయోగించడంద్వారా లోకాన్ని ఆశ్చర్యనిమగ్నం చేసింది.

హిందువులు నిర్వీర్యతలో మునిగిపోయిన కాలములో వర్ణ వ్యవస్థ చెడి, అంతర్వివాహ విషయములోను, అంతర్భోజన విషయములోను అనవసరమూ, హానికరమూ అయిన నిషేధాలతో కూడిన అసంఖ్యాకమైన కులభేదాలకు తావొసగింది. వర్ణధర్మానికి ఈ నిషేధాలతో ఏమీ సంబంధంలేదు. వివిధ వర్ణములమధ్య అంతర్వివాహము, అంతర్భోజనము జరుగవచ్చును. పాతివ్రత్య, పారిశుధ్య సందర్భంగా అవసరమైతేనే ఈ నిషేధములు సమర్థనీయమౌతాయి. ఒక బ్రాహ్మణుడు ఒక శూద్రకన్యను వివాహమాడినా, ఒక శూద్రుడు ఒక బ్రాహ్మణకన్యను పెండ్లాడినా అది వర్ణధర్మానికి భంగకరం కాదు.

యంగిండియా, 4-6-31.

ఒక తావున దుర్మాంసం పెరిగితే దేహమంతా చెడిపోయినట్లు భావించినా, కలుపు పెరిగిందికదా అని పంటపొలాన్ని విసర్జించినా ఏ విధంగా తప్పో. అట్లే కొందరు కులభ్రష్టులమూలంగా కులమంతా నాశనం చేయడంకూడా పాపంగా కనిపించకుంటుంది. ఈ రోజులలో దేనిని కులభ్రష్టతగా భావిస్తున్నామో దానిని పూర్తిగా నిర్మూలన మొనర్చవలసివున్నది. వ్యవస్థ అంతా నాశనం కాకుండా చూడవలెనంటె అందులో ఈ కులభ్రష్టత అనే దుష్టాంగాన్ని ఖండించి వేయాలి. అస్పృశ్యత అనేది వర్ణవ్యవస్థయొక్క ఫలితంగా పుట్టినదికాదు. హిందూమతంలోకి ప్రవేశించి దానిని విషక్రిమివలె దొల్చివేస్తూవున్న గొప్పకొద్ది అనే భేదభావమే

అస్పృశ్యతను సృష్టించింది. అందువల్ల అస్పృశ్యతా నిర్మూలనమంటే ఈ హెచ్చుతగ్గు భావాన్ని నిర్మూలించడమే అన్నమాట. అస్పృశ్యత తొలగిపోయిన మరుక్షణం కుల వ్యవస్థ పరిశుద్ధమవుతుంది. అనగా నేను కలలు కనేరీతిగా కులవ్యవస్థ నిజమైన వర్ణధర్మంగా రూపాంతరం పొందుతుంది. అప్పుడు ఒకరు గొప్ప ఒకరు కొద్ది అనే భేదభావం లేకుండా హిందూమత శరీరానికి సమాన తాహతుగల అవసరాంగ ములుగా నాలుగు సాంఘిక వర్గములు ఏర్పడతాయి.

హరిజన్, 11-2-33.

ఆర్థికదృష్ట్యా వర్ణవ్యవస్థ ఒకప్పుడు చాలా ప్రయోజన కరంగా వర్తించివున్నది. అది సంప్రదాయికమైన నైపు ణ్యాన్ని పరిణతమొనర్చింది. పోటీని పరిమితంచేసింది. దారి ద్ర్యానికి పరమౌషధంగా వర్తించింది. వృత్తిసంఘాల (Trade-guilds) వల్ల కలిగే లాభాలన్నికూడా దానిలో గర్భితమై వుండేవి. సాహసవ్యాపారాలను, నూతనయంత్ర నిర్మాణానికి అది ప్రోద్బల మొసగని సంగతి నిజమేకాని, వాటిని నిరోధించినట్లు మాత్రం రుజువులేదు.

చారిత్రంగా చూస్తే కులవ్యవస్థను భారతీయ సంఘ మనే ప్రయోగశాలలో సాంఘిక సంఘటనాసమస్య విషయ ముగా మానవుడొనర్చిన ఒకానొక ప్రయోగంగా భావించ వచ్చును. దానిని మనం ఫలప్రదమైనదిగా రుజువుపరచ గలిగిననాడు, ప్రపంచమునకు దానిని ఒక నూతన పరిష్కార సాధనంగా ఒసగగల్గుతాము. క్రూరమైన పోటీవిధానానికీ,

లోభంవల్లను కలుగుతూవున్న సంఘపతనానికీ దానిని ఒక పరమౌషధంగా చాటగల్గుతాము.

యంగిండియా, 5-1-21.

వర్ణాశ్రమధర్మంలో వర్ణాంతర వివాహములపైన, వర్ణాంతర భోజనంపైన నిషేధం ఏమీ లేకపోయినా, బలాత్కారంమట్టుకు వుండకూడదు. ఒక పురుషుడుగాని, ఒక స్త్రీగాని ఎవరిని వివాహం చేసుకునేది, ఎవరితో భోజనం చేసేది అనే విషయాలలో సంపూర్ణమైన వ్యక్తిగత స్వాతంత్ర్యం కలిగివుండాలి.

హరిజన్, 16-11-35.

అధ్యాయం ౬౧
అస్పృశ్యతా పిశాచం.

ఈనాడు హిందూమతం ఒక తీరని కళంకభారాన్ని వహిస్తున్నది. ఆ కళంకం మనకు అనాదికాలంనుంచి సంక్రమించినదని నేను నమ్మను. మనం అత్యంత పతనస్థితిలో పడివున్న కాలంలోనే ఈ అసహ్యకరమైన, దరిద్రమైన, బానిస భావంతోకూడిన "అంటరానితనం" మనలో ప్రవేశించివుంటుందని నేననుకుంటాను. ఈ కాలుష్యం మనకు అంటుకుపోయి, ఇంకా వదలడంలేదు. నాకిది మనలను ఆవేశించిన ఒక పిశాచమని తోస్తుంది. ఈ పిశాచం మనలను అంటిపెట్టుకొని వున్నంతవరకు మన పవిత్రభూమికి కలిగే ఈతిబాధలన్ని

మనం ఆచరిస్తూవున్న ఈ తీరని నేరానికి తగిన శిక్షగావచ్చి పడుతున్నాయని భావించకతప్పదు.

గాంధీ మహాత్ముని ప్రసంగాలు, రచనలు. పే. 287.

ఈనాడు హిందూమతంలో ఆచరణలో వున్నరీతి అస్పృశ్యత నా అభిప్రాయంలో దేవునియెడల, మానవుని యెడల కూడా పాపకార్య మనిపించుకుంటుంది. అందువల్ల అది విషప్రాయంగా హిందూమతముయొక్క ఆయుష్పట్లను దొల్చివేస్తున్నది. మొత్తంమీద తీసుకుంటే హిందూశాస్త్ర ములలో ఎక్కడా ఇది నిర్దేశింపబడి వుండలేదని నా అభిప్రాయము. ఆరోగ్యకరమైన ఒక అస్పృశ్యతను శాస్త్రములు పేర్కొంటాయి; అది అన్నిమతములలోను సమానంగా ఉన్నదే. అది ఆరోగ్యవిషయికము, పారిశుధ్యం విషయికము అయిన సూత్రం. అది ఎల్లకాలం వుండవలసినదే. కాని నేడు మనం భారతదేశంలో పాటిస్తూవున్న అస్పృశ్యత అసహ్యకరమైన విధానం. అది ఒక్కొక్క రాష్ట్రంలో — ఒక్కొక్క జిల్లాలోనైతం-ఒక్కొక్క రూపం దాల్చివుంటుంది. అది అస్పృశ్యులను, స్పృశ్యులనుకూడా పతనస్థితికి తెచ్చింది. అది సుమారు 40 మిలియన్ల మానవసమూహంయొక్క బ్రతుకులను గిడసబారిపోయేటట్లు చేసింది. వారికి సామాన్య జీవిత సౌకర్యాలైనా లేకుండా చేసింది. కావున హిందూమతానికీ, భారతదేశానికీ, లోకంలోని ప్రజాసామాన్య మందరికీ కూడా అది ఎంతత్వరగా అంతమొందితే అంత మంచిది.

హరిజన్, 11-1-33.

భారతీయ ప్రజలలో అయిదవవంతు జనులను మనం శాశ్వత బానిసత్వంలో అణగద్రొక్కి, బుద్ధిపూర్వకంగా వారికి జాతీయ సంస్కృతియొక్క ఫలాలను అందుబాట్లో లేకుండా చేయగోరినచో, స్వరాజ్యమనేమాట ఉత్తబూటక మనిపించుకుంటుంది. ఈ ఉత్కృష్టమైన పారిశుద్ధ్యోద్యమములో దేవుని సహాయం అపేక్షిస్తున్నాము; కాని ఈశ్వర సృష్టిలోకల్లా అర్హాతము లైనవారికి మానవత్వహక్కులను నిరాకరిస్తున్నాము. ఒకవంక మనమే అమానుషంగా వరిస్తూ మరొకవంక దైవసింహాసనముతోన ఇతరుల అమానుషత్వం నుంచి మనయొక్క ముక్తిని కోరజాలము.

యంగిండియా, 25-5-21.

అస్పృశ్యత అనేది చిరకాలానుగతమైన ఆచారమనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. కాని అది దురాచారమైనప్పుడు పురాతనత్వం దానికొక సమర్థనకాజాలదు. అస్పృశ్యులనబడేవారు ఆర్యులసంఘంనుంచి బహిష్కృతులైనవారని అనుకుంటే, అది ఆ సంఘంయొక్క లోపాన్ని మాత్రమే తెల్పుతుంది. ఆర్యులు తమ పురోగమనంయొక్క ఏదో ఒక పరిస్థితిలో ఏదో ఒక వర్గంవారిని శిక్షించే నిమిత్తం బహిష్కృతులుగా పరిగణిస్తే, అందుకని ఆ వర్గంవారి తరతరాల సంతానమందరిపైనా, వారి పూర్వీకులు శిక్ష ననుభవించిన హేతువుతో సంబంధంలేకుండా, ఆ శిక్ష ఎందుకు వర్తించవలెనో అర్థంకాదు. అస్పృశ్యులలోకూడా అస్పృశ్యులు వున్నారను విషయాన్నిబట్టి ఆ చెడుగును పరిమితమొనర్చడం

అసాధ్యమనిన్నీ, దాని నిర్జీవస్పర్శ సర్వవ్యాప్తమైనదనిన్నీ మాత్రమే తెల్పుతుంది. అస్పృశ్యులలోకూడా అస్పృశ్యులున్నారనే విషయం నాగరక హిందూసంఘం ఈ పిశాచం నుంచి బహుసత్వరంగా విముక్తి పొందవలసిన అవసరాన్ని బలపరుస్తుంది. అస్పృశ్యులు జంతువధచేయడంవల్ల వారివృత్తి రక్తమాంసాస్తికలకు సంబంధించినది కావడంవల్ల, వారు మలమూత్రవాహకవృత్తి చేయడంవల్ల అట్టిస్థితిలో వున్నారనేకనక అంటే, ప్రతినర్సు, ప్రతిడాక్టరుకూడా అస్పృశ్యులుగాభావింపబడవలసివుంటుంది. అట్లే క్రైస్తవులును, ముసల్మానులును, ఆహారానికో లేక బలి ఒసగుటకో జంతువధ గావించే పైతరగతి హిందువులు అంతాకూడా అస్పృశ్యులు కావలసుంటుంది. జంతువుల వధ్యశాలలు, కల్లుదుకాణాలు, వ్యభిచారగృహాలు దూరంగా వుండవలసినరీతినే అస్పృశ్యులుకూడా దూరంగా వుంచబడాలనే వాదన కేవల వైరుధ్యభావాన్ని మాత్రమే తెల్పుతుంది. వధ్యశాలలు, కల్లు దుకాణాలు దూరంగానే ఉన్నాయి, ఉండవలసిందేకూడా. కాని జంతువధ చేసేవారుగాని, కల్లంగడి యజమానులుగాని సంఘానికి దూరంగా వుంచబడడంలేదు.

యంగిండియా, 29-7-26.

ఒకవంక మనం ప్రలోభనహేతువులైన అంతశ్శత్రువులకు పాలై, మరొకవంక మిక్కిలి అస్పృశ్యములైన పాపభావాలనే పంకిలప్రవాహంలో మునిగి తేలుతూ, మన అజ్ఞానంవల్లను, మన అహంకారంవల్లను మనలో కొందరిని హీన

భావంతో చూచి, వారిని ముట్టుకుంటే మనం పంకిలమై పోతామనే అహంభావానికి వశమువకుందుముగాక. ఈశ్వర సింహాసన సమక్షాన మనం తిన్నదేమిటి? మనం ముట్టిన దేమిటి? అనేదానినిబట్టికాక, మనం ఎవరికి ఏ విధంగా సేవ చేశామనే దానినిబట్టే మన మంచిచెడ్డలు నిర్ణయమవుతాయి. మనం ఒక్క మనిషికైనాసరే సేవ ఒనర్చివున్నచో, అది ఈశ్వరదృష్టిలో ప్రీతికరమవుతుంది... పైకి కొన్ని ఆహారాలను విసర్జించినట్లు ప్రదర్శించి, దానిని మోసమునకు, కపట కార్యాలకు, అంతకంటె హీనమైన దుర్గుణములకు ఆచ్ఛాదనగా ఉపయోగించకుందుము గాక. పతితుడై అశుచిగా వున్న సోదరమానవునికి సేవ ఒనర్చుట మన అధ్యాత్మికోన్నతికి భంగకరముగ భావించకుందుము గాక.

యంగిండియా, 5-1-22.

పాకీపనివారు :

పాకీపని సంఘంలోని ఒక ప్రత్యేకవర్గంయొక్క పనిగా భావించడంలో ఏదో ఒక గొప్పలోపం ఉండితీరిందని నేను చాలాకాలంనుంచి అనుకుంటూవున్నాను. ఈ అత్యంతావసరమైన పారిశుధ్యకార్యానికి అత్యంతహీనమైన తాహతును మొట్టమొదట ఒసగిన మహానుభావు డెవరో చరిత్ర తెల్పదు. అత డెవరైనప్పటికీ, ఆతడు చేసినపని మనకు ఏ మాత్రం మంచిని చేకూర్చలేదు. మనమంతా పాకీపనివారమే అనే భావం చిన్నతనంనుంచీ మన మనస్సులపై అంకితంకావాలి.

ఈ భావాన్ని అవగాహన చేసికొనవలెనంటే భక్తిశ్రమగా పాకీపనిని స్వీకరించడమే సులభమార్గం. అట్లు జ్ఞానయుతంగా పాకీపని చేయుడంద్వారా మానవసమానత్వాన్ని మనం అర్థం చేసికొనగలుగుతాము.

యెరవ్డా మందిర్ నుంచి, అధ్యాయం 9.

ఆదిని అంటరానితనం అనేది ఒక పారిశుధ్యసూత్రముగామాత్రమే అమలయింది; అది భారతదేశానికి వెలుపలి ప్రపంచంలో అంతటను కూడా ఆచరణలోవున్నది. అదేమిటంటే, అశుచి అయిన ఒకవ్యక్తినిగాని, ఒక వస్తువునుగాని అంటరానిదిగా పరిగణించడం. అయితే అట్టి వ్యక్తియొక్క, లేక అట్టి వస్తువుయొక్క అశుచి తొలగిపోయినవెంటనే అతడుగాని, అదిగాని ఇక అస్పృశ్యంగా పరిగణింపబడదు. అందువల్ల పాకీపని చేయవలసివున్నవారు జీతమునకుచేసే పాకీపనివాడుగాని, ఉచితంగాచేసే తల్లిగాని తమ పనివలన కలిగిన అశుచిని ప్రక్షాళనచేసుకునేవరకు అశుచిగావున్నట్లే భావింపబడతారు. పాకీపనివానిని శాశ్వతంగా అస్పృశ్యునిగా భావించక సోదరునిగా చూచి, సంఘానికి అశౌచమైన ఆ సేవాకార్యమును నిర్వహించిన పిమ్మట ఆతడు తిరిగి శుద్ధమగుటకు అవకాశమొసగి, అవసరమైతే అందుకు మనంకూడా సహకరించినయెడల, ఆతడును ఆ సంఘంలో స్థానంపొందడానికి తక్కినవారందరితోటి సమానమైన యోగ్యతను కలిగినవాడౌతాడు.

హరిజన్, 11-2-33.

అధ్యాయం ౬౨

భారతదేశంలో మతసహనం.

హిందూమతం :

నేనెరిగిన మతములన్నిటిలోకి హిందూమతమే ఎక్కువ సహనభావంతో కూడినదిగా గోచరిస్తుంది. అది ఒక సిద్ధాంతానికి కట్టుబడకపోవడమే నాకు ఎక్కువ ఆకర్షణీయమైన సుగుణంగా తోస్తుంది. తద్వారా అది ఆ మతస్థుల ఆత్మాభివ్యక్తికి అధికమైన అవకాశం ఒసగుతుంది. అది అసహనంతో కూడినది కాకపోవడంవల్ల తదనుయాయులు ఇతర మతములన్నిటిని గౌరవభావంతో చూచుటకు వీలొసగడమే కాక, ఇతర మతములలోగల మంచిని ఉదారబుద్ధితో స్వీకరించి తమలో జీర్ణించుకొనుటకు కూడా వారికి అవకాశమిస్తుంది. అహింసా సిద్ధాంతం అన్ని మతములకు సామాన్యసూత్రమే అయినా, అది హిందూమతంలోనే అన్నింటికంటె ఎక్కువగా వ్యక్తమై, అనుసరింపబడింది. (ఈ సందర్భంలో నేను జైన, బౌద్ధమతములను హిందూమతమునకు వేరైనవిగా పరిగణించను.) హిందూమతం యావన్మానవ జీవిత సమైక్యతనే కాక, సర్వజీవకోటియొక్క సమైక్యతనుకూడా విశ్వసిస్తుంది. అందలి గోపూజావిధానం సర్వభూతసమానతా పరిణామానికి హిందూమతం ఒసగిన ఉత్కృష్ట సందేశమని నా అభిప్రాయం. సర్వజీవులయొక్కయు సమైక్యతాభావాన్ని తద్వారా సర్వజీవులయొక్కయు పవిత్రతాభావాన్ని అది

ఆచరణాత్మకంగా ప్రదర్శిస్తుంది. ఉత్కృష్టమైన పునర్జన్మ సిద్ధాంతం ఈ సర్వజీవైక్యతా విశ్వాసంనుంచియే ఉద్భవించింది. హిందూమతంయొక్క సత్యాన్వేషణాపరతయొక్క ఫలితములన్నిటిలోను ప్రముఖస్థానం వహించునది వర్ణాశ్రమ ధర్మసూత్రమని పేర్కొనవలసి వుంటుంది.

యంగిండియా, 20-10-27.

బౌద్ధమతం :

బౌద్ధమతము, లేక బుద్ధుని ధర్మబోధ, భారతదేశంలోనే పూర్ణంగా ఫలప్రదమైనదని నా నిశ్చితాభిప్రాయం. అందులో అసహజమేమీ లేదు. ఏమనగా, బుద్ధుడు హిందువులలోకల్లా ఉత్కృష్టమైన హిందువుడు. అతడు హిందూమతంలోని ఉత్తమాంశాలను తనలో పూర్తిగా జీర్ణించుకుని, పనికిరాని కలుపు మొక్కలతో కప్పబడిపోయిన వేదములలో గర్భితమైన కొన్ని ధర్మసూత్రాలకు తిరిగి ప్రాణప్రదానం చేసాడు... బుద్ధుడెన్నడుగాని హిందూమతాన్ని నిరాకరించి వుండలేదు; దాని పునాదులను మాత్రం విశాలం చేశాడు. అతడు దానికొక నూతనజీవమొసగి, నూతనమైన సమన్వయం చేకూర్చాడు.

యంగిండియా, 24-10-27.

ద్వేషప్రవృత్తి కలిగినవాడును, తన చేష్టలకు పశ్చాత్తాపం పొందవలసినవాడును, భూతలమందలి రాజులవలె ప్రలోభనములకు, లంచములకు లోనుకాగలవాడును, ఇష్టుల

యెడ పక్షపాత బుద్ధిగలవాడును అయిన దేవుడనబడే ఒక వ్యక్తివున్నాడనే అభిప్రాయాన్ని బుద్ధుడు నిరాకరించిన సంగతి నిస్సందేహమే దేవు డనబడే ఒక వ్యక్తి తన సృష్టి జాలానికి చెందిన జంతువులయొక్క ప్రాణరక్తాన్ని బలిగాగోరి, తద్వారా ప్రీతుడౌతాడనే విశ్వాసాన్ని సహించలేక, ఆతడు ప్రబలమైన ఆత్మావేశంతో దానిపై తిరుగుబాటు చేశాడు. స్వచ్ఛమైన దైవసింహాసనమును తాత్కాలికంగా అధిరోహించివున్న ఆ దురాక్రమణపరుని పారద్రోలి, ఆతడు ఆ సింహాసనమందు సత్యమైన దేవుని ప్రతిష్టించాడు. యావద్విశ్వమును పాలించే నిత్యము, నిర్వికారము అయిన నైతికశాసన మొకటున్నదని ఆతడు నిశ్చయించి, ఉద్ఘాటించి వున్నాడు. ఆ శాసనమే దేవుడని ఆతడు నిస్సంశయంగా ప్రకటించాడు.

యంగిండియా, 24-11-27.

క్రైస్తవమతం :

నేను ఏసుక్రీస్తు ఒక్కడే దైవసుతుడనే నమ్మకంతో ఏకీభవించలేను. కృష్ణుడు, రాముడు, మహమ్మదు, జోరోస్టరు ఎంత దివ్యాంశ సంభూతులో ఆతడును అంతే అని నమ్ముతాను. వేదములలోని, కొరానులోని ప్రతిమాటను నేనెట్లు దైవవాణిగా పరిగణించనో అట్లే బైబిలులోని ప్రతిమాటను నేను ఈశ్వరావేశ సంజనితమైనదిగా భావించను. ఈ గ్రంథములలో ఒక్కొకదానిలోని విషయమును మొత్తంగా తీసుకుంటే, అది దివ్యావేశపూరితమైనదిగానే నేను భావిస్తాను.

కాని వాటిలో చాలా భాగములను వేరువేరుగా పరికించి నప్పుడు వాటన్నిటిలోను దైవావేశం గోచరంకాదు. నేను మతగ్రంథములలో గీతకు, కొరానుకు ఎట్టి స్థానమిస్తానో బైబిలుకు కూడా అట్టి స్థానమే ఇస్తాను.

హరిజన్, 6-3-37

ప్రస్తుతకాలపు ఐరోపా ఖండము దైవభావానికి, క్రైస్తవమతానికి ప్రాతినిధ్యం వహించడానికి బదులు, సైతాను అంశకే ప్రాతినిధ్యం వహిస్తున్నదని నా దృఢమైన అభిప్రాయం. సైతాను దేవుని పేరు పెదిమలపై జపిస్తూ ప్రత్యక్షమైనప్పుడే, అతని అధికారం అత్యంత విజయవంతంగా సాగుతుందని చెప్పవచ్చును. ఐరోపాఖండంలో ఈనాడు క్రైస్తవం నామమాత్రమే. అక్కడ నిజంగా జరుగుతూవున్నది ధన దేవతారాధనమాత్రమే. "ఒంటె సూదిబెజ్జంలో దూరడం ఎంత అసాధ్యమో, ధనికుడైనవాడు దేవుని ప్రభుత్వంలో ప్రవేశం పొందడం అంత అసాధ్యం" అనే సద్వాక్యం ఏసుక్రీస్తు నోటనే వెలువడింది. అతనియొక్క అనుచరులుగా ఈనాడు చలామణి అవుతూవున్నవారు తమయొక్క నైతికౌన్నత్యానికి భౌతికసంపదనే కొలతబద్దగా భావిస్తున్నారు.

యంగిండియా, 8-9-20.

ఇస్లాంమతం :

నేను క్రైస్తవ, హైందవ, బౌద్ధమతాలనువలెనే ఇస్లాంను కూడా శాంతిసూత్రానుసారకమైన మతంగా భావిస్తాను. ఆయామతములు ఆ సూత్రము ననుసరించుటలో ఎక్కువ

తక్కువ లున్నమాట వాస్తవమే అయినా, శాంతిధర్మమే వాటన్నిటికీ పరమగమ్యం.

యంగిండియా, 20-1-27.

ఇస్లాంమతం భారతజాతీయ సంస్కృతి కొసగిన విశిష్టాంశములేవనగా – దేవుని ఏకత్వంలో అచంచల విశ్వాస మొకటి. ఆ మతస్థుల సంఘంలో మానవసౌభ్రాతృత్వ సూత్రాన్ని అమలుపరచడం రెండవది. నేను ఈ రెండు అంశములను విశిష్టసందేశములుగా పరిగణిస్తాను. ఎందుకంటే హిందూమతంలో భ్రాతృభావం ఎక్కువగా తాత్వికరూపం లోనే గోచరిస్తుంది. అట్లే తత్వదృష్ట్యా హిందూమతం దేవుని అద్వితీయునిగా భావించినప్పటికి, ఆచరణలోమాత్రం ఆ విషయంలో అది ఇస్లాంమతమంత నిర్కర్షగా వుండదన్న విషయం కాదనలేము

యంగిండియా, 21-3-29.

నా స్వప్నదర్శమైన భారతదేశం ఏదో ఒకే ఒక మతాన్ని-అంటే, పూర్తిగా హిందూమతాన్నో, పూర్తిగా క్రైస్తవమతాన్నో, పూర్తిగా ముస్లిం మతాన్నో - స్వీకరించవలెనని నే నాసించను. కాని ఆయామతములన్ని ఒకదాని పజ్జ ఒకటై, సంపూర్ణమైన సహనభావంతో వర్తిస్తూ వుండవలెనని మాత్రమే కోరుతాను.

యంగిండియా 22-12-27.

విగ్రహారాధన :

మనమంతా విగ్రహారాధకులమే. మన ఆధ్యాత్మిక పరిణతికి సహకరించుటకును, మన ఈశ్వరవిశ్వాసాన్ని బల

పరచుటకును గుళ్లో, చర్చిలో, మసీదులో, సైనగోగ్‌లో ఏదో ఒకటి అవసరమని మనమందరం భావిస్తాం. తమలో దైవభక్తిని రేకెత్తించడానికిగాను కొందరు ఒకరాతిబొమ్మనో లేక ఒక లోహవిగ్రహాన్నో అవసరమని తలిస్తే, మరికొందరు ఒక నివేదికయో, ఒక గ్రంథమో, లేక ఒక చిత్తరువో అవసరమని భావిస్తారు.

యంగిండియా. 28-8-24.

అవి ఆలయములైనాసరే, మసీదులైనాసరే, చర్చిలైనాసరే...దైవనివాసములుగా ఉద్దేశింపబడిన వీటిమధ్య నేను వ్యత్యాసాన్ని పాటించను. అవి మన విశ్వాసాన్నిబట్టి రూపొందుతాయి. చూపులకందని దానిని ఎటో ఒకట్లు అందుకొనుటకు మానవుడు అనుభవించే తహతహకు అవి ప్రతిబింబాలు.

హరిజన్. 18-3-33.

నేను సత్యమని భావించే అర్థంలో ఒకవంక నేను విగ్రహారాధకుణ్ణి, మరొకవంక విగ్రహ విధ్వంసకుణ్ణికూడా. విగ్రహారాధనకు మూలమైన భావాన్ని నేను విలువగా పాటిస్తాను. అది మానవజాతి అభ్యున్నతియొక్క పరిణామక్రమంలో మిక్కిలి ప్రధానమైన సాధనంగా ఉపకరిస్తుంది. మనదేశాన్ని పవిత్రమొనర్చె వేలసంఖ్యలోవున్న దేవాలయము లన్నిటిని రక్షించేనిమిత్తం నా ప్రాణమైనా సమర్పించగల శక్తిని నేనపేక్షిస్తాను...ఇక, తన ఆరాధనా విధానానికి భిన్నమైన ఇతర విధానములలోని మంచిని ఏ మాత్రమూ అంగీకరించని

మతోన్మాదరూపకమూ, సూక్ష్మతరమూ అయిన విగ్రహారాధనాభావమును విధ్వంసమొనర్చే అర్థంలో నేను విగ్రహవిధ్వంసకుణ్ణి. ఒక రాతిముక్కతోనో, ఒక బంగారు విగ్రహంతోనో తన ఆరాధ్యదైవాన్ని సరిపోల్చుకునే స్పష్టమూ, స్థూలమూ అయిన విగ్రహారాధనా విధానంకంటె పైనచెప్పిన మతోన్మాదరూపకమైన విగ్రహారాధనం ఎక్కువ సూక్ష్మతరమగుటచేతనే ఎక్కువ అపాయకరమైనదికూడా.

యంగిండియా, 28-8-24

మనం ఒక ఆలయానికిగాని, మసీదుకిగాని భక్తిగౌరవభావాలతో వెళ్లడంలోనే విగ్రహారాధనాభావం ఇమిడివుంది. కాని అందులో నాకేమీ హానికనిపించదు. నిజానికి మానవుని జ్ఞానం భౌతికమూ. పరిమితమూ అయినది కావడంవల్ల ఆతడింకేవిధంగాగాని వర్తించలేడు. చెట్లను పూజించినాకూడా నాకందులో స్వతఃసిద్ధమైన చెడుగుగాని, హానిగాని ఏమీ కనిపించదు సరిగదా, అందులో నాకు గొప్ప కారుణ్యమూ, కవితాత్మక సౌందర్యమూ గర్భితమైవున్నట్లు గోచరిస్తుంది సుందరరూప వైవిధ్యంతోకూడిన అనంతమైన ప్రకృతిదృశ్యాలద్వారా పరమేశ్వరుని మహిమను వేనోళ్ల చాటుతున్నట్లు తోచే వృక్షప్రపంచంపట్ల మనకు అనుభూతమయ్యే ఆదరగౌరవాలకు అది చిహ్నంగా వర్తిస్తుంది. ఆ వృక్షజాలంలేనిదే మన భూమిగోళం ఒక్క క్షణకాలమైనా ఈ జీవకోటిని పోషించలేదు. అందువల్ల వృక్షసంతతి అరు

ద్దైన దేశాలలోచేసే వృక్షారాధనలో మహత్తరమైన ఒక ఆధ్యాత్మికతత్వంకూడా ఇమిడివున్నట్లు భావించవచ్చును.

యంగిండియా, 26-9-29.

అధ్యాయం ౬౩

మతాంతరత్వ విధానం.

నా లోని హైందవప్రవృత్తినిబట్టి నేను మతములన్నీ కూడా, ఎక్కువ తక్కువగా, సత్యసంపన్నమైనవే అని తలుస్తాను. అన్నీ ఒక్క దేవునినుంచి పుట్టినవే అయినా, అసంపూర్ణమైన మానవసాధనం ద్వారా మనకు లభ్యమైనవగుట చేత, అవన్నీకూడా అసంపూర్ణమైనవే అవుతాయి. ప్రతి స్త్రీ, ప్రతిపురుషుడూ తన స్వీయవిశ్వాసంద్వారా పరిపూర్ణతను సాధించడమే నిజమైన "శుద్ధి" ఉద్యమం. అట్టి ప్రణాళికలో సచ్ఛీలం ఒక్కటే గీటురాయి అవుతుంది. ఒక అరలోనుంచి ఇంకొక అరలోనికి మారడంవల్ల, తద్వారా ఏదో ఒక నైతికోన్నతి కలిగితేతప్ప, ప్రయోజన మేమిటి? నా కూటంలో వున్నవారు ప్రతిరోజూ తమ చర్యలద్వారా దైవవిరోధ భావాన్ని ప్రకటిస్తూవుండగా, ఇతరులను నా దేవుని ఆరాధకులుగా మార్చడం ('శుద్ధి' అనే మాటకుగాని, 'తబ్లిక్' అనే మాటకుగాని ఇదే అంతరార్థమై వుండాలి) ఏ విధంగా అర్థయుక్తమౌతుంది? "వైద్యుడా, నీ ఆరోగ్యం ముందు బాగు చేసుకో" అనే నానుడి లౌకికమగు విషయములకంటె ఎక్కువ యదార్థంగా మత విషయాలకు వర్తిస్తుంది.

యంగిండియా, 29-5-24.

ఆధునిక మతాంతరత్వ విధానాన్ని నేను వ్యతిరేకిస్తాను. సంస్లతరబహిగా దక్షిణాఫ్రికాలోను, భారతదేశంలోనే నేను పొందివున్న అనుభవాన్నిబట్టి దీనివల్ల మతాంతరులైనవారికి నైతికోన్నతి చేకూరుటకు బదులు, యూరోపు నాగరికత యొక్క బాహ్యాడంబరములు మాత్రమే అలవడినవనీన్నీ, వారిలో ఏసుక్రీస్తుబోధ లేమిరా పాదుకొనలేదనీన్నీ నేను స్పష్టమైన అభిప్రాయానికి వచ్చాను. నేను చెప్తున్నది, ఏవో కొన్ని ప్రత్యేకమైన విశిష్టోదాహరణములకు కాక, సర్వసామాన్య పరిస్థితికి చెందినది మాత్రమే అని అర్థంచేసుకోవాలి. ఇది అటుండగా, క్రైస్తవ ప్రచారకుల కృషివల్ల పరోక్షంగా కలిగిన లాభం ఎక్కువ. అది హిందువులయొక్కయు ముస్లింలయొక్కయు మతవిషయికమైన పరిశోధనమును రేకెత్తించింది. అది మన గృహవాటికలను మనం చక్కదిద్దుకొనునట్లు చేసింది. క్రైస్తవ ప్రచారసంఘాలు స్థాపించిన విద్యాసంస్థలను, చికిత్సాలయాలను కూడా నేను పైన పేర్కొన్న పరోక్ష లాభాలలోనే జమకడతాను. ఆయా సంస్థలు కేవలం విద్యకోసమూ, చికిత్సకోసమూ కాక, మతాంతరతా విధానానికి సహాయకంగా స్థాపించబడి వుండడమే అందుకు కారణం.

యంగిండియా, 17-12-25.

లోకోద్ధరణ పేరిట ఇతర మతస్థులను తమ మతంలోకి కలుపుకునేపని మంచిపని కాదని నా అభిప్రాయం. అది తప్పకుండా ఈ దేశపు ప్రజలయొక్క ఆగ్రహాన్ని రేకెత్తించేపని.

మతమనేది కేవలం వ్యక్తిగతమైన విషయం; అది హృదయ సంబంధి. క్రైస్తవమతవిశ్వాసి అయిన ఒక డాక్టరు నా వ్యాధిని కుదిర్చాడు కదా అని, నేను నా మతాన్ని ఎందుకు మార్చుకోవాలి? నేను ఆ డాక్టరు చేతులలోవున్న సమయంలో ఆతడు నన్ను మతాంతరుణ్ణి కమ్మని ఎందుకు సూచించాలి?, అవుతానని ఎందుకు ఆసించాలి? వైద్య సహాయం అనేది దానికదే ప్రతిఫలంగాను. దానికదే సంతృప్తిగాను భావించబడవలసిన విషయంగదా? లేక నేను ఒక మిషనరీసంస్థలో వున్నప్పుడు, నాకు బలవంతంగా క్రైస్తవ ధర్మబోధ ఎందుకు చేయాలి! నా అభిప్రాయంలో అట్టి పనులు ఉన్నతిప్రదమైనవికావు సరికదా, అవి అనుమానాన్నీ రహస్యమైన శత్రుభావాన్నీ రేకెత్తించడానికి మాత్రమే తోడ్పడతాయి. మతాంతర్వ పద్ధతులు, "సీజరు భార్యవలె" అనుమానాతీతమైనవిగా వుండాలి. మతవిశ్వాసమనేది లౌకిక విషయాల మోస్తరుగా బోధించేదికాదు. దానిని హృదయ సంబంధమైన భాషలో అందజేయవలసినది. ఒక వ్యక్తిలో సజీవమైన విశ్వాసం పాదుకునివుంటే, అది గులాబీవలె తన సౌరభాన్ని చుట్టూ పరివ్యాప్తం చేస్తుంది. కంటికి కనుపించే రంగురంగుల గులాబీదళాలకంటె, కంటికి కనుపించనిదగుట చేతనే అది ఎక్కువ విస్తృతమైన ప్రభావాన్ని కలిగివుంటుంది.

నేను మతాంతరతకు కేవలం వ్యతిరేకిని కానుగాని, ఆధునికమైన మతాంతరత్వ పద్ధతులను మాత్రం నేను వ్యతి

చేకిస్తాను. ఇతర మతాలవారిని తమ మతంలోకి మార్చుకో వడమనేది, ఈ రోజులలో ఇతర వ్యాపారాలన్నిటివలె ఒక వ్యాపారమైపోయింది. నేను చదివిన ఒకానొక మిషనరీ నివే దికలో ఒక్కొక్క క్రొత్తమనిషిని మతంలోకి లాగినందుకు తల కెంత ఖర్చయినదీ, "వచ్చేపంట"కు (for the next harvest) ఎంత పెట్టుబడికావలసినదీ తమ అధికారులకు తెలుపుతూ వ్రాయబడివున్నట్లుగా నాకు జ్ఞాపకం.

నిజమే, మన దేశానికి ఇక్కడి పాతుకొనివున్న ఉత్కృష్ట మతాలు అన్నివిధాలా చాలుననే నేను వాదిస్తాను. క్రైస్త వాన్నీ, యూదుమతాన్ని అటుంచగా, హిందూమతమును దానిలోనుంచి పుట్టిన శాఖలనూ ఇస్లాం, జోరాస్ట్రియను మతములనూ సజీవమైన మతాలుగా లెక్కవేయవచ్చును. ఏ ఒక్కమతంగాని సంపూర్ణమైనది కాదు. ఆయా మతస్థులకు ఆయామతములన్నీ సమానాదరపాత్రములే అందువల్ల కావ లసినది ప్రపంచంలోని ప్రధానమతాలకు చెందివారందరి మధ్య సజీవమైన స్నేహసంబంధమేగాని, ఆయాసంఘస్థులు తమ మతమే ఇతర మన్నిటికంటె గొప్పదని నిరూపించడానికి వృథా ప్రయత్నాలు చేయడంగాని, తద్వారా ఘర్షణలపాలు కావడంగాని కాదు. అట్టి స్నేహపూర్వకమైన పరస్పర సం పర్కంవల్ల మనం మన మన మతాలలోని లోపాలను; దురా చారాలను తొలగించుకొనగలుగుతాం.

దీనినిబట్టి నేను పేర్కొనివున్నరీతి మతంమార్పు పద్ధ తులు భారత దేశానికి అనవసరమని స్పష్టపడుతుంది. అంతరంగ

పారిశుద్ధ్యం. ఆత్మజ్ఞానసాధన అనే అర్థంలో మతవిషయిక మైన పరివర్తనమాత్రం ఈ రోజులలో చాలా అవసరమే. అయితే మతాంతరత అనేదాన్ని ఈ విధమైన అర్థంలో ఎవరూ తీసుకోరు. భారతదేశాన్ని మతాంతరం చేయదల చినవారికి, "వైద్యుడా, ముందు నీ ఆరోగ్యం బాగుచేసుకో" అనే మాటయే సరియైన జవాబు అవుతుందనుకుంటాను.

యంగిండియా, 23-4-31.

ఒక క్రైస్తవుడు ఒకహిందువుని మతాంతర మొనర్చ వలెననిగాని, అట్లే ఒక హిందువుడు ఒక క్రైస్తవునిగాని ఎందుకు కోరాలి? ఆ హిందువుడు మంచివాడు, భక్తిపరుడూ అయితే ఆ క్రైస్తవుడు ఎందుకు సంతోషించి వూరుకో కూడదు. మనిషియొక్క నైతికప్రవర్తనతోనే కనక పనిలే దనుకున్నాడు, చర్చిలలోగాని, మసీదులలోగాని, గుడు లలోగాని ఒకానొక పద్ధతిప్రకారం జరుపబడే ఆరాధనా విధానమంతా వట్టిబూటక మనిపించుకుంటుంది. అది వ్యక్తి యొక్కయు, సంఘంయొక్కయు పురోభివృద్ధికే ఆటంకంగా పరిణమించవచ్చును. ఆరాధన ఈ విధంగానే జరగాలనీ, మంత్రం ఈ రీతిగానే ఉచ్చరించాలనీ పట్టుదల లేర్పడి, కొట్లాటలకు దారితీసి, అసలు మతవిశ్వాసాన్నే, అనగా దేవునిలో విశ్వాసాన్నే, రూపుమాపివేయవచ్చును.

హరిజన్, 30-1-37.

అధ్యాయం ౬౪

పరిపాలనా సమస్యలు.

చాలాకాలంవరకు భారతదేశంలో పెట్టుబడిదార్లవల్ల, భూస్వాములవల్ల, ఉన్నతవర్గాలనబడే వాటికి చెందినవారివల్ల, తదుపరి శాస్త్రపద్ధతిని బ్రిటీషు పరిపాలకులవల్ల, దళితులు, పతితులు అయిపోయినవారిని వారు పడివున్న అధఃపాతాళపంకంనుంచి పైకిలేవదీయడానికి అవసరమైన శాసననిర్మాణం చేయుడంలోనే గడవవలసివుంటుందని నాభయం. వీరందరినీ పతనస్థితినుంచి ఉద్ధరించి భారత జాతీయప్రభుత్వం తన ఇల్లు చక్కబెట్టుకొనవలెనంటే, వారిని అణచివేస్తూవున్న బరువులనుంచి విముక్తమొనర్చి, చాలాకాలంవరకు వారికి ఇతరులకంటె ప్రాధాన్యతనొసగి ఆదరించడం దానికి ముఖ్యవిధి అవుతుంది. భూస్వాములు, జమీందార్లు, ధనవంతులు అయిన వారెవరుగాని - వారు ఐరోపీయులైనాసరే, భారతీయులైనాసరే - అందుమూలమున తమ హక్కులకు భంగం కలుగుతున్నదనేకనక అనుకుంటే, నేను వారియెడల సానుభూతి వహిస్తానేగాని, వారికి సహాయం చేయగలిగి వున్నప్పటికి ఆ విషయంలో సహకరించను. ఎందువల్లనంటే, ఆపతితజనుల ఉద్ధరణ కార్యంలో నేను వారి సహాయాన్నికూడా అపేక్షిస్తాను. వారి సహాయంకూడా వుంటేతప్ప ఆ పని సాధ్యంకాదు.

అందువల్ల అది కలవారికీ, లేనివారికీ మధ్య యుద్ధరంగంగా పరిణమించవచ్చును. అదే జరుగుతుందని తలిస్తే,

అనగా, ఉన్నతవర్గాల వారంతా నోరులేని ప్రజాకోటితలకు పిస్తోలు గురిపెట్టి, "మా ఆస్తిపాస్తులకు, హక్కులకు రక్షణలు వుంటేతప్ప మీ ప్రజాపాలనము వీలుకాద"ని అడ్డగిస్తే మన జాతీయప్రభుత్వం రూపొందనేజాలదని నా భయం.

ది నేషన్సు వాయిస్, పే. 71.

గవర్నర్లు:

నేను ప్రభుత్వ బొక్కసంనుంచి ఒక్కపైసైనా దుబారా కాకూడదని కోరేవాణ్ణయినాగాని, గవర్నర్లను తొలగించడం అనేది మంచి ఆర్థిక సూత్రము కాదని తలుస్తాను. ఏమంటే, గవర్నర్లతో సరిసమానమైనరీతిని ముఖ్యమంత్రులు ఆ బాధ్యతను నిర్వర్తించగలరని నాకు తోచదు. గవర్నర్లు ప్రభుత్వ నిర్వహణలో అతిగా కలగజేసుకోడం నేనిచ్ఛగించనుగాని, వారు ఉత్త విగ్రహప్రాయంగా వుండడంకూడా మంచిది కాదనుకుంటాను. వారు మంత్రుల విధానాలను చక్కని మార్గాలలోకి మళ్లించడానికి ఉపకరించేపాటి అధికారం కలిగివుండాలి. వారి పదవి నిష్పాక్షికమైనది కావడంబట్టి విషయాలను వారు సమదృష్టినుంచి చూచి, తమ మంత్రివర్గాలు పొరపాట్లలో పడకుండా కాపాడగల్గుతారు. ఆయా రాష్ట్రాలలో గవర్నర్ల ప్రభావం సర్వతోముఖమైనదిగాను, నైతికమైనదిగాను వుండాలి.

హరిజన్, 21-12-47.

మంత్రులు :

కాంగ్రెసుసంస్థ ప్రజాసంఘటనగా నడవదలిస్తే మన మంత్రులు తెల్లదొరల పద్ధతిని జీవించడానికి వీలులేదు ; ఉద్యోగవిధుల నిర్వహణకోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన సౌకర్యాలను స్వంతపనులకు వినియోగించడంకూడా తగదు.

హరిజన్, 29-9-46.

బంధు పక్షపాతం :

ఈ పదవీస్వీకారమనేది మన గౌరవాన్ని ఇనుమడింప జేయడానికైనా దారితీయగలదు, లేదా పూర్తిగా చెరచడానికైనా దారితీయగలదు. అది గౌరవనష్టానికి దారితీయకుండా వుండవలెనంటే, మన మంత్రులును, శాసనసభ్యులును తమ వ్యక్తిగత ప్రవర్తనలోను బహిరంగ ప్రవర్తనలోను కూడా మిక్కిలి జాగరూకతను ప్రదర్శించవలసి వుంటుంది. వారు, సీజరు భార్యవలె, ప్రతివిషయమందును, అనుమానాతీతులుగా వుండాలి. తమస్వంతానికిగాని, తమబంధుమిత్రులకుగాని వ్యక్తిగతలాభాలు చేకూర్చడానికి ప్రాకులాడకూడదు. వారి బంధువులుగాని, మిత్రులుగాని ఏవైనా ఉద్యోగపదవులలో నియమితులైతే,దరఖాస్తుదార్లలోకల్లా వారేఎక్కువఅర్హులైనప్పుడు మాత్రమే అది జరగాలి; అంతేకాక ఇతరఉద్యోగం ఏదైనా స్వీకరిస్తే వారికి ప్రభుత్వోద్యోగంలోకంటె హెచ్చుజీతం రాగల విలువకూడా వారికున్నట్లు రుజువుంటేనే వారికి ఆప్రభుత్వోద్యోగాలలో తావొసగాలి. కాంగ్రెసు ముద్రపై ఎన్ని

కైన మంత్రులును, శాసనసభ్యులును తమ విధి నిర్వహణలో నిర్భయంగా వర్తించాలి. ఎప్పుడుగాని తమ పదవులను శాసన సభ్యత్వాలను వదలుకొనుటకు సంసిద్ధులై వుండాలి. కాంగ్రెసు గౌరవాన్ని, అధికారాన్ని పెంచడానికి సాధనములుగా తప్ప మంత్రిత్వాలకుగాని, శాసనసభలలో సభ్యత్వాలకు గాని ఇతరమైన విలువేమీలేదు. ఆ రెండు పదవులను వ్యక్తి జీవితంలోను, బహిరంగ జీవితంలోను నీతికలిగి వుండడం మీదనే పూర్ణంగా ఆధారపడేటటువంటివి కావడంచేత ఏ మాత్రం నైతికపతనం ఏర్పడినాగాని, అది కాంగ్రెసు సంస్థకు పెద్దదెబ్బగా పరిణమిస్తుంది.

హరిజన్. 23-4-38.

పన్నులు :

ప్రజాస్వామికమైన ఏ మంత్రివర్గంగాని శాసనసభకు బాధ్యమై వుంటుందికనక, దాని అనుమతిలేనిదే ఏ పనిచేయడానికీ వీలులేదు. ప్రజాస్వామికమైన శాసనసభలలో సభ్యులెవరుగాని తమర్ని ఎన్నుకున్న ఓటర్లకు బాధ్యులైవుంటారు. అందువల్ల ప్రజలందరకు ప్రతినిధి అయిన వోటరు తనవల్ల ఏర్పడిన ప్రభుత్వాన్ని విమర్శచేసేముందు బాగా ఆలోచించి మరీచెయ్యాలి. అంతేకాక ప్రజలయొక్క ఒక దురలవాటుని కూడా మనసులో వుంచుకోవాలి. వారికి అసలు పన్నులంటేనే యిష్టముండదు. మంచి ప్రభుత్వం నడుస్తున్నప్పుడు పన్నులు చెల్లించేవారికి వాటి విలువ పూర్తిగా తిరిగి ముడు

స్తుంది. ఉదాహరణకి నగరాలలోని నీటిపన్నును పేర్కొన వచ్చును. ఆ పన్నులు విలువమేరకు దానిని చెల్లించే ప్రత్యేకవ్యక్తిగాని తనకుతాను నీటిసరఫరా చేసుకోడం సాధ్యంకాదు. అది నిజమైనా, ఆ పన్ను ప్రజాభీష్టానుసారం అమలైనదైనా. అటువంటి పన్నులను చెల్లించడంకూడా ప్రజాసామాన్యం ఇష్టపడరు. నేను పైన ఉదహరించిన పన్ను విషయంలో అంత సులభంగా ఇతర పన్నులవలన కలిగే లాభాలవిషయంలో ప్రత్యక్షమైన రుజువుచూపడం కష్టం. సంఘం ఎక్కువ విస్తృతంగానూ, శాఖోపశాఖలుగానూ పెరిగి, దానితోపాటు ప్రజాహితరంగం కూడా విస్తరించి నప్పుడు, పన్నుచెల్లించే ప్రతివ్యక్తికిని, తాను చెల్లించే ఒకానొక పన్నువల్ల ఎట్టి ప్రతిఫలం ముట్టుతున్నదీ ప్రత్యేకించి బోధపరచడం కష్టం. అన్నిపన్నులును మొత్తంమీద సంఘ హితానికే వినియుక్తం కావలెననే విషయంమాత్రం స్పష్టం. అట్లు జరుగనియెడల ప్రజాభీష్టబలంతో పన్నులు అమలైన వని చెప్పేవాదం నిలవదు.

హరిజన్, 8-9-46.

నేరములు, వాని శిక్షావిధానం:

అహింసాత్మకమైన స్వతంత్ర భారతంలో నేరములు వుంటాయిగాని, నేరస్థులు వుండరు. వారు శిక్షింపబడరు. నేరములు చేయడమనేది కూడా ఇతర వ్యాధులన్నిటివలెనే ఒక వ్యాధి. అది అప్పుడు అమలులోవున్న సంఘ జీవనవిధా

నముయొక్క ఫలితం. అందువల్ల అన్ని నేరాలూ, హత్యా నేరంతో సహా, ఒక వ్యాధిగా భావింపబడి చికిత్స చేయబడ తాయి. ఆ రీతిగా నడిచే భారతదేశం ఏనాటికైనా రూపం లోకి వస్తుందా లేదా అనేది వేరే ప్రశ్న.

హరిజన్. 5-5-46.

స్వతంత్ర భారతంలో మన చెరసాలలు ఎట్టివిగా వుం డాలి? దోషులందరూ రోగులుగా పరిగణింపబడాలి. చెర సాలలు ఈ విధమైన రోగులను చేర్చుకుని చికిత్సనొసగి, రోగ నివారణ చేకూర్చే వైద్యశాలలుగా నడవాలి. ఎవరుగాని వినోదంకోసం నేరం చేయరు. అది మనస్సుయొక్క రోగ గ్రస్తతను సూచిస్తుంది. ఏ వ్యాధికిగాని మూలకారణాలను పరిశీలించి, వాటిని తొలగించాలి. చెరసాలలు వైద్యశాల లుగా మారినప్పుడు వాటికోసం బ్రహ్మాండమైన భవనాలు అవసరంలేదు. అట్టి వ్యయాన్ని ఏ దేశంగాని భరించలేదు. భారతదేశంవంటి పేదదేశం అసలే భరించలేదు. కాని చెర సాల ఉద్యోగులు వైద్యశాలలలోని వైద్యులవంటి, నర్సుల వంటి మనోవైఖరిని అలవరచుకోవాలి. నేరస్థులు ఉద్యోగు లను తమ మిత్రులుగా భావించగలగాలి. వారక్కడ నేరస్థు లను ఏ విధంగాగాని వేధించడానికికాక, వారి మానసికారో గ్యమును బాగుపరచుటకే ఉన్నట్లు కనుపించాలి. అట్టిమార్పు తీసుకురావడానికి మన ప్రజాస్వామిక ప్రభుత్వాలు అవసర మైన ఉత్తరువులను జారీచేయవలసి వుంటుంది. కాని ఈలోగా చెరసాలలలో పనిచేసే ఉద్యోగులు తమ పాలనవిధానాన్ని

ఎక్కువ దయాపూర్వకమైనదిగా చేయడానికి ఎంతైనా అవకాశముంది. చెరసాలలో ప్రవేశితుడైన నేరస్థుని విధి ఏమిటి? వారు ఆదర్శప్రాయమైన ఖైదీలుగా ప్రవర్తించాలి. వారు చెరసాల నిబంధనలను ఏ మాత్రం వ్యతిరేకించకూడదు. తమకు వప్పగించబడిన ఏ పనులనుగాని హృదయపూర్వకంగా నెరవేర్చాలి. ఉదాహరణకి, ఖైదీల భోజనం వారే తయారుచేసుకుంటారు గదా. వారు అందుకు కావలసిన బియ్యాన్ని, పప్పును, ఇతర దినుసులను శుభ్రంచేసి, అందులో రాళ్లు, మన్ను, పురుగులు ఏవీ లేకుండా చూడాలి. ఖైదీలకు చెప్పుకోవలసిన కష్టాలేమివున్నా వాటిని సమగ్రంగా అధికారులకు నివేదించాలి. ఖైదీలుగావున్న గడువులో తమ చిన్నసంఘంలో అలవరచుకునే ప్రవర్తనయొక్క ప్రతిఫలంగా వారు చెరసాలలో ప్రవేశించి నప్పటికంటె ఎక్కువ మంచి మనుష్యులుగా బయటికి వెళ్లగలగాలి.

ఢిల్లీ డైరీ పే. 113-14.

వయోజనుల వోటుహక్కు :

వయోజనుల వోటుహక్కు అమలైతీరాలని నేను కంకణం కట్టుకున్నాను... వయోజనులందరికి వోటింగు హక్కు వుండవలెననడానికి చాలా కారణాలున్నాయి. అందులో నాకు ప్రధానంగా కనిపించే కారణం ఏమిటంటే, దానివల్ల నేను ముస్లిం సంఘీయులయొక్కయు, అస్పృశ్యులని పిలువబడేవారియొక్క, క్రైస్తవసంఘీయులయొక్క, కార్మికులయొక్క

అన్ని ఇతర వర్గాలవారియొక్క సహేతుకమైన ఆశయాలను సంతృప్తిపరచ గలుగుతాను. శీలసంపదగల వ్యక్తికి ధనమూ, అక్షరజ్ఞానమూ లేని హేతువునగాని, నిజాయితీతో చెమటోడ్చి రాత్రింబగళ్లు కాయకష్టమొనర్చే వ్యక్తికి పేదవాడనే కారణంవల్లగాని వోటుహక్కు వుండకూడదంటే నేనది ఏ మాత్రమూ సహించలేను.

యంగిండియా, 8-10-31.

మరణపు సుంకాలు :

ప్రపంచంలోని అన్ని దేశాలలోకంటె ఎక్కువగా ఈ దేశంలో, ప్రత్యేకవ్యక్తుల హక్కు-భుక్తాలలో అపరిమితమైన సంపద వుండడమనేది, ప్రజానీకంయెడల జరిగే ఒక నేరంగా పరిగణించబడవలసి వుంటుంది. కాబట్టి ఒక నిర్దిష్టమైన పరిమితికి మించిన సంపత్తిపై ఎంత ఎక్కువ పన్ను వేసినా అది సమంజసమే అవుతుంది. ఇంగ్లాండు దేశంలో ఒక నిర్ణీత పరిమితికి మించిన ఆర్జనలపై ఇప్పటికే 70 శాతంవరకు పన్ను విధించివున్నట్లు తెలుస్తుంది. భారతదేశంలో అంతకంటె ఎక్కువశాతం పన్ను వేసినా సహేతుకమే అవుతుంది. మరణ సుంకాలు కూడా ఎందుకు విధించకూడదు? కోటీశ్వరుల తాలూకు యుక్తవయస్కులైన పుత్రులు, తమకు సంక్రమించే సంపత్తిమూలంగా, తమ శక్తులు నిర్వీర్యమైపోవడంద్వారా ఒక విధంగా నష్టపోతున్నారు. అందువల్ల దేశం రెండు విధాల నష్టపోతుంది. ఒకవంక ఆ ఆస్తి నిజానికి దేశమంతటికి

చెందవలసి నటువంటిది. ఇంకొకవంక ఆ సంపత్తియొక్క బరువు క్రింద నలిగి ఆ వారసులలో అంతర్గతమైన శక్తిసామర్థ్యాలు పూర్ణవికాసం పొందకుండా వృధాకావడంవల్ల కూడా దేశానికి నష్టం వాటిల్లుతున్నది.

హరిజన్, 31-7-37.

శాసనములద్వారా సంస్కరణ :

ఏదో ఒక చెడుగును అరికట్టే ఉద్దేశంతో ఒక శాసన నిర్మాణం జరగడంతో ఇక ఆ చెడుగు, ఇతర ప్రయత్నమేమీ అవసరం లేకుండానే, అంతటితో అంతరిస్తుందని ప్రజలు అనుకునేలా కనిపిస్తారు. దానికిమించిన ఆత్మవంచన మరొకటేదీ వుండదు. శాసననిర్మాణమనేది అల్పసంఖ్యాకులైన అజ్ఞానులను, దుష్టులను అరికట్టడానికి మాత్రమే ఉద్దేశింపబడినటువంటిది; వారి విషయంలోనే అది విజయవంతముగా పనిచేయగలుగుతుంది. కాని బుద్ధికుశలత, సుసంఘటనా శక్తిగల ప్రజాభిప్రాయంగాని, మతంపేరిట ఆవేశపూరితమైన ఒక అధికసంఖ్యాక సంఘంగాని వ్యతిరేకించినప్పుడు ఏ శాసనంగాని విజయవంతంగా అమలు కాజాలదు.

యంగిండియా, 30-6-27.

బలాత్కారంగాని, అసత్యంగాని లవలేశమైనా లేకుండా చూడడమనేది అన్నిటికంటె ప్రధానమైన అంశం. చెప్పదగిన ఏ సంస్కరణగాని ఇంతవరకు బలాత్కారవిధానం వల్ల విజయవంతం అయివుండ లేదని నా వినయపూర్వకమైన

విజ్ఞప్తి. బలాత్కారంవల్ల విజయం కలిగినట్లు పైకి కనిపించ వచ్చునేగాని, దానికి ప్రతిఫలంగా అసలు చెడుగుకంటె ఉప ద్రవకరమైన ఇతర చెడుగులు ఉత్పన్నం కావడం జరుగు తుంది.

యంగిండియా, 8-12-27.

పంచాయితీతోకూడిన కోర్టు విచారణలు :

పంచాయితీతోకూడిన కోర్టు విచారణలు, ఏ దేశంలో చూచినా, తరుచు న్యాయవిరుద్ధమైన ఫలితాలను ఒసంగ డమే కనిపిస్తుంది. ఈలోపం వున్నప్పటికి ప్రజలలో స్వతంత్ర భావం పెంపొందడమనే అధికతరలాభాన్ని ఆసించి, అన్ని దేశాలలోను ప్రజలు దానికి సంతోషంగా బద్ధులౌతున్నారు. పైగా తమతో సమాన తాహతుగల వారివల్ల తీర్పుపొందు తున్నామనే ఒకవిధమైన సంతృప్తివల్లకూడా వారు ఈ పద్ధ తిని అంగీకరిస్తున్నారు.

యంగిండియా 12-8-26.

జడ్జీల తీర్పులకంటె పంచాయతీల తీర్పులు లాభకర మనే అభిప్రాయం నాకు విశ్వసనీయంగా తోచదు... ఆంగ్లే యుల పద్ధతులన్నీ మనం బానిసలవలె అనుకరించకూడదు. సంపూర్ణమైన నిష్పాక్షికబుద్ధి, శాంతమనస్కత, సాక్ష్యం లోని మంచిచెడ్డలను తేల్చగల సామర్థ్యము, మానవస్వభావ పరిజ్ఞానము అవసరమైన విషయాలలో సుశిక్షితులైన జడ్జీలు చేయవలసినపని యదాలాభంగా సమకూర్చబడిన సామాన్య

వ్యక్తులకు వప్పగించడం మంచిది కాదు. అట్టడుగునుంచికూడా ప్రలోభనముల పాలుగానటువంటి, పక్షపాతబుద్ధి లేనటువంటి సమర్థమైనటువంటి న్యాయాధికారశాఖను నిర్మించడమే మనం ఆదర్శంగా పెట్టుకోవాలి.

యంగిండియా, 27-8-31.

న్యాయస్థానాలు :

లాయర్లయొక్క, లా కోర్టులయొక్క వ్యామోహానికి మనం వశులం కాకుండావుంటే, మన దురావేశాలను రేకెత్తించి కోర్టుల కెక్కించే "టవుట్లు"నే వాళ్లు లేకుండాపోతే, మనం ఇప్పటికంటె ఎంతో సుఖతరమైన జీవితాలను గడపగలిగేవాళ్లం. తరచు కోర్టుల చుట్టూతిరిగేవారిని - వారిలో మంచివారిని-అడిగి చూడండి. అక్కడి వాతావరణం ఎంత కంపుగా వుంటుందో వారే చెప్తారు. అక్కడ ఇరుపక్షాల తరఫునాకూడా దొంగసాక్షుల ముఠాలు డబ్బుకో స్నేహానికో తమ మనస్సాక్షులను అమ్ముకోడానికి తయారుగా వుంటారు.

యంగిండియా, 6-10-26.

న్యాయవాదవృత్తిని నీవు ఆధ్యాత్మిక మొనర్చగోరిన యెడల, ప్రస్తుతంలోవలె దానిని కేవలం ధనార్జనకు సాధనంగా భావించడంమాని, దేశసేవకు సాధనంగా వినియోగించవలసి వుంటుందని జ్ఞప్తి వుంచుకొనడం మొదట చేయవలసిన పని. నిస్వార్థమైన జీవితాలుగడిపి. తాము పేదరికం అనుభవించవలసి వచ్చినప్పటికి లెక్కచేయక తమయొక్క

న్యాయశాస్త్ర కౌశలాన్ని కేవలం దేశసేవకై వినియోగించిన గొప్ప న్యాయవాదుల ఉదాహరణలు అన్ని దేశాలలోను గోచరిస్తాయి ... రస్కిన్ కృతమైన "అన్టు దిస్ లాస్టు" అనే గ్రంథంలో ఈ సుభాషితాన్ని మీరు అనుసరించవచ్చును. "ఒక వడ్రంగిపనివాడు తాను చేసినపనికి పదిహేను పిల్లింగులు మాత్రమే పొందుతుండగా, ఒక లాయరు తనపనికి పదిహేను పౌన్లు ఎందుకు తీసుకోవాలి?" అని ఆయన ప్రశ్నిస్తాడు. లాయర్లు తీసుకునే ఫీజులు సర్వత్రా అతిగానే వుంటాయి. ఇంగ్లాండులోను, దక్షిణాఫ్రికాలోను సుమారుగా ప్రతిచోటను కూడా లాయర్లు తమ వృత్తివిషయికంగా తెలిసియో, తెలియకనో తమ క్లయింట్ల నిమిత్తం అసృతంలోకి దిగజారడం జరుగుతుందని నేను గమనించి వున్నాను. తన క్లయింటు దోషి అని తనకు తెలిసినాకూడా అతడిని సమర్థించడమే లాయరుయొక్క విధి అని ఒక సుప్రసిద్ధ న్యాయవాది వాదించడం నే నెరుగుదును. అయితే ఆయనమాట నే నంగీకరించను. లాయరుయొక్క విధి జడ్జీలముందర సత్యాన్ని వుంచడమూ, వారు సత్యమైన తీర్పుకు రావడానికి సహకరించడమూ మాత్రమేగాని, దోషులైనవారిని నిర్దోషులుగా రుజువుపరచడం కాదు.

యంగిండియా, 19-1-30.

సాంఘిక ప్రాతినిధ్యం:

స్వతంత్ర భారతం సాంఘిక ప్రాతినిధ్యపద్ధతిని అనుసరించడం తగదు. కాని స్వతంత్ర పరిపాలనా విధానం అల్ప

సంఖ్యాకులను బలాత్కరించుటపైన ఆధారపడకుండా వుండవలెనంటే, అన్ని సంఘాలవారికీ సంతృప్తి పరచవలసిన అవసర ముంటుంది.

యంగిండియా, 19-1-30.

సైనికశాఖా వ్యయం :

రెండుతరాలుగా మన రాజకీయవేత్తలు బ్రిటీషుపాలన క్రింద ఆయుధాల నిమిత్తం జరుగుతూవచ్చిన అధికవ్యయాన్ని ఖండిస్తూ ఉపన్యసించారు. కాని ఇప్పుడు రాజకీయ బానిసత్వంనుంచి స్వతంత్రులం కాగానే మన సైనికవ్యయం అధికతరంగా పెరిగింది. ఇంకా ఇంకా పెరిగే సూచనలే కనుపిస్తున్నాయి. దీనికి మనం గర్వపడుతున్నాం! దీనికి వ్యతిరేకంగా మన శాసనసభలలో ఒక్కరైనా పల్లెత్తుమాట పలకడంలేదు. పాశ్చాత్యపు పైమెరుగులయొక్క అర్థంలేని అనుకరణము, దానియెడల వ్యామోహము మనలో ఎంత మిగిలి వున్నప్పటికి, భారతదేశం ఈ మృత్యునాట్యమును దాటగలదనిన్నీ, 1915వ సం॥ మొదలుకొని ముప్పదిరెండు సంవత్సరాలుగా ఎంత అసంపూర్ణంగా అయినప్పటికి నిర్విరామంగా మాత్రం తాను పొందివున్న అహింసా విధాన శిక్షణంయొక్క ఫలితంగా తాను అందుకొనదగిన నైతిక శిఖరాన్ని అందుకొనగల్గుతుందనిన్నీ నేనూ, నావంటి వారింకా కొందరును, ఇంకా పూర్తిగా ఆశ వదలుకోలేను.

హరిజన్, 7-12-47.

నౌకాదళశాఖ :

నౌకాదళశాఖను గురించి నే నెరుగనుగాని, సైనిక దళానికి సంబంధించినంతవరకు అది భవిష్యత్తులో భారత దేశాన్ని పరాధీనం చేయుడానికిగాని, ఇతరదేశాల స్వాతంత్ర్యాన్ని హరించడానికిగాని పనికివచ్చే జీతగాళ్లతో కూడినదిగా వుండబోదని మాత్రం నేను చెప్పగలను. సైనికదళం యొక్క సంఖ్య చాలావరకు తగ్గించబడి, అది స్వచ్ఛంద సేవకులతో కూడినదై, భారతదేశంయొక్క (policing) అంతర్దేశ సంరక్షణమునకు మాత్రమే వినియుక్తమయేదిగా వుంటుంది.

హరిజన్, 20-1-37.

అధ్యాయం ౬౫

రాష్ట్రపునర్విభజన.

ఈ సూత్రమును (భాషాప్రయుక్తంగా రాష్ట్రపునర్విభజన చేయుటను) కాంగ్రెసుసంస్థ ఇదివరకే ఆమోదించి వున్నది. అట్టి పునర్విభజనం దేశంయొక్క సాంస్కృతిక పురోభివృద్ధికి అనుకూలిస్తుందనే అభిప్రాయంతో తాము అధికారంలోకి రాగానే ఆ సూత్రాన్ని అమలులో పెట్టగలమని కూడా కాంగ్రెసు ప్రకటించివున్నది అయితే అట్టి పునర్విభజనము సమైక్య వ్యక్తిత్వానికి వ్యతిరేకమైనదిగా మాత్రం వర్తించరాదు. రాష్ట్రస్వపరిపాలన అంటే దేశాన్ని

ముక్కలు చేయడమనిగాని, ఆయా రాష్ట్రములు పరస్పర సంబంధం లేకుండాను. కేంద్రంతో సంబంధం లేకుండాను తమ యిష్టానుసారం పోవచ్చుననిగాని అర్థం కాదు. ప్రతిరాష్ట్రము తానొక ప్రత్యేకమైన స్వతంత్ర రాజ్యంగా భావించుకోవడం ప్రారంభిస్తే భారత స్వాతంత్ర్యమే అర్థరహితమైపోతుంది. దానితోపాటు దానికి ఉపాంగములైన రాష్ట్రముల స్వాతంత్ర్యం కూడా అదృశ్యమైపోతుంది.

కాంగ్రెసు సంస్థయొక్క భావనప్రకారం భారత స్వాతంత్ర్యంయొక్క స్వభావం గ్రామస్వపరిపాలనం మీాద ఆధారపడినటువంటిది. కేంద్రప్రభుత్వం ఏ విధంగా గ్రామములనుంచి తన బలాన్నీ, అధికారాన్నీ పొందుతుందో అట్లే గ్రామములును కేంద్రంనుంచి జీవచైతన్యాన్ని పొందవలసి వుంటుంది. అట్లు కాక ఒకరితో ఒకరు తగాదాలు, పోటీలు పడి అపక్రమమైన రాష్ట్రాభిమానానికి తావొసగిన యెడల అది దేశానికే ముప్పు తెస్తుంది. ఇందుకు ఉదాహరణగా తమిళనాడు-ఆంధ్ర, బొంబాయి - కర్నాటకం మొదలైన తగాదాలను పేర్కొనవచ్చును. ప్రాంతీయభాషలు పూర్ణమైన అభివృద్ధి పొందవలెనంటే భాషాప్రయుక్తమైన రాష్ట్ర పునర్విభజనం అవసరమే. హిందూస్థానీ అంతరరాష్ట్రభాషగా వుండవలసినప్పటికీ, అది ప్రాంతీయభాషల స్థానాన్ని నింపజాలదు. అది రాష్ట్రములలో విద్యావాహనమైన భాషగా వర్తింపజాలదు; ఆంగ్లభాష ఆ పనికి అసలే పనికిరాదు.

హిందూస్థానీయొక్క ప్రయోజనం వివిధములైన రాష్ట్రములకు భారతదేశ మొత్తంతో సంబంధం చేకూర్చడంమాత్రమే. బయటి ప్రపంచం మనలను భారతీయులుగానే కాని గుజరాతీలుగాను, మహారాష్ట్రులుగాను, తమిళులుగాను, తదితరులుగాను ఎరగదు. అందువల్ల మనం దృఢమనస్కతతో దేశాన్ని ముక్కలుచేసే పోకడలకు ఏ మాత్రం తలెత్తనీయకూడదు. మనమంతా భారతీయులమనే అనుకుని, భారతీయులుగానే ప్రవర్తించాలి. భాషాప్రయుక్తరాష్ట్ర పునర్విభజనం అనేది ఈ సర్వప్రధానమైన సూత్రానికి బద్ధమై జరగాలి. అట్టి విభజనం విద్యావాణిజ్యాల పురోభివృద్ధికి దోహదంగా ఉపకరించగలదు.

(గాంధీజీ అభిప్రాయంలో) ఈ రాష్ట్రాల క్రొత్తసరిహద్దులను నిర్ణయించడానికి బౌండరీ కమిషన్ అవసరంలేదు. అది మనం విసర్జించిన వైదేశిక విధానానికి చెందిన పద్ధతి. మనం రాష్ట్రాలమధ్య ముఖాముఖీ సంప్రతింపులద్వారా క్రొత్త సరిహద్దు నిర్ణయాలను చేసుకుని, ఆ నిర్ణయాలను ప్రధానమంత్రి ముందుపెట్టి అనుమతిపొందడం ఉత్తమ మార్గం. అది నిజమైన స్వాతంత్ర్యాన్ని ప్రతిఫలించే పద్ధతి. ఈ నిర్ణయానికిగాను బౌండరీ కమిషన్ అనే మూడవవ్యక్తి యొక్క సహాయం కోరడమనేది మన స్వాతంత్ర్యానికి ప్రతికూలమైనపద్ధతి. భాషాప్రయుక్త రాష్ట్రములు పరస్పరాధారకమైనవిగాను, పరస్పర సహకారమైనవిగాను వర్తించాలి.

ఢిల్లీ డైరీ, పే. 378-80.

మంచిపని అయిన దానిని, తగిన కారణంలేకుండా, ఆలస్యంచేయకూడదనే అభిప్రాయంతోటే, మంచిదికాని పనిని ఏ పరిస్థితిలోనూ చేయడానికి అంగీకరించకూడదనే అభిప్రాయంతోటే నేను పూర్తిగా అంగీకరిస్తాను. చెడ్డతో ఏవిధమైన రాజీకాని పనికిరాదు. అయితే భాషాప్రయుక్త రాష్ట్ర విభజనమనేది, సుమారుగా ఏ దృష్టినుంచి చూసినా, అభిలషణీయంగానే కనిపిస్తున్నదికనుక, ఈ ప్రణాళికను అమలులోకి తేవడానికి ఏ మాత్రం ఆలస్యం జరగనవసరం లేదు.

కాని ప్రస్తుతం ద్యోతకమవుతూవున్న నిరుత్సాహ వాతావరణంలో భాషాప్రయుక్త పునర్విభజనం అమలుపరచడానికి సంకోచం చూపడంకూడా సమర్థనీయమే అని తోస్తుంది. ఎక్కడచూసినా అన్నిటికంటె ఎక్కువగా ప్రత్యేకతాభావం వ్యాప్తమై వున్నట్లు కనిపిస్తుంది. ప్రతివారూ తమ విషయం, తమ కుటుంబాల విషయం మాత్రమే ఆలోచిస్తున్నారు. భారతదేశమొత్తాన్ని గురించి ఎవరుగాని ఆలోచిస్తున్నట్టులేదు. సమైక్యతా భావంకూడా ప్రజాహృదయములో గర్భితమై వున్నప్పటికి అది పైకి హడావిడిగా ప్రదర్శితంకాదు; విభజనాత్మకమైన ఉద్రేకం పైనురుగువంటిది కావడంవల్ల అది సహజంగా తన కోలాహలంతో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ ఉద్రిక్తత సాంఘిక విషయాలలో ముఖ్యంగా అభివ్యక్తమౌతుంది. దీనిమూలంగా ఇతరరంగాలలోకూడా భయసంకోచాలు ఏర్పడ్డాయి. ఒరిస్సాకు ఆంధ్రకుమధ్య, ఒరిస్సా బీహారులనడుమ, ఒరిస్సా బెంగాలుల

మధ్య నడచివున్న తగాదాలచరిత్ర ఇంకా మన మనస్సులలో నిల్చియేవున్నది. ఆ తగాయిదాలు ఇంకా పూర్తిగా ఆరిపో లేదు...ఇప్పుడు, మనం స్వతంత్రులమైన తర్వాత, ఆ విష యాలు ఎట్లు పరిష్కరించుకోవడమో మనకింకా బోధపడటం లేదు. ఇది స్థూలదృష్టికి ఆత్మఘాతకమైన అరాజకపరిస్థితివలె కనిపిస్తున్నది. ఉత్సాహపూరితులైన సంస్కర్తలు కూడా దేశంలో ఇచ్చిపుచ్చుకోవడమనే ఉదారపద్ధతిని అందరూ అలవరచుకునే మంచికాలానికి వాయిదా వేయడం ఎదురు చూస్తూ, వాదప్రతివాదాలతో కూడిన పనులన్నిటిని దేశ క్షేమదృష్ట్యా ప్రస్తుతానికి వాయిదా వేయడం మంచిదని భావిస్తున్నారు. వర్గీయమైన పాక్షికాభిమానాలను త్యజించి సర్వులూ దేశమొత్తంయొక్క క్షేమాన్నే ప్రధానంగా భావించే సమయం వచ్చేదాకా ఆగడం మంచిదని తలుస్తు న్నారు. అందువల్ల, నిర్మాణాత్మకమైన సూచనలు వెంటనే ఆచరణలోకి రావాలనే ఆకాంక్షగల నా బోంట్లు దేశంలో ముందు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని, అంటే విరోధ భావానికి బదులు సామరస్యభావాన్నీ, సంఘర్షణలకు బదులు శాంతినీ, తిరోగతికి బదులు పురోగమనాన్నీ, మృత్యువుకి బదులు జీవచైతన్యాన్నీ పెంపొందజేసే వాతావరణాన్ని — తీసుకురావడానికి కృషిచేయవలసి వుంటుంది. సాంఘిక ఘర్ష ణలు సమసిపోయిననాడే ఆ సుఖప్రదమైన సమయం ఉద యిస్తుంది.

హరిజన్, 30-11-47.

రాష్ట్రములన్నీ సర్వతోముఖంగాను, సమానంగాను పురోభివృద్ధి పొంది, తద్వారా భారతదేశ మొత్తానికి సంక్షేమం చేకూరవలెనంటే, ఆయా రాష్ట్రములలోని ప్రభుత్వోద్యోగశాఖలలోని నియామకాలు ఆయా ప్రాంతీయులకు పరిమితమై వుండడం అవసరం. ప్రపంచం ముందర భారతదేశం తలెత్తుకు నిలబడవలెనంటే ఏ ఒక్క రాష్ట్రంగాని, ఏ ఒక్క జాతిగాని, ఉపజాతిగాని వెనుకకు దిగబడిపోయి వుండకుండా చూడవలసివుంటుంది. భారతదేశం తన ఆయుధబలం మీద నిలబడడానికి ఎన్నడూ ప్రయత్నించదు. ప్రపంచం ఇప్పటికే ఆయుధబలంతో అలసట పొందివున్నది. భారతదేశం తన యొక్క పౌరుని జీవితంలోను నేను లోగడ నిర్వచించివున్న సమాజవాదవిధానం (Socialism) లోను, అభివ్యక్తమగు తన అంతర్గత సంస్కృతిద్వారానే ప్రకాశితం కావలసుంటుంది...అనగా తన సిద్ధాంతాలను, ప్రణాళికలను వ్యాప్తం చేయడానికి ఏ విధమైన బలాత్కార పద్ధతులనుగాని అవలంబించకూడదన్నమాట. నిజంగా ప్రజాహితకరమైనది ఏదిగాని ప్రజామోదం పొందడానికి ప్రజాభిప్రాయ బలంతప్ప తదితర విధములైన బలాత్కార పద్ధతులేమీ అవసరంలేదు. అందునుబట్టి, లోగడ బీహారులోను, ఒరిస్సాలోను, అస్సాంలోను కొనసాగివున్న అసహ్యాకరమైన వ్యక్తిదౌర్జన్యచర్యలు ఏ మాత్రం జరిగివుండవలసినవి కావని స్పష్టపడుతుంది. సరిహద్దుల విషయంలో ఏర్పడిన లోపములు వేటిని గురించిగాని ఇతర రాష్ట్రముల ఆక్రమణలను గురించిగాని సరిదిద్దడానికి

ప్రజాహిత ప్రభుత్వాలు తగిన చర్యతీసుకోగలవు. ప్రతి రాష్ట్రప్రభుత్వమును ఇతర రాష్ట్రములనుంచి అక్కడకువచ్చిన వారందరికిని పూర్తిరక్షణ ఒసగవలసిన విధికి కట్టుబడివున్నది. "నీవు నీ సొత్తుగా భావించే దేనినిగాని ఇతరులకు నష్టం కలిగించని విధంగా ఉపయోగించుకో" అనేది న్యాయశాస్త్రం లోని ఒక ప్రసిద్ధ సూక్తి. దానిని నైతికప్రవర్తనకు మార్గదర్శకమైన ఉత్కృష్ట సూత్రంగాకూడా భావించవచ్చును. ప్రస్తుత పరిస్థితికి అది ఎంతైనా సముచితంగా వర్తిస్తుంది.

"రోమ్ నగరంలో వున్నప్పుడు రోమీయుల పద్ధతినే అనుసరించు"అనే నానుడి, రోమీయుల దుర్గుణాలకు వర్తించనంతవరకు, లోకజ్ఞానంతో కూడిన సూత్రంగానే భావించవచ్చును. క్రమానుగతమైన సమ్మిలన పరిణతి చెడ్డను విసర్జించి మంచిని జీర్ణించుకునే విధానాన్ని అనుసరించాలి ... మనయొక్క ప్రత్యేకతాత్మకమైన రాష్ట్రాభిమానమే మన ప్రజాజీవితాన్ని కలుషపూరిత మొనరిస్తూవున్న విషబీజం. నిజంగాచూస్తే మన రాష్ట్రపు పొలిమేరలు విశాలాతి విశాలమై భారతదేశపు పొలిమేరలతో సంలీనం కావాలి; భారతదేశపు పొలిమేరకూడా తుట్టతుదకు భూమండలపు పొలిమేరలతో సంలీనత పొందాలి. లేనిచో వినాశనమే గతి.

హరిజన్. 21-9-47.

ప్రతిభారతీయునికిని భారత పౌరునిగా భారతదేశంలోని ప్రతి భాగంలోను సమానహక్కులను అనుభవించే

యోగ్యతవున్నదని గాంధీజీ అభిప్రాయం. బీహారులో నివసించే బెంగాలీ ఎవరుగాని బీహారీగాను, బీహారీలతో అన్ని విధాలను సమాన హక్కులుగలవాడుగాను పరిగణింపబడాలి. అయితే అట్టి బెంగాలీ బీహారీలతో పూర్తిగా కలిసిపోవాలని ఆయన నొక్కిచెప్పారు. అట్టి బెంగాలీ తన స్వలాభానికి బీహారీలను నష్టపరచడంగాని, అక్కడ తానొక పరాయివాడుగా తలపోసికొనుటగాని, పరాయివానిగా ప్రవర్తించుటగాని పనికిరాదు... ముందు తగినరీతిగా నిర్వర్తింపబడిన విధులనుబట్టియే హక్కులన్నీ ఏర్పడతాయి. ఆ రెండు రాష్ట్రాలు సమానంగా పురోభివృద్ధి పొందవలెనంటే, అవి రెండును కూడా తమతమ హక్కులను బలపరచుకొనుటకుగాను దౌర్జన్య పద్ధతులను అవలంబించరాదని ఆయన ఉద్ఘాటించారు. అంటే బెంగాలీలుగాని, బీహారులుగాని తమ వాదం నెగ్గడానికిగాని, సరిహద్దు కమిషన్‌వారి నిర్ణయాన్ని మార్చడానికిగాని కత్తిమొనచూపి బలాత్కరించ కూడదన్నమాట. అదే ప్రజాస్వామ్య స్వతంత్ర భారతదేశం మొట్టమొదట నేర్చుకొనవలసిన పాఠం ... స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినదల్లా చేయడానికి లైసెన్సు కాదు. ఇష్టపూర్వకంగా ఆత్మనిగ్రహమును, క్రమశిక్షణమును అవలంబించడమే స్వాతంత్ర్యానికి అర్థం. అనగా భారత దేశీయులందరూ కలిసి తాము ఎన్నుకొనిన ప్రతినిధులద్వారా ఏర్పరచుకొన్న శాసనపాలనమునకు ఇష్టపూర్వకంగా బద్ధం కావడమన్నమాట. ప్రజాస్వామ్యంలో ఒత్తిడి తేవడానికి వినియోగింపదగిన సాధనం ప్రజాభిప్రాయం

ఒక్కటే. ప్రత్యక్షములేక పరోక్షము అయిన బలప్రయోగ మునకును సత్యాగ్రహ, శాసనోల్లంఘన, నిరశనవ్రతములకును ఏమీ సంబంధంలేదు. వీటికైనప్పటికి ప్రజాస్వామ్యంలో మిక్కిలి పరిమితమైన స్థానమే వుంటుంది. ఈ విధానముల యొక్క అవలంబన మైనప్పటికిని ప్రస్తుతంలో, అనగా మన ప్రభుత్వము లింకను స్థిరపడడానికి ప్రయత్నిస్తున్న సమయములో, సాంఘికఘర్షణలు ఇంకా రాష్ట్రంనుంచి రాష్ట్రానికి ప్రాకుతూవున్న సమయంలో, కేవలం అనూహ్యం.

(29-8-47 తేదీని కలకత్తాలో చేసిన ప్రార్థనానంతర ప్రసంగంనుంచి)
హరిజన్, 7-9-47.

ద్రావిడస్థాన్ :

తరువాత గాంధీజీ ద్రావిడస్థాన్ ఉద్యమాన్ని గురించి- అనగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం అనే నాలుగు ద్రావిడభాషలను మాట్లాడే జనాభాతో కూడిన దక్షిణ భారతప్రాంతాన్నిగూర్చి ప్రసంగించారు. ఈ నాలుగు భాషలను మాట్లాడే భారత దేశభాగాన్ని ఇతర ప్రాంతాలనుంచి ఎందుకు వేరుపరచాలి? ఈ భాషలుకూడా తమ సాహిత్య సంపదను పెంపొందించుకొనుటకు సంస్కృతభాషా భాండా రమునుంచి విస్తృతంగా గ్రహించి వుండలేదా? ఈ నాలుగు భాషాప్రాంతాలలోను ఆయన చేసివున్న సంచారంలో వాటి కిని తదితర ప్రాంతాలకును మధ్య ఏ విధమైన తేడాగాని వున్నట్లు ఆయనకు కనిపించలేదు. వింధ్యపర్వతాలకు దిగువ నివసించేవారంతా ఆర్యేతరులనిన్నీ, ఎగువ నివసించేవారంతా

అన్యులనిన్నీ అనుకోడం వట్టి అపోహ. ఒకానొకప్పుడు వారు ఎవరైవున్నప్పటికి ఒకరితో ఒకరు కలిసిపోయి ప్రస్తుతంలో కాశ్మీరం మొదలు కన్యాకుమారి కాగ్రంవరకు, భారతదేశం రెండుగా విభజింపబడినప్పటికి కూడా, అంతా ఒకే ఒక జాతిగా అయిపోయారు. ప్రస్తుతం జరిగివున్న విభజనంతో ఆగక, ఇంకా దేశాన్ని విభజించడం మొదలుపెడితే, లెక్క లేనన్ని స్వపరిపాలిత రాష్ట్రాలు ఏర్పడిపోయి, అవి భారత దేశానికిగాని ప్రపంచానికిగాని నిరుపయోగమైపోతాయి. పరాయిపాలనం క్రింద బానిసలమై వున్నప్పుడే మనం ఏకైక రాజకీయ సంఘటనకు బద్ధులమై వుంటామనీ, స్వతంత్రులం కాగానే ఆటవికులవలె గుంపులుగుంపులుగా విడిపోయి అంతా తలోకదారిని పోతామనీ లోకం అనుకునేలాగ మనం ప్రవ ర్తించకుందుముగాక. లేక, మనలను అదుపులో వుంచడానికి విస్తారమైన సైనికబలంతో కూడిన ఏకైక నిరంకుశ ప్రభుత్వం ఏర్పడవలసి వుంటుందా? ఈ సందర్భంలో ముఖ్యంగా దక్షి ణాత్యులు ఆంగ్లభాషయొక్క బానిసత్వంనుంచి విముక్తులు కావలసిన అవసరాన్ని గురించి గాంధీజీ నొక్కిచెప్పారు. ఆంగ్లభాష అంతర్జాతీయ వ్యాపారాలకు, రాజనీతికిమాత్రమే ఉపయుక్తమైనది. అది భారతదేశపు అసంఖ్యాకమైన ప్రజా సామాన్యంయొక్క భాషగా మాత్రం ఎన్నటికీ కాలేదు. ఒక శతాబ్దికిపైగా నడచిన బ్రిటీషు పరిపాలనంయొక్క ఫలి తంగా భారతీయ ప్రజాసముద్రంలో ఒక కొలది లక్షలమంది

మాత్రమే ఆంగ్లభాషా పరిచయం పొందగలిగారు. జనాభా లెక్కలను గమనిస్తే హిందీ ఉర్దూల సమ్మిశ్రణమై నాగరి, ఉర్దూలిపులలో వ్రాయబడే హిందూస్తానీ భాష మాట్లాడే వారు ఎన్ని లక్షలువున్నారో తేటతెల్లమౌతుంది. సంస్కృత భాషాపదాలు అధికంగా కలిగివుండే హిందీనిగాని, పెర్షియన్ భాషాపదాలు అధికంగా కలిగివుండే ఉర్దూనుగాని మాట్లాడే జనాభా హిందూస్థానీ మాట్లాడేవారికంటె చాలాతక్కువలో ఉంటారు. దాక్షిణాత్యులు తమ లిపిలో హిందూస్థానీ భాషను నేర్చుకోవచ్చునా అని కొందరు ఆయనను ప్రశ్నించారు. దానికి ఆయన తమ అభ్యంతరం లేదన్నారు. హిందూస్థానీ ప్రచారసభవారు దాక్షిణాత్య విద్యార్థులను ఆయాప్రాంతీయ లిపులలో హిందూస్తానీ నేర్చుకొనుటకు అనుమతించియే వున్నారు. తరువాత వారే, ఉత్తరప్రాంతపు సాహిత్యంతో సులభంగా పరిచితులు కావడానికిగాను హిందీ, ఉర్దూలిపులను రెంటినీకూడా అభ్యసించారు. దేశాభిమానంకోసమని అంత మాత్రమైనా మనం శ్రమపడవలసి వుంటుంది. మనం సంకుచిత రాష్ట్రాభిమానాలకు వశులమైపోవడం అనేది ఒక గొప్ప ఆపత్తు. అందరూ సంకుచిత మనస్కులై పోతే, ఇక మనకు ప్రేమాస్పదమైన సమగ్ర భారతం ఎక్కడిది? దాక్షిణాత్యులు హిందూస్తానీ నేర్చుకొనకపోవడం ఎంత తప్పో ఉత్తరదేశీయులును గొప్పసాహిత్యసంపదలకు నెలవైన దక్షిణభాషలలో ఒకటిగాని మరికొన్నిగాని నేర్చుకొనకపోవడం కూడా అంతే తప్పని గాంధీజీ స్పష్టంగా ఉగ్గడించారు. భారతీయులైన

ప్రేక్షకులతో కూడిన సభలలో తమను ఆంగ్లభాషలో ప్రసం గించమని ఎన్నడూ కోరకూడదని తీర్మానించు కొనవలసి నదిగా ఆయన దాక్షిణాత్య సభ్యులకు విజ్ఞప్తిచేశారు. ఆ విధ ముగా చేస్తే హిందూస్తానీ భాష త్వరగా వస్తుందనికూడా చెప్పారు. నైతికమైన పాలనసూత్రానికి బద్ధులమైనప్పుడే స్వతంత్ర భారతదేశంలో సమైక్యత సిద్ధిస్తుందని జ్ఞప్తివుంచు కొనవలసినదిగా కూడా ఉద్బోధించారు. కాంగ్రెసుసంస్థ తన యొక్క నైతికశక్తివల్లనే పరాధీనతా శృంఖలాలను తెగ త్రెంచుటకు యోగ్యమైన సమైక్యసంస్థగా వర్తించగలిగింది. రాజకీయ స్వాతంత్ర్యసిద్ధిని పొందినపిమ్మట కూడా అది ఆ రీతిగా నిలబడ నవసరంలేదా!

(16-7-47 తేదీని న్యూఢిల్లీలో చేసిన ప్రార్థనానంతరం ప్రసంగంనుంచి)

హరిజన్, 27-7-47.

అధ్యాయం ౬౬

అల్పసంఖ్యాక వర్గాల సమస్య.

వివిధ జాతులమధ్య సమైక్యత సిద్ధించవలెనంటే హిందూ సంఘీయులు అల్పసంఖ్యాక వర్గాలను ధైర్యంతో నమ్మాలి. ఇతర విధమైన సర్దుబాటు ఏదిగాని అంత సుఖదాయకంగా నడవదు. కోట్లాదిసంఖ్యలో వుండే ప్రజాబాహుళ్యమంతా శాసనసభ్యులు కావలెననిగాని, పురపాలక సంఘసభ్యులు కావలెననిగాని కోరరు. సత్యాగ్రహ ప్రయోగాన్నిగురించి

మనం సరిగా అర్థం చేసికొనియున్నయెడల అది క్రమ పరిపాలకు డెవరినిగాని అతడు హిందువైనాసరే, ముస్లింఅయినా సరే, తదితరమైన ఏ జాతికి, ఏ కులానికి చెందినవాడైనాసరే- ఎదుర్కొనడానికి ఉపయోగింపబడవచ్చుననీ, ఉపయోగింపబడవలసినదనీ గ్రహించగలరు. రెండవదిక్కున క్రమబద్ధమైన పరిపాలకు డెవరుగాని-అతడు హిందువైనాసరే, ముస్లిం అయినాసరే- సర్వదా సమానంగా మంచివారుగానే పరిగణింపబడాలి. సాంఘిక దురభిమానాలను మనము రూపుమాపదల్చుకున్నాము. అందువల్ల అధికసంఖ్యాకవర్గం ముందంజ వేసి తద్వారా తమ నిజాయితీనిగురించి అల్పసంఖ్యాక వర్గాలకు విశ్వాసం కలిగించాలి. దుర్బలపక్షం ముందుగా చేరికకు రావాలని కోరకుండా బలతరమైన పక్షం ముందంజ వేయుటద్వారానే వారిరువురిమధ్య సామరస్యం ఏర్పడటానికి వీలాతుంది. ప్రభుత్వశాఖలలో ఉద్యోగాల నియామకానికి సంబంధించినంతవరకు సాంఘికమూ, వర్గీయమూ అభిమానాలకు ఏ మాత్రం తావొసగినా, అది సత్పరిపాలనానికి విధ్వంసకంగా పనిచేస్తుందని నా అభిప్రాయం. పరిపాలన దృఢంగా నడవవలెనంటే అది ఎప్పుడును అర్హమైనవారి చేతులలో వుండాలి. పక్షపాతభావం ఏ మాత్రం వుండకూడదు. మనకు అయిదుగురు ఇంజనీర్లు కావలసివున్నయెడల వారిని ఒక్కొక్కరిని ఒక్కొక్క సంఘంనుంచి ఏరుకోకూడదు; కేవలం అర్హతములైన అయిదుగురిని - అందరూ ముసల్మానులైనాసరే, అందరూ పార్సీలైనాసరే – తీసుకోవాలి. అన్నిటికన్నా

తక్కువ తరగతి ఉద్యోగాలు విషయంలో, అవసరమనుకుంటే వివిధసంఘముల ప్రతినిధులతోను కూడిన నిష్పాక్షికమైన ఒక బోర్డువారిచేత పరీక్ష జరిపించి, తద్వారా నియామకాలు చేయబడవచ్చును. కాని ఉద్యోగాల పంపకం ఆయా సంఘాలయొక్క సంఖ్యాబలాన్నిబట్టి జరగకూడదు. విద్యావిషయికంగా వెనుకబడివున్న సంఘాలకు విద్యాసౌకర్యాలు కలిగించే విషయంలో జాతీయప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధచూపవలసివుంటుంది. దీనికి తగినఏర్పాట్లు చేయవచ్చును. అయితే ప్రభుత్వశాఖలలో బాధ్యతాయుతమైన ఉద్యోగస్థానాలను పొందుటకు ఆసించేవారు దానికి అవసరమైన పరీక్షలో ఉత్తీర్ణులైతే తప్ప ఆయా స్థానాలలో నియమింపబడకూడదు.

యంగిండియా, 29-5-24.

స్వతంత్ర భారతం సాంఘిక ప్రాతినిధ్యాన్ని భరించలేదు. అయినా స్వతంత్ర ప్రభుత్వం, అల్పసంఖ్యాకుల విషయంలో బలాత్కార విధానాన్ని అవలంబించకుండా సాగవలెనంటే, అది అన్నిసంఘాలను సంతృప్తిపరిచే విధానాన్ని అనుసరించి నడచుకోవలసుంటుంది.

యంగిండియా, 19-1-30.

హిందూస్తాన్ అనబడేదేశం ఇక్కడ పుట్టిపెరిగినవారందరికిని, తమ మాతృదేశంగా భావించదగిన ఇతరదేశమేదీ లేకుండా ఇక్కడనే నివాస మేర్పరుచుకున్న వారందరికిని, చెందుతుంది. అందువల్ల అది హిందువులతో సమా

నంగా పార్సీలకు, బెనీ ఇస్రాయిల్సుకు, ఇండియన్ క్రిస్టియ న్లకు, ముస్లింలకు, ఇతర హైందవేతరులకు కూడా చెందు తుంది. స్వతంత్ర భారతం అనేది హిందూరాజ్యంగా నడ వదు; భారతీయు లందరియొక్క రాజ్యంగాను నడుస్తుంది. అది ఏ మతవర్గాల అధికసంఖ్యపైనగాని ఆధారపడి వుండదు; మత భేదాలతో సంబంధం లేకుండా యావత్ప్రజానీకం యొక్కయు ప్రతినిధులపైన ఆధారపడి నడుస్తుంది. అల్ప సంఖ్యాక సంఘాలన్నీ కలిసి ఒకే ఒక అధికసంఖ్యాకవర్గమై, హిందువులను అల్పసంఖ్యాకవర్గపు లెక్కలోకి త్రోయగల పరిస్థితిని కూడా నేను ఊహించుకొనగలను. ఆయా ప్రజా ప్రతినిధులు తా మొనర్చివున్న సేవనుబట్టి, యోగ్యతనుబట్టి మాత్రమే ఎన్నుకోబడతారు. మతం అనేది వ్యక్తిగత విష యం. దానికి రాజకీయరంగంలో స్థానంలేదు. పరాయిప్రభు త్వమనే అసహజ పరిస్థితియొక్క ఫలితంగా మనకు మతముల ననుసరించి అసహజమైన వర్గవిభజనం ఏర్పడింది. ఆ పరాయి ప్రభుత్వం వదలిపోయిన వెంటనే, ఇంతవరకు అసత్యమైన ఆదర్శాలను నినాదాలను అనుసరించిన మన తెలివితక్కువను తలుచుకుని మనమే నవ్వుకునే సమయం వస్తుంది.

హరిజన్. 9-8-42

నేను నా మతంపేరిట ప్రమాణంచేస్తాను. దానికోసం నా ప్రాణం అర్పిస్తాను. కాని అది నా వ్యక్తిసంబంధమైన విషయం. ప్రభుత్వానికి దానితో ఏమీ సంబంధంలేదు. ప్రభుత్వం అనేది మన లౌకిక సంక్షేమాన్నీ, ఆరోగ్యాన్నీ,

రాకపోకల సౌకర్యాలనీ, విదేశ సంబంధాలనీ, నాణెముల చెలామణీ మొదలైన విషయాలనీ చూస్తుంది; అంతేకాని మీయొక్క మతంతోగాని, నాయొక్క మతంతోగాని దానికి సంబంధం లేదు. మతమనేది ప్రతివారియొక్కయు వ్యక్తిపరమైన విషయం.

హరిజన్. 22-9-46.

అంగ్లో-ఇండియన్లు; విదేశీయులు :

విదేశీయులెవరుగాని మన దేశంలో నివాసమేర్పరుచుకొనవచ్చునుగాని, వారు ప్రజానీకంలో తాము ఒకరమని భావించుకుని ఏకీభావం పొందాలి. విదేశీయు లెవరుగాని తమ హక్కులకు రక్షణలు కోరుతూ ఇక్కడ నివసించడానికి భారతదేశం అంగీకరించదు. వారు ఆ విధంగా కోరడమనేది వారు తమర్ని ఇతరులకంటె అధికులుగా పరిగణింపవలెనని అభిలషిస్తున్నట్లు అర్థమిస్తుంది. అట్టిపరిస్థితి ఘర్షణలకు కారణమౌతుంది.

హరిజన్, 29-9-46.

ఇది యూరోపియన్ల విషయంలో వర్తించదగిన వాస్తవ విధానమైనప్పుడు, ఇక యూరోపియన్లతో సమానస్థాయిగల వర్గంగా పరిగణింపబడే నిమిత్తమై వారి ఆచారవ్యవహారాలను అనుకరించి తమకు ప్రత్యేకరక్షణలను ఆశించే ఆంగ్లో-ఇండియన్లు వగైరాల విషయంలో ఇంకా ఎంత వాస్తవంగా వర్తిస్తుందో ఊహించుకోవచ్చును. వారింతవరకు పొంది

వున్న ప్రత్యేక ప్రాపకం ఇంకా నడవాలని కోరితే వారు తప్పకుండా ఇరకాటపు స్థితిలో పడతారు. ఏ విధమైన హేతువాదంవల్లగాని సమర్థనీయం కానటువంటి, తమ ఆత్మగౌరవానికే భంగకరమైనటువంటి ఆ ప్రత్యేక ప్రాపకంనుంచి వారికి విముక్తి కలిగింపబడుతూ వున్నందుకు వారు సంతోష పడవలసి వుంటుంది.

హరిజన్. 7-4-46.

ఆతని రాజకీయ హక్కుకి ఏమీ ఆపత్తు లేదు. అతనికి లేకుండాపోయినది సాంఘికమైన తాహతు మాత్రమే. ఒక దిక్కున ఆతడు తన పుట్టుకతో భారతీయ సంపర్కం వున్నందుకు అసంతృప్తి పాలౌతున్నాడు. మరొకదిక్కున యూరోపీయజాతి అతడిని తనలో కలుపుకోడానికి నిరాకరిస్తున్నది. అందువల్ల ఆతడు ఇటు నుయ్యి అటు గొయ్యివంటి పరిస్థితిలో పడ్డాడు. నేనా వ్యక్తిని తరుచు చూస్తూనేవుంటాను. అతడు యూరోపియన్లవలె జీవించడానికీ, వారివలె కనిపించడానికీ ప్రయత్నించి, తన స్థితికిమించిన ఖర్చుపాలై, పతనస్థితికివచ్చి వున్నాడు. అతనికి తాను మనోనిశ్చయంచేసుకుని, తన భవిష్యత్తును భారత ప్రజానీకంతో ఏకమొనర్చు కొనవలసి నదిగా నేను బోధచేసివున్నాను. ఈ వర్గానికి చెందిన స్త్రీ పురుషు లందరూ నేను సూచించిన సులభమైన సహజపరిష్కారాన్ని అనుసరించగల ధైర్యాన్నీ దూరదృష్టినీ చూపగలిగిన యెడల, ప్రస్తుతం వారు పడివున్న బాధాకరమైన పరిస్థితి

నుంచి బయటపడి, తమకూ భారతదేశానికీ కూడా ప్రయో జనకరమైనరీతిగా జీవించగల్గుతారు. నోరులేని ఆంగ్లో-ఇండి యన్ సంఘీయుల ప్రధాన సమస్య వారు తమ సాంఘిక తాహతు విషయం నిర్ధారణ చేసుకోవడమే. వారు తాము భారతీయులమని పరిగణించుకొని, భారతీయులవలె జీవించడం ప్రారంభించిన మరుక్షణం సంక్షేమకరమైన స్థితిని చేరు కుంటారు.

యంగిండియా 29-8-29.

అధ్యాయం ౯౩

భారతీయ గవర్నరు ఎలా వుండాలి ?

1. భారతీయ గవర్నరు వ్యక్తిగతంగాను, తన పరిస రాలలోను కూడా మద్యనిషేధి అయివుండాలి. అట్లుకానిచో ఆ ఉద్రిక్త ద్రావకనిషేధం ఏ మాత్రం సాధ్యంకాదు.

2. నోరులేని భారతప్రజానీకంతో ఏకీభావాన్ని భుక్తి శ్రమయొక్క అవసరాన్ని ప్రస్తుతంలో సంఘానికిపునాదిగావున్న సుసంఘటిత దౌర్జన్యవిధానానికి బదులుగా నెలకొనవలసివున్న సుసంఘటిత దౌర్జన్యరహిత విధానాన్ని సూచించుటకుగాను వాటికి బాహ్యచిహ్నమైన చేతి నూలువడికే ప్రక్రియ ఆతని పరిసరాలలో ప్రధానస్థానం పొంది వుండాలి.

3. అందరికీ అందుబాటులోవుంటూ కార్యకలాపాలు చక్కగా నెరవేర్చుకొనుటకు అవసరమైన గుప్తతకు కూడా

తగిన ఏర్పాట్లు కలిగివుండే కుటీరగృహంలో ఆతడు నివసిం చాలి. బ్రిటీషు ప్రభుత్వపు గవర్నరు సహజంగా బ్రిటీష్‌వారి బలానికి ప్రాతినిధ్యం వహించిన వాడుగా వుండేవాడు. అత నికీ, అతని పరివారానికీ ఆయుధసంపన్నమైన కోటవంటి నివాసం నిర్మితమయ్యేది. అందలి విశాలప్రాసాదంలో ఆత డును, ఆతని సామ్రాజ్యాన్ని నిలబెట్టే అనేకమంది సామం తులును వసించేవారు. భారత గవర్నర్లు విదేశపు రాజులకు, రాయబారులు మొదలైనవారి మకాం నిమిత్తం కొద్దిపాటి పెద్దభవనాలను ఏర్పాటుచేయవచ్చును. అట్టి అతిథులకు మన గవర్నర్లు ఒసగే ఆతిథ్యంద్వారా 'Even Unto This Last' యొక్క - అనగా సర్వసమానతయొక్క - అర్థం వాస్తవమైన ఉదాహరణ పూర్వకంగా అవగాహనకావాలి. గవర్నర్లకు మిక్కిలి విలువైన గృహోపకరణములు, స్వదేశీవిగాని విదే శీవిగాని, అవసరంలేదు. "సామాన్య జీవనము, ఉన్నతభావ నము" అనే సూక్తి ఆతని ఆదర్శమై వుండాలి. అది కేవలం ముఖద్వారానికి అలంకారప్రాయంగా కాక, దైనికజీవితంలో ప్రతిబింబిత మగునట్లుగా వుండాలి.

4. ఆతడు ఏ రూపంలోగాని అస్పృశ్యతను పాటించ కూడదు; కుల, మత, వర్ణభేదాలను వేటినీకూడా పాటించ కూడదు. ఆతడు అన్ని మతములలోని ఉత్తమభావాలను, ప్రాచ్యప్రాశ్చాత్య సంబంధమైన అన్ని ఉత్తమ విషయాలను అవగాహన చేసుకున్నవాడై వుండాలి. భారతదేశ పౌరుడుగా

వుంటూ ఆతడు ప్రపంచపౌరుడుగా కూడా ప్రకాశించాలి. కోట్లకొలది ధనసంపద తనకు పాదాక్రాంతమై వుండినీ ఖాలిఫ్ ఓమర్ ఈ విధమైన సామాన్యజీవితం గడిపినట్లు గ్రంథాలు చెబుతాయి; పురాతనకాలంలో జనకమహారాజు కూడా ఆ విధంగా జీవించివున్నాడు; బ్రిటిష్ దీవులలోని రాజకుటుంబా లకు సామంత కుటుంబాలకు చెందినపిల్లలు తన విద్యార్థులుగా చుట్టూ మసలుతుండగా ఈటన్ కాలేజీ అధ్యక్షుడు తన నివా సంలో ఆ విధమైన సామాన్య జీవితం గడపడం నేను చూచి వున్నాను. తిండికిలేని కోట్లాది జనసమూహంతో కూడిన భారతదేశపు గవర్నర్లుకూడా ఆ రీతిగా జీవించలేరా?

5. ఆతడు ఏ రాష్ట్రానికి గవర్నరయితే అక్కడి దేశ భాషను ఆతడు మాట్లాడగలిగి వుండాలి. దానితోపాటు జాతీయభాష అయిన హిందూస్తానీ భాషనుకూడా నాగరి, ఉర్దూలిపులు రెండిటితోనూ అభ్యసించి మాట్లాడగలిగి వుం డాలి. ఈ హిందూస్తానీ సంస్కృతభూయిష్ఠమైన హిందీగాని, పర్షియన్ పదజాలంతోనిండిన ఉర్దూగాని కాదు. వింధ్య పర్వతానికి ఉత్తరప్రాంతంలో అంతటా లక్షలాది జనసామా న్యానికి ఈ హిందూస్తానీయే వాహకభాష అని నిస్సంశయ ముగా చెప్పవచ్చును.

భారతీయ గవర్నర్లలో నెలకొని వుండవలసిన సుగుణా లన్నిటికి ఇది సంపూర్ణమైన జాబితా అని నా అభిప్రాయం కాదు. ఇది కేవలం ఉదాహరణ ప్రాయం మాత్రమే.

హరిజన్, 24-8-47.

అధ్యాయం ६० [?]

వా ర్తా ప త్రి క లు.

కేవలమైన ప్రజాసేవయే పత్రికారచనమునకు ఆదర్శముగా వుండాచి. వార్తాపత్రికా ప్రచురణమనేది చాలా శక్తివంతమైన సంస్థ. అయితే అడ్డుకట్టలేని నిర్ఝరి ఏ రీతిగా గ్రామప్రాంతాలను ముంచెత్తి పంటలను నాశనం చేస్తుందో అదేవిధంగా నిరోధంలేని లేఖినికూడా వినాశకరంగా పని చేస్తుంది. వెలపలనుంచి అమలైన నిరోధచర్య ఏదిగాని అసలు నిరోధం లేకున్నదానికంటె ఎక్కువ విషప్రాయంగా పరిణమించగలదు. స్వాయంగా అలవరచుకున్న నిగ్రహమే లాభకరంగా పనిచేస్తుంది. ఈ విధమైన సమాలోచన ప్రకారం చూస్తే ప్రపంచంలోని ఎన్నిపత్రికలు ఈ పరీక్షకు నిలబడగల్గుతాయి? కాని నిష్ప్రయోజనమైన పత్రికలను ఎవరు ఆపుచేయగలరు? వాటి మంచిచెడ్డలను నిర్ణయించేవారెవరు? లోకంలో మంచీ చెడ్డా కూడా వున్నట్లే, పత్రికలలో కూడా పనికివచ్చేవీ పనికిరానివీ కలిసి సాగుతూవుంటాయి. లోకులే తమ వివేచనబుద్ధితో కానలసినవి ఎన్నుకోవాలి.

ఆత్మకథ, పే. 287.

స్థూలదృష్టి, పక్షపాతం, అసత్యం, వీటితోపాటు తరుచుగా వంచనా బుద్ధికూడా ఆధునిక పత్రికారచనలో ప్రవేశించాయి. కేవలం న్యాయం జరిగేటట్లు చూడాలని కోరే నిజాయితీపరులైన వారినికూడా ఇవి తప్పుదారికి మళ్లించడం జరుగుతోంది.

యంగిండియా, 12-5-20.

కొన్ని పత్రికలనుంచి కత్తిరించబడిన భాగాలు-భయంకరమైన అంశాలతో కూడినవి నా ముందర వున్నవి. వాటిలో సాంఘికఘర్షణలను రేపెట్టేవి, ఉన్న పరిస్థితులను తారుమారుగా ప్రదర్శించేవి, హత్యాకాండతో కూడిన రాజకీయ దౌర్జన్యాన్ని పురికొల్పేవికూడా వున్నవి. వీటిని నిరోధించడానికిగాను ప్రభుత్వం కేసులు పెట్టడంగాని, ఆర్డినెన్సులు అమలుచేయడంగాని సులభమే. అట్టి చర్యలవల్ల తాత్కాలికంగా మాత్రమే పనిజరుగుతుంది, వాటివల్ల రచయితల మనస్సులలో మార్పేమీ కలగదు. వారికి బహిరంగమైన ప్రచురణావకాశం తొలగింపబడినయెడల వారు వెంటనే రహస్యప్రచారాన్ని కొనసాగించ నారంభిస్తారు.

విషప్రచార మొనర్చే పత్రికలను కొనుటకు నిరాకరించగల ఆరోగ్యవంతమైన ప్రజాభిప్రాయం ఏర్పడడమొక్కటే దీనికి తగిన నివారణోపాయం. మన పత్రికారచయితల సంఘమున్నదిగదా. అది ఒక ఉపశాఖను నియమించి, తద్వారా వివిధ పత్రికలను పరిశీలన చేయించి, అందలి అభ్యంతరకరములైన వ్రాతలను తేల్చి, వాటిని ఆయా పత్రికల సంపాదకుల దృష్టికి ఎందుకు తేకూడదు? అట్టి పత్రికలతో ఉత్తరప్రత్యుత్తరములు జరపడము, తద్వారా రావలసిన మార్పు రానియెడల అందలి అభ్యంతరకరములైన రచనలను గురించి బహిరంగంగా విమర్శించడము అనే పనులనుపైన పేర్కొన్నశాఖ నెరవేర్చవచ్చును. పత్రికా స్వాతంత్ర్య

మనే అమూల్యమైన హక్కును ఏ దేశంగాని వదలుకొనలేదు. కాని దానిపై శాసనబద్ధమైన నిరోధం అత్యల్పముగా తప్ప ఎక్కువగా వుండకూడదని కోరే పక్షంలో, నేను పైన సూచించినరీతి స్వయంనిర్ణీతమైన కట్టుబాటు ఏర్పాటుచేసుకో వలసివుంటుంది. అందుకు పత్రికలు ఆగ్రహించకూడదు.

యంగిండియా. 28-5-31.

అవినీతికరమైన వ్యాపార ప్రకటనల సహాయంతో వార్తాపత్రికలను నడపడం తప్పని నా అభిప్రాయం. వ్యాపార ప్రకటనలకు అసలు తావొసగడం అనేది అంగీకరించే సందర్భంలో పత్రికాధిపతులును, సంపాదకులును తమంత తామే వాటి మంచిచెడ్డలను తీర్మానించడానికి తగిన ఏర్పాటుచేసి, ఆరోగ్యవంతమైన ప్రకటనలను మాత్రమే తీసుకోవాలి ... చాలా గౌరవవంతమైనవిగా భావింపబడే వార్తాపత్రికలు, వ్యాససంచికలు కూడా అవినీతికరమైన వ్యాపారప్రకటనలను ప్రచురించే అభ్యాసంలో పడినట్లు గోచరిస్తుంది. ఈ చెడుగును తొలగింపవలెనంటే పత్రికాధిపతులయొక్కయు, సంపాదకుల యొక్కయు మనస్సాక్షిని నిశితమొనర్చవలసి వుంటుంది. ఆ నిశితమొనర్చే కార్యము నా వంటి సామాన్య సంపాదకుని కృషికి వశమగు నటువంటిది కాదు. ఆయా సంపాదకుల యొక్కయు, అధిపతులయొక్కయు, మనస్సాక్షి ఆ చెడుగు వ్యాప్తమగుటవల్ల కలిగే నష్టాలను గ్రహించి నప్పుడుగాని, ప్రజల అభిప్రాయబలానికీ, ప్రజల నైతికజీవితానికీ ప్రాతి

నిధ్యం వహించిన ప్రభుత్వం వారిపై ఆ విషయమై ఆంక్షలు విధించడం ద్వారాగాని మాత్రమే అది సాధ్యపడుతుంది.

యంగిండియా, 25-3-26.

వ్యాపార ప్రకటనల విషయంలో సత్యమునకు తగిన విలువ ఒసగబడవలెనని మాత్రమే నా వాదన. ఒక పుస్తకములోగాని, ఒక పత్రికలోగాని అచ్చయినటువంటుది ఏదైనాసరే వేదవాక్యంగా భావించడం ప్రజలకు అలవాటయింది. అందువల్ల వ్యాపారప్రకటనలను వ్రాసి తయారుచేయడంలో మిక్కిలి జాగరూకత వహించడం అవసరం. అసత్యమైన ప్రకటనలు చాలా ఆపత్కరంగా పరిణమించగలవు.

హరిజన్, 24-8-35.

అధ్యాయం ౯౯

శాంతి దళాలు.

కొంతకాలంక్రితం నేను శాంతిదళాలను నిర్మాణం చేయడం గురించి సూచించి వున్నాను. అట్టి దళములందలి సభ్యులు ప్రజలలో కొట్లాటలు వచ్చినప్పడు, ముఖ్యంగా సాంఘికమైన కొట్లాటలు కలిగినప్పుడు, వాటిని శాంతిల్ల జేయుడానికి తమ ప్రాణములనైనా ఒసగుటకు సంసిద్ధులై వుండాలని ఆ సూచనయొక్క అభిప్రాయం. ఈ దళాలు పోలీసుదళాలకు, మిలటరీదళాలకు బదులుగా పనిచేయగలిగి వుండాలని నా ఉద్దేశం. ఇది చాలా సాహసమైన భావంగా గోచరించు

వచ్చును. దీనిని ఆచరణరలోకి తేవడం అసాధ్యమైన పని కావచ్చునుకూడా. అయినాగాని, కాంగ్రెసు సంస్థ తన దౌర్జన్యరహితమైన పోరాటంలో విజయం సాధించవలెనంటే పైనపేర్కొన్న పరిస్థితులను శాంతియుతమైన పద్ధతిని ఎదుర్కొనగల శక్తిని పెంపొందించుకోవలసి వుంటుంది. కావున పైన ఉద్దేశింపబడినటువంటి శాంతి దళములందు సభ్యుడైన వానికి ఎట్టి అర్హతలు వుండవలసినదీ తెలుసుకుందాం:

1. అట్టి పురుషుడుగాని, స్త్రీగాని అహింసా విధానములో సజీవమైన విశ్వాసాన్ని కలిగినవాడై వుండాలి. భగవంతునియందు సజీవమైన విశ్వాసం వుంటేనేగాని ఇది సాధ్యంకాదు. అహింసాత్మకుడైన వాడెవడుగాని ఏ కార్యం చేసినా దైవకృపవల్లను, దైవశక్తివల్లను మాత్రమే దానిని చేయగలుగుతాడు. అదిలేనిదే ఆతడు క్రోధరహితంగాను, భయరహితంగాను, ప్రతీకారేచ్ఛారహితంగాను ప్రాణదానం చేయలేడు. పరమేశ్వరుడు అందరి హృదయాంతరములందు అధివసించి వున్నాడనిన్ని, భగవత్సమక్షంలో భయానికి తావుండదనిన్ని విశ్వసించినవానికి, తద్విశ్వాసఫలితంగా అట్టి ధైర్యం ఏర్పడుతుంది. దేవుడు సర్వాంతర్యామి అనివిశ్వసించినచో మనం మన శత్రువులైన వారియొక్కయు, ప్రతికక్షుల యొక్క యు, దౌర్జన్యచర్యలుచేసే గుండాలయొక్కయు ప్రాణముల యెడల కూడా గౌరవం భావం చూపవలసి వుంటుంది. మానవునిలోని పశుస్వభావ ప్రకోపాన్ని ఉపశమింపజేయడమే ఈ శాంతిదళములయొక్క విద్యుక్తధర్మం.

2. అట్టి శాంతిసందేశ ప్రచారకులు ప్రపంచమందలి ముఖ్యమతములన్నిటి పట్లను గౌరవభావం కలిగినవారై వుండాలి. ఉదాహరణకు అతడు హిందువైనయెడల భారతదేశంలోని ఇతర మతములన్నిటియెడల గౌరవభావం కలవాడై వుండాలి. అందునిమిత్తమై అతడు మన దేశంలోని వివిధ మతములయొక్కయు ముఖ్యసూత్రములను గురించిన పరిజ్ఞానం కలిగినవాడై వుండాలి.

3. ఈ శాంతికార్యం సాధారణంగా ఆయా ప్రదేశాలలో, అక్కడక్కడి స్థానికవ్యక్తులద్వారానే చక్కగా జరగడం సాధ్యపడుతుంది.

4. ఈ కార్యమును ఒక్కొక్కరుగాగాని, దళములుగాగాని చేయవచ్చును. అందువల్ల ఎవరుగాని అనుచరులకోసం ఆగనవసరంలేకుండా ఈ పనికి పూనుకొనవచ్చును. అయినప్పటికి స్థానికంగా అనుచరులను సంపాదించి, స్థానికదళాలను సంఘటిత మొనర్చవచ్చును.

5. ఈ విధమైన శాంతి ప్రచారకుడు తన వ్యక్తిగతమైన ప్రజాసేవా కార్యక్రమములద్వారా తనకు చెందిన, లేక తాను నిర్ణయించుకున్న, ప్రాంతంలోని ప్రజలతో పరిచితి కలిగించుకోవాలి. తద్వారా కొట్లాటలు కలిగినప్పుడు అతడు ప్రజలకు క్రొత్తవాడుగా వుండడు. అట్లు కానియెడల ప్రజలు అతనిని ఎక్కడనుంచో దిగివచ్చిన పరాయిమనిషిగా

భావించి అనుమానంతోను, అయిష్టతతోను చూడడం జరుగుతుంది.

6. అట్టి శాంతిదూత దోషరహితమైన శీలం కలవాడును, నిష్పాక్షికమైన దృష్టికలవాడును అయివుండాలి.

7. సాధారణంగా రాబోయే కలహాప్రతుపానులకు ముందుగా సూచనలు కనుపిస్తూవుంటాయి. అట్టి సూచనలు ద్యోతకమైనయెడల, కలహాలు ప్రారంభమై వ్యాప్తిపొందే వరకు ఆగకుండా, ఈ శాంతికార్యకర్తలు తగిన నివారణ చర్యలను తీసుకోవాలి.

8. ఈ ఉద్యమం వ్యాప్తిపొందినప్పుడు, తమ కాలమంతా ఈ పనినిమిత్తమే వినియోగించే కార్యకర్తలు ఏర్పడితే మంచిదే. కాని అట్లు పూర్ణకాలం వినియోగించేవారి అవసరం తప్పనిసరికాదు. సహృదయులు, సచ్ఛీలురు అయిన పురుషులును, స్త్రీలును తగినంతమంది తయారుకావలెననేదే ఈ ప్రణాళికయొక్క ఉద్దేశం. వివిధములైన జీవితరంగాల నుంచి స్వచ్ఛందసేవకులను చేర్చుకుంటేనే ఇది సాధ్యపడుతుంది. వీరు తమ తమ పరిచితప్రాంతములలోని స్థానికప్రజలతో స్నేహసంబంధాలను పెంపొందించుకొనుటకు తగిన వ్యవధికలిగినవారై వుండాలి. వారు ఈ శాంతిదళ సభ్యులకు ఉండవలసిన అర్హతలను కలిగినవారుగా కూడా వుండాలి.

9. ఈ శాంతిదళ సభ్యులు ఒక నిర్దిష్టమైన పద్ధతి ఉడుపులను ధరించాలి. తద్వారా వారిని ప్రజలు సునాయాసంగా పోల్చుకొనగలుగుతారు.

ఇవి స్థూలమైన సూచనలు. ఈ సూచనల ననుసరించి స్థానిక కేంద్రాలు తమ తమ నియమ నిబంధనావళిని ఏర్పరుచుకోవచ్చును.

హరిజన్. 18-6-38.

దౌర్జన్యశక్తిపై ఆధారపడిన విస్తృతమైన స్వచ్ఛంద సేవకదళాన్ని నడపడంలో నియమభంగం జరిగినప్పుడు సాధారణంగా దౌర్జన్య ప్రయోగం ఉపయోగించబడవలసివుంటుందని అర్థమిస్తుంది. అటువంటి సంస్థలలో మనుష్యుల సచ్ఛీలానికి ఎక్కువ విలువ ఉండదు. దేహబలమే ప్రధానమౌతుంది. దౌర్జన్యరాహిత్యం మీద ఆధారపడే సంస్థలలో పై వాటికి విరుద్ధమైన విలువలకు ప్రాధాన్యత ఒసగబడవలసివుంటుంది. అక్కడ దేహబలంకంటె ఆత్మశక్తికే అన్నిటికంటె ప్రాధాన్యత ఒసగబడాలి. అట్టి గుణంగల వ్యక్తులు ఎక్కువమంది దొరకడం కష్టమే. అందుకే క్రమబద్ధంగా నడువవలెనంటే అహింసాత్మకదళాలు కొలదిమందితో నేకూడి ఉండాలి. అట్టి దళాలు చెల్లాచెదరుగా అన్ని ప్రాంతాలలోను ఉండవచ్చును. ఒక్కొక్క గ్రామానికి, ఒక్కొక్క మొహల్లాకు ఒక్కొక్కటి ఏర్పాటుకావచ్చును. అందలి సభ్యులు ఒకరికొకరు బాగా పరిచితులైనవారై వుండాలి. ఏ దళమునకా దళము తమ తమ నాయకులను నిర్ణయించుకొనవచ్చును. సభ్యులందరిది సమాన తాహతే అయినా, అంతా ఒకే విధమైన కార్యక్రమానికి బద్ధులై వున్నప్పుడు, పని చక్కగా

జరుగవలెనంటే, ఎవరో ఒకరిని నాయకునిగా పరిగణించి ఆతని క్రమశిక్షణవిధానానికి అందరును బద్ధులైవుండడం అవసరం. రెండుగాని అంతకు ఎక్కువగాని దళములు ఉన్న చోట వాటినాయకులు తమలో తాము సంప్రతించుకుని, పరస్పరాంగీకృతమైన కార్యక్రమాన్ని అనుసరిస్తూవుండాలి. అట్టి పద్ధతిని అవలంబిస్తేనే పని విజయవంతంగా సాగుతుంది. ఈ పద్ధతిమీద అహింసాత్మకదళాలు ఏర్పాటైతే, అవి సునాయాసంగా కొట్లాటలను నివారించగల్గుతాయి. ఈ దళముల లోని వారికి అఖాడాలలో ఒసగబడే దైహికశిక్షణమంతా అక్కర లేదుగాని, అట్టి శిక్షణ కొలదిపాటిగా వుండడం మంచిదే.

అట్టి దళములలోని సభ్యులందరికీ సమానంగా అవసర మైన ముఖ్యాంశం ఒకటుంది; అది పరమేశ్వరుని యందలి సంపూర్ణ విశ్వాసం. వారికి సహచరుడు, సహకారకుడు ఆ పర మేశ్వరు డొక్కడే. అట్టి ఈశ్వర విశ్వాసంలేనిదే ఈ శాంతి దళాలు సజీవంగా పనిచేయలేవు. దేవుని ఏ పేర వ్యవహరిం చినాసరే, ఆ పరమేశ్వర శక్తిద్వారా తప్ప మనం ఏ కార్య మునుగాని సాధింపజాలమని మాత్రం తెలుసుకోవాలి. అట్టి జ్ఞాన మెరిగినవాడు ఇంకొకనికి ప్రాణహాని కలిగించలేడు. అవసరమైతే తన ప్రాణాన్ని సమర్పించి, మృత్యువును జయించ డంద్వారా ఆతడు చిరంజీవి అవుతాడు.

ఈ సత్యసూత్రాన్ని తన జీవితంలో అవగాహన చేసు కున్నటువంటి మనిషియొక్క మనస్సు క్లిష్టపరిస్థితి వచ్చినప్పుడు

విభ్రాంతంకాదు. ఆతడు సహజసిద్ధంగా సరియైనమార్గాన్ని తెలుసుకోగలుగుతాడు.

పైన చెప్పిన అంశములకు తోడుగా నా అనుభవం ద్వారా నేను గ్రహించివున్న కొన్ని నియమసూత్రాలను ఈ క్రింద పొందుపరుస్తాను :

1. అహింసాత్మక స్వచ్ఛందసేవకుడు తనతో ఏ విధమైన ఆయుధాలనుగాని ఉంచుకొనరాదు.

2. శాంతిదళసభ్యులు సులభంగా పోల్చుకొనుటకు వీలైన వేషం ధరించివుండాలి.

3. ప్రతిసభ్యుడును ప్రథమచికిత్స ఒసగడానికి అవసరమైన బేండేజీలు, కత్తెర, సూదీదారం, సర్జికల్ కత్తి వగైరా వస్తువులను తమతోకూడా వుంచుకోవాలి.

4. ప్రతిస్వచ్ఛందసేవకుడును గాయపడినవారిని ఎత్తి తీసికొనిపోయే పద్ధతిని తెలిసినవాడై వుండాలి.

5. ప్రతిస్వచ్ఛందసేవకునికిని మంటలను ఆర్పడం, మంటలతోకూడిన స్థలమును తనకు హానికలుగకుండా ప్రవేశించగల్గడం, మంటలనుంచి మనుష్యులను రక్షించుటకుగాను ఇండ్లు మొదలైన వాటిపైకి ఎక్కడం, ఒంటరిగాగాని మంటలనుండి రక్షింపబడినవారిని మోసికొనిగాని తిరిగి క్రిందికి దిగడం మొదలైన పనులు చేతనైవుండాలి;

6. ఆతడు తాను పనిచేసే ప్రదేశంలోని ప్రజలందరిని ఎరిగి వుండాలి. అట్టి పరిచితి పెంపొందించుకొనడమనేది దానికదే ఒక సేవాకార్యమౌతుంది.

7. ఆతడు తన హృదంతరంలో నిరంతరం రామనామాన్ని జపిస్తూ వుండాలి. రామనామాన్ని నమ్మే ఇతరులనుకూడా అట్లే చేయవలసినదిగా ప్రోత్సహించాలి.

మనుష్యులు సాధారణంగా దైవనామాన్ని ఉత్త చిలుక పలుకులవలె జపించి, దానివల్ల ఫలసిద్ధికావలెనని కోరుతుంటారు. నిజమైన సాధకుడు తనలోనుంచి ఇతరులలోనుంచి అట్టి చిలుకపలుకులవంటి అసత్యమైన భక్తిని పారద్రోలి, సజీవమైన భక్తిభావాన్ని తమ హృదంతరములందు నెలకొల్పుకోవాలి.

హరిజన్, 5-5-46.

గూండాలు :

గూండాలను నిందించడం పొరపాటు. మనం అనుకూల వాతావరణాన్ని సృష్టించినప్పుడు తప్ప వారు అల్లరులకు దిగరు. నేను 1921 వ సంవత్సరంలో ప్రిన్స్ డే రోజున బొంబాయిలో జరిగిన విషయాన్ని కళ్లార చూచివున్నాను. మనం నాటిన విత్తనాలకు ప్రతిఫలమైన పంటనే ఆ గుండాలు కోసుకుపోతారు. మనవాళ్లే వారికి వెనకమద్దతు ఇచ్చారు... గౌరవవర్గాలకు చెందినవారిని ఈ నింద సోకకుండా ఉంచుకోడమనే అభ్యాసాన్ని మనం బలంగా ప్రతిఘటించాలి...

బ్రాహ్మణులు, వైశ్యులు దార్ఢ్యరహితంగా ఆత్మరక్షణ చేసుకోడం చేతగాకపోతే, దార్ఢ్యసహితంగా చేసుకోడమైనా నేర్చుకోవాలి; లేకపోతే తమ స్త్రీజనమును, ఆస్తిపాస్తులను గూండాల పరంచేసి వూరుకోవాలి. గూండాలు హిందువులైనాసరే, ముస్లింలైనాసరే వారిదొక ప్రత్యేకమైన తెగ.

యంగిండియా, 29-5-24.

పిరికితనానికి మందు కసరత్తుచేయడం కాదు; ప్రమాదాలను ఎదుర్కొనడమే దానికిమందు. మధ్యతరగతి హిందువులు తాము పిరికివారై, తమ పెరిగిన పిల్లలను గారాబంగా దాచిపెట్టి, తమ పిరికితనాన్ని వారికికూడా సంక్రమింపచేస్తూ కూచున్నంతకాలం, వారు ఆపత్తులను, కష్టనిష్ఠూరాలను ఎదుర్కొనడానికి ఎన్నడూ సాహసం చూపలేనివారుగానే వుంటారు. తలిదండ్రులు యువకులైన తమ పిల్లలను ఢక్కామొక్కీలను ఎదుర్కొనడానికి స్వతంత్రంగా వదలిపెట్టి, ఆపత్తులను ఎదుర్కొనే సాహసాన్ని వారు పెంపొందించుకునేలాగ చేయాలి. అందువల్ల ఒకొక్కసారి వారికి ప్రాణహాని కలిగినాసరే,ఎంత దుర్బలశరీరుడైనాసరే గుండెధైర్యంకలవాడై వుండవచ్చును. కండలుతిరిగిన జూలూ జాతివాళ్లు ఒక చిన్న ఆంగ్లేయబాలుడిముందర గజగజ వణకిపోతారు. ప్రతిగ్రామములోను అందలి గుండె నిబ్బరంగల వ్యక్తులనుచేర్చి, వారిని సంఘటితపరచాలి.

యంగిండియా, 29-5-24.

శాంతి దళాలలో సభ్యుడుకాదలచిన వ్యక్తి తన ప్రాంతంలోని గూండాలనబడే వారితో పరిచితి కలిగించుకుని వారికి చేరిక కావాలి. ఆతడు అందరినీ ఎరిగినవాడై, అందరికీ తనను ఎరికపరచుకొని, తన జీవితంవల్లను తన నిస్వార్థమైన సేవవల్లను అందరి హృదయాలను చూరగొనగలిగి వుండాలి. ఏ తరగతి వారినిగాని తాను చేరికకావడానికి అనర్హమైన వారుగా భావించకూడదు. గుండాలనబడేవారు ఆకాశాన్నించి రాలిపడేవారూ కాదు; భూతాలలాగున భూగర్భం నుంచి పుట్టుకువచ్చేవారూ కాదు. వారు సంఘంయొక్క అరాజక పరిస్థితులకు ఫలితంగా పుట్టినవారు; అందువల్ల వారిని గురించిన బాధ్యత సంఘంమీదనే వుంటుంది. అనగా వారిని మనం సంఘశరీరంలో ఏర్పడిన అవినీతికి చిహ్నాలుగా పరిగణించాలి. రోగానికి చికిత్స చేయాలంటే ముందుగా దానికి మూలకారణ మేమిటో తెలుసుకోవాలి. అప్పుడే దానికి మందేమిటో కనిపెట్టడం సులభసాధ్యమౌతుంది.

హరిజన్, 15-9-40.

అధ్యాయం ౭౦

అఖిల భారత జాతీయ కాంగ్రెసు.

మన రాజకీయ సంస్థలలోకల్లా వృద్ధమైనదీ, అనేక పోరాటాలకు పర్యవసానంగా తన అహింసాత్మక విధానము ద్వారా దేశస్వాతంత్ర్యమును ఆర్జించినదీ అయిన భారత జాతీయ కాంగ్రెసు సంస్థను మృతిజెందనీయకూడదు. మన

జాతి మృతిజెందితేనే అది మృతిజెందుతుంది. సజీవమైనసంస్థ ఏదిగాని నిత్యం పెరుగుదల చూపుతూవుండాలి; లేనిచో అది నశిస్తుంది. కాంగ్రెసు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, సాంఘిక నైతిక స్వాతంత్ర్యాన్ని ఆర్జించింది. ఈ స్వాతంత్ర్యాలు ఎక్కువ నిర్మాణాత్మకమైనవి అగుటవల్ల, ఎక్కువ ఉద్రిక్త మైనదిగాని ఆర్భాటమైనవిగాని కాకపోవుటవల్ల, అవి రాజకీయ స్వాతంత్ర్యముకంటె కష్టసాధ్యమైనవి. సర్వతోముఖమైన నిర్మాణకార్యక్రమం కోట్లకొలదిగావుండే ప్రజానీకంలోని ప్రతివ్యక్తియొక్క చైతన్యాన్ని మేలుకొల్పుతుంది.

కాంగ్రెసు సంస్థ స్వాతంత్ర్యంయొక్క ప్రాథమికమూ, అత్యవసరమూ అయిన భాగాన్ని సమార్జించివున్నది. అన్నిటికంటెను కష్టసాధ్యమైన దానిని ఇంకను పొందవలసివున్నది. ప్రజాస్వామ్యత అనే శిఖరారోహణ మార్గంలో నామ మాత్రంగా ప్రజాహితమూ ప్రజాస్వామికమూ అయిన సంస్థలును, లంచగొండితనంతో కూడిన అవినీతి అనే ఊసరక్షేత్రాలును మొలకెత్తడమనేది తప్పనిసరిగా జరుగుతుంది. కలుపు మొక్కలతోను దట్టమైన రుప్పలతోను ఈ బంజరునుదాటి బయటపడేదారి ఏమిటి?

కాంగ్రెసుసంస్థకు ఇకముందు ప్రత్యేకమైన సభ్యులపట్టీ ఒకటి ఉండనవసరంలేదు. ఈ వరలోవున్న పట్టికయొక్క సభ్యత్వసంఖ్య ఎప్పుడుగాని ఒకకోటికి మించకపోయినా, దాని సభ్యుల స్పష్టస్వరూపం గోచరించడం కష్టసాధ్యంగా

వుండేది. ఎప్పుడూ అప్రత్యక్షంగావుండే అసంఖ్యాక సభ్యత్వంతోకూడిన అగోచరమైన కాంగ్రెసు సభ్యత్వపట్టిక వుండనే వుంటుంది. ఇకముందునుంచి దేశంలోని వోటర్లపట్టికలనే కాంగ్రెసు సభ్యత్వపట్టికగా భావించవలసి వుంటుంది. అందులో దొంగపేర్లు ప్రవేశించకుండాను, నిజమైనపేర్లు లోపించకుండాను చూడడమే కాంగ్రెసుసంస్థ చేయవలసిన పని. ఇక కాంగ్రెసు సంస్థయొక్క స్వంతపట్టిక మాత్రం పరిమిత సంఖ్యలోవుండే కొంతమంది దేశసేవకులతో కూడి వుండాలి. వారు అప్పటప్పటి వారికి నిర్దేశితమైన పనులను నెరవేరుస్తూ వుంటారు.

దురదృష్టవశాత్తు వారు ప్రస్తుతం నగరవాసులనుండియే సేకరింపబడవలసి వుంటుంది. వారిలో చాలామంది గ్రామాలలో, గ్రామవాసుల నిమిత్తం పనిచేయవలసి వుంటుంది. ఈ పట్టికలోకి ఎక్కువెక్కువగా గ్రామస్థులైనవారిని చేర్చవలసివుంటుంది.

ఈ దేశసేవకులు వారి వారి పరిసర సీమలలో చట్టప్రకారం వోటర్లుగా నమోదైన వారి విషయమై, వారికోసకు పనిచేయవలసి వుంటుంది. అనేకమంది వ్యక్తులును పక్షాలును వారిని మంచిచేసుకోడానికి ప్రయత్నిస్తారు. వారిలో ఉత్తములైనవారి విజయానికి తోడ్పడాలి. పూర్వం కాంగ్రెసు సంస్థకు దేశమందు ఏర్పడివున్న విశిష్టమైన స్థానం అతివేగముగా క్షీణిస్తూవున్నది; దానిని తిరిగి సంపాదించడానికి

ఇది ఒక్కటే మార్గం. ఈ వరలో కాంగ్రెసుసంస్థ ఒకదిక్కున దేశసేవాపరంగాను, ఇంకొక దిక్కున దైవసేవాపరంగాను వుంటూ వచ్చింది. ఇప్పుడు అది కేవలం దైవసేవాపరంగా మాత్రమే నిలుస్తున్నట్లు తనకూ, లోకానికీ చాటవలసివున్నది. అసహ్యాకరమైన అధికారపు పోటీకి అది దిగినచో, ఏదో ఒక రోజు తెల్లవారేసరికి ఇక కాంగ్రెసు అనేది లేనేలేకుండా నశించిపోయిందని తెలుసుకుంటాము. మన ప్రస్తుత రాజకీయ రంగంలో కాంగ్రెసుతోపాటు ఇతరపక్షాలుకూడా స్థాన మాక్రమించి వుండడం దేవుడు చేసిన ఒకమేలుగా భావించ వలసిన విషయం.

ఇందుమూలంగా నేను ముందు ముందు రానున్న దృశ్యాన్ని ప్రస్తుతం దిజ్మాత్రంగా గమనికలోకి తెస్తున్నాను. నాకు వ్యవధి, ఆరోగ్యం వుంటే ఈ లోకసేవక సంఘం అనేది తనకు ప్రభువైన స్త్రీపురుష వయోజన ప్రజానీకంయొక్క దృష్టిలో అధికతరంగా గౌరవభాజనం కావడానికి ఏ మేమి చేయగలిగినదీ ఈ పత్రికాముఖంగా చర్చించగల్గుతానని ఆశిస్తున్నాను.

హరిజన్, 1-2-48

మహాత్ముని అంతిమ సంకల్పం, మరణశాసనం :

[గాంధీ మహాత్ముడు తన మృతిదినానికి క్రితంరోజున, అనగా 29 జాన్యువరి 1948 సం॥ తేదీని ఈ క్రింద పొందుపరచిన కాంగ్రెసు సంస్థా నూతనప్రణాళికను తయారుచేసి వున్నాడు. అదే ఆయన చేతి నుండి వెలువడిన తుది రచన అగుటవల్ల, దానిని మహాత్ముని అంతిమ సంకల్పంగాను, మరణశాసనంగాను పరిగణింపవచ్చును.]

భారతదేశం, రెండుముక్కలుగా చీల్చబడినప్పటికీ, కాంగ్రెసుసంస్థచేకూర్చిన సాధనములద్వారాస్వాతంత్ర్యసిద్ధిని పొందివున్నది కనుక, ఆ సంస్థ తనయొక్క ప్రస్తుత రూపురేఖలతో, అనగా ప్రచారసాధనంగాను, శాసనసభాయంత్రంగాను తనప్రయోజనాన్ని పూర్తిచేసిందని భావించవచ్చును. భారతదేశం తనయొక్క నగర, పట్టణములను అటుంచి,తనవేడులక్షల గ్రామాలకు సంబంధించినంతవరకు సాంఘిక, నైతిక, ఆర్థిక రంగములలో ఇంకను స్వాతంత్ర్యసిద్ధిని పొందవలసి వున్నది. భారతదేశం తన ప్రజాస్వామ్యగమ్యము నందుకొనుటకుచేసే పురోగమనంలో పౌరశక్తి సైనికబలానికి పైచెయ్యిగా అగుటకు సంఘర్షణ జరుపకతప్పదు. కాంగ్రెసుసంస్థ రాజకీయ పక్షాలయొక్కయు, సర్గీయసంస్థలయొక్కయు పోటీలలో చిక్కుకొనకుండా చూడవలసివున్నది. అందునుబట్టియు, మరికొన్ని ఇతర కారణములనుబట్టియు కాంగ్రెసుసంస్థను ఇక ఎత్తివేయుటకును. అవసరమునుబట్టి మార్పులుచేసే అధికారంతో ఈ క్రింది నిబంధనలప్రకారం లోకసేవక సంఘంపేరిట రూపాంతర మొనర్చునట్లుగను ఇందుమూలంగా అ. భా. కాంగ్రెసు సంఘంవారు తీర్మానించడమైనది.

అయిదుగురు గామీణులైన స్త్రీపురుషులతో కూడిన ఒక్కొక్క పంచాయితీ సంఘం ఒక్కొక్క ప్రాథమికకూటం ఏర్పడాలి.

ప్రక్కప్రక్కగా ఏర్పడివున్న అట్టి రెండు ప్రాథమిక కూటాలు ఒక్కొక్క కార్యనిర్వాహక పక్షంగా ఏర్పడి, తమలోనుంచి ఒక నాయకుని ఎన్నుకోవాలి.

అటువంటి ఒక వంద పంచాయతీలు ఏర్పడినపిమ్మట వాటియొక్క ప్రాథమిక నాయకులైన ఏభై మందినీన్ని తమలో నుంచి ఒక ద్వితీయనాయకుని ఎన్నుకోవాలి. అట్లే ప్రతి ఏబదిమంది ప్రాథమిక నాయకులనుంచినీన్ని ఒక్కొక్క ద్వితీయ నాయకుడు ఎన్నుకొనబడుతూవుండాలి. పై ప్రాథమిక నాయకులు ఈ ద్వితీయవర్గపు నాయకులను అనువర్తించి నడుచుకోవాలి. ఈ విధంగా రెండేసివందల పంచాయతీలతో కూడిన శ్రేణులుగా ఏర్పడి, దేశమంతటను పరివ్యాప్తం కావాలి. వీటన్నిటికిని ప్రాథమికనాయకుల పద్ధతినే అనుసరించి ద్వితీయ వర్గనాయకులు ఎన్నిక కావాలి. ఈ ద్వితీయవర్గ నాయకులు ఒక్కొక్కరు తమ తమ స్థానిక ప్రాంతములకును, మొత్తంగా దేశమంతటికిని బాధ్యతవహించి పనిచేయాలి. వీరు ఎప్పుడు అవసరమనితోస్తే అప్పుడు తమలోనుంచి ఇంకొక ముఖ్య నాయకుని ఎన్నుకొనవచ్చును. ఈ ముఖ్యనాయకుడు క్రింది అన్నికూటముల మీదను తన సంకల్పానుసారంగా అధికారమును వహించి నడిపించగలడు.

(రాష్ట్ర)ములయొక్కయు, మండలముల యొక్కయు తుది స్వరూపనిర్ణయం ఇంకా నిర్ధారణగా ఏర్పడివుండనందున ఈ సేవకబృందములను ప్రస్తుతం రాష్ట్రములరీత్యాను మండలముల రీత్యాను విభజించుటకు ప్రయత్నించలేదు. అందువల్ల దేశమొత్తంయొక్క కార్యనిర్వహణ ప్రస్తుతానికి అప్పట్లో ఏర్పడివున్న ఒక కూటానికిగాని, బహు కూటాలకు

గాని వప్పగించబడినది. ఈ సేవకబృందం తమకు ప్రభువు లైన దేశమొత్తపు ప్రజానీకానికి తాము సంతోషపూర్వకం గాను, వివేకయుతంగాను సేవచేయడంద్వారా తమ అధికారాన్నీ, శక్తినీ పొందుతారు.)

1. ప్రతికార్యకర్తయు స్వయంగా వడికిన నూలుతో నేసిన ఖద్దరుబట్టనుగాని, అ. భా. చర్ఖాసంఘం వారి ధృవ పత్రముపొందిన ఖద్దరు బట్టనుగాని అభ్యాసరీత్యా ధరించే వారై వుండాలి. అతడు హిందువైనచో వ్యక్తిపరంగాను, తన కుటుంబంలోనుకూడా ఏ రూపంలోగాని అస్పృశ్యతను పాటించనివాడై వుండాలి. వివిధ సంఘ సమైక్యతాదర్శమును విశ్వసించేవాడై వుండాలి; అన్ని మతములయెడల సమాన గౌరవభావం కలవాడై వుండాలి; జాతి, మత, లింగభేదము లతో సంబంధంలేకుండా అందరికిని సమానావకాశములు, సమానతాహతు ఏర్పడవలెనని విశ్వసించేవాడై వుండాలి.

2. అతడు తన కార్యపరిధిలోని ప్రతిగ్రామీణునితోను వ్యక్తిగతసంపర్కం కలిగించుకోవాలి.

3. అతడు గ్రామీణులలో మంచి కార్యకర్తలను చేర్చి, వారికి అవసర శిక్షణమునొసగి, అట్టి కార్యకర్తల పట్టికను తయారుచేసి వుంచాలి.

4. అతడు తన దైనిక కార్యక్రమ నిర్వహణాను దినచర్యరూపంగా వ్రాసి భద్రపరచాలి.

5. అతడు గ్రామాలను వ్యవసాయంద్వారాను చేతి పనులద్వారాను స్వయంసంపూర్ణములను, స్వయంపోషకమును అగునట్లుగా సంఘటితపరచాలి.

5. అతడు గ్రామస్థులకు పారిశుధ్య, ఆరోగ్యసంబంధ మైన విజ్ఞానాన్ని కలిగించి, గ్రామాలలోని అనారోగ్య పరి స్థితులను వ్యాధులను నివారించుటకు తగిన చర్యలు తీసుకోవాలి.

7. అతడు గ్రామీణులకు నయీతాలిం పద్ధతి ననుస రించి ఆజన్మాంతము వర్తించే విద్యాశిక్షణమును ఒసగాలి. ఈ విషయంలో హిందూస్థానీ తాలిమీసంఘం నిర్ణయించిన విధానాన్ని అనుసరించి వ్యవహరించాలి.

8. అతడు శాసనబద్ధమైన వోటర్ల పట్టికలలో పడ కుండా మిగిలిపోయిన పేర్లను వాటిలో సక్రమంగా నమోజు అగునట్లు చూడాలి.

9. అతడు వోటింగుహక్కు పొందేందుకు అవసర మైన అర్హతలను ఇంకా సంపాదించుకోనివారిని అట్టి అర్హ తలను పొంది, తద్వారా వోటింగుహక్కును చేకూర్చుకొను నట్లు ప్రోద్బలం చేయాలి.

10. పైకార్యములను, ఇంకా అప్పటప్పట చేర్చబడ గల ఇతరకార్యములను నిర్వహించుటకుగాను, అతడు విధి నిర్వహణ విషయికంగా పై సంఘంవారు నిర్ణయించివున్న

నిబంధనల ప్రకారం ఆవసరమైన శిక్షణనుపొంది, అర్హత నార్జించినవాడై వుండాలి.

ఈ సంఘం ఈ క్రింది స్వయంపాలిత సంస్థలను తనకు అనుబంధ సంస్థలుగా స్వీకరిస్తుంది :

1. అఖిల భారత చర్ఖాసంఘం (A. I. S. A.)
2. అఖిల భారత గ్రామోద్యోగుల సంఘం A.I.V.I.A.
3. హిందూస్థానీ తాలిమీ సంఘం.
4. హరిజన సేవక సంఘం.
5. గోసేవా సంఘం.

ఆర్థిక విషయం :

ఈ సంఘం తన కార్యక్రమాశయాన్ని నెరవేర్చే నిమిత్తం గ్రామీణులనుంచి, ఇతరులనుంచి విరాళాలు పోగు చేయవచ్చును. ఈ విరాళసేకరణ విషయంలో "పేదవారి నుంచి పైసలసేకరణ" పద్ధతికి ప్రాముఖ్యత ఒసగాలి.

ది లాస్ట్ ఫేజ్, సం, 2, పే. 819-20.

అధ్యాయం ౭౧

భారతదేశం, పాకిస్తాన్, కాశ్మీరం.

దేశం రెండు భాగాలుగా విభజనకావడం అనేది మన దురదృష్టం. ఈ విభజన మతసంబంధమైన చీలికయొక్క ఫలితంగా జరిగినట్లు బహిరంగంగా ఉగ్గడించబడివున్నది.

దానికి వెనుక ఆర్థికమూ, ఇతరమూ అయిన హేతువులు కూడా ఉండివుండవచ్చును. కాని కేవలం ఆ హేతువులొక్కటే ఈ చీలికను తీసుకురాగలిగి వుండేవి కావు. ప్రస్తుతం వాతావరణాన్ని ఆవరించివున్న విషవాయువుకూడా ఆ సాంఘిక వైషమ్య ఫలితమైనదే. సాంఘిక వైషమ్య సమస్య లేకపోతే ఎంత బాగుండేదని అనుకోడం చక్కగానే వుంటుంది. కాని ప్రత్యక్షంగా ఉన్న సమస్యను తుడిచివేయడ మెలాగ ?

దేశం విభాజ్యమైన ఈ రెండు భాగాలనడుమ యుద్ధమే ప్రాప్తించిననాడు భారత యూనియన్‌లోని ముస్లింలు పాకిస్తాన్‌లోని ముస్లింలను ఎదుర్కొని యుద్ధం చేస్తారా అనిన్నీ, ఆ విధంగానే ఇక్కడి హిందువులు అక్కడి హిందువులను ఎదుర్కొని యుద్ధం చేస్తారా అనిన్నీ కొందరు ప్రశ్నిస్తున్నారు. అట్లు ఒకరితో ఒకరు యుద్ధం చేయడం ప్రస్తుతంలో ఎంత అసాధ్యమైనదిగా తోచినా, ఆ విధంగా జరగడంలో అసాధ్యమైన విషయమేమీ లేదు. ఏ పరిస్థితిలో అయినప్పటికీ అనూసంఘీయుల దేశభక్తి ప్రకటనలను విశ్వసించడం ప్రమాదకరమనిపించినప్పటికీ—వాటిని విశ్వసించడంలోకంటె విశ్వసించకపోవడంలోనే ఎక్కువ ఆపత్తువున్నదని నా అభిప్రాయం. ఆ ప్రశ్ననే ఇంకో విధంగా పెడితే ఎక్కువ స్పష్టంగా బోధపడగలదు; "సత్యంకోసం, న్యాయంకోసం ఏ పరిస్థితిలోగాని హిందువులు హిందువులతోటీ, ముస్లింలు ముస్లింమతస్థులతోటీ తలపడగలరా?" ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరంగా ఇంకొక

ప్రశ్న వేయవచ్చును: "అటువంటి ఉదాహరణలు చరిత్రలో ఎక్కడా కనిపించవా?"

ప్రస్తుతం సత్యానికి తగిన విలువ ఒసగబడకపోవడమే ఈ సమస్యా పరిష్కారానికి ఏర్పడుతూవున్న అడ్డంకు. ఈ భయంకరమైన దహనకాండమధ్య సత్యమే విజయం పొందు తుందనే దృఢవిశ్వాసం మీాద నిలబడేవారుకూడా కొందరు వున్నారని మనం ఆసిద్దాం.

హరిజన్, 26-10-47.

ఈ విభజన మత, సాంఘిక హేతువులనుబట్టి బలా త్కృతం చేయబడింది. కావున పాకిస్తాన్ అన్వర్థనామధేయం కావలెనంటే తన సంబంధ వ్యవహారాలన్నిటిలోను స్వచ్ఛ ముగా వుండవలసి వుంటుంది. హిందూ ముస్లింలు ఉభ యులూకూడా క్రూరమైన చర్యలకు, భయంకరమైన హార పాట్లకు పాల్పడివున్నారు. అయితే అందుకని ఈ ఉన్మాద పూరితమైన స్పర్థ ఇలాగే సాగాలనీ, తుదకు యుద్ధంగా పరిణ మించాలనీ ఎక్కడా లేదు. అటువంటి యుద్ధంవల్ల ఈ రెండు స్వతంత్ర రాజ్యాలును ఇంకొక మూడవ బలవత్తర రాజ్యా నికి లొంగుబాటు కావలసివస్తుంది. అంతకంటె నష్టకరమైనది ఇంకొకటి ఉండదు.

ఢిల్లీ డైరీ, పే. 307-08

ఇండియూ పాకిస్తాన్లమధ్య యుద్ధం తటస్థిస్తే, పాకిస్తాన్ లోని హిందువులు అక్కడ శత్రుపక్షీయులుగా (fifth Columnists) వుండడానికి వీలుకాదు. అలావుంటే దానిని

ఎవరూ సహించరు. వారికి పాకిస్తాన్ పట్ల అభిమానం లేకపోతే వారు దానిని వదలిపోవాలంతే. ఆ విధంగానే పాకిస్తాన్ యెడల అభిమానంగల ముస్లింలు భారత యూనియన్‌లో ఉండకూడదు. హిందువులకు, సిక్కులకు న్యాయంజరిగేలాగు చూడడం ప్రభుత్వంయొక్క విధి. ప్రభుత్వం తమ ఇచ్ఛానుసారంగా వర్తించేటట్లు ప్రజలే చేయగలరు ... "హన్ సేక్ లియా పాకిస్తాన్. లార్కే లేంగే హిందుస్తాన్" అంటూ ముస్లింలు నినాదాలుచేసినట్లు తెలియవచ్చింది ... కొందరు భారత దేశమంతనీ ఇస్లాం మతంలోకి మార్చివేయాలని కలలు కంటున్నట్లుకూడా కనిపిస్తుంది. అది యుద్ధంద్వారామాత్రం ఎన్నటికీ సాధ్యంకాదు. పాకిస్తాన్ హిందూమతాన్ని ఎన్నటికీ అంతరింపజేయలేదు. తమను, తమ మతమును ఏనాడుగాని అంతరింపజేసుకుంటే హిందువులే చేసుకోవాలి. అట్లే ఇస్లాం మతం నాశనమైనా అది పాకిస్తాన్‌లోని ముస్లింలవల్లనే జరగగలదుగాని హిందూస్తాన్‌లోని హిందువులవల్ల జరగదు.

ఢిల్లీ డైరీ, పే. 40-41.

ఈ రెండు రాజ్యాలమధ్య సముచితమైన విధంగా వ్యవహారాలు సర్దుబాటు చేసికొనవలెనంటే ఇరుపక్షాలవారును ఎవరి తప్పును వారు పూర్తిగా ఒప్పుకుని, ఒకరితో ఒకరు చేతులు కలుపుకోవడంగాని, అట్టి రాజీ కుదుర్చుకొనలేక పోయిన పక్షంలో మామూలు పద్ధతిని మధ్యవర్తిత్వానికి పరస్పరం బద్ధంకావడంగాని లోకసామాన్యమైన విధానం. ఇక మిగిలిన మొండిపద్ధతి యుద్ధం... పరస్పరమైన రాజీగాని,

మధ్యవర్తిత్వ పద్ధతిగాని అనుసరించడం కుదరని సందర్భంలో యుద్ధం తప్పదు. ఈలోగా ... తమ ఇష్టపూర్వకంగా పాకిస్తాన్‌కు తరలిపోకుండా ఉండిపోయిన ముస్లింలను నిర్భయంగాను సురక్షితంగాను తమ తమ యిండ్లకుపోయి నివసించవలసినదిగా వారి ఇరుగు పొరుగువారు హామీ ఇవ్వాలి. ఈ పని మిలటరీ సహాయంవల్ల జరిగేదికాదు. ఆయా స్థానిక ప్రజలు ఉన్మాద స్థితినుంచి బయటపడి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడడం మీదనే అది ఆధారపడి వుంటుంది.

ఢిల్లీడైరీ, పే. 19.

భారత దేశంనుంచి ప్రతి ముస్లింను తరిమివేయడం అన్నా, ప్రతి హిందువును, సిక్కుమతస్తుని పాకిస్తాన్‌నుంచి తరిమివేయండం అన్నా యుద్ధం అన్నమాటే. అట్టి యుద్ధం ఉభయ దేశాలకు చిరవినాశనకారకమైన విషయం. ఈ రెండు రాజ్యాలలోను ఇటువంటి ఆత్మనాశనకరమైన విధానమేకనక అనుసరింపబడిన పక్షంలో, తత్ఫలితంగా పాకిస్తాన్‌లోను, హిందూస్తాన్‌లోను ముస్లిం మతమూ, హిందూ మతమూ కూడా నాశనమాతాయి. మంచియే మంచిని పుట్టించగలదు. ప్రేమవల్లనే ప్రేమజనిస్తుంది. ఇక పగసాధించుకునే విషయం వస్తే, చెరుగుచేసిన వానిని దేవుని చేతులకు వప్పగించడమే మానవమాత్రుల విధి అని తెలుసుకోవడం మంచిది.

ఢిల్లీ డైరీ. పే. 26.

భారత దేశమూ, హిందూమతమూ, సిక్కుమతమూ, ఇస్లాం ఇవన్నీ వినాశనం పాలౌతూవుంటే ఏమీచేయలేక

చూస్తూ ఊరుకోడంకంటె, నాకు మరణమే ఉత్తమమగు శరణ్యమని భావిస్తాను. పాకిస్తాన్ తన పొలిమేరలలో వసించే వివిధమతస్థులకును సమానగౌరవమును వారి ప్రాణధనములకు రక్షణ హామీని ఒసగుట నిరాకరించడంగాని, ఆ ఉదాహరణమునే భారతదేశంకూడా అనుకరించడంగాని జరిగిన పక్షములో పైన నేను పేర్కొన్నరీతి వినాశనం జరగకతప్పదు. అయితే అప్పుడైనా ఇస్లాం భారతదేశపు రెండు ఖండాలలోను నాశనమైనా, ఇతర ప్రపంచప్రాంతాలలో అది మిగిలే వుంటుంది. ఇక హిందూ, సిక్కు మతాలు రెండును ఒక్క భారతదేశానికిమాత్రమే చెందినవి కావడంవల్ల, అవి పుట్టగతులులేకుండా నశిస్తాయి.

ఢిల్లీ డైరీ, పే, 332.

అల్పసంఖ్యాక సంఘంవారు దేశద్రోహులౌతారేమో అనే భయంవల్ల అధికసంఖ్యాక సంఘంవారు వారిని కత్తికి ఎరచేయడంగాని, దేశంనుంచి వెళ్లగొట్టడంగాని పిరికితనపు చేష్ట అని చెప్పకతప్పదు. అల్పసంఖ్యాకుల హక్కులకు పూర్తిరక్షణ ఒసగడమే అధికసంఖ్యాకుల విధ్యుక్తధర్మం. అట్టి హక్కులను లెక్కించకపోవడమనేది అధికసంఖ్యాకులను నవ్వులపాలుచేస్తుంది. బలమైన ఆత్మవిశ్వాసాన్ని కలిగివుండడం, నిజమైన లేక ఊహాజనితమైన ప్రత్యర్థిని నమ్మగల ధైర్యాన్ని కలిగివుండడం అనేవే ఉత్తమమైన ఆత్మరక్షణ సూత్రాలు.

• ఢిల్లీ డైరీ, పే. 31-32.

పాకిస్తాన్‌నుంచి తరుమబడి భారతదేశంలోనికి కాందిశీకులుగా వచ్చినవారు తామింక ఒక్క పంజాబుకో, పశ్చిమోత్తర సరిహద్దుప్రాంతానికో, సింధురాష్ట్రానికో మాత్రమే చెందినవారుగా కాక భారతదేశం యావత్తుకీ చెందిన పౌరులుగా భావించుకోవాలి. వారు ఎక్కడకు పోయినాగాని అక్కడి ప్రజలతో పాలలో పంచదారవలె కలిసిపోవాలి. వారు తమ వ్యాపార వ్యవహారాలన్నిటిలోను నిజాయితీకలిగి, కష్టపడి పనిచేయటం అలవరచుకోవాలి. వారు భారతదేశానికి సేవచేసి, దేశగౌరవాన్ని ఇనుమడింప జేయడమే తమజన్మకు సార్థకత కలిగిస్తుందని భావించి, దేశగౌరవానికి ఏవిధంగాను భంగకరం కానిరీతిగా వర్తించాలి. తమలో తాము తగవులాడుకోడంలోగాని, జూదము, మద్యపానము మొదలైన వ్యసనములలోగాని కాలాన్ని దుర్వ్యయం చేయకూడదు. తప్పుచేయడం మానవసహజమైనప్పటికి, చేసిన తప్పులనుంచి గుణపాఠాలు నేర్చుకొని వాటిని తిరిగి చేయకుండావుండే జ్ఞానంకూడా మనిషికి ఒసగబడినదనే విషయాన్ని గుర్తించాలి. కాందిశీకులుగా వచ్చినవారు ఈ సలహాలను పాటిస్తే వారెక్కడెక్కడికి వలసపోయినాగాని దేశానికి లాభకారులుగా జీవించగల్గుతారు. అప్పుడు అన్నిరాష్ట్రాలలోని ప్రజలు వారిని చేతులుచాపి ఆహ్వానిస్తారు.

ఢిల్లీ డైరీ, పే. 82.

పాకిస్తాన్ కేవలం ముస్లిం మతస్థుల రాజ్యంగాను, భారతదేశం కేవలం హిందువులకును, సిక్కులకును చెందినది

గాను వుండి, ఆయా చోట్లగల అల్పసంఖ్యాక సంఘాలకు ఏ విధమైన హక్కులనూ ఒసగకుండానే కనక వుంటే, అవి రెండు దేశాలకుకూడా వినాశకరంగా పరిణమిస్తుంది.

ఢిల్లీ డైరీ, పే, 91.

పాకిస్తాన్ మతపరిపాలితమైన రాజ్యంకాదనినీ, అది లౌకికరాజ్యాంగబద్ధమైన ప్రభుత్వమే అనినీ క్వాయిదీఆజాం చెప్పివుండలేదా? ఆయన ఉగ్గడించిన ఆ మాట దురదృష్టవశాత్తు చేతలలో అంతగా నిరూపితం కానిమాట పూర్తిగా వాస్తవమే అనుకోండి. ఇక భారతదేశం కూడా మతపాలిత రాజ్యమై, హైందవేతరులంతా హిందూ మతధర్మాన్ని అవలంబించవలసినదిగా బలాత్కరించ బడతారా?...అదేకనక జరిగితే భారతదేశం ఇక భవిష్యదాశకు, ఆశయాలకు నిలయం కాకుండా పోతుంది. ఆసియా, ఆఫ్రికా ఖండస్థులైన వివిధజాతులవారు మాత్రమే కాక ప్రపంచమంతా కూడా భారతదేశంనుంచి ఎదురుచూచే ఆదర్శసందేశాన్ని ఒసగడానికి అనర్హమైపోతుంది. ప్రపంచమంతా భారతదేశపు రెండు విభాజ్య రాజ్యాలనుంచీకూడా సంకుచితత్వాన్నీ, మతోన్మాదాన్నీ ఆశించడంలేదు. ఈరెండు రాజ్యాలూ ప్రస్తుతలోకాన్ని ఆవరించివున్న అంధకారంలో కాంతినిప్రసరించి, గుణపాఠాలను నేర్పగల ఉత్కృష్టమైన సచ్ఛీలతను ప్రదర్శించగలవని ప్రపంచమంతా ఆశించి ఎదురు చూస్తున్నది.

ఢిల్లీ డైరీ, పే. 140.

కాశ్మీరం :

కాశ్మీరంలో మహారాజా సాహెబ్‌నకుగాని, మహా ఘనతవహించిన నైజాంనకుగాని తమ తమ ప్రజల ప్రకటి తాభిమతాన్ని తెలిసికొనకుండా భారతదేశపు ఏ విభాజ్య రాజ్యంలో కలవడానికిగాని అధికారంలేదు. ఈ మాట ఆయ నకు (గాంధీజీకి) తెలిసినంతవరకు, కాశ్మీరం సందర్భంలో స్పష్టపరచబడివున్నది. మహారాజా ఒక్కడే భారతదేశంలో కలవడానికి నిశ్చయిస్తే. అట్టి కలయికను గాంధీజీ సమర్థ నీయంగా భావించేవారుకాదు. మహారాజాతోపాటు జమ్మూ కాశ్మీర్ ప్రజలతరఫున షేక్ అబ్దుల్లాకూడా కోరివుండడం వల్లనే భారతప్రభుత్వం కలయికకు తాత్కాలికాంగీకారాన్ని తెలిపింది. కాశ్మీర్, జమ్మూప్రాంతవాసులైన ఒక్కముస్లిం లకేకాక అచ్చటి ప్రజానీకమందరికినీ ప్రాతినిధ్యం వహించ డం మూలముననే షేక్ అబ్దుల్లా రాజకీయదృశ్యంలో స్థానం గడించడం జరిగింది.

కాశ్మీరం రెండు భాగాలుగా విభజింపబడి జమ్మూ హిందువులకును, కాశ్మీర్ ముస్లింలకు పంపకం కావచ్చు ననే ఒకమాట గుసగుసగా ఆయన వినికిడికివచ్చింది. అట్టి విభక్తాభిమానాలనుగాని, దేశంలోని రాష్ట్రాలను ఆవిధంగా ఖండఖండితం చేయడంగాని ఆయన ఏ మాత్రం ఊహించ లేనని చెప్పారు. అందువల్ల భారతదేశంలో అందరూ వివే చనాజ్ఞానంతో అట్టి విషమపరిస్థితి ఏర్పడకుండా వెంటనే

జాగ్రత్తపడగలరని ఆసిస్తున్నానన్నారు. బలవంతంగా వలస పోతైన నిస్సహాయ కాందిశీకుల నిమిత్తమైనా అట్టి దుష్టపరిస్థితి కలగకుండా చూడవలసి వుంటుందని ఉగ్గడించారు.

(ది 11-11-47న చేసిన ప్రార్థనానంతర ప్రసంగం నుంచి)

ఢిల్లీ డైరీ, పే. 163-64

అధ్యాయం ౯౨

భారతదేశంలోని విదేశీయ స్థావరాలు.

గోవా :

స్వతంత్రభారతంలో మన స్వతంత్ర శాసనవిరుద్ధంగా గోవా ఒక ప్రత్యేకస్థావరంగా ఉండటానికి వీలుకాదు. ఒక్క తుపాకిగుండు పేల్చవలసిన పనిలేకుండా, గోవా ప్రజలు స్వాతంత్రభారత పౌరసత్వ ప్రతిపత్తిని తమ జన్మహక్కుగా ఉగ్గడించి, పొందగలరు.

హరిజన్, 30-6-46.

ఫ్రెంచి, పోర్చుగీసు సామ్రాజ్యతత్వాలమధ్య చెప్పదగిన తారతమ్యమేమీ కనిపించదు. సామ్రాజ్య తత్వం యొక్క చేతులు ఎప్పుడూ రక్తకలుషితమై వుంటాయి. సామ్రాజ్యతత్వపరమైన రాజ్యాలు, సచ్ఛీలుడైన అశోక చక్రవర్తివలె, ఎంతత్వరితంగా తమ సామ్రాజ్యతత్వాన్ని విసర్జిస్తే అంతగా వారి భారాన్ని మోయలేక మూలిగే లోకా

నికి మంచిది. గోవాలోని భారతీయులకు పోర్చుగల్ దేశమే మాతృదేశమంటూ ప్రభుత్వ సమాచారసంస్థవారు చేసిన ప్రకటన కేవలం హాస్యాస్పదమైనమాట. నాకు భారతదేశం ఏ రీతిగా మాతృదేశమో వారికిని భారతదేశం ఆ రీతిగానే మాతృదేశమవుతుంది. గోవా బ్రిటీషు ఇండియాకు వెలుపల వున్నప్పటికీ భాగోళికమైన భారతదేశ మొత్తంలో అది భాగమే. గోవాలోని భారతీయులకును పోర్చుగల్ దేశీయులకును మధ్య ఏ విధమైన పోలికగాని లేదు.

హరిజన్. 8-9-46.

ఫ్రెంచిస్థావరాలు :

తమ స్వదేశస్థులైన లక్షలాది ప్రజానీకం బ్రిటిషు పరిపాలనమునుంచి స్వతంత్రులై వుండగా, వారి సమక్షంలో ఈ అల్పమైన విదేశీయస్థానరాలలోని ప్రజలు పరాధీనస్థితిలో మిగిలివుండడం సాధ్యంకాదు.

ఉదారాశయులని పేరుగాంచిన ఫ్రెంచిప్రజలు ఇండియాలోగాని, మరెక్కడగాని, నలుపురంగు వారినిగాని, చామనచాయ వారినిగాని అణగద్రొక్కడమనే పనితో ఎన్నడూ ఏకీభవించరని నేను ఆసిస్తాను.

హరిజన్, 16-11-47.

అధ్యాయం ౭౩.

భారతదేశం — ప్రపంచశాంతి.

నేటి ప్రపంచంలోని ఉత్తమ మనస్వులందరూ భవిష్యత్ప్రపంచం ఒకదానితో ఒకటి పోరాడుకునే కేవల స్వతంత్ర రాజ్యములతో కూడినదిగాకాక స్నేహభావబద్ధములైన స్వతంత్ర ప్రభుత్వములతో కూడినదై వుండవలెనని అభిలషిస్తున్నారు. అట్టి ఆదర్శసాఫల్యత చేకూరడానికి చాలా కాలం పట్టవచ్చును. ఈ విషయంలో మనదేశం తరఫున నే నేమీ గొప్పలు చెప్పబోడంలేదు. అయితే మనం కేవలమైన స్వాతంత్ర్యంకంటె విశ్వజనీనమూ పరస్పరాధారకరమూ అగు అనుబంధానికి సంసిద్ధతను ప్రకటించడంలో ఏ విధమైన అసాధ్యతగాని, ఆత్మశ్లాఘనంగాని వున్నదని నే ననుకోను.

యంగిండియా, 26-12-24.

నా పరమాశయం స్వాతంత్ర్యంకంటె చాలా ఉన్నతమైనది. భారతదేశ విమోచనంద్వారా లోకంలోని దుర్బల జాతులనబడేవారంతా తమర్ని అణగద్రొక్కే పాశ్చాత్యుల స్వప్రయోజన పరత్వంనుంచి విముక్తిపొందడం జరగవలెనని నేను ఆసిస్తాను. భారతదేశం స్వతంత్రం కావడం అంటే ప్రతి జాతి స్వతంత్రం కావడం అని అర్థమివ్వాలి.

యంగిండియా, 12-1-28.

ప్రత్యక్షమైన అహింసావిధానంద్వారా తాను స్వాతంత్ర్యం పొందినయెడల, తనకు బ్రహ్మాండమైన సైనికదళాలు

గాని, నౌకాదళాలుగాని, విమానదళాలుగాని కావలెనని భారతదేశం ఎన్నడూ ఆసించదు. తన స్వాతంత్ర్య పోరాటంలో అహింసాత్మకమైన విజయాన్ని సాధించగల ఉచ్ఛస్థితికి భారతదేశ చైతన్యం పెరగగలిగిననాడు ప్రపంచపు విలువలే మారిపోయి, యుద్ధావసరాలకు కావలసిన పరికరాలలో చాలాభాగం కేవలం నిరర్థకమైనవిగా పరిగణింపబడతాయి. ఆ రీతిగా రూపొందిన భారతదేశం ఉత్తకల అనీ, చిన్నపిల్లవాని ఊహాచిత్రమనీ అంటే అనవచ్చును. కాని నా అభిప్రాయంలో అహింసాత్మక విధానంద్వారా భారతదేశం స్వతంత్రం కావడంలో గర్భితమైన భావం అటువంటిదని ఉగ్గడించగలను. ఆ విధమైన స్వాతంత్ర్యం ఎప్పుడు చేకూరినా ... అది భారతదేశానికీ బ్రిటనుదేశానికీ మధ్య ఏర్పడే పరస్పరమైన సమ్మతి పూర్వకమైనదిగా ప్రాప్తిస్తుంది. అయితే అట్టిసమాధానం ఏర్పడడమనేది ప్రపంచంలో సర్వాధిక్యతను గడించగోరే సామ్రాజ్యగర్వితమైన బ్రిటనుదేశముతో కాక, సార్వజనసీ సంక్షేమాన్ని ఆసించే వినీతమైన బ్రిటనుదేశంతో మాత్రమే జరుగుతుంది.

యంగిండియా, 6-5-29.

అప్పుడు భారతదేశం బ్రిటనుయొక్క పరపీడనా పరాయణమైన యుద్ధకాండలలోకి నిస్సహాయంగా దింపబడే దుర్బలస్థితిలో వుండదు. అప్పుడు భారతవాణి ప్రపంచంలోని దౌర్జన్యశక్తులన్నిటిని అదుపులోవుంచే బలవత్తర జాతీయవాణిగా ప్రవర్తిస్తుంది.

యంగిండియా, 6-5-29.

భారతదేశమేకనక సత్యాహింసలద్వారా తన నిర్దిష్ట గమ్యసిద్ధిని పొందితే, తద్వారా ఆమె ప్రస్తుతం ప్రపంచ రాజ్యాలన్నీ తృష్ణాతురంగా ఎదురుచూచే ప్రపంచశాంతి యొక్క స్థాపనకు అనల్పమైన దోహదమొనర్చినది కాగల దనిన్నీ, తన ప్రయత్నంలో ఇష్టపూర్వకంగా సహాయమొన ర్చిన ఇతరదేశాలకు కొలదిపాటిగానైనా ఋణంతీర్చుకో గలుగుతుందనిన్నీ నేను సవినయంగా సూచించ సాహసిస్తాను.

యంగిండియా, 12-3-31.

భారతదేశం స్వయంపోషకమైనదీ, పరాధారంకానిదీ, స్వలాభానికి పరులను కొల్లగొల్లగొట్టడం మొదలగు ప్రలోభ నములకు లోనుకానిదీ అగు స్థితిని పొందిననాడు, అది ఇక ప్రాచ్యపాశ్చాత్యములలోని ఏ బలవద్రాజ్యముయొక్క లోభ వీక్షణములనుగాని ఆకర్షించదు. అప్పుడు భారతదేశం విలు వైన ఆయుధసామగ్రియొక్క భారాన్ని వహించ నవసరం లేకుండానే సురక్షితంగా వుండగలుగుతుంది. ఆమెయొక్క అంతర్దేశ ఆర్థికసంపన్నతయే ఆమెకు విదేశముఠాక్రమణ ములనుంచి కాపాడే దుర్భేద్యమైన రక్షణదుర్గంగా వర్తించ గలదు.

యంగిండియా, 2-7-31.

నేను నా దేశానికి స్వాతంత్ర్యం కోరుతున్నానంటే, ప్రపంచమొత్తంలోని మానవసంఘంలో అయిదవవంతు జనాభాగల నా దేశం భూతలంలోని మరియే ఇతరజాతినిగాని

వ్యక్తినిగాని గొల్లగొనే నిమిత్తం దానిని కోరడంలేదనీ, నా సామర్థ్యంలో వున్నంతవరకు అట్టి పరిస్థితి కలగబోదనీ చెపితే నమ్మండి. బలమైన లేక దుర్బలమైన ఇతర జాతులన్నిటికినికూడా నాతో సమానంగా స్వాతంత్ర్యాన్ని ఆసించే హక్కువున్నదనే భావాన్ని నేను విలువగా పాటిస్తేతప్ప, నేను నా దేశానికి కోరే స్వాతంత్ర్యానికి అర్హుడను కానేరను.

యింగిండియా 1-10-31.

లోకం రక్తపాతంతో విసిగిపోయివున్నదని నాహృదంతరాంతరంలో అనిపిస్తున్నది...ప్రపంచం దానినుంచితప్పించుకు బయటపడేమార్గాన్ని అన్వేషిస్తున్నది. ఆ అన్వేషణలో తహతహపడే లోకానికి దారిజూపే అదృష్టం ఈ పురాతన భారతదేశానికి లభ్యంకాగలదనే విశ్వాసంతో నేను ఆత్మశ్లాఘనం చేసుకుంటున్నాను.

ఇండియాస్ కేస్ ఫర్ స్వరాజ్, పే. 209.

భారతజాతీయ ప్రభుత్వం ఎట్టివిధానాన్ని అవలంబిస్తుందో నేను చెప్పలేను. నేను ఎంతగా అభిలషించినాగాని అంతవరకు బ్రతికివుండలేక పోవచ్చును. నేను బ్రతికేవుంటే, అహింసాత్మక విధానాన్ని వీలైనంతవరకు అవలంబించునట్లు సలహాచేస్తాను. అదే ప్రపంచశాంతికిని, నూతన ప్రపంచ ప్రణాళికకును మార్గదర్శకం అవుతుంది. భారతదేశములో అనేకమైన యుద్ధసంప్రదాయంగల జాతులు వుండడంబట్టినన్ని, వారందరికి రాగల ప్రభుత్వములో భాగం వుంటుంది కనక నున్నా, స్వతంత్ర భారతదేశపు విధానం కొంతవరకు షి

మితమైన సైన్యపద్ధతిని అనుసరించి వుండవచ్చునని ఊహిస్తాను; అహింసావిధానాన్ని ఒక రాజకీయశక్తిగా నిరూపించుటకు ఇంతవరకు చేసినకృషి అంతా వృథాకాబోదనీ, దేశంలో నిజమైన అహింసావిధానానికి ప్రాతినిధ్యంవహించే శక్తివంతమైన పక్షమొకటి నిలిచివుండగలదనీ మాత్రం నేను దృఢంగా నమ్ముతాను.

హరిజన్, 21-6-42.

అధ్యాయం ౭౪

ప్రాచ్యలోకపు సందేశం.

భారతదేశమేకనక వైఫల్యంపాలైతే, ఆసియాఖండమే మృతిపాలౌతుంది. భారతదేశం అనేక సంస్కృతులకును, నాగరికతలకును సమ్మేళనరంగమని చెప్పేమాటలో చాలా సామంజస్యంవున్నది. భారతదేశం కొల్లగొట్టబడిన ప్రపంచ జాతులన్నిటియొక్కయు— అవి ఆసియాకు చెందినవైనా, ఆఫ్రికాకు చెందినవైనా, మరే ఇతరప్రాంతానికి చెందినవైనా సరే— ఆశలకు అలవాలమైనదిగా ఇప్పటివలెనే భవిష్యత్తులో కూడా నిలిచివుండుగాక అని కోరుదాం.

ఢిల్లీ డైరీ, పే. 81.

(ఢిల్లీలో ది 2-4-1947 తేదీని జరిగిన అంతర ఆసియా సంబంధముల కాన్ఫరెన్సు యొక్క తుది సమావేశంలో ఒసగిన ఉపన్యాసంలో ప్రాచ్యప్రపంచంనుంచే పశ్చిమదేశాలకు జ్ఞానజ్యోతి ప్రసరించిందని తెలుపుతూ గాంధీ మహాత్ముడు ఈ క్రిందివిధంగా ప్రసంగించాడు:)

ఈ జ్ఞానసందేశం బరపినవారిలో ప్రప్రథముడు జొరోస్టర్. అతడు ప్రాచ్యప్రపంచానికి చెందినవాడు. అతని తర్వాత వచ్చినవాడు ప్రాచ్యప్రపంచానికి - భారతదేశానికి- చెందిన బుద్ధుడు. బుద్ధునిపిదప అవతరించిన జ్ఞాని ఎవరు? ప్రాచ్యంనుంచే ఉదయించిన ఏసుక్రీస్తు. ఏసుక్రీస్తుకిముందు వాడైన మోసెసు ఈజిప్టులో జన్మించినవాడైనా అతడు పాలస్తీనాకు చెందినవాడు. ఏసుక్రీస్తు అనంతరం వచ్చినవాడు మహమ్మదు. ఈ సందర్భంలో కృష్ణుడు, రాముడు మొదలైన ఇతర ప్రదీపకులను గురించి నేను ఇక్కడ ప్రస్తావించడంలేదు. వారు తక్కువవారని నేను ఎంచనుగాని, ప్రపంచ సాహిత్యరంగానికి తగినంతగా పరిచితులైనవారు కారు. అయినప్పటికి పైనపేర్కొన్న ఆసియా సంజనితులైన జ్ఞానులతో సరిపోల్చదగిన మరొకవ్యక్తి ఎవరూ నాకు ప్రపంచంలో ఇంకెక్కడగాని గోచరించడు. అటుపిమ్మట జరిగినదేమిటి? క్రైస్తవమతం పశ్చిమలోకంలో ప్రవేశం పొందినంతనే వక్రరూపం దాల్చింది. ఈ మాట అనవలసివున్నందుకు నేను చాలా విచారిస్తున్నాను. ఇంతకుమించి ఈ విషయమై నే నేమీ చెప్పను... నేను మిమ్ములను ఆసియా సందేశాన్ని అవగాహన చేసికొనమని మాత్రమే కోరుతాను. అది పాశ్చాత్యపు కంటి అద్దములద్వారాకాని, ఆటంబాంబును అనుకరించుటద్వారాకాని తెలిసేదికాదు. పశ్చిమానికి మీరు సందేశ మొసగదలిస్తే, అది ప్రేమసందేశము, సత్యసందేశము మాత్రమే కావలసివుంటుంది... ఈ ప్రజాస్వామ్యయుగంలో దరిద్రాతిదరిద్రులు కళ్లుతెరచి మేలుకొంటూవున్న ఈ యుగ.

ములో మీరు ఈ సందేశాన్ని మరింత బలవత్తరంగా పునరుద్ఘాటన చేయవచ్చును. మీరు కొల్లగొట్టబడివున్నందుకు ప్రతీకారబుద్ధితో కాక, నిజమైన ఆత్మీయతాభావంతో మీ పశ్చిమ ప్రపంచవిజయాన్ని తద్వారా పూర్ణమొనర్చుకొనవచ్చును.

మీరందరును మీ మేధస్సులను మాత్రమేకాక మీ హృదయాలనుకూడా సమైక్యమొనర్చుకొని ఈ ప్రాచ్య ప్రపంచపు జ్ఞానుల సందేశరహస్యమును అవగాహన చేసికొనుటకు ప్రయత్నించిన యెడల, ఆ ఉత్కృష్టసందేశమును వహించుటకు మనం అర్హతనార్జించిన యెడల, మనయొక్క పశ్చిమ ప్రపంచవిజయం సంపూర్ణతను పొందగలను. అట్టి విజయమును పశ్చిమప్రపంచమే ప్రేమపూర్వకంగా ఆమోదించగలుగుతుంది. ప్రాశ్చాత్యప్రపంచం ఈనాడు వివేకయుతమైన జ్ఞానంకోసం తహతహపడుతున్నది. పాశ్చాత్యలోకం ఆటంబాంబుల ప్రవృద్ధినిచూచి నిరాశోపహతమౌతున్నది. ఆటంబాంబులు ఒక్క పాశ్చాత్యప్రపంచ వినాశనానికే కాక యావత్ప్రపంచ వినాశనానికే కారణభూతం కాగలవనిన్నీ, తద్వారా బైబిలులో చెప్పిన జగత్ప్రళయసూచన వాస్తవరూపందాల్చగలదనిన్నీ వారు గ్రహించివున్నారు. ప్రపంచపు దౌష్ట్యాన్నీ, పాపాన్నీ లోకానికిచాటే అవకాశం మీ చేతులలోవుంది..మీకు గురుతుల్యులైనజ్ఞానులును, నాకు గురుతుల్యులైన జ్ఞానులును ఆసియాఖండమునకు ఒసగివున్న ప్రబోధము, మనకు వారు పరచిన చిరంతన సందేశము, ఇదే.

హరిజన్, 20-4-47.

అధ్యాయం ౨౫

ప్రాసంగికాభిప్రాయములు.

ఆదివాసులు :

ఆదివాసులనబడేవారు మనదేశంలో మొట్టమొదట నివసించిన జాతులకు చెందినవారు. వారిప్పుడు హరిజనులతో సమానమైన దుస్థితిలోపడివున్నారు. ఉన్నత తరగతులనబడే వర్గాలవారు వారి విషయమై ఇంతవరకు తీరని అశ్రద్ధచూపి వున్నారు. మన నిర్మాణకార్యక్రమంలో వారు ప్రత్యేక స్థానమునుపొంది వుండవలసినది. అందులో వారినిగూర్చిన ప్రస్తావన లేకపోవడం పొరబాటువల్ల జరిగినది. వారి పురోభివృద్ధి విషయికమైన కృషి కాంగ్రెసు కార్యకర్తలకు విస్తృతమైన కార్యరంగాన్ని చేకూర్చగలదు. ఇంతవరకు ఆ కార్యరంగం సుమారుగా ఒక్క క్రైస్తవప్రచారకుల చేతులలోనే వుండిపోయింది. కాని ఆదివాసులను తమ మతంలో కలుపుకొనడమూ, వారిలోని భారతీయత్వాన్ని నిర్మూలించడమూ మాత్రమే ఆ క్రైస్తవప్రచారకుల పరమాశయం కావడంవల్ల ఈ విషయంలో వారొనర్చిన అనల్పమైన కృషి అట్టే ఫలవంతం కాలేకపోయింది. ఏది ఎలావున్నా, అహింసాత్మకమైన పునాదులపై స్వరాజ్యనిర్మాణం చేయదలచిన వారెవరుగాని భారతీయ సంతానంలోని అల్పాల్పులయెడల కూడా ఏ మాత్రం అశ్రద్ధ చూపడానికి వీలులేదు. అంతేకాక ఆది.

వాసులయొక్క సంఖ్యాబలాన్నిబట్టి చూచినా వారియెడల అల్పదృష్టిచూపడం సమర్థనీయంకాదు.

హరిజన్, 18-1-42.

క్రమశిక్షణము :

అత్యున్నతమైన స్వాతంత్ర్య స్వరూపంలో అత్యధికమైన క్రమశిక్షణము, వినమ్రభావము గర్భితమై వుంటాయి. క్రమశిక్షణపైన, వినమ్రశీలంపైన ఆధారపడిన స్వాతంత్ర్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. విశృంఖలమైన స్వేచ్ఛ తనకూ, తన తోడివారికీకూడా అసభ్యతాచిహ్నంగా పరిణమిస్తుంది.

యంగిండియా, 3-6-26.

మనం చిరస్థాయిగా నిలిచే ఏ గొప్ప కార్యమును సాధించదలచినా మున్ముందుగా లోహకఠినమైన క్రమశిక్షణమును అలవరచుకొనవలసి వుంటుంది. అట్టి క్రమశిక్షణము పాండిత్య ప్రకర్షతోకూడిన వాదనశక్తిద్వారాగాని, హేతుతర్కశక్తుల ప్రయోగంవల్లగాని వచ్చేదికాదు. కష్టనిష్ఠూరాలను అనుభవించడంద్వారానే ఆ క్రమశిక్షణం లభ్యమౌతుంది. ఉత్సాహవంతులైన యువకులు ఇతర రక్షణలేమీ లేకుండా ప్రముఖమైన కార్యక్రమాలలో పాల్గొనడంద్వారానే బాధ్యత, క్రమశిక్షణలయొక్క అర్థం గ్రహించగల్గుతారు.

యంగిండియా, 19-5-27.

డాక్టర్లు :

• డాక్టర్లు మన సుఖలాలసతకు దోహద మొసగుతారన్న

మాట వాస్తవం. దాని ఫలితంగా మనం ఆత్మనిగ్రహాన్ని కోల్పోయి, నిర్వీర్యులమైపోయాం.

హింద్ స్వరాజ్, పే. 83.

నాకు మొత్తంమీద వైద్యవృత్తితో వున్న పేచీ ఏమిటంటే, అది ఆత్మవిషయం ఏమాత్రం పట్టించుకోనకుండా క్షణభంగురమైన ఈ దేహమనే సాధనాన్ని ఎలాగో ఒకలాగున మరమ్మతు చేయడానికి ప్రయత్నిస్తుంది. ఆ విధంగా వైద్యవృత్తి అనేది ఆత్మవస్తువును తృణీకరించి, మనుష్యులను తన చేతిలో చిక్కించుకోవడంద్వారా మానవుని ఆత్మగౌరవాన్ని, నిగ్రహశక్తినీ కుంచితం చేస్తుంది.

యంగిండియా, 11-6-25.

వస్త్రధారణ విధానం :

భారత దేశీయులకు అత్యంత సహజమూ, సమంజసమూ అయినటువంటిది జాతీయ వస్త్రధారణ విధానమే. యూరోపీయుల వేషాన్ని అనుకరించడం మన పతనస్థితికీ, అవమానానికీ, దౌర్బల్యానికీ చిహ్నం. మన దేశపు శీతోష్ణస్థితికి మిక్కిలి అనుకూలమైనది, సౌలభ్యతకు, సౌందర్యానికీ సులభసాధ్యతకు లోకంలో ఎక్కడా తులలేనిది, ఆరోగ్యసూత్రములకు అత్యంతము అనుగుణమైనది అయిన మన జాతీయ వస్త్రధారణ విధానాన్నొకనాక మనం విసర్జించిన మొదల తద్వారా మనం మన జాతీయసంస్కృతికి అపకారం చేసినవార మవుతాము.

గాంధిమహాత్ముని ప్రసంగములు, రచనలు, పే. 393.

నాలోని సంకుచిత జాతీయాభిమానం దొరటోపీ (Hat) ని నిరాకరిస్తుంది. కాని నాలో దాగున్న అంతర్జాతీయ భావం ఆ బెండు టోపీని యూరోపు దేశం మనకొసగిన ఒక వరంగా పరిగణిస్తుంది. దొరటోపీ అంటే దేశంలో ఏర్పడి వున్న అపారమైన వ్యతిరేక భావం అడ్డు కానిపక్షంలో ఆ బెండు టోపీలను ప్రచారం చేసేనిమిత్తం ఒక సంఘాన్ని స్థాపించి, దానికి నేను అధ్యక్షపదవిని స్వీకరించడానికి వెనుదీయును.

మన దేశపు శీతోష్ణస్థితులనుబట్టి కేవలం అనవసరమూ అనారోగ్యకరమూ, అనాకారమూ అయిన ట్రవుజర్లను స్వీకరించి, బెండు టోపీ విషయంలో సంకోచభావాన్ని ప్రదర్శించడం విషయంలో మన విద్యావంతులైన భారతీయులు చాలా పొరపాటుపని చేశారని నా అభిప్రాయం. అయితే జాతీయమైన అభిమానాలూ, అయిష్టాలూ హేతువాదం మీద ఆధారపడివుండవని నే నెరుగుదును.

యంగిండియా, 6-6-29.

జెండా :

అన్ని దేశాలకును జెండా అనేది అవసరం. లక్షలాది దేశభక్తులు దానికి తమ ప్రాణాలను సమర్పించి వున్నారు. అది ఒక విధమైన విగ్రహారాధన మన్నమాట నిజమే. అయినా, దానిని అరికట్టడంమాత్రం పాపకార్యమవుతుంది. ఏమంటే, జెండా అనేది ఒక ఆదర్శానికి చిహ్నప్రాయమైనది. ఆంగ్లేయుల హృదయాలలో యూనియన్ జాక్ జెండా ఎత్తినప్పుడు కలిగే దేశభక్తి భావం ఇంతని చెప్పడానికి సాధ్యం

కాదు. అమెరికా దేశస్థులకు చుక్కలు, చారలుగల జెండాలో అపారమైన అర్థం స్ఫురిస్తుంది. చుక్కలు, చంద్రవంకతో కూడిన జెండా ఇస్లాం మతస్థులలో వారి ఉత్తమమైన ధైర్య గుణాన్ని రేకెత్తిస్తుంది. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, యూదులు, పార్సీలతో కూడిన భారతీయులమైన మనకుకూడా జీవితానికి ధృవతారగా, ప్రాణసమర్పణకు పట్టుగొమ్మగావుండే ఒక పతాకం అవసరం.

యంగిండియా, 13-4-21.

లాయర్లు :

లాయరు (న్యాయవాది) యొక్క విధి జడ్జీ (న్యాయాధిపతి) ముందర సత్యమును ప్రదర్శించడములేక సత్యమును తెలిసికొనుటకు సహకరించడము మాత్రమేగాని, నేరస్థులను నేరము చేయనట్లు రుజువుపరచడంకాదు.

యంగిండియా, 11-6-25.

నాయకత్వం :

మందిమూకే శాసనంకాకుండా చూడవలెనన్నా, దేశం క్రమబద్ధంగా పురోగమించవలెనని కోరినా జనబాహుళ్యాన్ని నడిపించే నాయకులమని చెప్పుకునేవారు జనబాహుళ్యంవల్ల నడిపింపబడేవారుగా వుండకూడదు. తమ అభిప్రాయాన్ని కేవలం పైకి ఉగ్గడించి, వ్యవహారంలో మందియొక్క అభిప్రాయానికి లొంగిపోయే పద్ధతి పనికిరాదనిన్నీ, ముఖ్యమైన విషయాలలో మందియొక్క అభిప్రాయం తమ హేతు

బుద్ధికి సరియైనదిగా తోచనప్పుడు, నాయకులైనవారు దానికి భిన్నమైన మార్గాన్ని అనుసరించగలిగి వుండవలెననిన్నీ నా అభిప్రాయం.

యంగిండియా, 14–7–20.

నాయకుడంటే కేవలం సమానులలో మొదటివాడని అర్థం. ఎవరో ఒకరు ముందు నిలవవలసివుంటుంది. కాని ఆతడు ఆ గొలుసులోని అతిదుర్బలమైన లంకెకన్న తాను బలీయుడనని భావించరాదు; నిజంగా అంతకంటె బలీయుడు కాజాలడు కూడా. మనం ఒక నాయకుణ్ణి ఎన్నుకున్నతర్వాత అతడిని అనుసరించితీరాలి; లేనియెడల ఆ గొలుసు తెగిపోయి దుర్బలమై సడలిపోతుంది.

యంగిండియా, 8-12-21.

సంగీతం :

సంగీతం నిజంగా చాలాపురాతనమూ, పవిత్రమూ అయిన కళ. సామవేదం సంగీతఖని; కొరానులోని 'ఆయాత్' లను గానరహితంగా పఠించడానికి వీలుకాదు. డేవిడ్ ప్రార్థన గేయాలు (Psalms) పారవశ్యం కలిగిస్తాయి. వాటికీ సామగానానికీ సామీప్యతవుంది. ఈ గానకళను మనం పునరుద్ధరించి ఈ సంగీత కళాశాలకు దోహద మొనగూర్తుము గాక.

సంగీత సభలలో హిందూగాయకులును, ముసల్మాను గాయకులును ఒకరి పజ్జ ఒకరు కూర్చుని పాల్గొనడం మనం చూస్తూవుంటాం. ఇతర జీవితరంగాలలోకూడా ఈ విధమైన

సోదరభావపూరితమైన సమ్మేళనాన్ని ఎప్పుడు చూడగల్గు తామోగదా? ఆనాడు రామ, రహమాన్‌ల ఇరువురి నామాలు మన పెదవులపై తాండవించగల్గుతాయి.

యంగిండియా, 15-4-26.

పక్షాలు :

మనకు ఔదార్యమూ, సహనమూ లేనిపక్షంలో మన విభేదాలను ఎన్నటికీ స్నేహపూర్వకంగా తేల్చుకోనలేక పోతాం. అందువల్ల ఒక మూడవపక్షంయొక్క మధ్యవర్తిత్వానికి లొంగవలసివస్తుంది. అంటే విదేశీయుల చేతులలో చిక్కుకోవడం అన్నమాటే.

యంగిండియా, 17-4-24.

ఏ అభిప్రాయాలకు చెందిన పక్షంగాని సద్వివేచన జ్ఞానం తమ ఒక్కరిసొత్తే అని భావించడం సమంజసంకాదు. మనమంతా పొరపాట్లు చేయడానికి వీలుంది. తరుచుగా మన అభిప్రాయాలలోని పొరపాట్లను గ్రహించి వాటిని మార్చుకొనవలసిన అవసరంకూడా కలుగుతూవుంటుంది. మనదేశం వంటి విశాలమైనదేశంలో నిజాయితీతో కూడిన అన్ని విభిన్నాభిప్రాయాలకును తావుండవలెసి వుంటుంది.

మన ప్రతికూలపక్షపు అభిప్రాయాన్ని అర్థంచేసికొనడానికి ప్రయత్నించడమూ అది మనకు అంగీకారయోగ్యంగా కనిపించనప్పుడు, మన అభిప్రాయంపట్ల ఎదరిపక్షంవారు ఏ రీతిగా గౌరవం చూపవలసినదిగా కోరుతామో అట్లే ఎదిరిపక్షంవారి అభిప్రాయంపట్లకూడా మనం గౌరవంచూపడమూ

అనేదే మనం మనయెడలగాని, ఇతరులయెడలగాని చూప దగిన కనీసధర్మం. అట్టి దృక్పథమే ఆరోగ్యవంతమైన ప్రజా హిత జీవితానికి, అనగా స్వరాజ్యానికి, మన అర్హతను నిరూ పించే గీటురాయి.

యంగిండియా, 17-4-24.

రాజకీయాలు :

విశ్వాత్మకమూ, విశ్వవ్యాప్తమూ అయిన సత్యసం దర్శనమును ముఖాముఖిగా పొందవలెనంటే సృష్టిలోని అల్పాల్పమైన జీవినికూడా మనతో సమానంగా చూచి, ప్రేమించగలగాలి. అట్టి పరమాశయప్రాప్తికి సాధనచేసే వాడు ఏ జీవితరంగమునకుగాని దూరంగా వుండలేడు. అందు వల్లనే నా సత్యాన్వేషణపరత్వం నన్ను రాజకీయరంగము లోకి లాగింది. మతానికి రాజకీయంతో సంబంధమేమీ లేదనే వారికి మతమంటే ఏమిటో అవగాహన కాలేదని నేను నిస్సందేహంగానూ, సవినయంగాను విన్నవిస్తాను.

ఆత్మకథ, పే. 504.

మతగురువులు :

మతధర్మమునకు నిజమైన సంరక్షకులుగా వర్తించవల సిన మతగురువులే తమ సంరక్షణలో వున్న మతధర్మములను వినాశమొనర్చుటకు కారణభూతులుగా వర్తించి వున్నమాట, ఎంత శోచనీయవిషయంగా తోచినాగాని, అది చారిత్రక సత్యమని గ్రహించక తప్పదు.

యంగిండియా, 20-10-27.

విరాళధనం :

ప్రజలనుంచి విరాళాలుగా పోగుచేసిన డబ్బులో ప్రతి పైసకు జమాఖర్చులను చూపలేకపోయిన వారినీ, ఆ డబ్బును జాగ్రత్తగా వినియోగించనివారినీ ప్రజాహిత కార్యరంగంలో నుంచి పారద్రోలవలసి వుంటుంది.

యంగిండియా, 6-7-21.

మనం ప్రజలనుంచి విరాళములుగా పొందిన ధనాన్ని లోకములోకల్లా పేదవారైన భారతదేశపు దరిద్రజనులకు చెందిన సొత్తుగా భావించాలి. దాని వ్యయం విషయంలో మనం మిక్కిలి మెలకువతోను, జాగరూకతతోను, వివేచనా పూర్వకంగాను వర్తించాలి. కావున మనం ప్రజలనుంచి పొందిన ప్రతిపైసకు జమాఖర్చులు చూపుటకు ఎల్లప్పుడు సంసిద్ధంగా వుండాలి.

యంగిండియా, 16-4-31.

ప్రజాహిత సంస్థలు :

నేను నిర్వహించివున్న అనేక ప్రజాహిత సంస్థలను గురించిన అనుభవాన్నిబట్టి ప్రజాహిత సంస్థలు ఎప్పటూ శాశ్వతమైన మూలధనంమీద ఆధారపడి నడువకూడదనే అభిప్రాయానికి వచ్చాను. శాశ్వతమైన మూలధనం అనే దానిలోనే ఆ సంస్థయొక్క నైతికపతన బీజాలు గర్భితమై వుంటాయి... శాశ్వత మూలధనంయొక్క బలంమీద నడుపబడే సంస్థలు సాధారణంగా ప్రజాభిప్రాయాన్ని లెక్కచేయవు. తరుచు అవి ప్రజాభిప్రాయ విరుద్ధంగా వర్తించడం కూడా

జరుగుతుంది. మనదేశంలో అట్టి ఉదాహరణలు అడుగడుగునా కనిపిస్తాయి. మతసంబంధమైన ధర్మాదాయసంస్థలలో కొన్ని ఏవిధమైన జమాఖర్చులనుగాని చూపడమే మాని వేశాయి. వాటి ధర్మకర్తలు ఆయాసంస్థలకు హక్కుదార్లుగా అయిపోయి, ఇతరులెవ్వరికీ తాము బాధ్యులుకామని చెప్పే స్థితికి వచ్చారు. ప్రజాహిత సంస్థలనేవి, ప్రకృతిలోని సర్వజీవులవలెనే, ఆరోజునుంచి ఆరోజుకి దినభృతిమీాద నడవడమే ఆదర్శప్రాయమైన పద్ధతి అని నా గట్టినమ్మకం. ప్రజాదరణ మూరగొనజాలని సంస్థ ఏదిగాని ప్రజాహితసంస్థగా నిలవడానికి హక్కులేదని నా అభిప్రాయం.

ఆత్మకథ, పే. 198.

అర్హతగల ప్రజాహితసంస్థ ఏదిగాని ప్రజాసహకారలోపంవల్ల ఆగిపోవడం జరగదని నేను దృఢంగా విశ్వసిస్తాను. అలా ఏ సంస్థలైనను ఆగిపోవడం జరిగితే దానికి కారణం వాటిలో ప్రజాహితగుణం ఏమీా లేకపోవడమో, లేక వాటిని నడిపేవారిలోగల విశ్వాసలోపమో అయివుంటుంది. విశ్వాసం లోపించినదంటే నిలబడేశక్తి లోపించినదనే అర్థం.

యంగిండియా, 15-10-25.

మన ఆర్థికలోపంవల్ల ఎప్పుడూ ఆపత్తు కలగదు, నైతికలోపంవల్లనే కలుగుతుంది. తన కార్యకర్తలయొక్క స్వచ్ఛశీలంమీాద ఆధారపడి నడిచే ఏ ఉద్యమంగాని ప్రజాభిమానాల సహాయం లభించకపోవడంవల్ల ఆగిపోవడం అనేది

జరగదు... ఉన్నతవర్గాలనుంచి సహాయం రాకపోతే మనం అంతకంటె తక్కువతరగతి ప్రజలనుంచే సహాయం కోరాలి. మన మధ్యతరగతి ప్రజలూ, అంతకంటె పేదవర్గాలవారూ అసంఖ్యాకమైన భిక్షుకులనూ, దేవాలయాలనూ పోషిస్తున్నారు. కొలదిమంది సచ్ఛీలురైన ప్రజాసేవకులను వారు ఎందుకు పోషించలేకపోతారు? మనం గుమ్మం గుమ్మం దగ్గరికి భిక్షుకులవలెపోయి అడగాలి - ధాన్యమో, రాగి పైసలో, ఏవి దొరికితే అవి. బీహారులోను మహారాష్ట్రము లోనువలె పోగుచేయాలి... అయితే అంతా, మన ఏకాగ్ర మైన కార్యదీక్షపైనను, మన సేవాపరత్వంపైనను, సచ్ఛీలత పైనను ఆధారపడి వుంటుందని మాత్రం జ్ఞప్తివుంచుకోవాలి. మన నిస్వార్థబుద్ధిని గురించి ప్రజలకు విశ్వాసం కలిగితేతప్ప, అటువంటిపనులకు వారు విరాళాలు ఇవ్వరు.

హరిజన్, 28-11-36.

ప్రజాభిప్రాయం :

ప్రజాభిప్రాయమే సంఘాన్ని స్వచ్ఛంగాను, ఆరోగ్య వంతంగాను ఉంచగలదు.

యంగిండియా 18-12-20.

అనుకూల ప్రజాభిప్రాయం ఏర్పడే ముందుగా చేయ బడే శాసననిర్మాణం తరచు నిష్ప్రయోజన మవుతుంది.

యంగిండియా, 29-1-21.

ఆరోగ్యవంతమైన ప్రజాభిప్రాయం చూపగల ప్రభా

వంయొక్క విలువను మనం ఇంకా పూర్తిగా గ్రహించలేదు. కాని ప్రజాభిప్రాయం, దౌర్జన్యయుతమూ, ఘర్షణాత్మకమూ అయిన రూపందాలిస్తే మాత్రం అది సహింపరానిదిగా పరిణమిస్తుంది.

యంగిండియా, 7-5-31,

ప్రజాసేవకులు :

ఆధునిక ప్రజాహిత కార్యరంగంలో ప్రజాసేవకులుగా పనిచేసేవారి వ్యక్తిగతశీలం విషయంలో అశ్రద్ధచూపే పోకడ గోచరిస్తుంది. కార్యనిర్వాహకయంత్రంలో చాకచక్యంగల ఒక కీలకంగా పనిచేస్తే చాలునని అనుకోడం జరుగుతున్నది. ఆయావ్యక్తుల శీలాన్నిగురించిన విషయం వారికి కేవలం వ్యక్తిపరమైనదిగా భావిస్తూవుంటారు. చాలామంది ఈ అభిప్రాయం ప్రకారం వర్తిస్తూవుండడం నేను గమనించివున్నాను. కాని నేను మాత్రం ఆ అభిప్రాయంతో ఏకీభవించలేక పోయాను. ఆ విధంగా నేనెన్నడుగాని ఆచరించనూ లేకపోయాను. ప్రజాసేవకులుగా పనిచేసే వారి వ్యక్తిగతశీలంతో తమకు పనిలేదని భావించిన సంస్థలు ఎట్టి చిక్కుపరిస్థితులలో పడుతూవుంటాయో నేనెరిగిన విషయమే.

హరిజన్. 7-11-36.

కాలనియమానుసరణం :

మననాయకులును, కార్యకర్తలును కాలనియమాలను స్మక్రమంగా పాలించడం అలవరచుకుంటే అది మన జాతీయో

ద్యమానికి చాలాబాధకరంగా వుంటుంది ... ఏ వ్యక్తిగాని తాను నిజంగా చేయగలిగిన దానికి మించిన పని చేయవలెనని ఎవరూ కోరరు. రోజుప్రార్థసమయానికి పని అదనంగా మిగిలిపోయినా, భోజనం మానుకునో లేక నిద్రనో, ఆటవిడుపునో వదులుకునో చేస్తేతప్ప పని పూర్తిచేయడం సాధ్యంకాకపోవడమో జరుగుతున్నదంటే ఎక్కడో ఒకచోట కార్యనిర్వాహణ విషయికమైన లోపం వుందన్నమాటే. నిర్ణీతకాలనియమాలను పాలించడం, నిర్ణీతకార్యక్రమానుసారంగా పనిచేయడం మనం అభ్యసించినయెడల మన జాతీయ కార్యనిర్వాహణశక్తి ఇనుమడిస్తుంది. తద్వారా మనం మన గమ్యసిద్ధిని ఎక్కువ వేగంగా పొందగలుగుతాం. మన కార్యకర్తలు ఎక్కువ ఆరోగ్యవంతులుగాను, దీర్ఘజీవులుగాను వుంటారు.

హరిజన్, 24-9-38.

గుర్రపు పందెములు :

గుర్రములయెడల మనకు గల ప్రేమను చూపవలెనంటే అందుకు గుర్రపు పందెములుగాని, వాటివల్లకలిగే ఉద్రిక్తత గాని అవసరంకాదు. అట్టి పందెములు మనుష్యులను ప్రలోభనముల పాలుచేస్తాయి. వాటికోసమని వ్యవసాయానికి పనికివచ్చే కొంత మంచిభూమి, సద్వినియోగం కాదగిన కొంత డబ్బు దుర్వ్యయమౌతున్నాయి. గుర్రపు పందెముల జూదములో నాశనమైపోయిన పెద్దమనుషు లెందర్ని నేను చూచి వుండలేదు! పాశ్చాత్యుల దురభ్యాసాలను అనుకరించడం

ఇంక మానివేసి, వారిలోని మంచినిమాత్రమే మనం అలవ రచుకొనడానికి ప్రారంభిస్తే మంచిది.

హరిజన్, 18-1-48.

కాందిశీకులు :

వారు వినయం అనే కళను అలవరచుకోవాలి. ఇతరుల తప్పులను శోధించడంకంటె తమ విషయమై నిశితమైన ఆత్మ పరీక్ష చేసుకునే అభ్యాసం వినయశీలానికి చాలా అవసరం. ఇతరులను పరుషంగా విమర్శించడం తగిన హేతువులేకుండా తరుచు నిందించడం మొదలైన అలవాట్లు వినయశీలతకు విరుద్ధమైనవి. ఆత్మపరిశీలనం ఉన్నతిప్రదమైనది; పరవిమర్శ నం పతనకారకం. కష్టకాలాన్ని ఎదుర్కొనవలసివున్న కాంది శీక ప్రజలు కలిసి జీవించే గుణాన్నీ, కౌశలాన్నీ నేర్చుకోవలసి వున్నది. వారి సహకార జీవితముయొక్క పరిధి విశాలాతి విశాలమై, తుదకు మానవలోకమంతను ఆలింగనమొనర్చు కొనునట్లుగా పరిణతిపొందాలి. ఈ రీతిగా వర్తించినయెడల ఏ కాందిశీకుడుగాని ఒంటరిగా బ్రతకవలసిన పనివుండదు. వారు ఏ యే రాష్ట్రములలో వుండవలసివచ్చినా, అక్కడి అందరితోను సఖ్యతను పొంది, తమ ఒక్కరి సంక్షేమమునే కాక అందరి సంక్షేమమును వారు ఆసించగల్గుతారు. వారం దరు ఒకే ఒకచోటవుండవలెనని కోరకూడదు; అదిసాధ్యమూ కాదు. ఇల్లు వాకిళ్లువదలి తలదాచుకొనుటకు తావులేకుండా లక్షలాది జనులు కాందిశీకులుగా బయటపడిన ఈ సమయ ములో అది అసలే అసాధ్యకార్యం. కాని వారు సవినయమైన

సహకారభావాన్ని అలవరచుకున్నచో వారికి ఎక్కడెక్కడ నివాసములు ఏర్పాటైనాగాని, వారు ఏయే తాహతులకు, ప్రాంతములకు చెందినవారైనాగాని, తమ సోదర కాందిశీకులందరినడుమ సానుభూతి పూర్వకమైన అనుబంధాన్ని నిలుపుకొనగల్గుతారు. తమకు ఇష్టమైనచోటనే తామంతా నివసించగలగాలనే కోరిక పెట్టుకుంటేమాత్రం వారికేమీ లాభం లేదు. అది సాధ్యంకానిపని అని గ్రహించి, కాందిశీకులు అసంతృప్తి వెలిబుచ్చడం మానుకోవాలి.

అంతేకాక, వికలాంగుడుకాని ప్రతి కాందిశీకుడును తన తిండిని, బట్టను, నివాసాన్ని పొందుటకు అవసరమైన శ్రమను సగౌరవంగా చేయడానికి సంసిద్ధతచూపాలి. తద్వారా వారు శ్రమచేయుటలోగల ఆత్మగౌరవాన్ని గ్రహించగల్గడమేకాక, ఇతరులమీద ఆధారపడకుండా జీవించగల్గుతారు. వారందరును స్త్రీపురుష భేదంలేకుండా సమాన తాహతుతో వర్తించడం అలవరచుకోవాలి. కొన్నివిధములైన పనులు, ఉదాహరణకు మలపారిశుధ్యం, వీధుల పారిశుధ్యం మొదలైనవి, అందరూ పాలుపంచుకొని చేయాలి. ఏ పనులుగాని, ఇవి ఉచ్చతరమైనవి ఇవి నీచతరమైనవి అని భావించబడకూడదు. ఈ సంఘంలో కూచుని అనుభవించేవారికిగాని, సోమరిపోతులకుగాని, తిరుగుబోతులకుగాని స్థానంలేదు.

హరిజన్, 14-12-47.

నదులు :

మన దేశంలో గంగాయమునలు రెండే కాదు. అటు వంటి నదీమతల్లు లింకా ఎన్నో ఉన్నాయి. అవి మనకు ప్రాణదాయిని అయిన భూమాత కొరకు మనం చేయవలసిన త్యాగాన్ని స్మరణకు తెస్తాయి. క్షణక్షణం నదులే రీతిగా కల్మషమును విడనాడి స్వచ్ఛములౌతున్నవో, అల్లే మనము నిరంతరమైన స్వచ్ఛపరిణతిని పొందుతూవుండవలసిన అవసరాన్ని అవి గుర్తుకు తెస్తాయి. ఈ ఆధునికకాలపు ఒత్తిడిలో నదులను మనం మన మురుగునీటిని వదలుటకును, మన సరుకుపడవలను నడుపుకొనుటకును మాత్రమే వినియోగిస్తున్నాము. తద్వారా వాటిని మరింత పంకిలంచేసి వదలుతున్నాము. ప్రశాంతమనస్కులమై ఈ నదీతీరములకుపోయి, అక్కడ నిశ్చలధ్యాన నిమగ్నులమై ఆ నదీమతల్లు లొసగే మర్మరసందేశమును వినుటకు మనకు ఏ మాత్రం వ్యవధిలేదు.

యంగిండియా, 23-12-26.